# PRESCRIBED TEXT
# (DT01)
# (M.A. TELUGU)

## ACHARYA NAGARJUNA UNIVERSITY

CENTRE FOR DISTANCE EDUCATION

NAGARJUNA NAGAR,

GUNTUR

ANDHRA PRADESH

## మొదటి భాగము - ప్రాచీన పద్యభాగము

# శకుంతలోపాఖ్యానము - నన్నయ

### (ఆంధ్రమహాభారతం - ఆదిపర్వం - చతుర్థాశ్వాసం : 1 - 110 పద్యాలు)

## పాఠం -1

1. 1. 0 పరిచయం : కవి కావ్య పరిచయాలు

1. 1. 1 పాఠ్యభాగ వివరణ

1. 1. 2 సమగ్ర వ్యాఖ్యలు

### 1.1.0 పరిచయం : కవి కావ్య పరిచయాలు

మన పాఠ్యభాగమైన శకుంతలోపాఖ్యానం ఆదికవి నన్నయభట్టు రచించిన ఆంధ్రమహాభారతంలోని ఆదిపర్వంలోని చతుర్థాశ్వాసం నుంచి గ్రహించబడింది.

సరస్వతీపుత్రులైన "ఆంధ్రకవులకెల్ల నన్నయ్య అన్నయ్య". తెలుగు తల్లికి అమృత కలశాన్ని అందించిన సువర్ణుడూ ఆయన. నన్నయ భట్టారకుడు, రాజమహేంద్రవరాన్ని రాజధానిగా చేసుకొని వేంగీ సామ్రాజ్యాన్ని పరిపాలించిన రాజరాజ నరేంద్రుడి (1019 - 1061) ఆస్థానంలో ఉండేవాడు. రాజరాజ నరేంద్రుడి ప్రోత్సాహంతో భారతాంధ్రీకరణాన్ని ప్రారంభించాడు. ఆదిపర్వం, సభాపర్వం, అరణ్యపర్వం చతుర్థాశ్వాసంలోని 'శారదరాత్రులు' (ప. 142) అనే పద్యం దాకా ఆంధ్రీకరించాడు. అంతటితో ఆ మహాకవి గంటం ఆగిపోయింది.

నన్నయ రాజరాజ నరేంద్రుడికి కుల బ్రాహ్మణుడు. అనురక్తుడు. అవిరళజపహోమ తత్పరుడు. విపుల శబ్దశాసనుడు. సంహితాభ్యాసుడు. బ్రహ్మాండాది నానాపురాణ విజ్ఞాన నిరతుడు. పాత్రుడు. ఆపస్తంబ సూత్రుడు. ముద్గల గోత్రజాతుడు. సద్వినుతావదాత చరితుడు. లోకజ్ఞుడు. ఉభయభాషాకావ్య రచనాభిశోభితుడు. సత్ప్రతిభాభియోగ్యుడు. నిత్యవచనుడు మత్యమరాధిపాచార్యుడు. సుజనుడు. నన్నయ తన కావ్యావతారికలో చెప్పిన ఈ అంశాలు అన్నీ ప్రత్యక్షర సత్యాలు.

నన్నయకు భారతాంధ్రీకరణ కార్యక్రమంలో ఆయన సహాధ్యాయుడైన నారాయణభట్టు తోడుగా ఉండేవాడు. నారాయణ భట్టు 'వాఙ్మయధురంధరుడు'. సంస్కృత ప్రాకృత కర్ణాట పైశాచికాంధ్ర భాషలలో కవిరాజశేఖరుడిగా ప్రసిద్ధుడు. ఇంతకూ నన్నయకు కవిరాజశేఖరుడిగా ఎలా తోడ్పడ్డాడు ? భారతయుద్ధంలో అర్జునుడికి కృష్ణుడు తోడ్పడ్డట్లుగా వదలకుండా తోడ్పడ్డాడు. ఆయుధాన్ని పట్టకుండా, యుద్ధం చేయకుండా అంటే గంటం పట్టకుండా రచన చేయకుండా తోడ్పడ్డాడు. కొన్ని సందర్భాల్లో సముచితమైన సలహాలిచ్చాడు.

నన్నయ తన కవిత్వంలోని ప్రధాన లక్షణాలను ఇలా సూచించాడు :

సారమతిం గవీంద్రులు ప్రసన్న కథాకలితార్థయుక్తిలో
నారసి మేలు నా నితరు లక్షర రమ్యత నాదరింప నా
నారుచిరార్థ సూక్తినిధి నన్నయభట్టు తెనుంగునన్ మహా
భారత సంహితారచన బంధురుఁడయ్యె జగద్ధితంబుగాన్. (ఆది. 1 - 26)

నన్నయ కవిత్వంలో మూడు ప్రధాన లక్షణాలు కనిపిస్తాయి. (1) ప్రసన్న కథాకలి(వి)తార్థయుక్తి (2) అక్షరరమ్యత (3) నానారుచిరార్థ సూక్తి నిధిత్వం.

ప్రసన్న కథాకలితార్థయుక్తికి ప్రసన్న కథాకవితార్థయుక్తి అనే పాఠాంతరం కూడా ఉంది. కాని 'కలితార్థయుక్తి' పాఠమే ఎక్కువ అర్థవంతమైన పాఠం. మూలభారతంలో కొన్ని అనావశ్యక విషయాలు, పునరుక్తులు అక్కడక్కడా కనిపిస్తాయి. తద్వారా కొంత క్లిష్టత కలుగుతుంది. నన్నయ తన రచనలో వాటిని పరిహరించి కథను ప్రసన్నం చేశాడు. తేటతెల్లం చేశాడు. రససమర్పక గుణమైన ప్రసాదంతో భాసింపజేశాడు. ఆ ప్రసన్న కథలతో కూడిన పరమార్థాన్ని భాసింపజేశాడు. చతుర్విధ పురుషార్థాలను - ధర్మార్థ కామ మోక్షాలను సువ్యక్తం చేశాడు. తదనుగుణంగా కొన్ని కీలకమైన శబ్దాలను ప్రయోగించాడు. ఇదంతా కవీంద్రులు తమ సారవంతమైన బుద్ధిబలంతో లోతుగా ఆలోచిస్తే అర్థమయ్యే విషయం.

ఇక ఇతరులు సైతం మెచ్చుకొనే విషయం అక్షర రమ్యత. అక్షరాల ఆవృత్తి వల్ల కలిగే శ్రావ్యత. దీన్ని నన్నయ ఆదరించడం వల్ల సామాన్యులకు కూడా ఆయన కవిత్వం అభిమాన పాత్రమైంది. ఈ అక్షరరమ్యత కోసం ఆయన వృత్త్యను ప్రాసాలంకారాన్ని స్వీకరించాడు. నన్నయ అక్షరరమ్యత క్షరంకాని శాశ్వత సౌందర్యం. నన్నయ పద్యాలలో వేదనాదమాధుర్యం వీనుల విందు చేస్తుంది.

నన్నయ నానార్థ సూక్తనిధి; అనేక మనోహరార్థాలతో కూడిన సూక్తులకు నిధి. ఆయన కవిత్వమూ అంతే. ఆవులాంటిదే కదా దూడ కూడా ! నన్నయ ఎన్నో ధర్మాలను, ధర్మ సూక్ష్మాలను మనోహరంగా చెప్పాడు. పురుషార్థాలను ఆవిష్కరించాడు. వ్యక్తీకరణ కౌశలాన్ని ప్రదర్శించాడు.

సంస్కృతంలో మహాభారతాన్ని వాణీదరహాసమైన మహేతిహాసంగా వ్యాసమహర్షి తీర్చిదిద్దాడు. నన్నయ దానికి కావ్య కమనీయతను కలిగించి వన్నె తెచ్చాడు. ఇతిహాసంలో ప్రధానకథతో పాటు ఉపాఖ్యానాలు ఉంటాయి; అధికంగా ఉంటాయి. శబ్దం కన్నా అర్థం అందునా ఉపదేశం ప్రధానంగా ఉంటుంది. శృంగార హాస్యరసాలకు చెప్పుకోదగ్గ ప్రాముఖ్యం ఉండదు. శాంత వీర బీభత్సాద్భుత సన్నివేశాలతివేలంగా ఉంటాయి. మానవులతో పాటు సురాసురులు, పశుపక్ష్యాదులు పాత్రలుగా సాక్షాత్కరిస్తాయి. నన్నయ తన రచనలో వర్ణనలకూ అలంకారాలకూ కొంత ప్రాధాన్యాన్ని ఇచ్చి, ఉపదేశాన్ని ఉక్తి వైభవంతో మేళవించి తన రచనలో కావ్యత్వాన్ని స్ఫురింపజేశాడు.

### 1.1.1 పాఠ్యభాగ వివరణ :

మహాభారతంలోని మొదటి పర్వమైన ఆదిపర్వంలో పాండవుల జననం, విద్యాభ్యాసం, వివాహం మొదలైన ప్రధానకథాంశాలు ఉన్నాయి. ఇంకా ఆ వంశానికి సంబంధించిన పూర్వరాజుల కథలు - యయాతి, దుష్యంతుడు మొదలైన వారి కథలు - ఉన్నాయి. ఇక ధృతరాష్ట్ర పాండురాజుల విషయాలు సరే సరి !

దుష్యంతోపాఖ్యానం పరమరమణీయ కథ. వ్యాసభారతంలోని ఈ కథను గ్రహించి కాళిదాస మహాకవి అభిజ్ఞాన శాకుంతల నాటకాన్ని రచించాడు. అది అనేక ప్రాచ్య పాశ్చాత్య విద్వాంసుల ప్రశంసలకు పాత్రమైంది.

నన్నయ వ్యాసభారతాన్ని ఆంధ్రీకరిస్తూ అభిజ్ఞానశాకుంతల నాటకాన్ని కూడా దృష్టిలో ఉంచుకున్నాడు. ఈ అన్నింటినీ దృష్టిలో ఉంచుకొని 15 వ శతాబ్దిలో ఉన్న పిల్లలమర్రి పినవీరన శృంగార శాకుంతలమనే కావ్యాన్ని రచించాడు.

నన్నయ తీర్చిదిద్దిన అనేకోపాఖ్యానాలలో అత్యంతోజ్జ్వలమైనది శకుంతలోపాఖ్యానం. ఇది శతాధిక గద్యపద్య సంకలితం; వీర శాంత శృంగారాద్భుతరస బంధురం; ఆనందామృత నిష్యంది. భార్యాభర్తల, పితాపుత్రుల అనుబంధాలు, సత్యధర్మాల ఔన్నత్యాలు మొదలైన అంశాలు ఇందులో గమనార్హాలు.

చంద్రుని కుమారుడు బుధుడు. బుధుని కుమారుడు పురూరవుడు. పురూరవుని కుమారుడు ఆయువు. ఆయువు కుమారుడు. నహుషుడు. నహుషుని కుమారుడు యయాతి. యయాతి కుమారుడు పూరుడు. ఆ తరువాత దాదాపు పదిహేను తరాలు గడిచాయి. త్రసమహారాజు జన్మించాడు. త్రసుడికి కాళిందికి ఈలినుడు జన్మించాడు.

ఈలిమడికి రథంతరికి దుష్యంతుడు పుట్టాడు. దుష్యంతుడు అనన్య సాధారణ గుణయుక్తుడు. దుష్యంతుడు తన చిన్నతనంలో జింకపిల్లల్ని పట్టే విధంగా మహారణ్యంలో తిరుగుతూ ఉండే సింహ శార్దూలాలను, ఏనుగులను, శరభమృగాలను తరిమి తరిమి పట్టుకుంటూ ఉండేవాడు. చెట్లతో సహా పర్వతాల్ని పీకి ఇతర పర్వతాలపైకి విసరివేస్తూ యౌవనగర్వంతో ప్రకాశించాడు. మహాబల సంపన్నుడైన ఆ దుష్యంతుడు సూర్యకిరణాలూ గాలీ కూడా ప్రవేశించలేని భయంకరారణ్య ప్రదేశాలతో కూడి ఉన్న భూమండలాన్ని పూర్వరాజుల్లాగా బాహుబలంతో అజేయుడై పరిపాలించాడు. దిగ్గజాలే ఆయన రాజ్యానికి సరిహద్దులు. ఆయన రాజ్యం ప్రజాసమృద్ధితో, రోగాలు, శోకాలు, భయాలు, అనుమానాలు లేకుండా ధర్మమార్గంలో వర్ధిల్లింది.

ఆ దుష్యంతమహారాజా ఒకనాడు వేట వినోదంతో సూర్యుడి గుర్రాల కన్నా ఎక్కువ వేగంగా ప్రయాణించే అశ్వాల్ని పూన్చిన రథాన్ని ఎక్కి బయలు దేరాడు. ఎందరో అశ్వికులు ఆయన చుట్టూ మేలుజాతి గుర్రాలెక్కి బయలుదేరారు. వీరభటులు కుంతశక్తి ధనుష్ఖడ్గ ధారులై బయలుదేరారు. అరుపులతో, బొబ్బలతో బల మహామందరం ఆ అరణ్య సాగరాన్ని కలచివేసింది. మదించిన ఏనుగులు, సింహాలు, శరభమృగాలు, పెద్దపులులు, అడవి పందులు మహావేగంతో భయంకరంగా తిరుగుతున్న అరణ్య మధ్యంలో దుష్యంతుడు తన పరాక్రమాన్ని ప్రదర్శించాడు. తప్పించుకొని పోతున్న మృగాల్ని బాణాదుల్ని ప్రయోగించి, దగ్గరలో ఉన్న మృగాల్ని తరిమి ఖడ్గాదులతో నరికి చంపాడు. వేట మీది విశేషాసక్తితో అపార ఘోర వన్యమృగావళిని దుష్యంతుడు హతమార్చాడు.

ఇలా చాలా మృగాల్ని తరిమి తరిమి చంపుతూ, ఇంకా చంపాలనే వేడుకతో దుష్యంతుడు చాలా దూరం వెళ్లాడు. ఆయన రథవేగాన్ని అందుకోలేక ఆగిపోయిన కాలిబంట్లు ఆకలి దప్పికలతో వివశులై అక్కడక్కడా విశ్రమించారు. ఆ దుష్యంతుడు కొంతమంది మంత్రులతోను, పరిజనులతోను, పురోహితులతోను కొంత ముందుకు వెళ్లాడు.

అలా ముందుకు వెళ్లిన దుష్యంతుడు ఒక పుణ్యనదీ తీరంలో అనేక పరిమళ భరిత పుష్పాలతో, ఫలాలతో వినమ్రంగా ఉన్న చెట్లతో, తీగలతో, పొదరిండ్లతో ప్రకాశిస్తున్న ఒక వనాన్ని చూశాడు. దేవేంద్రుడి ఖాండవవనానికి, కుబేరుడి చైత్రరథానికి సమానంగా ఈ వనాన్ని బ్రహ్మ ఎంతో దయతో భూలోకానికి ప్రసాదించాడేమో ! అని భావించాడు.

ఈ విధంగా తత్ సౌందర్యాన్ని పొగడుతూ వచ్చి ఆ వనంలో ప్రవేశించాడు. ఎంతో మనోహరంగా వచ్చిన ఆ దుష్యంత మహారాజుకు మనోహ్లాదం కలిగేటట్లు లతలు అనే స్త్రీలు, పిల్లగాలికి రాలిన పుష్పాక్షతలతో, సేసలు చల్లారు. సేసలు అనడంతో భవిష్యద్వివాహ సూచకమైన తలంబ్రాలు స్ఫురిస్తున్నది. అలాగే తుమ్మెదల ఝంకారాలతో ఆశీస్సులిచ్చారు. ఇంకా వేటాడి అలసి ఉన్న అతని శరీరతాపం ఉపశమించేటట్లు ఆ నదీ పవనాలు వీచాయి.

బాగా చిగురించిన గోరంటలను, తగిన ప్రదేశాల్లో గుబురులుగా పూచిన మంచి అశోకాలను, సురపొన్నలను, పొన్నలను, మొగళ్లను, కాచి బాగా పండిన తియ్యమామిళ్లను, అరటులను చూస్తూ, చిలుకలు, కోకిల కంఠధ్వనులను వింటూ దుష్యంతుడు ముందుకు సాగాడు.

వెళ్లి వెళ్లి, నేతి హవిస్సుల పరిమళంతో కూడిన పొగలతో కూడిన తీగలు పెనవేసుకొన్న చెట్ల కొమ్మలమీద పూలు లేకపోయినా వాలి ఉన్న తుమ్మెదల సమూహాలను చూశాడు దుష్యంతుడు. ఇది తపోవనం అయి ఉంటుంది. అది మహర్షి ఆశ్రమమై ఉంటుందని భావించాడు.

హృదయ సుఖావహమైన ఆ వనంలో ముందుకు వెళ్తూ ఉన్నాడు దుష్యంతుడు. బ్రాహ్మణ వేద ధ్వనులు, అగ్నిహోత్ర స్వాహాశబ్దాలు, విద్వత్సంభాషణఘోషలు, మీమాంసక గోష్ఠి వివాద నినాదాలు మ్రోగుతూ ఉన్న కణ్వాశ్రమాన్ని చూశాడు. ఆ ఆశ్రమం యాజ్ఞికులకు, అనుష్ఠాతలకు, మహా తపోధనులకు నివాసమైన పుణ్యనదీ తీరంలో మనోహరంగా ఉంది; గంగాతీరంలో ఉన్న నరనారయణ స్థానం లాగా ఉంది.

కణ్వాశ్రమంలో చిలుకలు వీనుల విందుగా సామగానం చేస్తున్నాయి. ఆ చిలుకలు చదువును తన్మయత్వంతో ఏనుగులు వింటున్నాయి. ఆ ఏనుగులు తొండాల చల్లని నీడలో, తొండాల నీటి తుంపరుల చల్లగాలి మీది ఆశతో సింహాలు ఆశ్రయించి ఉన్నాయి.

బ్రాహ్మణశ్రేష్ఠులు భూతబలులుగా పెట్టే నివ్వరి అన్నపు పిండాల్ని తినడానికి ఎలుకలు, పిల్లులు కలిసి ఆడుకొంటున్నాయి. ఈ సహజ వైరివర్గాల సహవాసాన్ని చూచి కణ్వశక్తికి ఆశ్చర్యచకితుడయ్యాడు దుష్యంతమహారాజు.

"నేను కణ్వమహామునీంద్రుడికి నమస్కరించి వస్తాను. నేను వచ్చేదాకా అందరూ ఇక్కడే ఉండండి" అని మంత్రులను తగిన వారిని ఆజ్ఞాపించి దుష్యంతుడు ఒక్కడే వెళ్లి ఆ కణ్వుడి ఇంటిలో శకుంతల అనే కన్యను చూచాడు. ఆమె సన్నగా ఉంది. తామరరేకుల లాంటి విశాల నేత్రాలు కలిగి ఉంది. చిక్కగా తుమ్మెదల లాగా ఉన్న నల్లని వంకరలు తిరిగిన వెంట్రుకలు కలిగి ఉన్నది.

ఆ శకుంతల జయంతుడి లాంటి అనంత విలాసవంతమైన దుష్యంతుణ్ణి తెలుసుకుంది. తొందరగా ఆసనార్ఘ్య పాద్యాది విధులతో పూజించి కుశల మడిగింది. అప్పుడు దుష్యంతుడు ఆమెతో ఇలా అన్నాడు : "మేము వేటకు వచ్చి, ఇక్కడ కణ్వ మహామునిని దర్శించి వెళ్లామని వచ్చాం. ఆయన ఎక్కడకు వెళ్లారో ! " శకుంతల ఆమాటలు విని ఇలా అన్నది " ఆయన ఇక్కడే ఉండి ఇప్పుడే వనానికి పండ్లు తేవడానికి వెళ్లారు. మీరు వచ్చిన విషయం తెలుసుకుంటే ఆయన ఇప్పుడే వస్తారు. వారు వచ్చేదాకా కొంచెం సేపు ఉండండి". శకుంతల మాటలను విని దుష్యంతుడు ఆమె వినయానికి, మృదుమధుర వచనాలకు సంతోషించాడు. పెండ్లికాని అమ్మాయి అని గ్రహించాడు. మన్మథ రాజ్యలక్ష్మి లాంటి ఆమె సర్వలక్షణ లక్షిత సర్వావయవ సందర్శనంతో సంచలిత హృదయుడయ్యాడు. "నీవు ఎవరి కూతురివి ? ఇక్కడికి ఎందుకు వచ్చావు ? అని శకుంతలను అడిగాడు. శకుంతల దుష్యంతునితో తాను జగదారాధ్యుడైన కణ్వమహామునీంద్రుని పుత్రికనని చెప్పింది.

అప్పుడు దుష్యంతుడిలా ఆలోచించాడు : "ఈమె మునికన్య అయితే ఈమె మీద నా మనస్సు ఎందుకు లగ్నమైంది ? నేను ఈ మాటలను నమ్మలేను. అదిగాక ఈ కణ్వమహర్షి విజితేంద్రియుడని విన్నాను". ఇలా ఆలోచించి ఉన్న సంగతి తెలుసుకోవడానికి ఉత్సుకుడయ్యాడు.

శకుంతల జన్మ వృత్తాంతాన్ని తెలుసుకోవాలని ఆమెతో ఇలా అన్నాడు. "కణ్వమహాముని ఊర్ధ్వరేతుడు. ఆ పుణ్య చరితుడికి నీవు ఎలా పుత్రికవయ్యావు ? వివరంగా చెప్పు !" ఆ మాటలు విని శకుంతల దుష్యంతుడితో ఇలా అన్నది. "పూర్వం ఒక మహర్షి 'శకుంతల ఎక్కడిది ? ఎలా జన్మించింది ? ' అని మా తండ్రిని అడిగాడు. మా తండ్రి నేను వింటూఉండగా ఆయనకు చెప్పాడు. ఆ విషయాలను మీకు చెబుతాను. సావధానంగా వినండి" అని చెప్పనారంభించింది.

రాజర్షి అయిన విశ్వామిత్రుడి అతి ఘోరతపస్సుకు దేవేంద్రుడు భయపడ్డాడు. మేనకను పిలిచి అతని తపస్సును భగ్నం చెయ్యమని, తద్వారా దేవరాజ్యమహిమను రక్షించమని కోరాడు. మేనక చాలాభయపడి ఇంద్రునితో ఇలా అన్నది. "దేవేంద్రా ! బ్రహ్మ అంతటివాడైన వసిష్ఠుణ్ణి పుత్రశోక సముద్రంలో ముంచినవాడు ఆ విశ్వామిత్రుడు. ఆయనంటే నీవూ, దేవతలూ అందరూ భయపడుతుంటారు. అటువంటి ఉగ్రక్రోధుడి దగ్గరకు వెళ్లమని, తపోభంగం చేయమని నన్ను ఆజ్ఞాపించడం న్యాయమా! ఆ మహర్షి కోపించి చూస్తే ఆ క్షణంలో కులపర్వతాలు సైతం బ్రద్దలౌతాయి. ఇసుక మినహా సముద్రాలు ఇంకిపోతాయి. మూడు లోకాలు దిర్ధిర తిరుగుతాయి. గాలి వీచడానికి జంకుతుంది. మహాతీవ్ర కోపపరుడి దగ్గరకు స్త్రీలు వెళ్లడానికి సంకోచించరా ? అయినా నా చేతనయిన విధంగా ఆ విశ్వామిత్రుడి మనస్సుకు మన్మథాయత్త మయ్యేటట్లు చేస్తాను" - అని ఇంద్రుణ్ణి వీడ్కొని బయలుదేరింది. మేనక తనకు మందమలయానిలం తోడుకాగా వచ్చి హిమవత్పర్వత ప్రదేశంలోని విశ్వామిత్రుడి తపోవనంలో ప్రవేశించింది.

చల్లని దక్షిణపు గాలి, మేనక జడలోని పూలను, మైపూతలను తగిలి పరిమళ భరితమై విశ్వామిత్రుడి మీద వీచింది. మేనక అప్పుడే వికసించిన పుష్పాభరణులను ధరించి మెల్లమెల్లగా వనకేళీలాలస విలాస గమనంతో వచ్చి విశ్వామిత్రుణ్ణి చూచింది. ఆ విశ్వామిత్ర మహర్షి మన్మథుణ్ణి నిరసించిన స్థితిలో ఉన్నాడు. ఆయనను చూచి మేనక ఆయనకు నమస్కరించింది. తాను చెలికత్తెలతో కలిసి పూలుకోసుకునే వంకతో అక్కడ విహరిస్తున్నది. మేనక ఆ మహాముని ఎదుట ఉన్న సమయంలో కమ్మని వాయువు వల్ల ఆమె పైగుడ్డ జారి వికలమైంది. ఆమె స్తనాలు, చంకలు, అందమైన సన్నని పొట్ట, మూడు వళులతో కూడిన నూగారు బయటపడ్డాయి. వాట

మీద విశ్వామిత్రుడి చూపుపడింది. అతని హృదయంలో మన్మథబాణాలు పడ్డాయి. విశ్వామిత్రుడు చిత్తస్థైర్యాన్ని కోల్పోయాడు. తపించాడు. ఆమెతో సంభోగ సౌఖ్యాన్ని అనుభవించడానికి పూనుకొన్నాడు. మేనక కూడ విశ్వామిత్రుడికి ఇష్టమైన కామోపభోగాలతో చాలాకాలం రమించింది. మేనకా విశ్వామిత్రులకు ఈ పిల్ల పుట్టింది. ఈ బిడ్డను మాలినీ నదీపులినతలంలో వదలివేసి మేనక దేవలోకానికి వెళ్లింది. విశ్వామిత్రుడు తపోవనానికి వెళ్లాడు.

ఆ విశ్వామిత్ర మహర్షి ప్రభావం వల్ల, ఏడుస్తూ ఉన్న పసిపాపను రాక్షసులూ క్రూరమృగాలు ఆహారంగా పట్టుకోకుండా పక్షిసమూహాలు రెక్కలతో కప్పి రక్షిస్తూ ఉన్నాయి. ఆ తరువాత మేము శిష్యగణాలతో సమిధలూ పూలూ పండ్లూ తెచ్చుకోవడానికి అక్కడకు వెళ్లాం. దివినుండి భువికి దిగివచ్చిన చంద్రరేఖలా ఉన్న అత్యంత కాంతిమతి అయిన బిడ్డను ఎత్తుకొని వచ్చాం. ఆమె శకుంత రక్షిత కావడం వల్ల శకుంతల అని పేరుపెట్టి గారాబంగా పెంచాం. స్త్రీలకు కన్నతండ్రి, అన్నంపెట్టినవాడు, భయంనుండి రక్షించినవాడు - ఈ ముగ్గురూ తండ్రులు. ఈ శాస్త్రార్థానుగుణంగా మేము ఈమెకు భయత్రాతలం కనుక గురువులం. ఈమె మా చేత పెంచబడింది. కాబట్టి మాకు హృదయానందని అయిన నందన.

ఈ విధంగా కణ్వమహాముని ఆ మునికి చెప్పిన తీరును వివరంగా శకుంతల దుష్యంతుడికి చెప్పింది.

దుష్యంతుడు తనలో ఇలా అనుకొన్నాడు. "ఈ శకుంతల ముని శ్రేష్ఠుడైన కణ్వుని పుత్రిక అని నా హృదయం, ఇప్పటిదాకా ఎంతో నిస్పృహతో ఉంది. ఇప్పుడు ఈమె రాజపుత్రినని తన అభిజాత్య సంపదను తెలియజేసింది. ఇక నా హృదయం మన్మథబాణాలకు వశం అయింది. తుమ్మెద పాటుతో కంపించిన పద్మంలాగా సంచలించింది." ఇలా అంటూ కామాతురుడయ్యాడు దుష్యంతుడు. తన మీద శకుంతలకు అనురాగం ఉన్నట్లు గమనించి ఇలా అన్నాడు "ఓ శకుంతలా ! నీ రూపలావణ్యాలు ఈ నారచీరలకు, ఈ అడవి పండ్ల ఆహారాలకు, ఈ చెట్లకొమ్మల క్రింది కుటీర నివాసాలకు తగినవా ? కావు. నీవు ఈ మునిపల్లెలో ఉండడమెందుకు ? నాకు భార్యవై మహారాజ్య మహనీయ సౌఖ్యాన్ని అనుభవించు. చంద్రకిరణ స్వచ్ఛ సౌధాల్లో, బంగారు నేలమీద సంచరించు. అష్టవిధ వివాహాలలో గాంధర్వ రాక్షసాలు క్షత్రియులకు చాలా ప్రశస్తాలు. నీకూ నాకూ స్నేహాన్ని ప్రేమను మన్మథుడు పెంచనారంభించాడు. మనకు గాంధర్వ వివాహం యుక్తమైనది."

ఆ మాటలు విని శకుంతల లజ్జా వనతవదనమై ఇలా అన్నది. 'దయామయులూ, ధర్మ స్వరూపులైన మా తండ్రిగారు కొద్ది సేపట్లో వస్తారు. వారు నన్ను నీకిస్తే వివాహం చేసుకో ! " అప్పుడు దుష్యంతుడు "తనకు తానే చుట్టం, తానే గతి తనను తానే అర్పించుకోవాలి - ఇది అతి రహస్యమూ అమంత్రకమూ అయిన గాంధర్వ వివాహ విధానం" అని శకుంతలను అంగీకరింపజేశాడు. అనంతరం ఆమె దుష్యంతుడితో "నీ దయవల్ల నాకు కలిగిన కుమారుణ్ణి యౌవరాజ్యాభిషిక్తుడిగా చేయాలి. నీవు ప్రసన్న బుద్ధితో ఈ వరం దయచెయ్యి. అలా అయితే నీకూ నాకూ సంగమం అవుతుంది" అని అన్నది. ఆ మాటలు విని దుష్యంతుడు ఎంతో సంతోషంతో ఆమె కోరిన వరం ఇచ్చాడు. గాంధర్వ వివాహ పద్ధతిలో అభిమతసుఖాలను అనుభవించాడు. ఆమెను వీడ్కొని వెళ్లేటప్పుడు " త్వరలో నిన్ను తోడ్కొని రావడానికి నా మంత్రుల్ని కణ్వమహాముని దగ్గరకు పంపుతాను" అని ఊరడించి దుష్యంతుడు తన పట్టణానికి వెళ్లాడు.

ఇక్కడ శకుంతల తాను చేసిన పనిని కణ్వమహర్షి తెలిసికొని కోపిస్తాడేమో అని భయపడుతున్నది. తరువాత ఆ మహర్షి వనం నుండి కందమూల ఫలాలు తీసుకొని వచ్చాడు. లలిత శృంగార భావంతో సిగ్గుతో తలవంచుకొని భయపడుతున్న కూతురును చూశాడు. దివ్యజ్ఞానంతో విషయమంతా తెలుసుకున్నాడు. క్షత్రియులకు గాంధర్వ వివాహం విధి చోదితమే అని సంతోషించాడు. కణ్వమహర్షి శకుంతలతో "అమ్మా ! నీకుల గోత్ర సౌందర్యాలకు తగిన భర్తను పొందావు. గర్భవతివి అయ్యావు. నీ గర్భంలో ఉన్న బిడ్డ చక్రవర్తి సుమా ! నీ ధర్మ చరిత్రకు మెచ్చుకున్నాను. నీవు కోరిన వరం ఇస్తా ! కోరుకో ! " అన్నాడు. అప్పుడామె తన మనస్సు ధర్మలగ్నమై ఉండాలనీ, తన కుమారుడు దీర్ఘాయురారోగ్యైశ్వర్య బల సమన్వితుడూ, వంశకర్తా కావాలి అని కోరుకున్నది. ఆ మహర్షి కరుణించి ఆమె కోరిన వరాలు ఇచ్చాడు.

కణ్వుడు శకుంతలకు కాలోచిత విధ్యుక్త గర్భసంస్కార సంరక్షణలు చేయించాడు. భరతుడు జన్మించాడు. భరతుడు కణ్వ నిర్వర్తిత జాతకర్మాది క్రియాకలాపుడై పెరుగుతున్నాడు. అతడు కరతలాలంకృత చక్రుడూ, చక్రవర్తి లక్షణ లక్షితుడూ, సర్వాంగ సుందరుడూ, దీర్ఘ బాహుడూ అనంత జవసత్వ సంపన్నుడూ అయి ప్రకాశిస్తున్నాడు.

మహాభయంకరమైన ఆ అడవిలో తిరిగే అడవి పందుల్ని, సర్పాల్ని పెద్ద పులుల్ని, ఖడ్గమృగాల్ని, మదపుటేనుగుల్ని, ఇంకా తక్కిన జంతువుల్ని తెచ్చి కణ్వాశ్రమ సమీపంలోని వృక్షాలకు వరుసగా కట్టి వేస్తున్నాడు. మహాబలంతో మదించిన ఏనుగుల్ని అధిరోహిస్తున్నాడు. ఇలా తన బలాన్ని చూపుతూ శకుంతలా నందనుడు శైశవ క్రీడల్ని సాగిస్తున్నాడు.

అరణ్యంలో ఉన్న అన్ని జంతువుల్ని తన మహాబలంతో అణచివేస్తున్న భరతుణ్ణి చూచి అక్కడి ఋషులు అతనికి సర్వదమనుడని పేరు పెట్టారు. కణ్వమహాముని కూడా భరతుడి మహావర్చస్సుకు, రూపరేఖలకు, పరాక్రమానికి సంతోషించాడు. యౌవరాజ్యాభిషేకానికి అర్హుడయ్యే సమయం సమీపించిందని భావించాడు.

కణ్వమహర్షి ఒకనాడు తన కూతురు శకుంతలతో ఇలా అన్నాడు : "ఎంత పతివ్రతలకైనా పుట్టినిళ్లల్లో ఎక్కువకాలం ఉండడం అంత మంచిది కాదు. భర్తల దగ్గర ఉండడమే స్త్రీలకు ధర్మం. భార్యలకు సంరక్షకులు భర్తలేసుమా! కనుక నీవు ఈ కుమారుణ్ణి తీసుకొని నీ భర్త దగ్గరకు వెళ్లు" అని చెప్పి మహా తపోధనులైన కొంతమంది శిష్యుల్ని తోడు పంపాడు. శకుంతల భరతుణ్ణి తీసుకొని దుష్యంతుడి దగ్గరకు వచ్చింది. అప్పుడు దుష్యంతుడు సామంతమంత్రి పురోహిత ప్రధాన పౌరజన పరివృతుడై ఉన్నాడు.

శకుంతల దుష్యంతుణ్ణి చూచింది. ఇంతకు ముందు తన తండ్రి ఆశ్రమంలో భర్తవల్ల తాను పొందిన అనురాగం, ఆదరం, సంభ్రమం, ఇప్పుడు కనిపించలేదు. ఇలా ఆలోచించింది. "ఇతడు నన్ను ఎరుగడా ? తెలిసికూడా తెలియనట్లు ఉన్నాడా ? చాలాకాలం, చాలాదూరం కావడం వల్ల మరచిపోయాడా? రాజులు మోహపరవశులు కనుక మరిచిపోకుండా ఉంటారా? అదికాక ప్రభువులు ఎన్నో పనుల్లో మునిగిపోయి ఉంటారు కదా? పూర్వం ఇచ్చిన మాటను మనస్సునుంచి తొలిగించుకొన్నాడేమో ! చూపులు సరసంగా లేవు సరే! విరసంగా, క్రూరంగా తయారయ్యాయి. కారణం ఏమిటో ! కలుపుగోలుతనంతో పలకరించారని, ఉపకారం చేశారని బుద్ధిమంతులైన వారు రాజుల్ని నమ్మి ఉండకూడదు. రాజులు కొత్తవారి పట్ల మోజుతో ఇంతకుముందు ఉన్న ప్రేమపాత్రుల్ని వదలివేస్తారు".

ఇలా ఆలోచించి చింతాక్రాంత అయింది శకుంతల. మళ్లీ మనస్సులో ఇలా అనుకొన్నది. "ఎవరైనా నిజంగా మరచిపోతే గుర్తు చేయవచ్చు. అసలు తెలియకపోతే అన్ని విధాలా తెలిసేటట్లు చేయవచ్చు. కాని తెలిసి ఉండి, ఇతరులు చెప్పేది వినడానికి ఇష్టపడని వంచకుడికి తెలియజెప్పడం ఆ బ్రహ్మకు కూడా తరం కాదు. అయినా ఇక్కడి దాకా వచ్చి ఊరక తిరిగి పోగూడదు. కాబట్టి నా పూర్వ వృత్తాంతం మొత్తాన్ని చెప్పి ఈ కుమారుణ్ణి చూపుతాను" అని శకుంతల తన మనస్సులో అట్లా నిశ్చయించుకొని దుష్యంతుడితో ఇలా అన్నది. "ఓ రాజా ! నీవు వేట నెపంతో ఉద్దేశపూర్వకంగా కణ్వాశ్రమానికి వచ్చి సంతోషంతో నాకు ఇచ్చిన వరాన్ని గుర్తుతెచ్చుకో ! బాలసూర్యుడితో సమానమైన తేజస్సు కలిగిన ఈ బాలుడు నీ కుమారుడు. పౌరవవంశరత్నా భరణుడూ, సద్గుణ నిలయుడూ అయిన వీడికి పట్టాభిషేకం జరిపించి యువరాజుగా చెయ్యి".

దుష్యంతుడు అంతా తెలిసికూడా తెలియని వాడిలాగా ఇట్లా అన్నాడు: "నేను నిన్ను ఎరుగను! నీవు ఎక్కడి దానివి? ఊరకే అనగూడని మాటలు అంటావెందుకు ? ఎక్కడి నుంచి వచ్చావో అక్కడికి వేగంగా వెళ్లు !"

శకుంతల దుష్యంతుడి మాటల్ని విని తెల్లబోయింది. వేడినిట్టూర్పులు వదలింది. నిశ్చేష్టురాలైంది. ఎర్రతామర రేకుల నుంచి జారుతున్న నీటిబొట్లులాగా కోపంతో ఎరుపెక్కిన ఆమె కళ్లనుంచి బాష్పబిందువులు స్రవిస్తూ ఉన్నాయి. ఆమె తలవంచి ఆ రాజును కడకంట చూస్తూ, హృదయ సంతాపాన్ని తనకు తానే అణచుకొన్నది. చాలాసేపు విచారించింది.

శకుంతల రాజుతో ఇలా అన్నది : "జ్ఞానంలేని ఇతరుల్లాగా నీవు ఎరుగనంటున్నావు. అన్నీ తెలిసి కూడా ఇలా ఎందుకు మాటాడుతున్నావు? నేను తప్ప ఇక్కడ ఉన్నవారు ఎవ్వరూ దీని నెరుగరని ధార్మికులైనవారు అబద్ధమాడవచ్చా? వేదాలు, పంచభూతాలు, ధర్మదేవత, సంధ్యలు, అంతరాత్మ, యముడు, చంద్రసూర్యులు, పగలు, రాత్రి అనే మహాపదార్థాలు ఉండగా మానవుడు తన్నుతాను

మోసగించుకోవడానికి పూనుకుంటాడా ? పూనుకోడు. ఓ రాజా! నీవు ఇచ్చిన వరం నాకు తెలిసినట్లే వీటి అన్నిటికీ తెలుసు. కనుక నా మీద పూర్వంలాగే దయచూపించు. తిరస్కరించడం తగినపని కాదు. పతివ్రత, గుణశాలిని, సంతానవతి, అనువ్రత అయిన అనురాగవతి అయిన భార్యను తిరస్కార దృష్టితో చూచే దుర్బుద్ధికి భూలోక సుఖంలేదు, స్వర్గలోక సుఖంలేదు. అనుగుణమైన భార్య కలవాడు శాశ్వతమైన గృహస్థ ఫలితాన్ని పొందుతాడు. యజ్ఞయాగాది కర్మలు చేసేవాడు, తపఃక్లేశాన్ని సహించేవాడు, పుత్రవంతుడూ అవుతాడు.

"ఇంకా ధర్మార్థ కామసాధనకు సాధనం, గృహనీతి విద్యకు గృహం, స్వచ్ఛమైన నడవడిని బోధించడానికి గురుస్థానం, వంశవృద్ధికి మూలం, మంచి మార్గంలో నడవడానికి ఊత, గౌరవానికి ప్రధానకారణం, సద్గుణమణులకు గని, హృదయ సంతోషాన్ని కలిగించేది భార్యయే సుమా ! కనుక భర్తకు తక్కినవి ప్రియం కావు. అరణ్య వాసాది క్లిష్టఘట్టాలలోను, ఆపదలలోను, అవసరాల్లోను చుట్టుముట్టిన శోకాలన్నీ గూడా, భార్యల్ని సంతానాన్ని చక్కగా చూచుకునే ప్రజలకు సులభంగా తొలగిపోతాయి.

"భార్య పురుషుడిలో అర్ధభాగం. భర్తకన్నా ముందే మరణించిన పతివ్రత పరలోకంలో తన భర్తకోసం ఎదురుచూస్తూ ఉంటుంది. ఒకవేళ తనభర్త ముందే మరణిస్తే వెంటనే తానుకూడా మరణించి తన భర్తను కలిసి పరలోకానికి పోతుంది. అటువంటి భార్యను అవమానించడం అధర్మం. ఇంకా భర్త భార్యలో ప్రవేశించి గర్భంలో పుత్రుడై తానే జన్మిస్తాడు. కనుక "అంగా దంగాత్ సంభవసి" (ప్రతి శరీరంలోనుంచి జన్మిస్తున్నావు) మొదలైన వేదవాక్కుల్లోనూ తండ్రీ కొడుకూ అనే తేడాలేదు. గార్హపత్యం అనే అగ్ని వేరే ప్రదేశంలో అహవనీయమనే పేరుతో ప్రకాశించేటట్లు తండ్రి తానే కుమారుడిగా తన తేజస్సుతో వెలుగుతుంటాడు. తానే తన ప్రతిబింబాన్ని నీళ్లలో స్పష్టంగా చూచేటట్లు తండ్రి తన కొడుకును తాను చూచి అధిక ప్రీతితో మహానందాన్ని పొందుతాడు. 'పున్నామ్నో నరకాత్ త్రాయత ఇతి పుత్రః' (పుత్ అనే పేరుగల నరకంనుంచి రక్షిస్తాడు కనుక పుత్రుడు) అనే వేదవాక్యం ఉంది. కాబట్టి పుణ్యాచారుడైన పుత్రుడు తల్లివంక వారిని తండ్రివంక వారిని ఉద్ధరిస్తాడు. వారికి ఉత్తమ గతులు కలిగిస్తాడు.

"కాబట్టి దీపం నుంచి మరో దీపం పుట్టినట్లు నీ పుణ్యశరీరం నుంచి ఈ కుమారుడు పుట్టి తేజస్సుతో ప్రకాశిస్తున్నాడు. ఓ మహారాజా ! విరుద్ధమైన ప్రత్యుత్తరాలు ఎందుకు? ఈ కుమారుడి శరీరాన్ని కౌగిలించుకోవడం వల్ల కలిగే సుఖాన్ని పొందు. ముత్యాలహారాలు, కర్పూర ధూళి, మంచి గంధం, వెన్నెల కుమార శరీరాలింగనం లాగా జీవులకు హాయిని కలిగిస్తాయా? అధికమైన చల్లదనాన్ని కలిగిస్తాయా? కలిగించవు. నీ కుమారుడు పుణ్యాత్ముడూ వంశోద్ధారకుడై ఆధిక్యంతో వంద వాజపేయయాగాలు చేస్తాడని మునులందరూ వింటూ ఉండగా ఆకాశవాణి నన్నుద్దేశించి అన్నది. కనుక ధర్మాన్ని ప్రేమించే మహారాజా ! న్యాయమైన బుద్ధికలవాడా! శాస్త్రచింతనాదుల వల్ల కలిగే అర్థ నిర్ణయ జ్ఞానం కలిగినవాడా ! ఆనాటి సత్యం ఎటూ ఉన్నది. నీవు నిష్కారణంగా ఇటువంటి సమస్త సద్గుణ సంపన్నుణ్ణి, వంశోద్ధారకుణ్ణి కాదనడం న్యాయమా?

"ప్రశస్తమైన నీటితో నిండిన నూరు నూతులకన్నా ఒక బావి శ్రేష్ఠమైనది. నూరుబావుల కన్నా ఒక మంచి యజ్ఞం శ్రేష్ఠమైనది. నూరు యజ్ఞాలకన్నా ఒక కుమారుడు శ్రేష్ఠం. నూరుగురు కొడుకులకన్నా బాగా ఆలోచిస్తే ఒక సత్యవాక్యం శ్రేష్ఠం. వెయ్యి అశ్వమేధాల్ని, ఒక సత్యాన్ని త్రాసులో రెండు ప్రక్కలా పెట్టి తూకం వేస్తే అధికమైన భారం కారణంగా సత్యం వైపే ముల్లు మొగ్గుతుంది. అన్ని తీర్థాలను పొందడం (యాత్ర చేసి చూడడం), అన్ని వేదాలను పొందడం (చదవడం), సత్యంతో సమానం కావు. ధర్మవేత్తలైన మునులు అన్ని ధర్మాలలో సత్యమే గొప్పదని అంటారు. గమనించు !

"కాబట్టి నీవ్వు స్వచ్ఛమైన ప్రతిభతో సత్యమే గొప్పదని భావించి, కణ్వాశ్రమంలో అనుకున్న మాటప్రకారం దయ ఉంచి కొడుకును దయార్ద్రదృష్టితో చూడు. క్షత్రియ శ్రేష్ఠమైన విశ్వామిత్రుడికి, పవిత్రురాలైన మేనకకు కూతురునై అబద్ధం ఆడడానికి నేను అంత అధర్మపరురాలినా?"

ఇలా అన్న శకుంతల మాటల్ని ఆదరించడానికి అంగీకరించలేదు దుష్యంతుడు. ఇలా అన్నాడు. "నేనెక్కడ? నువ్వెక్కడ? కొడుకెక్కడ! నేను ఇంతకు పూర్వం ఎప్పుడూ నిన్ను చూచి ఎరుగను. 'ఆడవాళ్లు అబద్ధాలాడే వాళ్లు' అనేటట్లు అసత్యమాడడం తగిన పనేనా? ఇంకా ఇలా అన్నాడు. "ఎత్తులో వయస్సులో చాలా అధికమైన బలంతో సాటిలేని వీణ్ణి నీ కొడుకని చూపించడానికి తీసుకు వచ్చావా? అందరూ నవ్వుతున్నారు ! ఇటువంటి లోకవిరుద్ధాలకు మేము సంకోచిస్తున్నాం. అయుక్తమైన మాటలుమాని నీ ఆశ్రమానికి పో !"

అట్లా దుష్యంతుడనగానే శకుంతల మనస్సు మలమల మాడిపోయింది. "పుట్టిన వెంటనే తల్లిదండ్రులు విడిచిపెట్టారు. ఇప్పుడు భర్త కూడా విడిచి వేస్తాడేమో ! వేయి మాటలెందుకు ? పూర్వజన్మలో ఎంతో తక్కువ నోములు నోచి ఉంటాను. లేకపోతే ఇదేమిటి ? అంటూ బాధ పడింది. ఆశలు వదలుకున్నది". కన్నీరు ఒత్తుకొంటూ ఇక "దేవుడే దిక్కు" "అన్యథా శరణం నాస్తి" అని ఆ మహాపతివ్రత తన కుమారుణ్ణి తీసుకొని పోబోయే సమయంలో ఒక అద్భుతం జరిగింది.

ఆకాశవాణి ప్రయత్న పూర్వకంగా, ఆ సభలోని వారంతా ఆశ్చర్యచకితులౌతూ ఉండగా రాజుతో ఇలా అన్నది. "వీడు శకుంతలకూ నీకూ ప్రియపుత్రుడు. నీ బిడ్డను నీవు దగ్గరకు తీసుకొని పోషించు ! శకుంతల పతివ్రతలందరూ బాగా ప్రశంసించే మహాపతివ్రత" అని వివేకంతో సత్యాన్ని పలికింది. అప్పుడు ఆకాశం నుంచి దేవతల మాటలు అతిస్పష్టంగా వినిపించాయి. అవి శకుంతల పతివ్రతాత్వ ప్రశంసలు. సత్యప్రశంసలు. భరతోత్పత్తి ప్రశంసలు. ఆ మాటలు అందరికీ సంతోషాన్ని కలిగించాయి.

అప్పుడు దుష్యంతుడు సభలోని వారందరూ వినేటట్లు ఇలా అన్నాడు "నేను కణ్వమహాముని ఆశ్రమంలో గాంధర్వ వివాహ పద్ధతిలో శకుంతలను పెండ్లాడిన విషయం మా ఇద్దరికే తప్ప ఇతరులకు తెలియదు. ఇతరులకు తెలియదుగదా ! అని లోకాపవాద భీతితో నేను ప్రీతిని విడిచి ఈమెను ఎరిగికూడా ఎరుగనన్నాను. ఆకాశవాణి ఆశ్చర్యకరంగా ఇప్పుడు ఇక్కడ ఉన్న వారందరికీ తెలిసేటట్లు చెప్పింది."

దుష్యంతుడు ఎంతో అనురాగంతో కొడుకును ఎత్తుకొని సంతోషం వలన గగుర్పాటు ఎక్కువ కాగా కొడుకును కౌగలించుకున్నాడు. శకుంతలా మహాదేవిని ఎంతో ప్రేమతో గౌరవించాడు. భరతుణ్ణి యౌవరాజ్యానికి అభిషిక్తుణ్ణి చేశాడు. దుష్యంతుడు చాలాకాలం రాజ్యసుఖాలు అనుభవించాడు. ఆ తరువాత తన రాజ్యభారాన్ని భరతుడి మీద మోపి తపోవనానికి వెళ్లాడు.

భరతుడు సువిశాల భూభారాన్ని వహించినవాడై లోక ప్రసిద్ధిని పొందాడు. గంగాయమునా తీరప్రదేశాల్లో అనేక యాగాలను మంచి నిష్ఠతో చేశాడు. బ్రాహ్మణులకు బంగారాన్ని, ఆవుల్ని, గుర్రాల్ని, ఏనుగుల్ని, దక్షిణలు ఇచ్చాడు. వంశకర్త అయ్యాడు.

### 1.1.2. సమగ్ర వ్యాఖ్యలు :

**పద్యం 8 :**

ఆ దుష్యంతుఁ డనంత సత్త్వుఁడు సమస్తాశాంత మాతంగ మ
ర్యాదాలంకృతమైన భూవలయ మాత్మాయత్తమై యుండఁగా
నాదిత్యాంశు సమీర దుర్గమ మహోగ్రారణ్య దేశాళితో
నాదిక్షత్ర చరిత్ర నేలె నజితుండై బాహు వీర్యంబునన్.

**పరిచయం :**

ఈపద్యం నన్నయ భట్టారకుడు రచించిన శ్రీమదాంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానం' నుంచి గ్రహించబడింది.

**సందర్భం :**

దుష్యంత మహారాజు రాజ్యపరిపాలనను కవి వర్ణిస్తున్న సందర్భంలోది ఈ పద్యం.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| న + అంత సత్త్వుడు | = | మేరలేని బలం కలిగిన వాడైన;<br>శేషుని వంటి విష్ణువు వంటి బలం కలిగిన వాడైన |
| ఆ దుష్యంతుడు | = | ఆ దుష్యంత మహారాజు |

| | | |
|---|---|---|
| బాహు వీర్యంబునన్ | = | భుజబలంతో |
| అజితుండు + ఐ | = | గెలువబడిన వాడై: త్రిమూర్తుల వంటివాడై |
| ఆదిత్య + అంశు | = | సూర్యకిరణాలు |
| సమీర | = | వాయువు |
| దుర్గమ | = | ప్రవేశించరానిదైన |
| మహా + ఉగ్ర + అరణ్యదేశ + ఆళితోన్ | = | చాలా భయంకరమైన అరణ్య ప్రదేశాల సమూహంతో |
| సమస్త + ఆశా + అంత | = | అన్ని దిక్కుల చివరలలో ఉన్న |
| మాతంగ | = | ఏనుగులే |
| మర్యాదా + అలంకృతము + ఐన | = | హద్దుగా అలంకరించబడిన |
| భూవలయము | = | గుండ్రని నేల |
| ఆత్మ + ఆయత్తము + ఐ + ఉండన్ + కాన్ | = | తన ఆధీనమై ఉండగా |
| ఆదిక్షత్ర చరిత్రన్ | = | పూర్వరాజుల నడవడిలో |
| ఏలెన్ | = | పరిపాలించెన్. |

**తాత్పర్యం :** ఆ దుష్యంత మహారాజు అంతంలేని బలం కలవాడు. సూర్య కిరణాలూ, గాలీ కూడా ప్రవేశించలేని దిక్కు వనవులలో కూడి ఉన్న భూమిని పరిపాలించాడు. ఆయన సామ్రాజ్యానికి దిగ్గజాలే హద్దులు. ఆయన భుజబలంలో ఎవరికీ లొంగలేదు. పుణ్యాత్ములైన పూర్వరాజుల మార్గంలో ఏలుబడిని కొనసాగించాడు.

**కవితా విశేషాలు :**

ఈ పద్యంలో నన్నయ దుష్యంతుడి సామ్రాజ్య విస్తీర్ణతను సుదీర్ఘ సమాస బంధురంగా వర్ణించాడు. దుష్యంతుడి భూభారవహనంలో శేషుణ్ణి విష్ణువును ఇంకా బ్రహ్మరుద్రులనూ స్ఫురింపజేసి మన కథానాయకుణ్ణి మహనీయుడిగా తీర్చి దిద్దాడు.

వృత్త రచనలో ఎంతో ప్రవీణుడైన నన్నయ సందర్భోచితంగా ఈ శార్దూలాన్ని చాలా గంభీరంగా నడిపాడు.

**17. వ**

అతిరుచిరాగతుం డయిన యాతనికిన్ హృదయ ప్రమోద మా
తతముగ నవ్వనంబున లతాలలనల్ మృదులానిలాప వ
ర్జిత కుసుమాక్ష తావళులు సేసలు వెట్టిన యట్టి రైరి సం
పతదళినీ నినాద మృదు భాషల దీవన లొప్ప నిచ్చుచున్.

**పరిచయం :**

ఈ పద్యం నన్నయ భట్టారకుడు రచించిన శ్రీమదాంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానం' నుంచి గ్రహించబడింది.

**సందర్భం :**

దుష్యంత మహారాజు మృగయా వినోదంలో ఎన్నో మృగాల్ని తరిమి చంపాడు. ఇంకా చంపే వేడుకతో చాలా దూరం వెళ్లి ఒక వనాన్ని చూశాడు. దాని రమణీయతను ప్రశంసిస్తూ వచ్చి అందులో ప్రవేశించాడు. ఆ వనం ఆయనను సత్కరించిన సందర్భంలోది ఈ పద్యం.

ప్రతిపదార్థం :

| | | |
|---|---|---|
| అతి రుచిర + ఆగతుండు + అయిన | = | చాలా మనోహరమైన రాక కలవాడైన |
| ఆతనికిన్ | = | ఆ దుష్యంత మహారాజుకు |
| హృదయ ప్రమోదము | = | మనస్సంతోషం |
| ఆతతముగ | = | విస్తారమయ్యేటట్లుగా |
| ఆ + వనంబున | = | ఆ వనంలోని |
| లతాలలనల్ | = | తీగలనే స్త్రీలు |
| సంపతత్ | = | వాలుతున్న |
| అళినీ నినాద | = | ఆడు తుమ్మెదల రొదలనే |
| మృదు భాషలన్ | = | మెత్తని మాటలతో |
| దీవెనలు | = | ఆశీస్సులు |
| ఒప్పన్ | = | చక్కగా |
| ఇచ్చుచున్ | = | ఇస్తూ |
| మృదుల + అనిల | = | సుకుమార వాయువుచే |
| ఆపవర్జిత | = | రాల్చబడ్డ |
| కుసుమ + అక్షత + ఆవళుల | = | పూలనే అక్షతల సమూహంతో |
| సేసలు + పెట్టిన + అట్టిరు + ఐరి | = | అక్షతలు చల్లిన వాళ్ల అయ్యారు |

తాత్పర్యం : దుష్యంతుడు చాలా మనోహరంగా వస్తున్నాడు. అతని మనస్సుకు ఆనందం అధికమయ్యేటట్లుగా ఆ వనంలోని తీగల నుంచి పిల్లగాలుల స్పర్శకు పూలు రాలి అతనిపై పడ్డాయి; ఆడు తుమ్మెదలు ఝుంకారాలతో వీనులవిందు చేస్తున్నాయి. ఇది ముత్తైదువులు అక్షతలు చల్లుతూ ఆశీస్సులు పలికినట్లుగా ఉంది.

కవితా విశేషాలు :

నన్నయగారు ఇక్కడ దుష్యంతుడికి త్వరలో జరగనున్న వివాహాన్ని స్ఫురింపజేశాడు. దుష్యంత వివాహం ఈశ్వర సంకల్పం. అందువల్లనే దుష్యంతుడు అతిరుచిరాగతుడు. సేసలు అంటే తలంబ్రాలు అని కూడా అర్థం.

ఈ పద్యంలోని రూపకాలంకారం మనోజ్ఞం. ఇక్కడ మత్తేభ, శార్దూలాది ఉద్ధత వృత్తాల్ని వాడకుండా సుకుమారమైన చంపకమాలను వాడడం ఔచిత్యశోభితం.

25. ప.

వలయు నమాత్యులం దగిన వారల నుండఁగఁబంచి ధారుణీ
తలవిభుఁ డొక్కరుండ చని తన్విఁ బయోజదళాయతాక్షి సం
కుల మిళితాళి నీల పరికుంచిత కోమల కుంతలన్ శకుం
తల యను కన్యకం గనియెఁదన్ముని వల్లభు మందిరంబునన్.

పరిచయం :

ఈ పద్యం నన్నయ భట్టారకుడు రచించిన శ్రీమదాంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానం' నుంచి గ్రహించబడింది.

సందర్భం :

దుష్యంతుడు కణ్వాశ్రమాన్ని చూశాడు. అతనితో పాటు ఉన్న మంత్రులు మొదలైన వారితో "మీరు ఇక్కడే ఉండండి! నేను కణ్వమహాముని దర్శనం చేసుకొని వస్తాను" అని కణ్వ మహాముని మందిరానికి వెళ్లాడు. శకుంతలను చూశాడు.

ప్రతిపదార్థం :

| | | |
|---|---|---|
| ధారణీతల విభుడు | = | మహారాజు (దుష్యంతుడు) |
| వలయు + అమాత్యులన్ | = | ఇష్టులైన మంత్రులను |
| తగిన వారలను | = | యుక్తమైన వారిని |
| ఉండగన్ + పంచి | = | అక్కడే ఆగమని ఆజ్ఞాపించి |
| ఒక్కరుండు + అ | = | ఒక్కడే |
| చని | = | వెళ్ళి |
| తత్ + మునివల్లభు | = | ఆ ముని శ్రేష్ఠుని (కణ్వుని) |
| మందిరంబునన్ | = | ఇంటిలో |
| తన్విన్ | = | బక్క పలుచనిదీ |
| పయోజదళ + ఆయత + అక్షి | = | తామర రేకులు లాగా విశాలమైన కళ్లు కలదీ |
| సంకుల | = | విస్తారమైన |
| మిళిత | = | కలిసిన (చిక్కని) |
| అళినీల | = | తుమ్మెదలవలె నల్లనైన |
| పరికుంచిత | = | బాగా వంపులు తిరిగిన |
| కోమల | = | మృదువైన |
| కుంతలన్ | = | వెంట్రుకలు కలదీ అయిన |
| శకుంతల + అను | = | శకుంతల అనే పేరుగల |
| కన్యకన్ | = | పెండ్లికాని పడుచును |
| కనియెన్ | = | చూశాడు |

తాత్పర్యం : దుష్యంతుడు అందరినీ ఆగమని చెప్పి ఒక్కడే వెళ్లి శకుంతలను చూశాడు. ఆమె బక్కపలుచగా ఉంది. తామర రేకుల్లాంటి విశాలనేత్రాలతో విరాజిల్లుతున్నది. బాగా వ్యాపించిన చిక్కని నల్లని వంకరలు తిరిగిన నున్నని జుట్టుతో ప్రకాశిస్తున్నది.

కవితా విశేషాలు :

నన్నయగారు శకుంతల సౌందర్యాన్ని ఎంతో ఉదాత్తంగా వర్ణించారు. ముచ్చటైన మూడు విశేషణాలలో ఒకటిన్నర పాదంలోనే ఆ దివ్య సౌందర్యాన్ని రూపు కట్టించారు. ఇంకొక కవి అయితే అందునా ప్రబంధ కవి అయితే అంగాంగ శృంగారాన్ని అభివర్ణించి ముప్పై నలభై పద్యాలు వ్రాసేవాడే. ఇది అమలిన శృంగారం. శకుంతల సౌందర్యం ఆమె కేశపాశంలో ఉందనిపిస్తోంది. నన్నయ ఆరామణీయకాన్ని సురుచిర సమాసంలో నిక్షేపించాడు. అంత్యానుప్రాస, ఉపమాలంకారాలు అప్రయత్న సిద్ధాలు. ఈ సౌందర్య వర్ణనకు చంపకమాలను స్వీకరించి ఆదికవి వృత్తౌచిత్య పాలనను ప్రదర్శించాడు.

51. ప

ఇది మునినాథ కన్య యని యెంతయు నిస్పృహవృత్తి మున్న నా
హృదయము రాజపుత్త్రి నని యిక్కమలాక్షి నిజాభిజాత్య సం
పద నెఱిఁగించినన్ మదనబాణ పరంపర కిప్పుడుండ నా
స్పద మయి సంచలించె నళిపాత వికంపిత పంకజాకృతిన్.

**పరిచయం :**

ఈ పద్యం నన్నయ భట్టారకుడు రచించిన శ్రీమదాంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానం' నుంచి గ్రహించబడింది.

**సందర్భం :**

దుష్యంతుడు కణ్వమందిరంలో శకుంతలను చూశాడు. మన్మథరాజ్యలక్ష్మి లాంటి ఆమెను చూచి సంచలిత హృదయుడై 'నీ వెవరి కూతురివి' అని అడిగాడు. ఆమె తాను కణ్వాత్మజనని చెప్పింది. 'ఇది ముని కన్యయేని మఱి యేలొకొ యీ లలితాంగి యందు నా హృదయము దర్లయుందవిలె ?' నని నమ్మలేక పోయాడు. ఊర్ధ్వరేతుడైన కణ్వుడికి నీవెలా కూతురివయ్యావు ? అని ప్రశ్నించాడు. అప్పుడు ఆమె, పూర్వం కణ్వుడొక మహర్షికి చెప్పిన తన జన్మ వృత్తాంతాన్ని చెప్పింది. అనంతరం దుష్యంతునకు కలిగిన ఆలోచన ఈ పద్యంలో ఉంది.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| ఇది | = | ఈ శకుంతల |
| మునినాథ కన్య + అని | = | ఋషి కన్య అని (కణ్వ మహాముని కూతురని) |
| ఎంతయు | = | ఎంతో |
| నిస్పృహవృత్తిన్ + ఉన్న | = | ఆశలేని నడవడితో ఉన్న |
| నా హృదయము | = | నా మనస్సు |
| ఈ + కమల + అక్షి | = | ఈ పద్మ నేత్ర అయిన శకుంతల |
| రాజపుత్త్రిని + అని | = | క్షత్రియుడైన విశ్వామిత్రునకూ అప్సరోంగన అయిన మేనకకూ పుత్రికనని |
| నిజ + అభిజాత్య సంపదను | = | తన గొప్ప ఇంటి పుట్టుక కలిమిని |
| ఎఱిగించినన్ | = | తెలుపగా |
| ఇప్పుడు | = | ఈ సమయంలో |
| మదనబాణ పరంపరకు | = | మన్మథ బాణాల వరుసకు |
| ఉండన్ + ఆస్పదము + అయి | = | ఉండడానికి చోటై |
| అళిపాత | = | తుమ్మెదల పాటువల్ల |
| వికంపిత | = | బాగా వణకెత్తిన |
| పంకజ + ఆకృతిన్ | = | తామరపువ్వు రూపంగా |
| సంచలించెన్ | = | బాగా కదిలింది. |

**తాత్పర్యం :** ఈ శకుంతల కణ్వమహర్షి పుత్రిక అని, ఋషి కన్య అని నేను నిరాశలో మునిగి పోయాను. ఈమె విశ్వామిత్రుడి సంతానాన్ని అని చెప్పడం వల్ల క్షత్రియ కన్య అని తేలిపోయింది. వెంటనే మన్మథబాణాలు వరుసగా నా హృదయాన్ని తాకుతున్నాయి. తుమ్మెదలు పైన పడడం వల్ల వణకిపోయే తామరపువ్వులాగా ఉంది నా మనస్సు అని దుష్యంతుడు భావించాడు.

కవితా విశేషాలు :

ఇక్కడ దుష్యంతుడి పవిత్ర హృదయం వ్యక్తమౌతున్నది. దీన్ని కాళిదాసు అభిజ్ఞాన శాకుంతల నాటకంలో చక్కగా విశ్లేషించాడు. "సతాం హి సందేహ పదేసు వస్తుషు / ప్రమాణ మంతః కరణ ప్రవృత్తయం" అన్నాడు. నన్నయ దీన్ని గమనించి "ఇది ముని కన్యయేని" (ప. 30) పద్యంలో సందేహాన్ని ప్రారంభించాడు. ఈ పద్యంలో ముగించాడు

పౌరవ వంశ సంభవుల పావన చిత్త విధంబు లన్య కాం
తారతికిం బ్రమోద కలితంబులు కావు ........ (శృం.. శా. 2 - 65)

అని పిల్లలమర్రి పిన వీరభద్రకవి తన శృంగార శాకుంతలంలో మరింత స్పష్టం చేశాడు.

నన్నయ గారు ఈ పద్యంలో ఉపమాలంకారాన్ని సముచితంగా ప్రయోగించి దుష్యంత హృదయ ప్రకంపనాల్ని మనకు అందించాడు. ఈ సుకుమార సన్నివేశానికి ఈ చంపకమాలాచ్ఛందస్సు అనుగుణంగా ఉంది.

70 ప.

తలఁపఁగ నాఁడు పల్కిన విధం బెడఁదప్పఁగ వీడెనొక్కొ చూ
డ్కులు విరసంబులై కరము క్రూరములైన నిమిత్త మేమియో
కలయఁగఁ బల్కరించి రుపకారులు నై రని నమ్మియుండఁగా
వలవదు బుద్ధిమంతులు నవప్రియులైన ధరాధినాథులన్.

పరిచయం :

ఈపద్యం నన్నయ భట్టారకుడు రచించిన శ్రీమదాంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానం' నుంచి గ్రహించబడింది.

సందర్భం :

శకుంతలను భర్తదగ్గరకు వెళ్లమని మహాతపోధనులైన శిష్యులను కొంతమందిని తోడిచ్చి పంపించాడు కణ్వమహర్షి. ఆమె తన కుమారుడైన భరతుడితో కూడ దుష్యంతుడి దగ్గరకు వచ్చింది. నిండు కొలువులో ఉన్న దుష్యంత మహారాజును చూచింది. అంతకు పూర్వం తానుభర్త వల్ల పొందిన అనురాగదరానుగ్రహ కరుణా సంభ్రమాలు ఇప్పుడు కనపడలేదు. తదనంతరం శకుంతల ఆలోచించిన తీరు ఈ పద్యంలో ఉంది.

ప్రతిపదార్థం :

| | | |
|---|---|---|
| తలఁపగన్ | = | ఆలోచిస్తే |
| నాఁడు | = | ఆనాడు |
| పల్కిన విధంబు | = | అన్నమాట ప్రకారాన్ని |
| ఎడన్ | = | హృదయంలో నుంచి |
| తప్పఁగన్ | = | తప్పిపోయేటట్లుగా |
| వీడెను + ఒక్కొ | = | విడిచి పెట్టాడేమో ! |
| చూడ్కులు | = | చూపులు |
| విరసంబులు + ఐ | = | ప్రేమ లేనివై |
| కరము | = | చాలా |

| | | |
|---|---|---|
| క్రూరములు + ఐన | = | భయంకరాలైన |
| నిమిత్తము | = | కారణం |
| ఏమి + ఓ | = | ఏమిటో ? |
| కలయఁగన్ | = | బాగా కలుపుగోలుతనంతో |
| పల్కరించిరి | = | పలకరించారనీ |
| ఉపకారులున్ + ఐరి + అని | = | మేలు చేశారనీ |
| నవ ప్రియులు + ఐన | = | కొత్తవారి పట్ల మోజుగల వారైన |
| ధరా + అధినాథులన్ | = | భూ భర్తలైన రాజుల్ని |
| బుద్ధిమంతులు | = | బుద్ధి ఉన్నవారు |
| నమ్మి + ఉండన్ + కాన్ + వలవదు | = | నమ్ముకొని ఉండగూడదు. |

**తాత్పర్యం** : ఈ రోజు ఈ రాజు చూపులు ప్రేమ శూన్యాలై ఇలా మరీ భయంకరంగా మారడానికి కారణం ఏమిటో ? కణ్వాశ్రమంలో ఇచ్చిన మాటను తప్పాడేమో ! బాగా కలుపుగోలుతనంతో తియ్యగా పలకరించారని, ఏదో కాస్త ఉపకారం చేశారని బుద్ధి ఉన్న వాళ్ళు రాజుల్ని నమ్మకూడదు. ప్రభువులందరూ నవప్రియులు. కొత్తవారు కనపడగానే పాతవాళ్లను ఎంతటి ఆత్మీయుల్ని అయినా వదలి వేస్తారు.

కవితా విశేషాలు :

నన్నయ ఈ పద్యంలో శకుంతల వివేకాన్ని, పరేంగితజ్ఞతను, రాజుల స్వభావాన్ని చక్కగా చిత్రించాడు. ఇది ఆదికవి లోకజ్ఞతకు అద్దం పడుతున్న పద్యం. చివరి రెండు పాదాలలో నన్నయ నానారుచిరార్థ సూక్తి నిధిత్వం ప్రస్ఫుటమౌతున్నది. ఇందులోని అలంకారం అర్థాంతరన్యాసం. శకుంతల అంతరంగంలోని చింతను ఈ చంపకమాల చక్కగా వ్యక్తీకరిస్తున్నది.

80. ఉ.

విమల యశోనిధీ ! పురుష వృత్త మెఱుంగుచునుండుఁ జూవె వే
దములును బంచ భూతములు ధర్మువు సంధ్యలు నంతరాత్మయున్
యముఁడును జంద్ర సూర్యులు నహంబును రాత్రియు నన్మహాపదా
ర్థము లివి యుండఁగా నరుఁడు దక్కొన నేర్చునె తన్ను ద్రుచ్చిలన్.

పరిచయం :

ఈ పద్యం నన్నయ భట్టారకుడు రచించిన శ్రీ మదాంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానం' నుంచి గ్రహించబడింది.

సందర్భం :

కొలువులో ఉన్న దుష్యంతుడు శకుంతలను ఎరుగునట్లు ప్రవర్తించాడు. ఆమె చింతాక్రాంత అయింది. కణ్వాశ్రమ వృత్తాంతాన్ని వివరించింది. అయినా ప్రయోజనం లేకపోయింది. శకుంతల కళ్లవెంట నీళ్లు కారాయి. తన సంతాపాన్ని తానే ఉపశమించుకొని పలికిన మాటలు ఈ పద్యంలో ఉన్నాయి.

ప్రతిపదార్థం :

| | | |
|---|---|---|
| విమల యశః + నిధీ | = | స్వచ్ఛమైన కీర్తికి పాతర అయినవాడా |
| వేదములును | = | నాలుగు వేదాలు (ఋగ్యజుస్సామాధర్వాలు) |
| పంచ భూతములు | = | భూమి, నీరు, అగ్ని, గాలి, ఆకాశం |
| ధర్మువు | = | ధర్మదేవత |
| సంధ్యలన్ | = | ఉదయ సాయం సంధ్యలు |
| అంతః + ఆత్మయున్ | = | అంతరాత్మ |
| యముఁడును | = | యమధర్మరాజు |
| చంద్ర సూర్యులును | = | చంద్రుడూ, సూర్యుడూ |
| అహంబును | = | పగలు |
| రాత్రియున్ | = | రాత్రి |
| అన్ | = | అనే |
| మహాపద + అర్థములు | = | గొప్ప పదార్థాలు |
| పురుష వృత్తము | = | మానవుడి నడతను |
| ఎఱుంగుచున్ + ఉండున్ + చూవె | = | తెలుసుకుంటూ ఉంటాయి సుమా ! |
| ఇవి + ఉండన్ + కాన్ | = | ఈ మహా పదార్థాలు సాక్షులుగా ఉండగా |
| నరుడు | = | మానవుడు |
| తన్ను మ్రుచ్చిలన్ | = | తనను తాను మోసగించుకోవడానికి |
| తక్కొన నేర్చునె | = | పూనుకుంటాడా ? (పూనుకోడు అని భావం) |

తాత్పర్యం : నిర్మలమైన కీర్తికి పాతరలాంటి వాడా ! ఓ దుష్యంత మహారాజా ! వేదాలు, పంచభూతాలు, ధర్మదేవత, ఉభయ సంధ్యలు, అంతరాత్మ, యముడు, సూర్యుడు, చంద్రుడు, పగలు, రాత్రి అనే మహా పదార్థాలు మానవుడి నడవడిని గమనిస్తుంటాయి. ఈ గొప్ప పదార్థాలు సాక్షులుగా ఉండగా మానవుడు ఆత్మవంచనకు పూనుకుంటాడా ? పూనుకోడు. పూనుకోగూడదు.

కవితా విశేషాలు :

శకుంతల ధర్మ చరిత. తన మనస్సు ఎప్పుడూ ధర్మ నిమగ్నంగా ఉండాలని కోరుకొంటుంది. ఆమె ఇప్పుడు దారి తప్పిన దుష్యంతుణ్ణి 'కటాక్షించి', ఎంతో 'చింతించి' చెప్పిన ధర్మాలు ఇవి. విశ్వనాథ వారన్నట్లు "నన్నయ్య గారి శకుంతల యందు ఆకాశనిష్ఠమైన శబ్దబ్రహ్మము నిత్య ప్రసన్నమై యున్నది." శకుంతల ఋషి కల్పురాలు. ఆమె చెప్పిన ధర్మాలెన్నో తెలుగుజాతికి నేటికి ఆరాధ్యాలుగా ఉన్నాయి. నిత్య ప్రసక్తాలై ఉన్నాయి. ఒక శతాబ్దం క్రిందటి మన పత్రాలలో సూర్య చంద్రులు సాక్షులుగా ఉన్నారు. సూర్యుడు కర్మసాక్షి.

ఇక భారతాన్ని వ్రాయించిన రాజరాజు 'పరమ ధర్మ విదుడు' వ్రాసిన నన్నయ 'నిత్య సత్యవచనుడు'. నానారుచిరార్థ సూక్తినిధి. భారతమో ధర్మ తత్త్వజ్ఞులు ధర్మశాస్త్రమని ప్రశంసించేది. ఈ విషయాలన్నీ ఈ పద్యానికి వన్నె పెడుతున్నాయి.

ఇందులోని ఛందస్సు చంపకమాల.

91. ప

విపరీత ప్రతిభాష లేమిటికీ నుర్వీనాథ ! యీ పుత్ర గా
త్ర పరిష్వంగ సుఖంబు సేకొనుము; ముక్తాహార కర్పూర సాం
ద్రరాగ ప్రసరంబుఁ జందనము ఁజంద్రజ్యోత్స్నయుం బుత్రగా
త్ర పరిష్వంగమునట్లు జీవులకు హృద్యంబే ? కడున్ శీతమే ?

పరిచయం :

ఈ పద్యం నన్నయ భట్టారకుడు రచించిన శ్రీ మదాంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని 'శకుంతలలోపాఖ్యానం' నుంచి గ్రహించబడింది.

సందర్భం :

సభాస్థితుడైన దుష్యంత మహారాజు, పుత్రసమేతంగా తనముందు నిల్చిన ధర్మపత్ని శకుంతలను ఎరుగనట్లు ప్రవర్తించాడు. ఆమె ఎన్నో ధర్మాలను, ముఖ్యంగా గృహస్థాశ్రమ ధర్మాన్ని ప్రబోధించింది. భార్యాభర్తల సంబంధం, తండ్రీ కొడుకుల సంబంధం వేదవచన పురస్సరంగా వివరించింది. అతడూ ప్రజ్ఞావాది అయి ఆయా సందర్భాలలో మాటకు మాట సమాధానం చెప్పాడు. చిట్టచివరకు ఆమె అనుభూతి సూత్రాన్ని ప్రయోగించింది - ఈ పద్యంలో.

ప్రతిపదార్థం :

| | | |
|---|---|---|
| ఉర్వీనాథా | = | ఓ మహారాజా ! |
| విపరీత ప్రతిభాషలు | = | విరుద్ధమైన ప్రత్యుత్తరాలు |
| ఏమిటికి | = | ఎందుకు ? |
| ఈ పుత్రగాత్ర | = | ఈ కుమారుడి శరీరాన్ని |
| పరిష్వంగ | = | కౌగలించుకోవడం వల్ల కలిగే |
| సుఖంబు + చేకొనుము | = | సుఖాన్ని పొందు ! |
| ముక్తాహార | = | ముత్యాల దండలయొక్క |
| కర్పూర | = | కర్పూరం యొక్క |
| సాంద్రపరాగ | = | దట్టమైన ధూళియొక్క |
| ప్రసరంబున్ | = | వ్యాప్తీ |
| చందనమున్ | = | మంచిగంధమూ |
| చంద్రజ్యోత్స్నయున్ | = | చందమామ వెన్నెలా |
| పుత్రగాత్ర | = | కుమారుడి శరీరం యొక్క |
| పరిష్వంగము + అట్లు | = | కౌగిలి లాగా |
| జీవులకు | = | ప్రాణులకు |
| కడున్ | = | మిక్కిలి |
| హృద్యంబు + ఏ | = | మనోహరమైనదా ? (కాదు) |
| శీతము + ఏ | = | చల్లనిదా ? (కాదు) |

**తాత్పర్యం :** ఓ దుష్యంత మహారాజా ! 'మాటకు మాట తెగులు' అన్నట్లు ఈ విరుద్ధమైన సమాధానాలు దేనికి ? ఒక్కసారి ఈ కుమారుడి దేహాన్ని కౌగలించుకో ! ఆ సుఖాన్ని అనుభవించు ! ముత్యాల దండలు కానీ, కర్పూర ధూళిగానీ, మంచి గంధంగానీ, చందమామ వెన్నెల కానీ కొడుకు శరీరాన్ని కౌగిలించుకోవడం లాగా ప్రాణులకు మనోహరంగా ఉండదు. చల్లగా ఉండదు.

కవితా విశేషాలు :

ఈ పద్యంలో పుత్రగాత్ర పరిష్వంగ సుఖ పారమ్యాన్ని ఆరోహణక్రమంలో ఎంతో గంభీరంగా మత్తేభ విక్రీడితంలో చక్కగా చిత్రించాడు నన్నయ. సంహితాభ్యాసుడైన నన్నయ ఈ పద్యాన్ని వేదనాదమేదురంగా తీర్చిదిద్దాడు.

ఈ పద్యంలో ఋషికల్పుల భావలక్షణాలు ఉన్నాయి. పుత్రగాత్ర పరిష్వంగ హృద్యత జీవులకు అనుభవ సిద్ధం. భవభూతి సీతారామచంద్రుల స్పర్శ సుఖం ఆధారంగా ఉత్తరరామ చరిత్ర నాటకాన్ని వ్రాశాడు. అది భార్యాభర్తల స్పర్శ లక్షణం. ఈ పద్యంలోది తండ్రి కొడుకును కౌగలించుకున్నప్పుడు పొందే స్పర్శానుభూతి. ఇది ధర్మానుష్ఠాతలైన జీవుల శ్రేష్ఠమైన అనుభూతి విశేష వివరణం.

ఇది నన్నయ కవిత్వపు 'ఖజానా' మనకందించిన 'నజరానా'.

94. ప

నుతజల పూరితంబు లగు నూతులు నూఱిటికంటె సూనృత
వ్రత! యొక బావి మేలు మఱి బావులు నూఱిటి కంటె నొక్కస
త్క్రతు వదిమేలు తత్క్రతు శతంబున కంటె సుతుండు మేలు త
త్సుతశతకంబు కంటె నొక సూనృత వాక్యము మేలు సూడగన్.

పరిచయం :

ఈ పద్యం నన్నయ భట్టారకుడు రచించిన శ్రీమదాంధ్రమహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానం' నుంచి గ్రహించబడింది.

సందర్భం :

సభాస్థితుడైన దుష్యంత మహారాజు, పుత్ర సహితయై తనముందు నిల్చిన ధర్మపత్ని శకుంతలను ఎరుగనట్లు ప్రవర్తించాడు. ఆమె ఎన్నో వేదధర్మాలను, పుత్రగాత్ర పరిష్వంగ సుఖానుభూతిని వివరించింది. ఆ తరువాత సత్యవాక్య ప్రశస్తిని వక్కాణిస్తున్న సందర్భంలోనిది ఈ పద్యం.

ప్రతిపదార్థం :

| | | |
|---|---|---|
| సూనృతవ్రత | = | సత్యవ్రతం కలిగినవాడా ! ఓ దుష్యంత మహారాజా ! |
| నుతజల | = | ప్రశస్తమైన నీటితో |
| పూరితంబు + అగు | = | నిండినవైన |
| నూతులు | = | చేద బావులు |
| నూఱిటి కంటెన్ | = | వందకన్నా |
| ఒక బావి | = | ఒక దిగుడు బావి |
| మేలు | = | శ్రేష్ఠమైనది |
| మఱి | = | ఇంకా |
| బావులు | = | దిగుడు బావులు |
| నూఱిటి కంటెన్ | = | వందకన్నా |
| ఒక్క | = | ఒక |
| సత్ + క్రతువు + అది | = | మంచి యజ్ఞం ఉందే అది |

| | | |
|---|---|---|
| మేలు | = | శ్రేష్ఠమైనది. |
| కల్ + క్రతు శతంబున కంటెన్ | = | ఆ వంద యజ్ఞాల కన్నా |
| సుతుండు | = | ఒక కుమారుడు |
| మేలు | = | శ్రేష్ఠం |
| కల్ + సుతశతకంబు కంటెన్ | = | ఆ కుమారులు వందమంది కన్నా |
| చూడఁగన్ | = | బాగా పరిశీలిస్తే |
| ఒక సూనృత వాక్యము | = | ఒక సత్యవాక్యం |
| మేలు | = | శ్రేష్ఠమైనది |

**తాత్పర్యం :** సత్యవాక్య పాలనమే వ్రతంగా కలిగిన ఓ దుష్యంతమహారాజా ! నూరు మంచినీటి నూతులకన్నా ఒక దిగుడు బావి మేలు. నూరు దిగుడు బావుల కన్నా ఒక మంచి యజ్ఞం గొప్పది. అటువంటి నూరు సత్క్రతువులకన్నా ఒక కుమారుడు ఎక్కువ. బాగా ఆలోచించి చూస్తే ఇన్నిటి కన్నా మిన్న అయిన కుమారుడి కన్నా కూడా ఒక సత్యవాక్యం శ్రేష్ఠమైనది.

అందువల్ల నీవు మన కుమారుణ్ణి ఈ భరతుణ్ణి ఆదరించు ! పూర్వం కణ్వాశ్రమంలో చేసిన వరదానాన్ని పాటించు ! ఆ సత్యపాలనం కన్నా పుణ్యం లేదు ! ఏతత్తిరస్కారం కన్నా పాపం లేదు - అన్న ధ్వని ఇందులో గర్భితం.

**కవితా విశేషాలు :**

శకుంతల ధర్మచరిత. తన మనస్సు ధర్మనిమగ్నంగా ఉండాలన్నది ఆమె నిరంతర వాంఛ. ఆమె మాటతప్పిన దుష్యంతుణ్ణి కటాక్షించి', పుత్రుడి కన్నా కూడా సత్యవాక్యం మిన్న అని చెప్పింది. శకుంతల ఋషి కల్పురాలు. ఆమె చెప్పిన సత్యప్రశస్తి నేటికీ ఆంధ్రజాతికి ఆదర్శంగా ఉంది.

నన్నయ 'నిత్య సత్యవచనుడు'. భారతాంధ్రీకరణ ప్రేరణ కారణభూతుడు రాజరాజు 'పరమ ధర్మవిదుడు'. భారతమో ? ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రమని కొనియాడేది. ఈ విషయాలన్నీ ఈ పద్యాన్ని హృద్యం చేస్తున్నాయి.

నానారుచిరార్థ బంధురమైన ఈ పద్యం సారాలంకార సంకలితం. సత్యసౌరభ శోభితమైన ఈ చంపకమాల శిరోధార్యం.

**110.** చ

భరతుఁడ శేష భూభువన భార ధురంధరుఁడై వసుంధరం
బరఁగి యనేక యాగములఁ బాయక భాస్కర జహ్నుకన్యకా
సురుచిర తీర దేశముల సువ్రతుఁడై యొనరించి భూరి భూ
సురులకు నిచ్చె దక్షిణలు శుద్ధ సువర్ణ గవాశ్వ హస్తులన్.

పరిచయం :

ఈ పద్యం నన్నయ భట్టారకుడు రచించిన శ్రీ మదాంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానం' నుంచి గ్రహించబడింది.

సందర్భం :

సభాస్థితుడైన దుష్యంతమహారాజు పుత్రసహితయై తనముందు నిల్చిన ధర్మపత్ని శకుంతలను తిరస్కరించాడు. ఆమె దుః ఖంలో దైవం తప్పక శరణం లేదని తిరిగిపోబోతున్న వేళలో ఆకాశవాణి జోక్యం చేసుకొని యథార్థం పలికింది. దేవతలూ శకుంతల పై పాతివ్రత్యాన్ని సత్యనిష్ఠనూ భరతోత్పత్తిని ప్రశంసించారు. అప్పుడు దుష్యంతుడు తాను లోకాపవాద భీతి వల్ల శకుంతలను ఎరుగనన్నానని

ఒప్పుకున్నాడు. భార్యాపుత్రుల్ని స్వీకరించాడు. భరతుడికి యౌవరాజ్యాభిషేకం చేశాడు. చాలాకాలం రాజ్యసుఖాలనుభవించి భరతుడికి రాజ్యాభిషేకం చేసి దుష్యంతుడు తపోవనానికి వెళ్లాడు. భరతుడు వంశకర్తయై రాజ్యాన్ని పాలించిన తీరు ఈ పద్యంలో వర్ణితం.

ప్రతిపదార్థం :

| | | |
|---|---|---|
| భరతుడు | = | శకుంతలా దుష్యంతుల కుమారుడైన భరతుడు |
| అశేష | = | అఖిలమైన |
| భూభువన భార | = | భూలోకపు బరువును |
| దురం ధరుడు + ఐ | = | వహించిన వాడై |
| వసుంధరన్ | = | నేల మీద |
| పరగి | = | ప్రవర్తిల్లి, ప్రసిద్ధిని పొంది, ప్రయాణించి |
| భాస్కర జహ్నుకన్యకా | = | యమునా గంగానదుల |
| సురుచిర తీర దేశముల | = | మనోహర తట ప్రదేశాల్లో |
| పాయక | = | వదలకుండా |
| న + ఏక యాగముల | = | చాలా యాగాలను |
| సువ్రతుడు + ఐ | = | మంచి వ్రతం కలవాడై |
| ఒనరించి | = | చేసి |
| భూరి భూసురులకు | = | గొప్ప వారైన బ్రాహ్మణులకు |
| శుద్ధ సువర్ణ | = | మేలిమి బంగారాన్ని |
| గో + అశ్వ హస్తులన్ | = | ఆవుల్ని, గుర్రాల్ని, ఏనుగుల్ని |
| ఇచ్చె | = | ఇచ్చాడు. |

తాత్పర్యం : భరతుడు మహా సామ్రాజ్యాన్ని పరిపాలిస్తూ మహాకీర్తిని పొందాడు. గంగా యమునా నదీ తీరాల్లో ఎడతెగకుండా ఎన్నో యాగాలు చేశాడు. మహానుభావులైన బ్రాహ్మణులకు స్వచ్ఛమైన బంగారాన్ని, గోవుల్ని, గుర్రాల్ని, ఏనుగుల్ని దక్షిణలుగా ఇచ్చాడు.

**కవితా విశేషాలు :**

భరతుడు వంశకర్త. మన దేశానికి భారత దేశమనే పేరు భరతుడి పేరు మీదగానే వచ్చిందని చెబుతుంటారు. భరత వంశం వారి చరిత్ర భారతం. భారతంలో యజ్ఞయాగాలకు, బ్రాహ్మణాధిక్యానికీ, దక్షిణలకు దాన ధర్మాలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. రాజరాజ నరేంద్రుడు కూడా "భూదేవ కులాభితర్పణ మహీయః ప్రీతి", "సంతతదానశీలత" కలవాడు. నన్నయ కూడా 'అవిరళ జపహోమ తత్పరుడు', 'సంహితాభ్యాసుడు', భరతుడి పాలనలోని ప్రధాన లక్షణాన్ని - యజ్ఞయాగాదుల్ని - చక్కగా వర్ణించాడు నన్నయ.

నన్నయ అక్లిష్ట మనోహరమైన అనతిదీర్ఘ సంస్కృత సమస్త పదశైలిలో అక్షరరమ్యతను ఆదరించి అనతిదీర్ఘ సంస్కృత సమస్త పదశైలిలో అక్షరరమ్యతను ఆదరించి ఈ పద్యాన్ని రచించాడు. ఇందులోని అలంకారం వృత్త్యనుప్రాసం. ఛందస్సు చంపకమాల.

డా॥ చేరెడ్డి మస్తాన్ రెడ్డి ఎం. ఏ., పి హెచ్.డి.
ప్రిన్సిపాల్ & రీడర్
ఎస్.కె.ఆర్.బి.ఆర్. కళాశాల
నరసరావు పేట, గుంటూరు జిల్లా

మొదటి భాగము - ప్రాచీన పద్యభాగము

# శకుంతలోపాఖ్యానము - నన్నయ

## (ఆం.మ.భా. ఆది. 4 - 1 నుంచి 110 పద్యాలు)

## పాఠం - 2

**1. 2. 0** సందర్భ సహిత వ్యాఖ్యలు

**1. 2. 1.1** నన్నయ ఆంధ్రీకరణ విధానం

**1. 2. 1.2** నన్నయ కవితారీతులు

**1. 2. 2** ప్రశ్నలు - సమాధానాలు

**1. 2. 3** రాదగిన ప్రశ్నలు

**1. 2. 4** ఆచూకీ గ్రంథాలు

### 1. 2. 0 సందర్భ సహిత వ్యాఖ్యలు :

**1. బాల హరిణముల ౘబట్టెడు లీలను. (ఆ.ప 4 - 6)**

పరిచయం : ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టు రచించినటువంటి ఆంధ్రమహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసం లోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

సందర్భం : దుష్యంతబాల్య వర్ణనంలో కవి అన్నమాట. దుష్యంతుడు తన బాల్యంలో విషమాటవీచలిత గజసింహ శార్దూలాది మృగాలను తరిమి తరిమి పట్టుకుంటున్నాడు. ఈ సందర్భంలో కవి ప్రయోగించిన ఉపమానమిది.

వివరణ : జింకపిల్లలను పట్టుకున్నట్లుగా అని భావం. అనంతర కాలంలో దుష్యంతుడి కుమారుడైన భరతుడు కూడా ఇలాగే ప్రవర్తించాడు. "పెట్టుబడులు దూరమైనా పుట్టుబడులు దూరమౌతాయా ?" అంటారు పెద్దలు. జన్యులక్షణ సామ్యమంటారు జీవశాస్త్రవేత్తలు.

అలంకారం : ఉపమాలంకారం.

**2. కలచెను దుష్యంతుమహాబల మందర నగము (ఆ. ప. 4 - 11)**

పరిచయం : ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్రమహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

సందర్భం : యౌవన సంశోభితుడైన దుష్యంతుడు మృగయా వీరవిహారం చేస్తున్న సందర్భంలో ఆయన సైన్యం చూపిన పరాక్రమాన్ని కవి వర్ణిస్తూ అన్నమాట.

వివరణ : ఆ దుష్యంతుడి సైన్యం అనే మందర పర్వతం ఆ అరణ్యమనే సముద్రాన్ని సంక్షోభిపంపజేసిందని భావం. ఇందులో చక్కని రూపకాలంకారం ఉంది. ఆనాడు వననిధి మథనం వల్ల లక్ష్మి జన్మించినట్లు ఈనాడు వనమథనం వల్ల శకుంతల లభించి, విష్ణు స్వరూపుడైన దుష్యంతుడికి భార్య అయింది.

**3. రచియించె నొక్కొ కమలజుడు దయన్. (ఆ. ప. 4 - 15)**

**పరిచయం :** ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్రమహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** దుష్యంతుడు వేటాడుతూ ముందుముందుకు సాగిపోతుండగా, అతని రథవేగాన్ని అనుగమింపలేక కాలిబంట్లు అక్కడక్కడా విశ్రమించారు. ఆయన ఇంకా ముందుకు వెళ్లి ఒక మనోహరవనాన్ని చూచి దాన్ని ప్రశంసించిన సందర్భంలోనిది ఈ వాక్యం.

**వివరణ :** దేవేంద్రుడి ఖాండవవనానికీ, కుబేరుడి చైత్రరథానికీ సమానంగా దీన్ని భూలోక సౌందర్యం కోసం దయతో బ్రహ్మ సృష్టించాడేమో ! అని భావం. దుష్యంత వివాహానికీ, శృంగార రసచిత్రణకూ ఇది చక్కని నేపథ్యం. ఇందులోని ఉత్ప్రేక్షాలంకారం అత్యంత మధురం.

**4. చూచి మునిశక్తి కెంతయుఁజోద్యమిది. (ఆ. ప. 4 - 23)**

**పరిచయం :** ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసం లోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** దుష్యంతుడు వేటకు వచ్చి వనంలో నడుస్తూ నరనారాయణాశ్రమం లాంటి పవిత్రమైన కణ్వాశ్రమం చూచాడు. అక్కడ చిలుకలు చెవులకింపుగా సామగానాలు చదువుతున్నాయి. సామజాలు వాటిని కదలకుండా వింటున్నాయి. ఆ ఏనుగులు తొండాల చల్లదనాన్ని ఆశ్రయించి సింహాలు ఉన్నాయి. బ్రాహ్మణులు భూతబలులుగా పెట్టే నీవారాన్న పిండాల్ని భక్షించడానికి ఎలుకలూ పిల్లులూ కలిసి తిరుగుతున్నాయి. ఈ విషయాలన్నింటి సారాంశాన్ని కవి ఈ వాక్యంలో చెప్పాడు.

**వివరణ :** ఇది అంతా వైరివర్గాల సహవాసం. ఇది ఇలా జరగడానికి కారణం కణ్వమహాముని శక్తి. దీనికి దుష్యంతుడు అద్భుతరసావిష్టుడయ్యాడు. భారతీయ సంస్కృతిలోని ప్రధానాంశమైన సహజీవనాన్ని మనం ఇక్కడ సందర్శించవచ్చు. స్వభావోక్తి సుందరమైన ఋష్యాశ్రమ వాతావరణ చిత్రణం నన్నయ సాటిలేని మేటి.

**5. కోపపరు పాలికి భామలు పోవ నోడరే. (ఆ. ప. 4 - 38)**

**పరిచయం :** ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసం లోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** దుష్యంతుడు కణ్వమహర్షి మందిరంలో శకుంతలను చూచాడు. శకుంతల జన్మవృత్తాంతాన్ని తెలుసుకోవాలని ఆమె నడిగాడు. పూర్వం ఒక ముని కణ్వుణ్ణి అడిగితే ఆయన చెప్పిన కథను శకుంతల దుష్యంతుడికి చెప్పింది. విశ్వామిత్రుడొకసారి మేనకను పిలిపించి ఆయన తపస్సును భగ్నం చెయ్యమని ఆజ్ఞాపించాడు అప్పుడు మేనక అన్న మాట ఇది.

**వివరణ :** విశ్వామిత్రుడు కోపపడి చూస్తే కులపర్వతాలు బద్దలౌతాయి. సముద్రాలు, ఇసుకే మిగిలేటట్లు ఇంకిపోతాయి, మూడులోకాలూ గిర్రున తిరుగుతాయి. వాయు సంచారం కూడా ఉండదు. అటువంటి భయంకరమైన కోపాత్ముడి దగ్గర స్త్రీలు వెళ్లడానికి భయపడరా ? ఇందులోని అర్థాంతరన్యాసం అత్యంత మనోజ్ఞం.

**6. అవనీ తలంబున కవతరించిన తరుణశశిరేఖ యుంబోని దాని. (ఆ. ప. 4 - 48)**

**పరిచయం :** ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసం లోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

సందర్భం : శకుంతల జన్మవృత్తాంతాన్ని తెలుసుకోవాలని ఆమెనడిగాడు. పూర్వం ఒక ముని కణ్వుణ్ణి అడిగితే ఆయన చెప్పిన కథను శకుంతల దుష్యంతుడికి చెప్పింది. కణ్వమహర్షి తాను శిష్యగణాలతో సమిత్కుసుమ ఫలహారణార్థం మాలినీ నదీతీరంలో శకుంత రక్షితయైన అత్యంతకాంతితో వెలుగుతున్న బిడ్డను చూచినట్లు చెబుతున్న సందర్భంలోని మాట ఇది.

వివరణ : దివినుండి భువికి దిగివచ్చిన లేతజాబిల్లి రేకలాగా ఎంతో కాంతితో శకుంతల ప్రకాశిస్తున్నదని భావం. ఇందులోని ఉపమానం పరమసుకుమార సుందరం.

## 7. ఇంతులకు మువ్వు రొగిన గురువులు (ఆ. ప. 4 - 49)

పరిచయం : ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసం లోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

సందర్భం : శకుంతల జన్మవృత్తాంతాన్ని తెలుసుకోవాలని దుష్యంతుడు ఆమెనడిగాడు. పూర్వం ఒక మునికి కణ్వుడు చెప్పిన కథను, తాను విన్నది విన్నట్లుగా, శకుంతల దుష్యంతుడికి చెప్పింది. తాను భయత్రాత అయినందువల్ల శకుంతలకు తండ్రినని ధర్మశాస్త్రార్థాన్ని కణ్వుడు ప్రవచించిన సందర్భంలోది ఈ వాక్యం.

వివరణ : స్త్రీలకు ముగ్గురు గురువులు. వారు కన్నతండ్రి, అన్నదాత, భయంనుంచి రక్షించినవారు. ఇటువంటి ధర్మ ప్రవచనం వల్ల భారతం పంచమవేదమైంది. 'ధర్మార్థులకు నిత్యధర్మ సంప్రాప్తి' గావించే గ్రంథమైంది. మధురాక్కర ఛందస్సులోని మందగమనం ఈ భావవ్యక్తీకరణ కెంతో దోహదకారిగా వుంది.

## 8. నిరుపమదాన యట్లయిన నీకును నాకును సంగమంబగున్. (ఆ. ప. 4 - 60)

పరిచయం : ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసం లోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

సందర్భం : దుష్యంతుడు శకుంతలకు గాంధర్వ వివాహ స్వరూపాన్ని చెప్పి ఆమెను అంగీకరింపజేసాడు. అప్పుడామె దుష్యంతుడితో తమకు జన్మించే కుమారుడికి దయతో యౌవరాజ్యాభిషేకం చేయమని కోరి, ఈ వాక్యం పలికింది.

వివరణ : అలా అయితే నీకూ నాకూ కలయిక జరుగుతుంది అని భావం. భరతుడి యౌవరాజ్యాభిషేకం శకుంతలోపాఖ్యానంలోని కీలకాంశం. ఇది ఒక వరమని శకుంతల సప్రశ్రయంగా అడిగింది. దయతో, ప్రసన్నబుద్ధి, దయతో ఇలాంటి పదాలను శకుంతల ప్రయోగించింది. 'నిరుపమదాన' అన్నచోట ఈ అర్థం మరింత విస్ఫారితమైంది. సాటిలేని మేటిదానం కలవాడా ! అన్నది సార్థక సంబోధన.

## 9. సతుల కేడు గడయు (బతుల చూవె ? (ఆ. ప. 4 - 66)

పరిచయం : ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టు రచించినటువంటి ఆంధ్రమహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసం లోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

సందర్భం : కణ్వ మహాముని తన పెంపుడు కూతురైన శకుంతలను ఆమె పుత్రుడైన భరతుడితో సహా భర్తృగృహానికి, - దుష్యంతుడి దగ్గరకు - పంపాలనుకున్నాడు. ఒకనాడు తన కూతురితో అన్న మాటలివి.

వివరణ : ఎంతటి పతివ్రతలకైనా పుట్టినిళ్లల్లో ఎక్కువ కాలం ఉండడం అంతమంచిది కాదు. స్త్రీలకు భర్తల దగ్గర ఉండడమే ధర్మం. స్త్రీలకు భర్తలే సంరక్షకులు సుమా !

ఏడు + కడ = గురువు, తల్లి, తండ్రి, పురుషుడు, విద్య, దైవం, దాత - ఈ ఏడు విధాల రక్షణ.

ఈ పద్యపాదంలో నన్నయ నానారుచిరార్థ సూక్తి నిధిత్వం గోచరిస్తున్నది.

**10. ముగ్ధ లధిపులు, మఱవరె బహు కార్య భార మగ్నులుకారే ! (ఆ. ప. 4 - 69)**

**పరిచయం :** ఈ వాక్యం ఆదికవి నన్నయ భట్టారకుడు రచించిన ఆంధ్రమహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** శకుంతల కుమార సమేతంగా దుష్యంతుడి దగ్గరకు వచ్చినప్పుడు ఆయనలో పూర్వం ఉన్నట్లుగా అనురాగం, ఆదరణం, దయ, ప్రేమతో కూడిన తొందర కనిపించలేదు. అప్పుడు శకుంతల దుష్యంతుణ్ణి గురించి, అలాంటి రాజుల్ని గురించి అనుకొనే సందర్భంలోది ఈ వాక్యం.

**వివరణ :** నన్ను ఈ దుష్యంతుడు ఎరుగడా ! ఎరిగికూడా తెలియనట్లు ఉన్నాడు. చాలా కాలం గడిచింది కాబట్టి మరచిపోయాడా? రాజులు మోహపరవశులు. అదీగాక అనేక కార్యక్రమాల్లో మునిగిపోయి ఉంటారు.

**11. కఱటిం దెలుపంగఁ గమలగర్భుని వశమే ? (ఆ. ప. 4 - 72)**

**పరిచయం :** ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్ర మహాభారతం ఆది పర్వం చతుర్థాశ్వాసం లోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** దుష్యంతుడి చూపులు చాలా విరసంగా ఉండడాన్ని గమనించిన శకుంతల చింతాక్రాంత అయి తనలో అనుకొన్న మాట.

**వివరణ :** ఎవరైనా ఒక విషయాన్ని మరచిపోతే జ్ఞప్తి చేయవచ్చు. అసలు తెలియకపోతే అన్నివిధాలా తెలిసేటట్లు చెప్పవచ్చు. కాని తెలిసి, తెలుసుకోవడానికి ఇష్టపడని వంచకుడికి తెలియజెప్పడం బ్రహ్మకైనా తరం అవుతుందా ? కాదు.

ఇక్కడ శకుంతల లోకజ్ఞతను, మనస్తత్త్వ పరిశీలనను లోకజ్ఞుడైన నన్నయ చక్కగా చిత్రించాడు.

**12. కెందమ్మి రేకుల వలనం దొరంగు జలకణంబుల పోలె. (ఆ. ప. 4 - 78)**

**పరిచయం :** ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్రమహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** దుష్యంతుడు శకుంతలను వచ్చినదారినే తిరిగి వెళ్లమన్నాడు. వేగంగా వెళ్లమన్నాడు. అంటే కణ్వాశ్రమానికే తిరిగి వెళ్లమన్నాడు. ఆ మాటలకు శకుంతల నిశ్చేష్టిత అయింది. కోపంతో ఎర్రబడ్డ కళ్లనుంచి కన్నీరు కారుతూఉండగా తలవంచకుంది. ఈ సందర్భంలో నన్నయ ప్రయోగించిన ఉపమానం ఈ వాక్యం.

**వివరణ :** ఎర్రతామర రేకులనుంచి స్రవిస్తున్న నీటిబొట్లులాగా ఆమె కోపారుణిత నయనాలనుంచి బాష్పకణాలు ప్రవహిస్తున్నాయి. ఈ వాక్యం నన్నయ అలంకార శైలికి చక్కని నిదర్శనం.

**13. తప్పఁ బలుక నగునె ధార్మికులకు ? (ఆ. ప. 4 - 79)**

**పరిచయం :** ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్రమహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** దుష్యంతుడు శకుంతలను తిరస్కరిస్తూ మాటాడాడు. కన్నీరు కారుతూఉండగా, తలవంచి, దుష్యంతుణ్ణి కడకంటితో చూస్తూ, తన మనోవ్యథను తానే అణచుకొని శకుంతల దుష్యంతుడితో మాటాడిన సందర్భంలోది ఈ వాక్యం.

**వివరణ :** అన్నీ తెలిసికూడా ఏమీ తెలియనట్లు అజ్ఞానుల లాగా మాటాడుతున్నావని, నేను తప్పక ఎవరూ ఎరుగరని అసత్యాలు పలకరాదని శకుంతల దుష్యంతుణ్ణి మందలించింది. అబద్ధమాడడం ధర్మాత్ముల లక్షణం కాదని హెచ్చరించింది.

**14. ఇహముం బరము ( గలదె మతిఁబరికింపన్. (ఆ. ప. 4 - 82)**

పరిచయం : ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్రమహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

సందర్భం : దుష్యంతుడు శకుంతలను తిరస్కరిస్తూ మాటాడినప్పుడు శకుంతల తన మనోవ్యథను తానే ఉపశమింపజేసుకొని మాటాడిన సందర్భంలోది ఈ వాక్యం

వివరణ : పతివ్రత, గుణవతి, సంతానవతి అయిన భార్యను తిరస్కారదృష్టితో చూచే దుర్బుద్ధికి ఈ లోకంలోనూ పరలోకంలోనూ సుఖాలు ఉండవు. ఈ ధర్మవచనం సాధారణంగా కనిపించినా దుష్యంతుణ్ణి వేలెత్తి చూపినట్లుంది.

**15. దీపంబువలన నొండొక దీపము ప్రభవించినట్లు (ఆ. ప. 4 - 90)**

పరిచయం : ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసం లోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

సందర్భం : తనను తిరస్కరించిన దుష్యంతుడితో శకుంతల పుత్ర విశిష్టతను వివరిస్తున్న సందర్భంలోది ఈ వాక్యం.

వివరణ : దీపంనుంచి ఇంకొకదీపం వెలిగినట్లు నీ పుణ్యశరీరంనుంచి ఈ పుత్రుడు ఉద్భవించి తేజస్సుతో ప్రకాశిస్తున్నాడు.

ఈ ఉపమానం ప్రజాసామాన్యం లోది. నన్నయ లోకజ్ఞతకు నిదర్శనం.

**16. సత్యము వలనన ములుసూపు గౌరవంబున పేర్మిన్ ! (ఆ. ప. 4 - 95)**

పరిచయం : ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసం లోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

సందర్భం : తనను తిరస్కరించిన దుష్యంతుడికి శకుంతల సత్యప్రశస్తిని తెలుపుతున్న సందర్భంలోది ఈ వాక్యం.

వివరణ : వేయి అశ్వమేధ యాగాల్నీ ఒక సత్యాన్నీ త్రాసులో రెండు వైపులా పెట్టి తూస్తే సత్యం వైపే ముల్లువాలుతుంది. సత్యానికి ఉన్న గౌరవాతిశయం అంతటిది.

ఇందులో శకుంతల ధర్మజ్ఞత వ్యక్తమౌతున్నది.

**17. ఎల్ల ధర్మంబుల కెందు ( బెద్ద యండ్రు సత్యంబు ధర్మజ్ఞులైన మునులు. (ఆ. ప. 4 - 96)**

పరిచయం : ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసం లోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

సందర్భం : తనను తిరస్కరించిన దుష్యంతుడికి శకుంతల సత్యవాక్య ప్రశస్తిని తెలుపుతున్న సందర్భంలోది ఈ వాక్యం.

వివరణ : అన్ని తీర్థ ప్రదేశాలకు యాత్రలు చేయడం, అన్ని వేదాలు చదవడం లాంటి గొప్ప పుణ్యకార్యాలు కూడా సత్యంతో సమానంకావు. ధర్మవేత్తలైన మునులు అన్ని ధర్మాల్లోనూ సత్యమే గొప్పది అని చెప్పారు.

ఇక్కడ శకుంతల ధర్మజ్ఞత వ్యక్తమౌతున్నది.

**18. ఇప్పాటినోములు దొల్లి కడఁగి నోచితిని గాకేమి ? (ఆ. ప. 4 - 103)**

పరిచయం : ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసం లోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

సందర్భం : తనను తిరస్కరించిన దుష్యంతుడితో శకుంతల ఎన్నో ధర్మవచనాలను పలికింది. కాని అతడు స్వీకరించలేదు. "నేనెక్కడ ! నీ వెక్కడ ! కుమారుడెక్కడ ! నేను ఇంతకుముందు నిన్ను చూచి ఎరుగను. ఇటువంటి లోకవిరుద్ధాలకు నేను భయపడుతుంటాను. అయుక్త వచనాలు మాని నీ ఆశ్రమానికి పో !" అని దుష్యంతుడు అన్నప్పుడు శకుంతల మనస్సులో ఎంతో పరితాపాన్ని పొందింది. అప్పటి ఆమె ఆలోచన పరంపరలోది ఈ వాక్యం.

వివరణ : 'నేను పుట్టిన వెంటనే నన్ను తల్లిదండ్రులు విడిచిపెట్టారు. ఇప్పుడు భర్తకూడా విడిచిపెడతాడు కాబోలు ! వేయి మాట లెందుకు ! నేను క్రిందటి జన్మలో కొరత నోములు నోచి ఉంటాను' అని శకుంతల బాధపడింది.

ఇందులో భారతీయ సంప్రదాయానికి మూలస్తంభాల్లో ఒకటైన పునర్జన్మ సిద్ధాంతం ప్రస్తావించబడింది. 'పతి' తప్ప అన్నీ తెలుగుపదాలే. నన్నయ శోకసన్నివేశాల్లో సంఘర్షణను చిత్రించడానికి గాను తెనుగు శైలిని వాడడం ఇందులో కనిపిస్తుంది.

## 19. ఇంక దైవంబ కాని యొండు శరణంబు లేదు. (ఆ. ప. 4 - 104)

పరిచయం : ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసం లోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

సందర్భం : దుష్యంతుడు శకుంతలను తిరస్కరించాడు. తగని మాటలు మాని, నీ ఆశ్రయానికి వెళ్ళు అన్నాడు. శకుంతల మహాదుఃఖాన్ని పొందింది. ఇక దుష్యంతుడు స్వీకరిస్తాడనే ఆశలేదు. కన్నీరును ఒత్తుకుంటూ అనుకున్న మాట.

వివరణ : ఇంక దైవం తప్ప వేరే శరణం లేదు అని శకుంతల అనుకొన్నది. భగవంతుణ్ణి శరణుజొచ్చింది. మానవ ప్రయత్నం ఫలించక పోవడంతో ఆ నిర్ణయానికి వచ్చింది. వెంటనే భగవదాదరం ఆకాశవాణి రూపంలో లభించింది.

ఇతిహాస ప్రధాన లక్షణమైన భగవత్ప్రాధాన్యం ఈ వాక్యంలో కనిపిస్తున్నది. దైవం, పురుషకారం రెండూ ముఖ్యమైనవైనా దైవమే మిన్న.

## 20. ఎఱిఁగియు నిత్తన్వి ప్రీతి దప్పి యెఱుగనంటిని ! (ఆ. ప. 4 - 108)

పరిచయం : ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసం లోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

సందర్భం : ఆకాశవాణి సభాసదులు అందరూ ఆశ్చర్యపడేటట్లుగా "శకుంతల సత్యం పలికింది, ఈ భరతుడు నీ కుమారుడు, ఇతన్ని స్వీకరించి పోషించు" అని చెప్పింది. శకుంతలా పతివ్రతాత్వాన్ని, భరతోత్పత్తిని ప్రశంసిస్తున్న దేవతల మాటలు కూడా ఆకాశం నుంచి వినిపించాయి. దుష్యంతుడు అందరిముందు వాస్తవాన్ని అంగీకరిస్తున్న సందర్భంలోది ఈ వాక్యం.

వివరణ : కణ్వమహాముని ఆశ్రమంలో జరిగిన మా గాంధర్వ వివాహం ఇతరులకు తెలియదన్న ఉద్దేశంతో లోకాపవాద భీతికిలోనై, ఈమె ప్రీతిని వదలివేసి ఎరుగనన్నాను. ఇప్పుడు ఆశ్చర్యకరంగా ఆకాశవాణి అందరికీ తెలియజేసింది.

దుష్యంతుడు లోకాపవాదభీతి వల్ల శకుంతలను తిరస్కరించినట్లు భారతంలో ఉండగా, కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలం నాటకంలో మార్పుచేశాడు. శకుంతల పొందిన దుర్వాసశ్శాపం వల్ల దుష్యంతుడు మరచిపోయినట్లు కల్పించాడు. నన్నయ కాళిదాస కల్పనను స్వీకరించకుండా వ్యాసభారతబద్ధ నిరూపితార్థాన్నే ఆంధ్రీకరించాడు.

## 1. 2. 1.1 నన్నయ ఆంధ్రీకరణ విధానం :

నన్నయ భట్టారకుడు ఆదికవి. ఆయన ఆంధ్రీకరణానికి రాచబాటలు వేశాడు. వ్యాసమహర్షి సంస్కృతంలో రచించిన మహాభారతాన్ని వ్యాసహృదయానుకూలంగా నన్నయ ఆంధ్రీకరించాడు. కన్నడకవులు వ్యాసహృదయానికి భిన్నంగా అర్జునుణ్ణి నాయకుడుగా చేసి రచన సాగించారు. నన్నయ అటువంటి మూలచ్ఛేదానికి ఒడిగట్టలేదు.

అట్లా అని నన్నయ వ్యాసభారతాన్ని మక్కికి మక్కిగా ఆంధ్రీకరించలేదు. కొన్ని విషయాల్ని పరిహరిస్తూ కొన్నిటిని పరిగ్రహిస్తూ, మూర్పులతో చేర్పులతో కూర్పు నేర్పును ప్రదర్శించాడు. ముఖ్యంగా మూలంలోని గహనమైన వేదాంత విషయాలను, పునరుక్తులను, అనావశ్యకాలను నన్నయ విడిచిపెట్టాడు.

నన్నయది అనువాదం కాదు; ఆంధ్రీకరణం. అనువాదమంటే అనుసరించి పలకడం - చిలకపలుకుల్లాగా. నన్నయ రచన అటువంటిది కాదు. ఆయన ఎంతో స్వాతంత్ర్యాన్ని అవలంబించారు. "తెనుగున రచియింపు మధిక ధీయుక్తి మెయిన్" (ఆది. 1 - 16) అన్న తన ప్రభువు రాజరాజనరేంద్రుడి అభ్యర్థనను అక్షరాలా పాటించారు. పునస్సృష్టి చేశాడు. ఆయన ఎంతో బుద్ధిబలంతో - సాహితీబలంతో - భారతాంధ్రీకరణం చేసి తిక్కనాది అనంతర కవులకు మార్గదర్శకుడయ్యాడు.

నన్నయ ఆంధ్రీకరణంలో ప్రధానంగా ఈ ఆరు పద్ధతులు ఉన్నాయి.

| | | |
|---|---|---|
| 1. యథామూలకత | : | మూలంలో ఉన్నట్లే అనువదించడం. |
| 2. మూలకుంచనం | : | మూలంలో మరీ విస్తారంగా ఉన్న విషయాన్ని కుదించడం. |
| 3. మూల ప్రపంచనం | : | మూలంలో సంక్షిప్తంగా ఉన్న విషయాన్ని పెంచడం |
| 4. అన్యథా ప్రకల్పనం | : | మూలంలో ఒకవిధంగా ఉంటే వేరే విధంగా చెప్పడం |
| 5. మూలత్యాగం | : | మూలంలో ఉన్నదాన్ని ఆంధ్రీకరణంలో వదలిపెట్టడం |
| 6. అమూలకత | : | మూలంలో లేని విషయాల్ని కొత్తగా కల్పించడం |

ఈ ఆరు ఆంధ్రీకరణ విధానాలు శకుంతలోపాఖ్యానంలో నిక్షిప్తమైన తీరును పరిశీలిద్దాం !

1. **యథామూలకత :** శకుంతల దుష్యంతుడికి తండ్రీ కొడుకుల సంబంధాన్ని తెలిపే సన్నివేశంలో మూలంలో ఇలా ఉంది.

సరసీ వామలే ఽ త్మానం / ద్వితీయం పశ్యతే సుతమ్

సరసీ వామలే సోమం ప్రేక్షాత్మానం త్వ మాత్మనా ।

దీన్ని నన్నయ యథామూలకంగా ఇలా అనువదించాడు.

తాన తన నీడ నీళ్లల

లో నేర్పడఁ జూచునట్లు లోకస్తుత త

త్సూను జనకుండు సూచి మ

హానందముఁ బొందు నతిశయ ప్రీతి మెయిన్.

సత్య వాక్య ప్రశక్తికి సంబంధించిన

అశ్వమేధ సహస్రంచ / సత్యంచ తులయా ధృతమ్

అశ్వమేధ సహస్రాద్ధి / సత్యమేవ విశిష్యతే । - అనే శ్లోకాన్ని

వెలయంగ నశ్వ మేథం
బులు వేయును నొక్క సత్యమును నిరుగడలం
దుల నిడి తూపఁగ సత్యము
వలనన ములుసూపు గౌరవంబున పేర్మిన్ - అని తెనిగించాడు. 'విశిష్యతే' అన్నదానికి 'ములుసూపు' మంచి అనువాదం.

**2. మూలకుంచనం :** మూలంలో దుష్యంత వర్ణనం పన్నెండు శ్లోకాల్లో వివరంగా ఉంది. ఈ సందర్భంలో నన్నయ నాలుగు పద్యాలు మాత్రమే వ్రాసి సంక్షిప్తతను పాటించాడు. మూలంలో ఐదు శ్లోకాల్లో ఉన్న దుష్యంతుడి రాజ్యస్థితిని, ప్రజాసమృద్ధిని నన్నయ "ఆతని రాజ్యంబున" అనే కందంలో పొందుపరిచాడు. మూలంలో దుష్యంత బలవర్ణనం మూడు శ్లోకాల్లో ఉంటే నన్నయ దాన్ని ఒక్కకందంలో - 'ఉర్వీరుహనివహముతో' - అందించాడు. మూలంలో ఇరవై ఆరు శ్లోకాలున్న దుష్యంతుడి మృగయావర్ణన నన్నయ భారతంలో నాలుగు గద్యపద్యాల్లో సంగ్రహించబడింది. మూలంలో మేక ఇంద్రుడితో విశ్వామిత్రుడి గొప్పతనాన్ని తెలిపే పనులను ఎన్నింటినో విపులంగా చెప్పింది. ఈ సందర్భంలో నన్నయ "వనజభవ ప్రభావుఁడవు వాని" అని ఒక్క చంపకమాల వ్రాసి తత్సౌరభాన్ని గుభాళింప జేశాడు. శకుంతల తన తల్లిదండ్రులైన మేనకా విశ్వామిత్రుల గొప్పతనాన్ని వర్ణించి, తన జన్మవృత్తాంతాన్ని, గాంధర్వ వివాహాన్ని ఏకరువు పెట్టింది. ఆ పౌనరుక్త్యాన్ని నన్నయ పాటించలేదు. "క్షత్రవీరుడైన విశ్వామిత్రునకు" అనే ఒక్కపద్యంలో సారాంశాన్ని అందించాడు. దుష్యంతుడు శకుంతలను నిరాకరిస్తూ పలికిన మాటలు :

'నపుత్ర మభిజానామి త్వయి జాతం శకుంతలే'

ఇత్యాదిగా మూడు శ్లోకాల్లో ఉన్నాయి. నన్నయ "ఏనెట నీవెట సుతుడెట" అనే కందంలో ఇమిడ్చాడు. భరతుడి గొప్పతనం మూలంలో సప్తశ్లోకాల్లో ఉంది. నన్నయ "భరతుడశేష భూభవన భార ధురంధరుడై" అని ఒక్క పద్యం రచించాడు.

**3. మూల ప్రపంచనం :** మేనకా విశ్వామిత్రుల కథలో వాయువు మేనకను వివస్త్రను చేసిందని, ఆ స్థితిలో విశ్వామిత్రుడు చూచాడని ఉంది.

'అనిర్దేశ్య వయోరూపా మపశ్య ద్వివృతాం తదా'

నన్నయ ఈ భావాన్ని "అలసతయొప్పగా" అనే పద్యంలో వివరించాడు. మూలంలో స్త్రీకి మాత్రమే గురువులెవరో చెప్పబడింది.

'శరీరకృత్ ప్రాణదాతా యస్య చాన్నాని భుంజతే'

ఆంధ్రీకరణంలో - " తన జనకుండు" అనే మధురాక్కరలో పురుషుడికి గురువులెవరో కూడా చెప్పి నన్నయ తన శాస్త్రజ్ఞతను స్పష్టం చేశాడు.

**4. అన్యథా ప్రకల్పనం :** శకుంతల దుష్యంతునితో తాను కణ్వమహా మునీంద్రుడి ఆత్మజను అని చెప్పింది. అప్పుడు దుష్యంతుడు తనలో సందేహించాడు. నన్నయ "ఇది మునికన్యయేని మఱియేలొకొ యీ లలితాంగియందు నా హృదయము దద్దయుం దవిలె" అని వ్రాశాడు. కాని మూలంలో దుష్యంతుడు తన సందేహాన్ని శకుంతలతో అన్నట్లు ఉంది. ఇక్కడ నన్నయ కావించిన అన్యథాప్రకల్పనమే సముచితం.

పితృ పరిత్యక్త అయిన బాల శకుంతలను పక్షులు తమకు తాము రక్షించినట్లు మూలంలో ఉంది. విశ్వామిత్రుడి తపఃప్రభావం వల్ల అలా జరిగిందని నన్నయ వ్రాశాడు. నన్నయ అన్యధా ప్రకల్పనమే మాన్యము.

మూలంలో శకుంతల తన్ను దుష్యంతుడు చేపట్టిన సంగతి కణ్వుడితో తనకుతానై చెప్పినట్లు కొంత చెప్పి తర్వాత "అతస్సర్వం తు యద్వృత్తం దివ్యజ్ఞానేన పశ్యసి" అన్నట్లు ఉంది. కాని నన్నయ భారతంలో మొత్తం వృత్తాంతాన్ని కణ్వుడు తన దివ్యజ్ఞానంతో తెలుసుకున్నట్లు ఉంది. ఇదే సమంజసం.

మూలంలో కణ్వుడు శకుంతలా శరీరాన్ని విశుద్ధ్యర్థం స్పృశించినట్లు, అలా స్పృశింపగానే శకుంతల పరమహర్షాన్ని పొందినట్లు ఉన్నది. నన్నయ రచనలో ఇది లేదు. శకుంతల ధర్మచరిత్రకు మెచ్చి వరప్రదానం చేసినట్లుంది. ఇదే బాగున్నది.

దుష్యంతుడు వెళ్లిన తర్వాత మూలంలో ఇలా ఉంది. కణ్వుడు సర్వదమనుడితో 'నీ తండ్రి దగ్గరకు వెళ్లు' అన్నాడు. అప్పుడతడు తాను వెళ్లననీ, మునిపాదాల దగ్గరే అధ్యయనం చేస్తాననీ అన్నాడు. అప్పుడు శకుంతల కుమారుడితో "నీవు మృగాన్ని దమించడం వల్ల మహర్షికి కోపం వచ్చి పొమ్మంటున్నారు. నేనిక్కడే ఉంటాను" అన్నది. అప్పుడు కణ్వుడామెకు పాతివ్రత్య మహిమను చెప్పి సర్వదమనుడితో "నీతల్లి భర్తమీది కోరికతో వేరే విధంగా మాటాడుతున్నది. కావున ఆమెను తీసుకువెళ్లు" అన్నాడు. అప్పుడు భరతుడు శకుంతలతో దుష్యంతుడి దగ్గరకు వెళదామన్నాడు. శకుంతల తన అజ్ఞానాన్ని మన్నించమని కణ్వుణ్ణి వేడుకొన్నది. కణ్వుడు తలవంచుకొని ఏమీ అనకుండా కన్నీళ్లు కారుస్తూ మునుల్ని పిల్చి శకుంతలను రాజు దగ్గరకు తీసుకువెళ్ళండన్నాడు.

ఆ మునులు శకుంతలను తోడ్కొని కొండలను కోనలను దాటి మధ్యాహ్నానికి ప్రతిష్ఠానపురం చేరుకున్నారు. జటావల్కల ధారులైన ఆ మహర్షులను చూచి ఆ పురప్రజలు నవ్వారు. ఇక ఆ మునులు తిరిగిపోయారు.

నన్నయ రచనలో కణ్వుడు శకుంతలతో "ఎంతటి పతివ్రతలకైనా పుట్టినిళ్లలో ఎక్కువకాలం ఉండడం మంచిది కాదు, నీ కుమారుణ్ణి తీసుకొని నీ భర్త దగ్గరకు వెళ్లు" అన్నట్లున్నది. మహాతపోధనులైన తన శిష్యుల్ని తోడు పంపినట్లు, వారు శకుంతలా భరతులతో దుష్యంతుడి దగ్గరకు వచ్చినట్లున్నది. ఈ అన్యథాప్రకల్పనమే ఔచిత్యభరితంగా ఉంది.

**5. మూలత్యాగం :** మూలంలో మేనక, విశ్వామిత్రుడి దగ్గరకు వెళ్లేటప్పుడు తనకు మన్మథుణ్ణి, వాయువును తోడు పంపమని కోరినట్లు ఉంది. ఆ తరువాత తనను వివస్త్రను చేసిన వాయువును నిందించినట్లు ఉన్నది. నన్నయ ఇక్కడ మూలత్యాగం చేశాడు. శకుంతల దుష్యంతుడితో పలికినట్లున్న "పితారక్షతి కౌమారే" అని శ్లోకాన్ని,

"యది మే యాచమానాయా / వచనం న కరిష్యసి
దుష్యన్త శతధా త్వద్య / మూర్ధా తే విఫలిష్యతి"

అనే శ్లోకాన్ని నన్నయ ఆంధ్రీకరించలేదు. రాజు శకుంతలను అన్న అవాచ్యాలను నన్నయ పరిహరించాడు. శకుంతల కారణంగా దుష్యంతుడు లోకంలోని స్త్రీలందరినీ నిందించాడు.

ఏ తన్నిందా గర్భితాలైన 'సర్వా వామా స్త్రియో లోకే / సర్వాః కామపరాయణా':

- మొదలైన శ్లోకాలను ఆంధ్రీకరించలేదు. ఔచిత్యవేత్త నన్నయ.

కథాంతంలో దుష్యంతుడు శకుంతలను అంతఃపురానికి తీసుకువెళ్లి ఆమెను 'వాసో ఉన్నపానాలతో' పూజించి, ఆమెను కొడుకును తన తల్లికి పరిచయం చేసినట్లు మూలంలో ఉంది. నన్నయ ఈ అంశాలను తన ఆంధ్రీకరణంలో వర్జించాడు.

**6. అమూలకత :** దుష్యంతుడు తపోవన మిది అని నిర్ధారణకు రావడానికి అమోఘమైన కారణాన్ని ప్రదర్శించాడు నన్నయ. నేతి హవిస్సుల పరిమళాలతో కూడిన ధూమలతాతతులతో ఉన్న కొమ్మలమీద వాలి పూలు లేకపోయినా తుమ్మెదలు వదలడం లేదని నన్నయ అన్నాడు. ఈ భావం అమూలకం.

దుష్యంతుడు శకుంతలతో నేను నిన్ను ఎరుగనన్నప్పుడు ఆమె కళ్లనుంచి అశ్రుకణాలు రాలాయి.

"కెందమ్మి రేకుల వలనం దొరంగు జలకణంబుల పోలెఁ
గోపారుణిత నయనంబుల బాష్ప కణంబులు దొరగ"

అని నన్నయ వచనం. ఇందులోని ఉపమాలంకారం అమూలకం.

శకుంతల కుమారుణ్ణి చూపుతూ దుష్యంతుడితో ఇలా అన్నది.

నీ పుణ్య తనువు వలనన
యీ పుత్రకుఁ డుద్భవిల్లి యెంతయు నొప్పున్
దీపంబు వలన నొండొక
దీపము ప్రభవించినట్లు తేజం బెసఁగన్.

పితా పుత్ర సంబంధ వ్యక్తీకరణ పటువైన ఈ ఔపమ్యం రమ్యం ఇది అమూలకం.

ఈ విధంగా నన్నయ తన ఆంధ్రీకరణ నైపుణ్యంతో వ్యాస మహాభారతాన్ని మరింత సౌందర్యభరితం చేశాడు; వనాన్ని తపోవనం చేశాడు.

## 1. 2. 1. 2 నన్నయ కవితారీతులు :

ఆదికవి నన్నయ భట్టారకుడు గద్యపద్యోభయమయమైన చంపూకావ్య రచనతో తెలుగు కవిత్వానికి శ్రీకారం చుట్టాడు. మధుమయ ఫణితికి మార్గదర్శి అయ్యాడు. అనంతరం కవులకు ఆదర్శం కాదగిన కవితారీతులను వెలార్చాడు. "తస్య ప్రతిభావేశః సర్వేషా మాంధ్రసుకవితా శ్రీః" అనే కవిసమ్రాట్టుల కైవారా లందుకున్నాడు.

నన్నయ తన భారతావతారికలో తన కవితారీతులలోని ప్రధానాంశాలను పేర్కొన్నాడు. అవి ప్రసన్న కథాకలితార్థయుక్తి, అక్షర రమ్యత, నానారుచిరార్థ సూక్తి నిధిత్వం. ఆయన కథా కథన కౌశలంతో పాటు రసపోషణ పాత్ర చిత్రణ వర్ణనా వైదగ్ధ్యాలూ, ప్రశంసార్హాలు. అక్షరరమ్యతను అంది పుచ్చుకున్న నన్నయ శబ్దార్థాలంకార ప్రయోగాలు కూడా మెచ్చుకోదగ్గవి. నానారుచిరార్థ సూక్తులతో పాటు సామెతలు, జాతీయాలు ఆయన కవిత్వానికి ఎంతో అందం తెచ్చాయి. ఇక నన్నయ ఛందోగమన సౌందర్యాలు వర్ణనాతీతాలు.

వ్యాసమహర్షి ప్రణీతమైన మహాభారత మహేతిహాసానికి కావ్యకళాకమనీయతను కొంతకు కొంత సంతరించాడు. నన్నయ భారతం అనువాదం కాదు. ఆంధ్రీకరణం. వ్యాసహృదయాన్ని ఆవిష్కరించిన స్వతంత్రరచన.

నన్నయ కథాకథనదక్షుడు. ప్రసన్న కథాకవితార్ధ యుక్తి ఆయన కవితా ప్రధాన లక్షణం. ఆయన మూలకథలోని చిక్కుల్ని తొలగించి దాన్ని ప్రసన్నం చేశాడు. ఆ కథలను అర్థాలనూ ప్రసన్నం చేశాడు. మొత్తం మీద ప్రసన్న కథలలో ప్రసన్నార్థాల కూర్పును భాసింపజేశాడు. మూలంలోని గహనమైన వేదాంతవిషయాలను, పునరుక్తులను, అనావశ్యక విషయాలను, అనౌచిత్యాలను పరిహరించాడు నన్నయ. శకుంతల భర్తృగృహానికి వెళ్లే ముందున్న కొన్ని మూలకథాంశాలు నన్నయ పరిహరించాడు. అలాగే దుష్యంతుడు శకుంతలను స్వీకరించిన తరువాత ఉన్న కొన్ని కథాంశాలను కూడా నన్నయ అనువదించలేదు.

నన్నయది రసపోషణంలో అందెవేసిన చెయ్యి. దుష్యంతుడు కణ్వాశ్రమానికి వెళ్లేముందు నన్నయ రచించిన "అతిరుచిరాగతుండయిన" పద్యం శృంగారరస సమ్మిళితం. అలాగే శకుంతల దుష్యంతనిరాకృత అయి విలపిస్తూ అన్న మాటలను నన్నయ "తడయక పుట్టిన" అనే మధ్యాక్కరలో నిబంధించి కరుణరస పోషణం చేశాడు. అలాగే కణ్వాశ్రమ వర్ణన పద్యంలో (శ్రవణ సుఖంబుగా సామగానంబుల) శాంతరసపోషణం చేశాడు నన్నయ.

ఆదికవి నన్నయ పాత్రపోషణం ప్రశంసాపాత్రం. కావ్యంలో అత్యంత ప్రధానమైన రసానికి ఆధారభూతమైన పాత్రలు పాత్రలు. మహాభారతం విభిన్న మనస్తత్వాలు కలిగిన బహుపాత్రలతో కూడింది. మూలంలోని పాత్రల రూపరేఖలను మరింత స్పష్టంగా చూపిన నన్నయ 'అబ్జాసన కల్పుడు'. శకుంతలోపాఖ్యానంలోని శకుంతల, దుష్యంతుడు, భరతుడు, కణ్వుడు, విశ్వామిత్రుడు, మేనక అందరూ నన్నయ భారతంలో తమతమ ప్రత్యేక లక్షణాలతో సాక్షాత్కరిస్తారు. శకుంతల సంభాషణలోని పారుష్యాన్ని, దుష్యంత వాగ్గతానౌచిత్యాన్ని నన్నయ తగ్గించి ఉదాత్తతను సమకూర్చాడు నన్నయభట్టు. "ఇది మునికన్యయేని", "ఇది మునినాథ కన్యయని" అనే పద్యాలలో దుష్యంతుడి మనస్సంఘర్షణ అద్భుతంగా చిత్రితమైంది.

నన్నయ వర్ణనావైదగ్ధ్యం తదనంతర కవులకు ముఖ్యంగా ప్రబంధ కవులకు ఒజ్జబంతి అయింది. దుష్యంతుడి బాల్యవర్ణన, రాజ్యవర్ణన, మృగయా వర్ణన, వన వర్ణన, కణ్వాశ్రమ వర్ణన మొదలైనవి అమోఘాలు. శకుంతల సౌందర్య వర్ణన, శోకవర్ణన మనోహరాలు. భరతుడి బాల్యవర్ణన, రాజ్యపాలన వర్ణన కూడా హృద్యాలు.

నన్నయ కవిత్వంలో అక్షర రమ్యత ఉజ్జ్వలమైన భాగం. అందులో సంగీతమాధుర్యం, వేదనాద మాధుర్యం తరంగితాలౌతుంటాయి. 'ఆదిత్యాంశు సమీర దుర్గమ మహోగ్రారణ్యదేశాళితో' అన్న పద్యపాదంలోని సమాసదీర్ఘత దుష్యంత సామ్రాజ్య విస్తీర్ణ స్ఫోరకంగా ఉంది. ఆయన శబ్దాలు రసాబ్దాలు.

నన్నయ కవిత్వంలోని శబ్దాలంకారాలు మితంగా, సున్నితంగా, సుందరంగా ఉంటాయి. ఎక్కడా భావప్రవాహానికి భంజకాలుగా ఉండవు; పైగా రంజకాలుగా ఉంటాయి. నన్నయ వాడే శబ్దాలంకారాలలో ప్రధానమైనది వృత్త్యాను ప్రాసం. వృత్త్యనుప్రాసం కనిపించీ కనిపించని శబ్దాలంకారం. ఇది గర్భస్థ పిండంలాంటిది. శిశువు లాంటిది కూడా కాదు.

సరభస పరిచలిత మహా
శరభ ద్విపరిపు వరహ శార్దూల మద
ద్విరదాది ప్రకర భయం
కర వనమధ్యమున నృపతి గడుఁ గడిమి మెయిన్.

అనే దుష్యంతుడి వేట వర్ణన పద్యంలో, చిన్న కందంలో తొమ్మిది చోట్ల రకారం ఉంది. కర్తన శీలమైన రేఫాన్ని ప్రయోగించి సన్నివేశాన్ని సముద్దీపింపజేశాడు నన్నయ.

నన్నయ అంత్యానుప్రాసాలంకారం విశిష్టమైంది. చివరంటా అలంకారాన్ని సాగదీసి కొనసాగించాలన్న ఆగ్రహాన్ని ఆయన ప్రదర్శించాడు. సహజంగా ఉన్నదాకే అని మిన్నకుంటాడు నన్నయ. దుష్యంతుడి వేట సందర్భంలోని

ఓసరిలి పఱచు మృగముల
నేసియు డాసిన మృగముల నెగిచి భుజాసిన్
వ్రేసియు.

పద్యం ఇందుకు నిదర్శనం. ఏసియు, వ్రేసియు అని వదలి వేశాడు. దుష్యంతుడు శకుంతలను చూచిన సందర్భంలోని "సంకుల మిళితాళినీల పరికుంచిత కోమల కుంతలన్ శకుంతల" అన్నది కూడా ఇటువంటిదే.

నన్నయ ప్రయోగించే అర్థాలంకారాలు కూడా అతి మనోజ్ఞంగా ఉంటాయి. దుష్యంతుడు విషమాటవీ చలిత కేసరి శార్దూలాది మృగాలను బాలహరిణాలను పట్టుకునే విధంగా పట్టుకొన్నాడని, గార్హపత్యమనే అగ్ని ఆహవనీయంగా ప్రకాశించే విధంగా జనకుడు పుత్రుడై ప్రకాశిస్తాడని, తాను తన నీడను నీళ్లలో చూచే విధంగా తండ్రి కుమారుణ్ణి చూచి అతిశయ ప్రీతితో మహానందాన్ని పొందుతాడని, దుష్యంతుడి పుణ్యతనువు వల్ల ఉద్భవిల్లిన భరతుడు దీపం నుండి పుట్టిన దీపంలాగా ఉన్నాడని చక్కని ఉపమాలంకారాలను ప్రయోగించాడు నన్నయ. దుష్యంతుడు వనాన్ని చూచి దేవేంద్రుడి ఖాండవవనానికి, కుబేరుడి చైత్యరథానికి సమానంగా దీన్ని భూలోకం కోసం బ్రహ్మ సృష్టించాడేమో అనుకున్నాడు. ఇది మంచి ఉత్ప్రేక్షాలంకారం. దుష్యంత సైన్యమనే మందరపర్వతం అరణ్యమనే మహాసముద్రాన్ని సంక్షోభింపజేసిందని, అతిరుచిరాగతుడయిన దుష్యంతుడి మీద లతాలలనలు కుసుమాక్షతలు చల్లారని, అళినీనినాద మృదుభాషలతో దీవనలిచ్చారని నన్నయ మనోహరమైన రూపకాలంకారాన్ని ప్రయోగించాడు. ఉత్తరోత్తరోత్కర్షను వర్ణించే సారాలంకారం 'నుతజల పూరితంబులగు' అనే పద్యంలో పరమరమణీయంగా సాక్షాత్కరిస్తున్నది.

నన్నయ కవిత్వంలో నానారుచిరార్థ సూక్తులకు విశిష్టస్థానం ఉంది. లోకనీతులు, రాజనీతులు వీటిలో విరాజిల్లుతుంటాయి.

1. ఎట్టి సాధ్వులకును బుట్టిన యిండ్లను బెద్ద కాలమునికి తద్ద తగదు.
2. నమ్మియుండగా వలవదు బుద్ధిమంతులు నవప్రియులైన ధరాధి నాథులన్
3. ఎల్ల ధర్మంబుల కెందుఁ బెద్ద యండ్రు సత్యంబు ఇత్యాదుల నెన్నింటినో ఉదాహరించవచ్చు.

నన్నయ కవిత్వంలో అక్కడక్కడ సామెతలు, జాతీయాలు తీయదనాన్ని అందిస్తుంటాయి. వ్యవహార సన్నిహితమైన వాక్యవిన్యాసం కూడా అక్కడక్కడా మనస్సును స్పందింపజేస్తుంది.

1. అరుగుము ఎందుండి వచ్చి తందులకు వడిన్.
2. ఇంక దైవంబకాని యొండు శరణంబులేదు.

నన్నయ ఛందశ్శిల్పవేత్త. శకుంతలోపాఖ్యానంలో మత్తేభశార్దూలాలను పరిమితంగా వాడాడు. దుష్యంత రాజ్యవిస్తృతిని శార్దూలంలోను, భరతుడి బాల్యాన్ని తద్గాత్ర పరిష్వంగ సౌఖ్యాన్ని రెండు మత్తేభాల్లో వర్ణించాడు నన్నయ. తక్కిన శృంగార కరుణ రస సన్నివేశాలలో ఉద్ధత వృత్తాలను వాడలేదు. చంపకోత్పల మాలలనే ప్రయోగించాడు. విశేషవృత్తాలైన మానిని, కవిరాజ విరాజితాలను వనవర్ణనంలో ప్రయోగించాడు నన్నయ. ఇవి చతురస్ర గతిలో నడుస్తూ దుష్యంత గమనాన్ని సూచిస్తున్నాయి.

"తనర జనకుండు" అనే మధురాక్కర గంభీరంగా ఔపదేశిక ప్రతిపత్తితో, "తడయక పుట్టిననాడ" అనే మధ్యాక్కర జాను తెనుగు శైలిలో కరుణ రసప్రసారంతో ప్రకాశిస్తున్నాయి. 'ఇది మునికన్య యేని', 'ఇది మునినాథ కన్యయని' అనే పద్యాలు ఒకే ఎత్తుగడతో ఉండి దుష్యంత సందేహ ప్రవృత్తిని సూచిస్తున్నాయి. "క్రచ్చఱ వేట వచ్చి" అనే ఉత్పలమాలలో పూర్వార్థంలో దుష్యంతుడి మాటలు, ఉత్తరార్థంలో శకుంతల మాటలు సమవిభక్తాలై సౌందర్యాన్ని విరజిమ్ముతున్నాయి.

ఈ విధంగా నన్నయ శకుంతలోపాఖ్యానంలో తన కవితారీతులను ప్రదర్శించాడు. వీటిని మననం చేసుకుంటుంటే "వాల్మీకిం నన్నార్యం త్యక్త్వా కవిరస్తివా జగత్యస్యః" అన్న విశ్వనాథ వారి అభిభాషణం అక్షర సత్యమనిపిస్తుంది.

## 1. 2. 2 ప్రశ్నలు - సమాధానాలు

**ప్రశ్న 1. 'శకుంతలోపాఖ్యానం' ఆధారంగా శకుంతలా దుష్యంతుల పాత్ర చిత్రణం కావించండి . - లేదా -**

**దుష్యంతుడు శకుంతలను స్వీకరించిన విధానాన్ని వివరించండి.**

ఆంధ్రమహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలో ఉన్న శకుంతలోపాఖ్యానంలోని ప్రధాన పాత్రలు శకుంతలా దుష్యంతులు.

శకుంతల మేనకా విశ్వామిత్రుల ముద్దుబిడ్డ. ఆమె పుట్టగానే తల్లిదండ్రులు విడిచిపెట్టారు. పక్షులామెను రెక్కలతో కప్పి రక్షించాయి. కణ్వుడు సమిత్కుసుమ ఫలాహరణార్థం అక్కడకు వెళ్ళి మాలినీనది ఇసుక తిన్నెమీద ఉన్న ఆమెను తీసుకువచ్చి శకుంతరక్షిత - పక్షులచేత రక్షించబడింది - కనుక శకుంతల అనే పేరుపెట్టి ప్రేమతో పెంచాడు. అందువల్ల కణ్వుడు శకుంతలకు పెంపుడు తండ్రి.

దుష్యంతమహారాజు వేటకు వచ్చి కణ్వమహర్షిని సందర్శించడానికి వచ్చి శకుంతలను చూచి గాంధర్వ వివాహం చేసుకుంటానని శకుంతలను అంగీకరింపజేశాడు. అప్పుడు ఆమె దుష్యంతుడితో "నీ దయవల్ల కలిగే కుమారుడికి యౌవరాజ్యాభిషేకం చేయడానికి వరం ఇవ్వు. అట్లయితేనే నీకూ నాకు సంగమం అవుతుం'దని అన్నది. దుష్యంతుడు శకుంతల కోరిన వరం ఇచ్చి గాంధర్వ వివాహం చేసుకొని అభిమత సుఖాలు అనుభవించాడు. వెళ్లేటప్పుడు దుష్యంతుడు తనమంత్రులను కణ్వమహాముని వద్దకు పంపుతానన్నాడు. శకుంతల ఊరడిల్లింది. శకుంతల గాంధర్వవివాహం క్షత్రియులకు విధి చోదితమని కణ్వుడు ఆమోదముద్ర వేశాడు.

శకుంతల దుష్యంతుణ్ణి కోరిన వరం విషయం కణ్వుడి నోట వెంట వచ్చింది. ఆమె ధర్మచరిత్ర. తన మనస్సు ఎప్పుడూ ధర్మాన్ని అంటిపెట్టుకొని ఉండాలని, తన పుత్రుడు వంశకర్త కావాలని తండ్రిని వరం కోరుకోవడంలో ఆమె ధర్మశీలం తెలుస్తున్నది.

శకుంతల భరతుణ్ణి కన్నది. ఆ కుమారుడు చక్రవర్తి లక్షణలక్షితుడు. అనంత జవసత్వ సంపన్నుడు. అరణ్యంలోని సర్వజంతువుల్నీ తన మహాబలంతో అరికట్టాడు. మునులు సర్వదమనుడన్నారు అతనిని. ఇలా యౌవరాజ్యాభిషేకానికి అర్హతకల వయస్సు వాడయ్యాడు.

ఇలా శకుంతల తగిన పతిని, సుతుణ్ణి పొందింది. ఆమె ఉత్తమపత్ని. ఉత్తమ జనని.

శకుంతల తండ్రి చెప్పిన ప్రకారం ఆయన పంపిన శిష్యులతో కుమార సమేతంగా భర్త దగ్గరకు వచ్చింది. నిండు కొలువులో ఆ రాజును చక్కగా పరిశీలించింది. అనురాగం, ఆదరం, ప్రేమతోడి తొందర లేకపోగా చూపుల్లో క్రూరత చోటు చేసుకున్నదని గమనించింది. శకుంతల గొప్ప పరేంగితజ్ఞ. దుష్యంతుడు తెలియనట్లు నటిస్తున్నాడు. యథార్థాన్ని మనస్సులోకి ప్రవేశింపనివ్వడం లేదని ఆమె గ్రహించింది.

శకుంతల క్రియాశీలం ప్రశంసార్హం. ఇంతదూరం వచ్చి ఊరకే తిరిగిపోవడం మంచిదికాదని తన ప్రయత్నాన్ని ప్రారంభించింది. పూర్వవృత్తాంతం చెప్పి కొడుకును చూపాలనుకుంది. దుష్యంతుడు 'నిన్ను ఎరుగను, వచ్చిన చోటికే తిరిగి వెళ్లు "అనగానే ఆమెకు కళ్లవెంట బాష్పకణాలు స్రవించాయి.

"ఆపదలందు ధైర్యగుణం" శకుంతల నైజం. తన హృదయ సంతాపాన్ని తానే ఉపశమించిజేసుకున్నది. శకుంతల ధర్మజ్ఞ. ఆమె దుష్యంతుడితో ఇలా అన్నది. ధార్మికులైనవారు మాటతప్పకూడదని, మనం చేసిన పనిని మానవులు చూడకపోయినా పంచభూతాలు సూర్యచంద్రులు అహోరాత్రాలు మొదలైన మహాపదార్థాలు గమనిస్తూ ఉంటాయని అందువల్ల అబద్ధమాడి ఆత్మవంచన చేసుకోవద్దని హెచ్చరించింది. భార్యను తిరస్కరించే దుర్మతికి ఇహపరాలులేవని, ఎటువంటి ఆపదల్లోనైనా భార్యాపుత్రులను చూచుకుంటే చాలు బాధలు తొలగిపోతాయని చెప్పింది. ఆ తరువాత పుత్రప్రాశస్త్యాన్ని వివరించింది. పుత్రగాత్ర పరిష్వంగ సౌఖ్యంకన్నా చల్లనిదీ, మనోహరమైనదీ లేదని అతి మధురానుభూతికి అక్షరాకృతి ఇచ్చింది. ఆ తరువాత సత్యగౌరవాన్ని వక్కాణించింది.

"ఎఱుఁగు మెల్ల ధర్మంబుల కెందుఁ బెద్ద
యండ్రు సత్యంబు ధర్మలైన మునులు" ని చెప్పింది.

శకుంతల దైవవిశ్వాసం వర్ణనాతీతం. ఆమె ఎన్ని చెప్పినా దుష్యంతుడు వినలేదు. నీ ఆశ్రమానికి వెళ్లు అన్నాడు. ఆమె వెంటనే "దైవంబకాని యొండు శరణంబు" లేదనుకున్నది.

ఆకాశవాణి జోక్యం చేసుకున్నది. దుష్యంతుడితో శకుంతల మహాసాధ్వి, ఆమె వివేకంతో సత్యం పలికిందని, ఈ బాలుడు మీ కుమారుడని అందరూ వినేటట్లు చెప్పింది.

శకుంతల మహాసాధ్వి. ఆమెను ఆకాశవాణితో పాటు గగనస్థితులైన దేవతలూ ప్రశంసించారు. దుష్యంతుడి చేత అతిప్రణయ గౌరవంతో సంభావింపబడింది.

దుష్యంతుడు రాజ్యపరిపాలనాదక్షుడు, మహావీరుడు, సౌందర్య పిపాసి, ఇంకా అన్ని విధాలా గొప్పవాడే, కాని లోకాపవాద భీతివల్ల తెలియనట్లు నటించాడు. శకుంతల మాటలను చెవిలో దూరనీయలేదు. చివరకు ఆకాశవాణి చెప్పగానే యథార్థాన్ని అంగీకరించాడు. అందుకైనా మనం ఆ మహారాజును మెచ్చుకోవలసిందే. ఆ తరువాత కొడుకును ఎత్తుకొన్నాడు. హర్ష పులకలు అతిశయించేటట్లు ఆలింగనం చేసుకున్నాడు. పుత్రగాత్ర పరిష్వంగ సుఖాన్ని తనివితీర అనుభవించాడు 'సృష్టి కర్త ప్రవృత్తి గుణ సమగ్రతకు విముఖం గదా' అని కాళిదాసోక్తి కనుక దుష్యంతుడిలోని ఈ లోపం క్షమార్హ మైనదే!

**ప్రశ్న 2. శకుంతలోపాఖ్యానం లోని సందేశాన్ని వివరించండి.**

**- లేదా - శకుంతలో పాఖ్యానం ద్వారా గృహస్థాశ్రమ ధర్మ స్వరూపాన్ని తెలుపండి. - లేదా - శకుంతలోపాఖ్యానంలో విదితమయ్యే మహిళా చైతన్య స్వరూపాన్ని వివరించండి.**

మహభారతాన్ని ఇతిహాసంగా, శాస్త్రేతిహాసంగా వేదవ్యాస మహర్షి రూపొందించాడు, నన్నయ వ్యాస విహిత మార్గంలో పురుషార్థ నిరూపణం చేశాడు. ప్రధానంగా ధర్మ ప్రబోధం చేశాడు.

శకుంతల ధర్మ చరిత. కణ్వ మహాముని సైతం ' నీ ధర్మ చరితంబునకు మెచ్చితి ' అన్నాడు ఆమెతో. ఆమె తన మనస్సు 'ధర్మువునంద తగిలి' ఉండాలని వరం కోరుకొన్నది.

కణ్వ మహర్షి శకుంతలకు బోధించిన ధర్మాన్ని ముందుగా మననం చేసుకుందాం. " ఎంతటి పతివ్రతలైనా పుట్టింట్లో ఎక్కువ కాలం ఉండరాదు. భర్త తగ్గర ఉండడమే ధర్మం." అన్నాడు కణ్వుడు, ఇది శాశ్వత సత్యం.

దుష్యంతుడి పరిస్థితిని గమనించి శకుంతల రాజుల తత్త్వాన్ని ప్రకటించింది. రాజులు ప్రయోజనాపేక్ష కలవారు. తమ ప్రయోజనం కోసం ఆశ్రితుల మీద అభిమానాన్ని మార్చుకుంటారు. వారికి కొత్తవారిమీద మోజు ఎక్కువ. అందువల్ల బుద్ధి మంతులు రాజుల్ని నమ్మాకూడదు. ఇదీ శకుంతల అభిప్రాయ సారాంశం. వ్యాసుడు, నన్నయ ప్రకటించిన ఈ అభిప్రాయాలే పోతన, ధూర్జటి, త్యాగరాజు

మొదలైన తెలుగుకవులను ప్రభావితం చేశాయి. రాజులు మత్తులనీ, వారిసేవ నరక సమానమనీ, వారి కానుకలు ఆత్మవ్యథా బీజాలనీ ధూర్జటి అన్నాడు. నిధి చాల సుఖమా రాముని సన్నిధి చాల సుఖమా? అని త్యాగరాజు ఎలుగెత్తి పాడాడు.

మాట తప్పిన భర్తను 'సైతం క్షమించలేదు శకుంతల.' అజ్ఞాని లాగా తెలిసిన విషయాన్ని తెలియదనవద్దు అని మందలించింది. ఇది రహస్యం ఎవరికీ తెలియదులే అని అబద్ధ మాడడం ధార్మికుల లక్షణం కాదన్నది. వేదాలు, పంచభుతాలు, ధర్మదేవత, ఉభయసంధ్యలు, అంతరాత్మ, యముడు, సూర్య చంద్రులు, రేయీ పగలూ ఉండగా అవి మానవ ప్రవర్తనను గమునిస్తూ ఉండగా అబద్ధమాడి ఆత్మవంచనకు పూనుకోరాదు.

గృహస్థాశ్రమంలో భార్యకు ఉన్న ఉన్నతస్థానాన్ని శకుంతల చక్కగా వ్యక్తం చేసింది. పతివ్రత, గుణవతి, సంతానవతి, అనుకూలవతి అయిన భార్యను తిరస్కరించే దుర్మార్గుడికి ఇహపరాలు లేవు. అనుగుణ భార్యావంతుడు శాశ్వతమైన గృహస్థ ఫలాన్ని మొత్తం పొందుతాడు. భార్య పురుషార్థాలైన ధర్మార్థ కామాలను సాధించడానికి సాధనం స్వచ్ఛమైన నడవడికి గురుస్థానం వంశస్థితికి మూలం మోక్షానికి చేదోడు. గౌరవానికి కారణం. సంతోష జనకం.

కష్టాలు వచ్చినప్పుడు భార్యను, బిడ్డల్ని చూస్తే బాధలన్నీ తొలగిపోతాయి. భార్య భర్తలో అర్ధ భాగం. ఆమె ముందు మరణిస్తే స్వర్గంలో భర్త కోసం ఎదురు చూస్తుంటుంది. భర్త భార్యలో ప్రవేశించి కుమారుడిగా జన్మిస్తాడు 'అంగాదంగాత్ సంభవసి' అనే వేదవాక్యాన్ని బట్టి తండ్రీ కొడుకులకు తేడాలేదు.

శకుంతల పుత్ర విశిష్టతను కూడా పేర్కొన్నది. గార్హపత్యాగ్ని మరోరూపంలో ఆహవనీయాగ్నిగా ప్రకాశించే విధంగా జనకుడే తనయుడిగా ప్రకాశిస్తాడు. తన నీడను తాను నీళ్లలో చూచుకొని ఆనందించే విధంగా తండ్రి కుమారుణ్ణి చూచి ఆనందిస్తాడు. పున్నామ్నో నరకాత్ త్రాయత ఇతి పుత్రః' అనే వేదవచనం ప్రకారం పుత్ అనే పేరుగల నరకం నుంచి తల్లి వైపు వారిని తండ్రి వైపు వారిని రక్షిస్తాడు అని పుత్ర శబ్దార్థం. పున్నామ నరకం నుంచి తల్లి వైపు వారిని, తండ్రి వైపు వారిని రక్షిస్తాడు. దీపం నుంచి పుట్టిన దీపం లాగా తండ్రి వల్ల జన్మించిన కుమారుడు ఆ కాంతిని-పితృలక్షణాల్ని-కొనసాగిస్తాడు. కొడుకు ఒంటిని కౌగిలించుకుంటే కలిగే హాయి అనుభవిస్తే తెలియాల్సిందే కాని మాటలకు అందదు. ముత్యాల దండలు, కర్పూర రజం, మంచిగంధం, ఆహ్లాదానికి మారుపేరైన వెన్నెల-ఏవీ కలిగించలేవు. అందువల్ల పుణ్యాచారుడైన పుత్రుణ్ణి ఎవరూ దూరం చేసుకోగూడదు.

అనంతరం శకుంతల సత్యఔన్నత్యాన్ని చాటింది. అందురూ బాగా మెచ్చుకునే నీటితో నిండిన నూరు నూతుల కన్నా ఒక దిగుడు బావి శ్రేష్ఠం. అటువంటి బావులు నూరిటి కన్నా ఒక సత్క్రతువు శ్రేష్ఠం. అటువంటి క్రతువులు నూరిటికన్నా ఒక కుమారుడు మేలు. అటువంటి కుమారులు వందమంది కన్నా ఒక సత్యవాక్యం మంచిది. వెయ్యి అశ్వమేధ యాగాల ఫలితాన్ని త్రాసులో ఒక ప్రక్కన పెట్టి, సత్య ఫలాన్ని మరో ప్రక్కన పెట్టి తూకం వేస్తే సత్యం వైపే ముల్లు మొగ్గుతుంది. సత్యానికి ఉన్న గురుత్వాతిశయం. గొప్పతనం బరువు - అలాంటిది. ఎన్ని తీర్థ యాత్రలు చేసినా, ఎన్ని వేదాలు చదివినా సత్యంతో సమానం కావని ధర్మశాస్త్ర వేత్తలైన ఋషుల అభిప్రాయం.

మానవులకు జన్మ పరంపర ఉంటుంది. ఒక జన్మలో చేసుకున్న పుణ్యాపాపాలు ఆ తరువాత జన్మలోకి వెన్నంటి వస్తాయి.

మానవుడు ఎప్పుడు తన పని తాను చేయవలసిందే. వ్యతిరేక పరిస్థితులు వచ్చినప్పుడు అధైర్యపడకుండా ముందుకు సాగి పోవాలి. అయితే దైవాన్ని విస్మరించకూడదు మానుష శక్తి కన్నా దైవ శక్తి మిన్న అన్న భావంతో ప్రవర్తించాలి. ఫలితాన్ని ఆశించకుండా పని చేయాలి. ఈ నిష్కామకర్మకు, భగవత్ శరణాగతి తోడుకావాలి. అప్పుడు భగవంతుడు జోక్యం చేసుకొని తన స్వరూపమైన సత్యాన్ని ప్రతిష్ఠిస్తాడు. 'సత్యమేవ జయతే' పరమార్థాన్ని సాక్షాత్కరింపజేస్తాడు. శకుంతల కథలో ఇలాగే జరిగింది. "ఇంక దైవంబు కాని ఒండు శరణంబు లేదు'' అనుకోగానే ఆకాశవాణి యథార్థం పలికింది. కథ సుఖాంతమైంది.

మొత్తం మీద మానవుడు భౌతిక సంపదల కోసం మరో మానవుణ్ణి అర్థించడం మంచిది కాదని, భార్యను సంతానాన్ని గౌరవించడం ఉత్తమ మానవ లక్షణమని, క్లేశాలు అనుభవించినా విజయం సాధిస్తారని శకుంతలోపాఖ్యానం సందేశం. అది ధర్మ సందేశం.

### 1.2.3 రాదగిన ప్రశ్నలు :

1. దుష్యవతుడు శకుంతలను గాంధర్వ వివాహం చేసుకున్న విధానాన్ని గురించి, తత్పర్యవసానాన్ని వివరించండి.
2. శకుంతల జన్మ వృత్తాంతాన్ని వ్యక్తీకరించండి లేదా మేనక విశ్వామిత్రుడి తపస్సును భగ్నం చేసిన తీరును తెలియజేయండి
3. రాజ సభలో జరిగిన శకుంతలాదుష్యంతుల సంవాదాంశాన్ని క్రోడీకరించండి.
4. దుష్యంతుడు శకుంతలాభరతుల్ని స్వీకరించడంలో ఏర్పడ్డ సంఘర్షణను సమీక్షించండి.
5. శకుంతలోపాఖ్యానంలోని సమకాలిక సార్వకాలిక విశేషాలను పేర్కొనండి.

### 1.2.4 ఆచూకీ గ్రంథాలు :


1. ఆంధ్రమహాభారతము. ఆది పర్వము : ఆం. ప్ర. సా. అకాడమి
2. ఆంధ్రమహాభారతము. ఆది సభాపర్వము : సంశోధితము. ఉస్మానియా విశ్వవిద్యాలయం.
3. ఆంధ్రమహాభారతము-కవిత్రయము : దివాకర్ల వేంకటావధాని, ఆం.ప్ర.సా. అకాడమి
4. ఆంధ్రమహాభారతోపన్యాసములు : ఆంధ్రసారస్వత పరిషత్తు.
5. ఆంధ్రవాఙ్మయారంభదశ (సం. 1,2) ప్రాఙ్నన్నయ యుగము, నన్నయ భారతము : దివాకర్ల వేంకటావధాని.
6. ఆంధ్రసాహిత్య చరిత్ర : పింగళి లక్ష్మీ కాంతం.
7. నన్నయ కవితా వైభవం : దివాకర్ల వేంకటావధాని
8. నన్నయ్య కవిత్వము-అక్షర రమ్యత : వి.వి.యల్. నరసింహారావు
9. నన్నయగారి ప్రసన్న కథా కలితార్థయుక్తి : విశ్వనాథ సత్యనారాయణ
10. భారత ధ్వని దర్శనము : శలాక రఘునాథ శర్మ.
11. భారత పద్యశైలి : చేరెడ్డి మస్తాన్ రెడ్డి
12. సమగ్ర ఆంధ్రసాహిత్యం (సం.1) : ఆరుద్ర.



**డా॥ చేరెడ్డి మస్తాన్ రెడ్డి**, ఎం.ఏ., పిహెచ్. డి.

రీడర్ & ప్రిన్సిపాల్

ఎస్.కె.ఆర్.బి.ఆర్. కళాశాల,

నర్సరావుపేట

మొదటి భాగము - ప్రాచీన పద్యభాగము

# ఉత్తర గోగ్రహణము - తిక్కన

## (ఆంధ్ర మహాభారతం - విరాట పర్వం - చతుర్థాశ్వాసం పూర్తిగా) (1 - 277)

## పాఠం -3


1. 3. 0 పరిచయం
1. 3. 0. 1 కవి పరిచయం
1. 3. 0. 2 కావ్య పరిచయం
1. 3. 1. పాఠ్య భాగవివరణ


### 1. 3. 0 పరిచయం

### 1. 3. 0. 1 కవి పరిచయం

"ఉభయ కవిత్వ తత్త్వ విభవోజ్జ్వలు సంవితాధ్వర క్రియా
ప్రభు బుధ బంధు భూరి గుణ బంధురు భారతసంహితాకథా
విభుఁ బర తత్త్వ బోధను, నవీన పరాశర సూను సంతత
త్రిభువన కీర్తనీయ యశుఁ దిక్కకవీంద్రుని గొల్తునర్థితోన్" - అని మార్కండేయ పురాణంలో మారన చేత ప్రశంసింపబడిన ఉభయ కవితా విశారదుడు, అభినవ వ్యాసుడు తిక్కన.

తిక్కన శిష్యుడైన మూలఘటిక కేతన తాను రచించిన 'దశకుమార చరిత్రము' ను తిక్కనకు అంకితమిచ్చాడు. ఆంధ్రసాహిత్య చరిత్రలో కావ్యాన్ని అంకితం గొన్న కవులలో తిక్కన ప్రప్రథముడు. కేతన తిక్కనను గూర్చి అనేక విశేషాలు తెలియజేశాడు. తిక్కన గౌతమ గోత్రుడు, ఆపస్తంబ సూత్రుడు. కొట్టరువు అనేది వారి గృహనామం. కొట్టరువు భాస్కర మంత్రి తిక్కన తాత. ఆయన సార కవితాభిరాముడు; గుంటూరు విభుడని తిక్కన తన నిర్వచనోత్తర రామాయణంలో తెలియజేశాడు. తిక్కన తల్లి అన్నమ, తండ్రి కొమ్మన.

**తిక్కన కాలం :** తిక్కన నెల్లూరును పాలించిన మనుమసిద్ధికి తాను రచించిన నిర్వచనోత్తర రామాయణాన్ని అంకితమిచ్చి ఆ రాజు చేత 'మామా' అనిపించుకొన్నాడు. మనుమసిద్ధి క్రీ.శ. 1250 - 1290 మధ్యకాలంలో రాజ్యాన్ని పరిపాలించినట్లు తెలుస్తున్నది. తిక్కన మనుమసిద్ధి ఆస్థాన కవిగా మాత్రమే కాకుండా, మహామంత్రిగా కూడా విరాజిల్లినట్లు స్పష్టమవుతున్నది. మనుమసిద్ధి అధికారంలోనికి వచ్చిన కొద్దికాలానికే దాయాదియైన విజయాదిత్యుని చేత పరాజితుడై, రాజ్యాన్ని కోల్పోయి ప్రవాసానికి వెళ్లగా, తిక్కన మంత్రిగా తన బాధ్యతను నెరవేర్చటానికి ఓరుగంటి కాకతి గణపతి దేవచక్రవర్తిని దర్శించి తన ప్రతిభా విశేషం చేత ఆయన్ని మెప్పించి, మనుమసిద్ధికి పోయిన రాజ్యాన్ని ప్రాప్తింపజేశాడట. అందువల్ల తిక్కన కాలాన్ని క్రీ.శ. 1210 - 1300 మధ్య అని కొందరు క్రీ.శ. 1205 - 1300 అని మరికొందరు గుర్తించారు. ఏదిఏమైనా తిక్కన సహస్రమాస జీవిగా 13 వ శతాబ్దమంతా తన ప్రతిభను పరివ్యాప్తం గావించిన విశిష్టమూర్తిగా దర్శనమిస్తాడని భావించవచ్చు.

**తిక్కన రచనలు :**

తిక్కన తొలికృతి నిర్వచనోత్తర రామాయణం. మలికృతి ఆంధ్రమహాభారతం. ఈ రెండు గ్రంథాలనే కాకుండా విజయసేనము, కవిసార్వభౌమ ఛందము, కృష్ణశతకము అనే గ్రంథాల్ని కూడా తిక్కన రచించాడనే ప్రచారం లోకంలో ఉన్నది. అలంకార గ్రంథాల్లో 'తిక్కన విజయసేనము' లోనివిగా కొన్ని పద్యాలు కనిపిస్తున్నాయిగాని తిక్కన శిష్యులుగానీ, సమకాలికులుగానీ ఆయన 'విజయసేనము' రచించినట్లు పేర్కొనలేదు. కాబట్టి దీని కర్తృత్వం సందేహాస్పదమైంది. 'కవిసార్వభౌమ ఛందము' కూడా లభించలేదు. కృష్ణశతకము లోనిదిగా ఒకే ఒక పద్యం ప్రచారంలో ఉన్నది.

"అరయన్ శంతను పుత్రుపై విదురుపై నక్రూరుపై గుబ్జపై
నరుపై ద్రౌపదిపై, గుచేలుని పయి న్నంద వ్రజ స్త్రీలపైఁ
బరగం గల్గు భవత్కృపారసము నాపైఁ గొంత రానిమ్ము నీ
చరణాబ్జంబులు నమ్మినాడ జగదీశా ! కృష్ణ ! భక్త ప్రియా !" - ఈ పద్యం తప్ప వేరే ఆధారాలు లేకపోవటంతో దీన్ని తిక్కన కృతంగా గుర్తించడం కష్టమే.

తిక్కన రచనలు ప్రస్తుతానికి లభ్యమవుతున్నవి రెండే రెండు. 1. నిర్వచనోత్తర రామాయణం 2. ఆంధ్ర మహాభారతం. ఆంధ్రమహాభారతంలోన విరాట పర్వం నుంచి స్వర్గారోహణ పర్వం వరకు 15 పర్వాల్ని తిక్కన రచించాడు. నిర్వచనోత్తర రామాయణాన్ని మనమసిద్ధికి అంకితంచేశాడు. మహాభారతాన్ని హరిహర నాథునికి అంకితమిచ్చాడు. హరిహర నాథుడు కలలో కనిపించి కృతిపతిత్వాన్ని కోరి వచ్చానని చెప్పాడు. తిక్కన ఏ ముహూర్తంలో ఈ స్వప్న వృత్తాంతాన్ని చెప్పాడోకానీ తర్వాతి కాలంలో చాలామంది కవులు స్వప్న వృత్తాంతాల్ని వర్ణించారు. తిక్కనను

"తన కావించిన సృష్టి తక్కొరుల చేతంగాదు నా నేముఖం
బునఁదా బల్కిన పల్కు లాగమములై పొల్పొందు నావాణి సో
త్తను నీతండొకరుండు నాజను మహత్వాప్తిం గవిబ్రహ్మనా
వినుతింతుం గవితిక్క యజ్వనఖి లోర్వీ దేవతాభ్యర్చితున్" అని ఎర్రన ప్రశంసించాడు. తిక్కనకు ఉభయకవిమిత్రుడు, కవిబ్రహ్మ అనే బిరుదులున్నాయి.

**తిక్కన మనః పరిణామం :**

తిక్కన నిర్వచనోత్తర రామాయణ రచనా సమయానికి పాండిత్యాన్ని మాత్రమే కలిగి ఉన్నాడని అప్పటికి పరిణతిని పొందక పోవడంవల్లనే "అమలో దాత్త మనీష నేను భయ కావ్య ప్రౌఢిఁ బాటించు శిల్పమునం బార గుడం గళా విదుడ" అని పేర్కొన్నాడని కొంత స్వాతిశయాన్ని ప్రకటించాడని విమర్శకుల అభిప్రాయం. భారత రచనకు పూర్వం తిక్కన యజ్ఞంచేసి సోమయాజి అయ్యాడు. భారతరచనకు పూనుకొనే నాటికి వయః పరిపాకముతో పాటు బుద్ధి వికాసం కూడా సిద్ధించింది. చక్కని సంయమనం, సమదృష్టి కలిగాయని స్పష్టమవుతున్నది. భారత రచనచేస్తూ "నా నేర్చిన భంగి జెప్పి వరణీయుడనయ్యెద భక్తకోటికిన్" అని వినయాన్ని ప్రకటించాడు. అంతేకాదు

"కావున భరతామృతము కర్ణపుటంబుల నారఁగ్రోలి యాం
ధ్రావలి మోదముం బొరయు నట్లుగ సాత్యవతేయ సంస్కృతి.
శ్రీవిభ వాస్పదంబయిన చిత్తము తోడ మహాకవిత్వ దీ
క్షావిధి నొంది పద్యముల గద్యములన్ రచియింంచెదం గృతుల్" - అని ఆంధ్రావలి మోదముంబొరయు నట్లుగ' భారతాన్ని రచిస్తానని ప్రకటించాడు. రామాయణాన్ని రాజు మెప్పుకోసం రచించి, భారతాన్ని ప్రజల మెప్పుకోసం రాశాడు.

భారత రచన చేసే సమయానికి తిక్కనలో ఆముష్మిక చింతన కలిగింది. అందుకే కలలో దర్శన మిచ్చిన హరిహరనాథుని "జన్మాంతర దుఃఖముల్ దొలఁగునట్లు గఁజేసి సుఖాత్మఁ జేయవే" అని వేడుకొన్నాడు.

సమగ్ర ఆంధ్రసాహిత్యంలో ఆరుద్ర తిక్కనను గూర్చి "నాదేశం ఆనందించడానికి ఈ కావ్యం వ్రాస్తున్నాను" అని చెప్పిన మొదటి కవి తిక్కన. ఆయన కావించిన సృష్టి ఇంకొకరి వల్ల అయ్యేది కాదు. ఆయన నోట పలికిన ఏ పలుకైనా వేదం లాగా పొలుపొందుతుంది. వాణీశుడిత డొక్కడే అని చెప్పదగి, మహిమవల్ల కవిబ్రహ్మ అనిపేరు కెక్కిన తిక్కన గారికి నమస్కరిస్తున్నాను "అని కవిత్రయంలో ఒకరైన ఎర్రాప్రెగడగారన్నారు. ఆయన చెప్పిన మాటలు అక్షరాల నిజం" అని రచించిన తీరు ప్రశంసనీయం.

### 1 .3. 0. 2 కావ్యపరిచయం :

సంస్కృతంలో వ్యాసుడు భారతాన్ని ఇతిహాసంగా తీర్చిదిద్దాడు. ఈ సంస్కృత భారతాన్ని నన్నయ, తిక్కన, ఎర్రాప్రెగడ కవిత్రయం వారు కావ్యంగా రూపొందించారు. కవిత్రయం వారు కథను రమణీయంగా, కథనాన్ని రమ్యాతి రమ్యంగా కూర్చి సహృదయులకు అనితర సాధ్యమైన ఆనందాన్ని కలిగించారు. లౌకికానంద జనకమైన అంశాలతో పాటు పారమార్థికాంశాలను కూడా స్పృశించి మానవుని పురుషార్థసాధనకు ఉదాత్త మార్గాలెన్నింటినో ఏర్పరిచారు. అందుకే మహాభారతం విశ్వవిజ్ఞాన కోశంగా రమణీయ కావ్యంగా అవతరించింది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని

"ధర్మేచార్థేచ కామేచ మోక్షేచ భరతర్షభ
యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి నతత్ క్వచిత్" - అని శ్లోకం వెలువడింది. - మహాభారతంలో లేని విషయం ఏదీలేదని, అందులో లేనిది ఎక్కడా లేదని భావం.

నన్నయ ప్రారంభించిన ఆదిసభా పర్వాలు, ఆరణ్య పర్వంలో సగభాగమూ అనువదించగా తిక్కన విరాట పర్వంనుంచి కొనసాగించి ఆంధ్ర మహాభారతంలో 15 పర్వాలు రచించాడు. శైవ వైష్ణవ భేదాలతో కొట్టుమిట్టాడుతున్న సమాజానికి హరిహరనాథుని పరిచయం చేసి భావ ప్రచారానికి తిక్కన పాటుపడ్డాడు. అందుకే మహాభారతాన్ని

" శ్రీయన గౌరినా,ఁబరగు చెల్వకు చిత్తము పల్లవింప, భ
ద్రాయిత మూర్తియై హరిహరంబగు రూపము దాల్చి విష్ణు రూ
పాయ నమశ్శివాయ యని పల్కెడు భక్తజనంబు వైదిక
ధ్యాయిత కిచ్చమెచ్చు పరతత్త్వము ఁగొల్చెద నిష్టసిద్ధికిన్" అని ప్రారంభించాడు.

తిక్కన విరాట, ఉద్యోగ, భీష్మ, ద్రోణ, కర్ణ, శల్య, సౌప్తిక, స్త్రీ,, శాంతి, అనుశాసనిక, అశ్వమేథ, ఆశ్రమవాస, మౌసల, మహాప్రస్థానిక, స్వర్గారోహణ అనే 18 పర్వాల్ని రచించాడు. నన్నయ వదలిన అరణ్య పర్వశేషాన్ని ఎర్రన అనువదించాడు.

**విరాట పర్వ ప్రాముఖ్యం :** 'వింటే భారతమే వినాలి. తింటే గారెలేతినాలి' అని నానుడి. గారెలు తింటే మానవులకు తుష్టి , పుష్టి కలుగుతాయి. అలాగే భారతం వింటే సాహిత్య ప్రయోజనాలయిన ఆనందమూ, ఉపదేశమూ కలుగుతాయి. విరాట పర్వాన్ని చదివితే వర్షాలు కురుస్తాయనే నమ్మిక తెలుగునాట బాగా ప్రచారంలో ఉన్నది. వర్షం సంగతి ఎలా ఉన్నా రసామృత వర్షం మాత్రం కురుస్తుందని సహృదయుల విశ్వాసం. సామాన్యంగా భారతంలో కనిపించే ఉపాఖ్యానాలు విరాట పర్వంలో కనిపించవు.

**పాఠ్యభాగ సందర్భం :** పాండవులు విరాట రాజు కొలువులో అజ్ఞాత వాసం చేస్తుండగా 'భీముడు కీచకుని చంపాడు. కీచకుని మరణ వార్త విని దుర్యోధనుడు పాండవులు విరాటుని కొలువులో ఉండి ఉంటారనే అనుమానంతో వారి అజ్ఞాత వాసాన్ని భగ్నం చెయ్యడానికి త్రిగర్త దేశాధీశుడైన సుశర్మ ఆధ్వర్యంలో దక్షిణ గోగ్రహాన్ని నిర్వహింపజేశాడు. అయితే విరాటుని తాకిడికి తట్టుకోలేక సుశర్మ సైన్యాలు పిక్కబలం చూపాయి. విరాటుని ఆలమందల్ని వలలుడు (భీముడు) మనలించుకొని వచ్చాడు. విరాటుని విజయవార్తను విన్న ప్రజలు మహోత్సాహంతో విజయోత్సవం జరుపుకొన్నారు. పాండవులు, విరాట మహారాజు ఒకానొక సైకత స్థలిలో వెండివెన్నెలలో ఆ రాత్రి గడిపారు.

దక్షిణ గోగ్రహణం పూర్తయిన మరుసటిరోజు దుర్యోధనుడు తనపక్షాన ఉన్న వీరులతో విరాటుని 'మత్స్య' నగరానికి ఉత్తరాన ఉన్న గోవుల్ని ముట్టడించటంతో ప్రస్తుత పాఠ్యభాగమైన 'ఉత్తర గోగ్రహణం' ప్రారంభమవుతుంది.

### 1.3.1 పాఠ్యభాగ వివరణ :

వైశంపాయన మహర్షి జనమేజయ మహారాజుకు ఈ విధంగా వివరిస్తున్నాడు.

"మహారాజా ! దక్షిణ గోగ్రహణం జరిగిన మరునాడే కౌరవ సైన్యం భీష్మ ద్రోణాది మహావీరులతో మత్స్య నగరానికి బాగా దగ్గరగా ఉన్న విరాటుని పశువుల్ని ముట్టడించింది. గోరక్షకులు వారిని ఎదిరించినా కృపాశ్వత్థామాది వీరులు గోపాలకుల్ని తిరుగులేని బాణాలతో నొప్పించి ఆలమందల్ని ఆక్రమించటంతో గోపాలకులు తమ మీద దాడిచేసింది కౌరవ సైన్యమని గుర్తించారు. గోపాలుర నాయకుడు రథంమీద విరాటుని రాజమందిరానికి వెళ్లి అక్కడ అంతఃపురంలో ఉన్న భూమింజయుని (ఉత్తరుని) చూసి ఇలా విన్నవించుకొన్నాడు.

"రాజకుమారా ! భూమండలమంతా దద్దరిల్లేటట్లు దుర్యోధనుని సేనలు వచ్చి మన గోగణాన్ని ముట్టడించాయి. వెంటనే వారిని మరలించి తీసుకురావటానికి ప్రయత్నించు. శత్రురాజుల్ని నీ బాణసమూహానికి గురిచెయ్యి. నీ భుజబలాన్ని ప్రదర్శించు. రథాన్ని సిద్ధం చేయించు. కవచాన్ని తెప్పించు. ధనుర్బాణాలను ఆయుధాన్ని సిద్ధం చేయించు. నీవు భుజబల సంపన్నుడవని, వంశోద్ధారకుడవని, భూమండలాన్ని పరిపాలించగల సమర్థుడవని, ఆపదలో ఉన్నవారిని రక్షించగలగిన వాడవని మీ తండ్రి నిన్ను గూర్చి పలుకుతూ ఉంటాడు. ఆ పలుకుల్ని రుజువు చెయ్యటానికి తగిన రీతిలో ప్రవర్తించు".

గోపాలుర నాయకుడు ఉత్తరుని అంతఃపుర కాంతలమధ్య ప్రశంసించేటప్పటికి అతనిలో యుద్ధోత్సాహం అతిశయించింది. గర్వాతిశయంతో ఈ విధంగా పలికాడు.

**ఉత్తరుని ప్రగల్భాలు :** కౌరవులు నన్నెదుర్కొన్నట్లయితే వారిని పిండిపిండి చేస్తాను. ఒక క్షణంలో మన గోవుల్ని మరలించి తెస్తాను. కాని నా రథానికి సారథిలేడనే విషయం నాకు విచారాన్ని కలిగిస్తున్నది. నా రథసారథ్యం చేయగలిగిన వాడు ఈ పట్టణంలో ఒక్కడైనా లేడా ? సమర్థత గలిగిన సారథి దొరికితే శత్రువుల్ని జయించడం ఒక లెక్కగాదు. కౌరవులు గోవుల్ని దూరంగా తోలుకొని పోయారేమో? ఎంతదైన్య స్థితి ప్రాప్తించింది. ఎక్కడైనా సారథి దొరుకుతాడేమో వెదకండి. దుర్యోధనుడు భీష్ముడు మొదలైన వారు నా విజృంభణను చూసి నన్ను అర్జునుడని భావించి కలత చెందేటట్లు ఎదిరించి, వారందరినీ జయించి గోవుల్ని మళ్లించుకొని రాకపోతే, రాజూ, మిత్రులూ, పరివారమూ మెచ్చుకుంటారా ? " అని ఉత్తరుడు ఎంతో ఉత్సాహంతో పలికాడు.

ఉత్తర కుమారుని పలుకుల్ని విన్న సైరంధ్రి కోపమూ, అపహాస్యమూ నిండిన మనస్సుతో అక్కడ జరిగిన విషయాన్ని మెత్తని పలుకులతో బృహన్నలకు తెలిపింది. అప్పుడు బృహన్నల అజ్ఞాత వాస సంవత్సరం దాటిపోయిందని నిర్ణయించి సైరంధ్రితో ఇలా అన్నాడు. "నీవు వెళ్లి వాళ్లతో "మన బృహన్నలకు సారథ్యం చేసే నేర్పు ఉన్నది. పూర్వం ఖాండవ దహన సమయంలో అర్జునునికి సారథిగా ఉండి అతని మెప్పు పొందాడు. ఇంకా ఎన్నో సమయాల్లో అతని రథం తోలటానికి ఇతడే ఉంటాడు. అతని సామర్థ్యం నాకు బాగా తెలుసు. అతని సహాయం ఉంటే కౌరవ సేనను గెలవడంలో సందేహం లేదు" అని చెప్పి ఇంకా వాళ్లు ఏమైనా అంటే దానికి తగిన రీతిలో మాట్లాడి ఎలాగైనా నన్ను పిలిపించే ఏర్పాటు చెయ్యి" అని బృహన్నల పలకగానే సైరంధ్రి అలాగే చేస్తానని చెప్పి ఉత్తర ఉన్న చోటుకు వెళ్లింది.

సైరంధ్రి ఉత్తరతో రాకుమారుడు సారథి కోసం వెతుకుతున్నాడు. కాబట్టి తనకు తెలిసిన విషయాన్ని చెప్పటం ధర్మం కదా అని బృహన్నల యుద్ధ రంగంలో అర్జునునికి సారథ్యం వహించిన నిపుణుడు, భుజశాలి అని పలికింది. ఈ విషయాన్ని ఉత్తరునికి తెలియజేద్దామని వారిద్దరూ ఉత్తరుని దగ్గరకు వెళ్లి బృహన్నల విషయాన్ని తెలపటంతో అతడు చిరునవ్వు నవ్వి "నన్ను గేలిచెయ్యటమెందుకు? నేను రెండు కళ్లూ విచ్చి పేడిని చూడడానికి కూడా అసహ్యించుకొంటాను కదా! యుద్ధంలో సారథ్యం చెయ్యటానికి ఎలా ఆజ్ఞాపిస్తాను" అని పలికాడు.

ఉత్తరుడు ఇంకా "అపారమైన కౌరవ సైన్యం ముట్టడికి వచ్చినప్పుడు పేడివాడైన బృహన్నల రథసారథి అయితే చూచిన వారు నవ్వరా ? ఈ పట్టణంలో రథం నడిపేవారే లేరా ?" అని పలకటంతో సైరంధ్రి "రాకుమారా! కేవలం కౌరవ సైన్యమే కాదు ముల్లోకాలూ

ఒక్కటై వచ్చినా రథం బృహన్నల వశంలో ఉంటే గెలుపును సాధించవచ్చు. అతని గొప్పతనం ఇంతకుముందే నాకు తెలుసు. ఏదో ఒక కారణం వల్ల శరీరంలో వికారం కలిగినంత మాత్రాన అతని ఆధిక్యం నశించదుకదా !'' అని పలికింది. అప్పటికి ఎవరూ దొరకక పోవడంతో ఉత్తరుడు బృహన్నలను సారథిగా నియమించుకోవటానికి అంగీకరించి అతనిని పిలిపించాడు.

ఉత్తర సౌకుమార్యమూ, కోమలత్వమూ స్ఫురించే రీతిలో రాజహంసలకే అనుసరణీయమైన నడకలతో నర్తనశాలకు వెళ్లింది. ఆమె వెళ్లిన తీరు మేఘంలోనికి మెరుపు ప్రవేశించినట్లున్నది. తన గురువైన బృహన్నలతో అభ్యర్థన, అణకువ, తొట్రుపాటు ముప్పిరిగొనగా ఈ విధంగా పలికింది.

"ఇంతకు ముందు ఒక యుద్ధంలో మా అన్న సారథి చనిపోయాడు. మళ్లీ తగిన సారథి దొరకకపోవడంతో ఎవరినీ సారథిగా స్వీకరించలేదు. ఇప్పుడు కౌరవులు ఆలమందల్ని ముట్టడించారనే వార్త వచ్చింది. సారథి ఉంటే బాగుంటుందని మా అన్న భావిస్తున్న సమయంలో సైరంధ్రి నీ గొప్పతనాన్ని చెప్పగా నిన్ను తీసుకురమ్మని మా అన్న నన్ను పంపించాడు. ఏ విధంగానైనా తీసుకువస్తానని చెప్పి వచ్చాను. నువ్వు అంగీకరించి ఆపద గట్టెక్కించాలి. నువ్వు ఒప్పుకోకపోతే నామీద వాత్సల్యం తగ్గినట్లే'' అన్నది. ఉత్తరమాటలు బృహన్నలకు ముచ్చట గొలిపాయి. అప్పుడు బృహన్నల నవ్వుతూ "రాకుమారీ ! నాకు సారథ్యం చేసే నేర్పు ఉందా ? కాదనటానికి భయం కలుగుతున్నది. సరేపద. భవిష్యత్తు అలా ఉందేమో ! నువ్వు ప్రార్థించావు కాబట్టి ఎన్ని కష్టాలు వచ్చినా వాటినన్నిటినీ తొలగించి సారథ్యమే కాదు ఏ పనైనా చేసి నీకు సంతోషాన్ని కలిగిస్తాను.'' అని పలికి మత్తగజంలా నర్తనశాలనుంచి బయటకు నడిచాడు.

**ఉత్తరుడు బృహన్నలను సారథిగా చేసుకోవటం :** బృహన్నల రావటాన్ని దూరంనుంచే గమనించి ఉత్తరుడు "కౌరవులతో నాకు యుద్ధం వచ్చింది. నువ్వు సారథివి కావాలి. వెంటనే రా. కవచం తొడుక్కో. రథమెక్కు. నీకు తప్పించుకోవటం కుదరదు. నీ పరాక్రమం, గొప్పతనం మాకు సైరంధ్రి తెలియజేసిందని పలికాడు. అతని పలుకుల్ని విన్న బృహన్నల ఆటపాటల విషయంతో నను పిలిపిస్తే సమంజసంగా ఉంటుందికానీ, యుద్ధానికి రావలసిందని, సారధ్యాన్ని నిర్వర్తించవలసిందని చెప్పటం తగదని రథాన్ని నడపటానికి బాహుబలాఢ్యుడైన వేరొకరిని నియమించుకోమని చెప్పాడు.

ఉత్తరుడు బృహన్నలతో ఖాండవ దహన సమయంలో ఇంద్ర తనయునికి రథం నడిపి విజయాన్ని చేకూర్చిన గొప్పతనం నీలో నశించిందా ? వేరొక మాట పలుకవద్దు. యుద్ధానికి సిద్ధం కావలసింది'' అని పలకటంతో అతని మాటలకు భయపడినట్లు నటించి బృహన్నల రథసారధ్యానికి అంగీకరించటంతో బృహన్నలకు గట్టి కవచాన్ని తెప్పించి తొడుగుకోమనటంతో బృహన్నల దాన్ని వ్యత్యస్తంగా తొడుగుకొని అక్కడ ఉన్న స్త్రీలందరినీ నవ్వింపజేసాడు. ఉత్తరుడు కూడా మరో కవచం ధరించి బృహన్నలతో రథాన్ని గుర్రాలను, జెండాను సిద్ధం చెయ్యవలసిందని చెప్పి వెంటనే విజయాన్ని సాధించి పురజనుల అభినందనల్ని పొందాలని చెప్పాడు.

బృహన్నల ఉత్తరునితో "నీవు ఎలా చెబితే అలా చేస్తానని పలికి జవనాశ్వాలతో రథాన్ని సిద్ధంచేసి సింహ ధ్వజాన్ని ఎగురవేశాడు. అప్పుడు ఉత్తర, ఆమె చెలికత్తెలు తమ బొమ్మ పొత్తికలకు కౌరవ వీరుల తలపాగల్లో చిత్ర వర్ణ భాసురమైన వస్త్రాల్ని తీసుకు రావలసిందిగా కోరారు. "విజయలక్ష్మిని పొందే రాకుమారునికి బొమ్మ పొత్తికలు తీసుకురావటం ఏమంత కష్టమైన పని? చూస్తూ ఉండండి అన్ని రకాలు తెస్తాము'' అని బృహన్నల వారిని ఆనందింపజేసాడు.

బృహన్నల సమస్తాయుధాలతో రథాన్ని సిద్ధం చేశాడు. ఉత్తరుడు పశువుల్ని కౌరవులు పట్టుకొన్న దిక్కు ఏది?'' అని గోపాలుర నాయకుని అడగటంతో వాడు 'శ్మశానం వైపు' అని చెప్పాడు. రథం సాగబోతున్న సమయంలో పౌరులు, పెద్దముత్తయిదువులు, బ్రాహ్మణులూ బృహన్నలను చూసి "పూర్వం ఖాండవ దహన సమయంలో అర్జునునికి ఎటువంటి శుభం కలిగిందో అలాంటి శుభమే ఇప్పుడు ఉత్తరునకు కలుగుగాక!'' అని దీవించి అక్షతలు చల్లారు. శ్మశానం వైపు వెళ్లిన సమయంలో ఉత్తరుడు భయంకరంగా నడుస్తున్న కౌరవ సైన్యాన్ని చూశాడు.

**ఉత్తరుడు కౌరవ సేనను చూసి భయపడటం :** ఆ సైన్యం భూమి కృంగిపోతున్న రీతిలో నడవటాన్ని చూసిన ఉత్తరునకి భయంకలగటంతో తొట్రుపాటుతో బృహన్నలతో "ఈ సైన్యం భీష్మ, ద్రోణాది వీరులతో భయంకరంగా ఉన్నది. దుర్యోధనుడనే గ్రీష్మాదిత్యుడు తీక్షణంగా ఉన్నాడు. శస్త్రాస్త్రాల వేడిమి విస్తరించిన చతురంగ బలం ఉగ్రంగా ఉన్నది. ఎత్తిన ధ్వజాల రెపరెపలు అగ్నిజ్వాలల్లా ఎగసిపడుతున్నాయి. ఇలాంటి భయంకరమైన సైన్యాన్ని నేను సమీపించగలనా?" అస్త్రవిద్యా నైపుణ్యంలేని నేను ప్రసిద్ధులైన కౌరవ వీరుల్ని ఎదురించి నిలవగలనా? తెలియక ఇక్కడకు వచ్చాం భయం కలుగుతున్నది. కౌరవ సైన్యాన్ని చూసి శరీరమూ, మనసూ వణుకుతున్నాయి. నీవేమో రథాన్ని తోలుకుపోతున్నావు. ప్రస్తుత స్థితిని పరిశీలిస్తే వీళ్లను నేను ఎదిరించలేననటం నిజం. కాబట్టి రథాన్ని వెనక్కి త్రిప్పు. ప్రాణం మీద తీపిలేని వారుంటారా?" అని చెప్పటంతో బృహన్నల చిరునవ్వు నవ్వుతూ ఇలా అన్నాడు.

"రాకుమారా ! సాటిలేనిదిగా ఉన్న కౌరవ సైన్యం మీదికి వెళ్లటానికి నేనేమైనా వెర్రివాడనా? మన గోసంపదను ముట్టడించి తోలుకుపోతున్న అల్పసేనను ముట్టడించి గోసంపదను మళ్లించుదాం. వాటిని విడిచి వెళ్లటం ధర్మం కాదు. అంతఃపురంలో స్త్రీలందరికీ గోవుల్ని మరలించు కొని వస్తానని చెప్పి ఇప్పుడు భయపడటం మంచిది కాదు. "వెంటనే ఉత్తరుడు వణుకుతున్న గొంతుతో "పశువుల మాట దేవుడికి తెలుసు. స్త్రీల సంగతి నాకెందుకు? నేను మాత్రం యుద్ధం చెయ్యలేను." అని పలికాడు.

బృహన్నల ఉత్తరునితో "తన భుజబలమూ, శత్రువుల బలమూ పరీక్షించి అంటే కొంతసేపు పోరాడి ఎటూ తెగక సాధ్యం కాకపోతే అప్పుడు వెనకకు తిరిగి వెళ్లటం లోకధర్మం. శూరులయితే దీన్నికూడా మెచ్చుకోరు. కౌరవ బలం ఇంతవరకూ నీవైపు తేరిపార చూడనయినా లేదు. అప్పుడే నీకింత భయం కలగటానికి కారణమేమిటో చెప్పు. యుద్ధంలో ఎన్ని కష్టాలు కలిగినా తట్టుకొని ధైర్యంతో శత్రువుల్ని గెలిస్తేనే సత్కీర్తి కలుగుతుంది. కానీ సైన్యం దూరంగా ఉండగానే ఇలా భయపడి పారిపోతే నవ్వరా?" అని పలికాడు. అప్పుడు ఉత్తరుడు దక్షిణగోగ్రహణం కారణంగా తన తండ్రి సుశర్మ మీదకు వెళ్లడంతో నగరంలో మనకు సహాయం వచ్చేవారెవరూ లేకపోవడంవల్ల ఇలా ఒంటరిగా వచ్చి కౌరవ సైన్యాన్ని ఎదిరించవలసివచ్చింది. కాని వారిని ఎదిరించటం నావల్లకాదు. రథాన్ని తిప్పుకొని పట్టణానికి వెళ్లటమే మంచిది" అన్నాడు. అప్పుడు బృహన్నల "ఇలా వెళ్లడం పిరికితనంకాదా? నన్ను గురించి సైరంధ్రి ఎంతో గొప్పగా నీకు చెప్పింది. పౌరులంతా ఆశీర్వదించి పంపారు. ఇప్పుడు గోవుల్ని వదలి ఊరికే తిరిగిపోతానా? అసలు నీకు భయమెందుకు? నేనున్నాను కదా!" అని అభయం ఇచ్చినా "నీ కొవ్వు అరగక పోతే యుద్ధం చెయ్యి" అని పలికిన ఉత్తరుడు రథం దిగి పట్టణం వైపు పరుగెత్తాడు. అలా పరుగెత్తుతున్న ఉత్తరుని జూచి అసహ్యించుకొని బృహన్నల గుర్రాల పగ్గాలను నొగలకు కట్టి అతని వెనుక సహజ గాంభీర్యంతో నడుస్తున్న బృహన్నలను చూసిన కౌరవ సేనలు ఇతడు 'నివురు గవిసిన నిప్పులా ఉన్నాడని' అతని ఆడరీతిని పురుషాకృతిని గుర్తించి పలికారు. అతని వాలకం అర్జునునిలా ఉన్నదని, విరాటుని కొలువులో అజ్ఞాతవాసంలో అర్జునుడు పేడిరూపంలో ఉన్నాడేమో లేకపోతే కౌరవులతో కయ్యానికి మరొకడైతే ఒంటరిగా రాగలడా? దక్షిణ గోగ్రహణం వల్ల విరాటుడు తన సైన్యాన్ని తీసుకొని వెళ్లడంతో ఎవరూలేక పోవటంతో ఉత్తరుడు ఇతన్ని తీసుకొని వచ్చిఉంటాడు. వెనుకాముందూ తెలియని వాడు కావటంతో ఉత్తరుడు అహంభావంతో వచ్చి మన సైన్యాన్ని చూసి పారిపోతున్నాడు. పక్కనున్న ఆ మహాపురుషుని శౌర్యమూ, బలమూ ఇతనికి తెలియవు." అని అనుకొంటున్న సమయంలో బృహన్నల వంద అడుగుల్లో ఉత్తరుని వెంటాడి పట్టుకొనగా తనను వదలవలసిందని ప్రార్థించి బృహన్నలకు (పట్టణంలోనికి వెళ్లిన తర్వాత) కానుకలిస్తానని వెలవెలబోతూ పలికాడు. " మా అమ్మకు సంతోషం కలిగేటట్లు వెళ్లి ఆమెను చూస్తాను. బృహన్నలా నన్ను పోనివ్వు" అన్నాడు.

**అర్జునుడు ఉత్తరుని తనకు సారథిగా చేసుకోవడం :** కౌరవ సైన్యాన్ని చూచి భయపడుతున్న ఉత్తరునితో "ఉత్తర కుమారా! భయపడవద్దు. నీకు యుద్ధం చెయ్యటం చేతకాకపోతే ఊరుకో. నా రథానికి సారథిగా ఉండు. అగ్ని పిడుగులా విజృంభించి కౌరవ సైన్యాన్ని పిండి చేస్తాను. దుర్యోధనుని ధైర్యాన్ని పటాపంచలు చేస్తాను" అని పలికి ఉత్తరునికి ఇష్టం లేకపోయినా అతన్ని రథం ముందు భాగంలో కూలవేసి అర్జునుడు తానూ రథమెక్కి జమ్మిచెట్టు దగ్గరకు సంతోషంగా బయలుదేరాడు. అర్జునుడు తాము ఆయుధాలు దాచిన జమ్మిచెట్టు దగ్గరకు వెళ్లేటప్పుడు పేడి రూపంలో ఉన్నా భయంకరంగా ఉన్న అతన్ని జూచి కౌరవ సైనికులు కలత చెంది నిశ్చేష్టితులయ్యారు. వారినీ అప్పుడు కనపడే ఉపద్రవాలనూ చూసి ద్రోణుడిలా అన్నాడు.

"సూర్యుడు మాసిపోయాడు. నక్కలు కూశాయి. మేఘాలు అన్ని దిక్కుల్లోను వింత కాంతుల్ని వ్యాపింపజేశాయి. వాద్యాలు తమంత తాము అపస్వరాలు పలికాయి. జెండాలు నిష్కారణంగా వంగిపోతున్నాయి. ధైర్యం సడలుతున్నది. దిక్కులంతటా ధూమం వ్యాపించింది. మనకు యుద్ధం తప్పదు. ఆయుధాలు సిద్ధంగా ఉంచుకోండి. చేతనయినంత వరకూ నిర్భయంగా గోవుల్ని రక్షించుకోండి" అని పలికి తాను అర్జునుణ్ణి గుర్తించాడు కాబట్టి అజ్ఞాత వాససమయ భంగమవుతుందేమోనని భయంతో భీష్ముని వంక చూసి మెల్లగా ఇలా అన్నాడు. "ఇతడెవరో అమాయకంగా ఒంటరిగా చెట్టుపేరుతో వస్తున్నాడు. అహంభావం తప్ప మరొకటి కనబడటం లేదు. లక్షణాలు చూస్తే ఇంద్రునిలా ఉన్నాడు. కాని వీడు మనసులో ఏమనుకుంటున్నాడో తెలుసుకోవాలి." ఈ విషయాన్ని గుర్తించిన భీష్ముడు దుర్యోధనుని వైపు చూస్తూ శత్రువులకు అనుకూలమైన ప్రాంతాన్ని దాటి వచ్చాము. బాహుబలాన్ని ప్రకటించే సమయం ఆసన్నమైంది. శత్రువులకింక భయపడవలసిన పనిలేదు." దీని అర్థాన్ని గ్రహించిన ద్రోణుడు మళ్ళీ ఇలా అన్నాడు.

"ఆకలితో ఉన్న సింహం గుహలోనుంచి బయటకు వచ్చినప్పుడు ఏనుగుల మూకను చూసినప్పుడు ఎంత కోపంతో మీదకు దూకుతుందో అలాగే అర్జునుడు మన మీదకు వస్తున్నాడు. ఇతన్ని ఎదిరించగలవాడు మన సైన్యంలో ఉన్నారా? ఈశ్వరుణ్ణే తృప్తి పరచిన ధన్యజీవి అర్జునుడు." ఈ మాటల్ని కర్ణుడు సహించలేక పాండవపక్షపాతంతో ఇలా మాట్లాడటం మంచిదికాదు. అర్జునుడంత గొప్పవాడా? అతడేవస్తే అతని బాధించి మన వారికి సంతోషం కలిగిస్తాను" అన్నప్పుడు దుర్యోధనుడు కర్ణునితో ఇలా అన్నాడు.

"కర్ణా ! నువ్వు తప్పు మాట్లాడావు. ఇతడు అర్జునుడే అయితే సోదురులతో అడవికి వెళ్లి పన్నెండు సంవత్సరాలు అక్కడే ఉండాలి. అర్జునుడు కాకపోతే నా బాణ పరంపరతో అతన్ని చిటికెలో సంహరిస్తాను." ఆ మాటలకు అక్కడి వారంతా సంతోషించారు.

**అర్జునుడు శమీ వృక్షం మీద ఉన్న గాండీవాన్ని స్వీకరించటం :** అర్జునుడు ఉత్తరునితో రథాన్ని జమ్మి చెట్టు దగ్గర ఆపమని ఇలా అన్నాడు. ఈ చెట్టు మీద గాండీవం ఉంది. అది తప్ప పొట్టివి, తక్కువ బలం కలిగినవి అయిన ధనుస్సులు నా భుజబలోద్రేకానికి తగవు. ఈ ధనుస్సులు ఆయుధాలు నీశక్తికి తగినవి. నా విన్యాసానికి తగవు. అదిగో ఆ విల్లుచూడు అది లక్ష ధనుస్సుల పెట్టు" అన్నాడు. ఈ ఆయుధాలతో యుద్ధంలో నైపుణ్యాన్ని ప్రదర్శించలేము అని రథం మీద ఉన్న ఆయుధాల గూర్చి చెప్పి చెట్టు మీద ఉన్న పెద్దవిల్లును తెచ్చి ఇవ్వు. పాండవులు తమ ఆయుధాల్ని ఈ చెట్టుమీద పెట్టారు. ఆ కట్టవిప్పి అందులో గాండీవం తీసుకొని మిగిలిన వాటిని ఎప్పటిలాగే బంధించు" అని శవంలా ఉన్న ఆయుధాల కట్టను చూపించాడు. "అప్పుడు ఉత్తరుడు అర్జునునితో రాకుమారుడనైన నన్ను నీచపు పనికి ఆజ్ఞాపించటం తగునా? పాపం కదూ !" అన్నాడు. అప్పుడు అర్జునుడు అది శవం కాదని ఆయుధాల కట్ట అని చెప్పాడు. త్వరగా జమ్మి చెట్టు ఎక్కి కట్టవిప్పి గాండీవం నాకు అందించు" అనటంతో చేసేదేమీ లేక ఉత్తరుడు మెల్లగా చెట్టెక్కాడు. ఉత్తరుడు కట్టవిప్పటంతో ఆయుధాల కాంతులు మిరుమిట్లు గొల్పాయి. అప్పుడు ఉత్తరుడు సారథీ అని అర్జునుని పిలిచి ఇలా అన్నాడు.

" ఈ విల్లు ఆశ్చర్యాన్ని కలిగిస్తూ కొండచిలువా అన్నట్లుంది. దీనిపైన బంగారు పద్మాలు పొదిగారు. దీని కాంతి అంతటా వ్యాపిస్తుంది. పాండురాజు కుమారుల్లో ఎవరెవరు ఏయే ఆయుధాల్ని ధరించేవారో చెప్పవలసిందని అర్జునుని అడిగాడు. అప్పుడు అర్జునుడు "ముందుగా నువ్వు నన్నడిగిన ఆ విల్లు గాండీవం. అర్జునునికి రక్షణ అదే. దానివల్లనే అతడు యుద్ధంలో దేవదానవుల్ని అవలీలగా జయిస్తాడు. దీన్ని బ్రహ్మ, ప్రజాపతి, ఇంద్రుడు, చంద్రుడు, వరుణుడు, అగ్నిదేవుడు పూర్వం ధరించేవారు. అగ్ని అర్జునునికి ఖాండవ దహన సమయంలో ఇచ్చాడు" అని పలికి ధర్మరాజాదుల ఆయుధాల్ని గూర్చి కూడా వివరించాడు.

అర్జునుడు ఉత్తరునికి తనను తాను తెలియజేయటం అనేకాయుధాల్ని గూర్చి అర్జునుడు వివరించగా అతన్ని గుర్తించలేని ఉత్తరుడు పాండవులు ఆయుధాల్ని వదలి ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించి మళ్లీ "నేను ఆ మహానుభావుల మేనల్లుణ్ణి. వారు నాకు పూజ్య మిత్రులు. వారు శత్రువుల గర్వం అనే అంధకారానికి సూర్యుల వంటివారు. బంధువులకు మేలు చేస్తారు. "ఆ పాండవులెక్కడ ఉన్నారో? ద్రౌపదికి ఎన్నికష్టాలు కలిగాయో? ధర్మరాజు ఎన్నో కష్టాలు అనుభవించాడు. పాండవుల మాట ఎక్కడా వినిపించటంలేదు.

ఇప్పుడు నీ నోటినుంచి ఏమి వింటానో'' అని పలకటంతో అర్జునుడిలా అన్నాడు. వాళ్లను గూర్చి విచారించాల్సిన పనిలేదు. అజ్ఞాత వాసంలో మన ఊళ్లో ఆపద లేకుండా ఉన్నారు. వారెవరో చెబుతా విను. కంకుభట్టు ధర్మరాజు. వలలుడు భీముడు. అశ్వశిక్షకుడు నకులుడు. గోరక్షకుడు సహదేవుడు. చెప్పటం మొదలుపెట్టానుగా ఇంకా దాచటం ఎందుకు అర్జునుణ్ణి నేనే. మాలిని ద్రౌపది. ఆమె కోసమే భీముడు కీచకుని, ఉపకీచకుల్ని గంధర్వులు చంపారనే నెపంతో భయంకరంగా చంపాడు.'' ఈ మాటలకు సంభ్రమాశ్చర్యాల్లో మునిగిన ఉత్తరుడింకా ఇలా అన్నాడు. "అర్జునునికి పదిపేర్లున్నాయి. తడుముకోకుండా వాటిని చెప్పు. అనగానే అర్జునుడు చిరునవ్వుతో అర్జునుడు, ఫల్గునుడు, పార్థుడు, కిరీటి, శ్వేత వాహనుడు, బీభత్సుడు, విజయుడు, జిష్ణువు, సవ్యసాచి, ధనంజయుడు, అనే ఈ పది నా పేర్లు'' అన్నాడు . అప్పుడు ఉత్తరుడు ఏ కారణంగా ఈ పదిపేర్లు వచ్చాయో చెప్పుమన్నాడు. అర్జునుడు ఇలా చెప్పాడు. "భూమినంతా జయించి ధనం స్వీకరించటం వల్ల ధనంజయుడు, ఎంతటి వారినైనా యుద్ధంలో జయించటం వల్ల విజయుడు అనే పేర్లు వచ్చాయి. రథానికి తెల్లని గుఱ్ఱాలు ఉండటం వల్ల శ్వేత వాహనుడు, ప్రకాశించే కిరీటం నెత్తి మీద ఉండటం వల్ల కిరీటి, యుద్ధంలో బీభత్సం కలిగించే సమయంలోనూ తడబడకుండా బీభత్సం కలిగించకుండా ఉండటం వల్ల బీభత్సుడూ, రెండు చేతులతోనూ గాండీవాన్ని లాగగలను. ఎడమచేతితో బాగా లాగగలను కాబట్టి సవ్యసాచి. అవదాత వర్ణం కలిగి ఉండటం వల్ల అర్జునుడు, ఉత్తర ఫల్గునీ నక్షత్రంలో పుట్టటం వల్ల ఫల్గునుడు, యుద్ధంలో ఎవరినైనా పరిమారుస్తాను కాబట్టి జిష్ణువు, పృథ (కుంతి) కుమారుని కావటంతో పార్థుడు అని, తనకు కలిగిన పేర్లను గూర్చి వివరించాడు.

"ఖాండవ దహన సమయంలో శివుడూ బ్రహ్మ ప్రత్యక్షమై కృష్ణుడనే పదకొండో పేరు, ఎదురులేని బాణాలు ఇచ్చారు. ఇంద్రుడు కిరీటం ఇచ్చాడు. దేవతలు ఇచ్చిన నా శంఖానికి దేవదత్తమని పేరు. ఎంతమంది నన్ను ఎదిరించినా నా బలం తరగదు. 14 వేలమంది గంధర్వుల్ని జయించి దుర్యోధనుని (ఘోషయాత్రలో) విడిపించాను. కౌరవుల్ని ఓడించి ఆవుల్ని మళ్లిస్తా. నువ్వు భయపడకు'' అని అర్జునుడు పలకటంతో ఉత్తరుడు చెట్టుదిగి అర్జునుడికి పాదాభివందనం చేసి నమస్కరించి ఇలా అన్నాడు.

**ఉత్తరుడు బృహన్నలను అర్జునునిగా తెలుసుకోవటం :** "భుజబలంతో సాటిలేని అర్జునా ! నువ్వు నాకిలా కనిపించటం నాభాగ్యదేవత నన్ను కరుణించటమే. నా మనస్సులో మోహం పోయి సంతోషం వికసిస్తున్నది. నిన్ను అనవసరంగా మాట్లాడి నొప్పించినందుకు దయతో చూడు.'' ఈ మాటల్ని విన్న అర్జునుడు రథందిగి ఉత్తరుని కౌగలించుకొన్నాడు. ఇంకా ఉత్తరుడు అర్జునునితో "అర్జునా నా మనసు నిర్మలైంది. యుద్ధంలో సారథ్య నైపుణ్యం ప్రదర్శిస్తాను. దుర్యోధనుని పారద్రోలి ఆవుల్ని మళ్లించు. నీకు సారథ్యం చెయ్యాలనే నాచిరకాల వాంఛ నెరవేరింది'' అని పలికాడు.

ఉత్తరుని మాటలకు సంతోషించి అర్జునుడు "నువ్వంటే నాకెంతో ఇష్టం. నిన్నుగానీ, గుఱ్ఱాల్ని గానీ తాకేందుకు కనీసం గాలిని కూడా రానివ్వను. శత్రువుల్ని గూర్చి నువ్వు చింతించవలసిని పనిలేదు'' అని పలకటంతో "నువ్వు అర్జునుడని తెలిసినప్పుడే నా రోగాలన్నీ పోయాయి. నీకు పేడి రూపం కలగటానికి కారణం తెలుసుకోవాలని ఉంది. అన్నాడు. "ఊర్వశి శాపం వల్ల ఆ రూపం కలిగిందని ఇక మీదట ఉండదని చెప్పటంతో అర్జునునితో ఉత్తరుడు సంతోషంగా ఇలా అన్నాడు 'నామీద ప్రేమతో నువ్వు ఇలా చెప్పావు. ఇక దేవతలకైనా జంకను. నా పనేమిటో ఆజ్ఞాపించు' అనటంతో గాండీవమూ కాంచన పుంఖాలుకల బాణాలున్న రెండు అమ్ముల పొదులు, నా కవచం, నా కత్తి తీసుకొని మిగిలినవాటిని ఎప్పటిలాగా కట్టి పెట్టి రమ్మనటంతో అలాగే చేశాడు. అర్జునుడు ఆ ఆయుధాల దేవతకు భక్తితో నమస్కరించి ఆయుధాలు తీసుకొని ప్రకాశంతో కూడిన రూపం పొందాడు. ఇంద్రుడిచ్చిన కుండలాలు, తలపాగా తలచుకోగానే వచ్చాయి. వాటిన ధరించి రథమెక్కాడు. వరప్రభావం వల్ల అర్జునుని శిరస్సుపై కిరీటం దానంతట అదే తలమీద పుట్టినట్లుగా కాంతులు విరజిమ్మింది.

అర్జునుడు సమస్తాయుధాలు సిద్ధం చేసుకొని గాండీవాన్ని ఎక్కుపెట్టి పిడికిట పట్టుకొని ధనుష్టంకారం చెయ్యగానే ప్రకృతి కలతచెందింది. అర్జునుడు అగ్నిహోత్రుని తలచుకోవటంతో కపిధ్వజాన్ని పంపాడు. వెంటనే అర్జునుడు ఉత్తరుని సింహపతాకాన్ని జమ్మిచెట్టు మీద పెట్టించాడు. కపిధ్వజాన్ని రథానికి కట్టించగానే దేవదత్తం ప్రత్యక్షమైంది. అర్జునుడు సవినయంగా స్వీకరించాడు. ఉత్తరుడు అశ్వాల్ని సిద్ధం చేసుకొని వాటి జవసత్త్వాన్ని ప్రశంసించాడు.

**అర్జునుడు ఉత్తరుని సారథ్యంలో దేవదత్తం పూరించడం :** అర్జునుడు జమ్మిచెట్టుకు ప్రదక్షిణంగా రథాన్ని పోనివ్వు మనటంతో ఉత్తరుడు అలాగే చేశాడు. ఆవుల మందలు దూరంగా పోయాయి కాబట్టి త్వరగా రథాన్ని తోలమనటంతో ఉత్తరుడు రథాన్ని, త్వరగా తోలడం మొదలు పెట్టాడు. అప్పుడు అర్జునుడు యుద్ధోత్సాహంతో పిడుగులు పడ్డట్లుగా శంఖాన్ని పూరించాడు. ఆ శంఖనాదంతో సప్తసముద్రాలూ కలతచెందాయి. భూమి కంపించింది. దిక్కులు పిక్కటిల్లాయి. అమరావతి అల్లాడిపోయింది. పాతాళం క్షోభించింది. గ్రహాలు, నక్షత్రాలు గతులు తప్పాయి. బ్రహ్మ కూడా కదలిపోయాడు. గుర్రాలు చేష్టలుడిగి నేలమీద కూలబడ్డాయి. ఉత్తరుడు నొగల మీద చతికిలబడి మూర్ఛిల్లాడు. అర్జునుడు గుర్రాల్ని నిమిరి ఉత్తరుని లేవదీసి గాఢంగా కౌగలించుకొని రాకుమారులకు శంఖధ్వానాలు భేరీనాదాలు, గజఘీంకారాలు కొత్తవి కాదు కదా! ఎందుకింత భయం అనటంతో ఉత్తరుడిలా అన్నాడు. పూర్వం ఎన్నో ధ్వనులు విన్నాను. కానీ ఇలా చిత్తభ్రాంతిని కలిగించే ధ్వనిని వినలేదు. ఈ పెద్దధ్వనిని సహించలేను. చెవులు చిల్లులు పడ్డాయి. గుండెనీరయింది. నా వ్యాకులత ఎలా పోతుంది?''

ఉత్తరుని మాటల్ని విన్న తగిన పలుకులతో అతని కలత తీర్చి రథాన్ని నడపమని చెప్పి మళ్లీ శంఖాన్ని పూరించాడు. ఉత్తరుని ధీరునిగా చేసుకొని అర్జునుడు సాగుతుండగా అర్జునుడు విజృంభణకు కలతచెంది ద్రోణుడు దుర్యోధనునితో "మనల్ని ఇంతగా కలత చెందింప జేసినవి నిస్సందేహంగా గాండీవమూ, దేవదత్తమూ, కపిధ్వజమూ, ఇంద్రుడిచ్చిన కరీటమూ అయి ఉంటాయి. ఆశ్చర్యకరమైన పరాక్రమాధిక్యంతో యుద్ధాన్ని కోరి వస్తున్న అతడు అర్జునుడే. మాటలతో కాలం గడపవద్దు. చక్కని శూరుల్ని యుద్ధానికి సిద్ధం చెయ్యి'' అని పలికాడు. కృపుడు, అశ్వత్థామ మొదలైన వీరుల వంకచూసి "మనకు దుశ్శకునాలు కనిపిస్తున్నాయి. మన గెలుపు సందేహాస్పదమే. అయితే చేయదగ్గపని ఒకటి చెబుతాను వినండి. ముందు రాజును పెట్టి సేనలు కలిసిపోయి సమ్మర్దంతో భయపెట్టకుండా ఆలమందల్ని నడిపించేటట్లు ఆజ్ఞాపించి, మనం అంతా కొంత సైన్యంతో వెనుక వెళుతూ ఉంటే అర్జునుడు దగ్గరకు వచ్చినపుడు వెనుదిరిగి యుద్ధం చెయ్యవచ్చు'' అని పలికాడు.

ద్రోణుని మాటల్ని విని దుర్యోధనుడు భీష్ముడు, కృపుడు, కర్ణుడు, వికర్ణుడు మొదలైన వారి వంక జూసి 'అజ్ఞాత వాస సంవత్సరం ఇంకా కొంత మిగిలి ఉండగానే అర్జునుడు తన్ను తాను బయటపెట్టుకొన్నాడు. కాబట్టి ఎప్పటి లాగా వనవాసానికి వెళ్లాలి. దీనిలో ఎక్కువ తక్కువలు నిరూపించి చెప్పటానికి భీష్ములవారు అర్హులు. వచ్చింది అర్జునుడైనా ఎవరైనా ఆయుధాల్ని సిద్ధం చేసుకోండి. శత్రువును చూసి ఒకరి ముఖాలొకరు చూసుకొంటే సరిపోతుందా ?'' అని పలికాడు.

**దుర్యోధనుడు ద్రోణాచార్యుని అధిక్షేపించడం :** "ఎవరైనా వింటే నవ్వుతారని కూడా తెలుసుకోకుండా ద్రోణుడు అర్జునుని చూపించి మనసైన్యం నీరసించేటట్లు పలికాడు. గుర్రాల సకిలింపులూ అనుకూలమైన గాలి మనకు విజయాన్ని సూచిస్తున్నాయి. అర్జునుని పెద్దచేసి ద్రోణుడు భట్రాజు లాగా పొగడటం ఎందుకు? ద్రోణాచార్యులు కార్యాన్ని దూరంనుంచి చూస్తారు. అందువల్ల యుద్ధ విధానాన్ని గూర్చి వారిని అడగకూడదు. వారిని యుద్ధంలో వెనుక ఉంచితే మన విజయాన్ని కాంక్షిస్తారు. అది మంచిది'' అని దుర్యోధనుడు పలకటంతో అశ్వత్థామ ఇలా అన్నాడు.

"గోపాలకుల్ని గెంటి ఆవుల్ని పట్టుకోగానే సరిపోదు. నువ్వు ఇంకా ఇంటికి కూడా చేరలేదు. శత్రువులు విజృంభణనూ అణచలేదు. కనీసం సైన్యం దెబ్బతినకుండా తప్పించుకొనైనా వెళ్లలేదు. యుద్ధంలో రాజ్యాన్ని జయించిన వాడు కూడా ఇలా మాట్లాడడు. జూదంలో రాజ్యాన్ని లాక్కొని దుర్భాషలాడతావేం? సమయం వచ్చింది. పూర్వంలా జూదం చెల్లదు. పూర్వం ద్రౌపదిని సభలోనికి తెప్పించింది పాండవుల్ని జయించి కాదు గదా! శకుని మోసంతో కాదూ ! ఇప్పుడు కూడా ఆ వచ్చే శత్రువుని ఆ శకునే మరలిస్తాడులే. అవమానితుడు కాబట్టి కౌరవులకు అగ్ని హోత్రుడైన కపిధ్వజుడు వచ్చాడు. ద్రోణుని అధిక్షేపించగలవు గాని దుర్జయుడైన అర్జునుని ఎదిరించగలవా? లోకోత్తరుడయిన అర్జునుని ఎవరైనా పొగడవలసిందే. అలాంటప్పుడు పుత్ర సమానంగా భావించే ప్రియశిష్యుని మెచ్చుకోవటం గురువు తప్పా ? ఇక సిగ్గువిడిచి యుద్ధం చేసినా ఆ ద్రోణుడే చేస్తాడు. కాని నేను మాత్రం దీన్ని సహించలేను. అంతేగాకుండా యముడుగాని, బడబాగ్నిగాని, మృత్యువుగాని విజృంభిస్తే ఇంకా కొంత మిగల్చవచ్చేమో కానీ అర్జునుని బాణాలు మాత్రం ఒక్కటి కూడా మిగల్చవు. అర్జునుడు బాణవర్షం కురిపిస్తాడు. కాని పాచికలు వెయ్యడు. ఆవుల వెంట విరాటుడు వస్తే ఎదిరిస్తాం. అర్జునుడైతే అతని సమీపానికి కూడా వెళ్లం.'' అని నిర్భయంగా పలికాడు.

అశ్వత్థామ పలుకులు కర్ణునికి కోపం తెప్పించగా అతడు వీరుల సమూహాన్ని చూసి "ఆలమందల్ని పట్టుకోవటానికి వచ్చి అర్జునుని చూచి భయపడి బిగ్గరగా అతన్ని పొగడుతూ రాజును వెర్రివానిగా చెయ్యటం మంచిది కాదు. మీకు భయం కలిగితే అలాగే ఉండండి. ఒక వీరునికి ఒక వీరుడు చాలు. కపిధ్వజాన్ని క్షణంలో కూల్చివేస్తా. దానిమీద ఉన్న పిశాచాల్ని పారదోలి నారదుని ప్రశంసలు పొందుతా. అర్జునుని శరీరంలో అనేక బాణాలు నింపుతా. నా రౌద్రమూర్తిని చూపిస్తా. మీరందరూ నిస్సంకోచంగా చూడండి. అర్జునుడనే అగ్నిని బాణవర్షంతో ఆర్పివేస్తా. అర్జునుడూ నేనూ భుజబల పరాక్రమాన్ని ప్రకటించటం సముచితంగా ఉంటుంది. దుర్యోధనుని రుణం తీర్చుకోవటానికి, నా ప్రతిజ్ఞను నెరవేర్చుకోవటానికి, ప్రజల సందేహాన్ని తీర్చటానికి (కర్ణార్జునులలో ఎవరుగొప్ప) పరశురాముని దయతో పొందిన విద్యను సార్థకం చేసుకోవటానికి తగిన సమయం వచ్చింది. ఈ రోజు నాకు పుణ్యదినం. యుద్ధం చూడాలనిపిస్తే చూడండి. లేకపోతే ఆవులు వెళ్లిన దారిన వెళ్లండి." అని పలికాడు.

కర్ణుని మాటలు విన్న కృపాచార్యుడు "నువ్వెప్పుడూ కయ్యానికే కాలు దువ్వుతావు. అర్థ స్థితికి యుద్ధాన్ని అథమ సాధనంగా రాజనీతిజ్ఞులు చెబుతారు. దేశ కాలాలూ బలమూ కూడగట్టుకొంటే యుద్ధంలో జయం లభిస్తుంది. మూర్ఖత్వంతో తమనూ, శత్రువునూ తెలుసుకోకుండా యుద్ధం చేస్తే చేటు కలుగుతుంది. కర్ణా ! ఖాండవ వనాన్ని దగ్ధం చేసిందీ, యాదవ బలాన్ని ఓడించి సుభద్రను తెచ్చిందీ, దిగ్విజయం చేసిందీ, చిత్రరథుని జయించి దుర్యోధనుని విడిపించిందీ, నివాత కవచుల్ని సంహరించిందీ, దేవతలకు కూడ సాధ్యంకాని కాలకేయుల్ని చంపిందీ అర్జునుడొక్కడే! మత్స్యయంత్రాన్ని అర్జునుడు కొట్టినప్పుడు రాజులందరూ యుద్ధానికి దిగిపారిపోయినప్పుడు నువ్వు అక్కడ ఉన్నావా లేవా? నిజం చెప్పు. పాండవులు ఎవరికి వారే సాటిలేని బలవంతులు. నువ్వు భుజ బలాన్ని గూర్చి దుర్యోధనునికి ఘనంగా చెబుతున్నావు. ఆయన మెచ్చుకొని వింటున్నాడు. ఎందుకు నీకీ అనవసర గర్వం? కర్ణా ! నువ్వు ఒక్కడివే అర్జునుని ఎదిరించడం అంటే సముద్రాన్ని చేతి ఈతతో ఈదాలను కోవటం కాదూ! అగ్నిలో దూకటం కాదూ! వాసుకి కోరలు పెకలించటానికి ప్రయత్నించటం కాదూ! విజృంభించే దావానలాన్ని ఒక్కడే ఆర్పగలడా? నీ ఈర్ష్యను కట్టి పెట్టు. ఎలాగైనా మనం ముందు రాజును రక్షించాలి గదా ! మనం అందరం కలసి అర్జునుని ఎదిరిద్దాం. లేకపోతే ఒంటరిగా అర్జునునెదిరించడం ముక్కంటికి కూడా సాధ్యం కాదు" అని పలికాడు.

**కర్ణుడు కృపాచార్యుని అధిక్షేపించడం :** కృపాచార్యుడు కుండబద్దలు గొట్టినట్లు అన్ని విషయాల్ని స్పష్టంగా చెప్పటాన్ని సహించలేని కర్ణుడు సంరంభంతో "శత్రువులంటే ఇష్టమైన నిన్ను తోడుకొని రమ్మనటానికి రాజేమైనా వెర్రివాడా? రాజధనాన్ని పూర్తిగా తింటారు. ఆపద వస్తే యుద్ధంలో వెనక్కి తగ్గుతారు. యజ్ఞాలు జరిగే చోటుకు వెళ్లి చక్కగా భోజనాలు ఆరగించు. నిన్ను రాజు యుద్ధంలో ఆబోతును విడిచినట్లు విడిచాడు. ఊరకే కోపించక ఇంటికి పో. నేను విల్లు పడితే పదునాల్గు లోకాలు కంపిస్తాయి. నా బాహుబలం తెలియక మాట్లాడావు. అర్జునుడంటే ఎంత? అయినా ఒక్కవీరుని చూసి ఇంతగా భయపడాలా?" అని పలికాడు.

ఒక్కొక్కరు పలుకుతన్న విషయాల్ని గమనించి భీష్ముడు ధర్మార్థాలు కలిసి వచ్చేటట్లు దుర్యోధనునితో "సమర్థుడు యుద్ధం చేస్తే చెల్లుతుంది. ఇతరులకు కటువు కలిగించే మాటలు తగవు. శత్రువులు దూరంగా ఉన్నప్పుడే తగిన ఆలోచన చెయ్యాలి. మహాత్ములు శత్రువులనైనా ప్రశంసిస్తారు. ఎదిరించినప్పుడు పరాక్రమాన్ని ప్రదర్శిస్తారు. కర్ణుడు తుది మొదలు ఎరుగడు. ఎంతటి వారినైనా పరుషంగా మాట్లాడతాడు. ఆచార్యులు గౌరవనీయమైన వాక్యాలకే తగుదురుకాని నిందార్హులు కారు. బలవంతునితో వైరం వచ్చినప్పుడు అంతఃకలహం అనుచితం. అందరం కలసి యుద్ధం చేద్దాం. ఆచార్యులారా! మీ లాంటి మహానుభావులు ఎక్కడ ఉన్నారు ? కౌరవ సేనలో ఏం జరిగినా మీరే బాధ్యులు. కాబట్టి క్షమించాలి. ఒక్కడేదో తెలియక ఏమయినా అంటే కోపించి రాజు పనివిషయం విడిచి పెట్టేవారా మీరు?" అని పలకటంతో కృపాశ్వత్థామలు "క్షమించటానికి మేమెంత వారం. ద్రోణుడు శాంతిస్తేచాలు" అనటంతో దుర్యోధనుడు భీష్మునీ, కర్ణుని కలుపుకొని ద్రోణుని ప్రార్థించాడు. అశ్వత్థామను వేడుకొన్నాడు. కృపాచార్యుని ప్రసన్నం చేసుకొన్నాడు. ద్రోణుడు ప్రసన్నుడై "నాకోపం భీష్ముని మాటలతోనే పోయింది. రాజుకు కీడు రాకుండా రక్షించాలి "అర్జునుని ఒక్కుమ్మడిగా చట్టుముట్టాలి అన్నాడు. అప్పుడు దుర్యోధనుడు అజ్ఞాతవాస సమయాన్ని గూర్చి నిరూపించి యథార్థం చెప్పటానికి భీష్ముడే అర్హుడు" అని మళ్లీ ఆ విషయాన్ని ప్రస్తావించటంతో భీష్ముడిలా అన్నాడు.

"రెండు సంవత్సరాల తర్వాత ఒక అధికమాసం వస్తుంది. ఇలా వచ్చిన అధిక మాసాల్ని లెక్కిస్తే నిన్నటితో పదమూడేళ్లు నిండాయి. దీన్ని గ్రహించే అర్జునుడు వచ్చాడు. పాండవులు ధార్మికులు. ధర్మరాజు నాయకత్వంలో వారు నడుస్తారు కాబట్టి ధర్మం తప్పరు. అలా అతిక్రమించాలనుకొంటే జూదం రోజునే యుద్ధం చేసేవారు. కానీ ధర్మ పాశాలకు కట్టుబడి కాలం కోసం నిరీక్షించారు. ఎలాగైనా పరాక్రమాన్ని చూపకమానరు. ముట్టడిస్తే దానికి తగ్గట్టు మనమూ ఎదిరిద్దాం" వచ్చింది అర్జునుడు తప్పకుండా గెలుస్తామని చెప్పలేం. రాజ్యలక్ష్మి కోసం పోరాడిన బలాలు రెండూ గెలవలేవు. జయాజపయాల్లో ఏదో ఒకటి లభిస్తుంది. ఏదైనా ఎదిరించాలి. ఏం వచ్చినా సహించాలి. ఒక విధంగా చూస్తే ఇప్పుడు సంధి చేసుకోవటం కూడా మంచిదే" అని పలకటంతో దుర్యోధనుడు చిరునవ్వుతో ఇలా అన్నాడు.

"మనకూ పాండవులకూ సంధి ఎలా కుదురుతుంది? నేను రాజ్యభాగం ఇవ్వను. యుద్ధానికే సిద్ధమవుతాను."

భీష్ముని పలుకుల్ని, దుర్యోధనుని నిశ్చయాన్ని విన్న ద్రోణుడు "యుద్ధ విషయంలో రాజుకంటే ఎక్కువ తెలిసిన వారుండరు. ఈ సైన్యంలోని నాలుగోవంతును తీసుకొని రాజు ముందుకు పోవాలి. అంతే బలం తర్వాత గోవుల్ని చుట్టు ముట్టి వెళ్లాలి. మిగిలిన సగంతో వెనుక మనం వెళదాం. అర్జునుడెక్కడ తలపడితే అక్కడ ఎదిరిద్దాం. అలా అయితే రాజు సురక్షితంగా ఉంటాడు. గోవులూ ఈ ప్రదేశం దాటుతాయి" అని పలకటంతో అందరూ సిద్ధపడి అలాగే ప్రవర్తించారు.

అపారమైన కౌరవ సేనకు ఒకే ఒక్కడైన అర్జునునికి ఆశ్చర్యంగా యుద్ధం జరుగుతోందని ఇంద్రుడు దేవతలూ, మునులూ, సిద్ధులూ, సేవిస్తూ ఉండగా సుదర్శనం అనే విమానంలో ఆకాశగమనంలో అక్కడకు వచ్చాడు. స్వర్గంలోని రాజులూ చక్రవర్తులూ కోర్కెలు తీగెలు సాగగా ఇంద్రుని సేవిస్తూ ఉన్నారు. పాండురాజు ఇంద్రుని ప్రక్కనే పెద్ద సింహాసనం మీద కూర్చొని అప్సరసలు వింజామరలు వీస్తూ ఉండగా ఉజ్జ్వల రీతిలో ఉండి చూస్తున్నాడు.

అర్జునుడు వెయ్యిమంది ప్రళయరుద్రులు ఒక్కసారి గర్జిస్తున్నట్లుగా బెదిరిస్తూ వేగంగా మెరుపు తీగ వచ్చినట్లు తన రథంరాగా కౌరవ సైన్యాన్ని సమీపించాడు. దేవదత్త ధ్వానంతో కౌరవ సేన పెడమొగ పెట్టింది. రథచక్రాల వేగంతో లేచిన ధూళి కౌరవ సేనల అవయవాల్ని కప్పివేసింది. కపిధ్వజ కాంతులు మిరుమిట్లు గొల్పుతున్నాయి. సైన్యం దిక్కుతోచక తల్లడిల్లింది. అర్జునుని ఆకారాన్ని చూసి భీతిల్లింది. కౌరవసైన్యానికి రెండు క్రోసుల దూరంలో ఉన్న అర్జునుడు ఉత్తరునితో ఇలా అన్నాడు.

"ఇదొక పెద్ద సైన్యం. ఆలమందకు ముందు కొంత సైన్యం ఉంది. దానికవతల కొంత సైన్యం. ఆ విభజించబడి వెళుతున్న సైన్యంలో దురభిమాని దుర్యోధనుడెక్కడ ఉన్నాడో? చూద్దాం రా. సేనకు ఎడంవైపుగా రథాన్ని పోనివ్వు. ఎవరడ్డు పడ్డా నేను దుర్యోధనుని మీదకే దూకుతా. అతడు దొరికితే భయంతో సైన్యం విడిపోతుంది. గోవుల్ని మళ్లించవచ్చు. దుర్యోధనుడు కనిపించకపోతే ఈ సైన్యాన్ని వదలి ఆలమందల దగ్గరకు వెళదాం. గోవులు విడిపోయి పారిపోకుండా చెయ్యడం మన ప్రథమ కర్తవ్యం. ఆ పని చేస్తుంటే దుర్యోధనుడు మనకు కనిపిస్తాడు. అదే పసందుగా ఉంటుంది." ఉత్తరుడు సేనకు ఎడమప్రక్కగా రథాన్ని నడపటంతో సేనను సమీపించిన అర్జునుడు సైన్యాలనన్నిటినీ స్పష్టంగా కలయజూశాడు.

కౌరవ సైన్యాన్ని కలయజూచిన అర్జునుడు ఏ దిక్కున ఎవరు ఉన్నారో ఉత్తరునికి స్పష్టంగా చెప్పి "వీరిలో దుర్యోధనుడు లేడు. అతడు గోవుల్ని తోలుకొని పోతూ ఉంటాడు. ఈ సేనతో మనం యుద్ధం చెయ్యవలసిన అవసరం లేదు. వీరంతా సమీపించి అడ్డుపడి ఆలస్యం చెయ్యకుండా పశువుల్ని మళ్లించి, రాజు పొలిమేర దాటకుండా పట్టుకోవాలి. ఆ వైపుకు రథాన్ని పోనివ్వు" అని ఆజ్ఞాపించి ద్రోణునకూ, కృపునికీ, భీష్మునికీ పాదాల దగ్గర రెండేసి బాణాలు, చెవుల ప్రక్క నుంచీ వెళ్లేటట్లు రెండేసి బాణాలు వేశాడు. అర్జునుని జూచి ద్రోణుడు "అర్జునుడెంత సముచితంగా ప్రవర్తించాడో" అని మెచ్చుకొని ఇలా అన్నాడు.

**ద్రోణాచార్యుడు అర్జునుని జూచి ప్రశంసించడం :** "అర్జునుని గాండీవం కదలిక విద్యుల్లతలా, కపిధ్వజ ధ్వని మేఘగర్జనలా, రథం మేఘంగా భాసించింది. అర్జునుడు ఇంద్రుని రూపం పొందాడు. శత్రువుల భుజబలం అనే వేసవికి అర్జునుడు వర్షాధి దేవతలా ప్రకాశించాడు. అర్జునుడు నా పాదల దగ్గర పడేటట్టు వేసిన బాణాలు నమస్కార పూర్వకమైనవి. చెవులకు తగిలీ తగలనట్టు వేసిన

బాణాలు కుశల ప్రశ్నలు. అర్జునుడు ఉద్రేకంతో వచ్చాడు. మీదకు వచ్చినప్పుడే సేనల్ని ధ్వంసం చేస్తాడు. అరణ్య, అజ్ఞాత వాసాలు పూర్తిచేసి, ఉదయించే సూర్యునిలా ప్రకాశిస్తున్నాడు.'' ద్రోణుడిలా పైకి చెప్పగా కృపాచార్య భీష్ములు మనసుల్లో సంతోషించారు. అప్పుడు భీష్ముడు కురువీరులతో ఈ విధంగా అన్నాడు. "అర్జునుడు సజ్జన ప్రియుడు, స్నేహశీలి, బంధుహితుడు, శత్రుభయంకరుడు. ఇటువంటి వారు భూమిపై ఉన్నారా? అతని రూపం దుస్సహమైంది. సమస్తలోకాల్ని పాలించదగిన తేజస్సు అర్జుననిది. వెనుకనుంచి వచ్చినా మనల్ని ఎదిరించటం ఇష్టం లేక మనల్ని దాటి వెళ్ళుతున్నాడు. అనుమానం లేదు. దుర్యోధనుని కోసమే వెళుతున్నాడు. మనకూ దుర్యోధనునికీ మధ్య అర్జునుడు ప్రవేశిస్తే ప్రమాదం. అందుకే మనం దుర్యోధనుని దగ్గరకు వెళదాం. అర్జునుడు దుర్యోధనుని పట్టుకొంటే మనవల్ల ప్రయోజనం ఏమిటి ?'' అని చెప్పి సైన్యాన్ని పురికొల్పగా సైన్యం వేగంగా ముందుకు పోతున్నది. గోవుల రక్షణ సైన్యం కూడా గోవుల్ని తరిమికొని వేగంగా పోతున్నది. అర్జునుడు సైన్యం ప్రక్కనే రెండు క్రోసులు వెళ్లి ఉత్తరునితో ఇలా అన్నాడు. ఇదిగో గోగణం దగ్గరకు వచ్చాం. సైన్యాలూ వచ్చాయి. ఈ రెంటి మధ్యలో దూరి శత్రువులకు నా భుజబలం రుచి చూపిస్తాను. పశువుల్ని మళ్లిస్తాను. ఏ విధంగానైనా రాజు నాచేత చిక్కుతాడు'' అని పలికాడు.

**యుద్ధారంభం :** అర్జునుని పలుకుల కనుగుణంగా ఉత్తరుడు సేన అడ్డంగా తూర్పుగా రథాన్ని నడిపాడు. రథం సేన ఎట్టఎదుటికి వెళ్లింది. అర్జునుని ఉత్సాహం రెట్టించింది. సైన్యానికి ఎదురుగా రథాన్ని నిలిపించి అర్జునుడు తన పేరు చెప్పి 'నిలు నిలు' మని కేక వేశాడు. ఆవుల మంద ప్రక్కగా వాడి బాణాలు ప్రయోగించాడు. అంతా అంధకారం అలముకోవటంతో కురుసైన్యానికి గుండె బద్దలైంది. ఎటు పోవాలో పాలుపోలేదు. అప్పుడు అర్జునుడు గోవుల వెనుక వెళ్లే కొద్దిసైన్యం చెదిరిపోయేటట్లుగా తూర్పువైపుకు రథాన్ని తోలించి దేవదత్తాన్ని పూరించాడు. వెంటనే ధ్వజం మీది కోతి గర్జించింది. భూతాలన్నీ ఒక్క పెట్టున అరిచాయి. వింటినారి, మోత, రథచక్రాల ధ్వని, శత్రుసైన్యం సందడి, ఆకాశంలో ప్రశంసించే దేవతల కంఠధ్వనీ ఒక్కసారిగా విజృంభించాయి. ఆవులతో పాటూ బంధితులై కొనిపోబడుతున్న గోపాలుర సమూహం అప్పుడు గోవులవెంట పరుగెత్తింది. అర్జునుడు సేనను జాగ్రత్తగా పరిశీలించి " ఈ సైన్యం పశువులకు అడ్డురాకుండా మధ్యలోనికి వెళ్లాలి. ఇటు ప్రక్కకు తరుము'' అని ఉత్తరుని ఆజ్ఞాపించాడు. ఉత్తరుడలాగే చేయగా అర్జునుడు గోపాలురతో "నిర్భయంగా పశువుల్ని తోలుకుపోండి'' అని పట్టణం వైపుకు పోవటానికి ప్రోత్సహించాడు.

అర్జునుని మాటల్ని విన్న కురుసేనలు ఏనుగులతో గుర్రాలతో విజృంభించి మేఘంలాగా కమ్మివేశాయి. అర్జునుడు శరవేగంతో ప్రచండ మారుతంలా విజృంభించి వాటిని పటాపంచలు చేశాడు. మీదకు వచ్చిన సేనలు వచ్చిపోగా అర్జునుడు ఆవుల మందను చెదిరి పోనీక పాదివి పట్టణం వైపుకు తోలాడు. అవికూడా విజృంభించి గోపాలురుతో పాటు తమనేలలో ప్రవేశించాయి.'' ఆ విషయాలన్నిటినీ వైశంపాయనుడు చెప్పగా విని జనమేజయుడు ఆశ్చర్యంతో ఇలా అన్నాడు.

"పశువులు పట్టుపడ్డాక అర్జునుడేం చేశాడు? దుర్యోధనుడు ఏం చేశాడు ? సైన్యాలు ఏమయ్యాయి ? భీష్మాది వీరులంతా ఎలా ప్రవర్తించారు ? ఈ ప్రశ్నలకు సమాధానాన్ని వైశంపాయనుడు పంచమాశ్వాసంలో తెలియజేశాడు.

డా॥ గుమ్మా సాంబశివరావు ఎం. ఏ., పి హెచ్.డి.
రీడర్ & తెలుగు శాఖాధిపతి
ఆంధ్ర లొయోల కళాశాల
విజయవాడ - 520 008

మొదటి భాగము - ప్రాచీన పద్యభాగము

# ఉత్తర గోగ్రహణము - తిక్కన

## (ఆంధ్ర మహాభారతం - విరాట పర్వం - చతుర్థాశ్వాసం)

## పాఠం - 4

1. 4. 0 - సమగ్ర వ్యాఖ్యలు

1. 4. 1 - సందర్భ సహిత వ్యాఖ్యలు

**1.4. 0 సమగ్ర వ్యాఖ్యలు :**

**పద్యం : 5**

ధరణీచక్రము సంచలింపఁగ సముద్దాంతంబులై గ్రక్కునం
గురుసైన్యంబులు వచ్చి ముట్టి కొనియెన్ గోవర్గమున్ వేగమై
మరలం దెచ్చుటకుం గడంగుము రిపుక్ష్మాపాల లోకంబు నీ
శరజాలంబుల పాలు సేయుము భుజోత్సాహంబు శోభిల్లగన్.

**పరిచయం :**

ఈ పద్యం తిక్కన సోమయాజి రచించిన ఆంధ్రమహాభారతంలోని విరాట పర్వమునందలి చతుర్థాశ్వాసంనుంచి స్వీకరించబడిన 'ఉత్తర గోగ్రహణము' అనే పాఠ్య భాగంలోనిది.

**సందర్భం :**

విరాట మహారాజుకు చెందిన గోగణం మత్స్య నగరానికి ఉత్తర దిక్కుగా ఉన్నప్పుడు దుర్యోధనాది కౌరవ వీరులు ముట్టడించినప్పుడు గోపాలుర నాయకుడు అంతఃపురానికి వచ్చి ఉత్తరునితో పలుకుతున్న సందర్భంలోనివి ఈ పలుకులు.

**ప్రతిపదార్థం :**

( రాజకుమారా'!

| | | |
|---|---|---|
| ధరణీ చక్రము | = | భూమండలం |
| సంచలింపగ | = | దద్దరిల్లేటట్లుగా |
| సముద్దాంతంబులై | = | చక్కగా నియమించబడినవై (ఆధిక్యాన్ని కలిగినవై) |
| కురుసైన్యంబులు | = | కౌరవ సేనలు |
| గ్రక్కునన్ | = | ఆకస్మికంగా |
| వచ్చి | = | వచ్చి |
| గోవర్గమున్ | = | ఆవుల మందల్ని |
| ముట్టికొనియెన్ | = | చుట్టుముట్టాయి |
| మరలన్+తెచ్చుటకున్ | = | (ఆవుల మందల్ని) తిరిగి తోలుకురావటానికి |
| వేగమై | = | వేగంగా |
| కడుంగుము | = | పూనుకో |

| | | |
|---|---|---|
| భుజ + ఉత్సాహంబు | = | నీ బాహు బలం |
| శోభిల్లగన్ | = | ప్రకాశించేటట్లు |
| రిపు | = | శత్రు పక్షానికి చెందిన |
| క్ష్మాపాల లోకంబు | = | రాజ సమూహాన్ని |
| నీ శరజాలంబుల పాలు+చేయుము | = | నీ బాణ సమూహాలకు గురిచెయ్యి. |

**తాత్పర్యం :**

"ఓ రాజకుమారా ! భూ మండలంతా దద్దరిల్లేటట్లు కౌరవ సైన్యం తమ ఆధిక్యాన్ని ప్రదర్శిస్తూ ఆకస్మికంగా వచ్చి మన ఆవుల మందల్ని చుట్టుముట్టింది. వెంటనే వాటిని మరలించటానికి పూనుకో. నీ బాహుబలం ప్రకాశించేటట్లు శత్రురాజుల సమూహాన్ని నీ బాణాలకు గురిచెయ్యి".

**కవితా విశేషాలు :**

మత్తేభ ఛందంలో సాగిన ఈ పద్యం గోపాలకాధ్యక్షుని బాధ్యతను, రాజకుమారుడైన ఉత్తరుని బాధ్యతను స్పష్టం చేస్తున్నది. గోపాలుర నాయకుడు తన ధర్మంగా జరిగిన వృత్తాంతాన్ని చెప్పి రాజకుమారుని ధర్మాన్ని నిర్వర్తించు మని పలికాడు. కౌరవసైన్యం యొక్క ఆధిక్యాన్ని తెలపటానికి "ధరణీ చక్రము సంచలింపగ" అనే పలుకుల్ని కవి తిక్కన గోపాలుని నోట పలికించాడు. చక్రం ధర్మాన్ని ధరణియందు ఆరోపించటం వల్ల ఇక్కడ రూప కాలం కారాన్ని గుర్తించవచ్చు. ముట్టికొనియెన్, గోవర్గమున్, శోభిల్లగన్' అనే పదాల్లో చివర 'నకారపు పొల్లు' ప్రయోగించబడటంతో అంత్యాను ప్రాసను గుర్తించవచ్చు.

**పద్యం : 9**

ఎత్తునఁ గొందుఁ గౌరవుల నెల్లను మార్కొని రేని గోవులం
దెత్తు ముహూర్త మాత్రమున దేరికి సారథిఁ లేమిఁజేసినా
చిత్తమునన్ విచార దశసెందెడు నెవ్వడు గల్గు నొక్కొ నా
కిత్తఱి నేఁగదా కడప నెంతయు నేర్చు రథం బనం బురిన్.

**పరిచయం :**

ఈ పద్యం తిక్కన సోమయాజి రచించిన ఆంధ్రమహాభారతంలోని విరాట పర్వమునందలి చతుర్థాశ్వాసంనుంచి స్వీకరించబడిన 'ఉత్తర గోగ్రహణము' అనే పాఠ్యభాగం లోనిది.

**సందర్భం :**

గోపులురు నాయకుడు భూమింజయుని (ఉత్తరుని) స్త్రీల మధ్యలో పొగడినప్పుడు ఉత్తరుడు పొంగిపోయి మనసులో రణకుతూహలం మితిమీరి, గర్వంతో గోపాలుర నాయకునితో పలుకుతున్న సందర్భంలోనిది ఈ పద్యం.

**ప్రతి పదార్థం :**

| | | |
|---|---|---|
| మార్కొని రేని | = | ఎదిరించినట్లయితే |
| కౌరవులను + ఎల్లన్ | = | కౌరవులందరినీ |
| ఎత్తునన్ | = | ఉపాయంతో |
| కొందున్ | = | వజ్జగా నరుకుతాను |
| గోవులన్ | = | ఆవుల మందల్ని |
| ముహూర్త మాత్రమునన్ | = | క్షణ కాలంలో |
| తెత్తున్ | = | మరలించి తెస్తాను |

| | | |
|---|---|---|
| తేరికిన్ | = | రథానికి |
| సారథి | = | సారథ్యం వహించే వాడు (నడిపేవాడు) |
| లేమిన్ + చేసి | = | లేక పోవటం చేత |
| నా చిత్తమునన్ | = | నా మనస్సులో |
| విచారదశ చెందెడున్ | = | విచార స్థితి కలుగుతున్నది |
| నాకున్ | = | నాకు (ఉత్తరునికి) |
| ఈ + తఱిన్ | = | ఈ సమయంలో |
| రథంబు | = | రథాన్ని |
| కడపన్ | = | నడపటానికి (తోలటానికి) |
| ఎంతయున్ | = | మిక్కిలి |
| నేర్తున్ | = | నైపుణ్యం గలిగిన వాడిని |
| నేన్ + కదా | = | నేనున్నాను కదా |
| అనన్ | = | అనటానికి |
| పురిన్ | = | పట్టణంలో |
| ఎవ్వడు | = | ఏ వ్యక్తి |
| కల్గన్ + ఒక్కొ | = | దొరుకుతాడో కదా ! |

**తాత్పర్యం :**

"కౌరవులు నన్నెదుర్కొంటే ఉపాయంతో నజ్జునజ్జు చేస్తాను. క్షణకాలంలో గోవుల్ని మరలిస్తాను. కానీ నా రథాన్ని నడిపే సారథి లేకపోవటం నాకు విచారాన్ని కలిగిస్తున్నది. "రథ సారథ్యం చేయగల నైపుణ్యం నాకున్నదని చెప్పగలిగినవాడు" మన పట్టణంలో ఎవడు దొరుకుతాడో కదా !"

**కవితా విశేషాలు :**

ఉత్తరుని ప్రగల్భాల్లో మొట్టమొదటి పద్యమిది. ఆడవారిలో తనను గవాధ్యక్షుడు ప్రశంసించటంతో ఒళ్లు తెలియని రీతిలో గర్వంతో ఉత్తరుడు పలికాడు. కౌరవుల మొత్తాన్ని నుజ్జుచేస్తానని చెప్పటంలో అతని అమాయికత్వం స్పష్టమవుతున్నది. గోవుల్ని క్షణకాలంలో తెస్తానని చెప్పటం ద్వారా ఉత్తరుడు తన స్థితిని మరిచాడని గుర్తించవచ్చు. "ఎత్తున" అని పద్యాన్ని ప్రారంభించటం ద్వారా తిక్కన తనదైన ప్రతిభను ప్రదర్శించాడు. ద్విత్వ తకార ప్రాస శ్రుతిహితంగా ఉన్నది. ఉత్పల మాలలో సాగిన ఈ పద్యంలో ఎక్కువ తెలుగు పదాల్ని ప్రయోగించి తిక్కన తెలుగుదనాన్ని ప్రకాశింపజేశాడు.

**పద్యం : 9**

కౌరవ సేనగాదు త్రిజగంబులు నొక్కట నెత్తి వచ్చినం
దేరు బృహన్నలావశగతిం జరియించిన గెల్వవచ్చుఁద
ద్వీర గుణంబు సొంపు పృథివీవరనందన ! మున్నెఱుంగుదుం
గారణ జన్మమై తను వికారము వచ్చినఁ బెంపు దప్పునే ?

**పరిచయం :**

ఈ పద్యం తిక్కన సోమయాజి రచించిన ఆంధ్రమహాభారతంలోని విరాట పర్వమునందలి చతుర్థాశ్వాసంనుంచి స్వీకరించబడిన 'ఉత్తర గోగ్రహణము' అనే పాఠ్యభాగం లోనిది.

సందర్భం :

"కౌరవ సైన్యాన్ని ఎదిరించి తన పరాక్రమాన్ని ప్రదర్శించాలనుకొన్నప్పుడు ఉత్తరునకు పేడిమైన బృహన్నల సారథి అయితే చూచినవారు నవ్వుతారు కదా ! సారథికి యింత కరవేర్పడిందా ?" అని ఉత్తరుడు సైరంధ్రితో పలికినప్పుడు బృహన్నల గొప్పదనాన్ని సైరంధ్రి ఉత్తరునికి తెలియజేస్తున్న పద్యమిది.

ప్రతిపదార్థం :

| | | |
|---|---|---|
| పృథివీ వర నందన ! | = | ఓ రాజకుమారా ! |
| కౌరవ సేన + కాదు | = | కౌరవుల సైన్యం మాత్రమేకాదు |
| త్రిజగంబులున్ | = | మూడు లోకాలూ |
| ఒక్కటన్ | = | ఒక్కుమ్మడిగా |
| ఎత్తివచ్చినన్ | = | దండెత్తి వచ్చినా |
| తేరు | = | రథం |
| బృహన్నలావశగతిన్ | = | బృహన్నలకు సాధ్యమైన నడకతో |
| చరియించినన్ | = | నడిస్తే |
| గెల్వవచ్చున్ | = | గెలుపు పొందవచ్చు. |
| తత్ | = | ఆ బృహన్నల యొక్క |
| వీరగుణంబు సొంపు | = | పరాక్రమ సమృద్ధిని గూర్చి |
| మున్ను | = | పూర్వం |
| ఎరుంగుదున్ | = | నేనెరుగుదును |
| కారణజన్మమై | = | కారణం చేత కలిగినదై |
| తను వికారము | = | శరీరంలో మార్పు |
| వచ్చినన్ | = | వచ్చినంత మాత్రాన |
| పెంపు + తప్పునే | = | గొప్పతనం తొలగిపోతుందా ? (పోదని భావం) |

**తాత్పర్యం :** "ఓ రాజకుమార ! కేవలం కౌరవ సైన్యమే కాదు మూడు లోకాలు ఒక్కటై దండెత్తి వచ్చినా రథం బృహన్నల వశంలో సాగితే గెలుపు లభిస్తుంది. ఆ వీరుని పరాక్రమాధిక్యం ఇంతకు ముందే నాకు తెలుసు. ఏదో కారణం వల్ల శరీరంలో వికారం కలిగినంత మాత్రన పరాక్రమం తొలగిపోదు కదా !"

**కవితా విశేషాలు :**

సైరంధ్రి పలుకుల్లో కవి తిక్కన బృహన్నల ఆధిక్యాన్ని ఈ పద్యంలో స్పష్టం చేశాడు. ముల్లోకాలూ ఒక్కటైనా గెలుపును పొందవచ్చు అనటం ద్వారా బృహన్నల ఆధిక్యాన్ని సైరంధ్రి స్పష్టం చేస్తున్నది. 'బృహన్నలావశగతిన్' అనటం ద్వారా తిక్కన విశిష్టమైన అర్థాన్ని సాధించాడు. అంటే బృహన్నల సారథి మాత్రమే కానక్కర లేదు. రథికుడైనా కావచ్చు అనే భవిష్యత్కథా సూచనను 'వశగతిన్' అనే పద బంధం ద్వారా సూచించాడు.

ఈ పద్యంలో కావ్యలింగాలంకారాన్ని గుర్తించవచ్చు. సమర్థించవలసిన అర్థాన్ని సమర్థించటమే కావ్యలింగం. ముల్లోకాలు ఒక్కటై దండెత్తివచ్చినా బృహన్నల వశంలో రథం నడిస్తే గెల్వవచ్చు అనే విషయాన్ని 'కారణజన్మమై తను వికారము వచ్చినఁ బెంపు దప్పునే" అనే విషయం ద్వారా సమర్థించటం జరిగింది. కాబట్టి కావ్యలింగాలంకారాన్ని కూడ గుర్తించవచ్చు. ఉత్పలమాల ఛందంలో సాగిన ఈ పద్యం తిక్కన ప్రతిభకు తార్కాణంగా ఉన్నది.

పద్యం : 37

ఖాండవ మేర్చునప్పుడు దగన్ రథ చోదక వృత్తి సల్పి, యా
ఖండలసూతికిన్ జయము గల్గ నొనర్చిన యట్టి బుద్ధియున్
దండి తనంబు నీ యెడన తక్కెనె నాదెస మైత్రి పెన్పు మిం
కొండొక మాట దక్కుము రణోత్సాహనం బొనరింపు గ్రక్కునన్.

పరిచయం :

ఈ పద్యము తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతంలోని విరాట పర్వము నందలి చతుర్థాశ్వాసంనుంచి స్వీకరించబడిన 'ఉత్తర గోగ్రహణము' అనే పాఠ్యభాగంలోనిది.

సందర్భం :

ఉత్తరుడు బృహన్నలను రథసారథిగా చేసుకోవటానికి పిలిపించినప్పుడు బృహన్నల ఆటపాటల విషయంలో తనకు నైపుణ్యం ఉన్నదని యుద్ధానికి తనను పిలవటం తగదని పలికినప్పుడు ఉత్తరుడు బృహన్నలతో పలుకుతున్న పద్యమిది.

ప్రతి పదార్థం : (ఓ బృహన్నలా !)

| | | |
|---|---|---|
| ఖాండవము | = | ఖాండవ వనాన్ని |
| ఏర్చునప్పుడు | = | దహించేటప్పుడు |
| తగన్ | = | తగిన రీతిలో |
| రథచోదకవృత్తి | = | రథాన్ని నడపటం అనే పనిని |
| సల్పి | = | చేసి |
| ఆఖండలసూతికిన్ | = | ఇంద్ర తనయుడైన అర్జునునికి |
| జయము + కల్గన్ | = | గెలుపు కలిగేటట్లు |
| ఒనర్చిన + అట్టి | = | చేసినటువంటి |
| బుద్ధియున్ | = | తెలివీ |
| దండితనంబున్ | = | పరాక్రమమూ |
| నీ + ఎడన | = | నీ యందు |
| తక్కెనె | = | లోపించాయా ? |
| నాదెస | = | నాపట్ల |
| మైత్రి | = | స్నేహం |
| పెన్పుము | = | పెంపొందించుకో |
| ఇంకన్ | = | ఇకపై |
| ఒండు + ఒకమాట | = | వేరొక మాట |
| తక్కుము | = | విడిచి పెట్టు (పలక వద్దు) |
| గ్రక్కునన్ | = | వెంటనే |
| రణ + ఉత్సాహనంబు | = | యుద్ధ ప్రయత్నాన్ని |
| ఒనరింపు | = | చెయ్యి |

**తాత్పర్యం :** "ఓ బృహన్నలా ! ఖాండవ వనాన్ని దహించే సమయంలో రథాన్ని నేర్పుతో నడిపి ఇంద్రునికుమారుడైన అర్జునునికి విజయం సాధించావు కదా ! అలాంటి బుద్ధి, పరాక్రమం నీలో నశించాయా ? నా పట్ల స్నేహం పెంపొందించుకో. ఇంకొక మాట పలకవద్దు. వెంటనే యుద్ధ ప్రయత్నం చెయ్యి."

**కవితా విశేషాలు :**

'ఖాండవ వన దహన సమయంలో అర్జునునికి విజయం సాధించి పెట్టింది బృహన్నల' అనే విషయాన్ని సైరంధ్రి ద్వారా అంతకుముందే విన్న ఉత్తరుడు ఆ విషయం తనకే తెలిసినట్లు బృహన్నలతో పలుకుతున్నాడు. ఉత్తరుని ప్రత్యేక వ్యక్తిత్వాన్ని తిక్కన ఈ పద్యంలో స్పష్టం చేస్తున్నాడు. బృహన్నలకు రోషం కలగటానికి 'అట్టి బుద్ధియున్, దండితనంబు నీయెడన్ తక్కెనె ?" అని పలికాడు. బృహన్నలకు కోపం వస్తుందేమోనని "నాదెస మైత్రి పెన్పుము" అని అర్థించాడు. మళ్లీ వెంటనే అధికార స్వరంతో ఇంకొండొక మాట దక్కుము" "రణోత్సహనం బొనరింపు గ్రక్కునన్" అని ఉత్తరుడు భిన్నరీతుల్లో బృహన్నలతో పలికాడు. ఈ పద్యంలో తగన్, సూతికిన్, బుద్ధియున్, గ్రక్కునన్ అనే పదాల్లో చివర 'పొల్లు నకారం' అంత్యాను ప్రాసగా అలరిస్తున్నది. పూర్ణ బిందు పూర్వక 'డ' కారంతో ఉత్పలమాల ఛందంలో సాగిన ఈ పద్యం సహృదయ రంజకంగా ఉన్నది.

**పద్యము : 52**

భీష్మ ద్రోణ కృపాది ధన్వి నికరాభీలంబు, దుర్యోధన
గ్రీష్మాదిత్య పటు ప్రతాప విసరా కీర్ణంబు, శస్త్రాస్త్రజా
లోష్మ స్ఫార చతుర్విధోజ్జ్వల బలాత్యుగ్రం బుదగ్రధ్వజా
ర్చిష్మత్వా కలితంబు సైన్యమిది యేఁ జేరంగ శక్తుండనే ?

**పరిచయం :**

ఈ పద్యం తిక్కన సోమయాజి రచించిన ఆంధ్ర మహాభారతంలోని విరాట పర్వమునందలి చతుర్థాశ్వాసంనుంచి స్వీకరించబడిన 'ఉత్తర గోగ్రహణము' అనే పాఠ్య భాగం లోనిది.

**సందర్భం :**

అపార కౌరవ సేనా వాహినిని చూసిన ఉత్తరుడు గగుర్పాటుచెంది మనసులో కలత కలగగా నిశ్చేష్టుడై, తడబడుతూ దుఃఖంతో బృహన్నలతో పలుకుతున్న పద్యమిది.

**ప్రతి పదార్థం : (ఓ బృహన్నలా !)**

| | | |
|---|---|---|
| సైన్యము + ఇది | = | ఈ కౌరవ సైన్యం |
| భీష్మ | = | భీష్ముడు |
| ద్రోణ | = | ద్రోణుడు |
| కృప | = | కృపాచార్యుడు |
| ఆది | = | మొదలైన |
| ధన్వి | = | విలువిద్యా వేత్తల యొక్క |
| నికర | = | సమూహంచేత |
| ఆభీలంబు | = | భయంకరమైనది |
| దుర్యోధన | = | దుర్యోధనుడనే |
| గ్రీష్మ + ఆదిత్య | = | వేసవి కాలపు సూర్యుని యొక్క |
| పటు | = | తీక్ష్ణమైన |

| | | |
|---|---|---|
| ప్రతాప | = | తేజస్సు అనే కాంతుల యొక్క |
| విసర | = | ప్రసారం చేత |
| ఆకీర్ణంబు | = | వ్యాపించినది. |
| శస్త్ర | = | ఆయుధములు |
| అస్త్ర | = | మంత్ర పూతమైన ఆయుధములయొక్క |
| జాల | = | సమూహమనే |
| ఊష్మ | = | వేడిమి యొక్క |
| స్ఫార | = | విస్తారం కలిగిన |
| చతుః + విధ | = | నాలుగు రకాలైన |
| ఉత్ + జ్వల | = | మిక్కిలి ప్రకాశించే |
| బల | = | బలం చేత |
| అతి + ఉగ్రంబు | = | మిక్కిలి భయంకరమైంది |
| ఉదగ్ర | = | ఎత్తబడిన |
| ధ్వజ | = | జెండాలు అనే |
| అర్చిష్మత్ | = | అగ్ని జ్వాలలతో |
| ఆకలితంబు | = | కూడినది |
| ఏన్ | = | నేను (ఉత్తరుడను) |
| చేరంగన్ | = | సమీపించటానికి |
| శక్తుండనే | = | సమర్థుడనా ? (సమర్థుడను కానని భావం) |

**తాత్పర్యం :** ఓ బృహన్నలా ! ఈ కౌరవ సైన్యం భీష్మ, ద్రోణ కృపాది విలు విద్యావేత్తలతో భయంకరంగా ఉన్నది. దుర్యోధనుడనే వేసవి కాలపు సూర్యుని ప్రతాపంతో తీక్ష్ణంగా శస్త్రాస్త్రాల వేడిమితో విస్తరించిన చతురంగ బలాలతో భయంకరంగా ఉన్నది. ఎగురుతున్న జెండాలనే అగ్నిజ్వాలల కాంతులతో నిండిన ఈ సైన్యాన్ని సమీపించటం నాకు సాధ్యం కాదు."

**కవితా విశేషాలు :**

తిక్కన సంస్కృత పద ప్రయోగ దక్షతకు, సమాస నిర్మాణ చాతుర్యానికి ఈ పద్యం నిదర్శనం. సాధారణంగా తిక్కన సంస్కృత సమాసాల జోలికిపోడు. రసోచిత శబ్ద ప్రయోగం తిక్కన ప్రత్యేకత. అపార కౌరవసేనా వాహినిని వర్ణించటానికి సుదీర్ఘ సమాసరచనం చేశాడు. పద్యాన్ని దుష్కర ప్రాసలో రచించాడు. 'ష' కార 'మ'కారాల సంయుక్తంతో ఉన్న శబ్దాలు అరుదుగా ఉంటాయి. అయినా తిక్కన అవలీలగా ఈ ప్రాసను నిర్వహించి తన పాండిత్యాన్ని ప్రదర్శించాడు. దుర్యోధనుడనే గ్రీష్మకాలపు సూర్యుడు, జెండాలనే అగ్ని జ్వాలలు అని వర్ణించటంలో రూపకాలంకారాన్ని పొందుపరిచాడు. ధన్వినికరా భీలంబు, విసరాకీర్ణంబు, బలాత్యుగ్రంబు, అర్చిష్మత్సా కలితంబు అనే సమాసాల్లో అంత్యాను ప్రాసను ప్రయోగించాడు. భీష్మ, ద్రోణ, నికర, దుర్యోధన, గ్రీష్మ ప్రతాప, విసరా కీర్ణంబు మొదలైన పదాల్లో సాదురేఫను ప్రయోగించి వృత్త్యాను ప్రాసను పొందుపరిచాడు. ఈ పద్యం తిక్కన బహుముఖ ప్రతిభకు, రసాభ్యుచితబంధ రచనకు, శార్దూలం ఛందంలో సాగటంవల్ల ఛందౌచిత్యానికి సాక్ష్యమని చెప్పవచ్చు.

పద్యం : 83

వెఱవకు మన్న ! పోటు కురు వీరుల తోడ నశక్యమేని న
త్తెఱ ఁ గది యేల నీకుడుగు; తేరికి సారథి గమ్ము నాకుఁ జి
చ్చుఱపిడు గెట్టు లట్టడరి శూరుల మొత్తము నుగ్గసేసెదం
బఱపెదసేన; రాజు ధృతి ఁబా పెద గోవులఁ గ్రమ్మరించెదన్.

పరిచయం :

ఈ పద్యం మహాకవి తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతము విరాట పర్వంలోని చతుర్థాశ్వాసంనుంచి స్వీకరించబడిన 'ఉత్తర గోగ్రహణము' అనే పాఠ్య భాగం లోనిది.

సందర్భం :

కౌరవ సైన్యాన్ని చూసి భయపడిన ఉత్తరుడు రథాన్ని వెనుకకు తిప్పుమని బృహన్నలతో పలికి రథం దిగి పారిపోగా ఆతన్ని పట్టి తెచ్చిన బృహన్నల ఉత్తరుని తనకు సారథిగా ఉండుమని ధైర్యం చెబుతున్న సందర్భంలోనిదీ పద్యం.

ప్రతి పదార్థం :

| | | |
|---|---|---|
| వెఱవకుము + అన్న | = | అన్నా ! భయపడవద్దు |
| నీకున్ | = | నీకు (ఉత్తరునకు) |
| కురువీరులతోడన్ | = | కౌరవ వీరులతో |
| పోటు | = | యుద్ధం |
| అశక్యము + ఏనిన్ | = | సాధ్యం కాకపోతే |
| ఆ + తెఱగు + అది + ఏల | = | ఆ పద్ధతి నీ కెందుకు ? |
| ఉడుగు | = | ఆ విషయాన్ని విడిచిపెట్టు |
| నాకున్ | = | నా యొక్క (బృహన్నలకు) |
| తేరికి | = | రథానికి |
| సారథి కమ్ము | = | సారథిగా ఉండు |
| చిచ్చుఱ పిడుగు + ఎట్టుల | = | చిచ్చర పిడుగెలాగో |
| అట్టు + అడరి | = | అలా విజృంభించి |
| శూరుల మొత్తమున్ | = | కౌరవ వీరులందఱినీ |
| నుగ్గు + చేసెదన్ | = | పిండి పిండి చేస్తాను |
| సేన | = | కౌరవ సైన్యాన్ని |
| పఱపెద | = | పారిపోయేటట్లు చేస్తాను |
| రాజు ధృతిన్ | = | దుర్యోధనుని ధైర్యాన్ని |
| పాపెదన్ | = | తొలగింప జేస్తాను. |
| గోవులన్ | = | ఆవుల్ని |
| క్రమ్మఱించెదన్ | = | మళ్లిస్తాను. |

**తాత్పర్యం :** "అన్నా ! ఉత్తరా భయపడవద్దు. కౌరవులతో యుద్ధం చెయ్యటం నీ వల్ల కాకపోతే ఊరుకో (ఆ విషయం నేను చూసుకొంటా) నా రథానికి సారథిగా ఉండు. అగ్గిపిడుగులా విజృంభించి కౌరవ సైన్యాన్ని పిండి చేస్తాను. రాజైన దుర్యోధనుని ధైర్యం సడలింప జేస్తాను. ఆవుల్ని మళ్లిస్తాను."

**కవితా విశేషాలు :**

తిక్కన పద్య రచనా చమత్కృతి ప్రశంసనీయంగా ఉంటుంది. కౌరవ సైన్యాన్ని చూపి భయపడిన ఉత్తరుని చేత సుదీర్ఘ సమాసాలు పలికించాడు. అతనికి ధైర్యం చెబుతున్న బృహన్నల చేత తేట తెలుగు మాటల్ని పలికించాడు. ఉభయ కవి మిత్రుడనటానికిదే నిదర్శనం. పద్యాన్ని 'వెఱవకు మన్న !' భయపడవద్దు అని ప్రారంభించి భయపడకుండా ఉండటానికి గల కారణాల్ని బృహన్నల చేత

చెప్పించాడు. అంతవరకు రథిగా ఉన్న ఉత్తరుని సారథి కమ్మని పలికాడు. తాను రథినైతే ఏం చేస్తానో "బృహన్నల పలికాడు. 'చిచ్చుఱ పిడుగులా' విజృంభిస్తానన్నాడు. శూరుల మొత్తము 'నుగ్గుసేసెద' నన్నాడు. ఈ పద్యంలో వెఱవకు, పోటు తెలుగు చిచ్చుఱ పిడుగు, అదరి, నుగ్గు, పఱపెద మొదలైన తెలుగు పదాలను ప్రయోగించి పద్యానికి ఒక కొత్త అందాన్ని తిక్కన సమకూర్చాడు. అలతి అలతి పదాలతో అనల్పార్థ రచన చేయటంలో తిక్కన సిద్ధ హస్తుడనటానికీ చంపకమాల పద్యం నిదర్శనం. నుగ్గుసేసెద, పఱపెద సేన, ధృతిబాపెద, గ్రమ్మరించెద 'అనే శబ్దాలలోని 'ద' కారం అంత్యాను ప్రాసగా అలరిస్తున్నది.

**పద్యం : 95**

సింగం బాఁకటితో గుహాంతరమునం జేడ్పాటుమైనుండి, మా
తంగ స్ఫూర్జిత యూథ దర్శన సముద్యత్క్రోధమై వచ్చునో
జం,గాంతార నివాస ఖిన్నమతి నస్మత్సేన పై నీఁడె వ
చ్చెం గుంతీసుత మధ్యముండు సమర స్థేమాభి రామాకృతిన్.

**పరిచయం :**

తిక్కన సోమయాజి రచించిన ఆంధ్ర మహాభారతము - విరాట పర్వంలోని చతుర్థాశ్వాసంనుంచి స్వీకరించబడిన 'ఉత్తర గోగ్రహణము' అనే పాఠ్య భాగంలోనిదీ పద్యం.

**సందర్భం :**

బృహన్నలను గూర్చి భీష్ముడు దుర్యోధనుని వైపు చూస్తూ గూఢంగా శత్రువులకు అనుకూలమైన మేరను దాటి వచ్చామని, భయపడవలసిన అవసరం లేదని పలికినప్పుడు అంతరార్థాన్ని గ్రహించిన ద్రోణుడు అర్జునుని గూర్చి పలుకుతున్న సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతి పదార్థం :**

| | | |
|---|---|---|
| సింగంబు | = | సింహం |
| ఆఁకటితోన్ | = | ఆకలితో |
| గుహా + అంతరమునన్ | = | గుహలో |
| చేడ్పాటుమైన్ + ఉండి | = | కష్టంతో ఉండి |
| మాతంగ | = | ఏనుగుల యొక్క |
| యూథ | = | సమూహం |
| స్ఫూర్జిత | = | విడిపోయిన విషయాన్ని |
| దర్శన | = | చూడటం చేత |
| సముద్యత్ | = | వెలువడుతున్న |
| క్రోధమై | = | కోపం కలిగినదై |
| వచ్చున్ + ఓజన్ | = | ఉత్సాహంతో వస్తున్నట్లుగా |
| కాంతార | = | అడవిలో |
| నివాస | = | నివసించటం చేత |
| ఖిన్నమతిన్ | = | దుఃఖపడిన మనసుతో |
| అస్మత్ + సేన పై | = | మన సైన్యం మీదికి |
| ఈఁడె | = | ఇడుగో |

| | | |
|---|---|---|
| కుంతీసుత మధ్యముండు | = | పాండవ మధ్యముడైన అర్జునుండు |
| సమర | = | యుద్ధంలో |
| స్థేమ | = | స్థిరమైన |
| అభిరామ | = | సొగసైన (మనోహరమైన) |
| ఆకృతిన్ | = | ఆకారంతో |
| వచ్చెన్ | = | వచ్చాడు. |

**తాత్పర్యం :** చాలా కాలం కష్టంతో గుహలో ఉండి ఆకలితో ఒక్కసారిగా బయటకు వస్తూ విడిపోయిన ఏనుగుల సమూహాన్ని చూస్తే ఎంత కోపంతో మీదకు దూకుతుందో సింహం అలాగే అరణ్య వాస క్లేశం వల్ల దుఃఖితుడైన అర్జునుడు మనసేన మీదకు యుద్ధంలో స్థిరంగా, సొగసుగా ఉండగలిగే ఆకారంతో వచ్చాడు.

**కవితా విశేషాలు :**

ఆకలితో చాలా కాలంలో గుహలో ఉన్న సింహానికి అరణ్య వాస క్లేశాన్ని అనుభవించిన అర్జునునికి పోలిక ఈ పద్యంలో చెప్పబడింది. సింహానికీ ఏనుగులకు సహజ వైరం. పాండవ ధార్త రాష్ట్రుల వైరమూ అలాంటిదే. సింహం గుహలోనుంచి బయటపడే సమయానికి ఏనుగుల సమూహం కనిపించినట్లే కుంతీ సుత మధ్యమునికి అరణ్యవాసం పూర్తి కావటంతో కౌరవ సేన కనిపించింది. ద్రోణుని పలుకుల్లో చక్కటి ఉపమాలంకారాన్ని తిక్కన పొందుపరిచాడు.

'కుంతీ సుతమధ్యముడు' అని చెప్పటంలో పాండవులైదుగురూ కుంతీ పుత్రులేననే అంతరార్థాన్ని కవి ధ్వనింపజేశాడు. దశవిధ పుత్రులలో పెంపుడు కొడుకు కూడా ఉంటాడు. అందువల్ల అర్జునుడు కుంతీసుత మధ్యముడే. సంస్కృత భారతంలోనూ పాండవుల్ని 'పార్థః' అని చెప్పటం జరిగింది. పృథ (కుంతి) పుత్రులే పార్థులు. నకుల సహదేవులకు కూడా ఈ పదం వాడబడింది.

ఈ మత్తేభ పద్యంలో స్ఫూర్జిత, యూథ, క్రోధ, ఖిన్న, మధ్యముండు, స్థేమ మొదలైన మహాప్రాణాల ప్రయోగం పద్యానికి తేజస్సును కలిగిస్తున్నది.

**పద్యం : 157**

ప్రియ మక్షీణము నాకు నీదెస మదిన్ భీతి ప్రదోద్వేగసం
శయముల్ సేరఁగ నీను నీకు ఘన రక్షా కల్పనా బుద్ధి ని
శ్చయ సంపాదిని నాదుదృష్టి నిను నశ్వవ్రాతముం జోఁక గా
లియు రానీను దృణీకరింపు రిపు దోర్లీలా సముల్లాసమున్.

**పరిచయం :**

ఈ పద్యం తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతము విరాట పర్వంలోని చతుర్థాశ్వాసంనుంచి స్వీకరించబడిన 'ఉత్తర గోగ్రహణము' అనే పాఠ్యభాగం లోనిది.

**సందర్భం :**

అర్జునునికి యుద్ధంలో సారథ్యం చెయ్యాలనే చిరకాల వాంఛ విధి దయవల్ల నెరవేరిందని ఉత్తరుడు పలికినప్పుడు అర్జునుడు ఎంతో ఆదరణతో ఉత్తరుని జూచి పలుకుతున్న పలుకులివి.

**ప్రతి పదార్థం : (ఓ ఉత్తరుడా !)**

| | | |
|---|---|---|
| నాకున్ | = | నాకు (అర్జునకు) |
| నీ దెసన్ | = | నీ మీద |
| ప్రియము | = | ఇష్టం |

| | | |
|---|---|---|
| అక్షీణము | = | ఎప్పటికీ తరగనిది (ఎక్కువ) |
| మదిన్ | = | మనసులో |
| భీతి ప్రద | = | భయం వల్ల కలిగే |
| ఉత్ + వేగ | = | ఆవేశాన్ని గానీ |
| సంశయముల్ | = | సందేహాల్ని గానీ |
| చేరగనీను | = | చేరనివ్వను |
| నా + దృష్టి | = | నా చూపు |
| ఘన | = | అధికమైన |
| రక్షా కల్పనా బుద్ధిన్ | = | రక్షణ కల్పించే బుద్ధిలో |
| నిశ్చయ సంపాదిని | = | నిశ్చయాన్ని కలిగించేది |
| నినున్ | = | నిన్నూ |
| అశ్వవ్రాతమున్ | = | గుర్రాల సమూహాన్నీ |
| సోఁకన్ | = | తాకటానికి |
| గాలియు రానీను | = | గాలిని కూడా రానివ్వను |
| రిపు | = | శత్రువుల యొక్క |
| దోః + లీలా సముల్లా సమున్ | = | భుజ విలాసోద్రేకాన్ని |
| తృణీకరింపు | = | లెక్క చెయ్యవద్దు. |

తాత్పర్యం : "ఓ ఉత్తరుడా ! నీ మీద నాకెంతో ప్రేమ. నీకు భయాన్ని, ఉద్వేగాన్ని, సంశయాన్ని కలగనివ్వను. నీకు దృఢమైన రక్షణ కల్పించటంలోనే నా దృష్టి నిలిచి ఉంటుంది. నిన్ను గానీ, గుర్రాల్ని గానీ తాకటానికి గాలిని కూడా రానివ్వను. నీవు శత్రువుల భుజ బల విలాసాల్ని లెక్కచెయ్యవలసిన అవసరం లేదు. అంటే శత్రువులకు నువ్వు భయపడవద్దు."

కవితా విశేషాలు :

తిక్కన పద్యం ఎత్తుగడలోనే ప్రత్యేకతను ప్రదర్శించాడు. ఉత్తరుడంటే అర్జునునికి ఇష్టం అని చెప్పటానికి 'ప్రియమక్షీణము' అని పద్యాన్ని ప్రారంభించాడు. ప్రియం అనే మాట పద్యానికి మకుటప్రాయంగా నిలిచింది. అదికూడా తరగని ప్రియం. అందుకే ఉత్తరునికి ఎలాంటి భయాన్ని కలగనివ్వనన్నాడు. అతని రక్షణ మీదనే అర్జునుని దృష్టినిలిచి ఉంటుందని అభయమిచ్చాడు. చక్కటి సమాసాలతో మత్తేభంలో సాగిన ఈ పద్యంలో 'గాలియు రానీను' అనే పలుకుబడి ఎంతో సముచితంగా ప్రయోగించబడింది. గాలిని కూడా సోకనివ్వనని చెప్పటంతో ఎంత రక్షణ కల్పిస్తాడో ఊహించవచ్చు. లెక్క చెయ్యవద్దు అనటానికి 'తృణీకరింపు' అంటే గడ్డి పోచగా ఈసడించు అనే అర్థాన్ని స్పష్టం చేశాడు. తిక్కన సముచిత సమాస నిర్మాణానికి నిలువెత్తు సాక్ష్యంగా సాగిందీ పద్యం.

పద్యం : 172

కలగెం దోయధి సప్తకంబు; గిరివర్గం బెల్ల నూటాడె, సం
చలతం బొందె వసుంధరావలయ; మాశాచక్రమల్లాడె; గొం
దల మందెం త్రిదశేంద్రు పట్టణము; పాతాళంబు ఘూర్ణిల్లె ;నా
కులమయ్యెన్ గ్రహతారకాకులము; సంక్షోభించె నిర్వేదయున్ !

పరిచయం :

ఈ పద్యం తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతము విరాట పర్వంలోని చతుర్థాశ్వాసంనుంచి స్వీకరించబడిన 'ఉత్తర గోగ్రహణము' అనే పాఠ్య భాగంలోనిది.

సందర్భం :

జమ్మి చెట్టుకు ప్రదక్షిణంగా రథాన్ని పోనిమ్మని అర్జునుడు ఉత్తరునితో పలకటంతో ఉత్తరుడు రథాన్ని తోలటం ప్రారంభించాడు. అప్పుడు అర్జునుడు యుద్ధోత్సాహంతో శంఖాన్ని పూరించగా దాని ప్రభావాన్ని కవి వర్ణిస్తున్న సందర్భంలోనిదీ పద్యం.

ప్రతి పదార్థం : (శంఖ ధ్వని వల్ల)

| | | |
|---|---|---|
| తోయధి సప్తకంబు | = | సప్త సముద్రాలూ |
| కల గెన్ | = | కలత చెందాయి |
| గిరి వర్గంబు + ఎల్లన్ | = | పర్వతాల సమూహమంతా |
| ఊటాడె | = | అటు ఇటూ ఊగింది |
| వసుంధరా వలయము | = | భూ మండలం |
| సంచలతన్ + పొందెన్ | = | మిక్కిలిగా కదిలింది. |
| ఆశాచక్రము | = | దిక్కుల సమూహం |
| ఆడెన్ + ఆడెన్ | = | తీవ్రంగా కదిలింది. |
| త్రిదశ + ఇంద్రు పట్టణము | = | దేవేంద్రుని నగరమైన అమరావతి |
| కొందలము + అందెన్ | = | కలత చెందింది. |
| పాతాళంబు | = | పాతాళలోకం |
| ఘూర్ణిల్లెన్ | = | తిరుగుడు పడింది. |
| గ్రహ తారకా కులము | = | గ్రహాల తారకల సముదాయం |
| ఆ కులము + అయ్యెన్ | = | కలత చెందింది. |
| ఆ + వేధయున్ | = | ఆ బ్రహ్మ దేవుడు కూడా |
| సంక్షోభించెన్ | = | బాధ పడ్డాడు |

**తాత్పర్యం :** అర్జునుడు యుద్ధోత్సాహంతో శంఖాన్ని పూరించగానే సప్త సముద్రాలు కలత చెందాయి. పర్వతాలన్నీ ఊగిసలాడాయి. భూ మండలం కంపించింది. దిక్కులన్నీ అల్లాడి పోయాయి. ఇంద్రుని నగరమైన అమరావతి అల్లాడింది. పాతాళం మిక్కిలి చలించింది. గ్రహాలు నక్షత్రాలు తికమక పడ్డాయి. బ్రహ్మదేవుడు కూడా క్షోభ చెందాడు.

కవితా విశేషాలు :

తిక్కన రసాభ్యుచితబంధం ఈ పద్యంలో కనిపిస్తున్నది. ప్రకృతిలోని హఠాత్పరిణామాన్ని తిక్కన సముచిత శబ్ద ప్రయోగం ద్వారా వర్ణించాడు. 'కలగెన్' అనే క్రియతో పద్యాన్ని ప్రారంభించి ఆ కలతను పద్యమంతటా వర్ణించాడు. ఒక్కో సమాసంలో ఒక్కో కలతను వర్ణించాడు. 'గిరి వర్గం బెల్లనూటాడె, ఆశాచక్రమల్లాడె, పాతాళంబు ఘూర్ణిల్లె అని అంత్యానుప్రాసలో ఆయా సంక్షోభాల్ని తెలియ జేశాడు. ఈ పద్యంలో తిక్కన ప్రయోగించిన క్రియాపదాలు కలగెన్, ఊటాడె, సంచలతం బొందె, అల్లాడె, కొందలమందె, ఘూర్ణిల్లె, ఆకులమయ్యెన్, సంక్షోభించె అనేవి ఆయా సమాసాల కనుగుణంగా రసోచితంగా ప్రయోగించబడ్డాయి. పద్యాన్ని ముగిస్తూ 'సంక్షోభించె నవ్వేధయున్' అనటం మిక్కిలి సముచితంగా ఉన్నది. వీర రసాన్ని పరోక్షంగా ప్రతిబింబించే ఈ పద్యం మత్తేభంలో సాగటం ఔచితీమంతమని చెప్పవచ్చు.

పద్యం : 186

అర్జునుడైన నేమి ? సురలైనను నేమగు ? విద్విషచ్ఛిదో
పార్జిత మైన గోగణము (బట్టితి మెవ్వరు వచ్చిరేని, వి
స్ఫూర్జిత బాహు సంపదలు సూపుద మొండొరు మీఱి నిర్మలా
త్యూర్జితకీర్తికారణ రణోద్ధతి వెల్వెల బాఱనేటికిన్ ?

పరిచయం :

ఈ పద్యం తిక్కన రచించిన ఆంధ్ర మహా భారతము విరాట పర్వంలోని చతుర్థా శ్వాసనుంచి స్వీకరించబడిన 'ఉత్తర గోగ్రహణము' అనే పాఠ్య భాగంలోనిది.

సందర్భం :

ద్రోణుడు అర్జునుని ఎదుర్కొనటానికి సైన్యాన్ని చక్కగా నియమించుకోవలసిన అవసరం ఉన్నదని దుర్యోధనాది వీరులతో పలికినప్పుడు దుర్యోధనుడు వచ్చిన వాడెవడైనా సరే కీర్తి కారణమైన యుద్ధంలో పరాక్రమాన్ని ప్రదర్శిద్దామని భీష్మాదులతో పలుకుతున్న సందర్భంలోనిదీ పద్యం.

ప్రతి పదార్థం :

| | | |
|---|---|---|
| అర్జునుడు + ఐనన్ + ఏమి | = | (వచ్చినవాడు) అర్జునుడైతేనేం ? |
| సురలు+ఐననున్+ఏమి+అగు | = | దేవతలైనా ఏమవుతుంది ? |
| విద్విషత్ | = | శత్రువుల్ని |
| ఛిదా | = | ఛేదించటానికి |
| ఉప + ఆర్జితమైన | = | బాగా సంపాదించిన |
| గోగణమున్ | = | ఆవులమందను |
| పట్టితిమి | = | పట్టుకొన్నాము |
| ఎవ్వరు వచ్చిరి + ఏనిన్ | = | ఎవరు వచ్చినా |
| నిర్మల | = | స్వచ్ఛమైన |
| అతి + ఊర్జిత | = | మిక్కిలి బలమైన |
| కీర్తి కారణ | = | కీర్తికి కారణమైన |
| రణ + ఉద్ధతిన్ | = | యుద్ధసంబంధమైన ఔద్ధత్యంతో |
| ఒండు + ఒరున్ మీఱి | = | ఒకరి నొకరు అధిగమించి |
| విస్ఫూర్జిత | = | పొగడదగిన |
| బాహు సంపదలు | = | భుజ బలాలను |
| చూపుదము | = | చూపించుదాం. |
| వెల్వెలన్ + పాఱన్ + ఏటికిన్ | = | వెలవెల బోవలసిన పనేమిటి ? |

తాత్పర్యం : వచ్చింది అర్జునుడైనా దేవతలైనా ఏమవుతుంది ? శత్రువుల్ని అణచటానికి సంపాదించిన గోగణాన్ని పట్టుకొన్నాం. ఎవరు వచ్చినా సరే కీర్తికి కారణమయ్యే యుద్ధంలో ఒకరినిమించి మరొకరం భుజబలాన్ని ప్రదర్శిద్దాం. తెల్ల మొగాలు వేయవలసిన పనిలేదు.

కవితా విశేషాలు :

ఈ పద్యంలో దుర్యోధనుని పలుకుల ద్వారా అతని రణోత్సాహం, భవిష్యత్కథా సూచన ప్రదర్శితమయ్యాయి. ఎవరెదురైనా ఏమవుతుందనే దుర్యోధనుని అహంకారమే తర్వాతి కురుక్షేత్రానికి నాంది పలికింది. అభిమాన ధనుడు కాబట్టి దుర్యోధనుడు

యుద్ధానికి జంకడనే విషయం ఈ పద్యంలో స్పష్టమవుతున్నది. 'ర్జ' అనే ప్రాస అంటే సాధురేఫ జకారాల ప్రాస పద్యానికి మరింత శోభను చేకూర్చుతున్నది. శత్రువుల్ని ఛేదించటానికే గోగణాన్ని బంధించామని చెప్పటం ద్వారా దుర్యోధనుని యుద్ధ నిర్ణయం స్పష్టమవుతున్నది. ప్రతి పాదంలోని చివరి అక్షరం తర్వాతి పాదంలోని మొదటి అక్షరం మీద ఊనిక కల్గి ఉండటం వల్ల పద్యానికి ప్రత్యేకమైన సౌందర్యం ప్రాప్తించింది. ద్రోణుని మాటలు కౌరవ వీరులకు నిరుత్సాహాన్ని కలిగించాయేమోనని దుర్యోధనుడు 'వెల్వెల < బాఱనేటికిన్' అనే ధైర్యం చెప్పాడు. ఉత్పలమాలగా సాగిన ఈ పద్యం ఆలోచనాత్మకంగా ఉన్నది.

పద్యం : 202

"జ్యాఘోషంబతి భీషణంబయి దిశాచక్రంబునిండన్ శర
వ్యాఘాతంబున శాత్రవుండు వికల స్వాంతుండుగా, నారద
శ్లాఘా పాత్రమునై ; యనర్గళ భుజా సంరంభతన్ రౌద్రరే
ఖా ఘోరాకృతి యేన చూపెద, నశంకం జూడుఁడీ యేర్పడన్".

పరిచయం :

ఈ పద్యం తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతంలోని విరాట పర్వము నందలి చతుర్థాశ్వాసంనుంచి స్వీకరించబడిన 'ఉత్తర గోగ్రహణము' అనే పాఠ్య భాగంలోనిది.

సందర్భం :

అశ్వత్థామ తన తండ్రి మాటల్ని సమర్థిస్తూ అర్జునుని ప్రశంసిస్తున్నప్పుడు కర్ణుడు తట్టుకోలేక కోపంతో కౌరవ వీరులవంక చూస్తు క్లిష్టసమయంలో రాజాను వెర్రివానిగా చేయటం తగదని తానే అర్జునుని ఎదుర్కొంటానని పలుకుతున్న సందర్భంలోనిదీ పద్యం.

ప్రతి పదార్థం :

| | | |
|---|---|---|
| జ్యా | = | అల్లె త్రాటి యొక్క |
| ఘోషంబు | = | పెద్ద శబ్దం |
| అతి భీషంబు + అయి | = | మిక్కిలి భయంకరమై |
| దిశాచక్రంబు నిండన్ | = | అన్ని దిక్కులకూ వ్యాపించగా |
| శర | = | బాణాల యొక్క |
| వ్యాఘాతంబునన్ | = | దెబ్బలతో |
| శాత్రవుండు | = | శత్రువైన అర్జునుడు |
| వికల స్వాంతుండుగా | = | కలత చెందిన మనసుతో ఉండగా |
| నారద | = | నారదుని యొక్క (కలహ భోజనుడైన నారదుని) |
| శ్లాఘా పాత్రమునై | = | ప్రశంసకు అర్హమైన |
| అనర్గళ | = | సాటిలేని (తిరుగులేని) |
| భుజా సంరంభతన్ | = | భుజోద్రేకంతో |
| రౌద్ర రేఖా | = | రౌద్ర రసస్ఫూర్తితో |
| ఘోర + ఆకృతి | = | భయంకరమైన రూపాన్ని |
| ఏన + చూపెదన్ | = | నేనే చూపిస్తాను |
| అశంకన్ | = | అనుమానం లేకుండా |
| ఏర్పడన్ | = | స్పష్టంగా |
| చూడుఁడీ | = | చూడండి |

తాత్పర్యం : "నా వింటి అల్లె త్రాటి ధ్వని భయంకరమై అన్ని దిక్కులకు వ్యాపించేటట్లు, నా బాణపు దెబ్బకు శత్రువు కలత చెందేటట్లు, నా పని నారదుని చేత ప్రశంసింప బడేటట్లు సాటిలేని భుజబలంతో రౌద్రరసం మూర్తీభవించిన రూపాన్ని నేనే చూపిస్తాను. మీ మనసుల్లో ఎలాంటి సందేహం లేకుండా స్పష్టంగా చూడండి.

కవితా విశేషాలు :

తిక్కన ఈ పద్యంలో రచనా రీతిలో పారుష్యాన్ని ప్రదర్శించి శార్దూల వృత్తంలో కర్ణుని ఉద్ధతిని ప్రకటించాడు. 'ఘ' కార ప్రాస ద్వారా సాగిన ఈ పద్యంలో కర్ణుని వాచాలత్వం కనిపిస్తున్నది. కర్ణునికి చేతలకంటే మాట లెక్కువ అనే అంశాన్ని ఈ పద్యం స్పష్టం చేస్తున్నది. తన పరాక్రమాన్ని నారదుడు కూడా మెచ్చుకొనేటట్లు ప్రదర్శిస్తాననటంలో కర్ణుని గర్వోన్నతి స్పష్టమవుతున్నది. 'ఏనచూపెద' అనటంలో 'నేనే' అనే అహంకారం ధ్వనిస్తున్నది. ఇన్ని ప్రగల్భాలు పలికిన కర్ణుడు తర్వాత అర్జునునితో జరిగిన ద్వంద్వ యుద్ధంలో యుద్ధ రంగంనుంచి పారిపోతాడు. దీన్ని బట్టి కర్ణుని అశక్త దుర్జనత్వం స్పష్టమవుతుంది.

పద్యము : 212

కుంతీనందను లొక్క(డొక్క(డ రిపుక్షోభంబు సంధిల్ల దు
ర్దాంత స్వైర పరాక్రమంబులు మహోత్సాహంబునం జేసి ర
త్యంతోదగ్రత ( బల్కెదీ విచట బాహాశక్తి యిమ్మేదినీ
కాంతుండియ్యు కొనంగ ( బూనితి వృథా గర్వంబు నీకేటికిన్ ?

పరిచయం :

ఈ పద్యం తిక్కన మహాకవి రచించిన ఆంధ్ర మహాభారతములోని విరాట పర్వమునందలి చతుర్థాశ్వాసంనుంచి స్వీకరించబడిన 'ఉత్తర గోగ్రహణము' అనే పాఠ్య భాగంలోనిది.

సందర్భం :

కర్ణుని ప్రగల్భాలను విన్న కృపాచార్యుడు అర్జునుని పరాక్రమాన్ని ప్రశంసిస్తూ కర్ణునితో మత్స్యయంత్రాన్ని అర్జునుడు అవలీలగా కొట్టిన సమయంలో 'నువ్వు అక్కడే ఉన్నావా ? లేవా ? నిజం చెప్పు' అని పాండవులు ఎవరికి వారే పరాక్రమ సంపన్నులని ప్రశంసిస్తున్న సందర్భంలోనివీ పలుకులు.

ప్రతి పదార్థం :

| | | |
|---|---|---|
| కుంతీ నందనులు | = | పాండవులు |
| ఒక్కడు + ఒక్కడ | = | ఒక్కడొక్కడే (ఎవరికి వారే) |
| రిపు | = | శత్రువులకు |
| క్షోభంబు సంధిల్ల | = | కలత కలిగేటట్లు |
| మహా + ఉత్సాహంబునన్ | = | అధికమైన ఉత్సాహంతో |
| దుర్దాంత | = | అణచటానికి వీలుకాని |
| స్వైర పరాక్రమంబులు | = | స్వేచ్ఛా పరాక్రమాలు |
| చేసిరి | = | ప్రదర్శించారు |
| ఈవు | = | నీవు (కర్ణుడవు) |
| ఇచట | = | ఇక్కడ |
| బాహాశక్తి | = | భుజబలాన్ని గూర్చి |
| అతి + అంత | = | మిక్కిలి |

| | | |
|---|---|---|
| ఉదగ్రతన్ | = | గొప్పగా |
| పల్కెదు | = | మాటాడుతున్నావు |
| ఈ + మేదినీ కాంతుండు | = | ఈ రాజు (దుర్యోధనుడు) |
| మెచ్చగా | = | మెచ్చుకోవాలనే కోరికతో |
| పూనితి | = | యుద్ధానికి సిద్ధమయ్యావు |
| వృథా గర్వంబు | = | పనికి రాని దర్పం |
| నీకున్ + ఏటికిన్ | = | నీ కెందుకు ? |

**తాత్పర్యం :** "ఓ కర్ణా ! పాండవులు ఎవరికి వారే శత్రువులు కలత చెందే రీతిలో తిరుగులేని తమ తమ పరాక్రమాన్ని ప్రదర్శించారు. నువ్వేమో ఇక్కడ భుజబలాన్ని గూర్చి గొప్పలు చెబుతున్నావు. దుర్యోధనుడు మెచ్చుకొని వింటున్నాడు. ఎందుకు నీకీ అనవసర గర్వం" అని కృపాచార్యుడు పలికాడు.

**కవితా విశేషాలు :**

కర్ణుని మాటలు పనికి రానివని, కర్ణుని గర్వం అనవసరమైందని కృపాచార్యుడు ఖండిస్తూ పాండుసుతుల పరాక్రమాన్ని ప్రశంసించాడు. 'ఒక్కడొక్కడ' అని కుంతీకుమారుల్ని గూర్చి చెప్పటం ద్వారా పాండవులందరూ పరాక్రమ సంపన్నులేనని చెప్పాడు. తిక్కన సుదీర్ఘ సమాసంలో 'రిపు క్షోభంబు సంధిల్ల దుర్దాంత స్వైర పరాక్రమంబులు మహోత్సాహంబునం జేసిరి" అని రచించి పాండవుల అనర్గళ పరాక్రమ సంపదను తెలియజేశాడు. కర్ణుని పలుకులు అత్యంత ఉదగ్రంగా ఉన్నాయని కృపాచార్యుని అభిప్రాయం. అంటే కర్ణుడు వాక్శూరుడేగాని కార్యశూరుడు గాడని వ్యంగ్యం. 'వృథా గర్వంబునీ కేటికిన్ ?' అనటం ద్వారా కర్ణుడు అసమర్థుడనే విషయాన్ని ప్రకటించాడు. శార్దూల వృత్తంలో సాగిన ఈ పద్యం పాండవుల ఆధిక్యాన్ని కర్ణుని పరాక్రమలేమిని ప్రకటిస్తున్నది.

**పద్యం : 234**

వచ్చినవాడు ఫల్గును ఁడవశ్యము గెల్తుమనంగరాదు, రా
లచ్చికినై పెనంగి బలంబులు రెండును గెల్వ నేర్చునే
హెచ్చుగు గుందగుందొదరు టెల్ల విధంబుల కోర్చుటట్లుగా
కిచ్చ ఁదలంచి యొక్క మెయినిత్తఱిఁ బొందగు చేఁతయుం దగున్ !

**పరిచయం :**

ఈ పద్యం తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతము - విరాట పర్వంలోని చతుర్థాశ్వాసంనుంచి స్వీకరించబడిన 'ఉత్తర గోగ్రహణము' అనే పాఠ్య భాగంలోనిది.

**సందర్భం :**

భీష్ముడు దుర్యోధనునితో పాండవుల అరణ్య అజ్ఞాత వాసాలు పూర్తి అయ్యాయని చెబుతూ వారు ధర్మపాశాలకు కట్టబడిన వారని కాలంకోసం నిరీక్షించారని, వారు తమ పరాక్రమం చూపటానికి వస్తే మనమూ ఎదిరిద్దామని పలుకుతూ అర్జునుని రాకను తెలియజేస్తున్న సందర్భంలోని దీ పద్యం.

**ప్రతిపదార్థం : (ఓ దుర్యోధనా !)**

| | | |
|---|---|---|
| వచ్చినవాడు | = | ఇక్కడకు వచ్చినవాడు |
| ఫల్గునుఁడు | = | అర్జునుడు |
| అవశ్యము | = | తప్పకుండా |

| | | |
|---|---|---|
| గెల్తుము+అనంగరాదు | = | విజయాన్ని సాధిస్తామని చెప్పలేం |
| రాలచ్చికిన్ + ఐ | = | రాజ్య సంపదకోసం |
| పెనంగిన | = | పోట్లాడిన |
| బలంబులు | = | సైన్యాలు |
| రెండును | = | రెండు వైపులా ఉన్నవి |
| గెల్వ నేర్చునే | = | గెలవటం సాధ్యమవుతుందా ? |
| హెచ్చు + అగున్ | = | గెలుపు కలగవచ్చు |
| కుందు + అగున్ | = | ఓటమి పొందవచ్చు (కాబట్టి) |
| తొడరుట | = | ఎదిరించటం |
| ఎల్ల విధంబులకున్ + ఓర్చుట | = | ఏ పద్ధతినైనా సహించటం (అవుతుంది) |
| అట్లు + కాక | = | ఆ విధంగా కాకుండా |
| ఇచ్చన్ + తలంచి | = | మనసులో ఆలోచించి (అంగీకరించి) |
| ఒక మెయిన్ | = | ఒక పద్ధతి ప్రకారం |
| ఈ + తఱిన్ | = | ఇప్పుడు |
| పొందు + అగుచేఁతయున్ | = | సంధి జరిగే పనికూడా |
| తగున్ | = | తగినదే |

**తాత్పర్యం :** (ఓ దుర్యోధనా!) వచ్చినవాడు అర్జునుడు. తప్పకుండా గెలుస్తామని చెప్పటం కుదరదు. రాజ్యలక్ష్మి కోసం పోరాడే రెండు పక్షాలు గెలువలేవు కదా ! జయం కలగవచ్చు. లేదా అపజయం ప్రాప్తించవచ్చు. ఏమైనా ఎదిరించటం లేదా సహించటం జరగాలి! అంతే ! అదీగాక ఒక విధంగా ఆలోచిస్తే ఇప్పుడు సంధి చేసుకోవటం కూడా మంచిదే".

**కవితా విశేషాలు :**

తిక్కన రచించిన ఈ పద్యం తెలుగునాట నానుడిగా స్థిరపడింది. 'వచ్చినవాడు ఫల్గునుడు' అనే పదం ప్రజా బాహుళ్యంలో బాగా ప్రచారం పొందింది. 'వచ్చిన వాడు' అని క్రియా పదంతో తిక్కన పద్యాన్ని ప్రారంభించాడు. అర్జునుడికి కిరీటి, బీభత్సుడు, కవ్వడి, ధనంజయుడు మొదలైన విశేణాలతో పాటు 'ఫల్గునుడు' అనే పేరుకూడా ఉన్నది. ఉత్తర ఫల్గునీ నక్షత్రంలో జన్మించటం వల్ల అర్జునునికి ఆ పేరు కలిగింది. 'ఫల్గుని' జయతార. ఆ నక్షత్రంలో పుట్టిన వానికి అపజయం ఉండదు. అందుకే తిక్కన 'ఫల్గునుడు' అనే విశేషణాన్ని సాభిప్రాయంగా ప్రయోగించాడు. విశేషణాన్ని సాభిప్రాయంగా ప్రయోగిస్తే అది పరికరాలంకారం అవుతుంది. మొదటి పాదంలో 'గెల్తుమనంగరాదు' అని చెప్పి పద్యాన్ని పొందగు చేతం యుండగున్ అని ముగించాడు. అంటే ఇప్పటికైనా సంధి చేసుకోవటం మేలన్నాడు. జయాపజయాలు అనిశ్చితాలు కాబట్టి సంధి మంచిదని భీష్ముడు పలికాడు. ఉత్పలమాల ఛందంలో సాగిన ఈ పద్యంలో 'గెల్తుమనంగరాదు' 'రాలచ్చి' 'పెనంగిన' 'కుందగు' 'తొడరుట' 'ఇచ్చ' ఒక్కమెయి మొదలైన అచ్చ తెలుగు శబ్దాలు శ్రుతిహితంగా ఉన్నాయి.

**పద్యం : 251**

విలసద్గాండివ చాపనోద్ధతి కనద్విద్యుల్లతా లీలగా
నలఘు స్ఫార కపిధ్వజ సముద్య ద్గర్జ చందంబుగా
జలదా కారత నొందెఁ దేరితఁడు పర్జన్యాకృతింబొల్చెఁదో
చ్చల తీవ్రారి నిదాఘ దుర్విషహా గర్వ స్ఫూర్తి నిర్మూర్తి గాన్ !

పరిచయం :

ఈ పద్యం తిక్కన సోమయాజి రచించిన ఆంధ్ర మహాభారతములోని విరాట పర్వమునందలి చతుర్థాశ్వాసంనుంచి స్వీకరించబడిన 'ఉత్తర గోగ్రహణము' అనే పాఠ్య భాగంలోనిది.

సందర్భం :

అర్జునుడు ఉత్తరునితో దుర్యోధనుని వైపు రథాన్ని నడపమని చెప్పి ద్రోణ, భీష్మ కృపాచార్యుల పాదాల దగ్గర రెండేసి బాణాలు, చెవుల ప్రక్కనుంచి వెళ్ళేటట్లు రెండేసి బాణాలు ప్రయోగించినప్పుడు అర్జునుని ప్రశంసిస్తూ ప్రక్కనున్న ఆప్తులతో పలుకుతున్న సందర్భంలోనిదీ పద్యం.

ప్రతి పదార్థం :

| | | |
|---|---|---|
| విలసత్ | = | విజృంభించే |
| గాండివ | = | గాండివం అనే పేరుగల వింటిని |
| చాలన | = | తిప్పటంలో |
| ఉద్ధతి | = | తీవ్రత |
| కనత్ | = | వెలుగులు చిమ్మే |
| విద్యుత్ + లతా లీలగాన్ | = | మెరుపు తీగవలె కాగా |
| అలఘు | = | గొప్పదైన |
| స్ఫార | = | ప్రకాశం గలిగిన |
| కపిధ్వజ | = | కోతి గుర్తుగల జెండా యొక్క |
| ధ్వని | = | మోత |
| సముద్యత్ | = | మిక్కిలిగా వెలువడే |
| గర్జ చందంబుగా | = | గర్జనం వలె |
| తేరు | = | రథం |
| జలద + ఆకారతన్ + ఒందెన్ | = | మేఘాకృతిని పొందింది. |
| ఇతడు | = | ఈ అర్జునుడు |
| దోః+బల | = | భుజబలం చేత |
| తీవ్ర | = | తీక్ష్ణమైన |
| అరి | = | శత్రువు అనే |
| నిదాఘ | = | వేసవి యొక్క |
| దుర్విషహ | = | సహించటానికి వీలుకాని |
| గర్వ స్ఫూర్తి | = | గర్వం యొక్క విలాసం |
| నిర్మూర్తి + కాన్ | = | నశించేటట్లు |
| పర్జన్య + ఆకృతిన్ | = | ఇంద్రునిలా |
| పొల్చెన్ | = | ప్రకాశించాడు. |

**తాత్పర్యం :** అర్జునుని గాండీవపు కదలిక మెరుపు తీగెలాగా, అతని కపిధ్వజ ధ్వని మేఘ గర్జనంలా ఉండగా అతని రథం మేఘాకృతిని ధరించింది. అర్జునుడు శత్రువనే వేసవి యొక్క గర్వం పూర్తిగా నశించేటట్లు ఇంద్రునిలా ప్రకాశించాడు (శత్రువుల భుజబలం వేసవిలా ఉండగా అర్జునుడు వర్షాధి దేవత అయిన ఇంద్రునిలా ప్రకాశించాడు).

కవితా విశేషాలు :

సందర్భోచితంగా సాగిన ఈ వర్ణన తిక్కన సమాస నిర్మాణ చాతుర్యానికీ, ఆలంకారిక ప్రతిభకూ, వర్ణనా నైపుణ్యానికీ నిదర్శనంగా ఉన్నది. తిక్కన పాండిత్య స్ఫోరకంగా ఈ పద్యాన్ని రచించాడు. గాండీవ చాలనం విద్యుల్లతలాగా, కపిధ్వజ ధ్వని మేఘ గర్జనంలాగా, రథం జలదంగా అర్జునుడు పర్జన్యునిలా ఉన్నట్లు వర్ణించటంలో ఉపమాలంకారాన్ని గుర్తించవచ్చు. శత్రువు అనే వేసవి తీవ్రత అనటంలో రూపకాలంకారం, భాసిస్తున్నది. వేసవి ఎంత తీవ్రంగా ఉన్నా తొలకరి మేఘాల రాకతో చల్లబడిపోతుంది. అలాగే అర్జునుడనే మేఘుని రాకతో శత్రువుల గర్వమనే వేసవి తీవ్రత సమసిపోతుందని భావించవచ్చు. విద్యల్లతతో పోల్చేటప్పటి 'ల' కార పునరావృత్తి, గర్జనంతో సామ్యం చెప్పేటప్పటి 'ద' కార పునరావృత్తి నాద మాధుర్యాన్ని ప్రాప్తింపజేస్తున్నది. ముందుగా సామ్యంగా మత్తేభ ఛందంలో సాగిన ఈ పద్యం ముగిసేటప్పటికి వేగ తీవ్రతను అందుకొని తిక్కన ప్రతిభకు సాక్ష్యంగా నిలుస్తున్నది.

## 1.4.1. సందర్భ సహిత వ్యాఖ్యలు :

### 1. దానికి నీడుగఁజేయు మిత్త్రతిన్ (పద్యం - 7)

పరిచయం : ఈ వాక్యం తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతములోని విరాట పర్వమునందలి చతుర్థాశ్వాసం నుంచి స్వీకరించబడిన 'ఉత్తర గోగ్రహణము' అనే పాఠ్యభాగంలోనిది.

సందర్భం : భీష్మ, ద్రోణ కర్ణాది మహావీరులతో కూడిన కౌరవ సైన్యం విరాటుని గోగణాన్ని తరలించుకుపోతున్న సమయంలో రాజసభకు వచ్చిన గోపాలకాధ్యక్షుడు కాంతా జనం మధ్యలో ఉన్న ఉత్తరునితో పలుకుతున్న సందర్భంలోని వీ పలుకులు.

వివరణ : 'ఉత్తరకుమారా ! నిన్ను గూర్చి మీ తండ్రి గొప్పగా చెబుతూ ఉంటాడు. నీవు కులదీపకుడవని, రాజ్యకార్య భార నిర్వహణ దురీణుడవని, ఆపదలనుంచి రక్షించే సామర్థ్యం కలవాడవని చెబుతూ ఉంటాడు. ఆ పలుకులకు అనుగుణంగా ప్రవర్తించు" అని గోపాలకాధ్యక్షుడు పలికాడు.

### 2. ఎఱింగిన పని సెప్పగా వలయు (పద్యం - 15)

పరిచయం : ఈ వాక్యం తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతములోని విరాట పర్వమునందలి చతుర్థాశ్వాసం నుంచి స్వీకరించబడిన 'ఉత్తర గోగ్రహణము' అనే పాఠ్యభాగంలోనిది.

సందర్భం : ఉత్తరునికి రథసారధి అవసరమైన విషయాన్ని గూర్చి సైరంధ్రి బృహన్నలలు మాట్లాడుకొన్న తర్వాత సైరంధ్రి, ఉత్తర దగ్గరకు వెళ్లి బృహన్నలను గూర్చి పలుకుతున్న సందర్భంలోనివీ పలుకులు.

వివరణ : "రాజ కుమారుడు తగిన సారథి కోసం వెదుకుతున్నాడు కదా ! తెలిసిన విషయాన్ని చెప్పాలి కాబట్టి చెబుతున్నాను. అర్జునుని మెప్పుపొందిన భుజశక్తి బృహన్నలకున్నది. ఈ విషయం నాకు తెలుసు కాబట్టి దాచుకోకుండా చెబుతున్నాను" అని సైరంధ్రి ఉత్తరతో పలికింది.

### 3. ఏను బేడిఁ జూడ రోయుదు (పద్యం - 18)

పరిచయం : ఈ వాక్యం తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతములోని విరాట పర్వమునందలి చతుర్థాశ్వాసం నుంచి స్వీకరించబడిన 'ఉత్తర గోగ్రహణము' అనే పాఠ్యభాగంలోనిది.

సందర్భం : బృహన్నల పలుకుల కనుగుణంగా సైరంధ్రి ఉత్తర దగ్గరకు వెళ్లి అర్జునునికి ఖాండవ దహన సమయంలో సహకరించినది బృహన్నలయేనని చెప్పి తర్వాత వాళ్లిద్దరూ ఉత్తరుని దగ్గరకు వెళ్లి ఆ విషయాన్ని చెప్పగా ఉత్తరుడు సైరంధ్రి వంక చూచి నవ్వుతూ పలుకుతున్న సందర్భంలోనివీ పలుకులు.

వివరణ : "అయ్యో ! సైరంధ్రీ నన్ను గేలిచెయ్యటమెందుకు ? బాగా కళ్ళు తెరచి నపుంసకుడైన వానిని చూడటానికే ఇష్టపడను కదా! మరి సారథిగా ఎలా అంగీకరిస్తాను" అని ఉత్తరుడు సైరంధ్రితో పలకటం ద్వారా ఎట్టి పరిస్థితుల్లోనూ బృహన్నలను సారథిగా స్వీకరించటం కుదరదనే భావాన్ని వక్తం చేశాడు.

### 4. తేరెక్కుము దప్పఁ గ్రుంకఁ దీఁటదు నీకున్ (పద్యం - 34)

పరిచయం : ఈ పలుకులు తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతములోని విరాట పర్వమునందలి చతుర్థాశ్వాసం నుంచి స్వీకరించబడిన 'ఉత్తర గోగ్రహణము' అనే పాఠ్యభాగంలోనివి.

సందర్భం : సంగీత నిలయం నుంచి వస్తున్న బృహన్నలను చూసిన ఉత్తరుడు తనకు కౌరవులతో కయ్యం కలిగింది కాబట్టి 'నువ్వు రథాన్ని నడపాలని' పలుకుతున్న సందర్భంలోనివి ఈ పలుకులు.

వివరణ : "బృహన్నలా త్వరగా రా. కవచం తొడుక్కో, రథమెక్కు, నీకు తప్పించుకోవటం కుదరదు" అని పలికి బృహన్నల బలాన్ని గూర్చి సైరంధ్రి చెప్పిందని ఉత్తరుడు తెలియజేశాడు. ఉత్తరుని పలుకుల్లో అధికార స్వరం ధ్వనిస్తున్నది.

### 5. నగుపించె నచటి యబలాజనమున్ (పద్యం - 39)

పరిచయం : ఈ పద్యపాదం తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతములోని విరాట పర్వమునందలి చతుర్థాశ్వాసం నుంచి స్వీకరించబడిన 'ఉత్తర గోగ్రహణము' అనే పాఠ్యభాగంలోనిది.

సందర్భం : ఉత్తరుడు తన రథానికి సారథిగా ఉండవలసిందని బృహన్నలతో పలికినప్పుడు అతడు తన అశక్తతను ప్రకటించగా ఖాండవ దహన సమయంలో ప్రకటించిన బాహు బలం నశించిందా అని పలికి చివరకు సారథిగా అంగీకరింపజేసి కవచం తెప్పించి ధరించమనగా దాన్ని బృహన్నల ధరించిన తీరును కవి వర్ణిస్తున్న సందర్భంలోనివీ పలుకులు.

వివరణ : ఉత్తరుడు తెప్పించిన కవచాన్ని వ్యత్యస్తంగా బృహన్నల ధరించి కొలువులోని కాంతా జనాన్ని నవ్వింపజేశాడు. బృహన్నల అభినయ చాతుర్యానికీ చేష్ట మచ్చుతునక.

### 6. బొమ్మ పొత్తికల కుంచెండీ (పద్యం -47)

### 7. అటు మూఁడెల్ల భంగులఁ దెత్తున్ (పద్యం - 48)

పరిచయం : ఈ వాక్యం తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతములోని విరాట పర్వమునందలి చతుర్థాశ్వాసం నుంచి స్వీకరించబడిన 'ఉత్తర గోగ్రహణము' అనే పాఠ్యభాగంలోనిది.

సందర్భం : ఉత్తరుడు బృహన్నల సారథ్యంలో కురువీరుల మీదకు యుద్ధానికి వెళుతున్న సమయంలో ఉత్తర, ఆమె చెలికత్తెలు కురువీరుల్ని గెలిచి వారు ధరించిన వస్త్రాలలో రంగు రంగులుగా ప్రకాశించే వాటిని బొమ్మ పొత్తికలకు తీసుకురమ్మని పలికిన సందర్భంలో బృహన్నల పలికిన పలుకులు

వివరణ : ఉత్తర ఆమె చెలికత్తెలు బొమ్మ పొత్తికలకు రంగు రంగుల వస్త్రాల్ని తెమ్మని అడిగినప్పుడు ఉత్తరుడు జయలక్ష్మిని స్వీకరిస్తాడు కాబట్టి వస్త్రాలు తీసకురావటం కష్టం కాదు. అందువల్ల అన్ని రకాల్ని తెస్తానని పలికి బృహన్నల వారిని ఆనందింపజేశాడు.

8. పసుల దయ్య మెఱుఁగుఁ బడఁతుల సంతోషమేల నాకు వనికిఁ బోల నేను (పద్యం - 59)

పరిచయం : ఈ పద్యపాదాలు తిక్కన సోమయాజి రచించిన ఆంధ్ర మహాభారతములోని విరాట పర్వమునందలి చతుర్థాశ్వాసం నుంచి స్వీకరించబడిన 'ఉత్తర గోగ్రహణము' అనే పాఠ్యభాగంలోనిది.

సందర్భం : కౌరవ సైన్యాన్ని చూచి భీతిల్లిన ఉత్తరునితో అంతఃపుర కాంత సమక్షంలో పశువుల్ని వెంటనే మరలిస్తానని పలికి వచ్చి ఇప్పుడు సైన్యాన్ని చూడగానే కలత చెందటం మంచిది కాదని పలికినప్పుడు ఉత్తరుడు బృహన్నలతో పలుకుతున్న పలుకులివి.

వివరణ : "పశువుల సంగతి దేవుడికి తెలుసు. పడతుల సంతోషంతో నాకెందుకు ? యుద్ధం చెయ్యటం నావల్ల కాదు". "ఎత్తునగొందు కౌరవుల నెల్లను" అని పలికిన ఉత్తరుడు కౌరవ సైన్యాన్ని చూచి తత్తరపడి పలికిన మాటలవి. సాధారణ వాక్యాల లాగా సాగిన ఈ పద్య పాదాలు తిక్కన పద ప్రయోగానికి నిదర్శనాలని చెప్పవచ్చు.

9. దవ్వు దవ్వుల నిల్చిన నవ్వరెట్లు (పద్యం - 62)

పరిచయం : ఈ పద్యపాదం తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతములోని విరాట పర్వమునందలి చతుర్థాశ్వాసం నుంచి స్వీకరించబడిన 'ఉత్తర గోగ్రహణము' అనే పాఠ్యభాగంలోనిది.

సందర్భం : కౌరవ సేనను చూచి భయ భ్రాంతుడైన ఉత్తరుడు యుద్ధం చెయ్యటం తనకు సాధ్యం కాదని పలికినప్పుడు బృహన్నల అతనికి ఉత్సాహాన్ని కలిగింపజేస్తున్న సందర్భంలో పలికిన పలుకులివి.

వివరణ : దిక్కులు ప్రతి ధ్వనించే శంఖ ధ్వనులకు భయపడకుండా చతురంగ బలాలతో సైన్యం దాడిచేసినా జంకకుండా, శత్రువులు శస్త్రాస్త్రాలతో బాధించినా తల్లడిల్లకుండా యుద్ధంలో నిలిచి గెలిస్తేనే సత్కీర్తి లభిస్తుంది. యుద్ధ భూమినుంచి దూరంగా పారిపోతే అందరూ నవ్వుతారు, గేలిచేస్తారు. క్షత్రియుడు యుద్ధ భూమినుంచి పారిపోకుండా నిలవాలనే ప్రబోధం బృహన్నల ఉత్తరునికి చేశాడు.

10. నీ క్రొవ్వుఱుగ దేనిఁ దలపడుము (పద్యం - 71)

పరిచయం : ఈ పలుకులు తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతములోని విరాట పర్వమునందలి చతుర్థాశ్వాసం నుంచి స్వీకరించబడిన 'ఉత్తర గోగ్రహణము' అనే పాఠ్యభాగంలోనివి.

సందర్భం : బృహన్నల ఉత్తరునికి ధైర్యం కలిగించే మాటలు చెబుతూ కౌరవ సైనికులందరూ భయపడేరీతిలో వేగాన్ని బలాన్ని ప్రదర్శించి పశువుల్ని మరలించుదామని పలికినప్పుడు మనసు తల్లడిల్లిన ఉత్తరుడు బృహన్నలతో పలికిన పలుకులివి.

వివరణ : "యుద్ధ భూమి నుంచి దూరంగా వెళితే పౌరులు నవ్వుతారా ? మంచిదే. నన్ను మాత్రం ఆపవద్దు. నీ కొవ్వు అరగక పోతే నువ్వు యుద్ధం చెయ్యి." ఇక్కడ 'క్రొవ్వుఱుగదేని' అనే ప్రయోగం తిక్కన పలుకుబడికి నిదర్శనం. అంటే 'నీకు ఒళ్లు బలిస్తే' నువ్వు యుద్ధం చెయ్యి అని ఉత్తరుని భావం.

11. నివుఱు గవిసిన మెఱయని నిప్పువోలె (పద్యం - 75)

పరిచయం : ఈ పద్యపాదం తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతములోని విరాట పర్వమునందలి చతుర్థాశ్వాసం నుంచి స్వీకరించబడిన 'ఉత్తర గోగ్రహణము' అనే పాఠ్యభాగంలోనిది.

సందర్భం : రథం దిగి పారిపోతున్న ఉత్తరుని పట్టుకోవటానికి అతనివెంట పరుగెత్తుతున్న బృహన్నలను చూసిన కౌరవవీరులు అతని గొప్పతనాన్ని గుర్తించలేక అపహాస్యం చేస్తూ అతని వికృత రూపం మీద దృష్టిని నిలిపారు. అతని రూప సౌమ్యతను, ఆజాను బహుత్వాన్ని, గాంభీర్యాన్ని గుర్తించిన వారు బృహన్నలను గూర్చి తమలో తాము అనుకొంటున్న సందర్భంలోనివీ పలుకులు

వివరణ : "ఇతనిలో ఆడురీతీ, పురుషాకృతీ కనిపిస్తాయి. ఉగ్రత, పరాక్రమమూ మనోహరత్వమూ వికృత వేషంతో బయట పడక ఇతడు "నివురు గప్పిన నిప్పులా ఉన్నాడు". ఒక చక్కటి జాతీయాన్ని తిక్కన ఇక్కడ ప్రయోగించాడు. బూడిదతో కప్పబడిన అగ్నిలా ఆడురీతి పురుషరూపమూ గల బృహన్నల ఉన్నాడని వర్ణించటంలో ఆతని వీరత్వాన్ని చెప్పకనే చెప్పినట్లయింది.

**12. ఇది యొక చాపము, విస్మయ మొదవించుచుఁగొండచిలువ యొకొ వాఁదగి యున్నది (పద్యం - 118) (మార్చి 2003)**

పరిచయం : ఈ పలుకులు తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతములోని విరాట పర్వమునందలి చతుర్థాశ్వాసం నుంచి స్వీకరించబడిన 'ఉత్తర గోగ్రహణము' అనే పాఠ్యభాగంలోనివి.

సందర్భం : జమ్మిచెట్టు మీద ఉన్న ఆయుధాలు పెద్ద పెద్ద పాములలాగా ఉండటం వల్ల భయపడి వణికిపోయే ఉత్తరుని జూచి తగిన మాటలతో అర్జునుడు భయం పోగొట్టినప్పుడు ఉత్తరుడు నిర్భయంగా పలుకుతున్న పలుకులివి.

వివరణ : "ఇక్కడ ఉన్న ఒక విల్లు ఆశ్చర్యాన్ని కలిగిస్తూ కొండచిలువా అనేటట్లు ఉన్నది. దీనిపైన బంగారు పద్మాలు పొదిగారు. దీని కాంతి అంతటా వ్యాపిస్తున్నది". వింటిని కొండచిలువగా ఊహించటంలో ఉత్ప్రేక్షాలంకారం భాసిస్తున్నది.

**13. ధరణి దుర్లభమగు నవదాత వర్ణమారఁ గలుగుట నర్జునుఁడంద్రు నన్ను (పద్యం - 146) (మార్చి 2003)**

**పరిచయం :** ఈ మాటలు తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతములోని విరాట పర్వమునందలి చతుర్థాశ్వాసం నుంచి స్వీకరించబడిన 'ఉత్తర గోగ్రహణము' అనే పాఠ్యభాగంలోనివి.

**సందర్భం :** అర్జునునికి ఉన్న పదిపేర్లూ ఎలా వచ్చాయో చెప్పమని ఉత్తరుడు అడిగినప్పుడు తనకు గల పేర్లను గూర్చి చెబుతూ అర్జునుడనే పేరు వచ్చిన తీరును వివరిస్తున్న సందర్భంలోనివీ పలుకులు.

**వివరణ :** "ఈ భూమండలం మీద దుర్లభమైన అవదాత వర్ణం (తెలుపు వంటి రంగు) నిండుగా కలిగి ఉండటం వల్ల నన్ను అర్జునుడు" అంటారు. అంతేకాకుండా ఉత్తర ఫల్గునీ నక్షత్రంలో పుట్టటం వల్ల ఫల్గునుడనే పేరు కూడా అని తెలిపాడు.

**14. విహ్వల భావము మాన నేర్చునే (పద్యం 177)**

**పరిచయం :** ఈ పలుకులు తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతములోని విరాట పర్వమునందలి చతుర్థాశ్వాసం నుంచి స్వీకరించబడిన 'ఉత్తర గోగ్రహణము' అనే పాఠ్యభాగంలోనివి.

సందర్భం : అర్జునుడు తన శంఖాన్ని పూరించినప్పుడు వెలువడ్డ తీవ్రమైన ధ్వనిని విని ఆశ్చర్యపడిన ఉత్తరుడు అంతపెద్ద ధ్వనిని వినలేనని చెప్పి తనకు వ్యాకులత కలుగుతున్నదని చెబుతున్న సందర్భంలోనివీ పలుకులు.

**వివరణ :** "ఈ శంఖ ధ్వనితో చెవులు చిల్లులుపడ్డాయి. దిక్కులు తిరిగిపోతున్నాయి. గుండె నీరయిపోయింది. నీ తేజస్సు నా మనసుకు పరవశత్వం కలిగిస్తున్నది" అని పలికి ఈ వ్యాకులత తొలగిపోతుందా ? అని అడిగాడు. అర్జునుని శంఖ ధ్వని తీవ్రతను ఉత్తరుని పలుకుల ద్వారా ఇక్కడ గుర్తించవచ్చు.

**15. ఆతండ మరల్పుఁ గాక సముద్రగత వచ్చు విరోధివిప్పుడున్ (పద్యం - 194)**

**పరిచయం :** ఈ పలుకు తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతములోని విరాట పర్వమునందలి చతుర్థాశ్వాసం నుంచి స్వీకరించబడిన 'ఉత్తర గోగ్రహణము' అనే పాఠ్యభాగంలోనివి.

సందర్భం : యుద్ధానికి ముందు అశ్వత్థామ దుర్యోధనునితో జూదంలో రాజ్యాన్ని లాగుగొని దుర్భాషలాడటం ఎందుకు ? ఇపుడు సమయం వచ్చింది. పూర్వంలా జూదం చెల్లదు. జూదంలో శకుని మోసంతో రాజ్యాన్ని పొందావు కాబట్టి ఇప్పుడూ అతడే సహకరిస్తాడని వ్యంగ్యంగా పలుకుతున్న సందర్భంలోనివీ పలుకులు.

వివరణ : "పూర్వం నీవు క్రూరత్వంతో ద్రౌపదిని సభలోనికి తీసుకురమ్మని తమ్ముని పంపించింది పాండవుల్ని జయించేనా ? ఆ శకుని మోసంతో కాదూ ! ఇప్పుడు కూడా ఆ వచ్చే శత్రువుల్ని అతడే మరలిస్తాడు లే" అని అశ్వత్థామ నిర్భయంగా పలికాడు.

16. ఒంటి మార్కొన వశమె ముక్కంటికైన (పద్యం - 215)

పరిచయం : ఈ పద్యపాదం తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతములోని విరాట పర్వమునందలి చతుర్థాశ్వాసం నుంచి స్వీకరించబడిన 'ఉత్తర గోగ్రహణము' అనే పాఠ్యభాగంలోనిది.

సందర్భం : కర్ణుడు తాను అర్జునుని గెలుస్తానని ప్రగల్భాలు పలుకుతున్న సమయంలో కృపాచార్యుడు కర్ణునితో పెద్దగాలితో విజృంభించే దావానలాన్ని ఒక్కటే ఆర్పబోతే ఆరిపోతుందా అని పలికి అర్జునుని గెలవటం ఎవరికీ సాధ్యం కాదని చెబుతున్న సందర్భంలోనివి ఈ పలుకులు.

వివరణ : దుర్యోధనుడూ, భీష్ముడూ, ద్రోణుడూ, అశ్వత్థామా, నీవు, నేనూ అంతా కలసి ఎదిరిద్దాం. లేకపోతే ఆ అర్జునుని ఒంటరిగా ఎదిరించటం శివునికైనా సాధ్యమవుతుందా ? ఇక్కడ అర్జునుని ఎదిరించటం శివునికి కూడా సాధ్యం కాదని చెప్పటం ద్వారా కృపాచార్యుడు అర్జునుని శక్తి అధికమైందని తెలియజేశాడు. ఇంతకు ముందే శివుని జయించిన వాడని ధ్వని.

17. నాచేఁ జిక్కురా జెమ్మెయిన్ (పద్యం - 263)

పరిచయం : ఈ పద్యభాగం తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతములోని విరాట పర్వమునందలి చతుర్థాశ్వాసం నుంచి స్వీకరించబడిన 'ఉత్తర గోగ్రహణము' అనే పాఠ్యభాగంలోనిది.

సందర్భం : భీష్ముడు దుర్యోధనుని రక్షించాలనే ఆసక్తితో రథాన్ని సిద్ధంచేసి తొందర పెట్టగా సేనాపతిని చూసి సైన్య సమూహాలు వేగంగా బయలుదేరాయి. గోవుల్ని చుట్టుముట్టిన సైన్యం కూడా వేగంగా వెలుతుండగా దాన్ని వెంబడించి వెళ్లిన అర్జునుడు ఉత్తరునితో పలుకుతున్న సందర్భంలోనివీ పలుకులు.

వివరణ : మనం గోగణం దగ్గరకు వచ్చాం ఇంకా ముందుకు వెళ్లవలసిన అవసరం లేదు. గర్వితులైన కౌరవ సేనా వీరులకు నా భుజబలాన్ని చూపించి వారిని అణచివేస్తాను. గోవుల్ని మళ్లిస్తాను. ఏ విధంగానైనా రాజు అంటే దుర్యోధనుడు తన చేత చిక్కుతాడని అర్జునుడు తెలిపాడు. అర్జునుని పలుకుల్లో వీరం, ఆత్మవిశ్వాసం స్పష్టమవుతున్నాయి.

డా॥ గుమ్మా సాంబశివరావు ఎం. ఏ., పి హెచ్.డి.
రీడర్ & తెలుగు శాఖాధిపతి
ఆంధ్ర లొయోల కళాశాల
విజయవాడ - 520 008

మొదటి భాగము - ప్రాచీన పద్యభాగము

# ఉత్తర గోగ్రహణము - తిక్కన

## పాఠం - 5

1: 5: 0 ప్రశ్నలు - సమాధానాలు

1: 5: 1 రాదగిన ప్రశ్నలు

1: 5: 2 ఆచూకీ గ్రంథాలు

### 1:5:0 ప్రశ్నలు - సమాధానాలు :

1. ఉత్తర కుమారుని ప్రగల్భాలను మీ పాఠ్యభాగం ఆధారంగా వివరించండి.

   లేదా

2. "ఉత్తర కుమారుని ప్రజ్ఞలు" అంటే ఏమిటి వివరించండి.

   లేదా

3. ఉత్తరుని గుణశీలాలను స్వభావాన్ని తెలియజేయండి.

ఆంధ్ర మహాభారతంలోని 15 పర్వాల్ని సమర్థంగా సహృదయ రంజకంగా రచించిన తిక్కన సోమయాజి మానవ మనస్తత్వాల్ని ఎరిగిన మనోవిజ్ఞానవేత్త. తిక్కన సృష్టిలో ప్రత్యేకత సంతరించుకొన్న పాత్రల్లో ఉత్తరుని పాత్ర ఒకటి. విరాట పర్వంలోని నాల్గవ ఆశ్వాసంలో ఉత్తరుని విచిత్ర ప్రవృత్తిని తిక్కన పరిశీలనాత్మక దృష్టితో వర్ణించాడు. మహా భారతంలోని ఉత్తరుని పాత్రను విశ్లేషిస్తూ డాక్టర్ అప్పజోడు వెంకట సుబ్బరయ్యగారు "మహాభారతము - మానవ స్వభావ చిత్రణము" అనే తమ పరిశోధన గ్రంథంలో ఈ విధంగా తెలియజేశారు.

"ప్రతి మానవునిలో ప్రగల్భములాడు తత్త్వము కొంత దాగియుండును. స్త్రీల యెదుట ఎక్కువగుట దాని స్వభావము. పిరికితనము అమాయకత, అసమర్థత, ప్రక్కనున్నవారు తన్నెక్కడ తక్కువగా చూతురో అనెడి అనుమానము - ఈ ప్రగల్భములాడు తత్త్వము వెనుక దాగియుండుపొరలు. వీనిని కప్పిపుచ్చుకొనుటకై నాలుక చేయు ప్రయత్నమే - ప్రగల్భములాడుట !! ఈ "బడాయి కోరు"ల నోటికున్న శక్తి చేతికుండదు. చేతికున్న శక్తి గుండెకుండదు. ఎంత పనినైన 'ఇదెంత' అని చిటికెవేసి అందరిముందు గంతులు వేయుదురు. చేయవలసి వచ్చినప్పుడు ఏదోసాకు చెప్పి తప్పించుకొందురు. గత్యంతరము లేనిచో భయపడి పారిపోవుదురు - లేదా చేతగాదని చతికిలబడుదురు. మానవ స్వభావములోని ఈ తత్త్వమునకు మహాభారతము ఉత్తరునిలో రూపురేఖలు దిద్దినది" అని తెలియజేసిన పలుకులు ప్రత్యక్షర సత్యాలు. ఉత్తరుని పాత్రలోని ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించి చెప్పిన ముత్యాల మూటలు ఈ మాటలు. ఉత్తరుని స్వభావాన్ని అతడు పలికిన ప్రగల్భాన్ని ఉత్తర గోగ్రహణము పాఠ్యభాగం ద్వారా ఈ విధంగా పరిశీలించవచ్చు.

ఉత్తరుడు విరాటుని పుత్రుడు. ఇతనికి భూమింజయుడని, మాత్స్యుడని పేర్లున్నాయి. ఉత్తరుడు అంతఃపుర కాంతాజన సమావిష్టుడైన సందర్భంలో గోపాలకాధ్యక్షుడు వచ్చి కౌరవసేన తమ గోవుల్ని ముట్టడించిందని, వెంటనే గోవుల్ని మళ్లించవలసినదని శత్రు సమూహాన్ని అతని బాణా సమూహాలకు గురిచెయ్యవలసిందని అర్థించాడు. అంతే కాకుండా విరాట మహారాజు ఉత్తరుని ఎప్పుడూ ప్రశంసిస్తూ ఉంటాడని, ఆ ప్రశంసా వాక్యాల్ని గోపాలుర నాయకుడు ఉత్తరునితో పలికాడు.

"విరటుఁడు నిన్ను నెప్డుఁ బదివేవుర ముందటఁ జెప్పు; "బాహువి
స్ఫురితుడు, శౌర్యశాలి, కులభూతి విశేషావిధాయకుండు, భూ
భరణ విశారదుండు, జనభవ్యతపః ఫల సంభవుండు, కా
తర పరిరక్షకుం"డనుచు; దానికి నీడుగఁ జేయుమిత్తఱిన్"

అంతఃపుర కాంతల సమక్షంలో గోపాలుర నాయకుడు ఉత్తరుని గూర్చి ఈ పలుకులు పలికాడు. అయితే ఆ పలుకులు అతనివికావు. విరాట మహారాజు తన కొడుకును గూర్చి పలికే పలుకులు. భుజబల సంపన్నుడు, పరాక్రమవంతుడే కాకుండా వంశవర్ధనుడట ! భూభారాన్ని వహించటంలో నేర్పరియట ! అంతేకాదు ప్రజల చక్కని తపస్సుకు ఫలితంగా పుట్టినవాడట ! అన్నిటినీ మించి చివరగా 'కాతర పరిరక్షకుడు' అన్నాడు. అంటే భయపడ్డవారిని రక్షించేవాడు. ఇప్పుడు భయపడింది గోవులు, గోపాలకులు. కాబట్టి రక్షించవలసిన బాధ్యత ఉత్తరుని మీద ఉన్నదనే విషయాన్ని గోపాలకాధ్యక్షుడు భంగ్యంతరంగా తెలియజేశాడు. తండ్రి మాటల్ని రుజువు చెయ్యమన్నాడు. అంటే ఉత్తరుని శక్తిని నిరూపించుకొనే సమయం వచ్చింది కాబట్టి పరాక్రమాన్ని ప్రదర్శించుమని ప్రబోధించాడు.

ప్రశంసకు లొంగనివారు లోకంలో ఉండరు. ఎంతటి మహావ్యక్తులయినా పొగడ్తలకు పొంగిపోతారు. పొగడ్తలు తమకు ఇష్టం ఉండవంటూనే పొగిడించుకొంటారు. అందులోనూ ఆడవారిమధ్య ప్రశంసింపబడితే ప్రశంసితుడైన వ్యక్తి పొంగిపోతాడు. ఒళ్లుమరచి ప్రవర్తిస్తాడు. గర్వాతిశయంతో తన స్థాయిని మరిచి మాట్లాడతాడు, ప్రవర్తించటానికి ప్రయత్నిస్తాడు. సరిగ్గా ఉత్తరుని ప్రవర్తన ఇక్కడ అలాగే ఉన్నది. యుద్ధం పట్ల తన ఉత్సాహం అతిశయించగా గర్వోక్తులు పలికాడు.

కౌరవ సైన్యం తమ ఆవులమందను ముట్టడించినదనే విషయం ఉత్తరునికి తెలుసు. గోపాలుర నాయకుని మాటల్నిబట్టి కౌరవ సైన్యం అల్పమైంది కాదని స్పష్టమవుతున్నది. 'ధరణీ చక్రము సంచలింపగ' వచ్చిన సైన్యమిది. ఈ మాటల్ని విన్నా ఉత్తరుడు "ఎత్తునఁ గొందుఁ గౌరవుల నెల్లను మార్కొనిరేని" అని పలికాడు "గోవుల్ని ముహూర్త మాత్రముఁ దెత్తున" ని ప్రగల్భాలు పలికాడు. అయితే రథానికి సారథి లేకపోవటం విచారంగా ఉన్నదన్నాడు. "నేను రథం నడుపగలను" అని అనగలిగిన సారథి నాకు ఇప్పుడు ఎవరు దొరుకుతారో అని సారథి లేకపోవటమే కొరత అని సారథి దొరికితే తన ప్రతాపాన్ని ప్రదర్శిస్తానని గర్వోక్తులు పలికాడు.

తగిన సారథి దొరికితే "పగతుర భంజించుటెంతపని?" అన్నాడు. ఆవుల మందల్ని దూరంగా తోలుకొని పోతారేమో ! ఇలా ఉంటే పని ఎలా జరుగుతుంది? ఎక్కడైనా ఉన్నాడేమో సారథిని వెతకండి" అన్నాడు. ఇంకా తన ప్రతాపాన్ని ఎలా ప్రదర్శిస్తాడో తన అర్హతను మించి ఈ విధంగా పలికాడు. -

"కురుపతి భీష్మకర్ణ కృప కుంభజముఖ్యులు, మత్సముద్యమ
స్ఫురణము చూచి ప్రార్థుఁడను బుద్ధిఁ గలంగగ బెట్టుగిట్టి, సం
గరమున నోర్చియేఁ బసుల గ్రమ్మఱఁ దేరకయున్న నన్ను. భూ
వరుఁడు సుహృజ్జనంబుఁ బరివారము జిత్తములందు మెత్తురే" (11)

- తన శక్తిని ఇతరులు మెచ్చుకోవాలనే తాపత్రయం ఇక్కడ ఉత్తరునిలో కనిపిస్తుంది. ప్రక్కనున్న వారు తన్నెక్కడ తక్కువగా చూస్తారోననే అనుమానమే ఈ ప్రగల్భాలాడే తత్త్వానికి భూమిక. దీన్ని కప్పిపుచ్చుకోవటానికి నాలుక చేసే ప్రయత్నమే ప్రగల్భాలాడటం అనే అభిప్రాయానికి నిలువెత్తు సాక్ష్యంగా ఇక్కడ ఉత్తరుని మాటలు స్పష్టమవుతున్నాయి. తన పరాక్రమాన్ని తాను ప్రదర్శించటం అలా ఉంచి కౌరవ వీరులు తనను చూసి పార్థుడనే బుద్ధితో కలతచెందే రీతిలో విజృంభిస్తానని పలికాడు. కౌరవవీరులు భయపడటమే కాదు, భూవరుడైన తన తండ్రి, మిత్రులు, పరివారు మెచ్చుకొంటారా? అన్నాడు. అంటే ఇతరుల మెప్పుకోసమే తన ప్రయత్నమనే విషయాన్ని ఇక్కడ ప్రకటించాడు.

ఉత్తరుని కార్యశూరత్వమెలాంటిదో తిక్కన విరాటపర్వంలోని పంచమాశ్వాసంలో ధర్మరాజు చేత ప్రకటింపజేశాడు. ఉత్తరుని పలుకుల్ని స్ఫురింపచేసే రీతిలో ధర్మరాజు పలుకులుండటం తిక్కన రమణీయోదాత్త రచనకు తార్కాణం. ధర్మరాజు విరాటునితో

"కురుపతి భీష్మ కర్ణ కృప కుంభజ ముఖ్య మహోగ్ర యోధ వి
స్ఫూరణము నోర్వఁ జూచి రణభూమి భుజాబలముల్లసిల్ల, ను
త్తరుఁడ జయించెనేని వసుధా వర ! యింతటికంటె నింకన
చ్చెరువును గల్గునే ధరఁ బ్రసిద్ధికి నెక్కఁడె యాతఁడొక్కఁడున్" - అని పలకటంలోని వ్యంగ్యం సహృదయ నైవేద్యం.

సైరంధ్రి ఉత్తరునితో బృహన్నల ఖాండవ దహన సమయంలో అర్జునునికి విజయాన్ని చేకూర్చటంలో సహకరించాడని చెప్పినప్పుడు చిరునవ్వు నవ్వి "సైరంధ్రీ నన్ను చులకన చెయ్యటం నీకు తగునా? పేడివానిని కన్నెత్తి చూడటానికే అసహ్యించుకొంటాను. అలాంటి సమయంలో రథసారథ్యం వహించమని ఎలా అడగగలను?" అని పలికాడు. ఇంకా "ఆవుల్ని బంధించటానికి కురుబలం వచ్చిందట. దాని మీద పట్టుదలతో పరాక్రమాన్ని ప్రదర్శించటానికి నేను వెళుతున్నానట. ఇటాంటి స్థితిలో బృహన్నల నా రథానికి సారథి అయితే లోకం నవ్వదా? ఇంత ఎందుకు? నగరంలో సారథులే కరువయ్యారా?" అన్నాడు. "ఇక్కడ కౌరవ సైన్యం వచ్చిందట. నేను వెడుతున్నానట. "అనే ఈ అట శబ్ద ప్రయోగం తన ఔన్నత్యానికి సూచన. వచ్చిన సైన్యమూ గొప్పదే. దానిమీదకు వెళ్లేవాడూ గొప్పడే. అటువంటి సమయంలో సారథి తగినవాడు లేడనే భావాన్ని ఉత్తరుడు ప్రదర్శించినట్లు గుర్తించవచ్చు. ఉత్తరుడు తన అర్హతను మించి తనను భావించుకొన్నాడు. అందుకే ఈ పలుకుల్ని పలికాడు.

సైరంధ్రి పలుకుల్ని మన్నించి బృహన్నలను సారథిగా చేసుకోవటానికి ఉత్తరుడు అంగీకరించి బృహన్నలను పిలిపించాడు. బృహన్నల వస్తూ ఉండగానే

"కౌరవులతోడఁ గయ్యంబు గలిగెనాకుఁ
గడగినేఁడు రథమ్మోవు నడప వలయు"

అన్నాడు. ఇది ఉత్తరుని ఉబలాటాన్ని సూచిస్తున్నది. స్వాతిశయాన్ని ప్రకటిస్తున్నది. "కయ్యంబు గలిగె నాకు" అనటంలో తన ఘనత గోచరిస్తున్నదని ఉత్తరుని భావం.

'వేరమ్ము; మైమఱువుఁ దొడి
తేరెక్కుము; దప్పఁగ్రుంకదింకఁ దీఱదునీకున్
సైరంధ్రి చెప్పె నీదగు
బీరమ్మును బెంపు లావు వెరవును మాకున్" (34) - అని పలకటంలో రాచఠీవిని ప్రదర్శించాడు 'తేరెక్కుము" అని ఆజ్ఞాపించాడు. తప్పించుకోవటం కుదరదని నిర్బంధించాడు. 'మాకున్' అనటంలో అతని ప్రగల్భం గోచరిస్తున్నది.

బృహన్నలను సారథిగా అంగీకరింపజేసి కవచాన్ని తెప్పించి తొడుక్కోమనగా అతడు వ్యత్యస్తంగా ధరించగా వెంటనే ఉత్తరుడు తానే కవచాన్ని బృహన్నలకు తొడగటంలో చేష్టాగతమైన దర్పాన్ని ప్రదర్శించాడు. ఈ ఘట్టంలో తిక్కన ఉత్తరుని అమాయకతను, అవివేకాన్ని ప్రకటింపజేశాడు. కవచాన్ని కూడా ధరించలేని వాడు ఖాండవదహన సమయంలో అర్జునుడికి సహాయం చెయ్యగలడా? అనే వివేకం కూడా లేనివాడు ఉత్తరుడు. రథానికి గుర్రాలను కట్టి దానిమీద ధ్వజాన్ని అలంకరించవలసిందని ఆజ్ఞాపించాడు. "ఇపుడ రావలయును గోచయమును గొని; యస్మదీయ విజయ మభినందింపఁ బురము జను లెదురుకొనన్" అని ఎంతో ప్రగల్భాన్ని ప్రకటించాడు. అసలు యుద్ధానికి వెళ్లనేలేదు. తన విజయాన్ని ప్రజలు అభినందించాలని ఆశించాడు. ఆర్భాటమే కాని అర్హత లేనివాడు ఉత్తరుడు అనటానికి ఈ పలుకులే ప్రత్యక్ష సాక్ష్యం. 'అస్మదీయ విజయమనటం' లోను గర్వం, అమాయకత్వం స్పష్టమవుతున్నాయి. యుద్ధానికి వెళుతున్నది తానొక్కడే కాదు. అతనితో బృహన్నల కూడా వెళుతున్నాడు. కానీ 'తన విజాయన్ని అందరూ అభినందించాలని ఆశించటంలో ఉత్తరుడు తన అవివేకాన్ని ప్రదర్శించాడు.

భూమండలం కుంగిపోయేటట్లు నడుస్తున్న కౌరవ రాజసైన్యాన్ని ఉత్తరుడు చూశాడు. చూడటంతోనే ఉత్తరుని పరిస్థితి మారిపోయింది. అంతః పురకాంతల మధ్య పలికిన ప్రగల్భాలు గాలిలో కలిసిపోయాయి.

"కనియుత్తరుఁడు గరుపా
ఱినమేనును, దలఁకు మనము, ఱిచ్చవడిన చూ
పునునై తొట్రుపడుచు ని
ట్లనియె, దిగులు సొచ్చి యాబృహన్నల తోడన్" (51)

- ఇక్కడ ఉత్తరునిలోని పిరికితనం కట్టలు తెంచుకొని ప్రవహించింది. అంతేకాదు అపారమైన కౌరవ సేనావాహినిని సమీపించటమే తనకు సాధ్యం కాదన్నాడు. "ఎత్తున గొందుఁ గౌరవులనెల్లను మార్కొనిరేని" అని పలికిన నోటితోనే "అకృతాస్త్రుడ, బాలుడనని తన స్థితిని ప్రకటించాడు. "ఇట్టగుటెఱుఁగక వచ్చితిమెట్టొకొ?" అని తనతో పాటు బృహన్నలను కూడా కలిపాడు. "మనకు మార్కొనునట్టి కొలఁది గాదు. "అని తన అసమర్థతను ప్రకటించటంతో పాటు బృహన్నలను తనతో చేర్చుకొన్నాడు. "భీతియడరెడు తోడ్తోన్" అనటంలో తన స్థితిని తాను తెలుసుకొని భయపడ్డాడని చెప్పవచ్చు. ఇక్కడ ఉత్తరుడు మాటలవాడేగాని చేతలవాడు కాడనే విషయం స్పష్టమవుతున్నది. ఇచ్చిన మాటను నిలుపుకోలేని అసమర్థుడనే అంశం విదితమవుతున్నది.

కౌరవ సైన్యాన్ని చూసి మనసుతో పాటు శరీరంకూడా వణకుతున్నదని చెప్పటం ద్వారా ఉత్తరుడెంత భయపడ్డాడో తెలుస్తున్నది. "ఇప్పటి భంగిఁ జూచిన వీరల నేను మార్కొనమి నిశ్చయమని" ఇక్కడ కూడా తన రాచరీవిని, అహంకారాన్ని ప్రదర్శించాడు. "ప్రాణములు దీపన మున్ వినవే?" అని ప్రాణాల మీద మమకారాన్ని ప్రదర్శించి భీరుత్వాన్ని ప్రకటించాడు.

"అంతః పుర కాంతలముందు పశువుల్ని క్షణంలో మరలించి తెస్తానని పలికి రథమెక్కి వచ్చి సైన్యాన్ని చూసి భయపడి పోవటం నీకు తగునా?" అని బృహన్నల పలకటంతో

"పసుల దయ్యె మెఱుఁగుఁ బడతుల సంతోష
మేల నాకు? ననికిఁ జాల నేను"

అని ప్రకటించటంలో తప్పించుకొనేతనం, చేతకానితనం వ్యక్తం చేశాడు. "రయంబునఁబురి కరుగుటయ నీతి" అని క్షత్రియుడు పలకకూడని పలుకులు పలికాడు.

అర్జునుడు ఉత్తరుని భయపడవలసిన అవసరంలేదని అభయం ఇచ్చినా " నీ క్రొవ్వుఱుగదేనిఁ దలపడుమ"ని తనతోపాటు తీసుకొని వచ్చిన సారథిని నట్టేట ముంచే ప్రయత్నం చేశాడు. ఇక చివరి ప్రయత్నంగా

"శరములు శరాసనమున
య్యరదముపై డిగ్గ విడిచి యతిరభసమునన్
ధరణికి లంఘించి వెసం
బురి దెసకును లజ్జవీటిఁ బోవం బాఱెన్" (72)

- ఉత్తరుడు క్షత్రియుడై పుట్టి యుద్ధ భూమినుండి పారిపోతున్న తీరుకు బృహన్నల అసహ్యించుకొన్నాడు. పరుగెత్తి పట్టుకోగా తనను విడిచిపెట్టమని, విడిచిపెడితే నగరానికి వెళ్ళినప్పుడు అనేక సంపదలిస్తానని అర్థించాడు. తనమీది ప్రేమతో ఎదురు చూసే తల్లికి సంతోషాన్ని కలిగించటానికి "నగరానికి వెళతాను. నన్ను పోనివ్వు" మని పరిపరివిధాలా ప్రార్థించినప్పుడు బృహన్నల అతనికి ధైర్యం చెప్పి రథానికి సారథిగా ఉండుమని, కౌరవ సైన్యం సంగతి తాను చూస్తానని చెప్పి బృహన్నల రథిగా, ఉత్తరుడు సారథిగా జమ్మిచెట్టు దగ్గరకు చేరుకొన్నారు.

ఈ పాఠ్యభాగంలో ఉత్తరుడు అంతః పురకాంతల ముందు పలికిన ప్రగల్భాలకు తర్వాత అతని దైన్యస్థితికి పొంతన కనిపించదు. ఉత్తరుడు శక్తిని మించి మాట్లాడినట్లు స్పష్టమవుతుంది. అతని మాటలు కోటలు దాటాయి. చేతలు గడప దాటలేదనిపిస్తుంది. మాటలకు చేతలకు సంబంధంలేని, పొంతన కుదరని ఇలాంటి వాక్శూరుల్ని గుర్తించి లోకంలో 'ఉత్తరకుమార ప్రజ్ఞలు' అనేనానుడి లోకంలో వ్యవహారం లోనికి వచ్చింది.

4. కవ్వడి పరాక్రమాన్ని వర్ణించండి (మార్చి 2003)

లేదా

5. అర్జునుని అద్భుత శౌర్యాన్ని వివరించండి

లేదా

6. 'విజయుడు' అనే పేరు ఎంతవరకు సముచితమో తెల్పండి?

జ. అర్జునుడు పాండవ మధ్యముడు - విలు విద్యాభ్యాస సమయంలోనే ద్రుపదుని పట్టితెచ్చి గురువైన ద్రోణునికి గురుదక్షిణగా సమర్పించిన ఉత్తమ శిష్యుడు. మత్స్యయంత్రాన్ని ఛేదించి అక్కడ తనను ఎదిరించిన రాజులను ఉక్కడగించిన పరాక్రమశాలి. ఖాండవవన దహన సమయంలో అగ్ని దేవుని సంతృప్తిపరచిన అసమాన తేజో విరాజితుడు. ఇంద్రుని మెప్పుపొంది అర్థ సింహాసనాన్ని పొందిన భాగ్యశాలి ద్వంద్వయుద్ధంలో ముక్కంటిని మెప్పించి పాశుపతాస్త్రాన్ని పొందిన యుద్ధనిపుణుడు అర్జునుడు.

ప్రస్తుత పాఠ్యభాగమైన 'ఉత్తర గోగ్రహణం' లో బృహన్నలగా, అర్జునుడుగా కనిపించే కవ్వడి తన అద్భుత పరాక్రమాన్ని ప్రదర్శించాడు. 'కవ్వడి' అంటే కవ + వడి రెండు చేతుల్లోను వడి కలవాడు. అంటే రెండు చేతులతో బాణాల్ని ప్రయోగించగల దక్షుడు. యుద్ధంలో అపజయమన్నది ఎఱుగని ధీశాలి కావటంతో ఇతడు విజయుడయ్యాడు. అపారమైన కౌరవ సేనావాహినిని ఒక్కడే జయించటం ద్వారా 'విజయుడు' అనే పేరు సార్థకమైంది.

బృహన్నలగా ఉన్న అర్జునుని పరాక్రమాన్ని సైరంధ్రి పలుకులద్వారా గుర్తించవచ్చు. 'కౌరవ సేనగాదు త్రిజగంబులు నొక్కట నెత్తివచ్చినం దేరు బృహన్నలా వశగతింజరియించిన గెల్వవచ్చు." అని సైరంధ్రి పలకటం ద్వారా అతని పరాక్రమాన్ని ఊహించవచ్చు. 'బృహన్నలా వశగతిన్' అనటంలోనే తిక్కన ఒక ప్రత్యేకతను ప్రకటించాడు.

కౌరవ సేనను చూసి భయపడిన ఉత్తరునికి ధైర్యం కలిగించటానికి ప్రయత్నిస్తూ తన భుజబలమూ, శత్రువుల బలమూ పరీక్షించి చూచి ఎటూ తేలకపోతే అప్పుడు వెనుదిరిగి పోవటం లోకధర్మం. శూరులయితే దీన్ని కూడా మెచ్చుకోరు. కౌరవబలం ఇంత వరకూ నీవైపు తేరిపార చూడనయినా లేదు. అప్పుడే నీకింత భయం కలగటానికి కారణమేమిటో చెప్పు" అని క్షత్రియుడు, వీరుడు పాటించవలసిన ధర్మాన్ని తెలిపాడు. రథియైన ఉత్తరుని సారధిగా చేసుకొని కార్యాన్ని సాధించిన అద్భుత పరాక్రమ సంపన్నుడు అర్జునుడు.

అర్జునుని గొప్పతనాన్ని కౌరవ సేనలోని వివిధ వ్యక్తులు ప్రకటించిన అభిప్రాయాల్నిబట్టి కూడా గుర్తించవచ్చు. "ఆడుచందము పురుషసమాకృతిలో ఉన్న వ్యక్తి నివుఱుగవిసిన మెఱయని నిప్పువోలె" ఉన్నట్లు కౌరవసేనలు ఊహించటంలోని ఔచిత్యాన్ని గుర్తించవచ్చు.

ద్రోణుడు కౌరవ సేనతో తమకు అపశకునాలు కనిపిస్తున్నాయి కాబట్టి యుద్ధానికి సిద్ధం కావలసిందని చెప్పటంలో అర్జునుని ఆధిక్యం స్పష్టమవుతున్నది. అజ్ఞాతవాసం ముగిసిందనే విషయాన్ని భీష్ముని ద్వారా భంగ్యంతరంగా తెలుసుకొన్న ద్రోణుడు పలికిన పలుకుల్లో అర్జునుని పరాక్రమం స్పష్టమవుతున్నది. "సింహం ఆకలితో చాలాకాలం గుహలో ఉండి ఒక్కసారిగా బయటకు వస్తూ ఏనుగుల

సమూహాన్ని చూస్తే ఎంతో కోపంతో మీదకు దూకుతుందో అలాగే అర్జునుడు అరణ్యవాసం చేసి ఖిన్నుడై మన సేనమీదికి రణ స్థిరమైన ఆకారంతో ఇడుగో వచ్చేశాడు.'' అనిపలకటం ద్వారా అర్జునుని పరాక్రమాన్ని ఊహించవచ్చు. అతడు శివుణ్ణి యుద్ధంలో సంతోషింపజేసిన శౌర్యశాలియని చెప్పాడు.

ఉత్తరుడు కుతూహలంతో అర్జునునికి పదిపేర్లు ఉన్నాయి కదా ! ఆ పేర్లు ఎలా వచ్చాయో చెప్పవలసిందని అడిగినప్పుడు అర్జునుడు ఆ పేర్ల సార్థకతను తెలియజేసేటప్పుడు అర్జునుని పరాక్రమం స్పష్టమవుతున్నది.

"భూమండలాన్ని జయించి ధనాన్ని స్వీకరించటంచేత ధనంజయుడయ్యాడు. యుద్ధంలో ఎదిరిస్తే ఎంతటి వారినయినా జయించటం చేత విజయుడయ్యాడు. యుద్ధంలో తన రథానికి ఎప్పుడు తెల్లని గుర్రాలు ఉండటంవల్ల శ్వేతవాహనుడయ్యాడు. ఇంద్రుడిచ్చిన కిరీటం ఎప్పుడూ శిరస్సుమీద ప్రకాశిస్తూ ఉంటుంది కాబట్టి కిరీటి అయ్యాడు. ఎలాంటి క్లిష్ట సమయాల్లోనయినా వీరులకు అసహ్యాన్ని కలిగించే పనిని ఎప్పుడూ చెయ్యడు. అందుకు అతడు బీభత్సుడయ్యాడు. యుద్ధంలో రెండు చేతులతోనూ గాండీవాన్ని లాగగలిగినా ఎడమ చేతితో బాగా లాగగలడు. అందువల్ల సవ్యసాచి అయ్యాడు. అనన్యసామాన్యమైన అవదాతవర్ణం కలిగి ఉండటం వల్ల అర్జునుడయ్యాడు. యుద్ధంలో తాను చూస్తూ ఉండగా ఎవరైనా ధర్మరాజును గాయపరిస్తే వారిని తప్పకుండా సంహరిస్తాడు. అందుకే జిష్ణుడయ్యాడు. పృథ (కుంతి) కుమారుడు కావటంతో పార్థుడయ్యాడు. ఈ పది పేర్లే కాకుండా కృష్ణుడు అనే పదకొండో పేరు కూడా శివుడూ బ్రహ్మదేవుడు తనకు ప్రసాదించారని చెప్పాడు. అర్జునునికి ఉన్న ఈ పేర్లన్నిటిలోనూ అతని పరాక్రమౌన్నత్యం స్పష్టమవుతున్నది.

యుద్ధకుతూహలంతో అర్జునుడు దేవదత్తమనే శంఖాన్ని పూరించటంతో ప్రకృతి సంక్షోభించింది. సప్తసముద్రాలూ, గిరివర్గం, భూమండలం, దిక్చక్రం, అమరావతి, పాతాళం, గ్రహనక్షత్రాల సమూహం కలత చెందాయి. చివరకు బ్రహ్మకూడా సంక్షోభం చెందాడని చెప్పటంలో అర్జునుని శంఖనాదపు తీవ్రత ఎలాంటితో ఊహించవచ్చు.

చెవులు చిల్లులు పడేటట్లు వినిపిస్తున్న వింటినారిని బట్టి, బ్రహ్మాండాన్ని బద్దలు చేసిన శంఖ ధ్వనిని బట్టి, భయాన్ని కలిగిస్తున్న కపిధ్వజాన్ని బట్టి, మిరుమిట్లు గొలిపే కాంతిని బట్టి చూస్తే వచ్చినవాడు అర్జునుడే అని ద్రోణాచార్యుడు దుర్యోధనునికి తెలియజేయటాన్ని బట్టి అర్జునుని అసమాన తేజో వికాసాన్ని గుర్తించవచ్చు. ద్రోణుడు అర్జునుని ప్రశంసించటాన్ని సమర్థించిన అశ్వత్థామ దుర్యోధనుని పలుకుల్లోనూ అర్జునుని ఆధిక్యం స్పష్టమవుతున్నది. "కౌరవులకు అగ్నిహోత్రుడైన కపిధ్వజుడు వచ్చాడు. గర్వంతో నీవు గురువైన ద్రోణుని అధిక్షేపించగలవు గాని దుర్జయుడైన అర్జునుని ఎదిరించగలవా?'' అనే పలుకుల్లో అర్జునుడు కౌరవుల్ని భస్మం చేస్తాడని అతన్ని గెలవటం ఎవరికీ సాధ్యంకాదని స్పష్టమవుతున్నది.

కృపాచార్యుడు కర్ణునితో పలికిన పలుకుల్లో అర్జునుని అద్భుత పరాక్రమం స్పష్టమైంది. ఖాండవ వనాన్ని దహించింది, సుభద్రా కళ్యాణం సమయంలో యాదవులందరినీ ఓడించిందీ, గంధర్వరాజైన చిత్రరథుని జయించి దుర్యోధనుని విడిపించిందీ, యుద్ధంలో నివాత కవచుల్ని, కాలకేయుల్ని చంపింది అర్జునుడొక్కడే కదా ! అని చెప్పటంలో అర్జునుని ప్రత్యేకత స్పష్టమవుతున్నది. అర్జునుని గెలవాలనుకోవటం సముద్రాన్ని చేతి ఈతతో దాటాలనుకోవటం అని కర్ణునితో అనటం అర్జునుడెంత దుర్భేద్యుడో తెలుస్తున్నది.

"వచ్చినవాడు ఫల్గునుడవశ్యము గెల్తుమనంగరాదు;'' అని భీష్ముడు పలకటం ద్వారా అర్జునుడు అజేయుడనే విషయాన్ని గుర్తించవచ్చు.

ద్రోణుడు కౌరవసేనను ఒక పథకం ప్రకారం విభజించి నడిపించాలన్నాడు. సైన్యంలోని ఒక భాగాన్ని తీసుకొని రాజుముందు వెళ్లాలి. ఒకవంతు సేన గోవుల్ని చుట్టుముట్టి వెళ్లాలి. మిగిలిన సగంతో మనం వెనుక వెళదాం. అలా అయితే రాజు సురక్షితంగా ఉంటాడు. ఆవులూ ఈ ప్రదేశం దాటుతాయి. ఇలా చక్కటి ప్రణాళికతో సైన్య విభాగం జరిగింది. ఈ సైన్యాన్ని ఛేదించటానికి అర్జునుడు వేసిన ఎత్తు ఆశ్చర్యకరంగా, యుద్ధనీతి నైపుణ్య స్ఫోరకంగా ఉన్నది. ఒక్కడైన అర్జునునికి, అపార కౌరవ సైన్యానికీ జరుగుతున్న యుద్ధాన్ని చూడటానికి విమానంలో ఇంద్రుడు వచ్చాడు. ఆయన ప్రక్కనే పాండురాజు కూడా ఉజ్జ్వలరీతిలో ఉన్నాడు.

అర్జునుడు కౌరవ సైన్యాన్ని సమీపించిన తీరులోనే ఒక ప్రత్యేకత ఉన్నట్లు కవి వర్ణించాడు. వెయ్యిమంది ప్రళయరుద్రులు ఒక్కసారి గర్జించినట్లుగా బెదరిస్తూ వేగంగా మెరుపు తీగె వచ్చినట్లు అర్జునుని రథం వచ్చింది. దేవదత్త ధ్వనిని విన్న కౌరవసేన పెడమొగం పెట్టింది. రథచక్రాల వేగం వల్ల లేచిన దుమ్ము సైన్యం యొక్క అవయవాల నన్నిటినీ కప్పివేసింది. కపిధ్వజం మిరుమిట్లు గొల్పింది. సైన్యానికి ఎటు పోవాలో దిక్కుతోచలేదు. అర్జునుని ఆకారపు ఆటోపానికి సైన్యం తల్లడిల్లింది.

అర్జునుడు కౌరవసేన విభజించిబడిన తీరును గమనించాడు. ఆలమందకు ముందూ, వెనుకా కొంత సైన్యం ఉండటాన్ని గుర్తించాడు. ఈ సైన్యంలో దుర్యోధనుడెక్కడ ఉన్నాడో అని సందేహించాడు. అందుకే ఉత్తరునితో

"అరయుదము గాని యిమ్మో
హరమునకును డాపలించి యరదముఁ బోని
మ్మురవడి నతనిక యుటికెద,
నరుదుగ నెబ్బంగి నెవ్వ రడ్డంబైనన్' (246) అని పలికాడు.

- దుర్యోధనుడెక్కడున్నాడో చూద్దాం. సేనకు ఎడం పక్కగా రథాన్ని పోనివ్వు. ఎవరడ్డుపడ్డా నేను దుర్యోధనుని మీదనే విరుచుకుపడతానని అర్జునుడు పలకటంలో అతని యుద్ధ ప్రణాళికా నైపుణ్యం స్పష్టమవుతున్నది. దుర్యోధనుడు చిక్కితే సైన్యం అంతా చెదిరిపోతుంది. అలా అయితే పని తేలికగా అవుతుంది. ఈ పెద్ద సైన్యంలో అతడు కనిపించకపోతే ఈ సైన్యంజోలికి వెళ్ళకుండా ఆవుల మంద దగ్గరకు వెళదామని అర్జునుడు చెప్పటంలో అతని పన్నాగం తెలుస్తున్నది. అంటే దొరికితే దుర్యోధనుని పట్టుకోవాలి. లేదా ఆలమందల దగ్గరకు వెళ్ళాలి అంతేగాని మిగిలిన సైన్యంతో యుద్ధం అనవసరం అనే నిశ్చయాన్ని ఇలా ప్రకటించాడు.

అర్జునుడు సైన్యాన్నంతా స్పష్టంగా చూశాడు. మధ్యభాగంలో దక్షిణ దిక్కున, ఎడమ భాగంలో, ముందు భాగంలో, పశ్చిమదిక్కున ఉత్తర దిక్కున ఎవరెవరు వెళుతున్నారో ఉత్తరునికి చెప్పాడు. "దుర్యోధనుడు మాత్రం కనిపించలేదు. అతడు గోవుల్ని తోలుకొనిపోతూ ఉండవచ్చు. ఈ సైన్యంతో యుద్ధం మనకు అనవసరం. వీరంతా అడ్డుపడి ఆలస్యం చేయకుండా పశువుల్ని మళ్ళించి రాజు పొలిమేర దాటకుండా పట్టుకోవాలి'' అని చెప్పి పశువులవైపుకు రథం తోలుమని ఉత్తరునికి చెప్పాడు. ఆ సమయంలోనే గురువునకూ, కృపాచార్యులకూ, భీష్మునికీ పాదాల దగ్గర రెండేసి బాణాలు, చెవుల ప్రక్కనుంచి వెళ్ళేట్లు రెండేసి బాణాలు వేశాడు. దీన్ని గుర్తించిన ద్రోణుడు "అర్జునుడెంత సముచితంగా ప్రవర్తించాడో'' అని ప్రశంసించాడు.

"అర్జునుని గాండీవ చాలనం విద్యుల్లతలా, కపిధ్వజ ధ్వని మేఘ గర్జనంలా ఉండగా అతని రథం మేఘరూపం పొందింది. అతడు ఇంద్రుని రూపం పొందాడు. శత్రువుల దోర్బలమనే వేసవిని చల్లార్చే వర్షాధి దేవతలా అర్జునుడు వెలుగొందాడని'' ద్రోణుడు ప్రశంసించాడు. ఉదయించే సూర్యునిలా ఉజ్జ్వలంగా ప్రకాశిస్తున్నాడని ద్రోణుడు చెప్పాడు. అర్జునుడు ప్రణామ, కుశల ప్రశ్నల రీతిగా బాణాల్ని ప్రయోగించిన తీరును కృపుడు, భీష్ముడు మెచ్చుకొన్నారు.

సమస్తలోకాల్నీ పరిపాలించదగిన తేజస్సు అర్జునునిలో ఉన్నదని భీష్ముడు మెచ్చుకొన్నాడు. వెనుకనుంచి వచ్చి సమీపించినా తన రథాన్ని తప్పించి, ఎదిరించటానికి ఇష్టంలేని మనస్సుతో క్రీగంటితో మనల్ని చూస్తూ దాటి వెళుతున్నాడని అర్జునుని గురి దుర్యోధనుని మీదనే ఉన్నదని, దుర్యోధనుడంటే అతనికి చాలా కోపమని భీష్ముడు చెప్పాడు. మనకూ దుర్యోధనునికీ మధ్య అర్జునుడు ప్రవేశిస్తే దుర్యోధనుడొక్కడే అర్జునుని ఎదిరించలేడు కాబట్టి మనం అక్కడకు వెళ్లాలన్నాడు.

అర్జునుడు సేన ప్రక్కనే రెండు క్రోసులు వెళ్ళి ఉత్తరునితో "ఇదిగోమనం గోగణం దగ్గరకు వచ్చాం. ఇంకా ముందుకు వెళ్ళవలసిన పనిలేదు సైన్యాలూ దగ్గరగా వచ్చాయి. రెండిటికీ మధ్యలో దూరి ఈ వచ్చే గర్వితులైన వీరులకు నా భుజబలవిలాసం చూపించి గర్వం పోగొడతాను. పశువుల్ని మళ్లిస్తాను. ఏ విధంగానైనా రాజు నా చేత చిక్కుతాడు.'' అని తన నిశ్చయాన్ని ప్రకటించాడు.

ఉత్తరుడు సేన కడ్డంగా తూర్పుగా రథాన్ని పోనిచ్చాడు. రథం సేనకు ఎట్ట ఎదుటిగా వెళ్లింది. అప్పుడు అర్జునుని ఉత్సాహంతో ఒళ్లు పొంగిపోయి భుజాగ్రాలు తలను తాకాయి. సేనల ఎదుట రథాన్ని నిలిపి అర్జునుడు తన పేరు ప్రకటించి 'నిలు నిలు' మని కేకలు వేశాడు. గోవుల మంద ప్రక్కనుంచి వెళ్లేటట్లుగా పదునైన బాణాల్ని ప్రయోగించాడు. ఆకాశం అంతా బాణాలతో నిండిపోయింది. అంధకారం వ్యాపించినట్లయింది. దానికి తోడు భయం అనే అంధకారం కూడా వ్యాపించి కురు సైన్యానికి గుండె బద్దలైంది. ఎదురుపోవాలో వెనుకకు వెళ్ళాలో పాలుపోలేదు. సేనలు భయపడి పోయాయి. అర్జునుని హస్త లాఘవాన్ని మాత్రం ప్రశంసించారు. ఇక మిగిలిన చేష్టలు మరచిపొయ్యారు. గోవుల వెనుక వెళ్లే 'కొద్దిసైన్యం బెదిరి తూర్పు దిక్కుకు చెదిరిపోయేటట్లుగా రథాన్ని తోలించి మధ్యలో కొంత చోటు ఉండేటట్లుచేసి తెల్లని వస్త్రం ఊపి దేవదత్తాన్ని పూరించాడు. వెంటనే ధ్వజం మీద కోతి గర్జించింది. భూతాలన్నీ ఒక్కసారిగా అరిచాయి. వింటినారి మోత, రథచక్రాల ధ్వని, శత్రుసేనల సందడి ఒక్కసారిగా విజృంభించాయి. గోవులు తోకలెత్తుకొని నేలబద్దలయ్యేటట్లు వెనుకకు తిరగి అర్జునుడు వచ్చిన మార్గం పట్టి దక్షిణ దిక్కుకు విజృంభించి పరుగెత్తాయి. ఆవులతో సహా పట్టుకొనబడి పోతూఉన్న గోపాలుర సమూహం కూడా అప్పుడు తొందరంగా గోవులవెంట పరుగెత్తింది.

అర్జునుడు సైన్యాన్ని శ్రద్ధగా పరిశీలించాడు. "ఈ సైన్యం పశువులకు అడ్డురాకుండా నడుమకు పోవాలి రథాన్ని ఇటుప్రక్కకు పోనివ్వు" అని ఆజ్ఞాపించగా ఉత్తరుడలాగే చేశాడు. గోపాలురను ఉద్దేశించి అర్జునుడు నిర్భయంగా పశువుల్ని తోలుకుపొండి" అని కేకవేసి పట్టణంవైపుకు పోవటానికి పురికొల్పాడు.

"కరితురగ సమితిఁ గార్కొని
కురువీరుల మొగలు మొగులు కొమరునఁ గవియన్
శరవేగంబున నరుఁడు
ద్ధుర మారుత చండ భంగి దోఁపఁ దెరల్చెన్" (270)

- ఏనుగులతో గుర్రాలతో విజృంభించి కౌరవ సేనలు మేఘంలాగా కమ్మివేశాయి. అర్జునుడు శరవేగంతో జంఝూ మారతంలాగా రెచ్చిపోయి అవి విచ్చిపోయేటట్లు చేశాడు. వెంటనే ఆవులమందను చెదరిపోనీక పాదవి పట్టణంవైపు తోలాడు. అవికూడా విజృంభించి గోపాలురతో తమ నేలమీదికి ప్రవేశించాయి. తమకు పరిచయమైన నేలమీదకు వచ్చేటప్పటికి గోవులు కూడా రెచ్చిపోయి పరుగెత్తటం మిక్కిలి సమంజసంగా ఉన్నది.

ఈ విధంగా అర్జునుని పరాక్రమం ప్రస్తుత పాఠ్యభాగంలో ఆయా వ్యక్తుల పలుకుల ద్వారా, అర్జునుని విజృంభణ ద్వారా స్పష్టమవుతున్నది. అపారమైన సైన్యాన్ని ఒక్కడే ఎదిరించి గెలవటం ద్వారా విజయుడనే నామాన్ని సార్థకం చేసుకొన్నాడని చెప్పవచ్చు. 'సాటిలేని పరాక్రమ సంపన్నుడు' అర్జునుడనటం సముచితం.

7. 'ఉత్తర గోగ్రహణము' ఆధారంగా తిక్కన కవితా తత్త్వాన్ని - అనువాద విధానాన్ని వివరించండి.

లేదా

8. 'నానా రసాభ్యుదయోల్లాసి' - విరాట పర్వం అనే విషయాన్ని మీ పాఠ్యభాగం ఆధారంగా విశ్లేషించండి.

లేదా

9. తిక్కన బహుముఖ కవితా ప్రతిభను మీ పాఠ్యభాగమాధారంగా ప్రకటించండి.

జ. పంచమ వేదంగా విలసిల్లి భారతీయ జీవన మార్గంలో మంచి చెడుల సంఘర్షణను చిత్రీకరిస్తూ అధర్మం మీద ధర్మమూ అవినీతి మీద నీతి, చెడుమీద మంచీ సాధించిన విజయాల్ని విశ్లేషించిన గ్రంథం సంస్కృత మహాభారతం. దీనికి ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో అనువాదాలు

వచ్చాయి. కానీ వ్యాసుని హృదయాన్ని స్పష్టంగా, సమగ్రంగా, సుందరంగా ఆవిష్కరించిన ఘనత తెలుగు భారతానికే దక్కింది. ఆ ఘనతకు కారకులు కవిత్రయం. కవిత్రయంలో సింహ భాగం మహాకవి తిక్కన సోమయాజిది. మహాభారతంలోని 15 పర్వాల్ని రచించిన కవిబ్రహ్మ, ఉభయ కవిమిత్రుడు తిక్కన.

తిక్కన మహాభారతం విరాట పర్వంతో ప్రారంభమవుతుంది. తాను రచించిన మహాభారతాన్ని హరిహరనాథునికి అంకితం చేసిన సమన్వయ వాది తిక్కన. విరాట పర్వం ప్రారంభంలో తిక్కన

"హృదయాహ్లాది, చతుర్థ, మూర్జిత కథో పేతంబు, నానారసా
భ్యుదయోల్లాసి విరాట పర్వ; మట యుద్యోగాదులుంగూడగాఁ
బదియేనింటి, దెనుంగు బాస జన సంప్రార్థ్యంబులై పెంపునం
దుదిముట్టన్ రచియించు టొప్పు, బుధ సంతోషంబు నిండారగన్" (1-71) - అని రచించాడు.

ఈ విరాట పర్వం హృదయానికి ఆహ్లాదం కలిగించేది. అంటే మనోరంజకమైంది. సంస్కృత మహాభారతంలోని విరాట పర్వం 'సభారంజనమై, సర్వమనోజ్ఞమైన" దని నన్నయ ఆదిపర్వంలో చెప్పాడు. ఈ విశేషణాల్ని దృష్టిలో పెట్టుకొని తిక్కన 'హృదయాహ్లాది' అని రచించి ఉంటాడు. ఊర్జిత కథోపేతమైందనటంలో దృఢమైన కథాభాగం కలిగినదని అర్థం. భారతంలోని ఇతర పర్వాల్లో అనేక ఉపాఖ్యానాలు వస్తాయి. కానీ విరాటపర్వంలో ఏ ఉపాఖ్యానమూ కనిపించదు. కథ అంతా పాండవ కౌరవులకు మాత్రమే సంబంధించి సాగుతుంది. ఇతివృత్తం ఊర్జితమైంది. దానిలో అంతర్లీనంగా రసం ప్రవహించింది. అందుకే 'నానా రసాభ్యుదయోల్లాసి' అన్నాడు.

"తెనుగుబాస నిర్మింపఁ దివురుటరయ
భవ్య పురుషార్థ తరుపక్వ ఫలము గాదె" -

అని హరిహర నాథుడు పలికి తానే కృతి పతిత్వాన్ని అర్థించివచ్చానని చెప్పాడు. అందుకే తిక్కన "నా నేర్చిన భంగిఁ జెప్పివరణీయుఁ డ నయ్యెద భక్త కోటికిన్" అని చెప్పాడు. అందుకే "ఆంధ్రావలి మోదముంబొరయునట్లుగ" రచిస్తున్నానని

"కావున భారతామృతము గర్ణ పుటంబుల నారఁగ్రోలి యాం
ధ్రావలి మోదముం బొరయునట్లుగ సాత్యవతేయ సంస్మృతి
శ్రీవిభవాస్పదంబయిన చిత్తము తోడ మహాకవిత్వ దీ
క్షావిధి నొంది పద్యముల గద్యములన్ రచియించెదం గృతుల్" (30) - అని పలికాడు.

తిక్కనలో బహుముఖ ప్రతిభ ఉన్నది. వర్ణనల్లోగాని, అలంకారిక విన్యాసంలో గానీ, సంభాషణల కూర్పులో గానీ, రస పోషణలోగానీ పద్యనిర్మాణ చాతుర్యంలోగానీ, సంస్కృతాంధ్ర పదప్రయోగంలోగానీ తిక్కన తనదైన ప్రతిభను ప్రకటిస్తాడు. ప్రస్తుత పాఠ్యభాగమైన "ఉత్తర గోగ్రహణము" లో తిక్కన చూపిన బహుముఖ ప్రతిభను అనువాద నైపుణ్యాన్ని ఈ విధంగా గుర్తించవచ్చు.

**వర్ణనాత్మక ప్రతిభ :** వర్ణనా నిపుణుడైన వానినే కవిగా గుర్తిస్తారు. తిక్కన వర్ణనల్లో ఒక ప్రత్యేకత ఉంటుంది. తిక్కన వర్ణనల్లో చలద్రూపం ప్రశస్తంగా ఉంటుంది. స్థిరంగా ఉన్న వస్తువును గానీ, వ్యక్తిని గానీ వర్ణించటం కంటే చలనరూపంలో ఉన్న వస్తువును గానీ, వ్యక్తిని గానీ వర్ణించటానికి తిక్కన మక్కువను ప్రకటిస్తాడు. ఉత్తర నర్తనశాలకు వెళుతున్న దృశ్యాన్ని నయన మనోహరంగా, ఆలంకారికంగా ఇలా వర్ణించాడు.

"అడుగుల నునుఁగాంతి నయ్యెడ పద్మరా
  గంబుల నెలకట్టు కరణినొప్పఁ

బాలిండ్లు దనువెడ వ్రాలింపఁ జెన్నొందు
   నసదుఁ గౌఁదీఁగె యల్లాడుచుండఁ
దఱివేచి వెనువెంటఁ దగులు కామాంధకా
   రము లీలఁ గ్రొవ్వెద కొమరు మిగులఁ
గర్ణ భూషణ మౌక్తిక ప్రభా డోలన
   మీక్షణ దీప్తుల నినుమ డింప

నందియల మొరపంబున కరుగు దెంచి
ప్రోది రాయంచ రయమునఁ బోవు నవ్వి
ధంబు దగ నభ్యసించు చందమునఁ దోన
చనఁగ నుత్తర నర్తన శాల కరిగె (126)

- ఈ పద్యంలో ఆమె సౌకుమార్యము, కోమలత్వమూ స్ఫురిస్తున్నాయి. ఆమె పాదాల ఎర్రదనానికి నేల అంతా పద్మరాగమణులు పొదిగినట్లు ఉందట. అంటే పాదాల ఎర్రదనం నేలకు సంక్రమించినట్లు వర్ణించాడు. దీన్ని 'తద్గుణం' అనే అలంకారంగా చెప్పవచ్చు. స్తనభారంచేత నడుము అనే తీగె అల్లాడుతుందనటంలో రూపకం ఉన్నది. కేశపాశం అంధకారంలా ఉన్నదనటంలో ఉపమానాన్ని గుర్తించవచ్చు. ఉత్తర నడుస్తుంటే కదలాడే చెవికమ్మలూ మెరుపులాగా చలించే చూపులూ ఒకదాని కొకటి పోషకాలై తళతళలాడుతున్నాయి. స్త్రీని 'హంసయాన' అనటం సంప్రదాయం. కానీ హంసయే ఈమె నడకను అభ్యసిస్తుందనటంలోని ఊహ ఉత్ప్రేక్షకు దోహదమైంది. పెంపుడు హంస అనటంలో అది ఆమె నిస్సంకోచంగా అనుకరిస్తుందని చెప్పవచ్చు.

కౌరవ సైన్యం నడుస్తున్న తీరును తిక్కన
"అభినవ జలధర శ్యామంబు లగునెడ
   లాకుజొంపంబు ననుకరింప
సాంధ్యరాగోపమ చ్ఛాయంబు లగుపట్లు
   కిసలయోత్కరములఁ గ్రేణిసేయ...." (50)

- అని ఉద్యానవనంలో కనిపించు వస్తువులన్నిటినీ పైకిలేచే ధూళిలో ఊహించాడు. ఆకు గుబురులు, చిగురు గుత్తులు, పూల పొదరిళ్లు, పుప్పొడి - ఇవన్నీ ఉద్యాన వనంలో కనిపించేవి. నేలనుంచి లేచిన ధూళిని ఆయా రంగుల్లో వర్ణించటం మహాకవికే సాధ్యం. అలాగే కౌరవ సైన్యాన్ని చూసి ఉత్తరుడు భయపడిన తీరును, కురువీరుల పలుకుల్లో అర్జునుని శౌర్యాన్ని వర్ణించిన తీరును గమనించినప్పుడు తిక్కన వర్ణనాత్మక ప్రతిభ స్పష్టమవుతుంది.

పాత్ర చిత్రణ : ఉత్తర గోగ్రహణము అనే పాఠ్యభాగంలో పలు పాత్రల్ని తిక్కన వర్ణించిన తీరును గమనించినప్పుడు ఆయన మనో విజ్ఞానవేత్తగా భాసిస్తాడు. తమ అర్హతనుమించి అనవసరమైన ప్రగల్భాలు పలికి చివరికి ప్రతీకగా ఉత్తరుడు చిత్రించబడ్డాడు. అవసరమైన సమయంలో తగిన సలహాలు ఇవ్వగలిగిన వ్యక్తిగా ఎటింగినపని సెప్పగావలయు" నని పలికి బృహన్నల గొప్పతనాన్ని చెప్పిన ఆపద్బాంధవిగా సైరంధ్రిని గుర్తించవచ్చు. బృహన్నలను సారథిగా ఒప్పించటానికి ఉత్తరను ప్రేరేపించిన కార్యశీలిగా సైరంధ్రి ఈ పాఠ్యభాగంలో కనిపిస్తుంది. గురువు పట్ల వినయం, భయం, సంభ్రమం కలిగిన ప్రియమైన శిష్యురాలిగా ఉత్తర దర్శనమిస్తుంది.

అసమాన పరాక్రమశాలిగా అర్జునుడు భాసించాడు. అర్జునుని పరాక్రమాన్ని మనసారా ప్రశంసించిన ఉత్తమ గురువుగా ద్రోణుడు ప్రత్యక్షమవుతాడు. ద్రోణుని పలుకుల్ని సమర్థిస్తూ అశ్వత్థామ పలికిన వ్యంగ్యస్ఫోరకమైన పలుకుల్లో అతని నిర్భయత్వం, తండ్రిపట్ల ప్రేమ,

వీరుని పట్ల అభిమానం స్పష్టమవుతాయి. మాత్సర్యగుణానికి ప్రతీకగా వాచాలతకు సాక్ష్యంగా, పెద్దల్ని దూషించే అవినయపరునిగా కర్ణుడు కనిపిస్తాడు. కర్ణుని వాచాలతకు అడ్డుకట్టవేసి అర్జునుని ఘనతనే కాకుండా పాండవుల బలాన్నిప్రశంసించిన 'ఆర్యమతి'గా కృపాచార్యుడు కనిపిస్తాడు. ఇప్పటికైనా మించింది లేదు. సంధి చేసుకోవటమే మంచిదని భీష్ముడు పలికినప్పుడు రాజ్యభాగాన్నివ్వనని యుద్ధానికి సిద్ధమని పలికిన అశక్త దుర్జనునిగా దుర్యోధనుడు ఈ పాఠ్యభాగంలో కనిపిస్తాడు. ఆయాపాత్రల మనః ప్రవృత్తుల్ని వారి పలుకుల ద్వారా, ఇతరుల పలుకుల ద్వారా స్పష్టంచేసి సజీవ పాత్ర నిర్మాణం గావించిన ప్రతిభాశాలి తిక్కన.

**నాటకీయ శైలి :** మహాభారతం శ్రవ్యకావ్యం. శ్రవ్యకావ్యంలో దృశ్యకావ్య ధర్మాల్ని పొందుపరచి అద్భుతమైన రచనను గావించిన కావ్య నిర్మాణమర్మజ్ఞుడు తిక్కన. నన్నయది కథా కథనశైలి కాగా తిక్కనది నాటకీయశైలి. ఎర్రనది వర్ణనాత్మకశైలి.

'ఉత్తర గోగ్రహణం' ఒక నాటకం లాగా సాగింది. ఆయాపాత్రల సంభాషణలు తిక్కన నాటకీయ శైలికి నిదర్శనాలు. పాఠ్యభాగం ప్రారంభంలోనే నాటకీయమైన సన్నివేశం సాక్షాత్కరిస్తుంది. అంతఃపురకాంతా సమేతుడై ఉత్తరుడు ఉండటం ఆ సమయంలోనే గోపాలుర నాయకుడు వచ్చి జరిగిన విషయాన్ని విన్నవించటం నాటకీయ ధోరణిలో సాగింది. గోపాలుర నాయకుడు పలికిన పలుకులకు స్పందించిన ఉత్తరుడు "కౌరవుల్ని నుగ్గునుగ్గుచేసి గోవుల్ని క్షణంలో మరలిస్తానని" చెప్పటంలో నాటకీయత గోచరిస్తుంది.

ఉత్తరుడు బృహన్నలను పిలిపించి సారథిగా చేసుకొనే సన్నివేశంలో నాటకీయత గోచరిస్తుంది.

ఉత్తరుడు : వేరమ్మ, మైమఱువుఁదొడి తేరెక్కుము.

బృహన్నల : ఆటపాటగల యప్పటికిన్ నను గోరి పిల్వబంచినఁ దగుఁగాక! సంగరము సేతకు సారథికమ్మ, రమ్మ నీవనుటుచితంబె?

ఉత్తరుడు : దండితనంబు నీ యెడన్ తక్కెనె? రణోత్సాహనంబొనరింపు గ్రక్కునన్ (తర్వాత కవచాన్ని తెప్పించి.)

ఉత్తరుడు : తొడుగుమీవని యొప్పించిన

బృహన్నల : ఇట్టునట్టు నొఱవలుగా మైగప్పికొని....

ఉత్తరుడు : సత్వరంబుగఁ దత్తనువున మఱువుం దొడిగి...

- ఈ సన్నివేశమంతా నాటకీయంగా సాగింది.

కౌరవ సైన్యాన్ని చూసి ఉత్తరుడు భయపడి పారిపోవటం, అతన్ని వెంబడించి అర్జునుడు పట్టుకొని రథంమీద ఉంచటం అనే విషయాలు నాటకీయ ధోరణిలోనే సాగాయి.

**రసాభ్యుచిత బంధం :** తిక్కన రసపోషణలో సిద్ధహస్తుడు. శ్రీనాథుడు "వాక్రుత్తు తిక్క యజ్వ ప్రకారముగ రసాభ్యుచిత బంధముగ నొక్కొక్కమాటు" అని పలకటాన్ని బట్టి కవిసార్వభౌమునికే ఆదర్శప్రాయుడైన వ్యక్తిగా 'కవిబ్రహ్మ' తిక్కన గోచరిస్తాడు. ప్రస్తుత పాఠ్యభాగమైన ఉత్తర గోగ్రహణంలో హాస్యం, వీరం, భయానకం, వాత్సల్యాదిరసాల కనుగుణమైన పద బంధాల్ని ప్రయోగించి తన ప్రతిభను ప్రకటించాడు.

ఉత్తరుడు తెప్పించిన కవచాన్ని "ఇట్టునటు నొఱవలుగా మైగొప్పికొనటంతో" అక్కడున్న అంతఃపుర స్త్రీలందరూ నవ్వారు. ఉత్తరుడు 'సత్వరముగ' కవచాన్ని తానే బృహన్నలకు తొడిగి తానూ హృద్యోదాత్తమైన కవచాన్ని ధరించాడు. 'రయమున సిడమెత్తుము' అంటాడు. యుద్ధభూమికి 'రయమున' వెళ్లే రథవేగానికి మెచ్చుకొన్నాడు. శత్రుసేనను చూసి భయపడి 'రయంబునన్ దేరు మరల్పుము' అంటాడు. ఉత్తరునికి అన్నీ 'రయముగా' జరగవలసిందే. అందుకే బృహన్నల ఉత్తరునితో "అరదమెక్కి రయంబునవచ్చి యిచ్చటన్ దండి తురంగ సద్భట కదంబముఁ జూచి కలంగుటొప్పునే" అని చురక అంటించాడు. అయినా దాన్ని గ్రహించేస్థితిలో ఉత్తరుడు లేడని చెప్పవచ్చు.

అర్జునుని వీరరసానికి స్ఫోరకంగా

"శ్రవణ పుటంబులు వ్రయ్యంగఁ దాకి సం
క్షోభంబు గావించె గుణము మ్రోత
బ్రహ్మాండ భాండంబు పగిలించి భూత ని
శ్చైతన్య మొనరించె శంఖరవము... " (180)

అని సాగిన పద్యంలో రసోచితమైన పదప్రయోగం జరిగింది. ఉత్తరుడు భయపడిన తేలిక పదాలతో వర్ణిస్తూ తిక్కన

"వెల వెలఁబాఱుచు వెగడొందుఁ బెదవుల
తడియాఱ నెంతయుఁ దల్లడిల్లుఁ
జల్లన నంగంబు లెల్ల నిండఁ జెమర్చుఁ
బదములుఁ గరములుఁ గుదియ వడకు..." (80) అని

చెప్పిన పద్యంలో ఇంకా గుండె దడదడ కొట్టుకోవటం, కంఠం గాద్గికం కావటం, ఏడవటం అనే లక్షణాల్ని తెలిపాడు. సాత్త్విక భావాల లక్షణాలతో సమర్థంగా సాగిన ఈ పద్యం తిక్కన రసాభ్యుచిత పద ప్రయోగానికి నిదర్శనం.

ద్రోణుని ప్రక్కనే ఉన్న భీష్ముడు మనుమని అభ్యున్నతికి సంతోషించాడు. ఆయనలో వాత్సల్య భావం తరంగితమైంది. అందుకే

"చిరకాలమునకుఁ గంటిమి
నరుఁ డక్కట వీడు సజ్జన ప్రియుఁడు సుహృ
త్పర తంత్రుడు బాంధవ హితుఁ
డరి భీకరుఁ డట్టి వార లవనింగలరే?" - అని పలికాడు

ఇక్కడ వాత్సల్యానికి అనుభావంలో గుణశ్లాఘనం ప్రధానమైంది. ఎంతోకాలానికి అర్జునుని చూచినామనటానికి 'అక్కట' అనే అవ్యయ ప్రయోగం అవ్యయమైన అతని సజ్జన ప్రియత్వం, మైత్రీ భావం, బాంధవ హితత్వం, అరిభీకరత్వం ప్రశంసా పాత్రాలయ్యాయి.

కలతపడిన ఉత్తరుని ఓదార్చటానికి బృహన్నలా వేషంలోని అర్జునుడు ఉత్తముడు. మొదట ఉత్తరునితో మేలమాడినా వాత్సల్యాన్ని ప్రకటించి అతనిలో ధైర్యాన్ని చిగురింపజేశాడు. దీనికి అనుగుణమైన పదాల్ని ప్రయోగించి తన ప్రత్యేకతను ఇలా ప్రకటించాడు.

"మనుజు లంటకుండ మఱువడఁ జేసిన
యస్త్ర శస్త్ర సంచయంబుగాని
శవముగాదు మత్స్యభూపాల తనయ యే
నట్టిదైన పనుతునయ్యనిన్ను" (109)

- బృహన్నల ఉత్తరుని 'మత్స్య భూపాల తనయ' అని సంబోధించటంలో ఆదరం, 'పనుతునయ్య' అనటంలో వాత్సల్యం స్ఫురిస్తున్నాయి.

**ఆలంకారిక ప్రతిభ :**

శబ్దార్థాలంకారాలు కావ్య బాహ్యాంతర సౌందర్య ప్రతీకలు. తిక్కన శబ్దాలంకారాల కంటే అర్థాలంకారాలనే ఎక్కువగా ప్రయోగిస్తాడనటానికి ప్రస్తుత పాఠ్యభాగమైన 'ఉత్తర గోగ్రహణము' సాక్ష్యం.

**శబ్దాలంకారాలు :**

"గర్జనోదగ్ర తర్జనుఁ డర్జునుండు" - అనటంలో సాధురేఫ 'జ' కారాల సంయుక్తంలో వృత్త్యను ప్రాస వినిపిస్తుంది.

"బాహు విస్ఫురితుడు.... కులభూతి విశేష విధాయకుండు, భూభరణ విశారదుండు, జనభవ్య తపః ఫల సంభవుడు, కాతర పరిరక్షకుండు" అనటంలో అంత్యానుప్రాస భాసిస్తున్నది.

"హయముల బూన్పుము రథమున
రయమున సిడమెత్తు మిపుడ రావలయును గో
చయముగొని, యస్మదీయ వి
జయమభినందింప...."

అనే పద్యంలోని ద్విప్రాస సహృదయ రంజకంగా ఉన్నది. ఇలా ఈ పాఠ్యభాగంలో శబ్దాలంకారాలెన్నో ఉన్నాయి.

**అర్థాలంకారాలు :**

ఉపమ : ఉత్తర నర్తనశాలలో ప్రవేశించిన తీరును వర్ణిస్తూ

"మెఱుగు మొగిలి సొచ్చు తెఱఁగున నాట్యమం
దిరము సొచ్చి తనదు గురువు కడకు
నరిగి నెమ్మి నిట్టులను నింతి....." (27)

- ఇక్కడ ఇంతి ఉపమేయం. నాట్యమందిరం ఉపమేయం. మెఱుగు, మొగిలి - ఉపమానాలు; చొచ్చుట - సమాన ధర్మం, తెఱగు ఉపమావాచకం. కాబట్టి ఇది పూర్ణోపమ.

రూపకం : కర్ణుని పలుకుల్ని కవి ఈ విధంగా వర్ణించాడు

శ్లేష :- అతడు వచ్చెనేని నస్మచ్ఛిలీముఖ
పాతచలిత హృదయ పద్ముఁజేసి
వెగడు పఱచి యోధవీరుల కెల్లను
త్సవ మొనర్తు బాహు దర్పమొప్ప" - (99)

- ఇక్కడ హృదయ పద్మం అనటంలో పద్మం అనే ఉపమాన ధర్మం హృదయం అనే ఉపమేయంలో ఆరోపించబడింది. కాబట్టి రూపకాలంకారాన్ని గుర్తించవచ్చు.

శిలీముఖ శబ్దానికి బాణం, తుమ్మెద అనే అర్థాలున్నాయి. భ్రమరం పడితే పద్మం చలించిపోయినట్లుగా. బాణపాతంతో హృదయం చలించి పోతుందని చెప్పటంలో 'శిలీముఖ' శబ్దం నానార్థ సంశ్రయమైంది కాబట్టి శ్లేషను గుర్తించవచ్చు. ఇలా ఎన్నో అలంకారాలున్నాయి.

**పదప్రయోగ దక్షత :**

తిక్కన పదప్రయోగం చిత్రంగా ఉంటుంది. అలతి అలతి పదాలతో సాగుతుంది. వాక్యాలుగా ఉంటుంది. క్రియా పదాలతో ఉంటుంది. సన్నివేశాని కనుగుణంగా ఈయన రచన సాగుతుంది.

"అరుల గుణములైన నగ్గింతు రెప్పుడు
గలయ బెరసినపుడు కలితనంబు
మెఱయుదురు మహాత్ము; లెఱుగడు తుదిమొద
లెట్టివారి నితడు బెట్టు పలుకు'' (223) - అలతి అలతి పదాలతో ఈ పద్యం సాగింది.

"భీష్మ ద్రోణ కృపాది ధన్వి నికరా భీలంబు దుర్యోధన గ్రీ
ష్మాదిత్య పటు ప్రతాప విసరాకీర్ణంబు శస్త్రాస్త్ర జా
లోష్మస్ఫారచతుర్విధోజ్జ్వల బలాత్యుగ్రంబు ......'' అని సాగిన

పద్యంలో దుష్కర ప్రాస మాత్రమే గాక సంస్కృత పద బాహుళ్యం, సుదీర్ఘ సమాసరచన స్పష్టమవుతాయి. తిక్కన పద్యాలు వాక్యాలుగా సాగుతాయి కొన్ని సందర్భాల్లో. "కురు సైన్యంబులు వచ్చిముట్టి కొనియెన్ గోవర్గమున్; వేగమై మరలం దెచ్చుటకుం గడంగుము, రిపుక్ష్మాపాల లోకంబు నీ శరజాలంబుల పాలుసేయుము'' - అని వాక్యాలతో పద్యం సాగింది. ఇలా పద్య నిర్మాణంలో తిక్కన పలుపోకడలు పోతాడు.

తెలుగుదనానికి తిక్కన కవిత నిలువెత్తు సాక్ష్యం. తిక్కన పలుకుబడులు, నానుడులు తెలుగుదనాన్ని ప్రతిబింబిస్తాయి. "ఎఱింగిన పని సెప్పగావలయు'' 'పసుల దయ్యమెఱుగు' 'పడతుల సంతోషమేల నాకు' "పేడిఁజూడ రోయుదు'' "నన్నిట్లాలి గొనగనేల'' "క్రొవ్వఱుగదేని'' "ఇట్టగుటెఱుగక వచ్చితిమి'' "ప్రాణములు దీపనమున్ వినవే'' "ఎత్తున గొందు'' "తెత్తుముహూర్త మాత్రమున'' "త్రిజగంబులు నొక్కట నెత్తి వచ్చినన్'' "నివుఱుగవిసిన మెఱయని నిప్పువోలె'' "ముక్కడి మూకలు,'' "పది వేవురముందర జెప్పు'' "నేల గోడివడగ'' "ఒంటి మార్కొన వశమె ముక్కంటికైన'' మొదలైన ప్రయోగాలు తిక్కన లోకజ్ఞతకు నిదర్శనాలు.

### తిక్కన - అనువాద విధానం

తిక్కన మూలభారతాన్ని అనువదించే సమయంలో పలు మార్గాల్ని అనుసరించాడు. యథామూలకంగా కొన్నిటిని సంక్షిప్తంగా కొన్నిటిని, కొన్నిటిని పరిహరించి భారత రచన చేశాడు. 'ఉత్తర గోగ్రహణము' అనే పాఠ్యభాగంలో తిక్కన అనువాద వైఖరిని ఈవిధంగా గుర్తించవచ్చు.

**యథామూలం :** సంస్కృతంలో ఉన్న విషయాల్ని యథావిధంగా తెలుగు చేసి మూలంపట్ల తన విధేయతను కొన్ని తావుల్లో తిక్కన ప్రదర్శించాడు. సంస్కృత భారతంలో అర్జునుని శ్వేత వాహనుడనే బిరుదు కలగటానికి గల కారణాన్ని అర్జునుడు ఉత్తరునితో

"శ్వేతాః కాంచన సన్నాహా రథేయుజ్యన్తి మేహయాః
సంగ్రామే యుధ్యమానస్య తేనాహం శ్వేతవాహనః'' (4-39-15) - అని పలికినట్లు ఉంటే తిక్కన

తే॥ తెలుపు లగు వాహనముల నాతేర సమర
భూములందెప్డు నియతిమైఁ బూన్కిఁ జేసి
శ్వేత వాహన నామ విఖ్యాతి నాకు
సకలజన సమ్మతంబుగ సంభవించె'' - అని రచించాడు.

**కొద్దిమార్పు :** బీభత్సుడు అనే బిరుదు ఏర్పడ్డ తీరును కూడా తిక్కన కొద్దిమార్పుతో రచించాడు.

"నకుర్యాం కర్మ బీభత్సం యుద్ధ్యమానః కథంచన
తేన దేవ మనుష్యేషు బీభత్సు రితి మాం విదుః'' (4-39-18) - అని మూలంలో ఉంటే

తే॥ "వీరులకుఁ జూడ బీభత్స విధముగలుగు
నట్టి కార్యంబు సేతకు నెట్టి సమర
భంగులను దడఁ బడక బీభత్ససేయ
దాన బీభత్సుఁడను నభిదానమయ్యె" (144) - అని తిక్కన రచించాడు. ఇక్కడ 'దేవ మనుష్యేషు' - అనే విషయాన్ని తిక్కన మార్పు చేశాడు.

**మూలానికి కొంచెం పెంపు :** మూలంలో సవ్యసాచి అనే బిరుదు కలగటానికి గల కారణాన్ని అర్జునుడు

"ఉభౌ మే దక్షిణౌ పాణీ గాండివస్య వికర్షణే
తేన దేవ మనుష్యేషు సవ్యసాచీతిమాం విదుః" (4-39-19) - అని పలికాడు. దీన్ని తిక్కన

"భండనమున నిరుగేలను
గాండీవముఁ దివియ నేర్పు గలిగిన నందు
ద్దండమగు సవ్యకరము, ప్ర
చండతఁ బరగుదును సవ్యసాచియనంగన్" (145) - ఇక్కడ సవ్యకరము, ప్రచండత అనేవి తిక్కన పెంపులు. ఇలాగే జిష్ణుడు అనే బిరుదు రావటానికి మూలంలో

"అహందురా పోదుర్ధర్షో దమనః పాకశాసనిః
తేన దేవ మనుష్యేషు జిష్ణు ర్నామాస్మి విశ్రుతః" (4-39-31) - అని ఉండగా తిక్కన

"అని మొన మార్కొని వ్రణమేఁ
గనుఁగొన ధర్మజుని మేనఁ గావింపఁగ, న
య్యనిమిషులుఁ జాలరెవ్వరుఁ
జెనకినఁ బరిమార్తుఁ గాన జిష్ణుడ నైతిన్ - (147) - అని రచించాడు.ఇక్కడ ధర్మజ ప్రశంస తిక్కన పెంపు.

మూలంలో యుద్ధాన్ని చూసింది ఇంద్రుడు మాత్రమే అని ఉంటే తిక్కన ఆయనతోపాటు పాండురాజును కూడా కూర్చోబెట్టాడు.

**మూలానికి వ్యాఖ్య :** దుర్యోధనుడు తన ప్రలాపాలను ప్రకటిస్తున్న సమయంలో భీష్మాదులు విని కీర్తించారనే విషయం ఉన్నది మూలంలో -

"తస్మిన్ బ్రువతి తద్వాక్యం ధార్తరాష్ట్రే పరంతపే
భీష్మోద్రోణః కృపో ద్రౌణిః పౌరుషం తదపూజయన్" - అని రాజరాజు పౌరుషాన్ని వాళ్లు నలుగురూ కీర్తించారు అని మాత్రం ఉన్నది. దీన్ని తిక్కన వ్యాఖ్యానిస్తున్న రీతిలో

"అను పలుకులకును భీష్మం
డును ద్రోణుఁడు ద్రోణ సూనుఁడును గృపుఁడును మే
లని యియ్య కొనిరి హృదయా

నను రూపము లయిన తెలువు లాస్యముఁ బొందన్" (103) - అని రచించాడు. "కీర్తించారు" - అని మూలంలో ఉంటే తిక్కన వారునలుగురూ పైకి బాగుందని సంతోషించారు. కాని వారి మనసుల్లో దుర్యోధనుని హీన స్వభావానికి అసహ్యం వేసింది. ఆ 'మేలు' అనే మాటలోనూ వ్యతిరేకత గోచరిస్తున్నది. అందులో ఒక విధమైన హేళనకూడా లేకపోలేదు. "హృదయాననురూపములయిన తెలువు లాస్యముఁ బొందన్" అనేది తిక్కన వ్యాఖ్యానం.

'ఉత్తర గోగ్రహణము' అనే పాఠ్యభాగంలో తిక్కన తన బహుముఖ ప్రతిభా పాటవాన్ని ప్రదర్శించాడు. ఆంధ్రావళికి మోదం కలిగేటట్లు రచించాడు. వర్ణనలతో, రసపోషణతో, సంభాషణా చాతుర్యంతో ఆలంకారిక ఉపజ్ఞతో, సమాసరచనా నైపుణ్యంతో అనువాద ప్రతిభతో సహృదయుల్ని అలరింపజేశాడు. ముఖ్యంగా మానవ మనఃప్రవృత్తుల్ని ప్రకటింపజేసే సందర్భంలో నిశిత పరిశీలనాశక్తి ప్రదర్శించాడు. అందుకే తిక్కన భారతం సార్వకాలికమై సార్వజనీనమై అలరారుతూ ఉంటుందని చెప్పటం సముచితమని భావించవచ్చు.

### 1. 5. 1 రాదగిన ప్రశ్నలు :

1. ఉత్తరుడు కురు సైన్యాన్ని చూసి భయపడిన తీరును తెల్పడి.
2. ఉత్తరుడు బృహన్నలను తన సారథిగా చేసుకొన్న విషయాన్ని వివరించండి.
3. రథి సారథియైన తీరును అంటే ఉత్తరుడు అర్జునునికి సారథియైన ప్రత్యేకతను తెల్పండి.
4. అర్జునుని పాత్ర చిత్రణ గావించండి.

### 1. 5. 2 ఆచూకీ గ్రంథాలు :

1. శ్రీమదాంధ్ర మహాభారతము - విరాట పర్వము - జననహిత వ్యాఖ్య - 1989
2. తిక్కన సారస్వతమూర్తి - కళాప్రపూర్ణ మరుపూరి కోదండరామిరెడ్డి - 1986
3. తిక్కన చేసిన మార్పులు - ఔచిత్యపు తీర్పులు - డా॥ సుమతీ నరేంద్ర - 1982
4. ఆంధ్రమహాభారతములో రసపోషణము - డా॥ ఎల్లూరి శివారెడ్డి - 1989
5. మహాభారత వైజయంతి - 2 భారతీయ ధార్మిక విజ్ఞాన పరిషత్, గుంటూరు - 2003
6. భారత పద్యశైలి - డా॥ చేరెడ్డి మస్తాన్ రెడ్డి - 1989

డా॥ గుమ్మా సాంబశివరావు ఎం. ఏ., పి హెచ్.డి.
రీడర్ & తెలుగు శాఖాధిపతి
ఆంధ్ర లొయోల కళాశాల
విజయవాడ - 520 008

మొదటి భాగము - ప్రాచీన పద్యభాగము

పాల్కురికి సోమన

# బెజ్జ మహా దేవి కథ

(బసవ పురాణం - తృ.ఆ 151 - 166)

# గొడ గూచి కథ

(బసవ పురాణం - తృ.ఆ 625 - 952)

## పాఠం - 6


1. 6. 0 - పరిచయం

1. 6. 0. 1 - కవి పరిచయం

1. 6. 0. 2 - కావ్య పరిచయం

1. 6. 1 - పాఠ్యభాగ వివరణ

1. 6. 1. 1 - బెజ్జ మహాదేవి కథ

1. 6. 1. 1 - పాఠ్యభాగ వివరణ

1. 6. 1. 2 - గొడ గూచి కథ


**1.6. 0 పరిచయం :**

**1.6. 0.1 కవి పరిచయం :**

తెలుగు సాహిత్యంలో నన్నయ యుగానంతరం శివకవి యుగమన్నది ప్రసిద్ధం. శివకవుల్లో ప్రముఖుల్లో నన్నెచోడుడు, పండితారాధ్యుడు, పాల్కురికి సోమన. నన్నెచోడుడు వృత్తాల్నే స్వీకరించాడు. కానీ పాల్కురికీ సోమన ద్విపదచ్ఛందస్సుకు ప్రాముఖ్యమిచ్చాడు. శివపారమ్యమైన కథలే గ్రంథస్థం చేశాడు. కనుకనే వీర శైవ కవుల్లో ప్రథమగణ్యుడు పాల్కురికి సోమన. ఇతడు అష్ట భాషా కవితా ప్రవీణుడు. తత్త్వ విద్యాకలాప కవితా సారుడు. సోమనను గూర్చి తెలుసుకోవడానికి ముఖ్యమైన ఆధారగ్రంథాలు. 1. ఇతని బసవ పురాణము మొదలైన గ్రంథాలు 2. పిడపర్తి సోమన రచించిన పద్య బసవ పురాణము 3. తోంటదసిద్ధ లింగకవి కన్నడంలో రచించిన పాల్కురికి సోమేశ్వర పురాణము. 4. ఏకామ్రనాథుని ప్రతాప చరిత్ర.

**జన్మస్థలం :** ఈ కవి ఇంటిపేరును బట్టి 'పాలకురికి' - గ్రామ వాస్తవ్యుడై ఉండవచ్చునని పండితుల అభిప్రాయం. శ్రీశైలానికి ఈశాన్యభాగాన కొలనుపాక గ్రామంలోని సోమేశ్వరస్వామి వరప్రసాదాన, పాలుకురికి గ్రామంలో జన్మించాడని తోంటదసిద్ధలింగకవి, తన 'సోమేశ్వర పురాణం' పేర్కొన్నాడు. ప్రస్తుతం వరంగల్లుకు 30 కి.మి. దూరంలో పాల్కురికి గ్రామం ఉంది. ఇతడు క్రీ. శ. 1160 - 1240 మధ్యకాలంలో జీవించినట్లు తెలుస్తుంది. ఇతని ప్రసిద్ధరచనలైన 'అనుభవ సారము' ను క్రీ.శ. 1180 ప్రాంతంలోను, బసవపురాణాన్ని 1192 ప్రాంతంలోను, పండితారాధ్య చరిత్రను 1230 ప్రాంతంలోను రచించిఉంటాడని 'బండారు తమ్మయ్య' గారి అభిప్రాయం.

**తల్లిదండ్రులు :** బసవపురాణావతారికలో :

'భ్రాజిష్ణుడగు విష్ణు రామిదేవుండు
తేజిష్ణువగు శ్రీయాదేవి యమ్మయును
గారవింపగ నొప్పు గాదిలి నుతుఁడ
వీరమాహేశ్వరాచార వ్రతుండ' - అని చెప్పుకున్నాడు.

కాని సోమనాథుని బాల్యమందే తల్లిదండ్రులు మరణించగా, అప్పటి పాలకురికి గ్రామ పరిపాలకులు, శైవ బ్రాహ్మణ కుటుంబం వారాతని ఆదరించి పోషించారని ఒక ఐతిహ్యం కూడా ప్రచారంలో ఉంది. సోమనాథుడాజన్మాంతము గృహస్థుడుగా జీవించాడు. అతడు సన్యాసం స్వీకరించాడని చెప్పడానికి ఎటువంటి ఆధారాలు లేవు. సోమనాథుని కవితా విద్యాగురువు కరస్థలి విశ్వనాథుడు.

**సోమనాథుని వైదుష్యము :** సోమనాథుడు సకల విద్యాపారంగతుడు. సరస కవితా విశారదుడు. సంగీత శాస్త్రజ్ఞుడు. పిడపర్తి సోమనాథుడు ఇతని మేధాశక్తిని ఈ విధంగా చెప్పాడు.

సీ ॥ లిపి లిఖింపక మున్న యపరిమితార్థోక్తి
శక్తి యాతని జిహ్వ జరుగుచుండు
ఛంధోధి కరణాది సరణి జూడకమున్న
మదినుండు కావ్య నిర్మాణశక్తి,
భాష్య సంతతులు చెప్పక చూడకయ మున్న
రుద్ర భాష్య క్రియారూఢి వెలయు
తర్క శాస్త్రాది విద్యలు పఠింపకమున్న
పర పక్ష నిగ్రహ ప్రౌఢి వెలయు,

గీ॥ అతని నుతియింప నాబోటి కలవి యగునె
జైన మస్తక విన్యస్త శాతశూల
కవిత బిజ్జల తలగుండు గండ బిరుద
శోభితుడు పాల్కురికి సోమనామాభిదుండు' --

ఇటువంటి అపారజ్ఞానం, గురువు అనుగ్రహం వల్ల సంపాదించడం, కేవలం ఒక్క జన్మలో సాధ్యమయ్యేది కాదు. ఈశ్వర ప్రసాదాన అప్రయత్నంగానే సకల విద్యాశక్తులు ఇతనికి లభించాయి. అందుచేతనే అతనిని సాక్షాత్తు 'భృంగి' అవతారంగా భావించడం జరిగింది.

**బిరుదులు :** 'పర సర్వజ్ఞ శిఖామణి,' 'ప్రత్యక్ష భృంగీశావతార', 'తత్వ విద్యాకలాప', 'అన్యవాద కోలాహ', 'కవితా సార', మొదలగునవి ఇతనికి గల బిరుదులు.

**సోమన రచనలు :** తెలుగు భాషాకృతులు : బసవ పురాణం, పండితారాధ్య చరిత్ర, అనుభవసారం, వృషాధిపశతకం, చతుర్వేద సారం, బసవరగడ, గంగోత్పత్తిరగడ, సద్గురు రగడ, చెన్నమల్లు సీసములు, నమస్కార గద్య, అక్షరాంక గద్య, పంచప్రకార గద్య, అష్టోత్తర శతనామగద్య, శరణు బసవగద్య, బసవోదాహరణము, పండితారాధ్యోహరణము మొదలైనవి. వీటిలో మనకు కొన్ని మాత్రమే లభ్యమవుతున్నాయి.

ఇందులో బసవపురాణం, పండితారాధ్య చరిత్ర ద్విపద కావ్యాలు.

**సంస్కృత భాషాకృతులు :** సోమనాథ భాష్యం, రుద్ర భాష్యం, సంస్కృత బసవోదాహరణం, వృషభాష్టకం, త్రివిధ లింగాష్టకం అనేవి.

కన్నడ భాషలోని లఘుకృతులు : సద్గురు రగడ, చెన్న బసవ రగడ, అక్షరాంక పద్యాలు, శరణు బసవ రగడ, బసవ లింగనామావళి, శీలసంపాదనం, శివగణ సహస్రమాలఅనేవి.

ఈ విధంగా పాల్కురికి సోమన సంస్కృతాంధ్ర కర్ణాట భాషల్లో నిష్ణాతుడు, కవిశ్రేష్ఠుడు.

**1.6.0. 2 కావ్య పరిచయం :**

**బసవపురాణ పరిచయం :**

తెలుగులో వెలసిన తొలి వీరశైవ పురాణ గ్రంథం బసవపురాణం. వీరశైవ మతాచార్యుడు బసవేశ్వరుని చరిత్రను ఈ కవి బసవ పురాణంగా రచించాడు. జైనులు, తీర్థంకరుల చరిత్రలకు 'పురాణం' - అని పేరుపెట్టడం, సంస్కృత కన్నడ సాహిత్యాల్లో ఉంది. ఆ సంప్రదాయాన్ననుసరించి సోమన, బసవన్న చరిత్రకు పురాణమని పేరు పెట్టాడు. బసవేశ్వరుడు నందీశ్వరుని అవతారంగా ఇందులో వర్ణించబడ్డాడు. ఈ గ్రంథంలో ఏడాశ్వాసాలున్నాయి. బసవని పూర్వావతారాలు, జననం, వ్యవహార దక్షత, వీరశైవ ధర్మ రక్షాప్రచారాలు, జంగమసేవ, లింగైక్యము మొదలైన పుణ్యచరిత్రలతోపాటు సుమారు 75 మంది శివభక్తుల కథలు కూడా పూసలలో దారం లాగా ఇందులో కూర్చబడ్డాయి. ముగ్ధసంగయ్యకథ, బెజ్జమహాదేవి కథ, గొడగూచి కథ, కన్నప్ప కథ, మాదిరాజయ్య కథ, సిరియాళుని కథ మొదలైనవెన్నో రసనిర్భరంగా సోమన రచించాడు.

**బసవేశ్వరుడు :** బసవేశ్వరుడు క్రీ.శ 1139 ప్రాంతంలో జన్మించినట్లు తెలుస్తుంది. ఆదిశంకరుని లాగానే 40 సంవత్సరాల లోపే జీవించాడు బసవేశ్వరుడు. ఇతడు నందీశ్వరుని అంశతో, మాదిరాజు, మాదాంబ అనే బ్రాహ్మణ దంపతులకు జన్మించాడు. పసితనంలోనే అనేక విద్యలు నేర్చి, తల్లిదండ్రులను విడిచి, కల్యాణ కటకంలో తన మేనమామ దగ్గర చేరాడు. అతని మేనమామ బిజ్జలుని వద్ద మంత్రిగా ఉండేవాడు. తన మేనమామ కుమార్తె గంగాంబను వివాహమాడి క్రమంగా, మేనమామ అనంతరం మంత్రి అయ్యాడు. అప్పటినుంచి వీరశైవమత ప్రచారానికి ఉద్యమించాడు. ఆనాడు శైవ మతంలో భిన్న శాఖలుండేవి. వాటినన్నింటిని ఒక్క కూటం లాగా చేర్చి, ఆంధ్ర కర్ణాట ప్రాంతాలలో వీర శైవం వ్యాప్తి చేశాడు. కులాధిక్యాలతో కూడుకున్న వర్ణవ్యవస్థను ధిక్కరించాడు. సర్వవర్ణాలవారు ఇందులో చేరడానికి అర్హులే. వర్ణవ్యవస్థ తుడిచివేయడంతో ప్రజల్లో న్యూనాధిక్యాలు తొలగిపోయాయి. అందరికీ భక్తి భావంకుదిరింది. ఇతడు కత్తిచేత బట్టి వీరశైవాన్ని ప్రబోధించాడు.

పురుషులతో పాటు సమాన బాధ్యతలతో స్త్రీలకు కూడా లింగధారణ దీక్ష ఇవ్వబడేది. ఈ కారణం చేత వీరశైవుల్లో స్త్రీ పురుష వివక్షలేక పుట్టుక నుంచి ద్విజులై, ఆజన్మ శుద్ధులై ఉండేవారు. వారికి లింగధారణే యజ్ఞోపవీతం. "లీన మర్థంగమయతి" - ఈ సృష్టి అంతా దేనిచేనుద్భవించి, దేనియందు లీనమవుతుందో ఆ పరబ్రహ్మకు లింగవాచకం వర్తిస్తుంది.

'ఈశాన స్సర్వ విద్యానామ్' - అని పంచబ్రహ్మ మంత్రాలలో చెప్పినట్లు సకల విద్యాధీశుడగు శివుని వదనపంచకం నుంచి ఆవిర్భవించిన సంతతివారగుటచే, తాము శివకులీనులమని, అందుచే వేదాధ్యయనాది సమస్తాధికారాలు తమకున్నాయని వీరశైవుల విశ్వాసం.

ఈశ్వరుని పంచముఖాల నుంచి 'సద్యోజాత, వామదేవ, అఘోర, తత్పురుష, ఈశాన' - అనే అయిదుగురాచార్యులుద్భవించి, వేర్వేరు యుగాలలో, వివిధ నామాలతో వ్యవహార ప్రసిద్ధులైనారు. వారే వీరశైవులకు గోత్రకర్తలని శైవాగమాల్లో చెప్పబడింది. బసవేశ్వరుడు పండితుడు, జ్ఞాని, మాత్రమే కాదు. మధుర గాయకుడు కూడా. ఇతడు సుమారు నాలుగు లక్షల వచనాలు రచించినట్లు చెబుతారు. బసవేశ్వరుడు తన మధుర కంఠంతో, ఆ వచనాలు తన్మయత్వంతో పాడుతుంటే ప్రజలు పరవశులై వినేవారట.

**సోమన కవితా దృక్పథం :**

సంస్కృత భూయిష్ఠ రచన పండితులకేనని, తన రచన సర్వజన సుబోధకంగా ఉండడానికి 'జాను తెనుగు' ను అభిలషించానని, అవి కేవలం తెలుగు మాటలని చులకనగా చూడవద్దని, వాటిని 'వేదముల కొలదియకాఁజూడుడ' ని, 'అల్పాక్షరంబుల అనల్పార్థ రచన కల్పించుటయె కాదె కవి వివేకమ' ని సోమన చెప్పుకున్నాడు.

"ఆరూఢ గద్య పద్యాది ప్రబంధ
పూరిత సంస్కృత భూయిష్ఠ రచన
మానుగా సర్వ సామాన్యంబు గామి
జాను దెనుగు విశేషము ప్రసన్నతకు." (పండితారాధ్య చరిత్ర)

"ఉరు తరగద్య పద్యోక్తుల కంటె
సరసమై పరగిన జాను దెనుంగు
చర్చింపగా సర్వ సామాన్య మగుట
గూర్చెద ద్విపదలు గోర్కె దైవార

తెలుగు మాటలనంగ వలదు, వేదముల
కొలదియ కాజూడు డిల ......."
"అల్పాక్షరముల ననల్పార్థ రచన
కల్పించుట మెకాదె కవివివేకంబు" (బసవపురాణం)

దీనిని బట్టి తన రచనలు సమాజంలో అందరికీ అర్థంకావాలనే అతని అభ్యుదయ దృక్పథం వెల్లడౌతుంది.

దేశికవితోద్యమం శివకవులతోనే ప్రారంభమైంది. పాల్కురికి సోమన వస్తువు, ఛందస్సు, భాష - అనే అంశాలతో ఈ దేశికవితను సాధించాడు.

బసవేశ్వరుడు, పండితారాధ్యుడు - అనే మహాశైవ ప్రముఖుల చరిత్రలో అనేక వీర శైవభక్తుల కథలను కావ్యవస్తువులుగా స్వీకరించి, ద్విపద చందస్సులో, జాను దెనుగు భాషలో రచనలు చేసి సోమన శివకవి యుగానికి తలమానికమయ్యాడు. కాని, ఇతడు, చారిత్రకంగా, సాహిత్య పరంగా దేశికవులకు ఆచార్యుడైనప్పటికీ, ఇతని గ్రంథాలు మతావేశంతో కూడి ఉన్నాయి. కాబట్టి పాక్షిక దృష్టితో పాఠకలోకంలో ఉండిపోయాయి. కవితావేశం, మతావేశం పరస్పర పోషకంగా కనిపిస్తాయి. అయినప్పటికీ సోమన దేశికవితోద్యమ నాయకుడంటే అబ్బురపడవలసిన పనిలేదు.

## 1.6. 1 పాఠ్యభాగ వివరణ :

### 1.6.1. 1 బెజ్జ మహాదేవి :

బెజ్జ మహాదేవి ఈశ్వరుని శుభప్రదమైన పాదపద్మాలను తన అంతరంగంలో నిలుపుకున్న భక్తురాలు. ఆమె ఇలా ఆలోచించింది. " భర్గునకు సేవకులు, బంధువులు అందరూ ఉన్నారు. కాని తల్లి మాత్రం లేదు. ఇది చాలా చిత్రంగా ఉంది. కానీ తల్లిలేకుండా తానెట్లా జన్మించాడు ? త్రిలోకాలకు అధిపతియైన శివునకు తల్లి మరణించి ఉంటుంది. ఇప్పుడేం చెయ్యాలి ? తల్లి చనిపోయిన కారణంగానేకద తానెంతో దుఃఖపడింది ? ఎటువంటి వారికైనా మాతృవియోగ దుఃఖమంతేగద ? శివునికి తల్లిగనక ఉంటే ఎందుకు తపస్సు చేయనిస్తుంది? తల్లి ఉంటే వెంట్రుకలు జడలు గట్టనిచ్చేదా ? హాలాహల విషాన్ని తాగడానికి ఒప్పుకునేదా ? తోలు చీరలు ధరించనిచ్చేదా ? ఒంటినిండా బూడిద పూసుకోనిచ్చేదా ? భిక్షాటన చేయనిచ్చేదా ? శ్మశానంలో నివాసం ఉంటే ఊరుకునేదా ? తల్లి లేని బిడ్డడు కాబట్టి ఇన్ని చెయ్యరాని పనులు చేశాడు ! ఎన్నో ఇబ్బందులు పడ్డాడు !

తల్లి ఉంటే తన స్తన్యాన్నిచ్చి, వెన్నబెట్టి, ఆకలైతే మళ్లీ మళ్లీ చూసి పాలిచ్చి సాకి పెంచి పెద్దవాణ్ణి చేసేది కాదా ? తల్లి లేక పోతేనే ఇంత వాడయ్యాడు ! చిన్నప్పటి నుంచీ తల్లి ఉంటే ఇంకెంతగా వృద్ధిపొందే వాడోగదా ! ఎంత మగబిడ్డలైనా పెండ్లిండ్లలోను, పేరంటాలప్పుడు, పండుగ రోజుల్లోను, జాతరలప్పుడు చక్కగా అలంకరించి ఆదరించే తల్లి లేకపోతే దుఃఖపడరా ? ఇంక ఉపేక్షించడం మంచిదికాదు. హరునికి నేనే తల్లి నౌతాను. భేదభావం లేక పెంచే ఏ స్త్రీయైనా తల్లికాదా ?" అని ఆలోచించి బెజ్జ మహాదేవి తానే శివుని తల్లిగా

భావించుకుంది. పరమేశ్వరుణ్ణి తన కుమారునిగా లాలించసాగింది. పసిపిల్ల వాడు గాబట్టి తొడలమీద పడుకోబెట్టి అభ్యంజన స్నానం చేయించింది. స్నానం చేయించేటప్పుడు ముక్కును, చెక్కిళ్లను, కడుపును, వీపును చక్కగా పెరగాలని చేతులతో ఒత్తింది. మూడు కళ్లనూ స్పృశించింది. కాళ్లు, చేతులు వంకర్లు లేకుండా చక్కగా లాగింది. నలుగులు పెట్టింది. కాళ్లమీద బోరగిల పడుకోబెట్టి, నీటితో వీపుమీద చరచింది. తలమీద నీరు పోసింది. నీళ్లు నోట్లోకి పోకుండా ముఖానికి తన చేతిని అడ్డంపెట్టింది. పసుపు కలిపిన నీటితో స్నానం చేయించేది. స్నానం తర్వాత కళ్లు, చెవులు గట్టిగా ఊదేది. వ్రేలితో నోట్లో సున్నితంగా నొక్కి, కఫాన్ని వెలికి తీసేది. స్నానం చేయించడం పూర్తి కాగానే చేతినీరు చుట్టూరా తిప్పి దిష్టి తీసినట్లుగా, బొట్టు పెట్టేది.

తర్వాత బొటనవ్రేలితో మెత్తని మట్టిని కలిపి బొట్టు పెట్టేది. కడవ క్రింద అంటుకున్న కాలిన పిడకలు నలిచి, ఆ బూడిదను శివుని నొసటికి పూసేది. పై కెత్తితే ఎత్తు పెరగడేమో అని భయపడి ఆమె, ఆ బాలుని తన గుండెలకు అదుముకునేది. కాటుక పెడితే కళ్లుపెద్దవౌతాయని మూడుకళ్లకు కాటుక పెట్టి స్తన్యమిచ్చేది. పక్షుల నీడ పారితే పిల్లవాడు పాడైపోతాడని, జాగ్రత్తపడేది. తినడానికి వెన్నపెట్టేది. బుగ్గగిల్లి ఏడ్వగానే ఉగ్గుపాలు పోసేది. ఏడుపు మానడానికి ముద్దాడి బుజ్జగించేది. తన ఉదరాన్నే పాన్పుగా వేసి 'వీరెవ్వరో ?' యని లాలించేది. 'జో' కొట్టేది. ఈ విధంగా శివుని తన కుమారునిగా తలచి ఆమె ఉపచారాలు చేస్తూ ఉండగా ఆమె నిశ్చల ముగ్ధ భావానికి మెచ్చుకొని, ఈశ్వరుడు వాటినన్నింటిని స్వీకరించాడు. 'రూపం ఒక్కటే' అని వేదాలు, 'సాధకుడు ఎల్లప్పుడూ భగవంతుణ్ణి స్మరించాలి' - అప్పుడే 'ఆ రూపం, భావం సిద్ధిస్తాయి' - అని ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి. ఇది హరుని వాక్యం. దానికి లోకంలో తిరుగులేదు. 'భక్తు డే విధంగా భావిస్తే శివుడు ఆ రూపంలోనే సాక్షాత్కరిస్తాడ' ని భక్తులందరూ భావిస్తుంటారు.

ఈ విధంగా కొన్ని రోజులు జరుగగా, ఆ దేవ దేవుడు బెజ్జ మహాదేవికి ప్రసన్నుడు కాదలచి, చిన్న పరీక్ష పెట్టాడు. ఆ పిల్లవానికి తీవ్రమైన రోగం వచ్చింది. పాలు తాగడం లేదు. వెన్న తినడానికి నోరు తెరవలేదు. పిల్లవాని పరిస్థితి చూచి తల్లి తల్లడిల్లింది. దుఃఖంతో వివశురాలై ఇలా అంటుంది "నా ముద్దుల పట్టి ! పాలెందుకు తాగవు ? నీ చెమటలు చూస్తే నేను నెత్తురు ముద్దనౌతాను. (అంటే భరించలేనని భావం) ఈ స్థితిలో నిన్నెట్లా చూడగలను ? తల్లిని గద ! ఇంతటి బాధను ఏ విధంగా సహించగలను ? లేకలేక ఒక్కడివే పుట్టావు. ఈ దుఃఖాన్ని ఎలా దాటగలను ? నాకు నేలమీద కాళ్లు నిలవడం లేదు. ఏమీ మాట్లాడవెందుకు ? ఆహారం జీర్ణం కాలేదా ? గొంతు నొప్పిగా ఉందా ? అంగిట్లో బాధ కలిగిందా ? నాకేమీ మందులు మాకులు తెలియవు' - అంటూ దుఃఖంలో పలకరించింది. పొర్లింది. బిడ్డ ఒళ్ళు వేడిగా ఉందేమోనని చూచింది. కౌగిట్లో చేర్చింది. శరీరం మీద గుడ్డ కప్పుతుంది. తీస్తుంది. మళ్ళీ మళ్లీ అదేపని చేస్తుంది. తల్లడపడింది. పిల్లవానికి అంగిటిముల్లు అయిందని ఇరుగుపొరుగు వాళ్లంటే ఎంతో బాధపడింది. శోకసముద్రంలో మునిగిపోయింది.

ఆమె శివుణ్ణి చూస్తూ ఇలా నిష్ఠూరంగా అంటున్నది "కడుపులో కొంచెం వెలితి అంటే ఒడయనంబి దగ్గరకు వెళ్లావు. అక్కడ తినడానికి ఏమీలేక పోతే కుమ్మర గుండయ్య వాద్యం వాయిస్తూ ఉంటే నాట్యం చేశావు. అక్కడ కూడ ఏమీ లేకపోతే చేరమ చక్రవర్తి వద్ద అందరూ ఆశ్చర్యపడేటట్లుగా ఆడావు. ఆకలితో అలసిపోయావు. ఇటువంటి ఆటలు ఎన్ని ఆడినా కడుపునిండుతుందా ? అన్ని తిరిగివచ్చి, పిట్టవ్వ దగ్గర చివరకు ఇంత పిట్టు తిన్నావు. తర్వాత సామవేదుల వారింట్లో చచ్చిన పెయ్యను వండిపెడితే తిని, కరికాళవ్వ యింట్లో రహస్యంగా మామిడి పళ్ళు తిన్నావు. అంతటితో ఆగకుండా చెన్నయ్య ఇంట్లో పులిసిన అంబలి జుర్రి, చిరుతొండనంబి కొడుకు మాంసం అడిగి మరీ తిన్నావు. నిమ్మవ్వ దగ్గర భుజించి, చోడవ్వ గిన్నెతో ఇచ్చిన పులగం తిని, సురియ చౌడయ్య చేతి ముద్దలకు ఆశపడ్డావు. నిన్న ఈ విషయాలన్నీ ఒకామె నాకు చెప్పింది. కుమారా ? నన్ను ఇంతగా ఎందుకు బాధిస్తావు ? నీవు ఆకలికి మలమల మాడుతూ అందరి దగ్గర తిరగడమెందుకు ? అనవసరమైన తిళ్లు తినడం ఎందుకు ? నేను ఎలా బ్రతుకుతాను ? ఇలా చెడ్డ తిళ్లు తింటుంటే కడుపు ఉబ్బకుండా ఎలా ఉంటుంది" ?

"నేను నీకు చాలాసార్లు పాలు తాగిస్తున్నాను. వెన్న పెడుతున్నాను. వేళకు లేకపోతే ఎక్కడైనా అడిగి తెస్తున్నాను. నీవు ఇతరుల ఇళ్లకు వెళ్లి అడిగి తినడం ఎందుకు ? ఇన్ని రోజులు ఏ విధంగా సరిపోయింది ? నిన్న నీ కడుపు ఎందుకు నిండలేదు ? పగలైనా, రాత్రిపూట అయినా నీవు చంక దిగడం లేదు. నీలాటి మంకుపిల్లలుంటారా ? నాలాంటి తల్లులు ముల్లోకాల్లో ఉంటారా ? నీవు నా ప్రాణానివి. దానికి నీవే సాక్షివి. ఎలాగైనా, నేను చెప్పినట్లు ఉండి, పెట్టినంత తిని ఉంటే నీకు ఈ నొప్పి, రోగం ఎందుకు వస్తాయి ? నిప్పుకు చెదలంటుతాయా ? ఈ రోగం నీకు నీవే తెచ్చుకున్నావు. లేకపోతే ఈ ఆపద నీకెలా వస్తుంది ? మాటలతో రోగాలు తగ్గుతాయా ? నా పిచ్చిగానీ, ఇవన్నీ నిన్ను అడగడమెందుకు ? ఈ బాధ నేనింక చూడలేను. నీకోసం నేను ప్రాణాలు విడుస్తాను" అని

బెజ్జ మహాదేవి తన శిరస్సును పగులకొట్టుకోబోయింది. అపుడు శివుడు ప్రత్యక్షమై 'నీకు కావలిసిన వరం కోరుకోమంటాడు. ఆమె 'కుమారా ! నాకు ఏమీ లోటు లేదు. నీవు ఏ రోగం లేకుండా శాశ్వతంగా సుఖంగా ఉంటే నాకంతే చాలు. కన్న ప్రేమ కన్న పెంచిన ప్రేమ ఎక్కువంటారు. నిన్ను కళ్లారా చూస్తూ ఇక్కడ ఉండడమే నాకోరిక' - అంటుంది. అపుడీశ్వరుడు చిరునవ్వు నవ్వి తల్లిని కౌగిట చేర్చి ఇలా అంటాడు. 'నీవు నాకు తల్లివిగాబట్టి మూడులోకాలకు నీవే ముత్తవ్వవు. నీలాంటి తల్లి ఉంటే నాకు రోగాలెందుకు వస్తాయి ?' - అని ఆమెకు శాశ్వతమైన ముక్తిని ప్రసాదించాడు. ఆమె 'అమ్మ' యై శివుణ్ణి సేవించింది గాబట్టి ఆమెకు 'అమ్మవ్వ' - అన్న పేరు వచ్చింది.

### 1.6.1. 2 గొడ గూచి కథ :

శివ దేవుడను వాడొక శివభక్తుడు. ఒకసారి తాను, తన భార్య, కలిసి పొరుగూరికి వెళ్లవలసి వచ్చింది. వారిద్దరు, తమ సంతానంలో చివరిదైన చిన్నపిల్లను పిలిచి 'ఇంటికి కాపలగా ఉండమని ఇలా చెప్పారు'. 'నీవు అటూఇటూ వెళ్లవద్దు. ఇతర పిల్లలతో ఆడుకోవడానికి పరుగెత్తవద్దు. శివాలయానికి వెళ్లి ప్రతిరోజు కుంచెడు పాలు శివునికి ఆరగింపు పెట్టు. ఈ వ్రతాన్ని మరచిపోవద్దు. నిన్ను నమ్మి మేము ఊరికి వెళుతున్నాము. ఊరి నుంచి వచ్చేటప్పుడు నీకు బొమ్మలు, బొమ్మ పొత్తికలు తెచ్చియిస్తాము' - అని అప్పగించి, వారు వెళ్లగా, వారి కుమార్తె కాళ్లు, ముఖం కడిగి ఆవుపాలు మరగ గాచి, కుంచెడు పాత్రలో కొలిచి, పాత్రమీద సన్నని వస్త్రాన్ని కప్పి శివాలయానికి వెళ్లి ఆ పాలగిన్నె శివుని ముందు పెట్టి నమస్కరించి, ఆరగింపుమని విన్నవించింది. చాటున నిలిచి, మళ్లీ వచ్చి చూచింది. శివుడు పాలారగించలేదు. పాత్రలో పాలు తరగలేదు. ఆ బాలిక భయపడింది.

ఇలా పరిపరి విధాలుగా శివున్ని ప్రశ్నించింది. 'ఈశ్వరా ! నీవు పాలెందుకు త్రాగవు ? కాచుట సరిగా లేదా ? కమ్మగాలేవా ? విరిగినవా ? నేను చిన్నపిల్లనని భావించావా ? లేక ప్రొద్దెక్కి పోయిందా ? లేక పొగ వాసన వేస్తుందా ? నీకు పాలు త్రాగాలని బుద్ధి పుట్టలేదా ? నెయ్యి వెయ్యలేదని త్రాగవా ? చాలా వేడిగా ఉన్నాయా ? నీరు కలిసినవా ? వాద్యాలు లేకుండా నేనొక్కతెనే తెచ్చానని తాగవా ? ఇవి ఆవుల పాలు కాదని సందేహిస్తున్నావా ? పాలమీద నా మనస్సు పోయిందా ? లేక గిన్నె తెల్లగా శుభ్రం చేయలేదా ? కుంచెడు లేవా ? నీకు ఆరగింపు పెట్టడం నాకు చేతగాలేదా ? క్రింద పోయినవా? మీగడ లేదా ? నీకు తెచ్చేటప్పుడు ఎవ్వరైనా చూచారా? ఎందుకు పాలు త్రాగవు ? నిజంగా నీకు ఆకలి లేకపోతే గ్రుక్కెడు తాగి, మిగిలినవి నాకు ఇవ్వు, పాలు తాగడానికి గుడగుడలెందుకు? గుజ్జుగా చేసిన ఆహారం ఒక పాత్ర నిండా తెచ్చి పెట్టనా ? చిన్న పాత్రల నిండా పోలెలు (భక్ష్య విశేషాలు) ఉన్నాయి. వాటిని తెచ్చి పెడతాను. బెల్లము ఒక కుండ నిండా ఉంది. నీకిష్టమైతే చెప్పు. రేపు మా తండ్రి యింట్లో అర్చన ఉంది. నిన్ను పిలుచుకొని వెళతాను. మా శివసోదరి మఠంలో పాయసం ఉంది. పాలు ముందు తాగు. షోడశ పండుగ చూడడానికి పోదాము. నీవు పాలుతాగు.

"వీరభద్రుని జాతరకు నిన్ను బండిమీద పంపిస్తాను. పాలు తాగడానికి వైదుష్యమెందుకు ? కావాలంటే పాలలోకి అటుకులు తెస్తాను. ఈ పిల్ల ఉండగా ఎలాగని అనుకుంటావేమో ? ఇద్దరం కలిసితాగుదాము. రేపు ఊరినుంచి వచ్చేటప్పుడు చిన్న గిన్నెలు, చిన్న బొమ్మలు, అటుకులు, ఎన్నోరకాల పండ్లు మావారు తీసుకొని వస్తారు. అవినీకు కూడ ఇస్తాను. నీ మీద ఒట్టు . . . పాలుచల్లగా ఆరిపోయాయి. నాతోమట్లాడవు. ఎందుకు నన్ను బాధపెడుతున్నావు ?" అని ఆ బాలిక చాలాసార్లు ప్రశ్నించింది. మ్రొక్కింది. కోపించింది. అరిచి మెటికలు విరిచింది. కాళ్లు నేలకు తటతటా కొట్టింది. శివుని బుజ్జగించింది. మాయచేసింది. ప్రాణంలేని దానిలాగా పడిపోయింది. మళ్లీలేచి ఎప్పటిలాగే ఎలుగెత్తి ఏడ్చింది. పాత్ర పక్కకు పెట్టింది. మళ్లీ శివుని ముందర పెట్టింది. పలుమార్లు శివుని పాదాలపై వాలింది. ఏ విధంగా చేస్తే పాలుతాగుతావని అడిగింది ? 'నీవు పాలుతాగక పోతే మావారు నన్ను చంపుతారు. సందేహమెందుకు? ఎప్పుడైనా నా చావుతప్పదు కనుక, ఇక్కడనే మరణిస్తే సరిపోతుంది' అని ఆ బాలిక తనతలను శివలింగాలోనికి తాకించి పగులకొట్టుకోబోయింది.

అప్పుడారుద్రుడు ఎంతో దయగలవాడై నవ్వుతూ పాలు స్వీకరించాడు. అప్పుడా బాలిక శివునితో ఇలా అన్నది. "నేను చిన్న దాన్నని కదా ఇంతగా ఏడిపించావు. ఇది ఊరికే పోదు. ఈ సంగతి మా అన్నకు చెపుతానుండు. ఇంక మాటలెందుకు ? ఈశ్వరా ? ఇదంతా మరిచిపోవద్దు' - అని ఆ పాలగిన్నె అడిగి తీసుకొని వేగంగా ఇంటికి వచ్చింది. ఇలా ప్రతిరోజు ఆ బాలిక పాలు తెచ్చియిస్తుంటే శివుడు ఆరగించేవాడు.

ఒకరోజు బాలిక ఖాళీ పాత్రను చేతిలో పట్టుకొని గుడినుండి తిరిగివస్తుండగా, ఊరికి వెళ్లిన తల్లిదండ్రులు ఎదురై 'ఎక్కడి నుంచి వస్తున్నావు ? ఖాళీ పాత్రను తీసుకొని వస్తున్నావేమిట' ని ప్రశ్నించారు. ఆ బాలిక 'మీరు చెప్పినట్లే శివునకు కుంచెడు పాలు ఆరగింపుపెట్టినా, మ్రొక్కి ప్రతిరోజు పాత్ర తీసుకొని వస్తున్నాన' ని చెప్పింది. 'ఏనాడైనా శివుడు పాలు స్వయంగా తాగాడా ? నీవే తాగి ఉంటావు. లేక నీతోపాటు ఆడుకొనే పిల్లలకు పోసివస్తున్నావా ? లేక ఎక్కడైనా పాలను చల్లి (పారబోసి) వస్తున్నావా? నీకు ఒడలు తెలియడం లేదు. ఎంతో గొప్ప భక్తులు సైతం భక్తితో ప్రార్థించి, 'ఆరగింపవే దేవ !' అని వినుతించినప్పటికీ, శివుడు స్వయంగా ఆరగించడం ఈ భువిలో దుర్లభమైన విషయం. ఇక ఇది ఇతరులకు సాధ్యమౌతుందా ? నిన్ను ఎలా నమ్మేది ? ' - అని ఆ బాలికను తండ్రి దూషించాడు. అలాగైతే మరునాడీ సంగతిచూద్దామని తండ్రి, ఆ బాలిక చేతనే పాలు పట్టించుకొని గుడికి బయలుదేరాడు. పాల పాత్ర ముందర పెట్టగా, శివుడారోజు పాలను స్వీకరించలేదు. ఆ బాలిక ముగ్ధత్వాన్ని నిశ్చలమైన, స్వచ్ఛమైన భక్తి భావాన్ని లోకానికి ప్రకటింపదలచాడీశ్వరుడు.

అపుడు శివదేవుడు కోపించి, 'ఓసి ! నేడు శివుడెందుకు పాలు తాగడు ? ఆశ్చర్యం కలిగించేటట్టు పెక్కు అబద్ధాలు చెప్పావు. శివునికి ఉద్దేశించిన పాలు, నిత్యం తాగుతున్న ద్రోహి ! నీ పొట్ట చీలుస్తాను. ఎక్కడికి పోతావ' ని భయంకరంగా దండించడానికి రాగా ఆ బాలిక ఎంతో భయపడింది. శివుని వద్దకు వెళ్లి ' హాలింగ ! హాలింగ! ' అంటూ చేతులు సాచి శివుని దగ్గర ఒదిగి కూర్చుంది. అంతలో పరమదయామతియైన హరుడు, భయపడవద్దని ఆ క్షణంలోనే తన వక్షస్థలాన్ని తెరిచాడు. జగములు పొగడేట్లుగా, ఆ భోగనాథుని దివ్యమైన లింగంలోనికి ఈ బాలిక ప్రవేశించింది. అంతమాత్రంలోనే 'అయ్యో ! పోయింద' ని తండ్రి ఆ బాలిక జుట్టు పట్టుకున్నాడు. ఆమె దేహంమాత్రం ఈశ్వర లింగంలో లీనమైంది. తండ్రి గుప్పిట ఆమె వెంట్రుకలు మాత్రం చిక్కినవి. ఇప్పటికీ, సంవత్సరంలో ఆరునెలలకొకసారి ఆ వెంట్రుకలు కత్తిరిస్తారు. ఆ బాలిక నిశ్చలమైన ముగ్ధభక్తికి ఇది తార్కాణమని ప్రజలు పొగడేట్లుగా ఆమె 'గొడగూచి' అన్న పేరుతో ప్రసిద్ధమైంది.

**డాక్టర్ జి. వైదేహి** ఎం. ఏ., ఎం.ఫిల్., పిహెచ్. డి
రీడర్ & తెలుగుశాఖ,
టి.జె.పి.ఎస్. కళాశాల
గుంటూరు.

మొదటి భాగము - ప్రాచీన పద్యభాగము

పాల్కురికి సోమన

# బెజ్జ మహాదేవి కథ

# గొడ గూచి కథ

## పాఠం - 7

1. 7. 1 సందర్భ సహిత వ్యాఖ్యలు

1. 7. 1. 1 బెజ్జమహాదేవి కథ

1. 7. 1. 2 గొడగూచి కథ

1. 7. 2 పాల్కురికి సోమన కవితారీతులు

1. 7. 3 ప్రశ్నలు - సమాధానాలు

1. 7. 3. 1 బెజ్జ మహాదేవి కథ

1. 7. 3. 2 గొడ గూచి కథ

1. 7. 4 రాదగిన ప్రశ్నలు

1. 7. 5 ఆధార గ్రంథాలు

### 1. 7. 1 సందర్భ సహిత వ్యాఖ్యలు :

### 1. 7. 1. 1 బెజ్జ మహాదేవి కథ :

**1. 'తల్లి లేకుండుట దావిచిత్రంబు' !**

**పరిచయం :** ఈ వాక్యం సుప్రసిద్ధ కవి పాల్కురికి సోమన రచించిన బసవపురాణం, తృతీయాశ్వాసం నుంచి స్వీకరింపబడిన 'బెజ్జమహాదేవి' అనే పాఠ్య భాగంలోనిది.

**సందర్భం :** బెజ్జ మహాదేవి శివభక్తురాలు. ఆమె, శివునకు బంధువులు, సేవకులు, అందరున్నప్పటికీ తల్లిలేదని బాధపడే సందర్భంలోనిదీవాక్యం.

**వివరణ :** బెజ్జమహాదేవి శివభక్తురాలేగానీ, పండితురాలు కాదు. కేవలం ఆమెది ముగ్ధభక్తి. అందుకనే సర్వాంతర్యామియైన ఈశ్వరుని, సాధారణ మానవమాత్రునిగా భావిస్తున్నది. 'లోకంలో అందరికీ తల్లి ఉందికదా ! శివునకు తల్లిలేక పోవడం చాలా విచిత్రంగా ఉంది' ! - అనేది ఆమె ఆలోచన ! అమాయక స్త్రీ ప్రకృతికి గాఢమైన భక్తికీ ఇది నిదర్శనం.

**2. 'ఎల్ల వారికి దుఃఖమిట్టిద కాదె ?' -**

**పరిచయం :** ఈ వాక్యం పాల్కురికి సోమన రచించిన బసవపురాణం, తృతీయా శ్వాసంలోని 'బెజ్జమహాదేవి కథ' - అనే పాఠ్యభాగం నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** అఖిల లోకాధిపతియైన ఈశ్వరునకు తల్లి మరణించి ఉంటుందని అమాయకురాలైన బెజ్జమహాదేవి భావించే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :** 'శివునకు బంధువులందరూ ఉన్నారు. తల్లి మాత్రం లేదు. అయినా తల్లి లేకుండా తానెట్లా ఉద్భవిస్తాడు ? కాబట్టి, శివునకు తల్లి మరణించి ఉంటుంది. తల్లి మరణం తననెంతో క్రుంగదీసింది. మాతృవియోగ దుఃఖం అందరికీ ఒక్కటే గదా !' అని ఆమె భావిస్తున్నది. తనలాగే అందరూ అని భావించే మనస్తత్వం ఆమెది !

### 3. 'తల్లి పుచ్చునె సుతు వల్ల కాటికిని' ?

**పరిచయం :** ఈ వాక్యం పాల్కురికి సోమన రచించిన బసవపురాణం, తృతీయాశ్వాసంలోని 'బెజ్జ మహాదేవి కథ' నుంచి స్వీకరింపబడింది.

**సందర్భం :** 'లోకంలో ఏ తల్లి అయినా కుమారుణ్ణి వల్ల కాటికి పంపిస్తుందా' ? - అని బెజ్జమహాదేవి ఆలోచించే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :** శివునకు తల్లిలేదని అమాయకురాలైన బెజ్జమహాదేవి భావించింది. తానుకూడా తల్లి మరణించినప్పటి దుఃఖాన్ని అనుభవించింది. అందరికీ అంతేగద ! శివునకు తల్లి ఉన్నట్లైతే తల జడలు గట్టనిస్తుందా ? విషం తాగడానికి ఒప్పుకుంటుందా ? తోలు చీరలు కట్టుకోవడానికి ఒప్పుకునేదా ? పాములు ధరించడానికి, బూది పూసుకోవడానికి, తిరిపెమెత్తడానికి తల్లి అనుమతిస్తుందా ? ఏ తల్లైనా, తన కుమారుణ్ణి శ్మశానంలో నివాసముండడానికి అంగీకరిస్తుందా ? - అని ఎన్నో ప్రశ్నలు ఆమె మనసులో ఉదయించాయి ! ఇక్కడ ఆమె మాతృ హృదయం చక్కగా ఆవిష్కరింపబడింది. ఇది ఆమె గాఢమైన ముగ్ధభక్తికి ఉదాహరణ.

### 4. 'తానెంత పెరుగునో తల్లి గల్గినను ?' -

**పరిచయం :** ఈ వాక్యం పాల్కురికి సోమన రచించిన బసవపురాణం, తృతీయా శ్వాసంలోని 'బెజ్జమహాదేవి కథ' అనే పాఠ్యభాగం లోనిది.

**సందర్భం :** బెజ్జ మహాదేవి ఈశ్వరునకు తల్లి లేదని భావిస్తున్నది. తల్లి గనకఉంటే ఇంకెంతగా శివుడు పెరిగి వృద్ధిలోకి వచ్చేవాడో గదా ! అని భావించే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :** తల్లిలేకుండా శివుడు అనేక కష్టాలు పడుతున్నాడు. తల్లి ఉన్నట్లయితే తనస్తన్యాన్నిచ్చి, వెన్నపెట్టి, ఆకలైతే పాలుపట్టి చక్కగా పెంచి ఉండేది. తల్లి లేకుండానే, ఇంతవాడయ్యాడు. తల్లి ఉంటే ఇంకెంతగా పెరిగేవాడో కదా ! అని ఆమె భావన. ఇది ఆమె మాతృహృదయాన్ని అద్దం పట్టి చూపిస్తుంది.

### 5. 'పగవారే మఱి యెట్టి మగ బిడ్డలైన ?' -

**పరిచయం :** ఈ వాక్యం పాల్కురికి సోమన రచించిన బసవపురాణంలోని తృతీయాశ్వాసం నుంచి గ్రహింపబడిన 'బెజ్జ మహాదేవి కథ' - అనే పాఠ్యభాగం లోనిది.

**సందర్భం :** 'తల్లి లేని మగపిల్లలు కూడా ఏ అచ్చటా ముచ్చటా నోచుకోరు. ఎంత మగపిల్లలైనా బాధపడతారు గదా !' - అని బెజ్జమహాదేవి భావించే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** వివాహం మొదలైన వేడుకల్లోను, పేరంటాలలోను, పండుగదినాల్లోనూ, జాతరలప్పుడు గూడ, ముద్దుమురిపాలు తీర్చి సంతోషించే తల్లి లేకపోతే ఎంత మగబిడ్డలైనా దుఃఖ పడతారు. ఇక్కడ శివునికి తల్లిలేదు. ఈ బాధే అతని మనస్సులో కూడా ఉంటుంది - అని, తన మనస్సులోని తపనే, శివుని తపనగా భావించింది బెజ్జమహాదేవి.

### 6. 'కాటుక యిడు మూడుఁగన్నుల గలయ' -

**పరిచయం :** పాల్కురికి సోమన రచించిన బసవపురాణం తృతీయాశ్వాసంలోని 'బెజ్జమహాదేవి కథ' - నుంచి ఈ వాక్యం స్వీకరింపబడింది.

**సందర్భం :** తల్లిలేని ఈశ్వరునకు, తననే తల్లిగా భావించుకుంది బెజ్జమహాదేవి. శివునకు బాల్యోపచారాలన్నీ చేస్తుంది. ఆ సందర్భంలో కవి పల్కిన సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :** బెజ్జమహాదేవి శివునికి స్నానం చేయించి, విభూతి పెట్టి కాటుక పెడుతుంది. కాటుక పెడితే పిల్లల కళ్లు విశాలంగా ఉంటాయని తల్లి భావన. శివుని మూడునేత్రాలకు ఆమె కాటుక పెట్టింది. ఇక్కడ సోమన, తెలుగు తల్లుల పసిపిల్లలను పెంచే పద్ధతులు, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, నమ్మకాలు అన్నింటినీ సహజసుందరంగా వర్ణించాడు.

**7. 'భక్తుడె బ్భంగిగా భావించు శివుడు**

**వ్యక్తిగాఁ దద్రూపుడై యుండటరుదె' !**

**పరిచయం :** ఈ వాక్యం పాల్కురికి సోమన రచించిన బసవపురాణం, తృతీయా శ్వాసంలోని 'బెజ్జ మహాదేవి కథ' - అనే పాఠ్యభాగం నుంచి స్వీకరింపబడింది.

**సందర్భం :** బెజ్జమహాదేవి శివునికి బాల్యోపచారాలన్నీ చేస్తూ ఉంటుంది. ఆమె నిశ్చల ముగ్ధభావాన్ని మెచ్చుకొని ఈశ్వరుడు వాటినన్నింటినీ అంగీకరిస్తాడు. సోమన, ఈ సందర్భంలో శ్రుతి, స్మృతి వాక్యాలను ఉదాహరిస్తాడు. 'ఏక ఏవహి రూపేణ' - 'సాధక స్సంస్మరేత్ సదా' -, 'తస్య తన్మయతాంయాతి' - అన్న భగవద్వాక్యాలను ఒక్కచోట చేర్చి, 'భక్తుల భావన ననుసరించే, భగవంతుడు ఆ రూపాన్ని ధరించి ఉంటాడ' ని భక్తబృందం నుతిస్తున్నట్టుగా కవిచెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :** భక్తులు భావన ననుసరించే, భగవంతుని రూపం సాక్షాత్కరిస్తుంది. సోమన ఈ సందర్భంలో శ్రుతి, స్మృతుల వాక్యాలను ఉదాహరించాడు. దేశీయమైన ద్విపదచ్ఛందస్సులో సోమన రచించినా, వివిధ సందర్భాలలో ఆయనకు గల పాండిత్య ప్రకర్ష దర్శనమిస్తుంటుంది. సోమన పండిత కవి. ప్రజలకు తన భావన అర్థం కావాలనే భావంతో దేశయమైన రీతిలో ఈ బసవపురాణం రచించాడు.

**8. 'నీ చెమూటయుఁజూచి నెత్తురునవుదు' !**

**పరిచయం :** ఈ వాక్యం పాల్కురికి సోమన రచించిన బసవపురాణం, తృతీయాశ్వాసంలోని బెజ్జమహాదేవి కథలోనిది.

**సందర్భం:** ఈశ్వరుడు బెజ్జమహాదేవి చేసే శైశవోపచారాలను అంగీకరించి స్వీకరిస్తాడు. కొన్నాళ్లకు ఆమె ముగ్ధభక్తిని పరీక్షింపదలచాడు. ఆ బాలునికి వింత వ్యాధి వచ్చి, పాలుత్రాగక నోరు కూడా తెరవడం మానేశాడు. అప్పుడు ఆమె బాధపడే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :** 'నీ బాధ చూచి నేను నెత్తురు ముద్దనౌతాను.' - అని ఆమె పలకరిస్తుంది. సాధారణంగా లోకంలో తల్లులు, తమ బిడ్డలకు ఏ వ్యాధి సోకినా ఎంతో తల్లడిల్లి పోతారు. ఇక్కడ ఈమె సాక్షాత్తూ పరమేశ్వరుణ్ణి తన బిడ్డగా భావించిన గొప్పతల్లి. ఆమె మాతృప్రేమకు సాటి మరేదీలేదు. ఎంతో గాఢమైన మమకారంతో ఆమె పైవిధంగా భావించింది. ఆమె తల్లి మనస్సును ఆవిష్కరించడానికి సమతూకంగా, వాడిన సోమన ప్రయోగం యిది. ఇది సోమన రచనా విధానానికి, శైలీ వైశిష్ట్యానికి మచ్చుతునక.

**9. 'చేయి దిగండిట్టి సితగుండు గలఁడె' ?**

**పరిచయం :** ఈ వాక్యం పాల్కురికి సోమన రచించిన బసవపురాణం, తృతీయాశ్వాసంలోని 'బెజ్జమహాదేవి కథ' - అనే పాఠ్యభాగం నుంచి స్వీకరింపబడింది.

**సందర్భం :** శివుడు బెజ్జమహాదేవిని కరుణింపదలచి, చిన్న పరీక్ష పెట్టాడు. తన కుమారునిగా భావిస్తున్న ఆ ప్రతిరూపంగల బాలునికి ముల్లు వ్యాధి వచ్చింది. ఆమె తల్లడిల్లింది. అందరి యిళ్లకూ వెళ్లి అన్ని తింటున్నావని మందలిస్తుంది. నిష్ఠూరాలు పలికింది. ఇంతకుముందు ఇలా లేడని, రేయి పగలూ కూడా దిగకుండా ఉండేవాడని పలికే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :** మంకుపట్టు పట్టే పిల్లలతో సాధారణంగా తల్లులు మాట్లాడేమాటలివి. రాత్రిపగలు చంక దిగని మంకు పిల్లాడు వీడని బెజ్జమహాదేవి కూడా భావిస్తుంది. 'సితగుండు' అంటే మంకు బిడ్డడని అర్థం. వైరిసమాసాలు చెయ్యడం శివకవుల రచనలోని ప్రత్యేకత. 'సిత' - అంటే 'తెల్లని' అని 'గుండు' అంటే వర్తులాకారంలో ఉండే శివస్వరూపమని చెప్పవచ్చు. ఈశ్వరుడు తెల్లనివాడు. 'కర్పూర కాంతి ధవళం'తో శోభించేవాడు. స్థాణు స్వరూపుడు ఆదిమధ్యాంతాలు లేనివాడు. వీటినన్నింటినీ స్ఫురింప చేస్తూ సోమన 'సితగుండు' - అని ప్రయోగం చేశాడు.

**10. 'నిప్పునఁ జెదలంటునే' ?**

**పరిచయం :** ఈ వాక్యం పాల్కురికి సోమన రచించిన బసవపురాణం, తృతీయాశ్వాసంలోని బెజ్జ మహాదేవి కథలోనిది.

**సందర్భం :** అంగిట ముల్లు వ్యాధితో బాధపడుతున్న శివుని తన కుమారునిగా భావించి, బెజ్జమహాదేవి మాట్లాడే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :** 'నిప్పుకు చెదలంటునే' అనీ ప్రజల వ్యవహారంలో ఉన్న నానుడి. తాను నిప్పులాగా పవిత్రంగా ఉంటే ఎటువంటి చీడపీడలు, ఆధివ్యాధులు రావని దీని భావం. ఇక్కడ శివుడు అంగిటముల్లు వ్యాధి తనకుతానుగా తెచ్చుకున్నాడనీ, తాను పెట్టినంత తిని యింటిపట్టున ఉంటే, ఇటువంటి జబ్బు వచ్చేదికాదనీ, ఆమె బాధపడుతుంది. ఇక్కడ కవి చక్కని పోలిక చెప్పాడు.

**1. 7. 1. 2 గొడగూచి కథ !**

**1. 'నీకొక మంచి బొమ్మయు నిన్ని**
**బొమ్మ పొత్తికలును౯ బోయి తెచ్చెదము' -**

**పరిచయం :** ఈవాక్యం పాల్కురికి సోమన రచించిన బసవపురాణం, తృతీయాశ్వాసంలోని 'గొడగూచి కథ' అనే పాఠ్యభాగం నుంచి స్వీకరింపబడింది.

**సందర్భం :** శివదేవుడనే శివభక్తుడు తన కుమార్తె గొడగూచితో శివునికి పాలు ఆరగింపు పెట్టమనే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :** గొడగూచి అనే బాలిక తండ్రి శివదేవుడు. అతడు శివభక్తుడు. అతడు ప్రతిరోజు తమ ఊరిలో గల శివాలయంలోని శివునకు కుంచెడు పాలు నైవేద్యం పెట్టేవాడు. ఒకసారి ఊరికి వెళ్లవలసి వచ్చింది. అందుకని తమ ఇంట్లోని చిన్న పిల్ల గొడగూచిని బుజ్జగిస్తూ, మంచి బుద్దులు చెపుతూ, తాము తిరిగి వచ్చేదాకా శివునికి పాలు ఆరగింపు మరచిపోవద్దని, వచ్చేటప్పుడు బొమ్మలు, బొమ్మపొత్తికలు తెచ్చియిస్తామని చెబుతాడు.

**2. 'కడువేడియో నీరు గలసినవనియొ ?' -**

**పరిచయం :** ఈవాక్యం పాల్కురికి సోమన రచించిన బసవపురాణం, తృతీయా శ్వాసంలోని 'గొడగూచికథ' - అను పాఠ్యభాగం నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** తండ్రి చెప్పినట్లుగానే గొడగూచి, కుంచెడు పాలను శివునకు నివేదన చేసింది. కాని శివుడు పాలు త్రాగలేదు. పాలెందుకు తాగలేదని గొడగూచి ప్రశ్నించే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :** గొడగూచి పాలపాత్రను శివుని ముందర పెట్టి పాలు తాగమని ప్రార్థించింది. శివుడారగించలేదు. దానికి గొడగూచి, ఎంతో భయపడింది. అనేక కారణాలు ఊహించింది. ప్రశ్నించింది. పాలు చాలా వేడిగా ఉన్నాయా ? లేక నీరు కలిసిందా ? అని అడిగింది. ఇది ఆ బాలిక ముగ్ధభక్తికి నిదర్శనం.

**3. 'నీకు నిచ్చెద గాని నీ యాన' !**

**పరిచయం :** ఈ వాక్యం పాల్కురికి సోమన రచించిన బసవపురాణం, తృతీయాశ్వాసంలోని 'గొడగూచి కథ' - అనే పాఠ్యభాగంలోనిది.

**సందర్భం :** గొడగూచి ఆరగింపు పెట్టిన పాలను శివుడు స్వీకరించలేదు. దానికా బాలిక భయపడి, ఎన్నో కారణాలు ఊహించిన సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :** శివుడు పాలు తాగలేదని బాధపడింది గొడగూచి. చాలా ప్రశ్నలు వేసింది. ఏవేవో తెచ్చియిస్తానని ఆశపెట్టింది. తన తల్లిదండ్రులు ఊరినుంచి తిరిగి వచ్చేటప్పుడు ఆటలాడుకోవడానికి తెచ్చిన బొమ్మలు, అటుకులు, పండ్లు మొదలైనవన్నీ తెచ్చియిస్తారనీ, వాటినన్నింటినీ, శివునకు తెచ్చియిస్తానని ఆశపెట్టింది. 'నీ మీద ఒట్టు !' - అని ఆన పెట్టింది. అయినా ఈశ్వరుడు పాలు తాగలేదు. ఈ సన్నివేశంలో చిన్న పిల్లల మనస్తత్త్వానికి అద్దం పడుతుంది. ముగ్ధభక్తికి చక్కటి నిదర్శనం.

**4. 'క్షితి దుర్లభంబన్న నితరుల తరమె ?' -**

**పరిచయం :** పాల్కురికి సోమన రచించిన బసవపురాణం, తృతీయాశ్వాసంలోని 'గొడగూచి కథ' నుంచి స్వీకరింపబడింది.

**సందర్భం :** తండ్రి చెప్పిన ప్రకారం గొడగూచి, కుంచెడు పాలను ప్రతిరోజు ఈశ్వరునికి నివేదించింది. మొదట శివుడు పాలు తాగలేదు. ఆ బాలిక భయపడి ప్రాణత్యాగానికి సిద్ధపడుతుంది. ఆ బాలిక ముగ్ధభక్తికి మెచ్చుకుని శివుడు ప్రత్యక్షమై పాలు రోజు తాగేవాడు. ఒకరోజు ఖాళీ పాత్రతో తిరిగేవచ్చే గొడగూచికి తల్లిదండ్రులెదురుపడ్డారు. గొడగూచి తండ్రితో యథార్థం చెప్పింది. అతను నమ్మలేదు. ఆ సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :** తండ్రి గొడగూచిని దండిస్తూ 'ఏనాడు ఈశ్వరుడు పాలు ప్రత్యక్షంగా తాగలేదు. నీవు తాగావా? లేక, నీతోపాటు ఆడుకునే పిల్లలకు పోశావా ? ఎంతో మంది భక్తులు, భక్తితో ఆరగింపుమని ప్రార్థించినా, శివుడు స్వయంగా ఆరగించడు. ఇది దుర్లభమైన విషయం. ఇక ఇతరులకు సాధ్యమౌతుందా? ఈవిషయం ఎలా నమ్మగలను ?' - అని కోపిస్తాడు. ఇక్కడ ఒకప్రక్క గొడగూచి అమాయకపు భక్తి, తండ్రి యొక్క సామాన్య మానవ నైజం గోచరిస్తున్నాయి. రాగద్వేషాలతో నిండిన మనస్సు శివదేవుడిది. నిష్కల్మమైన అద్దంలాంటి మనస్సు గొడగూచిది. శివుడు అటువంటి నిర్మలమైన భక్తిని మెచ్చుకొంటాడు గానీ, పటాటోపంతో, ఇష్టసిద్ధి కోసం చేసే పూజలను అంగీకరించడు.

### 1.7. 2 పాల్కురికి సోమన కవితారీతులు :

" ఉరుతర గద్యపద్యోక్తుల కంటె
సరసమై పరగిన జానుతెనుంగు
చర్చింపగా సర్వసామాన్యమగుట
కూర్చెద ద్విపదలు కోర్కిదైవార'' - (బసవపురాణం)

"ఆరూఢ గద్యపద్యాది ప్రబంధ
పూరిత సంస్కృత భూయిష్ఠ రచన
మానుగ సర్వ సామాన్యంబుగామి
జాను తెనుగు విశేషము ప్రసన్నతకు' - (పండితారాధ్యచరిత్ర) -

అని సోమన కవితా హృదయాన్ని, దృక్పథాన్ని విప్పిచెప్పాడు. సోమన కేవలం కవి మాత్రమే కాడు. వీరశైవ మతవ్యాప్తికి తన కవిత్వాన్ని సాధనంగా చేసుకొన్న మహామేధావి. ఆనాడు సమాజంలో వ్యాపించి ఉన్న బౌద్ధ, జైన వైష్ణవాది మతాలనన్నింటినీ ప్రతిఘటించి, తన అసమాన పాండిత్యంతో వీరశైవమత వ్యాప్తికి కారకుడైనాడు. సంస్కృతంలో చతుర్వేదసారం, సోమనాథ భాష్యం మొదలైన గ్రంథాలలో తన పాండిత్యాన్ని నిరూపించుకున్నాడు. కాని, అది శైవమతవ్యాప్తికి దోహదపడదు. జనసామాన్యంలో తన సిద్ధాంతాలు వ్యాపితం కావాలంటే దేశభాషలో, దేశీయ ఛందస్సులో, దేశీయరీతిలో కవిత్వం చెప్పాలి. అప్పుడది ప్రజలమధ్యకు వెళ్లగలుగుతుంది. తన అభీప్సితం నెరవేరుతుంది. ఈ రహస్యం బాగా తెలిసినవాడు పాల్కురికి సోమన. అందుకనే దేశీయమైన ఛందస్సు ద్విపదను స్వీకరించాడు. జాను తెనుగును ప్రతిపాదించాడు.

**జాను తెనుఁగు :** సోమనాథునికి పూర్వమందు 'ఆరూఢ గద్యపద్య ప్రబంధపూరిత సంస్కృత భూయిష్ఠ రచన'. అది 'సర్వ సామాన్యము' కాదు. అది కొద్దిమంది విద్వత్కవులకు, పండితులకు మాత్రమే పనికి వచ్చేది. కాని కవిత్వ లక్షణమది కాదు. దీనికి 'జాను తెనుఁగు'ను స్వీకరించాడు. ఇది సర్వజనసుబోధకమైన తెనుగు. 'చదునైన తెలుగు', 'జాను' అంటే 'చదును' శబ్దానికి రూపాంతరమని, ఇది 'చతుర' శబ్దభవమని డా॥ చిలుకూరి నారాయణరావు గారి అభిప్రాయం. దీనికే 'తేటతెనుఁగు', 'తిన్ననిసూక్తి' అని కూడా

సోమనాథుడు పేర్కొన్నాడు. దీనికే కర్ణాటలాక్షణికులు' సమసంస్కృతోక్తి' - అని అన్నారు. అది నిఘంటు, వ్యాకరణాల ద్వారా బోధపడేదికాకుండా, మరీ అచ్చతెనుగు పదాలు కాకుండా, లోక వ్యవహారసిద్ధమైన సంస్కృత ఆంధ్రపదాలతో కూడింది. వీటిని కేవలం తెలుగు పదాలని నాటి పండితలోకం నిరసిస్తుందేమోనని, 'వేదముల కొలదియ కాఁజూడుడ'ని చెప్పాడు. స్థూలంగా సర్వజనామోద యోగ్యమైందే జానుతెనుగు.

**ద్విపద ఛ్ఛందస్సు ప్రాధాన్యం :** సంస్కృతంలో 'అనుష్టుప్' ఎలాగో, కన్నడిగులకు త్రిపద ఎట్లో, తెలుగువారికి ద్విపద అటువంటిది. ఇది వీరి జీవితాలతో అల్లుకునిపోయింది. నాటి నుంచి నేటివరకు పల్లెపాటల్లో, పడవపాటల్లో, దంపుడు పాటల్లో, జోలపాటల్లో, పెండ్లిపాటల్లో, ఒకటేమిటి ? అన్ని విషయాలతో పెనవేసుకుపోయింది. నవ్వు, కోపం, దుఃఖం, ఉత్సాహం మొదలైన భావోద్వేగాలు కనబడిన చోటల్లా ద్విపద సాగుతూనే ఉంది. ఇటువంటి ఛందస్సును గ్రంథస్థం చేసి, వ్యాప్తిలోకి తెచ్చిన వాడు మొదటగా పాల్కురికి సోమనాథుడు మాత్రమే. మూడింద్ర గణాల మీద ఒక సూర్యగణం చేరిస్తే ఒక పాదమౌతుంది. పాదంలో మూడవ గణాద్యక్షరం యతి. రెండుపాదాలను ప్రాసాక్షరం కలుపుతుంది. సోమనాథుని తర్వాత ద్విపద వాఙ్మయమమితంగా వెలిసింది.

**సోమన కవితా లక్షణాలు :** కథావస్తువులో కొత్తదనాన్ని తీసుకొని వచ్చాడు. వీరశైవ సిద్ధాంతాన్ని ప్రత్యేకంగా చెప్పకుండా, కథలో మేళవించి చెప్పడం సోమన ప్రత్యేకత. బసవపురాణంలో బసవేశ్వరుని చరిత్రతో పాటుగా, ఎంతోమంది శివభక్తుల గాథలను కలిపి, నాటి సాంఘిక జీవన చిత్రంగా కావ్యాన్ని మలిచాడు.

వేద వేదాంగాలు శ్రుతి, స్మృతులనుంచి వాక్యాలను ఉదాహరించినా, వాటిని తన కవితాధారలో సందర్భ శుద్ధితో లయం చెయ్యడం సోమనకు చెల్లింది. బెజ్జమహాదేవి కథలో 'ఏక ఏవహిరూపేణ' - 'సాధక స్సంస్మరేత్సదా' - 'తస్య తన్మయతాంయాతి' - అనే వాక్యాలిందుకు ఉదాహరణలు. భగవంతుని స్వరూపాన్ని, తత్వాన్ని చక్కగా వివరించే వాక్యాలివి. సాధకుణ్ణి అనుసరించే భగవంతుడుంటాడు. 'యద్భావం తద్భవతి' - అని ఆర్యులన్నట్టుగా, భక్తుడే విధంగా భావిస్తే భగవంతుడా విధంగా అనుగ్రహిస్తాడు. 'యే యథామా ప్రపద్యంతే తాంస్త థైవ భజామ్యహమ్' - అన్న గీతా వాక్యానికి కూడా అర్థమిదే.

అపరిమితమైన వైదుష్యం, వ్యవహార జ్ఞానం గలవాడు సోమన. బసవపురాణం, పండితారధ్య చరిత్రల్లో ఇవి ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. హఠయోగం, రసయోగం, ద్యూత విద్య, పిల్లలను పెంచే విధం, పిల్లలను తల్లులు లాలించేవిధం, పసిపిల్లల మనస్తత్వం, స్త్రీల హృదయావిష్కరణ మొదలైన వెన్నంటినో తన సునిశిత దృష్టితో పరిశీలించి రచించాడు. బెజ్జమహాదేవి ఈశ్వరుణ్ణి తనపిల్ల వానిగా భావించి లాలించడం, పిల్లవాడు అంగిటముల్లుతో బాధపడుతుంటే తల్లడిల్లడం మొదలైన విషయాలు స్త్రీ సహజ లక్షణాలను, పిల్లలపట్ల ఉండే అవ్యాజమైన మమకారాన్ని సూచిస్తాయి. అలాగే గొడగూచి కథలో గూడ శివుడు పాలుతాగకపోతే గొడగూచి అనేక ప్రశ్నలు వెయ్యడం చివరకు, శివుడు తననింతగా ఏడిపించాడని - ఆ విషయం తన అన్నకు చెప్పివస్తాననడం, మొదలైన సన్నివేశాల్లో పసిపిల్లల మనస్తత్వాన్ని చక్కగా చిత్రీకరించాడు. దీనికి ఎంతో నిశితపరిశీలన, అనుభవ పూర్వకంగా ఉంటేగానీ, ఇది సాధ్యం కాదు.

ఆమ్రేడితాలు, పునరుక్తులతో సన్నివేశానికి అందం తేవడం ఒక ప్రత్యేకత. బెజ్జమహాదేవి కథలో 'తల్లి గల్గిన నేల తపసిగానిచ్చు? -- తల్లి పుచ్చునె సుతువల్ల కాటికి' -- అన్నపుడు తల్లి వాత్సల్యాన్ని, శివతత్వాన్ని చక్కగా వర్ణించాడు. 'తల్లి' - అన్న పదం పలుమార్లు ఉపయోగించినప్పటికీ, అది పునరుక్తిగా పాఠకులకు తోచదు.

సోమనశైలి సమాసాలు కూడా ప్రయోగించాడు. 'సితగుండు', 'జగదభినుత కరడిగ' - ఇత్యాదులుదాహనరణాలు. ప్రజలమధ్య ఉండే పలుకుబళ్లు, సామెతలు, 'నేలపై నా కాళ్లు నిలువవురన్న, నిప్పున చెదలంటునే', 'కన్నమోహంబున కంటె నగ్గముల ఎన్న పెంచిన మోహమెందు' - మొదలైనవి నేటికి తెలుగువారికి అలవాటే. అచ్చతెలుగు మాటల్లో సోమనాథుడుపయోగించినన్ని పదాలు మరే ఇతర కవి ఉపయోగించలేదు.

ఈవిధంగా దేశీయకవితా ప్రవర్తకుడుగా, వస్తువు, ఛందస్సు, భాష అనే మూడింటి ద్వారా అనన్య సామాన్యమైన ప్రతిభా పాండిత్యాలతో వీరశైవ మతవ్యాప్తికి తన రచనల ద్వారా దోహదం చేసి, ప్రజల వద్దకు కవిత్వాన్ని తీసుకువెళ్లిన కవి పాల్కురికి సోమన అనడంలో అతిశయోక్తిలేదు.

### 1.7.3 ప్రశ్నలు - సమాధానాలు :

1. బెజ్జ మహాదేవి మాతృ వాత్సల్యాన్ని వివరించండి :
   లేదా
   బెజ్జ మహాదేవి తల్లిగా ఈశ్వరునికి చేసిన బాల్యోపచారాలు వివరించండి :

సమాధానం : పాల్కురికి సోమన బసవపురాణంలో బెజ్జమహాదేవి కథ ఎంతో మనోజ్ఞంగా రచించబడింది. ప్రజల్లో ప్రచారంలో ఉన్న కథలనే స్వీకరించానని సోమనాథుడు వివరించాడు. ఈ కథలు భక్తి ప్రధానం కానీ, లింగం, కులం, వర్ణం, జాతి ప్రధానంకావని ప్రబోధిస్తాయి. మార్గ సాహిత్యానికి విరుద్ధంగా, పురుషులతో సమానంగా స్త్రీలు కూడా మోక్షార్హులేనని, స్త్రీలు పతిభక్తితో కాకుండా, పరమేశ్వర భక్తితో మోక్షం పొందవచ్చుననీ ఈ కథలు స్పష్టం చేస్తాయి. అది మూఢ భక్తి కావచ్చు. ముగ్ధ భక్తి కావచ్చు. వాత్సల్యభక్తి కావచ్చు. దేన్ని అనుసరించినా వారికి కైవల్యం సిద్ధిస్తుంది. దీనికి సంప్రదాయాలు, నియమాలు ఏమీలేవు.

సహజంగా స్త్రీ ప్రేమమూర్తి. జాలి, కరుణ ఆమె స్వభావాలు. స్త్రీ సహజమైన ఈ లక్షణాలతోనే బెజ్జమహాదేవి శివుని పుత్రవాత్సల్యంతో పెంచుతుంది. మమకారం పంచుతుంది. తల్లిలేని బిడ్డడని జాలి పడుతోంది. అందరిళ్లకూ వెళ్లి అతిగా తిన్నావని కోప్పడుతుంది. బిడ్డడికి వచ్చిన రోగాన్ని నయం చేయలేక, చివరకు ఆత్మార్పణకు సిద్ధమౌతుంది. ఇలా ఈ కథలో బెజ్జమహాదేవి తన శక్తియుక్తులన్నింటినీ, త్రికరణ శుద్ధిగా శివుని మీదే కేంద్రీకరిస్తుంది. ఈ విషయాలలో ఆమె మాతృహృదయం ఎలా ఆవిష్కృతమైందో పరిశీలిద్దాము.

బెజ్జమహాదేవి గొప్ప శివభక్తురాలు. ఆమె మనస్సుకు ఒకనాడొక ఆలోచన వచ్చింది. 'శివునకు బంధువులందరూ ఉన్నారు కానీ, తల్లిమాత్రం లేదు. తల్లి లేకుండా బిడ్డడుదయించడు కాబట్టి, శివుని తల్లి మరణించి ఉంటుంది. లేకపోతే శివుని తపస్సుచేయడానికి అంగీకరించేదా? సంస్కారం లేకుండా జుట్టును జడలు గట్టనిచ్చేదా ? విషాన్ని తిననిచ్చేదా ? తోలు వస్త్రాలను, పాములను ధరింపనిచ్చేదా ? వల్లకాటిలో ఉండనిచ్చేదా ? మాతృవియోగ దుఃఖం తనకు తెలుసు . అందుకనే శివుడు ఇన్ని కష్టాలుపడుతున్నాడు. ఎంతటి మగబిడ్డలైనప్పటికీ తల్లి లేని దుఃఖం వారనుభవించరా?' - అని భావించింది. ఆమె అమాయకురాలు. కల్మషంలేని హృదయం ఆమెది. అఖిల లోకాధీశుడు, సర్వాంతర్యామి, అభవుడైన ఈశ్వరునికి తల్లిలేదని భావించడం ఆమె ముగ్ధత్వానికి నిదర్శనం. సర్వజ్ఞుడైన శివుని సామాన్య బాలకునిగా భావించింది. సమస్త వ్యాపకునికి తానే తల్లిగా ఉందామనుకోవడం ఆమె జాలిగుండెను ప్రతిఫలిస్తుంది.

సమస్త భువనాధీశుణ్ణి తన బిడ్డగా భావించడం, బాల్యోపచారాలన్నీ చెయ్యడం ఆమెకే చెల్లింది. స్నానం చేయించి, వెన్నపెట్టి, పాలుత్రాగించి, కాటుకపెట్టి, దిష్టితీసేది. ఉగ్గుపెట్టి బుజ్జగించేది. లాలించేది. ఆమె నిర్మలభక్తిని ఈశ్వరుడంగీకరించాడు. పరమేశ్వరుడు భక్తసులభుడు. అందునా కలియుగంలో భక్తినిమించిన పరమార్థం లేదు. అందుకని భక్తుడే విధంగా భావిస్తే భగవంతుడా విధంగా దర్శనమిస్తాడని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. సమస్త భువనాధీశుణ్ణి బిడ్డగా భావించింది కాబట్టి, ఆమెను బిడ్డగానే పరమాత్మ కరుణించాడు. ఆమె చేసే శైశవోపచారాలన్నింటినీ స్వీకరించాడు.

అయితే ఈమె మాతృహృదయాన్ని పరీక్షించి, ప్రసన్నుడు కాదలిచాడు పరమేశ్వరుడు. అందుకే చిన్న పరీక్ష పెట్టాడు. తాను బిడ్డడుగా భావించే శివునికి గొంతునొప్పి వచ్చింది. అంగిటి ముల్లు వ్యాధి సోకింది. పాలుత్రాగడానికి నోరు తెరవలేదు. ఇక ఆ తల్లి ఎంతో బాధపడింది. ఆమెకు మందులు మాకులు తెలియవు. దుఃఖించింది. నేలమీదబడి పొరలింది. సన్నటి వస్త్రాన్ని తెచ్చి మాటిమాటికీ కప్పింది. శోకజలధిలో మునిగిపోయింది. మానసికంగా, భౌతికంగా ఆమెపడే బాధను, వేదనను ఎంతో చక్కగా చూపించాడు సోమనాథుడు. అమాయకురాలైన ఒక జానపదాంగన ఎటువంటి భావాలు వ్యక్తం చేస్తుందో, ఇక్కడ బెజ్జమహాదేవి కూడా అలాగే ప్రవర్తించింది. ఆమె పుత్ర వాత్సల్యం ఎల్లలు దాటింది. తల్లి మనస్సు చక్కగా ఆవిష్కృతమైంది.

ఇరుగుపొరుగులతో సంభాషించింది. విషయ సేకరణ చేసింది. తనయింట్లో, తన చంకదిగని బిడ్డడు తనకు తెలియకుండా ఎన్నో పైతిండ్లు తిన్నాడు. పిట్టవ్వ దగ్గర, సామవేదుల వారింట్లోను, కరికాళవ్వ యింట్లోను, చిఱుతొండనంబి వద్ద -- ఇలా ఎందరి దగ్గరికో వెళ్లి తన బిడ్డ తినగూడని తిండి తిన్నాడని బాధపడింది. పరాయి ఇళ్లకు ఎందుకువెళ్లావని ప్రశ్నించింది. నాలాగా ప్రేమతో

పెంచే తల్లులు ఈముల్లోకాలలో ఉంటారా ? అని అడిగింది. పెట్టినంత తిని, ఇంటి పట్టున ఉంటే ఈరోగమెందుకు వచ్చేదని నిష్ఠూరాలాడింది. ఇంక బిడ్డ బాధచూడలేక ప్రాణాలు విడుస్తానన్నది.

ఇలా మాటల కందని ఆర్ద్రతను, ప్రేమను చూపించింది ఆమె. ఆ ప్రేమ మూలంగా, తుదకు ప్రాణత్యాగానికైనా సిద్ధపడింది. ఇంతకంటె ఆమె నిశ్చలమైన వాత్సల్య భక్తికి తార్కాణం ఇంకేముంటుంది ? అందుకే శివుడామెకు ప్రసన్నుడై వరం కోరుకోమంటే కైవల్యాన్ని, మోక్షాన్ని కోరకుండా "నీవు ఏరోగం లేకుండా, శాశ్వతంగా సుఖంగా ఉంటే చాలు. నిన్ను కన్నులారా చూడడమే నాకోరిక' - అని పల్కింది.

లోకంలో ఏ తల్లైనా బిడ్డను సుఖం కంటే మరేదీ కోరుకోదు. ఇక్కడ ఈమె అవ్యాజమైన ప్రేమ, మమకారం, వాత్సల్యం, ఇవన్నీ మనకు గోచరిస్తున్నాయి. 'తస్యతన్మయతాం యాతి' - అన్నట్లుగానే, అలౌకికమైన మాతృహృదయంతో 'అమ్మవ్వ'గా నిలిచి, పరమేశ్వరునికే తల్లి స్థానాన్ని పొందగలిగింది బెజ్జమహాదేవి. ఈ విధంగా, చిత్తశుద్ధిలేని అర్చనలు, పూజలకన్నా మూఢభక్తి ముగ్ధభక్తికే ప్రాధాన్యం ఇచ్చాడు సోమన.

2. గొడగూచి ముగ్ధభక్తిని వివరించండి.

పాల్కురికి సోమన బసవపురాణంలోని మరొక రమణీయమైన కథ 'గొడ గూచి కత' - వీర శైవమతంలో మోక్షార్హత అందరికీ ఉంటుంది. దానికి స్త్రీ పురుష భేదం లేదు. బాలురు, వృద్ధులనే తారతమ్యం లేదు. కులం, వర్ణం, జాతి అనే వివక్ష లేదు. పూజాది కార్యక్రమాలు, యజ్ఞయాగాది క్రతువులు అసలే అక్కరలేదు. కేవలం భక్తిమాత్రమే చాలు. అది నిష్కల్మషంగా ఉండాలి. నిర్మలంగా స్వచ్ఛంగా ఉండాలి. అది మూఢభక్తి అయినా ముగ్ధభక్తి అయినా వీరభక్తి అయినా అనుసరణీయమే దానిని ఈశ్వరుడామోదిస్తే ఆభక్తులకు ముక్తి లభ్యమౌతుంది.

'గొడగూచి' చిన్న బాలిక. అమాయకురాలు. ఒకసారి ఆమె తండ్రి శివదేవుడు పొరుగూరికి పోతూ, తాను ప్రతిరోజు అర్పించే శివుడికి కుంచెడు పాలు నైవేద్యంగా పెట్టమని, ఆ వ్రతానికి భంగం చెయ్యవద్దని చెబుతాడు. అలాచేస్తే, తాను వచ్చేటపుడు ఆడుకోవడానికి బొమ్మలు, బొమ్మపొత్తికలు తెచ్చియిస్తామని కుమార్తెను బుజ్జగించి వెళతాడు. తండ్రి ఆదేశానుసారం ఆ బాలిక కుంచెడు ఆవుపాలు కొలిచి పాత్రలో పోసుకుని, సన్నని వస్త్రాన్ని కప్పి శివాలయానికి వెళ్లి పాత్ర శివుని ముందుపెట్టి తాగమని ప్రార్థించింది.

కాని శివుడా పాలను స్వీకరించడు. చిన్న పిల్లల్లో అమాయకత్వం అధికంగా ఉంటుంది. శివుడు పాలు తాగకపోతే అది తన తప్పేమోనని భయపడుతుంది. అందుకని ఈశ్వరునితో బేలగా ఈవిధంగా అంటుంది.

'శివా ! నీవు పాలెందుకు ఆరగించవు ? కమ్మగా లేదా ? సరిగ్గా కాచలేదా ? నీకు ఆరగింపు పెట్టడానికి ఆలస్యమైందా ? నేను తెచ్చేటప్పుడు ఎవ్వరైనా చూశారా ? నీకు నిజంగా ఆకలిగా లేదా ? గ్రుక్కెడైనా తాగి, మిగిలిన నాకు వదలిపెట్టు' - అని అనేక ప్రశ్నలు వేసింది. శివుడు పాలు తాగకపోతే తటతట కాళ్లతో నేలను కొట్టి, అరచి ఏడ్చింది. బుజ్జిగించింది. మాయచేసింది. ఏమేవో ఇస్తానని ఆశపెట్టింది.

ఇలా ఎన్నో బాల్యచేష్టలు చేసింది. ఇవన్నీ ఆమె నిష్కల్మష హృదయానికీ, ముగ్ధత్వానికీ ప్రతీకలు. తండ్రి చెప్పిన మాటకు జవదాటకూడదనీ, అలాచేస్తే తండ్రి మందలిస్తాడేమోననీ ఒక పక్క భయం. శివుడు నిజంగా పాలు తాగుతాడనీ భావించడం ఆమె అమాయకత్వానికి నిదర్శనం. ఆముగ్ధత్వంతోనే శివుణ్ణి బుజ్జగించి, బ్రతిమాలి, ఏడ్చి కాళ్లు నేలకు కొట్టింది. పాలు త్రాగకపోతే తన తండ్రి వచ్చి ఆమెను చంపుతాడు. ఎప్పుడైనా చావు తప్పదు కనుక ఇప్పుడే ఇక్కడే చచ్చిపోతే సరిపోతుందని శివునికి తన తల కొట్టుకుంటుంది. ఆమె ముగ్ధభక్తిని, అమాయకత్వాన్ని మెచ్చుకుని ఈశ్వరుడు పాలు తాగుతాడు. ఇతరులకు శిలాసదృశుడైన ఈశ్వరుణ్ణి, గొడగూచి తన ముగ్ధభక్తి చేత పాలు త్రాగించింది. తన ముగ్ధత్వంలో అసాధ్యాన్ని సుసాధ్యంచేసి చూపించింది గొడగూచి. ఇలాగే ప్రతిరోజు జరుగుతుండేది.

ఊరికి వెళ్లిన ఆమె తల్లిదండ్రులు తిరిగివచ్చే మార్గంలో ఖాళీపాత్రలో గొడగూచి ఎదురౌతుంది. తండ్రి పాలేవని ప్రశ్నించాడు. గొడగూచి జరిగిన వృత్తాంతం వివరించింది. వారు నమ్మలేదు. నిజమేమిటో చూద్దామని మరునాడు పాలుతీసుకొని గుడికి అందరూ వెళ్లారు. శివుడారోజు పాలారగించలేదు. తండ్రి దండించడానికి రాగానే, ఆమె భయపడి ఎలుగెత్తి శివుణ్ణి పిలిచింది. మరుక్షణమే పరమ దయామతియైన ఈశ్వరుడు తన వక్షస్థలాన్ని తెరిచి, ఆమెను తనలో లీనం చేసుకున్నాడు. శివదేవుడి చేతికి ఆమె తలవెంట్రుకలు దొరికాయి. ఇప్పటికీ ఆరునెలలకొకసారి ఆ వెంట్రుకలను కత్తిరిస్తారు. ఈ విధంగా సోమన, గొడగూచి ముగ్ధభక్తిని ఆవిష్కరించాడు. సోమన సృష్టించిన పాత్రలు మామూలు మనుషుల్లాగే సహజంగా కన్పిస్తాయి. సామాజిక జీవితానికి చాలా దగ్గరగా ఉంటాయి. ప్రత్యేకమైన వ్యక్తిత్వంతో, కూడి ఉంటాయి. ఇది అనన్యభక్తి. ఆభక్తితోనే భగవంతుడు మోక్షమిస్తాడని, ఈ పాత్రలద్వారా సోమనలోకానికి చాటి చెప్పాడు.

3. గొడగూచి పాత్ర ద్వారా వ్యక్తమౌతున్న చిన్న పిల్లల మనస్తత్వాన్ని తెలియజేయండి ?

**సమాధానం :** పాల్కురికి సోమన తన బసవపురాణంలో ఈశ్వరుని కరుణార్ద్ర హృదయాన్ని, భక్తజనవాత్సల్యాన్ని ఎన్నో పాత్రలద్వారా వ్యక్తీకరించాడు. అందులో గొడగూచి కథ ఒకటి. ఈ కథ ద్వారా ఈశ్వరుడు ముగ్ధభక్తిని సైతం అంగీకరించాడు. భక్తి తన్మయత్వానికి వయోభేదంలేదని నిరూపించాడు. ఈ కథలో గొడగూచి చిన్నపిల్ల. ఈ పాత్రద్వారా సోమనాథుడు చిన్నపిల్లల మనస్తత్వాన్ని చక్కగా తెలియజెప్పాడు. పసిపిల్లల మనస్సు అద్దంలాంటిది. లోకంలోని కుత్సితాలు, ఈర్ష్యాసూయలు వారిని దరిజేరవు. అందరి పిల్లలలాగానే గొడగూచి ముగ్ధబాలిక. ఆమె తండ్రి శివదేవుడు. అతను శివభక్తుడు. శివదేవుడు ఒకసారి పొరుగూరికి వెళుతూ ఈశ్వరునికి, తాను తిరిగి వచ్చేవరకు కుంచెడు పాలు నివేదించమని, ఆ వ్రతం తప్పవద్దని చెప్పివెళతాడు.

నైవేద్యంగా పెట్టిన పాలు ఈశ్వరుడు నిజంగానే తాగుతాడని భావించడం, అలా శివుడు పాలు తాగకపోతే అనేక రకాల ప్రశ్నలు వేయడం, అప్పటికీ తాననుకున్నది కాకపోయేసరికి నేలకు కాళ్లకొట్టి ఏడవడం, కోపగించుకోవడం, ఎగిరి అరవడం, చేతివేళ్లు విరుచుకోవడం, నేలమీదబడి పొర్లిఏడవడం - ఇవన్నీ చిన్న పిల్లలకుండే సహజలక్షణాలు. సాధారణంగా చిన్నపిల్లలు ఏదైనా పనిఅనుకుంటే అదిసాధించేవరకూ పట్టువదలరు. అలాగే ఇక్కడ గొడగూచి కూడా తన సహజ స్వాభావికమైన లక్షణాలన్నీ వ్యక్తీకరించింది.

ఈశ్వరుణ్ణి కూడా, తన వయస్సు బాలకుడిగా భావించి, పాలు తాగడానికి ఏవేవో ఆశలు పెట్టింది. తన తల్లిదండ్రులు ఊరి నుంచి వచ్చేటప్పుడు ఆడుకోవడానికి బొమ్మలు, తినడానికి అటుకులు, పండ్లు, తెచ్చియిస్తారని పాలు తాగితే వాటినన్నింటిని శివుకిస్తానని ఆశచూపించింది. 'నీమీద ఒట్టు !' అని ఆనబెట్టింది. ఇవ్వన్నీ చిన్నపిల్లల లక్షణాలు. ఈ ఘట్టంలో అరచి, గోలచేసి, అమాయకంగా శివునికి ఆశచూపే గొడగూచి రూపం పాఠకుల మనస్సుల్లో చిత్రతమౌతుంది. చిత్రకారుడెవరైనా ఈ దృశ్యాన్ని చక్కగా చిత్రీకరించవచ్చు.

ఎన్ని మాటలు చెప్పినా, ఆశలు చూపించినా, శివుడు పాలు తాగలేదు. చివరకు తన మాట నెగ్గలేదని, గొడగూచి చావడానికి సంసిద్ధమైంది. శివుడామె అమాయకత్వానికి సంతోషించి పాలు తాగడం మొదలుపెట్టాడు. శివుడు పాలుత్రాగిన పిమ్మట 'నీవు నన్నింతగా ఏడిపించావు ! నేను చిన్నదాన్నని కదా ! నీ సంగతి మా అన్నకు చెప్పివస్తాను ఇంకమాటలెందుకు?' - అని ప్రశ్నించింది. ఇదికూడా ఆమె పసిమనసుకు నిదర్శనం.

ఊరినుంచి తిరిగి వచ్చిన తల్లిదండ్రులు, ఖాళీపాత్రను చేతిలోపట్టుకొని వస్తున్న బాలికను చూచి, పాలేవని అడిగారు. ఆమె నిర్భయంగా శివుడు పాలుతాగాడని చెప్పింది. తల్లిదండ్రులా మాటనమ్మలేదు. కాని చిన్నపిల్లలు తాము చూచిన, చేసిన పనులన్నింటినీ అందరిముందు నిస్సంకోచంగా వెల్లడిచేస్తారు. ఎవ్వరేమనుకుంటారో అనే భయం వారికి తెలియదు. అలాగే ఈ బాలిక గూడా శివుడు స్వయంగా పాలుతాగాడని వివరించింది. వయస్సుమీరి, రాగద్వేషాలు ఒంటబట్టిన వారుగాబట్టి, వారామెమాటలు నమ్మలేదు. కాని, ఆమె ప్రవిమలభక్తి, అమాయకత్వం ఈశ్వరుణ్ణి సమ్మోహితుణ్ణి చేశాయి. అందుకే ఆబాలికను తనలో ఐక్యం చేసుకున్నాడు. ఎంతోమంది తాపసశ్రేష్ఠులు గూడా పొందలేని సాయుజ్యాన్ని ప్రసాదించాడు.

ఈ విధంగా ఈ కథలో సోమన గొడగూచి పాత్ర ద్వారా పసిపిల్లల మనస్తత్వాన్ని చక్కగా నిరూపించి, పాత్రల చిత్రీకరణలో తన నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. అందుకే సోమన గ్రంథాలలోని పాత్రలు సహజత్వానికి చాలా దగ్గరగా నిలబడతాయి. భేషజాలు, అనవసరపు ఆర్భాటాలు, ఆభిజాత్యపు సంపదలు-- ఇలాంటివేవి కనబడవు.

## 1.7.4. రాదగిన ప్రశ్నలు :

1. శివుడు బెజ్జమహాదేవిని పరీక్షించిన విధమెట్టిది ?
2. ఈశ్వరుడు గొడగూచిని తనలో ఐక్యం చేసుకున్న విధానాన్ని వివరించండి.
3. 'నిర్మల మనస్తత్వానికి సోమన స్త్రీ పాత్రలు ప్రతీకలు' - వివరించండి.
4. సోమన సృష్టించిన స్త్రీ పాత్రలు సహజత్వానికి ఎలా దగ్గరగా ఉంటాయో నిరూపించండి.
5. పాల్కురికి సోమన ఇతివృత్తం, ఛందస్సు, భాష అనే మూడింటిలో దేశికవితా రీతిని సాధించిన విధానాన్ని తెలుపండి.
6. పాల్కురికి సోమన జాను దెనుగును తన కవితలో తీర్చిన రీతిని వివరించండి.

## 1.7.5. ఆచూకీ గ్రంథాలు


1. పాల్కురికి. సోమన : బసవ పురాణం
2. పాల్కురికి. సోమన : పండితారాధ్య చరిత్ర
3. లక్ష్మీకాంతం. పింగళి : ఆంధ్ర సాహిత్య చరిత్ర, 1976.
4. నాగయ్య. జి. డా॥ : తెలుగు సాహిత్య సమీక్ష; మొదటి సంపుటి, 1990.
5. శ్రీరామమూర్తి. కొర్లపాటి, ఆచార్య : తెలుగు సాహిత్య చరిత్ర - ప్రథమ భాగం, 1991
6. సుశీల, టి. డా॥ : ఆంధ్ర ద్విపద సాహిత్య చరిత్ర. 1979
7. తెలుగు సాహిత్య చరిత్ర : తెలుగు అకాడమీ. 1996
8. ఆంధ్రుల సంస్కృతి-సాహిత్యచరిత్ర : తెలుగు అకాడమీ. 1989



**డాక్టర్ జి. వైదేహి,** ఎం.ఏ., ఎం.ఫిల్., పి.హెచ్.డి.

రీడర్ & తెలుగుశాఖ,

టి.జె.పి.యస్. కళాశాల

గుంటూరు.

మొదటి భాగము - ప్రాచీన పద్యభాగము

# కిరాతార్జునీయము - శ్రీనాథుడు

**(హరవిలాసము - సప్తమాశ్వాసము - 1-103 పద్యాలు)**

## పాఠం - 8


**1.8.0** పరిచయం

**1.8.0.1** కవిపరిచయం

**1.8.0.2** కావ్యపరిచయం

**1.8.1** పాఠ్యభాగ వివరణ

**1.8.2** సమగ్ర వాఖ్యలు


### 1.8.0. పరిచయం :

### 1.8.0.1 కవిపరిచయం :

**శ్రీనాథుడు :**

15 వ శతాబ్దంలో ప్రభవించిన కవులలో శ్రీనాథు డగ్రేసరుడు. ఆంధ్ర సాహిత్య జగత్తులో కవిత్రయం వారి తరువాతి స్థానం పదిలపఱచుకొన్న మహాకవి. కవిసార్వభౌమ బిరుదాంచితుడు. సకల విద్యాసనాథుడు. బ్రాహ్మీదత్త వరప్రసాదుడు. ఉరుప్రజ్ఞావిశేషోదయుడు. ఈశ్వరార్చన కళాశీలుడు. ఉభయ భాషాకవిత్వ ప్రయోగకుశలుడు. ఆగమజ్ఞాననిధి. తత్త్వార్థఖని. బహుపురాణజ్ఞుడు. కమలనాభ పౌత్రుడు. భీమాంబికామారయామాత్య పుత్రుడు. గౌడడిండిమభట్టు కంచుఢక్కను పగుల గొట్టించిన ప్రౌఢ కవి. రెడ్డి రాజుల ఆస్థానంలో విలసిల్లిన కవి మూర్ధన్యుడు. పెదకోమటి వేమారెడ్డి కాలమున విద్యాధికారి. రాజమహేంద్రవర రాజ్యాధిపతులైన అల్లాడ రెడ్డి, వీరభద్రా రెడ్డి ఆస్థాన కవి.

ఆయన రచించిన కొన్ని కృతులు ఈ క్రింది పద్యము వలన తెలియుచున్నవి.

చిన్నారి పొన్నారి చిఱుత కూకటినాడు
రచియించితి **మరత్తరాట్చరిత**
నూనూగు మీసాల నూత్నయౌవనమున
**శాలివాహన సప్తశతి** నుడివితి
సంతరించితి నిండు జవ్వనంబునయందు
**హర్షనైషధ** కావ్యమాంధ్ర భాష
ప్రౌఢ నిర్భర వయః పరిపాకమునఁ గొని
యాడితి **భీమనాయకుని మహిమ** (భీమేశ్వర పురాణము)
ప్రాయమింతయు మిగుల గైవ్రాలకుండఁ
**గాశికాఖండ మను** మహాగ్రంథ మేనుఁ
దెనుగుఁ జేసెదఁ గర్ణాట దేశ కటక
పద్మ వనహేళి శ్రీనాథ భట్ట సుకవి. (కాశీఖండం. 1-7).

ఇవి కాక పండితారాధ్యచరిత్రము, ధనంజయ విజయము, నందనందన చరిత్ర, వల్లభాభ్యుదయము వ్రాసినట్లు తెలుస్తుంది. క్రీడాభిరామము కర్తృత్వ విషయం వివాదగ్రస్తం. లభించిన కావ్యములన్నియు ఆంధ్ర సరస్వతికి అమూల్యాలంకారములే.

1. శృంగారనైషధము - ఇది శ్రీనాథుడు నిండు జవ్వనమున సంతరించిన గ్రంథం. మామిడి సింగనామాత్యునకు అంకితం. సంస్కృత హర్ష నైషధానికి అనువాదం. స్వతంత్రాస్వతంత్రాంధ్రీకరణ పద్ధతిలో దీనిని రచించాడు.
2. భీమేశ్వర పురాణము : ఇది ప్రౌఢ నిర్భరవయః పరిపాకంలో రచితం. బెండపూడి అన్నయ మంత్రికి అంకితం. పురాణమని యున్నను అది కావ్యమే. ఇది క్షేత్రమహాత్మ్యకావ్యాలలో రెండవది. (మొదటిది ఎఱ్ఱన నృసింహ పురాణము).
3. కాశీఖండము : ఇది ప్రాయమింతకు మిగుల గైవ్రాలకుండ రచించినది. అల్లాడ వీరభద్రారెడ్డికి అంకితం. సంస్కృతకాశీఖండ మయః పిండం. కాగా శ్రీనాథుని కాశీఖండ మమృతభాండము.
4. శివరాత్రి మాహాత్మ్యము : ఇది ముమ్మడి శాంతయ్యకు అంకితము. ఇది స్వతంత్ర కావ్యము.
5. హర విలాసము : ప్రస్తుత పాఠ్యభాగము కావ్యంలోనిదే.
6. పలనాటి వీరచరిత్ర : కర్తృత్య విషయము కొంత వివాదగ్రస్తమైనది. అది శ్రీనాథ కృతమే అని కొర్లపాటి శ్రీరామమూర్తి గారి నిష్కర్ష.
7. మరుత్తరాట్చరిత్ర - లభింపలేదు.
8. శాలివాహన సప్తశతి - ఇది నూనూగు మీసాల నూత్న యౌవనంలో రచితం. ఇదీ లభింపలేదు. హాలుని గాథాసప్తశతికి అనువాదం. లభించిన పద్యాలు రసగుళికలు. ఒక ఉదాహరణ :

   వారణసేయ ఁదావిగొనవా, నవవారిజమందుఁ దేఁటి క్రొ
   వ్వారుచునుంట నీ వెఱుగవా, ప్రియ వాతెఱ గంటిఁ గంటి కె
   వ్వారికిఁ ఒంపురాదె, తగవా మగవారల దూఱ, నీ విభుం
   డారసి నీ నిజం బెఱుగు నంతకు నంతకు నోర్వు నెచ్చెలీ.

9. పండితారాధ్య చరిత్రము : లభింపలేదు. ఇది పద్యప్రబంధము. మామిడి ప్రెగడయ్యకు అంకితము.
10. ధనంజయ విజయము : లభించలేదు
11. నందనందన చరిత్ర : శ్రీనాథుడు తెలియజేయనిది. కాని లాక్షణికులు సూచించారు.

అట్లే ఇంకను కొన్ని కావ్యాలు శ్రీనాథకృతమని చెప్పబడుతున్నాయి.

శ్రీనాథుని అవసానకాలం హృదయ విదారకమైనది. అందుకీ రెండు పద్యాలు సాక్ష్యం

కవిరాజు కంఠంబు ఁగౌగిలించెను గదా
పురవీధి నెదురెండ బొగడదండ
సార్వభౌముని భుజాస్కంధ మెక్కెను గదా
నగరి వాకిట నుండు నల్లగుండు
ఆంధ్రనైషధకర్త యంఘ్రి యుగ్మమునఁ దగిలి
యుండెనుగదా నిగళ యుగము.
వీరభద్రారెడ్డి విద్వాంసు ముంజేత
వియ్యమందెనుగదా వెదురు గొడియ
కృష్ణ వేణమ్మ గొనిపోయె నింత ఫలము

బిల బిలాక్షులు తినిపోయె తిలలు పెసలు
బొడ్డు పల్లెను గొడ్డేటి మోసపోతి
నెట్ల చెల్లింతుఁడంకంబు లేదు నూర్లు.

ఇట్టి దశలో కూడా శ్రీనాథుడు నైషధాన్ని స్మరించాడంటే శృంగారనైషధ కావ్య ప్రశస్తి ఎంతటిదో ఊహించవచ్చు.

కాశికా విశ్వేశుఁగలిసె వీరారెడ్డి
రత్నాంబరంబు లే రాయడిచ్చుఁ
గైలాసగిరిఁబండె మైలారవిభుడేగె
దినవెచ్చ మేరాజు తీర్చఁగలడు
రంభఁ గూడె ఁదెనుంగురాయ రాహుత్తుండు
కస్తూరికే రాజు ప్రస్తుతింతు
స్వర్గస్థుడయ్యె విస్సన మంత్రి మఱిహేమ
పాత్రాన్న మెవ్వని పంక్తిఁ గలదు
భాస్కరుడు మున్నెదేవుని పాలికరిగెఁ
గలియుగంబున నిక నుండఁ గష్ట మనుచు
దివిజ కవివరు గుండియల్ దిగ్గురనగ
నరుగుచున్నాడు శ్రీనాథు డమరపురికి

అవసానదశలో సైతం దివిజ కవివరు డంటేబృహస్పతి గుండెలు గుభేలుమనేట్టు స్వర్గానికి వెళ్లుతున్నానని చాటి చెప్పుకోవడం శ్రీనాథునికే తగింది. దేశపర్యటనలో పలనాటిలో తిరుగుతూ చాటు పద్యాలు చెప్పినట్లు తెలుస్తుంది.

"రసికుడు పోవడు పల్నా
డెసగంగా రంభయైన యేకులె వడకున్
వసుధేశుడైన దున్నునుఁ
గుసుమాస్త్రుండైన జొన్న కూడే కుడుచున్."

చిన్న చిన్న రాళ్ళు చిల్లర దేవుళ్ళు
నాగులేటి నీళ్ళు నాపరాళ్ళు
సజ్జ జొన్న కూళ్లు సర్పంబులును తేళ్ళు
పల్లెనాటి సీమ పల్లెటూళ్ళు.

మొదలైన చాటు పద్యాలు ప్రచారంలో ఉన్నాయి.

కవిత్రయం వారి కవితావైభవాన్ని జీర్ణించుకొని తనదైన ప్రత్యేకతను నిరూపించుకొని ఆంధ్ర సరస్వతి నర్చించి మనకు కవితామృత మందించిన మహాపండితుడు, మహాకవి, కవిసార్వభౌముడైన శ్రీనాథుడు.

**1.8.0.2. కావ్యపరిచయం :**

హరవిలాసము :

"హరవిలాసము గౌరీకల్యాణం వినాస్వతంత్ర కావ్యము." గౌరీకల్యాణం మాత్రం అనువాదం. ఈ కావ్యం అవచితిప్పయసెట్టికి అంకితం.

"బాలసఖుడవు శైవ ప్రబంధ మొకటి
యవధరింపుము నాపేర నంకితముగ"

అని అవచితిప్పయ సెట్టి అడుగగా శ్రీనాథుడు దీనిని రచించి అంకితమిచ్చాడు. ఇది శైవ ప్రబంధం. ఇందు ఐదుకథలున్నాయి. ఇవి ఏ కథ కాకథయే. పైకి చూడడానికి వస్తైక్యం లేనట్లుంటాయి. కాని అంతస్సూత్రమొకటే. ప్రతికథకు ఫలశ్రుతులేవైనా పరమార్థమొకటే. ఆ కథలలో శ్రీనాథుని ఆత్మీయత అడుగడుగున గోచరిస్తుంది. కిరాతార్జునీయంలో షట్కాల శివలింగార్చన పొందుపరచాడు. ఈశ్వరార్జన కళాశీలుడనని స్థాపించుకొన్నాడు.

చిరుతొండనంబికథ : చిఱుతొండనంబి దంపతులు ఈశ్వరాదేశంమేరకు తమపుత్రుని సిరియాలుని వండి ఆహారంగా పెట్టారు. వారిభక్తిని పరీక్షించి వరమనుగ్రహించడం, వారి కారణంగ కంచిలోని ఏడువాడల వారికి మోక్షం లభించుడం; ఇదికథ. రచన మిగుల రమణీయం. పుత్రపౌత్రాభివృద్ధి, ధన కనక వస్తు వాహన సమృద్ధి, ఇష్టార్థసిద్ధి అనేవి ఫలశ్రుతి. ఈ కథ శిష్టరక్షాత్మకం.

**2. గౌరీకల్యాణము :**

ఇది కాళిదాసు కుమారసంభవంకు అనువాదం. స్వతంత్రాను వాదం, చక్కని అనువాదం. ప్రారంభము, ముగింపులో కాళిదాసకృతికి, శ్రీనాథునకు తేడాగలదు. హిమవన్నగవర్ణనతో అది ప్రారంభము. "తారకుడన్ మహాసురుడు ... పాతుచున్" అన్నతారకుడు దేవతలను పెట్టు బాధలను తెలియజేసే పద్యంతో గౌరీ కల్యాణం ప్రారంభమైనది. తారకవధ ముగుస్తుంది. దీనిని మిగుల సంక్షిప్తంగ రచించాడు. "భూజనములకు భోగము మోక్షమును గలుగు'' నని దీని ఫలశ్రుతి. ఇది దుష్టశిక్షాత్మకం.

**3. దారువన విహారము :**

బ్రహ్మాండ పురాణమందలికథ. శివుని భిక్షాటనం, లింగస్వరూపం వర్ణితాలు. లింగరూపమే పూజకు అర్హమని ప్రతిపాదింపబడినది. ఇది శివలింగరూపాత్మకం. (తె.సా.చ - ద్వి.భా. పుట 51).

**4. వార్ధిమథన కథ :**

హాలాహల భక్షణం ఈ కథలోని పరమార్థం. బ్రహ్మవిష్ణువులకు అలవికాని వాటినిచూపి, శివుని ఆధిక్యతం స్థాపించాడు శ్రీనాథుడు. భారత భాగవతాదులలోనూ ఈ కథగలదు. హరవిలాసంలోనిది శివాధిక్యాత్మకం. దీని ఫలశ్రుతి ఆయుశ్శ్రీవృద్ధులు.

**5. కిరాతార్జునీయం :**

ఈ పేర భారవి సంస్కృతంలో మహాకావ్యాన్ని రచించాడు. కథ భారతాంతర్గతమే. షట్కాల శివలింగార్చనం ఇందు ప్రతిపాదితమైన అంశం. దానిద్వారా అర్జునుడు శివుని అనుగ్రహం పొందాడు. ఇది శివానుగ్రహాత్మకం.

ప్రతికథా రసవత్తరం. పరమార్థోన్ముఖం. శ్రీనాథుని కవితా పాటవానికి దర్పణం. ప్రతిపద్యం అమృతోపమానం. శ్రీనాథుడు ఈశ్వరార్చన కళాశీలుడని స్థాపించడానికి పరమోదారణం హరవిలాసకావ్యం.

## 1.8.1. పాఠ్యభాగ వివరణ :

**అర్జునుడు ఇంద్రుని గూర్చి తపస్సుచేసిన విధం :** అర్జునుడు ఇంద్రకీల పర్వతంలో తీయమామిడి, చీకటి చెట్లు, తాడి, కడిమి, తెల్లమద్ది, లొద్దుగ, తుమ్మికి, మఱ్ఱి, ఉసిరిక, పనస, మామిడి, కలిగొట్టు, మద్ది, గోరంట, చింత, పచ్చచందనము, మంచిగంధము, వేప, మొగలి, వెలగ, పోఁక మొదలైన చెట్లచే పుణ్యతమమైన ఆశ్రమంలో అన్నల అనుమతితో, ద్యూతపరాభవం వల్ల కలిగిన దుఃఖంతో శత్రువులను జయించడానికి ఇంద్రునిపై మనస్సు నిలిపి తపస్సు చేయడానికి పూనుకొన్నాడు. విల్లు బాణాలు ధరించి, అమ్ముల పొదుల రెండింటిని వీపున బంధించి కిరీటం, కవచం దాల్చి అర్జునుడు, శత్రువులను గెలువడానికి కోరికతో, మిక్కిలి గొప్ప నిష్ఠతో ఇంద్రకీల పర్వతాగ్రంపై ఇంద్రునిగూర్చి తపశ్చర్యకు పూనుకున్నాడు. మనసులో ఏ మాత్రమైనా వంచన లేక ఆ పర్వతం మీద పంచాగ్నుల మధ్య అర్జునుడు తపస్సు చేయనారంభించాడు. గాండీవంతోపాటు యోగులు ధరించే దండం, అస్త్రాలతో పాటు కొన్ని లేఁత దర్భలు, కవచంతోపాటు పులితోలు ధరించి విరుద్ధపు తపమొనర్చాడు. సింహాలు, ఎలుగుబంట్లు, అడవి దున్నలతోనిండి భయంకరమైన ఆ పర్వతారణ్యమందు కందమూలాదు లాహారంగా గలవాడై ఇంద్రియాలను జయించినవాడై, జాతి పైభాగం పడకగా గలవాడై త్రికరణ శుద్ధిగా అనేక తపశ్చర్యలను అనేక ప్రకారాలుగా స్వర్గాధిపతి ప్రియకుమారుడైన అర్జును డొనరించాడు.

పడుతున్న సెలయేటి నీటి ప్రవాహాలలో అఘమర్షణ స్నాన మాచరించాడు. "అస్త్రమంత్రములచే మంత్రింపబడిన జలమును ఎడమ ముక్కు కొనను చేర్చి 'ఇడ'యను నాడిచే ఆ జలము లోన ప్రవేశించినట్లును, అద్దానిచే లోని పాపము కాలిపోయినట్లును భావించి, తరువాత పింగళయను కుడి ముక్కు నాడిచే ఆ జలము వెలుపలికి వచ్చి కుడిచేతి యందున్నట్లు భావించి, అందే పాప పురుషుడున్నట్లు ధ్యానించి ఎడమ ప్రక్కను వజ్రశిలయున్నట్లు భావించి యా జలమునందువైచి పాపపురుషుడు చూర్ణమయ్యెనని యెంచవలయును. ఇదియే అఘమర్షణమగును" (ఈశ్వరార్చనకళాశీలుడు, పుట 31). కొండగోఁగు పూవులతో, కుండ వర్ధన పుష్పాలతో శివుని పూజించాడు. చిగురు వంటి చేతియందు స్ఫటికాక్ష మాలిక ధరించి ఇంద్రుని మంత్రాన్ని జపించాడు. బాహువునుపైకి చాచి ఒంటి కాలిపై చాలసేపు నిలబడి తపం చేశాడు. శరభాలు, శార్దూలాలు, సింహాలు మొదలైన జంతు సమూహం విజృంభించి తనపైకి దూకునపుడు దండం వంటి చేతిలో గల గాండీవం నుంచి వెలువడే భయంకరమైన, మిక్కిలి తీక్ష్ణమైన, వాడియైన, వజ్రాయుధంలాగ కఠినమైన బాణ సమూహంతో చీల్చి చెండాడాడు. మలయ పర్వతం నడిమి భాగమందు పాముచే చుట్టబడిన గందపు చెట్టులాగా సవ్యసాచియందు వీరరసగర్భితమై శాంతరసం మిక్కిలిగ విస్తరిల్లినది.

గాండీవ మనే వింటి అల్లె త్రాడును లాగి కొట్టడంచేత ఏర్పడిన కాయల కళంకమే అలంకారాలైన చేతులు నీవార పాకానికి; ద్రౌపది యొక్క కుంభములవంటి కుచాలపైగల కుంకుమతో చూడముచ్చటైన వక్షస్థలం రుద్రాక్షధారణకు; అంగార పర్ణ గర్వనిర్భేదనంతో సమర్థమైన హుంకారానికి కారణమైనన కంఠం మహేంద్రుని మంత్రాక్షరాలను ధరించడానికి; ఖాండవ దహన సమయంలో విజృంభింప బడిన గర్వాతిశయం గల కమలం లాంటి హృదయం ప్రణవానుభవానికి; ద్రోణునిచే నిర్దేశింప బడిన కొమ్మచివరగల పక్షి లక్ష్యాన్ని చూడడంలో జాగరూకమైన చూపులు ముక్కుపై కూర్చడానికి మత్స్య యంత్రాన్ని ఛేదించే ఉపాయమెటిగిన శక్తియొక్క సిద్ధిగల బుద్ధి, పెద్దలను సేవించడానికి; గంగాజల నిగ్రహానుగ్రహాపాదనానికి సమగ్రమైన మానసోత్సాహాన్ని ఇంద్రియముల నరికట్టడానికి ఉత్తర దిగ్విజయ యాత్రకు సాగదగిన కాళ్ళు తీర్థ గమనాలకు పాల్పడునట్లుజేసి జెగజెట్టి అనే బిరుదు స్థిరమయ్యేట్లుగా ఇంద్రుని గురించి తపస్సు చేస్తూండగా దినాలు, వారాలు, పక్షాలు, మాసాలు, ఋతువులు గడచి సంవత్సరం దాటింది.

అప్పుడు తెల్లని గడ్డం, తెల్లని మీసం, నరసిన వెంట్రుకలతోడి తెల్లనైన శిరస్సు, నిప్పుమసి బొట్టు, ప్రకాశించే జందెం, విభూతి తోడి నొసటి మూడురేఖలు, కాలిదోవతి, బొంతవంటి ఉత్తరీయం, యోగదండం, చంకలో జింకతోలు, పంచాంగపు కట్ట, చేతిలో యాగాలలో నెయ్యి చిలుకునట్టి రెండు దర్భపోచలు, ఒక వ్రేలికి వెండి ఉంగరం, జారుడుబొజ్జ, దర్భలుగలసంచి, ఎడమ చేతిలో పొడుగు కఱ్ఱగల గొడుగు ధరించి తనకు సహచరుడుగా తపసియైన వృద్ధ బ్రాహ్మణుడొకడు నెమ్మది నెమ్మదిగా పార్థుకడకు వచ్చాడు. అలా వచ్చి, ఆతని నాశీర్వదించి మహాత్మా నీ సహవాసంతో తపస్సు చేయడానికి వచ్చాను. ఇచ్చట క్రూరజంతువులు నన్ను బాధింపకుండ కొన్ని దినములు కనుపెట్టుకొని ఉండవలసినదని పలికి మిక్కిలి అలసిపోయినవానిలాగా అతని ముందట చతికిలబడి కూర్చుండి ఆ బ్రాహ్మణుడు మూర్ఖునిలాగా వంకర టింకరగా అర్జునుని చూస్తూ, మిక్కిలి నాస్తికభావాన్ని ప్రకటించే దీనమైన పల్కులతో నిట్లన్నాడు.

"అన్నా ! ఎవరు నీవు ? ఈ అడవిలో తపస్సు చేస్తున్నావు. నీ మంత్ర తంత్ర విధులను పరీక్షించి చూడగా నీవు దేవేంద్రుని ప్రార్థిస్తున్నావని విదిత మవుతుంది. చక్కని వాడవు. మిక్కిలి చల్లనివాడవు. భాగ్యరేఖ పెంపెక్కినవాడవు. ఈ అరణ్యమెక్కడ ? నీ సౌకుమార్య మెక్కడ? తెలివితక్కువ వాడవైన నీ వొక్కడవు దక్క ఎవ్వడైన ఇట్టి యౌవనంలో ఘోరవీర తపస్సు చేస్తాడా ? శరచాపాలను ధరించడం, మనశ్శాంతి, తపఃక్లేశం నోర్చుకొన్న ఇంద్రియ నిగ్రహాన్ని చూడగా చంకలో దుడ్డు కఱ్ఱ ఉంచుకొని శరణు అని ఇతరులను ఆశ్రయించిన వాడి విధంతోస్తుంది. మదించిన ఏనుగుల కుంభస్థలాలను చీల్చడంలో భయంకరమైన కత్తివాదర గలవీ, పరిఘవంటి ఆకారం గలవీ అయిన నీ చేతులు కందమూలాలను పెల్లగించడానికి పాల్పడ్డాయిగదా ! ఈ శుభమైన ఆకారం, ఈ మహాబాహుద్వయం, ఈ పొడవైన విల్లు. ఈ భయంకరత్వం బొక్కొక్కటియే లోకైకాధిపత్యాన్ని పొందడానికి అర్హమనిపిస్తాయి. కొండముచ్చులు, ఎలుగుబంట్లు, మదపుటేనుగులు విస్తరిల్లిన ఈ అడవిలోపల ఏ ప్రయోజనమెంచి ఏకాగ్రభావంతో తపస్సు చేస్తున్నావో కదా ?

ఈశ్వరుని గూర్చి తపస్సు చేస్తే మంచిదే. విష్ణువుని గూర్చి చేస్తే అది మాకు ఇష్టం. బ్రహ్మను గూర్చి చేసినా అది మరీ శ్రేష్ఠం. కాని ఇట్లు ఇంద్రుని గూర్చిచేయడం, ఏమాత్రమూ తగదు. ఇంద్రుని గూర్చి తపస్సుచేయవలసినదని నీ కెవడు ఉపదేశించాడు? ఆ ఉపదేశించిన వానికి ఇంద్రుడు గౌతముని ఇంటిలో చేసిన కామగోష్ఠి తెలియనే తెలియదు. ఆవేయికన్నుల వాని మనః పవిత్రతకు మహామునియైన

గౌతముని యింటి పంచయేసాక్షి. ఆ దేవతాపతి బహుపరాక్రమానికి గరుత్మంతుని ఒక్క యీక రాలడమే సాక్షి. ఆ సునాసీరుని గర్వాతి శయానికి నిషధాద్రిమీది నెలవే సాక్షి. ఆ శచీవల్లభుని ఉచితజ్ఞతకు దుర్వాసుడిచ్చిన పూలమాలయే సాక్షి. ఇట్టివాడైన దేవేంద్రుని వలన నీవేమి ప్రయోజనం పొందుతావు. ఇకచాలు; నీ కోరిక పాడుగాను; వాడు నీకన్న ఎందులో అధికుడు? ఆతని గూర్చి తపస్సు చేయడం తగదు. ఈ విరుద్ధపు తపస్సు ఇక చాలింపుము''. అని చెప్పాడు.

అట్లెంతగా చెప్పినా వినక మిక్కిలి ధీరోదాత్తుడగు పాండుపుత్రుడు తనరీతిలో తపస్సు చేసుకొంటున్నాడు. అట్టి ఆతని యేకాగ్రభావానికి ప్రియమంది ఇంద్రుడు వృద్ధ బ్రాహ్మణ వేషం వదలిపెట్టి ఆతనికి ప్రత్యక్షమై వరం కోరుకోమన్నాడు. అప్పుడర్జునుడు "పురుహూతా ! ద్రోణుడు, భీష్ముడు, కర్ణుడు, సైంధవుడు, అశ్వత్థామ అనే వారితో సహ దుర్యోధనుని సైన్యాన్ని సంహరించగల బలాన్ని దయతో ప్రసాదించవలసింది'' అని కోరుకొన్నాడు. అప్పుడు అర్జునునితో ఇంద్రుడిట్లన్నాడు. భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, కృపుడు ఛేదింప నలవికాని బలం కలవారు. అశ్వత్థామ, భూరిశ్రవసుడు, భగదత్తుడు, శల్యుడు, సైంధవుడు మంచి వీరులన్న పేరుగలవారు. కాబట్టి యుద్ధంలో విజయం ఈశ్వరుని దయలేక ఏ విధంగా కలుగుతుంది? అందువల్ల ఈశ్వరుని గూర్చి తపస్సుచేయవలసింది. ఆయన అనుగ్రహంతో నీకు జయమవుతుంది. పునర్దర్శనమగుగాక! పోయి వస్తానని ఇంద్రుడు అంతర్ధానమయ్యాడు.

**అర్జునుడు ఈశ్వరుని గూర్చి చేసిన తపస్సు - పాశుపతదీక్ష ; షట్కాల శివలింగార్చన :**

ఇంద్రుడు చెప్పిన మాటలు తప్పక ఆదరించి ధీరుడైన అర్జునుడు ఇంద్రకీల పర్వతంపై ఏకనిష్ఠతో నీశ్వరుని గూర్చి యతిఘోర వీర తపంచేశాడు.

భస్మంతో పూయబడిన నిర్మలమైన అవయవాలు కలవాడూ, పంచాక్షరీయంత్రం నిరంతరం పఠించడంలో ఆసక్తికలవాడూ, శివుని ధ్యాన నిమగ్నుడు, దట్టమై నునుపుగానున్న పులి చర్మాన్ని బొంతను శుభమైన ఆస్తరణంగా కలవాడునై అర్జునుడు సాటిలేని స్థిరత్వముతో పాశుపతి దీక్షను గైకొన్నాడు.

**అరుణోదయార్చన :**

ఆకాశగంగలోని బంగారు తామర మొగ్గలు తొలిసంజకెంజాయతో వెలుగుతూండగా మసకబాటిన అద్దంలాగా చంద్ర మండలం కాంతిహీనం కాగా తెల్లవారజామున కొంచెం వెన్నెల గ్రోలి చకోర పక్షులు ఆకసాన మత్తిల్లి ఆడుతూండగా, మందర పర్వత శిఖర మధ్యభాగంలో కృత్తికా నక్షత్రం ఒరగి ఉండగా, మెత్తని విభూతి ధూళి కల శయ్య నుంచి లేచి పవిత్రమైన రుద్రాక్షమాలధరించి అర్జునుడు పర్ణశాలలోపల హరునకు అరుణోదయార్చన చేశాడు.

**సూర్యోదయార్చన** : ఇంద్రకీల పర్వతం చరియలనుంచి పడుతున్న ప్రవాహాలలో స్నానం చేసినవాడై అర్జునుడు సమస్తోపచార విధులతో ఈశ్వరుని సూర్యోదయవేళ పూజించాడు.

**సంగవకాలార్చన :** (ఉదయమధ్యాహ్నాల నడిమికాలం) పన్నీరు, కర్పూరం, కస్తూరికాద్రవం, నల్ల అగరు, చందనం మొదలైన పరిమళద్రవ్యాలతో; పూవులతో; లవలి, అగురు మొదలగు నానావిధ ధూపధూమాలతో అర్జునుడు ఏకాగ్రభావంతో ఈశ్వరుని సంగవకాలంలో పూజించాడు.

**మాధ్యాహ్నికార్చన** : పంచ బ్రహ్మలతోను, షడంగ బీజాలతోను, ప్రసాదమంత్రాలతోను కూడిన పంచాక్షరీ మంత్రమంలోని గొప్ప నియమ తాత్పర్యంతో అర్జునుడు ఈశ్వరుని ఎల్లప్పుడు మనస్సున నిలిపి మధ్యాహ్నకాలంలో సేవించాడు.

**సాయంకాలార్చన** : ఇంద్రకీల పర్వతంపై మొలచిన మారేడు చెట్ల నీడల చేత నిర్మలమైన చంద్రకాంత మణిశిలా ప్రదేశంలో, పులితోలు నడుమన పద్మాసనంతో అర్జునుడు సంధ్యానటుడును, బరువైన జడలుగలవాడూ అయిన ఈశ్వరుని సాయంకాలం పూజించాడు.

**అర్ధనిశాసమయార్చన** : గురువు యొక్క ఉపదేశము పొందిన మార్గముచేత పవిత్రమైన పూజావిధితో సంపెగమొగ్గలు, దిరిసెనపువ్వులు, కొండగోగులు అనువానితో బంగారు గుహలను గృహముల ముఖద్వారములలో అర్జునుడు ఉత్తమ ప్రయోజనము కలవాడై (దీక్షాసంస్కారం) సముచిత భక్తితో శివుని అర్ధనిశాసమయములతో సేవించాడు.

**ఈశ్వర లీలా విలాసం :** ఈ విధంగా పాశుపతదీక్షాధురంధరుడై ఈశ్వరుని గూర్చి అర్జునుడు తపస్సు చేస్తున్నాడు. ఒకనాడు అర్జునుడు పర్వత శిఖరం నడిమి భాగంలో వికసించిన అనేక లతల నుంచి, చెట్లనుంచి దేవార్చనకై పుష్పాలను, మొగ్గలను కోస్తుండగా కుక్కల గుంపు కంఠనాళమనే వాద్యవిశేషమునుంచి "భౌ భౌ" మను మహానాదాలు శ్రావ్యాలై వినబడ్డాయి. చిఱుతపులులకంటె, సింహాలకంటె క్రూరమై మిక్కిలి పొగరుతో వేదమయమూర్తులైన ఆ కుక్కల గుంపులు ఉద్ధతితో పైపైని గుంపుగా గూడి వచ్చాయి. అందులో కొన్ని ఉదాత్తంగా, కొన్ని అనుదాత్తంగా, కొన్ని స్వరితంగా, కొన్ని ప్రచయాలుగా ఘోషించ మొదలుపెట్టాయి. బంగారు గొలుసులతో వేదాలనే కుక్కలను పట్టుకోగా, ప్రక్కల ప్రమథులు రెండువైపుల మాయాకిరాతులై తనను పేలిస్తూ ఉండగా శివుడు మాయాకిరాత వేషం ధరించాడు. వికటమై పాటలవర్ణం గల జటా కిరీటం చింపిరిజుట్టుగా మారింది. అందమైన చంద్రకళ అనే శిరోభూషణం పెడకొప్పుపైన ఉండే 'పీకె'గా మారింది. నొసటి కంటి చిచ్చు గైరిక ద్రవ తిలకమైంది. భుజమధ్యంలో ఉన్న సర్పహారాలు గురుగింజ పూసలతో చేసిన గుండ్రని దండలయ్యాయి. ఇలాంటి కిరాత వేషం దాల్చిన శంకరుడు, చెంచితగా మారిన పార్వతి తనతో రాగా, చేత ఓంకార చాపం ధరించి అర్జునుని తపోవనానికి వచ్చాడు.

ఆ సమయంలో మేఘంలాగా నల్లని దేహం, చంద్రకళా యుగళంతో సమానమైన కోరలూ, వజ్రాయుధంతో సమానమైన ముట్టె అనీ వికసించిన నల్లకలువ రంగుగల చవులూ, ఎఱ్ఱనివి, గుండ్రనివి అగుకన్నులూ గలిగి కఠోరమైన కంఠంనుంచి వెలువడు ఘుర్ఘురధ్వనుల పుట్టుక కలదిగా, ముట్టెతో ఇంద్రకీల పర్వతం మీది పెద్ద పుట్టలను తవ్వుతూ, చెట్లను చాపకట్టుగా త్రొక్కుతూ ఘుర్ఘురధ్వనుల పుట్టుక కలదిగా, మాటి మాటికి దిక్కుటాలను తాకుతూ, కన్నులనుంచి నిప్పులను వెళ్ళగ్రక్కుతూ తన గిట్టల తాకిడిచే శిలలు బంతులలాగా చిన్నవగుపుతూండగా వచ్చి ఒక పంది హరార్జుల నడుమ నిలిచింది. పినాక చాపంతో ఈశ్వరుడు గాండివకార్ముకంతో అర్జునుడు దానిపై బాణప్రయోగం చేశాడు. వజ్రసమానమైన ఆ రెండు బాణాలు వరాహం రెండు ప్రక్కలనుంచి దూసుకొని పోయి ఒకదానితో ఒకటి రాచుకొన్నాయి. ఆ శరఘాతవేదనతో మూకాసుర సూకరం వేగంగా తిరుగాడింది. హరార్జునుల బాణ పాతంవల్ల పుట్టిన వ్యధచే క్షోభించినదై ఆ వరాహం ప్రళయకాలంలో గాలితో చలింపజేయబడిన గొప్పదైన వర్షాకాలమేఘంలాగా తిరిగింది. దీర్ఘతరమైన హరవరాశుగ (నరాశుగ) మనెడి పిడుగుపాటుతో పుట్టిన మిక్కిలి వ్యధచే లోలో తిరుగుడుపడుతూ ఘుర్ఘుర ధ్వనిచేస్తూ ఆ పంది నేలగూలింది.

**కిరాతార్జునుల యుద్ధం :** అప్పుడు కిరాతవేషంలో ఉన్న పురారి తన ఓంకార చాపాన్ని నేలమీద నిలబెట్టి దాని కొప్పుపై అరచేతిని మోపి, కొంచెం ఒరగి ఒయ్యారంగా నిలిచి కుడిచేతితో వాడి అయిన బాణం తిప్పుచు ఎదురుగా ఉన్న శూరుడైన అర్జునుని చూచి వర్షాకాల మేఘంలాగా ఉరుముల్లా గంభీరమైన స్వరంతో ఇంద్రకీల గిరిధరులు ప్రతిధ్వనించేట్లు మారుమోగునట్లు సంరంభంతో గర్వంతో ఇట్లన్నాడు. "ఎవడవురానీవు? నా ఎదురుగా పరుగెత్తు పందిని బాణంతో కొట్టావు. ఓరి! నేనెవరినో ఎరుగవా? ఈ ఇంద్రకీల పర్వతాన్ని పాలించే వనచరసార్వభౌముణ్ణి. నేనూ నా భార్యా వేటకు వెళ్లి ఈ అరణ్యంలో అనేక మృగాలను చంపుతూవచ్చి, నేను వాడిబాణంతో నీ పందిని చంపుతానని శపథం చేసి దాని వెనుకనే వస్తూండగా; ఏటునకు అందినంత దూరంలో కొట్టి చెంచెత ఓటమి పెట్టడానికి పూనుకొని ఉండగా అడవి ఎరుకవానిలో కొఱతను కలుగజేసి క్రీడలోని వేడుకనంతా చెడగొట్టితివి కదరా! తాపసి వైయుండి ధనువు పట్ట తగునా? శాంతి పరులకు ప్రాణిహింస ఏలరా? కపటధార్మికా! మిక్కిలి పాపాత్ముడ! నా పందిని కొట్టడానికి నీవెవడవురా! తీక్ష్ణమగు వాడియైన బాణాలతో దీనిని గుండె పగులేట్లు కొట్టి చంపావు. రండాసుత! దీనిపై బాణప్రయోగం చేయటంవల్ల నీకు కలిగిన ప్రయోజనమేమి? నీవు తపసివైపోయావు గాన నాచేతి నుండిచావు తప్పించుకొన్నావు! ఇలాచేయడం వేట నియమమేనా? ఇతర ఆటవికుల తీగలాంటి పెద్ద వింటి యొక్క గాఢమైన బాణపు దెబ్బ తగిలిన వనేచరజంతువును ఇలా తొందరపాటున కొట్టావు. శవంపై సంధించిన నీ వాడి బాణం ఎంత వెట్టిదో కదా!" అన్నాడు.

ఆ ఆటవిక చక్రవర్తితో అర్జునుడన్నాడు "ఓ శబర ! పైబడు క్రూరజంతువును హస్తలాఘవంతో కొట్టడానికి సిగ్గెందుకు చెప్పు? నీ వంకరమాటలు కట్టిపెట్టి నీ దారి నీవు బొమ్ము. ఓ కిరాతరాజ! పందినపేక్షిస్తూ పందెంలో గెలవాలన్న వేడ్క ఉందా? ఆ ఫలం పొందుదువుగాక. ఎందుకీ విధంగా మాట్లాడుతావు. ఓ పుళిందరాజ ! ఇంక ఆలస్యం చేయక వెళ్ళు. మధ్యాహ్నకాల మవుతున్నది. ఈ సమయంలో శివార్చన చేయడానికి మాకు ఏకాంత మవసరం. ఈ అడవిలో గ్రుమ్మరి నీవు బాగా అలసిపోయిట్లున్నావు. కోపం వదలిపెట్టు. శాంతం వహించు.

ఇంత వాదమెందుకు? నీ భార్యా, నీవు, కుక్కల గుంపు నీ అనుచరులు గొప్పదాడివల్ల శ్రమచేత దప్పిక గొన్నారు. ఇక్కడ ఉండడానికిష్టమేని సుఖంగా ఉండవచ్చు.

అని అర్జునుడు పలుకగా ఆ అహంకారి మూర్ఖత్వంతో ముఖం అడ్డంగా తిప్పి ఇట్లన్నాడు. ఈ మూర్ఖపు మాటలతో పనిలేదు. పంది సంగతికాదు. వేట నియమం తప్పి మమ్ము అధిక్షేపించావు. ఈ తప్పు నీవు చేసినా నీవు తపసివి కాబట్టి శిక్షించనులే. అంతేకాక తాటి చెట్టంత విల్లుధరించావు. నీ రెండుభుజాలు అల్లెత్రాటి రాపిడిచే కాయలుగాచి ఉన్నాయి. గర్వరేఖ నీయందు స్పష్టంగా కనబడుతూంది. నీతపస్విత్వం వట్టిమోసం !

ఎందుకో నిన్ను చూచినంతనే నా హృదయం ఈ భామాసన్నిధిలో నీపై బాణ ప్రయోగం చేయాలని ఉవ్విళ్ళూరుచున్నది. నీ బాహు పరాక్రమం మేరలేనిదైతే కొంతసేపిక్కడ విజృంభించు. నామీద వాడియైన అనేక క్రూరబాణాలను ప్రసరింపచేసేది. నన్ను చెంచని ఎంచకు. హీనజాతివాడనని వంచింపకు. యుద్ధంలో నన్ను మెప్పిస్తే నిన్నపుడు శబాసంటాను. శివలింగార్చన ఎక్కడకి పోతుంది? ఈ కొద్దిలో నీ తాపసభావానికి హాని కలుగదులే. ధ్యానానుసంధానాలు ఆలస్యాన్ని సహింపనివా? బాహుపరాక్రమసంపద వేడుకను ఆశ్చర్యకరంగా నాఎదుట ప్రదర్శించు! బాణమెక్కు పెట్టు; ప్రయోగించు. నా హృదయం మునుపటిలాగానే కౌతుకాధీనమైఉంది. ఔర! నా భార్య ఘోరవీర యుద్ధమంటే ఆశపడుతూంది.

అనిపలికి ఆ లీలా కిరాతుడు నారిమీటినతోడనే మేఘగర్జనలాగా వ్యాపించిన మోతకు అర్జునుడు అంకుశం చూపగా కోపించిన మదపుటేనుగులాగా రోషించి గాండీవమునే మీటి త్రాటి మోతతో ఆకసం మారుమోగేట్లు చేసి ఆ టక్కరి విలుకానిపై బాణాలు ప్రయోగించాడు. గాండీవం నుంచి వెలువడిన నిష్ఠురమైన బాణపరంపరను ఈశ్వరుడు ప్రతిబాణాలచో ఖండించాడు. అప్పుడర్జునుడాశ్చర్యంపొంది "బాపురే! కిరాతరాజ!'' అని దండంలాంటి తన బాహు గర్వంతో మళ్లీ వాడియైన క్రూరమైన బాణాలను ప్రయోగించాడు. ఈశ్వరుడు పెద్ద ప్రయత్నం లేకుండానే వాటిని గడ్డిపోచలలాగా ఆ యుద్ధంలో తెగవేశాడు, పదునైన రంపంతో నఱికివేశాడు, అలాగాకపోతే ఈ విధంగా తుంచివేయడానికి వీలవుతుందా అని సందేహం కలిగేలా అవలీలగా వారింపశక్యంగాని అహంకృతితో క్షణంలో ఖండించాడు. హరుడు వేసిన బాణాలను నరుని బాణాలు అడ్డగిస్తాయి. అట్లే నరుడువేసిన బాణాలను హరుని బాణాలు అడ్డగిస్తాయి. ఈశ్వరార్జునుల క్రూరతరాలైన ఆశుగ, నారాచ శిలీముఖాలనే అనేక అస్త్రాల సమూహంచేత నిండిన ఆకాశంలోను, దిక్కులలోను గాఢాంధకార మలముకొన్నది. ఈశ్వరార్జునుల బాహుగర్వంచేత నిరంకుశమైన యుద్ధభూమిలోని ఓంకార గాండీవాల అల్లెత్రాళ్లమ్రోతలు ఆకాశమందంత నిండిపోయింది. ఇట్ల హరార్జునులు అహమహమికతో పోరాడుతూండగా పరమేశ్వరుని మాయాశక్తి వల్ల అర్జునుని అమ్ములపొదులు ప్రళయకాలంలో సముద్రాలు నీటిచేశూన్యమై (శరశూన్యము) నట్లుగా బాణశూన్యమయ్యాయి. అంతేకాదు. ఈశ్వరుని కుహనా కౌటిల్య శిల్పంతో దివ్యాస్త్రమంత్రాక్షరాలు అర్జునునకు గుర్తుకురాకుండా పోయాయి. కృపద్రోణులబోధన నిష్ఫలమైంది. ఎడతెగక చేసిన అభ్యాసమంతా వృధా అయిపోయింది. ముక్కంటి మాయవల్ల తన ప్రాగల్భ్యం చెడిపోగా అర్జునుడు బొమలు ముడుచుకొన్నాడు. సంకట పడుతున్నాడు. చేయి చెమర్చింది. 'బాణహీనత నా అమ్ముల పొదులకు గల్లెగదా! నాపాండిత్య మెక్కడికి పోయింది. ఆశ్చర్యంగాదా! ఈతడనాయాసంగా విజృంభిస్తున్నాడు'. అని అర్జునుడు గాండీవాన్ని పట్టుకొని గంగాధరుని వేయనారంభించాడు. అప్పుడు పార్వతి వడ వడ వడకింది.

కరకంఠుని నెత్తి నడిమచోటును పాండవుడు గాండీవంతో తాడింపగా ఈశ్వరుని కరకు వెంట్రుకలలో ప్రవహించే మందాకిని సుకుమారదేహం బక్కజిక్కింది. శిరోలంకార కుసుమహారమైన చంద్రరేఖ బ్రహ్మకపాలరంధ్రంలో దూఱింది. తలపాగగా జుట్టిన పాము దాని పట్టు సడలి వొసలిపై దిగజారింది. ఫాలనేత్రంలోని అగ్ని రగుల్కొని రెప్పల సందున నిప్పులను గ్రక్కింది. పార్వతి భయపడింది. ప్రమథులు భీతిచెందారు. ఉపనిషత్తులు ఒక్కపెట్టున ఘోషించాయి. పాండునందనుని భుజాదండంతో ధరించిన తీవ్రమైన గాండీవంతో కొట్టబడిన ఈశ్వరుని జటాజూటంలోని మిన్నేటి తరగల సమూహం గుమికూడి తాండవ మాడింది. విల్లుగొని ఇలా కొట్టగా కొట్టగా చివరకు విసుగు పుట్టింది.

**కిరాతార్జునుల మల్లయుద్ధం :**

కపికేతు (అర్జునుడు) వృషభకేతనులు మల్లయుద్ధం చేయాలన్న ఉత్సాహంతో 'ఉపతాయి' అనే మల్లబంధంతో విశేషమైన నడక నాట్యంగా నైపుణ్యంతో పెనగనారంభించారు. "తోరహత్తం" అనే మల్లబంధ విశేషంలో అర్జునుడు అధిక్యాన్ని ప్రదర్శించాడు. మిక్కిలిగా తొడలను పీడించాడు. "సీసం" అనే బంధ విశేషంతో హరుడు నొక్కి పట్టి అర్జునునకు నిశ్వాసక్రియను భారంచేశాడు. అప్పుడు అర్జునుడు "డొక్కరం" అనే మల్లబంధ విశేషంతో హరుని కంఠమూలాన్ని బిగించాడు. ముంజేతి పీడనంతో మూడవ కన్ను బైటికి వచ్చి మినుకు మినుకు మంటూంది. తాకుతూ, పొడుస్తూ, నేలపైపడుతూ, అతిశయిస్తూ, ఉడికిపోతూ, పైకెగస్తూ, కూలదోస్తూ, తూలిపోతూ హరార్జునులు బాహాబాహి మల్లయుద్ధం చేశారు.

ఇట్లీశ్వరార్జులు ఒకరినొకరెదిరించి, వారి భుజాగర్వాన్ని సిద్దులును చారణులు పొగడుతూండగా మృత్యువు యముడు లాగా ఘోరమైన ఆకారాలలో సమానత్వం కానరానిదిగా మూర్ఛిల్లకుండా పిడిలికి పడికిలిగా యుద్ధంచేశారు. "సమం" "విషమం" అనే మల్లయుద్ధ క్రీడలో చెమర్చడంలో, పెదవి గఱచడంలో, బొమలు ముడువడంలో, నిర్వికార స్థితిలో, పరిశ్రమలో ఇరువురు సరిసమానంకాగా పెనగులాడారు. కిరీటి కవచాన్ని తాటించాడు. వక్షస్థలాన్ని కొట్టాడు. అర్జునుడప్పుడు పిడికిటి పోటుతో ధూర్జటి బొమ్మను పొడిచాడు.

**ఈశ్వరసాక్షాత్కారం :** అంతట చంద్రకళాధరుడు తనదైన భుజం యొక్క అధికమైన పీడచేత అలసటచెందినవాడై; పాములహారాలతో, దేవగంగానదితో, గజచర్మ వస్త్రంతో, ఎఱ్ఱని జడల సమూహంతో పాండుకుమారుని ఎదుట కరుణతో ప్రత్యక్షమయ్యాడు. చెంచెత పార్వతి అయింది. చెంచులు భూతాలై తమతమ ఆకృతులను దాల్చారు. ఆకాశంలో దేవతలు ఫాలభాగాన అంజలులుంచి నమస్కరించారు. పార్థుడాశ్చర్యంతో అధికభక్తి వినయాలు ఉల్లసిల్లగా ప్రణామంచేశాడు. తొల్లింటి కుక్కలో నెమ్మది నెమ్మదిగ దిశవిడుస్తూ నాల్గు వేదాలు ఉపనిషత్తులతోగూడి ప్రణవమంత్రాక్షరాలతో ప్రస్ఫుటంగ ఈశ్వరుని స్తోత్రం చేయనారంభించాడు.

**అర్జునుడు చేసిన శివస్తుతి :** అప్పుడు పార్థుడు కృతార్థుడై గగుర్పాటే కవచంగా సమస్తదేహంతో ఆనందబాష్పాలతో గూడిన కన్నులు గలవాడై రెండుచేతులను నొసటఁగీలించి యీశ్వరు నిలా స్తుతించాడు.

"శివా! నీవేపరబ్రహ్మవు. నీవే అఖిలాండాండ పతివి. నీవే ప్రసన్నమైన శ్రీవిభవం, ఆరోగ్యం, ఆయువు, ప్రావీణ్యం, ప్రాభవం మొదలైన ముఖ్యఫలాలను ఇచ్చే వాడవు.

"బాలేందుధరా! నిన్ను త్రిజగన్నివాసుని, పన్నగాభరుణుని, భక్తపరాధీనుని, అధిక దయాగుణ విభవుని చూశాను. జీవించాను.

"ఓ చంద్రకలాశేఖర! నేను యాచించిన కృపానిధివి, మాటలకందని వివేకంతో దిట్టతనంగలవాడవై నీచేత నామనోభీష్టాన్ని పొందుతాను.

"ఓ గజచర్మాంబరా! మహానిష్ఠా గరిష్ఠస్థితితో నేను నీకై తపస్సు చేశాను. నా నేర్పు నిండారగా నిన్ను సంస్తుతిచేస్తాను. నిత్యం సద్భక్తితో పూవులతో నీ పూజ చేస్తాను. అహర్నిశలు నీ సేవచేస్తాను.

"ఓ నిశాటభూష! విష్ణువుచేత బ్రహ్మచేత నమస్కరింపబడేవాడా! ఘనజటాజూటంలో గంగా ప్రవాహం గలవాడా! గజాసురవైరీ! నీకు సాటి వేరెవ్వరు!

"ఓ శర్వా! నీ యందు అన్ని జగాలుంటాయి. ఆ జగాలలో నీవుంటావు. ఈ విధం బ్రహ్మ విష్ణువులకు సైతం తెలియదు.

"సర్వేశ్వరా! సర్వలోక జనకా! అర్ధచంద్రుని తలమానికంగా గలవాడా! జయం. కాముని అంతమొందించిన వాడా! కామితార్థాల నిచ్చేవాడా! పాములను కుండలాలుగా గలవాడా! జయం. పరిపూర్ణదయాగుణానికి నిలయమైనవాడా! పార్వతీ వల్లభా! జయం. దక్షయజ్ఞాన్ని ధ్వంసం చేసినవాడా! జయం. గిరిశా! జయం. ఈశ్వరా! రక్షింపవే.

"నిన్ను కొండ కిరాతునిగా భావించి లెక్కపెట్టక అనగూడని మాటలను గర్వంతో పల్కినాను. ముష్టిఘాతాలతో తీవ్రంగా బాధించాను. గాండీవంతో తలపై మోదాను. ఓ సర్పభూష! అనేకవిధాల ద్రోహం చేశాను అని అనేక పర్యాయాలు సాష్టాంగ ప్రణామమాచరించి నిలిచిన అర్జునుని చూచి ఈశ్వరుడిట్లన్నాడు. "నీ తపస్సుకు పాశుపతవ్రతనిష్ఠా గరిష్ఠతకు భుజశౌర్యానికి సంతోషించాను. నీకేవరం కావాలో

కోరుకో'' అని అన్న ఈశ్వరునితో అర్జునుడన్నాడు. "శంకరా! నాకిష్టమైన వరాన్ని దయతో ప్రసాదించి రక్షింపదలంచిన, రౌద్రమూ, ఘోరమూనై లోకాలను కాపాడే పాశుపతమనే పేరుగల దివ్యబాణాన్నిమ్ము'' అని ప్రార్థించాడు.

**వరప్రదానం :** అంతశంభుడు ప్రీతిచెందిన మనస్సుగలవాడై పార్వతీదేవి హృదయాను రాగం వల్ల, ప్రమథపరివారసమక్షంలో చిరునవ్వు కందళింపగా ఆ అర్జునుని జూచి - త్రిపురాసురుని భార్య ముఖమనే పద్మానికి సాయం సంధ్యాసమయ ప్రారంభంలాంటిదీ; గజాసురుని కుంభమధ్య గల కూటపాకల మనే (ఏనుగులకు వచ్చుజ్వరము) జ్వరంలాంటిదీ; జలంధరుడనే మేఘ మండలానికి జం ఝూ మారుతంలాంటిదీ; అంధకాసురునకు సూర్య కాంతిమండలంలాంటిదీ, శార్దూలదానవు డనే అరణ్యానికి దావానలం లాంటిదీ అయిన ఆ మహనీయ దివ్యాస్త్రాన్ని, ప్రమోగించే విధానంతో ఉపసంహరింపఁజేసే విధానంతో, దాని కీలకంతో, దాని రహస్యంతో ఉపదేశించాడు. అప్పుడు సేవించడానికి వచ్చిన కిన్నరులు, కింపురుషులు, గరుడులు, గంధర్వులు, విద్యాధరులు తమతమ దివ్యాయుధాలను అర్జునునకు ప్రదానంచేశారు. పార్వతీదేవి అక్షయబాణ తూణీరాలను ప్రసాదించింది. దండధరుడు (యముడు) దండాన్ని, పాశపాణి (వరుణుడు) పాశాన్ని, ఇంద్రుడు వజ్రాన్ని సమర్పించారు.

ఈవిధంగా వరప్రదానం చేసి ఈశానుడు (శివుడు) పరివారంతో పార్వతితో అంతర్ధాన మయ్యాడు.

## సమగ్రవ్యాఖ్యలు

1. ధనురస్త్రంబులు కేలఁ దాల్చి శరధి ద్వంద్వంబు నేపార వీఁ
పున బంధించి కిరీటియై కవచియై పూనెం దపశ్చర్య య
ర్జునుఁ డత్యంత గరిష్ఠ నిష్ఠ నమరేంద్రుం గూర్చి యయ్యింద్రకీ
ల నగాగ్రంబునఁ బ్రత్యనీక విజయశ్లాఘాభిలాషంబునన్. (7.5)

**పరిచయం :**

ఈ పద్యం కవిసార్వభౌమ బిరుదాంచితుడైన శ్రీనాథ మహాకవి ప్రణీతంబైన హరవిలాసమను కావ్యంలోని సప్తమాశ్వాసంలోని ప్రస్తుత పాఠ్యభాగమైన కిరాతార్జునీయములోనిది.

**సందర్భం :**

ఇంద్రకీల పర్వతంపై ఇంద్రుని గూర్చి తపశ్చర్యకు దొడంగిన అర్జునుని వర్ణించే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| ధనుః | : | ధనుస్సు |
| అస్త్రంబు | : | అస్త్రములు |
| కేలన్ | : | చేతియందు |
| తాల్చి | : | ధరించి |
| శరధి | : | అమ్ముల పొదులయొక్క |
| ద్వంద్వంబున్ | : | రెండింటిని |
| ఏపారన్ | : | అతిశయంతో |
| వీపునన్ | : | వీపున |
| బంధించి | : | కట్టి |
| కిరీటియై | : | కిరీటం గలవాడై |
| కవచియై | : | కవచం ధరించినవాడై |
| అర్జునుడు | : | అర్జునుడు |
| ప్రత్యనీక | : | శత్రువును |

| | | |
|---|---|---|
| విజయ | : | గెలుచుటవలన |
| శ్లాఘ | : | పొగడ్తలందలి |
| అభిలాషంబునన్ | : | ఆసక్తితో |
| ఇంద్రకీల | : | ఇంద్రకీలమనే పేరుగల |
| నగ | : | పర్వతము యొక్క |
| అగ్రంబునన్ | : | పైభాగాన |
| అమరేంద్రుంగూర్చి | : | ఇంద్రుని గూర్చి |
| అత్యంత (అతి + అంత) | : | మిక్కిలి |
| గరిష్ఠ | : | గొప్పదైన |
| తపః + చర్య | : | తపస్సనే కార్యాన్ని |
| పూనెన్ | : | ప్రారంభించాడు. |

**తాత్పర్యము :**

శత్రువులను జయించావన్న కోరికతో అర్జునుడు విల్లు, బాణాలు ధరించి, అమ్ముల పొదులను వీపున బంధించి కిరీట కవచధారియై ఇంద్రకీల పర్వతం పై భాగాన దేవేంద్రుని గూర్చి మిక్కిలి నిష్ఠతో తపస్సు చేయనారంభించాడు.

విశేషాంశాలు:

అర్జునుడు తపస్సు చేయడంలోని ప్రయోజనం ఇందు విదితం. తండ్రిని ప్రసన్నుని చేసికోవడం. తండ్రి ఆదేశాన్ని పాటించడం, కుమారుని లక్షణం. తనకోరిక సాధించడానికి మంచిమార్గమిది. తండ్రికూడా గురువే. ఇరువురూ ఉపదేశం చేసేవారు. పశుపతిని గూర్చితపస్సు చేయవలసిందని ఉపదేశించింది తండ్రి; అంటే గురువే. అందుకే "గురూపదేశపదవీ......" అని తరువాతి పద్యాలలో శ్రీనాథుడు రచించాడు. ఇంద్రుని గూర్చి తపస్సుచేయడంలోని ప్రయోజనమిదే.

ఛందస్సు :

| స | భ | ర | న | మ | య | వ |
|---|---|---|---|---|---|---|
| I I ∪ | ∪ I I | ∪ I ∪ | I I I | ∪ ∪ ∪ | I ∪ ∪ | I ∪ |
| ధ ను ర | స్త్రం బు లు | కే లఁ దా | ల్చి శ ర | ధి ద్వం ద్వం | బు నేపా | ర వీఁ |

ఈ పద్యపాదమునందు స, భ, ర, న, మ, య, వ అనే గణాలున్నాయి. యతిస్థానం 14వ అక్షరం. (ధ-ద్వం) కావున ఇది మత్తేభం.

2. శాకాహారుఁడు నిర్జితేంద్రియుఁడు పాషాణాగ్రతల్పుండునై
నాకేశప్రియనందునుండు సలిపె న్నానాప్రకారంబులన్
వాకుం జిత్తము దేహము న్సరియెకా నానాతపశ్చర్యలన్
వ్యాకీర్ణోరగసింహభల్లుకలులాయాభీల శైలాటవిన్. (7-8)

**పరిచయం :**

ఈ పద్యం కవిసార్వ భౌమ బిరుదాంచితుడైన శ్రీనాథ మహా కవి ప్రణీతమయిన హరవిలాసమనే కావ్యంలోని సప్తమాశ్వాసంలోని ప్రస్తుత పాఠ్యభాగమైన కిరాతార్జునీయములోనిది.

**సందర్భం :**

ఇంద్రుని గూర్చిన అర్జునుని తపః ప్రకారాన్ని కవివర్ణించు సందర్భం లోనిది.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| శాక + ఆహారుడున్ | : | కందమూలాదులు ఆహారంగా కలవాడూ |
| నిర్జిత + ఇంద్రియుడున్ | : | జయింపబడిన ఇంద్రియాలు కలవాడును, |
| పాషాణ | : | రాతి యొక్క |
| అగ్ర | : | పై భాగం |
| తల్పుండును + ఐ | : | పడకగా కలవాడయి |
| నాకా + ఈశ | : | ఇంద్రుని యొక్క |
| ప్రియ | : | ప్రియమైన |
| నందనుడు | : | కుమారుడు (అర్జునుడు) |
| వాకున్ | : | వాక్కును |
| చిత్తమున్ | : | మనస్సు |
| దేహమున్ | : | దేహమూ |
| సరియెకాన్ | : | సరియగు నట్లుగా అంటే త్రికరణ శుద్ధిగా |
| వ్యాకీర్ణం | : | నలుదిక్కుల విస్తరిల్లిన |
| ఉరగ | : | పాముల చేత |
| సింహ | : | సింహాల చేత |
| భల్లుక | : | ఎలుగుబంట్లచేత |
| లులాయ | : | అడవి దున్నలచేత |
| ఆభీల | : | భయంకరమైన |
| శైల + ఆటవిన్ | : | పర్వతారణ్యంలో |
| నానా | : | అనేక విధాలైన |
| ప్రకారంభులన్ | : | పద్ధతులతో |
| నానా | : | అనేక విధాలైన |
| తపః + చర్యలన్ | : | తపోనుష్ఠానాలను |
| చలిపెన్ | : | చేసెను |

**తాత్పర్యము :**

శాకాహారాన్నీ తీసుకొంటూ, జితేంద్రియుడై, రాతి పైభాగమే పడకగా గలవాడై అర్జునుడు పాములు, సింహాలు, ఎలుగుబంట్లు, అడవి దున్నలు మొదలైన క్రూర జంతువుల చేత భయంకరమైన ఇంద్రకీల పర్వతారణ్యంలో అనేక రీతుల, అనేక తపోనుష్ఠానాలను త్రికరణ శుద్ధిగా చేశాడు.

**విశేషాంశాలు :**

ఇంద్రుని గూర్చి తపస్సు చేయుచున్న అర్జునుని "నాకేశ ప్రియనందనుండు'' అనుట సాభిప్రాయంగా ఉంది. క్రూర జంతువులచే వ్యాప్తమైన అరణ్యంలో తపస్సు చేస్తున్నాడు కాబట్టి శార్దూల వృత్తాన్ని ఎన్నుకోవడం సముచితంగా ఉంది. శ్రీనాథుని సంస్కృత పద ప్రౌఢి ఇందులో స్పష్టమవుతుంది.

**ఛందస్సు :**

| మ | స | జ | స | త | త | గ |
|---|---|---|---|---|---|---|
| U U U | I U U | I U I | I I U | U U I | U U I | U |
| శా కా హా | రు డు ని | ర్జి తేం ద్రి | యు డు పా | షా ణా గ్ర | త లుం డు | నై |

ఈ పద్య పాదంలో మ, స, జ, స, త, త, గ అనే గణాలున్నాయి. యతి స్థానం 13వ అక్షరము (శా - షా) కావున ఇది శార్దూలం,

4. భసితోద్ధూళిత నిర్మలావయవుడు న్పంచాక్షరీ సంతతా
భ్యసన వ్యాప్తి పరాయణుండును శివధ్యానాను సంధాతయున్
మసృణ స్నిగ్ధ తరక్షు చర్మమయ కంథాభద్రపీఠుండునై
యసమస్థేమఁ గిరీటి పాశుపత దీక్షారంభముం గైకొనెన్. (7-29)

**పరిచయం :**

ఈ పద్యం కవిసార్వభౌమ బిరుదాంచితుడైన శ్రీనాథ మహాకవి ప్రణీతంబైన హరవిలాసమనే కావ్యంలోని సప్తమాశ్వాసంలోని ప్రస్తుత పాఠ్యభాగమైన కిరాతార్జునీయములోనిది.

**సందర్భం :**

తండ్రి అయిన ఇంద్రుని ఉపదేశం ప్రకారం ఇంద్రకీల పర్వతంపై అర్జునుడు ఈశ్వరుని గూర్చి తపస్సుచేయడానికి పాశుపత దీక్షను గ్రహించే సందర్భములోని పద్యం.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| భసిత | : | భస్మంచేత |
| ఉద్ధూళిత | : | పూయబడిన |
| నిర్మల | : | పరిశుద్ధమైన |
| అవయవుడున్ | : | అవయవాలు కలవాడూ |
| పంచాక్షరీ | : | పంచాక్షరీ మంత్రాన్ని (నమశ్శివాయ) |
| సంతత | : | ఎల్లప్పుడు |
| అభ్యసన | : | అభ్యసించడాన్ని |
| వ్యాప్తి | : | పొందుటలో |
| పరాయణుండును | : | ఆసక్తిగలవాడూ |
| శివ | : | శివుని గూర్చిన |
| ధ్యాన | : | ధ్యానాన్ని |
| అనుసంధాతయున్ | : | కూర్చువాడూ |
| మసృణ | : | నునుపైన |
| స్నిగ్ధ | : | చిక్కనైన |
| తరక్షుచర్మ | : | పులితోలుతో |
| మయ | : | కూడినదైన |
| కంథా | : | బొంతయే |
| భద్ర | : | శుభమైన |
| పీఠుండునై | : | ఆస్తరణంగా గలవాడై |
| అసమ | : | సాటిలేని |

| | | |
|---|---|---|
| స్థేమన్ | : | స్థిరత్వంతో |
| కిరీటి | : | అర్జునుడు |
| పాశుపత | : | పాశుపతమనే పేరుగల |
| దీక్షా | : | దీక్షయొక్క |
| ఆరంభమున్ | : | ప్రారంభాన్ని |
| కైకొనెన్ | : | స్వీకరించాడు |

**తాత్పర్యం :**

భస్మంతో పూయబడిన నిర్మలమైన అవయవాలు కలవాడూ, పంచాక్షరీ మంత్రాభ్యసనం నందాసక్తి గలవాడూ, శివధ్యానానికి కూర్చువాడూ, నునుపైన చిక్కనైన పులితోలు బొంతయే ఆస్తరణంగా గలవాడూనై సాటిలేని స్థిరత్వంతో అర్జునుడు పాశుపతదీక్షను స్వీకరించాడు.

**విశేషాంశాలు :**

ఇందు శ్రీనాథుని ఆత్మీయతకలదు. పంచాక్షరీ సంతత వ్యాప్తి పరాయణుడు నిజానికి శ్రీనాథుడే. శివలింగార్చనా పరులకుండవలసిన బాహ్య చిహ్నలలో నొకటి భస్మధారణం. అది త్రివిధం. అందు ఉద్ధూళన మొకటి. "పొడి విభూతిని సమంత్రకంగా సర్వాంగీణంగా అలదుట ఉద్ధూళనము. (ఈశ్వరార్చనకళాశీలుడు-పుట 17). ఇదంతా శ్రీనాథుడు ఈశ్వరార్చన కళాశీలుడనే అంశాన్ని స్థాపిస్తుంది.

**ఛందస్సు :**

| స | భ | ర | న | మ | య | వ |
|---|---|---|---|---|---|---|
| I I U | U I I | U I U | I I I | U U U | I U U | I U |
| భ సి తో | ద్ధూ ళి త | ని ర్మ లా | వ య వు | డున్ పం చా | క్ష రీ సం | త తా |

ఈ పద్య పాదమునందు స, భ, ర, న, మ, య, వ అనే గణాలు కలవు. యతి స్థానం 14వ అక్షరం. (భ - పం). కావున ఇది మత్తేభం.

5. అవధానంబున (బాకశాసన సుతుం డర్ధేందుకోటీరు సం
గవకాలంబున (బూజసేయు హిమవాః కర్పూర కస్తూరికా
ద్రవ కాలాగురు గంధసార సురభిద్రవ్యంబులంబూవులన్
లవలీ సర్జరసాగురు ప్రముఖ నానాధూపధూమంబులన్. (7-32)

**పరిచయం :**

ఈ పద్యం కవిసార్వభౌమ బిరుదాంచితుడైన శ్రీనాథమహాకవి ప్రణీతంబైన హరవిలాసమనే కావ్యంలోని సప్తమాశ్వాసంలోని ప్రస్తుత పాఠ్యభాగమైన కిరాతార్జునీయము లోనిది.

**సందర్భం :**

అర్జునుడొనరించే షట్కాల శివలింగార్చనలో నిది సంగవకాలార్చనను వర్ణించే సందర్భం.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| పాకశాసన సుతుండు | : | పాకుడను రాక్షసుని శాసించిన వాడైన ఇంద్రుని యొక్క కుమారుడు - అర్జునుడు |
| హిమవాః | : | పన్నీటితో |
| కర్పూర | : | కర్పూరంతో |
| కస్తూరికాద్రవ | : | కస్తూరికాద్రవంతో |
| కాల + అగురు | : | నల్లని అగురుతో |
| గంధసార | : | చందనం మొదలైన |
| సురభి | : | పరిమళాలుగల |

| | | |
|---|---|---|
| ద్రవ్యంబులన్ | : | వస్తువులతో |
| పూవులన్ | : | పూవులతో |
| లవలీ | : | లవలీలతా |
| సర్జరస | : | యక్షధూపమూ |
| అగురు | : | అగురు |
| ప్రముఖ | : | మొదలగు |
| నానా | : | అనేకములైన |
| ధూప | : | ధూపాలయొక్క |
| ధూమంబులన్ | : | పొగలతో |
| సంగవకాలంబునన్ | : | సూర్యోదయాత్ప్రభృతి ఏడుఘడియలకాలంలో |
| అర్థ + ఇందు + కోటీరున్ | : | అర్ధచంద్రుని జటాజూటంలో గలవానిని - ఈశ్వరుని |
| అవధానంబునన్ | : | ఏకాగ్రతతో |
| పూజసేయున్ | : | పూజిస్తాడు. |

**తాత్పర్యము :**

అర్జునుడు పన్నీరు కర్పూరం, కస్తూరికాద్రవం, నల్ల అగురు, చందనం మొదలగు పరిమళద్రవ్యాలతోను, పూవులతోను, లవలీలత, యక్షధూపం అగరు మొదలగు అనేక ధూపధూమాలతో సంగవకాలమందు ఈశ్వరుని నేకాగ్రతతో పూజిస్తాడు.

**విశేషాంశాలు :**

ఇందు శ్రీనాధుని ఆత్మీయతఉంది. ఆహ్నిక విధానంలోధూప సంపాదనం కూడా ఒకటి. ఇది తెలిసినవాడు శ్రీనాథుడు. దానికి పద్యంలోని వస్తువిశేష మిశ్రణం అవసరం. ఇవి ఇంద్రకీలపర్వతంపై గలవా? లేక శ్రీనాథుని బాల్య సఖుడు సుగంధభాండాగారాధ్యక్షుడైన అవచి తిప్పయసెట్టి అందించాడా? ఏమైనా ఇది శ్రీనాథుని ఈశ్వరార్చనమే.

**ఛందస్సు :**

| స | భ | ర | న | మ | య | వ |
|---|---|---|---|---|---|---|
| I I ∪ | ∪ I I | ∪ I ∪ | I I I | ∪ ∪ ∪ | I ∪ ∪ | I ∪ |
| ద్ర వ కా | లా గు రు | గం ధ సా | ర సు ర | భి ద్ర వ్యం | బులం బూ | వు లన్ |

6. పంచబ్రహ్మ షడంగబీజ సహిత ప్రాసాద పంచాక్షరీ
చంచన్మంత్ర పరంపరా పరమ నిష్ఠా తత్పరత్వంబునన్
మంచుంగొండ యనుంగుఁ బెండ్లికొడుకున్మధ్యా హ్నకాలంబుసే
వించు న్నిర్జర రాజ సూనుడు మనోవీధీ సదాధ్యాసితన్. (7-33)

**పరిచయం :**

ఈ పద్యం కవిసార్వ భౌమబిరుదాంచితుడైన శ్రీనాథమహాకవి ప్రణీతంబైన హరవిలాసమనే కావ్యంలోని సప్తమాశ్వాసంలోని ప్రస్తుత పాఠ్యభాగమైన కిరాతార్జునీయము లోనిది.

**సందర్భం :**

అర్జునుడు చేపట్టిన పాశుపత దీక్షలోని షట్కాల శివలింగార్చనలో మధ్యాహ్నకాలార్చనాన్ని తెలిపే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| పంచబ్రహ్మ | : | పంచబ్రహ్మ మంత్రాలతోను |
| షడంగబీజ | : | ఆరంగాల బీజమంత్రాలతోను |

| | | |
|---|---|---|
| సహిత | : | కూడుకొన్న |
| ప్రాసాద | : | ప్రాసాదమంత్రాలతో |
| పంచాక్షరీ | : | పంచాక్షరాలతో |
| చంచత్ | : | కదలుచున్న |
| మంత్ర | : | మంత్రం యొక్క |
| పరంపరా | : | క్రమమందలి |
| పరమ | : | శ్రేష్ఠమైన |
| నిష్ఠా | : | నియమమందలి |
| తత్పరత్వంబునన్ | : | ఆసక్తితో |
| మంచుంగొండ | : | హిమవంతుని యొక్క |
| అనుంగు | : | ప్రియమైన |
| పెండ్లికొడుకున్ | : | అల్లుని |
| నిర్జరరాజసూనుడు | : | దేవతాప్రభువైన ఇంద్రుని కుమారుడు - అర్జునుడు |
| మనః | : | మనస్సుయొక్క |
| వీధీ | : | మార్గమందు |
| సదా | : | ఎల్లప్పుడు |
| అధ్యాసితన్ | : | నిలిచి యుండుటచే |
| మధ్యాహ్నకాలంబు | : | మధ్యాహ్నసమయంలో |
| సేవించున్ | : | సేవిస్తాడు |

**తాత్పర్యం :**

ఐదు బ్రహ్మములతోను, షడంగబీజములతోను కూడిన ప్రాసాదమంత్రములతోడి పంచాక్షరీ మంత్రనియమమందలి తాత్పర్యభావముతో అర్జునుడు మధ్యాహ్నకాలమున శివుని సేవించును.

**విశేషాంశాలు :**

ఇందు శ్రీనాథుని ఆత్మీయత భాసిల్లుతూంది. పంచాక్షరీ మంత్రం పరమేశ్వరుని హృదయం. ఆ మంత్రం శ్రీనాథుని హృదయంలో ప్రతిక్షణ పారాయణం. పాశుపత వ్రతానికి ప్రధాన మంత్రాలైన పంచబ్రహ్మమంత్రాలు షడంగబీజాలు, ప్రాసాదమంత్రాలు ఇందుచోటు చేసికొన్నాయి. వీటికి మూలమైన మంత్రం పంచాక్షరీమంత్రం. దీనిని దీక్షాపూర్వకంగా గ్రహించ వలసి ఉంది. అట్లే శ్రీనాథుడు చేసి అర్జునునిచేత చేయించాడు.

**ఛందస్సు :**

| మ | స | జ | స | త | త | గ |
|---|---|---|---|---|---|---|
| U U U | I U U | I U I | I I U | U U I | U U I | U |
| పం చ బ్ర | హ్మ ష డం | గ బీ జ | స హి త | ప్రా సా ద | పం చా క్ష | రీ |

ఈ పద్యపాదంలో మ, స, జ, స, త, త, గ, అనే గణాలున్నాయి. యతిస్థానం 13 వ అక్షరం. కావున ఇది శార్దూలం.

7. వైయాఘ్రాజిన ఖండ మధ్యమున లేవన్ బద్ధ పద్మాసనుం
డాయింద్రాత్మజు డింద్రకీల శిఖరీంద్రారూఢ బిల్వద్రుమ
చ్ఛాయా నిర్మల చంద్రకాంతమణి పాషాణ ప్రదేశంబునన్
సాయంకాలము పూజసేయు నభవున్సంధ్యానటున్ ధూర్జటిన్. (7-34)

**పరిచయం :**

ఈ పద్యం కవిసార్వభౌమ బిరుదాంచితుడైన శ్రీనాథ మహాకవి ప్రణీతంబైన హరవిలాసమనే కావ్యంలోని సప్తమాశ్వాసంలోని ప్రస్తుత పాఠ్యభాగమైన కిరాతార్జునీయములోనిది.

**సందర్భం :**

పాశుపతవ్రతస్థుడైన అర్జునిని షట్కాల శివలింగార్చనలోని సాయంకాలార్చనను వర్ణించే సందర్భంలోని దీపద్యం.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| ఇంద్రకీల | : | ఇద్రకీలమనే |
| శిఖరి + ఇంద్ర = శిఖరీంద్ర | : | పర్వతశ్రేష్ఠంనందు |
| ఆరూఢ | : | మొలచిన |
| బిల్వద్రుమ | : | మారేడు చెట్టుయొక్క |
| ఛాయా | : | నీడచే |
| నిర్మల | : | నిర్మలమైన |
| చంద్రకాంతమణి | : | చంద్రకాంత మణులయొక్క |
| పాషాణ | : | శిలల యొక్క |
| ప్రదేశంబునన్ | : | ప్రదేశంలో |
| వైయాఘ్ర + అజిన | : | పులితోలుయొక్క |
| ఖండ | : | ముక్కయొక్క |
| మధ్యమునన్ | : | మధ్యభాగాన |
| ఠేవన్ | : | ఒప్పిదంగా |
| బద్ధ | : | కూర్చబడిన |
| పద్మాసనుండు | : | పద్మాసనంగలవాడు (అగు) |
| ఆ + ఇంద్ర + ఆత్మజుడు | : | ఆ యింద్రుని కుమారుడు - అర్జునుడు |
| సాయంకాలము | : | సాయంకాలం |
| అభవున్ | : | పుట్టుకలేనివాడైన |
| సంధ్యానటున్ | : | సంధ్యాసమయంలో తాండవం చేసేవాడైన |
| ధూర్జటిన్ | : | ఈశ్వరుని |
| పూజసేయు | : | పూజిస్తాడు |

**తాత్పర్యం :**

ఇంద్రకీల పర్వతం మీద మొలచిన మారేడు చెట్టునీడలోని చంద్రకాంత మణి వితర్దిపై పరచిన పులితోలుమీద పద్మాసం వైచుకొని అర్జునుడు అభవుడు, సంధ్యానటుడు అయిన ధూర్జటిని సాయంకాలం సేవిస్తాడు.

**విశేషాంశాలు :**

ఇందు శ్రీనాథుని ఆత్మీయత సుస్పష్టం. శ్రీనాథుడు ఇంద్రకీల పర్వతంపై చంద్రకాంతమణివేదికను నిర్మించడమే గాక కొండవీటిలో తాను చూసిన మారేడు చెట్లనుసైతం ఇంద్రకీల పర్వతంపై మొలిపించాడు. పద్మాసనస్థుడైనాడంలో శ్రీనాథుని యోగవిజ్ఞానం తెలుస్తుంది.

పులితోలుపై కూర్చున్న అర్జున వ్రతాన్ని 'శార్దూల' పద్యంలో వ్రాయడం, సాయంకాలార్చన చేస్తూండడంచేత శివుని 'సంధ్యానటున్', 'ధూర్జటిల్' అనేవి మిక్కిలి సముచితంగా ఉన్నాయి.

**ఛందస్సు :**

| మ | స | జ | స | త | త | గ |
|---|---|---|---|---|---|---|
| U U U | I U U | I U I | I I U | U U I | U U I | U |
| వై యా ఘ్రా | జి న ఖం | డ మ ధ్య | ము న తే | వన్ బద్ధ | ప ద్మా స | నం |

ఈ పద్యపాదంలో మ, స, జ, స, త, త, గ అను గణాలు గలవు. యతిస్థానం 13 వ లక్షరం (వై - వన్) కావున ఇది శార్దూలం.

8. అంచితభక్తితో శివుని నర్ధ నిశాసమయంబునందు సే
వించు గురూపదేశ పదవీ పరిశుద్ధ సమర్చనావిధిన్
కాంచన కోరకంబుల శుక ప్రసవంబులఁగొండ గోగులం
గాంచన కందరాగృహ ముఖంబులఁ బార్థుడు సంస్కృతార్థుడై. (7-35)

**పరిచయం :** ఈ పద్యం కవిసార్వభౌమ బిరుదాంచితుడైన శ్రీనాథ మహాకవి ప్రణీతంబైన హరవిలాసమనే కావ్యంలోని సప్తమాశ్వాసంలోని ప్రస్తుత పాఠ్యభాగమైన కిరాతార్జునీయములోనిది.

**సందర్భం :** అర్జునుని పాశుపతవ్రత దీక్షలోని అర్ధనిశాసమయార్చనాన్ని తెలియజేసే సందర్భంలోని దీపద్యం.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| పార్థుడు | : | అర్జునుడు |
| సంస్కృత + అర్థుడై | : | సంస్కరింపబడిన - ఉత్తమ - ప్రయోజనం కలవాడై |
| కాంచన కందరా | : | బంగారు గుహలనెడి |
| గృహ | : | గృహాల యొక్క |
| ముఖంబులన్ | : | ద్వార సమీపంలో |
| గురు + ఉపదేశ = గురూపదేశ | : | గురువుచే ఉపదేశించబడిన |
| పదవీ | : | మర్గంచేత |
| పరిశుద్ధ | : | పవిత్రమైన |
| సమర్చనా విధిన్ | : | పూజావిధానంతో |
| కాంచన | : | సంపెంగలయొక్క |
| కోరకంబులన్ | : | మొగ్గలతోను |
| శుకప్రసవంబులన్ | : | దిరిసెనపూవులతోను |
| కొండగోగులన్ | : | కొండగోగులతోను |
| అర్ధనిశాసమయంబు నందు | : | అర్థరాత్రి సమయంలో |
| శివునిన్ | : | ఈశ్వరుని |
| అంచిత | : | ఒప్పిదమైన |
| భక్తితోన్ | : | భక్తితో |
| సేవించున్ | : | సేవిస్తాడు. |

**తాత్పర్యం :** బంగరుగుహలనే గృహాల యొక్క ద్వారసమీపమందు పార్థుడు దీక్షా సంస్కారంగలవాడై (సంస్కృతార్థుడై) గురువు ఉపదేశించిన మార్గంచేత పవిత్రమైన పూజావిధితో సంపెగమొగ్గలతోను, దిరిసెన పువ్వులతోను కొండగోగులతోను శివుని ఒప్పిదమైన భక్తితో అర్ధ నిశాసమయంలో సేవిస్తాడు.

**విశేషాంశాలు :**

ఇందులో శ్రీనాథుని ఆత్మీయత వ్యక్తమవుతుంది. పాశుపతవ్రతానికి సంబంధించిన "అష్టావరణము"లలో గురువునకు అగ్రతాంబూలం. గురువు ఉపదేశించినట్లుగానే శిష్యుడు శివుని పూజించవలసిఉంది. అందుకే శ్రీనాథుడు "గురూపదేశ పదవీ పరిశుద్ధ సమర్చనావిధిన్" అని రచించాడు. ఆ గురువు శ్రీనాథుడే అని కొర్లపాటి శ్రీరామమూర్తి గారి అభిప్రాయం. శ్రీనాథుడు ఇందు చెప్పిన "కాంచనకోరకములు, శుకప్రసవములు కొండగోగులు ఆగమోక్త ప్రకారమైన పుష్పావళియే" (ఈశ్వరార్చన కళాశీలుడు - పుట 42).

**ఛంద్రస్సు :**

| భ | ర | న | భ | భ | ర | వ |
|---|---|---|---|---|---|---|
| U I I | U I U | I I I | U I I | U I I | U I U | I U |
| కాంచన | కందరా | గృహ ము | ఖంబులం | బార్థు డు | సంస్కృతా | ర్థుడై |

ఈ పద్యంలో భ, ర, న, భ, భ, ర, వ అనే గణాలు కలవు. యతిస్థానం 10వ అక్షరం. (కాం - ఖం) కావున ఇది ఉత్పలమాల

9. ఒకనా డింద్రతనూభవుండు గిరికూటోత్సంగ భాగంబునన్
వికచానేక లతా తరు ప్రతతులన్ దేవార్చనాపుష్ప కో
రకముల్‌గోయుచు నుండగా వినబడెన్ శ్రావ్యంబులై కుర్కుర
ప్రకరోదంచిత కంఠనాళకుహలీ బౌబౌ మహారావముల్. (7-37)

**పరిచయం :**

ఈ పద్యం కవిసార్వభౌమ బిరుదాంచితుడైన శ్రీనాథ మహాకవి ప్రణీతంబైన హరవిలాసమనే కావ్యంలోని సప్తమాశ్వాసంలోని ప్రస్తుత పాఠ్య భాగమైన కిరాతార్జునీయములోనిది.

**సందర్భం :**

పాశుపతదీక్షాధురంధరుడైన పార్థుడు పశుపతిని గూర్చి తపస్సు చేస్తూండగా కొండొక కాలానికి శ్రావ్యములై కుక్కల బౌబౌధ్వనులు ఆతడు పూలు గోస్తూండగా వినబడిన సందర్భంలోనిదీపద్యం.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| ఒకనాడు | : | ఒకనాడు |
| ఇంద్రతనూభవుండు | : | ఇంద్రుని కుమారుడు - అర్జునుడు |
| గిరి | : | ఇంద్రకీల పర్వతం యొక్క |
| కూట | : | శిఖరం యొక్క |
| ఉత్సంగ భాగంబునన్ | : | నడిమిప్రదేశంలో |
| వికచ | : | వికసించిన |
| అనేక | : | అనేకములైన |
| లతా | : | తీగల యొక్క |
| తరు | : | చెట్లయొక్క |
| ప్రతతులన్ | : | సమూహాలలో |
| దేవ + అర్చనా | : | ఈశ్వరుని పూజకొరకు |
| పుష్ప | : | పువ్వులు |
| కోరకముల్ | : | మొగ్గలు |

| | | |
|---|---|---|
| కోయుచునుండగాన్ | : | కోస్తూండగా |
| కుర్కుర | : | కుక్కల యొక్క |
| ప్రకర | : | సమూహంయొక్క |
| ఉదంచిత | : | ఒప్పిదమైన |
| కంఠనాళ | : | గొంతు అనెడి |
| కుహలీ | : | కాహళి అనే వాద్యవిశేషం యొక్క |
| బౌ బౌ | : | బౌ బౌ అనే |
| మహా | : | గొప్ప |
| రావముల్ | : | ధ్వనులు |
| శ్రావ్యంబులై | : | వినదగినవై |
| వినబడెన్ | : | వినబడ్డాయి. |

**తాత్పర్యం :**

ఒకనాడు అర్జునుడు ఇంద్రకీల పర్వత శిఖరం యొక్క మధ్యభాగంలో వికసించిన అనేక లతలనుంచి చెట్లనుంచి పూజకై పుష్పాలను మొగ్గలను కోస్తూండగా కుక్కలయొక్క కాహళివంటి గొంతులోనుంచి బౌబౌ మనే పెద్దధ్వనులు శ్రావ్యములై వినబడ్డాయి.

**విశేషాంశాలు :**

ఇందు శ్రీనాథుని సంస్కృతప్రౌఢి. గమ్యమానం. దేవార్చనా పుష్పకోరకాలు అనడం విశేషం. ఆగమశాస్త్ర విహితమై ఈశ్వరార్చనకు యోగ్యమైన పుష్పాలు, మొగ్గలు అని తాత్పర్యం. అవి సంపెగమొగ్గలు, దిరిసెనుపువ్వులు మొదలైనవి. ఈశ్వరార్చన కళాశీలుడు గావుననే అలా ప్రయోగించాడు.

**ఛందస్సు :**

| స | భ | ర | న | మ | య | వ |
|---|---|---|---|---|---|---|
| I I U | U I I | U I U | I I I | U U U | I U U | I U |
| ప్ర క రో | దం చిత | కం ఠ నా | ళ కు హ | లీ బౌ బౌ | మ హా రా | వ ము ల్ |

ఈ పద్యపాదంలో స, భ, ర, న, మ, య, వ అనే గణాలు కలవు. యతిస్థానం 14వ అక్షరము. (పు - బౌ) కావున ఇది మత్తేభం.

10. ముట్టియ నింద్రకీల తట మూల మహీప్రభవంబులైన పెన్
బుట్టలు గ్రొచ్చి వైచుచును భూరుహషండముఁ జాపకట్టుగా
మట్టుచు ఘర్ఘరధ్వనుల మాటి మాటికి దిక్పుటంబులన్
ఘట్టన చేయుచున్ వెడద కన్నుల నిప్పులు వెళ్ళఁగ్రాయుచున్. (7-44)

**పరిచయం :**

ఈ పద్యం కవిసార్వభౌమ బిరుదాంచితుడైన శ్రీనాథ మహాకవి ప్రణీతంబైన హరవిలాసమనే కావ్యంలోని సప్తమాశ్వాసంలోని ప్రస్తుతపాఠ్యభాగమైన కిరాతార్జునీయములోనిది.

**సందర్భం :**

హరార్జునుల నడుమకు జేరవచ్చిన వరాహంయొక్క తీవ్రమైన క్రియలను వర్ణించే సందర్భంలోనిది.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| ముట్టియన్ | : | ముట్టెతో |
| ఇంద్రకీల | : | ఇంద్రకీల పర్వతం యొక్క |

| | | |
|---|---|---|
| తట | : | చఱియల యొక్క |
| మూల | : | మొదలునందలి |
| మహీ | : | భూమినుంచి |
| ప్రభవంబులు + ఐన | : | పుట్టినవైన |
| పెన్ | : | పెద్ద పెద్ద |
| పుట్టలన్ | : | పుట్టలను |
| గ్రొచ్చివైచుచును | : | త్రవ్వి వేస్తూ |
| భూరుహ | : | చెట్టయొక్క |
| షండమున్ | : | సమూహాన్ని |
| చాపకట్టుగాన్ | : | చదునుగా |
| మట్టుచున్ | : | తొక్కుతూ |
| ఘర్ఘరధ్వనులన్ | : | ఘర్ఘరమనే ధ్వనులతో |
| మాటి మాటికిన్ | : | పదే పదే |
| దిక్ + పుటంబులన్ | : | దొప్ప వంటి దిక్కులను |
| ఘట్టనచేయుచు | : | ఒరపిడి చేస్తూ |
| వెడద | : | విశాలమైన |
| కన్నులన్ | : | కన్నుల నుంచి |
| నిప్పులు | : | నిప్పులు |
| వెళ్ళఁగ్రాయుచున్ | : | వెళ్ళఁగ్రక్కుతూ |

**తాత్పర్యం :**

ముట్టెతో నింద్రకీల పర్వతసాను ప్రదేశభూములనుంచి పుట్టిన పెద్ద పెద్ద పుట్టలను తవ్వివేస్తూ, చెట్లగుంపును నేలమట్టం చేస్తూ ఘర్ఘర ధ్వనులతో దిక్కులను రాస్తూ, విశాలమైన కన్నులనుంచి నిప్పులను వెళ్ళఁగ్రక్కుతూ (తరువాతి పద్యంతో అన్వయం)

**విశేషాంశాలు :**

“నిప్పులు వెళ్ళఁగ్రాయు” వంటి జాతీయప్రయోగము “చాపకట్టు” వంటి తెలుగు నుడికారము “గ్రొచ్చివైచు” వంటి పదబంధమూ ఈ పద్యానికి వన్నె గూర్చినట్లు స్పష్టం. ద్విత్వటకారప్రాస అందగించింది.

**అలంకారం :**

ఈ పద్యంలో “స్వభావోక్తి” అనే అలంకారముంది.

లక్షణం; “స్వభావోక్తి: స్వభావస్య జాత్యాదిస్థస్య వర్ణనమ్” జాతిగుణ క్రియాదులను స్వభావ సుందరంగా వర్ణించడమే స్వభావోక్తి అలంకారం.

**అన్వయము :** పై పద్యములో పుట్టలను త్రవ్వుట, ఘర్ఘరధ్వనులు చేయుట ఇత్యాది వరాహక్రియలు సహజసుందరంగా వర్ణితం.

**ఛందస్సు :**

| భ | ర | న | భ | భ | ర | వ |
|---|---|---|---|---|---|---|
| U I I | U I U | I I I | U I I | U I I | U I U | I U |
| ముట్టియ | నింద్రకీ | ల త ట | మూల మ | హీ ప్ర భ | వంబులై | న పెన్ |

ఈ పద్యపాదమునందు భ, ర, న, భ, భ, ర, వ అనే గణాలు గలవు. యతిస్థానం 10వ అక్షరం (ము - మూ) కావున ఇది ఉత్పలమాల.

11. జలధర నీల దేహమును ( జంద్రకళా యుగళీ సమాన దం
ష్ట్రలు భిదురోపమాన ముఖ సంపుట పోత్రము ఫుల్ల మేచకో
త్పల దళ వర్ణకర్ణములుఁ బాటల వర్తుల లోచనంబులుం
గలిగి కఠోర కంఠ ఘన ఘర్ఘర ఘట్టన ఘోష జన్మమై. (7-43)

**పరిచయం :**

ఈ పద్యం కవిసార్వభౌమ బిరుదాంచితుడైన శ్రీనాథ మహాకవి ప్రణీతంబైన హరవిలాసమనే కావ్యంలోని సప్తమాశ్వాసంలోని ప్రస్తుత పాఠ్యభాగమైన కిరాతార్జునీయము లోనిది.

**సందర్భం :**

హరార్జునుల నడుమకు వచ్చే వరాహాన్ని కవి వర్ణించే సందర్భంలోనిదీపద్యం.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| జలధర | : | మేఘంలాగా |
| నీల | : | నల్లనైన |
| దేహమున్ | : | శరీరమూ |
| చంద్రకళా | : | చంద్రకళల యొక్క |
| యుగళీ | : | రెండింటితో |
| సమాన | : | సమానమైన |
| దంష్ట్రలున్ | : | కోరలును |
| భిదుర | : | వజ్రాయుధంతో |
| ఉపమాన | : | పోలికగల |
| ముఖసంపుట | : | దొప్పవంటి ముఖానగల |
| పోత్రము | : | ముట్టె |
| ఫుల్ల | : | వికసించిన |
| మేచక | : | నల్లనైన |
| ఉత్పల | : | కలువయొక్క |
| దళ | : | రేకుల యొక్క |
| వర్ణ | : | రంగు గల |
| కర్ణములున్ | : | చెవులును |
| పాటల | : | ఎర్రనైన |
| వర్తుల | : | గుండ్రనైన |
| లోచనంబులున్ | : | కన్నులును |
| కలిగి | : | కలిగి |
| కఠోర | : | కఠినమైన |
| కంఠ | : | కంఠం యొక్క |
| ఘన | : | గొప్పవి అయిన |
| ఘర్ఘర | : | ఘర్ఘర ధ్వనుల యొక్క |
| ఘట్టన | : | ఒరపిడి యొక్క |

ఘోష : ధ్వనుల యొక్క

జన్మము + ఐ = జన్మమై : పుట్టుక కలదియై.

**తాత్పర్యము :**

మేఘంలాగా నల్లనైన దేహమూ, చంద్రకళల రెండింటితో సమానమైన కోరలు, వజ్రాయుధంతో సమామైన ముట్టెయు, వికసించిన నల్లకలువ రెక్కల రంగు గలచెవులూ, ఎర్రగాను గుండ్రంగానూ ఉన్న కన్నులూ, కలిగి కఠోరమైన కంఠం నుంచి వెలువడే ఘర్ఘర ధ్వనుల యొక్క పుట్టుక కలదియై (తరువాతి పద్యంతో అన్వయం).

**విశేషాంశాలు :**

సందర్భాన్ననుసరించి పద్యం గౌడీరీతిలోను ఆరభటీ వృత్తితోను నడిపింపజేసినాడు శ్రీనాథుడు. ఆయన సంస్కృత ప్రౌఢికి కూడా ఇది చక్కని ఉదాహరణ.

**ఛందస్సు :**

| న | జ | భ | జ | జ | జ | ర |
|---|---|---|---|---|---|---|
| I I I | I ∪ I | ∪ I I | I ∪ I | I ∪ ∪ | I ∪ I | ∪ I ∪ |
| జ ల ధ | ర నీ ల | దే హ ము | నుఁ జంద్ర | కళా యు | గళీ స | మాన దం |

ఈ పద్య పాదంలో న, జ, భ, జ, జ, జ, ర అనే గణాలు గలవు. యతిస్థానం 11వ అక్షరం, కావున ఇది చంపకమాల.

**అలంకారం :** ఇందు ఉపమాలంకారముంది.

**లక్షణం :** "ఉపమా యత్ర సాదృశ్యలక్ష్మీరుల్ల సతిద్వయోః"

ఉపమేయోపమేనాలకు సొగసైన సాదృశ్యం చెప్పడమే ఉపమాలంకారం.

**అన్వయము :** జలధరాలలాగా నీలమైనదేహమూ, చంద్రకళాయుగళికి సమానమైన దంష్ట్రలు భిదురోపమాన పోత్రమూ అనడం ఉపమాలంకారం. దేహం, దంష్ట్రలు పోత్రం ఉపమేయాలు కాగా జలధరం, చంద్రకళాయుగళం, భిదురం ఉపమానాలు.

12. గాండీవ ప్రవిముక్త నిష్ఠుర మహాకాండ ప్రకాండంబులన్
ఖండించెన్ ప్రతిబాణ ఘట్టనమునం గందర్ప విద్వేషి యా
తండాశ్చర్యము నొంది బాపురె! పుళింద శ్రేష్ఠ ! యంచున్ భుజా
దండాహంకృతి వెండియుం బఱపె శాతక్రూర నారాచముల్. (7-68)

**పరిచయం :**

ఈ పద్యం కవిసార్వభౌమ బిరుదాంచితుడైన శ్రీనాథ మహాకవి ప్రణీతంబైన హరవిలాసమనే కావ్యంలోని సప్తమాశ్వాసంలోని ప్రస్తుత పాఠ్యభాగమైన కిరాతార్జునీయములోనిది.

**సందర్భం :** హరార్జునుల యుద్ధాన్ని వర్ణించే సందర్భంలోనిది. యుద్ధారంభ పద్యమిది.

**ప్రతిపదార్థం :**

గాండీవ : గాండీవం నుంచి

ప్రవిముక్త : బాగుగా విడువబడిన

నిష్ఠుర : కఠినమైన

మహా : గొప్పవి అయిన

కాండ : బాణాలయొక్క

| | | |
|---|---|---|
| ప్రకాండంబులన్ | : | సమూహాలను |
| ప్రతిబాణ | : | ఎదురు బాణాల యొక్క |
| ఘట్టనమునన్ | : | తాకిడి చేత |
| కందర్ప విద్వేషి | : | మన్మథుని శత్రువైన, ఈశ్వరుడు |
| ఖండించెన్ | : | తుంచి వైచాడు |
| ఆతండు | : | అతడు (అర్జునుడు) |
| ఆశ్చర్యమున్ + ఒంది | : | ఆశ్చర్యపడి |
| పుళింద శ్రేష్ఠ | : | కిరాతులలో గొప్పవాడా ! |
| బాపురె | : | భళీ ! |
| అంచున్ | : | అని అంటూ |
| భుజాదండ | : | దండములవంటి బాహువుల యొక్క |
| అహంకృతిన్ | : | గర్వంతో |
| వెండియున్ | : | మరలా |
| శాత | : | వాడియైన |
| క్రూర | : | క్రూరమైన |
| నారాచముల్ | : | బాణాలు |
| పఱపెన్ | : | ప్రయోగించాడు. |

**తాత్పర్యం :**

గాండీవం నుంచి వెలువడిన కఠినమైన బాణాలను ఈశ్వరుడు ఎదురుబాణాలతో ఖండించాడు. అప్పుడర్జునుడాశ్చర్యంపొంది ఓ కిరాతశ్రేష్ఠా! భళీ ! అంటూ బాహుదండాల యొక్క గర్వంతో వాడియైన క్రూరమైన బాణాలను మరల ప్రయోగించాడు.

**విశేషాంశాలు :**

ఇందు యుద్ధోత్సాహం ప్రకటితం. కాబట్టి రసం వీరము. అందుచేత రచన గూడా వీరరసానుగుణంగా సాగింది. బిందుపూర్వక డకారప్రాస, డకార టకారావృత్తి, రేఫ పునః ప్రయోగం గౌడీరీతిని స్థాపించాయి. మొదటి పాదమంతా ఒకే సమాసం. విలసిత సమాసభరితోజ్జ్వలబంధం ఓజోగుణం. గుణరీతులే గాక తీసికొన్న వృత్తం కూడా రసానుగుణంగా సాగింది. తిక్కయజ్వ ప్రకారం రసాభ్యుచితబంధంగా వ్రాయగలవాడుగదా శ్రీనాథుడు.

**ఛందస్సు :**

| మ | స | జ | స | త | త | గ |
|---|---|---|---|---|---|---|
| U U U | I U U | I U I | I I U | U U I | U U I | U |
| గాం డీ వ | ప్ర వి ము | క్త ని ష్ఠు | ర మ హా | కాండ ప్ర | కాండంబు | లన్ |

ఈ పద్యపాదంలో మ, స, జ, స, త, త, గ అనే గణాలు కలవు. యతి స్థానం 13 వ అక్షరం (గాం - కాం) కావున ఇది శార్దూలం.

13. తెలివం బొందక యుండె నెమ్మనమునం దివ్యాస్త్ర మంత్రాక్షరం
బులు శారద్వత కుంభసంభవుల సంబోధంబు సర్వంబు ని
ష్ఫల మయ్యెన్ వృథయయ్యె నాంతరకృతాభ్యాసంబు గాండీవికిన్
కలహక్షోణిఁ బినాకపాణి కుహనా కౌటిల్య శిల్పంబునన్. (7-75)

**పరిచయం :**

ఈ పద్యం కవిసార్వ భౌమ బిరుదాంకితుడైన శ్రీనాథమహాకవి కృతంబైన హరవిలాసమనే కావ్యంలోని సప్తమాశ్వాసమందలి ప్రస్తుత పాఠ్యభాగమైన కిరాతార్జునీయములోనిది.

**సందర్భం :**

పరమేశ్వరమాయాశక్తిచే పార్థుని ప్రాగల్భ్యం చెడిపోయిన తీరును వర్ణించే సందర్భంలోనిదీపద్యం.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| కలహక్షోణిన్ | : | యుద్ధభూమిలో |
| పినాకపాణి | : | పరమేశ్వరునియొక్క |
| కుహనా | : | కపటమైన |
| కౌటిల్య | : | కుటిలత్వమందలి |
| శిల్పంబునన్ | : | నేర్పుచేత |
| గాండీవికిన్ | : | అర్జునునకు |
| దివ్య | : | దివ్యమైన |
| అస్త్ర | : | అస్త్రాలకు సంబంధించిన |
| మంత్ర + అక్షరములు | : | మంత్రాలు |
| నెఱ + మనమునన్ = నెమ్మనమునన్ | : | మనస్సునందు |
| తెలివింబొందక | : | గుర్తురాకుండ |
| ఉండెన్ | : | ఉండిపోయాయి. |
| శారద్వత | : | కృపాచార్యులయొక్క |
| కుంభసంభవుల | : | ద్రోణాచార్యుల యొక్క |
| సంబోధంబు | : | బోధన |
| సర్వంబు | : | పూర్తిగా |
| నిష్ఫలము + అయ్యెన్ | : | ఫలించకుండా పోయింది. |
| ఆంతర | : | లోపలిచే (మనసుపెట్టి అని) |
| కృత | : | చేయబడిన |
| అభ్యాసంబు | : | అభ్యాసమూ |
| వృథ | : | వ్యర్థంగా |
| అయ్యెన్ | : | అయినది. |

**తాత్పర్యం :**

ఈశ్వరుని మాయా ప్రభావంవలన అర్జునునకు యుద్ధభూమిలో దివ్యాస్త్రాలను ప్రయోగించడానికి అవసరమయ్యే మంత్రాలు గుర్తుకురాలేదు. కృపద్రోణుల బోధన నిష్ఫలమైంది. చేసిన కృషి వ్యర్థమైంది.

**విశేషాంశాలు :**

హరార్జునులను గాండీవి, పినాకపాణి అనడం సముచితంగా ఉంది. ముక్కంటిమాయ మూడంశాలలో ప్రభావం నెఱపింది.

**ఛందస్సు :**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| స | భ | ర | న | మ | య | వ |
| I I U | U I I | U I U | I I I | U U U | I U U | I U |
| తె లి విం | బొం దక | యుండెనె | మ్మనము | నం ది వ్యా | స్త్ర మంత్రా | క్షరం |

ఈ పద్యపాదంలో స, భ, ర, న, మ, య, వ అనే గణాలు గలవు. యతి స్థానం 14 వ అక్షరం. కాన ఇది మత్తేభం.

కాండ క్షీణత నాయిషుచ్ఛ టలకుం గల్గెంగదే నాధనుః
14. పాండిత్యం బెటువోయె నొక్కొయని చెప్పంజిట్టలౌ గాక యీ
తండీ లాగున (బోవు వాడె మయిమై(దానంచు గర్వోద్ధతిన్
గాండీవంబున (బూన్చి వేయ(దొడగెన్ గాండీవి గంగాధరున్. (7-73)

**పరిచయం :** ఈ పద్యం కవిసార్వభౌమ బిరుదాంకితుడైన శ్రీనాథమహాకవి ప్రణీతంబైన హరవిలాసమనే కావ్యంలోని సప్తమాశ్వాసంలోని ప్రస్తుత పాఠ్యభాగమైన కిరాతార్జునీయము లోనిది.

**సందర్భం :** పినాకపాణి కుహనాకౌటిల్య శిల్పం వల్ల ప్రగల్భత చెడిన పాండునందనుడు తనలోతాను చింతిస్తూ గాండీవంతో ఖండపరుశుని తాడించే సందర్భంలోనిదీపద్యం.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| కాండక్షీణత | : | బాణహీనత |
| నా | : | నా యొక్క (అర్జునుని యొక్క) |
| ఇషుచ్ఛటలకున్ | : | అమ్ములపొదులకు |
| కల్గెంగదే | : | కలిగెనుగదా ! |
| నా | : | నా యొక్క (అర్జునుని యొక్క) |
| ధనుః పాండిత్యంబు | : | విలువిద్యాకౌశలం |
| ఎటు + పోయెన్ + ఒక్కొ | : | ఎటుపోయినదో కదా ! |
| చెప్పన్ | : | చెప్పడానికి |
| చిట్టలౌగాక | : | ఆశ్చర్యమగునుగాక ! |
| ఈతండు | : | ఇతడు (కిరాతుడు = శివుడు) |
| ఈలాగునన్ | : | ఈ విధంగా |
| మయిమై | : | అనాయాసంగ |
| తాను | : | తాను |
| పోవువాడె | : | ప్రవర్తిల్లుతున్నాడు గదా ! |
| అంచున్ | : | అంటూ |
| గర్వ + ఉద్ధతిన్ | : | గర్వాతిశయంతో |
| గాండీవి | : | అర్జునుడు |
| పూన్చి | : | పట్టుకొని |
| గాండీవంబునన్ | : | గాండీవంతో |
| గంగాధరున్ | : | ఈశ్వరుని |
| వేయన్ | : | కొట్టుటకు |
| తొడగెన్ | : | ప్రారంభించాడు |

**తాత్పర్యం :**

బాణహీనత నా అమ్ముల పొదులకు కలిగింది గదా! నా విలువిద్యా కౌశలమేమైనది? చెప్పడానికి ఆశ్చర్యం కదా! ఇతడీ విధంగా అనాయాసంగా వర్తిల్లుతున్నాడే! అని అంటూ అర్జునుడు గర్వాతిశయంతో నీశ్వరుని గాండీవంతో కొట్టుటకు పూనుకొన్నాడు.

**విశేషాంశాలు :**

ఇదొక విచిత్రమైన సందర్భం. ఒక వైపు సమరోత్సాహమూ మరొకవైపు చిత్తవిచారమూను. అందుచేత రచనగూడ మాధురీగుణంతో సాగింది.

'కల్గెంగదే', 'ఎటువోయె', 'చెప్పంజిట్టలగు' 'ఈలాగునపోవువాడె' లాంటి ప్రయోగాలు అర్జునుని నిస్సహాయతను తెలియజేయడానికి సమర్థమైనవిగా ఉన్నాయి.

**ఛందస్సు :**

| మ | స | జ | స | త | త | గ |
|---|---|---|---|---|---|---|
| U U U | I U U | I U I | I I U | U U I | U U I | U |
| కాం డ క్షీ | ణ త నా | యి షు చ్ఛ | ట ల కుం | గల్గెం గ | దే నా థ | నుః |

ఈ పద్యపాదమునందు మ, స, జ, స, త, త, గ అను గణాలుగలవు. యతిస్థానము 13 వ అక్షరము. కావున ఇది శార్దూలము.

**అలంకారం :** ఈ పద్యమునందు "పరికరాంకురము" అను అలంకారముగలదు.

**లక్షణము :** "సాభిప్రాయే విశేష్యేతు భవేత్పరికరాంకురః"

విశేష్యము సాభిప్రాయమైనచో పరికరాంకురమగును.

**సమన్వయం :** గాండీవముతో కొట్టబోవు అర్జునుని 'గాండీవి' అని సాభిప్రాయ విశేష్యమును ప్రయోగించుటచే ఇందు "పరికరాంకురము" అను అలంకారముగలదని చెప్పవచ్చును.

15. నిష్టంకించి శశాంకశేఖరుడు గాండీవాయుధుండున్ భుజా
వష్టంభంబులు సిద్ధచారణులు గైవారంబు గావింపగా
దిష్టాంతాంతక ఘోరమూర్తులయి సాదృశ్యం బదృశ్యంబుగా
ముష్టాముష్టి రణంబు చేసిరి యసన్మోహప్రకారంబులన్. (7-86)

**పరిచయం :** ఈ పద్యం కవిసార్వభౌమ బిరుదాంకితుడైన శ్రీనాథ మహాకవి ప్రణీతంబైన హరవిలాసమనే కావ్యంలోని సప్తమాశ్వాసమందలి ప్రస్తుత పాఠ్యభాగమైన కిరాతార్జునీయములోనిది.

**సందర్భం :** హరార్జునుల ముష్టి యుద్ధాన్ని కవి వర్ణించే సందర్భం లోనిది ఈ పద్యం.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| శశాంకశేఖరుడు | : | ఈశ్వరుడు |
| గాండీవ + ఆయుధుండున్ | : | అర్జునుడును |
| నిష్టంకించి | : | మార్కొని (ఒకరినొకరు) |
| భుజా | : | బాహువులయొక్క |
| అవష్టంభంబులు | : | గర్వాన్ని |
| సిద్ధ | : | సిద్ధులును |
| చారణులున్ | : | చారణులును |

| | | |
|---|---|---|
| కైవారంబున్ | : | స్తోత్రాన్ని (పొగడ్తను) |
| కావింపగా | : | చేస్తూండగా |
| దిష్టాంత | : | మృత్యువులాగా |
| అంతక | : | యముని లాగా |
| ఘోర | : | భయంకరమైన |
| మూర్తులు + అయి | : | ఆకారంగలవారై |
| సాదృశ్యము | : | సమానత్వం |
| అదృశ్యంబుగాన్ | : | కానరానిదిగా |
| అసన్మోహ | : | మూర్ఛలేని |
| ప్రకారంబులన్ | : | విధానాలతో |
| ముష్టీ ముష్టి | : | పిడికిలికి పిడికిలిగా |
| రణంబు | : | యుద్ధం |
| చేసిరి | : | చేశారు. |

**తాత్పర్యం :**

హరార్జునులు ఒకరినొకరు ఎదిరించి తమ బాహుగర్వమును సిద్ధ చారణులు కీర్తించుచుండగా మృత్యుదేవతవలె, యమునివలె భయంకరాకారులై ఒకరిని మించి మఱియొకఱు మూర్ఛలేని విధమున ముష్టియుద్ధమును చేసిరి.

**విశేషాంశాలు :**

శ్రీనాథుని సంస్కృత ప్రౌఢి ఈపద్యం స్పష్టం. ఈ పద్యం గౌడీ రీతిలోసాగి ఓజోగుణంతో ఒప్పారుతుంది. రసం - వీరరసం సందర్భానికి తగినట్లు శార్దూల వృత్తాన్ని ఎన్నుకోవడం ఎంతో సముచితం.

**ఛందస్సు :**

| మ | స | జ | స | త | త | గ |
|---|---|---|---|---|---|---|
| U U U | I I U | I U I | I I U | U U I | U U I | U |
| ది ష్టాంతాం | త క ఘో | ర మూ ర్తు | ల యి సా | దృశ్యం బ | దృ శ్యంబు | గా |

ఈ పద్యంలో మ, స, జ, స, త, త, గ అనే గణాలు గలవు. యతిస్థానం 13 వ అక్షరం. (ది-దృ) కావున ఇది శార్దూలం.

16. అంతం జంద్ర కళాధరుండు నిజబాహాగాఢ పీడా పరి
శ్రాంతుండై యటఁ బాండుసూతి యెదురం బ్రత్యక్షమయ్యెం; గృపా
వంతుండై యహిరాజ హారములతో స్వర్వాహినీ వేణితో
దంతిత్వక్పరిధాన పల్లవముతో తామ్రజ్జటా పంక్తితోన్ ! (7-89)

**పరిచయం :**

ఈ పద్యం కవిసార్వభౌమ బిరుదాంచితుడైన శ్రీనాథ మహాకవి ప్రణీతంబైన హరవిలాసమనే కావ్యంలోని సప్తమాశ్వాసంలోని ప్రస్తుత పాఠ్యభాగమైన కిరాతార్జునీయములోనిది.

**సందర్భం :**

కిరీటి ధూర్జటి ఎదను పిడికిటి పోటున పొడిచిన పిమ్మట అర్జునునకు ఈశ్వరుడు సాక్షాత్కరించిన సందర్భంలో కవి వర్ణించే పద్యమిది.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| అంతన్ | : | అంతట |

| | | |
|---|---|---|
| చంద్రకళాధరుండు | : | చంద్రకళను ధరించినవాడు - ఈశ్వరుడు |
| నిజ | : | తనయొక్క |
| బాహా | : | బాహువులయొక్క |
| గాఢ | : | అధికమైన |
| పీడా | : | బాధచే |
| పరిశ్రాంతుండు + ఐ | : | అలసిపోయిన వాడై |
| అటన్ | : | అచ్చట (ఇంద్రకీల పర్వతంపైన) |
| అహిరాజహారములతోన్ | : | శ్రేష్ఠమైన సర్పహారాలతో |
| స్వర్వాహినీ | : | గంగతోగూడిన |
| వేణితో | : | జటాజూటంతో |
| దంతి | : | ఏనుగు యొక్క |
| త్వక్ | : | చర్మమనెడి |
| పరిధాన పల్లవముతో | : | పల్లవంలాంటి వస్త్రంతో |
| తామ్ర | : | ఎర్రనైన |
| జటా | : | జడలయొక్క |
| పంక్తితోన్ | : | వరుసతో |
| పాండుసూతి | : | పాండుకుమారుని యొక్క (అర్జునుని యొక్క) |
| ఎదురన్ | : | ఎదుట |
| కృపావంతుండై | : | దయగలవాడై |
| ప్రత్యక్షంబు + అయ్యెన్ | : | సాక్షాత్కరించాడు. |

**తాత్పర్యం :**

అంతట ఈశ్వరుడు తనభుజం యొక్క అధికమైన బాధతో అలసిపోయిన వాడై పాపసరులతో, గంగగల జటాజూటంతో, గజచర్మ వస్త్రంతో, ఎర్రని జటాసమూహంతో నింద్రకీలపర్వతంపై అర్జునుని ఎదుట దయగలవాడై సాక్షాత్కరించాడు.

**విశేషాంశాలు :**

ఈశ్వరుని సాక్షాత్కారం పతితలకే అవుతుందా అన్నట్లు పద్యరచనను గావించాడు శ్రీనాథుడు. హరుడు "నిజబాహాగాఢ పీడా పరిశ్రాంతుడు" అనడంవల్ల ఆయన విలాసానికి సంకేతం. అది భక్తునికి విజయం చేకూర్చే భగవానుని తాపత్రయం శ్రీనాథుని ఈశ్వరార్చనం.

**ఛందస్సు :**

| మ | స | జ | స | త | త | గ |
|---|---|---|---|---|---|---|
| U U U | I I U | I U I | I I U | U U I | U U I | U |
| దం తి త్వ | క్ప రిధా | న ప ల్ల | వ ము తో | తామ్ర జ్జ | టా పంక్తి | గా |

ఈ పద్యపాదంలో మ, స, జ, స, త, త, గ అనే గణాలు గలవు, యతిస్థానం 13 వ అక్షరం (దం - తా) కావున ఇది శార్దూలం.

**డా॥ శ్రిష్టి చంద్రమౌళి శర్మ, ఎం. ఏ., పిహెచ్.డి.**
రీడర్ & ప్రిన్సిపాల్
ఎస్.వి.కె.వి. కళాశాల, పొదిలి
ప్రకాశం జిల్లా.

మొదటి భాగము - ప్రాచీన సాహిత్యము

# కిరాతార్జునీయము - శ్రీనాథుడు

## (హరవిలాసము - సప్తమాశ్వాసము - 1-103 పద్యాలు)

## పాఠం - 9


1.9.0 సందర్భ సహిత వ్యాఖ్యలు :

1.9.1 శ్రీనాథుని కవిత్వం :

1.9.2 ప్రశ్నలు - సమాధానాలు :

1.9.3 రాదగిన ప్రశ్నలు :

1.9.4 ఆచూకీ గ్రంథాలు :


### 1.9.0 సందర్భ సహిత వ్యాఖ్యలు :

**1. పరమ నాస్తిక భావంబు పరిమళింప. (7-14)**

**పరిచయం :** ఈ వాక్యం కవిసార్వభౌమ బిరుదాంచితుడైన శ్రీనాథ మహాకవి ప్రణీతంబైన హరవిలాస మనే కావ్యంలోని సప్తమాశ్వాసంలోని ప్రస్తుత పాఠ్యభాగమైన కిరాతార్జునీయము లోనిది.

**సందర్భం :** ఇంద్రుని గూర్చి తపస్సుచేసే అర్జునునికడకు అతనిని పరీక్షించడానికి వృద్ధ బ్రాహ్మణ వేషంలో వచ్చిన వృద్ధశ్రవుండు మోరకుని చందాన నీర తారచూపు చూస్తూ అర్జునునితో పలికే సందర్భంలోనిది.

**వివరణ :** నాస్తికభావం అంటే భగవంతుడు లేడు అనే భావం. ఎవరిని గూర్చి తపస్సుచేస్తున్నాడో ఆతడే వచ్చి నాస్తిక భావంతో మాట్లాడుతున్నాడనడం ఒక వైచిత్రి. 'పరిమళింప' అనే ప్రయోగం రమ్యమైంది.

**2. చంకదుడ్డును శరణార్థియు ననెడునట్టి చందము (7-17)**

**పరిచయం :** ఈ వాక్యం కవిసార్వభౌమ బిరుదాంచితుడైన శ్రీనాథమహాకవి కృతమైన హరవిలాసమనే కావ్యంలోని సప్తమాశ్వాసంలోని ప్రస్తుత పాఠ్యభాగమైన కిరాతార్జునీయములోనిది.

**సందర్భం :**

తనను గూర్చి తపస్సుచేస్తున్న తనయుడైన అర్జునుని కడకు వచ్చిన దేవేంద్రుడు అతని శరచాపాలొకవైపు, శాంతి దాంతి పరిపాకమొకమైపు చూచి పల్కిన సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :** చంకలోదుడ్డు కర్ర ఉంచుకొని శరణు అన్నట్లుందని ఆ వాక్యార్థం. చంపుటకు కావలసిన ఆయుధాన్ని దగ్గరే ఉంచుకొని వేరొకరిని శరణువేడడం విపరీతం. అర్జునుడు శరచాపాలను ధరించి శాంతి దాంతి పరిపాకంతో తపస్సుచేయడమనేది చక్కటి సామ్యంతో వ్యక్త మొనర్చడం ఇందుగలదు. ఇది చక్కటి సామెత.

**3. వాఁడు నీకంటె నేమిట వాపిగలఁడు (7-22)**

**పరిచయం :** ఈ వాక్యం కవిసార్వభౌమ బిరుదాంచితుడైన శ్రీనాథమహాకవి నిర్మితమైన హరవిలాసమనే కావ్యంలోని సప్తమాశ్వాసంలోని ప్రస్తుత పాఠ్యభాగమైన కిరాతార్జునీయములోనిది.

**సందర్భం :** ఇంద్రుని గూర్చి తపస్సు చేస్తున్న అర్జునుని కడకు వృద్ధ బ్రాహ్మణ వేషంలో వచ్చిన ఇంద్రుడు ఇంద్రుని తక్కువ తనాన్ని అర్జునునితో చేప్పే సందర్భంలోనిది.

**వివరణ :** ఇంద్రుడు నీకంటె దేనిలో ఎక్కువ? అని దాని అర్థం. అహల్యాజారుడు, గరుడ విజితుడు, అహంకారపూరితుడు. అనౌచితీ పరుడు అని నిరూపించడానికి సాక్ష్యాలను చూపించి ఆతని తక్కువతనాన్ని చిత్రించి అర్జునుని ఆధిక్యాన్ని స్థాపిస్తున్నట్లు మాట్లాడడంలో తండ్రిపొందిన ఆనందం గర్భితం. పరీక్షించడానికనేది స్పష్టం.

**4. కందుకములు వోలె శిలలు గరువాఱంగన్ (7-45)**

**పరిచయం :** ఈ వాక్యం కవిసార్వభౌమ బిరుదాంకితుడైన శ్రీనాథమహాకవి ప్రణీతంబైన హరవిలాసమనే కావ్యంలోని సప్తమాశ్వాసంలోని ప్రస్తుత పాఠ్యభాగమైన కిరాతార్జునీయములోనిది.

**సందర్భం :** ఈశ్వరార్జునుల నడుమకు పంది పరుగెత్తిరాగా వర్ణించే సందర్భంలోనిదీవాక్యం.

**వివరణ :** "కొండ రాళ్ళు సైతం గుండ్రని బంతుల లాగా మీదికి తూలిపడుతూండగా'' అని దాని అర్థం. దీనివలన వరాహం యొక్క ఔద్ధత్యం ప్రకటితం.

**5. చీటంబున వేడ్క యెల్ల చెఱిచితి గదరా? (7-52)**

**పరిచయం :** ఈ వాక్యం కవిసార్వభౌమ బిరుదాంచితుడై శ్రీనాథ మహాకవి ప్రణీతంబైన హరవిలాసమనే కావ్యంలోని సప్తమాశ్వాసంలోని ప్రస్తుత పాఠ్యభాగమైన కిరాతార్జునీయములోనిది.

**సందర్భం :** ఈ మాటలు క్రీడాకిరాతుడు క్రీడితో అన్నవి. పందిని చంపుతానని నా భార్యతో పంతమాడి దాని వెనుక వస్తూండగా నీవు కొట్టావేరా! అని పలుకుతూ పై మాటలన్నాడు.

**వివరణ :** ప్రతిజ్ఞ భగ్నమైనందు వల్ల కలిగే చిరాకును వ్యక్తంచేస్తూ దానికి తగినట్లు శ్రీనాథుడా వాక్యాన్ని రచించాడు. వేడ్క - చెఱచుట మంచి పదాల ప్రయోగం.

**6. శాంతిపరులకు నేలరా సత్వహింస? (7-53)**

**పరిచయం :**ఈ వాక్యం కవిసార్వభౌమ బిరుదాంచితుడైన శ్రీనాథమహాకవి కృతమైన హరవిలాసమనే కావ్యంలోని సప్తమాశ్వాసంలోని ప్రస్తుత పాఠ్యభాగమైన కిరాతార్జునీయములోనిది.

**సందర్భం :** పంది నేసిన పార్థునితో పరమేశ్వరుడు పలికిన పల్కులివి. తపసివై ఉండి ధనుస్సు పట్టుకోవడం తగునా అని పై మాటలన్నాడు.

**వివరణ :** శాంతి, హింస అనేవి ఒకదానికి ఒకటి విరుద్ధమైనవి. తపస్వులు శాంతి స్వభావులు. దానికి విరుద్ధంగా ప్రవర్తించాడు అర్జునుడు. అందుకే మాయాకిరాతుడు ఆక్షేపించాడు. ఆ ఆక్షేపణ మిందు గమ్యమానం.

**7. సబముపయిన్నిగుడ్చిన నిశాత శిలీముఖ మెట్టి వెట్టిదో (7-55)**

**పరిచయం :** ఈ వాక్యం కవిసార్వభౌమ బిరుదాంచితుడైన శ్రీనాథమహాకవి నిర్మితంబైన హరవిలాసమనే కావ్యంలోని సప్తమాశ్వాసంలోని ప్రస్తు తపాఠ్యభాగమైన కిరాతార్జునీయములోనిది.

**సందర్భం :** వరాహంపై బాణప్రయోగంచేసిన పాండవేయునితో ఖండపరశువు అన్నమాటలివి. వేట పంతం అతిక్రమించావు. పరాటనికాయత చాపవల్లరీ నిబిడ శరాహతమైన వనేచర జంతువునేశావు అని పల్కి పై మాటలన్నాడు.

**విరణం :** శవంమీద వేసిన నీ బాణమెంత వెర్రిదోకదా! అని అర్థం. శవం మీద బాణం వేయడం హీనమని సూచించడానికి దాని వికృతరూపాన్ని ప్రయోగించాడు శ్రీనాథుడు. ఎట్టి వెర్రిదో అనడం వైచిత్రి.

**8. దాంభికంబు నీదు తబిసితనము** (7-62)

**పరిచయం :** ఈ వాక్యం కవిసార్వభౌమ బిరుదాంచితుడైన శ్రీనాథమహాకవి ప్రణీతంబైన హరవిలాసం అనే కావ్యంలోని సప్తమాశ్వాసంలోని ప్రస్తుతపాఠ్యభాగమైన కిరాతార్జునీయములోనిది.

**సందర్భం :** ధూర్జటి కిరీటితో పల్కిన పల్కులివి. నీవు నేను వేసిన పందినేసి వేట పంతం తప్పావు. తాటియంత విల్లు ధరించావు, నీలో గర్వరేఖ కన్పిస్తూంది. అని పలుకుతూ నీ మాటలన్నాడు

**వివరణ :** నీ తపస్విత్వం వట్టి కపటం అని దాని అర్థం. ప్రథమ సంయమి ఫల్గుణుని రెచ్చగొట్టుతూ పరీక్షించిన విధం స్పష్టమవుతుంది.

**9. వడకుంగుబ్బలి కుమారి వడవడ వడకెన్** (7-78)

**కవిపరిచయం :** ఈ వాక్యం కవిసార్వభౌముడైన శ్రీనాథమహాకవి నిర్మితంబైన హరవిలాసమనే కావ్యంలోని సప్తమాశ్వాసంలోని ప్రస్తు పాఠ్యభాగమైన కిరాతార్జునీయములోనిది.

**సందర్భం :** గాండీవంతో గాండీవి గంగాధరుని కొట్టినప్పుడు పార్వతి స్థితిని తెలియజేసే సందర్భంలోనిదీవాక్యం.

**వివరణ :** పార్వతి వడవడ వణికినది అని అర్థం "వడవడ వడకెన్" గాన సాభిప్రాయంగా పార్వతిని వడకుంగుబ్బలి కుమారి అని అన్నాడు శ్రీనాథుడు. డకారావృత్తికై 'వణకు'ను వడకుగా ప్రయోగించాడు.

**10. పెక్కుచందముల ద్రోహము చేసితి నేమిచేయుదున్?** (7-100)

**పరిచయం :** ఈ వాక్యం కవిసార్వభౌమ బిరుదాంచితుడైన శ్రీనాథ మహాకవి ప్రణీతంబైన హరవిలాసమనే కావ్యంలోని సప్తమాశ్వాసంలోని ప్రస్తుత పాఠ్యభాగమైన కిరాతార్జునీయములోనిది.

**సందర్భము :** తనకు సాక్షాత్కరించిన హరునితో నాడిన నరుని మాటలివి. ఈశ్వరా! కొండకిరాతుడవని అనుకొని ఎన్నో అనుచితమైనమాటలాడాను గాండివంతో మోదాను అని బాధపడుతూ అన్నమాటలు:

**వివరణ :** అనేకవిధాల ద్రోహంచేశాను. ఇంకేమి చేస్తే మంచిది? అని అర్థం. ఇందులో పశ్చాత్తాపం, పరమేశ్వరునిపై భక్తి గమ్యమానవుతున్నాయి.

## 1.9.1 శ్రీనాథుని కవితా రీతులు :

కవిసార్వభౌమ బిరుదాంకితుడైన శ్రీనాథ మహాకవి కవిత్రయం తరువాతి స్థానం ఆక్రమించిన కవిమూర్ధన్యుడు. తన కవితా రీతులను గూర్చి తానే చెప్పికొన్నట్లు ఆయన కావ్యాలలోని కొన్ని పద్యాలు సాక్ష్యమిస్తున్నాయి. కాశీఖండంలో ఇలా చెప్పుకొన్నాడు.

"వచియింతు వేములవాడ భీమన భంగి
    నుద్దండలీల నొక్కొక్కమాటు,
భాషింతు నన్నయభట్టు మార్గంబున
    నుభయవాక్ప్రౌఢి నొక్కొక్కమాటు,
వాక్రుత్తు తిక్కయజ్వప్రకారము రసా
    భ్యుచితబంధముగ నొక్కొక్కమాటు,

పరిఢవింతు ప్రబంధపరమేశ్వరుని రేవ
సూక్తివైచిత్రి నొక్కొక్కమాటు''

వేములవాడ భీమన లోని ఉద్దండ లీల, నన్నయభట్టు మార్గమైన ఉభయవాక్ప్రౌఢి, తిక్కన ప్రకారమైన రసాభ్యుచితబంధమూ, ఎఱ్ఱన విధమైన సూక్తివైచిత్రి, శ్రీనాథుని కవిత్వాంశాలుగా చెప్పవచ్చు, అంతేకాక భీమేశ్వరపురాణంలో ఇలా చెప్పుకొన్నాడు.

"హరచూడాహరిణాంకవక్రతయుఁ గాలాంతస్ఫురచ్చండికా
పరుషోద్గాఢపయోధరస్ఫుటతటీపర్యంతకాఠిన్యమున్
సరసత్వంబును సంభవించె ననఁగా సత్కావ్యముల్ దిక్కులం
జిరకాలంబు నటించుచుండుఁ గవిరాజీగేహరంగంబులన్.''

ఇది సత్కావ్యలక్షణమని శ్రీనాథుని అభిభాషణం. ఇందలి వక్రత కుంతకుని వక్రోక్తికి స్ఫోరకం. ఇందలి కాఠిన్యం ఉద్దండ లీల. సరసత్వమే రసాభ్యుచితబంధం.

భీమేశ్వర పురాణంలోనే ఆయన కవితారీతులను సూచించే మరో పద్యం కలదు.

"ప్రౌఢిఁ బరికింప సంస్కృతభాష యండ్రు
పలుకునుడికారమున నాంధ్రభాషయందు
రెవ్వ రేమన్న నండ్రుగా కేల కొఱఁత
నా కవిత్వంబు నిజము కర్ణాటభాష''

మొదటి పద్యంలోని ఉభయవాక్ప్రౌఢి ఈ పద్యంలోని సంస్కృత ప్రౌఢి, తెలుగు నుడికారమూను. మొత్తం మీద ఉభయవాక్ప్రౌఢి, రసాభ్యుచితబంధమూ, సూక్తివైచిత్రి శ్రీనాథుని ప్రధానమైన కవితారీతులుగా చెప్పవచ్చు.

**1. ఉభయవాక్ప్రౌఢి :**

సంస్కృత ప్రౌఢి, తెలుగు నుడికారాలే ఉభయవాక్ప్రౌఢి అనబడును.

(i) **సంస్కృతి ప్రౌఢి :** దీర్ఘ సమాసభూయిష్ఠ రచన సంస్కృత ప్రౌఢి. ఇలాంటి రచన హరవిలాసంలోని కిరాతార్జునీయములో అతిసుందరంగా వర్ణితం.

'జలధరనీలదేహమును ◌ఁజంద్రకళాయుగళీసమానదం
ష్ట్రలు భిదురోపమానముఖసంపుట పోత్రము పుల్ల మేచకో
త్పలదలవర్ణకర్ణములుఁ బాటలవర్తుల లోచనంబులుం
గలిగి కఠోరకంఠ ఘనఘర్ఘరఘట్టనఘోషజన్మ మై'.

శ్రీనాథుని సమాసరచన కేవల శబ్దాడంబరం మాత్రమే కాదు. సందర్భానుసారంగా సమాసఘటనముంటుంది. ఆ ఘటనచే ఘట్టం మూర్తి కడుతుంది. పై పద్యంలోని వరాహవర్ణన అలాంటిదే. శ్రీనాథుని సంస్కృత ప్రౌఢికి అనేక ఉదాహరణలను ఒసంగవచ్చును.
"కుర్కుర, ప్రకరోదంచితకంఠనాళకుహలీ బౌబౌ మహారావముల్''.
"గాండీవప్రవిముక్తనిష్ఠురమహాకాండ ప్రకాండంబులఁ.''
"మసృణస్నిగ్ధతరర్క్షుచర్మమయ కంథాభద్రపీఠుండు''.

(ii) **తెలుగు నుడికారం :**

"తెలుగు పదాలు, తెలుగు పలుకుబడులు, తెలుగు సామెతలు, జాతీయాలు సహజంగా, సందర్భోచితంగా తేజరిల్లేదే తెలుగు నుడికారం.'' శ్రీనాథునిలో తెలుగు నుడికార సంపదను అనంతముఖాలుగా చూడవచ్చు.

"మండెడుబలునారసమున
గుండియ పగులంగ నేసి కూల్చితి దీనిన్
వెండి ప్రయోజన మేదీ
రండాసుత! దీనిపై శరము నిగుడింపన్."
"మిక్కిలికను వెలికి నుఱికి మినుకుమినుకు మనన్".
"మోఱకునిచందమున నీఱుతాఱుచూపు"
"చక్కనివాఁడ వెంతయును జల్లనివాఁడవు"
"చంకదుడ్డను శరణార్థియు" (సామెత)
"చాలు నీవాంఛపాడుగాను"
"కన్నులనిప్పులు వెళ్ళఁగ్రాయు" (జాతీయము)
"చాఁపకట్టు" (జాతీయము)
"తబిసివి గానఁ జావునకుఁ దప్పితి"

"ఆగజ్జులాఁడు మోఱకంబున మొగ మడ్డంబు గదల్చి యీ యెడ్డిమాటలం బనిలేదు" మొదలైనవి ఉదాహరణలు.

శ్రీనాథుని పదాలు, పదబంధాలు పరమ రమణీయం. "చెండాడు", "చతికిలంబడి కూర్చుండి", "మత్తిల్లియాడు", "అత్తమిల్లు", "చల్లుకొనివచ్చు."

**2. రసాభ్యుచితబంధం :**

రసానుగుణమైన పదబంధమే రసాభ్యుచితబంధం. కాబట్టి శృంగారహాస్య కరణరసాలు ప్రసాద గుణంతో వైదర్భీ రీతితో సాగుతాయి. వీరరౌద్రబీభత్సభయానకాలు ఓజోగుణంతో గౌడీ రీతితో సాగుతాయి. సందర్భాన్ని బట్టి మాధురీగుణంలో పాంచాలీ రీతిలో సాగుతుంది. హరవిలాసంలోని కిరాతార్జునీయంలో అన్ని రసాలకు ఆస్కారం లేదు. కారణము అది ప్రధానంగా శివార్చనా పరమయినది. హరార్జునుల యుద్ధ ఘట్టంలో వీరం స్పష్టమవుతుంది.

నిష్టంకించి శశాంక శేఖరుఁడు గాండీవాయుధుండు న్భుజా
వష్టంభంబులు సిద్ధచారణులుఁ గైవారంబు గావింపఁగా
దిష్టాంతాంతకఘోరమూర్తు లయి సాదృశ్యం బదృశ్యంబుగా
ముష్టాముష్టి రణంబు చేసిరి యసన్మోహప్రకారంబులన్.

వీరరసానుగుణమైన ఓజోగుణము, గౌడీరీతితో ఒప్పారుతున్నది.

**సూక్తివైచిత్రి :**

ఇది కుంతకుని వక్రోక్తి సిద్ధాంతానికి ఉదాహరణ. రీతి, ధ్వని సిద్ధాంతాల సమన్వయమే వక్రోక్తి సిద్ధాంతం. కుంతకుని దృష్టిలో అర్థపరమైన వక్రతకన్న శబ్దపరమైన వక్రతను నిశితముగా సమీక్షించారు. అందులో కొన్ని అలంకారాలలో కలసిపోతాయి. వర్ణవిన్యాస వక్రత అట్టిదే. ఒకటి లేక రెండు వర్ణాలు తక్కువ వ్యవధానతో పునఃపునరావృత్తి గావించబడితే అది వర్ణవిన్యాస వక్రత అనబడుతుంది. ఇది వృత్త్యనుప్రాసాన్ని తలపిస్తుంది.

"కుంభికుంభవిదారణదారుణ కృపాణధారలు"
"చండగాండివతాడితఖండపరశు"

కుంతకుడు చెప్పిన వక్రతలలో లింగ వక్రత, పదపర్యాయ వక్రత, రూఢి వక్రత మొదలైనవి ముఖ్యమైనవి.

"వడకుంగుబ్బలి కుమారి వడవడవడకెన్"

ఇందు పదపర్యాయ వక్రత కలదు. అర్థపరిపోషకమైన పర్యాయాన్ని ప్రయోగించడమే పదపర్యాయ వక్రత అనబడుతుంది. వడవడ వడుకు పార్వతికి వడకుంగుబ్బలి కుమారి అను పర్యాయపదం వేసి అర్థపరిపుష్టిని చేకూర్చాడు శ్రీనాథుడు.

శ్రీనాథునిలో లింగ వక్రత, రూఢి వక్రతలు కూడా కనిపిస్తాయి. అన్యలింగ శబ్దాలను కూడా స్త్రీలింగీకరించి వ్రాస్తాడు. (కవిరాజీ గేహరంగంబులన్)

**ఆలంకారిక రచన :**

సందర్భానుగుణంగా కేవలం సౌందర్యసంపాదనార్థం గాక భావ పరిపోషణ కోసం శ్రీనాథుడు ఆలంకారిక రచన చేస్తాడు. శ్రీనాథుని అర్థాలంకారాలు రమణీయతరాలు :

శరధులు యుగాంతవేళా
శరధులునుం బోలె నయ్యె శరశూన్యంబుల్
సురపతిసూతికిఁ బరమే
శ్వరమాయాశక్తి నపుడు సమరాగ్రమునన్.

ఇందు శ్లేషానుప్రాణిత ఉపమాలంకారం కలదు. మొదటి పాదంలోని శరధులు అనే దానికి అమ్ము పొదులు అని అర్థం. రెండవ పదంలోని శరధులు అనుదానికి సముద్రాలు అని అర్థం. అమ్ముల పొదులు (ఉపమేయం) సముద్రాలు (ఉపమానం) పోలె శరశూన్యమయ్యాయట. శరమనగా బాణము, నీరు అని రెండర్థాలు.

"గాండీవంబునఁ బూన్చి వేయఁదొడఁ గెన్గాండీవి గంగాధరున్" గాండీవంతో కొట్టే అర్జునుని గాండీవి అని అనడంవల్ల అది పరికరాంకురాలంకారమైనది. "సాభిప్రాయే విశేష్యేతు భవేత్పరికరాంకుర:" అని దాని లక్షణం.

**భావచిత్రం :**

శ్రీనాథుడు తాను భావంలో ఊహించిన రూపాన్ని పదాలలో చిత్రిస్తాడు.
"కిరాతవేషధారి యగుపురారి యోంకారచాపంబు
నేల నిలువంబెట్టి తదీయశిఖరంబున నఱచెయి మోపి యొరగి
యొయారంపునిలుకడ నిలిచి వలకేల వాలమ్ము ద్రిప్పుచుఁ". ఇది చదువగానే ఈశ్వరుని కిరాత రూపం సాక్షాత్కరిస్తుంది.

**వర్ణనలు :**

శ్రీనాథుని వర్ణనలు మధుర రసార్ణవాలు. అర్జునుని అరుణోదయార్చనావసరాన కావించబడిన తత్కాలవర్ణన రమణీయం.

ప్రథమసంధ్యారాగపరిపాటి మిన్నేటి
కనకపంకజకోరకములు దెలుపఁ
గందువాఱి నమించుగచ్చుటద్దమువోలె
విధుమండలము కాంతి వీడుకొనఁగ
దరమైన వేఁబోకఁ దఱపి వెన్నలఁ గ్రోలి
దివిఁ జకోరములు మత్తిల్లి యాడ!

ఇందలి పదప్రయోగ వైచిత్రి, భావసౌందర్యం, నాన్యతోదర్శనీయం, అత్తమిల్లు వంటి పదాలు పెద్దనాదుల్ని ఆకర్షించాయి.

**పద్యశిల్పం :**

శ్రీనాథుని పద్యశిల్పం హృద్యం. ఏ సందర్భంలో ఏ పద్యాన్ని వ్రాయాలో, ఎత్తుగడ ఎట్లుండాలో ఎఱిగిన నేర్పరి. సీసపద్య రచనలో శ్రీనాథునిది అందెవేసిన చేయి.

"వికటపాటలజటామకుటికాభారంబు
కటికైనజుంజుఱు నెఱులు గాఁగఁ
జారుసుధాధామశకలావతంసంబు
పెడకొప్పుపై నుండుపీఁకె గాఁగ...."

పాదాంతంలో భావం పూర్తికావడం, యతిస్థానం దగ్గర పదం విరగడం శ్రీనాథుని సీసపద్యాలలోని ప్రధాన లక్షణం. అందులోని లయ అందరకు ఆదర్శమైనది.

శ్రీనాథుని పదాలు, పదబంధాలు మిక్కిలి రమణీయాలు. 'వాగ్వివాదము' వంటి విశేష ప్రయోగాలు శ్రీనాథుడు చాల చేశాడు. పెద్దనాదులు శ్రీనాథుని పద్యాలను అనుసరించడమే గాక పదబంధాలను కొల్లగొట్టారు. అనన్యప్రతిభాధౌరేయుడై, అఖండపాండితీవిభవుడై తాను కనకాభిషేకాన్ని పొందడమేగాక ఆంధ్రకవితా సరస్వతికి కవితామృతాభిషేకం చేసి తత్ప్రసాదాన్ని ఆంధ్ర రసజ్ఞులకు అందించిన కవిసార్వభౌముడు, ఈశ్వరార్చనకళాశీలుడు అయిన మహాకవి శ్రీనాథుడు.

**1.9.2. ప్రశ్నలు - సమాధానాలు :**

1. ఈశ్వరార్చన కళాశీలుడు శ్రీనాథుడని నిరూపించండి.

"బ్రాహ్మీదత్త వరప్రసాదుడ పురుప్రజ్ఞా విశేషోదయా
జిహ్మస్వాంతుడ వీశ్వరార్చనకళాశీలుండ వభ్యర్హిత
బ్రాహ్మాండాది మహాపురాణచయ తాత్పర్యార్థ నిర్ధారిత
బ్రహ్మజ్ఞాన కళానిధానమవు నీ భాగ్యంబు సామాన్యమే ?

అని మామిడి సింగనామాత్యుడు తనను సంభావించినట్లుగా శృంగార నైషధంలో శ్రీనాథుడు చెప్పుకొన్నాడు. దీనిని బట్టి శ్రీనాథుడు ఈశ్వరార్చన కళాశీలుడని వ్యక్తమవుతుంది. ఏ కవి రచనలోనైనా ఆ కవి యొక్క ఆత్మీయతా ముద్ర గోచరిస్తుంది. అట్లే ఈశ్వరార్చన కళాశీలత శ్రీనాథుని ఆత్మీయత.

ఈశ్వరార్చన కళాశీలుడు అనగా ఈశ్వరార్చన కళయే శీలంగా గలవాడని అర్థం. ఈశ్వరార్చనమనేది కళే! ఇక్కడ కళ అంటే దానికి విశేషమైన అర్థముంది. "ఆతిథేయులకు సత్క్రియాచార విధికళా సరణి" వంటి శ్రీనాథుని ప్రయోగాలను బట్టి చూడగా ధర్మశాస్త్ర ప్రకారం ఆచరించవలసి విధి 'కళ' యని తెలుస్తుంది. శ్రీనాథుని ఈశ్వరార్చన కూడా ఆగమశాస్త్రానుసారం జరిగింది. కాబట్టి అది కళ. "ఆగయోక్త ప్రకారమైన ఈశ్వరార్చనము శీలముగా కలవాడే ఈశ్వరార్చన కళాశీలుడు" (ఈశ్వరార్చన కళాశీలుడు - పుట 10) శ్రీనాథుడు అలాంటివాడు.

శ్రీనాథుని కావ్యాలలో పాత్రల పరంగా కనిపించే ఈశ్వరార్చన మంతా శ్రీనాథుని ఈశ్వరార్చనమే. ఆ విధంగా అతని ఆత్మీయత గోచరిస్తుంది. హరవిలాస కావ్యమాద్యంతమూ శ్రీనాథుని ఈశ్వరార్చకళాశీలతతో నిండి ఉంది. శ్రీనాథుని ఈశ్వరార్చన కళాశీలత అర్జునుని షట్కాల శివలింగార్చనంగా దర్శనమిస్తుంది.

ఈశ్వరార్చన కళాత్మకమైన వ్రతమే పాశుపత వ్రతం. కిరాతార్జునీయ ఘట్టంలో నర్జున షట్కాల శివలింగార్చనా క్రియాంతలలో "ఇట్లు పాశుపత దీక్షాధురంధరుండై కాలకంధరుం గుఱించి తపంబు సేయుచుండ" అని శ్రీనాథుడు రచించాడు. పాశుపతదీక్షాధురంధరుడనగా షట్కాల శివలింగార్చనాపరుడు అని తెలుస్తుంది. ఆ షట్కాల శివలింగార్చనయే ఈశ్వరార్చన కళ. అందుచేత ఈశ్వరార్చన కళాత్మకమైన వ్రతమే పాశుపతవ్రతమని చెప్పవచ్చు. అర్జునుడు పాశుపతదీక్షాధురంధరుడే.

పాపుపతవ్రతానికి ఎనిమిది అంగాలుంటాయి. వాటిని 'అష్టావరణము' లంటారని శైవాగమాలు తెలుపుతాయి. అందులో గురువు ముఖ్యుడు. పాశుపతవ్రత దీక్షిణ్యమానుడు తొలుత గురూపదేశం పొందవలసిఉంది. అది పొందనివాడికి సిద్ధిలేదు. అందుచేత అర్జునుడు గురూపదేశం పొందినట్లు శ్రీనాథుడు వ్రాశాడు "గురూపదేశ పదవీ పరిశుద్ధ సమర్చనావిధిన్" హరునర్జునుడు అర్చించాడు. కాని ఆ గురువెవరో శ్రీనాథుడు తెలుపలేదు. తండ్రి, గురువు పర్యాయ పదాలు. తండ్రి అయిన ఇంద్రుడు అర్జునునితో "పశుపతి గుఱించి తపంబుసేయుము

తత్ప్రసాదంబున నీకు జయం బయ్యెడుఁ బునర్దర్శనంబు కాఁగలయది పోయి వచ్చెద'' అని చెప్పి అంతర్థానమవుతాడు. తండ్రి చెప్పిన మాటలు తప్పక అప్పుడర్జునుడు'' అతిఘోరవీరతపము'' ఆచరించాడు. అతిఘోరతపస్సు పాశుపతదీక్షతో అతిఘోరవీరతపమవుతుంది. కాబట్టి అతి ఘోరవీర తపమంటే పాశుపతవ్రతదీక్షతో షట్కాల శివలింగార్చనమే. ఇంద్రుడు "పశుపతిని గూర్చితపము చేయవలసిన''దని చెప్పెనే గాని దీక్షనొసంగినట్లు శ్రీనాథుడు వ్రాయలేదు. అందుచే అది "శ్రీనాథుని గురూపదేశమే'' (ఈశ్వరార్చనకళాశీలుడు - పుట 15) అని శ్రీ కోర్లపాటి శ్రీరామమూర్తిగారు భావించారు.

గురుసంస్కృతార్థుడైన శివభక్తుడు శివలింగాన్నే పూజించవలసి ఉంది. అర్జునుడు చేసినది షట్కాల శివలింగార్చనమేకదా! కాబట్టి "శివలింగార్చన మెందువోయెడు'' బాహువిక్రమము చూపుమని మాయాకిరాతుడు అర్జునునితో అన్నట్లు శ్రీనాథుడు వ్రాశాడు. శివలింగార్చనం చేసే వాడికి కొన్ని బాహ్య చిహ్నాలు, కొన్ని అంతర చిహ్నాలు ఉంటాయి. బాహ్యచిహ్నాలలో ఒకటి భస్మధారణ రెండవది రుద్రాక్షధారణ. ఈ రెండూ అర్జునుడాచరించాడు. "భసితోద్ధూళిత నిర్మలావయవు'' డైనాడు. మంత్రపూర్వకంగ ఒడలంతయు పొడి విభూతిని పూసుకోవడం ఉద్ధూళనము. ఇది గూడాచేశాడు అర్జునుడు. అట్లే "అమలరుద్రాక్షధారణము'' నాచరించాడు.

ఈ క్రమమంతా తెలిసిన ఈశ్వరార్చన కళాశీలుడు, కాబట్టి శ్రీనాథుడు ఆ క్రమాన్ని తప్పక తన పాత్రగా మలచిన అర్జునునిలో పొందుపరచాడు. పాశుపత దీక్షారంభ పద్యంలోనే భస్మోద్ధూళనం గావించాడు.

భసితోద్ధూళిత నిర్మలావయవుడున్ పంచాక్షరీ సంతతా
భ్యసన వ్యాప్తి పరాయణుండును శివధ్యానాను సంధాతయున్
మసృణస్నిగ్ధ తరక్షుచర్మమయ కంథాభద్ర పీఠుండునై
యసమస్థేమఁ గిరీటి పాశుపత దీక్షారంభముం గైకొనెన్.

పాశుపత దీక్షను గైకొని అర్జునుడు షట్కాల శివలింగార్చనానికి బూనుకొన్నాడు. షట్కాల శివలింగార్చనం చేయడానికి ముందుగా అఘమర్షణస్నానం చేయవలసి ఉంది. ఇదియంతా శ్రీనాథుని నిత్యకృత్యమై ఉంటుంది. అర్జునునిచేత గూడ అఘమర్షణ స్నానం చేయించాడు. అతడు ఇంద్రుని గూర్చి తపస్సుచేసే సమయంలో అఘమర్షణ స్నానం ఆచరిస్తాడని శ్రీనాథుడు పేర్కొన్నాడు.

"పతయాళు నిర్ఝరాంభః ప్రవాహంబున
నఘమర్షణస్నాన మాచరించు'' అని.

అఘమర్షణ స్నానమైన తరువాత చేయవలసింది అరుణోదయార్చన. అర్జునుడు చేసిన అరుణోదయకాల హరార్చనను ఇట్లు శ్రీనాథుడభివర్ణించాడు.

"ప్రథమసంధ్యారాగ పరిపాటి మిన్నేటి
కనకపంకజ కోరకములు దెలుపఁ
గందువాటిన మించుఁగంచుటద్దము వోలె
విధుమండలము కాంతి వీడుకొనగ
దరమైన వేబోక తఱపి వెన్నెలఁగ్రోలి
దివిఁ జకోరములు మత్తిల్లి యాడ
మందరాచలకూట మధ్యభాగంబునఁ
గృత్తికానక్షత్ర మత్తమిల్ల
మృదులభస్మరజశ్శయ్యమేలుకాంచి
యమల రుద్రాక్షధారణం బాచరించి

యర్జునుడు పర్ణశాలికాభ్యంతరమున
హరునకొనరించు నరుణోదయార్చనంబు''

ఇందు సీసభాగం అరుణోదయ వర్ణన; తేటగీతి భాగం అర్చనా వర్ణన. పర్ణశాల లోపల అరుణోదయార్చనం చేశాడు.

**సూర్యోదయార్చన :**

కపికేతుఁ డింద్రకీల
ప్రపాత పతయాళు నిర్ఘర స్నాతుండై
యుపచార విధుల నన్నిటఁ
దపనోదయ వేళ వ్యాళధరు పూజించున్.

తపనోదయమంటే సూర్యోదయం. ఆ వేళ "ఉపచార విధుల నన్నిట'' పూజిస్తాడు. ఇవి "షోడశోపచారాల్లా షట్త్రింశదుపచారములా! కారణోత్తరాగమున వీటికి మించిన ఉపచారములు గలవనియు అందుచే ఇది మహాపూజ'' అని కొర్లపాటి వారి అభిప్రాయం.

**సంగవకాలార్చన :**

అవధానంబునఁ బాకశాసన సుతుండర్ధేందుకోటీరు సం
గవకాలంబునఁ బూజసేయు హిమవాః కర్పూర కస్తూరికా
ద్రవకాలాగురు గంధసార సురభిద్రవ్యంబులం బూవులన్
లవలీ సర్జరసాగురు ప్రముఖ నానాధూపధూమంబులన్

ఇందు ధూపధూమాలతో పూజించడం జరిగింది. ఇది ఆహ్నిక విధానం. సంగవకాలమంటే'' సూర్యోదయాత్ప్రభృతి ఏడు గడియలకాలము''

**మధ్యాహ్న వేళార్చన :**

పంచబ్రహ్మషడంగబీజ సహిత ప్రాసాద పంచాక్షరీ
చంచన్మంత్ర పరంపరా పరమ నిష్ణాతత్పరత్వంబునన్
మంచుంగొండ యనుంగు ఁబెండ్లి కొడుకున్ మధ్యాహ్న కాలంబు సే
వించున్ నిర్జరరాజ సూనుడు మనోవీధీ సదాధ్యాసితన్.

పంచబ్రహ్మమంత్రాలు, షడంగబీజాలు, ప్రాసాదమంత్రాలు మొదలైన పాశుపతవ్రత మంత్రాల కన్నింటికి మూల మంత్రమైంది పంచాక్షరీ మంత్రం. అట్టి పంచాక్షరీ మంత్ర క్రమంలోని పరమ నిష్ణాతత్పరత్వంతో మధ్యాహ్నవేళ పూజిస్తారు. ఇదంతా ఈశ్వరార్చన కళాశీలుడైన శ్రీనాథునిదే. అర్జునుని ద్వారా వ్యక్తం చేశాడు.ఇది అర్జునుడు చేసిన మధ్యాహ్నవేళార్చన.

**సాయంసమయార్చన :**

వైయాఘ్రాజిన ఖండమధ్యమున లేవన్ బద్ధ పద్మాసనుం
డాయింద్రాత్మజు డింద్రకీల శిఖరీంద్రారూఢ బిల్వద్రుమ
చ్ఛాయా నిర్మల చంద్రకాంతమణి పాషాణ ప్రదేశంబునన్
సాయంకాలము పూజసేయు నభవున్ సంధ్యానటున్ ధూర్జటిన్.

అర్జునుడు పద్మాసనం వైచుకొని బిల్వద్రుమచ్ఛాయలో చంద్రకాంతమణి వేదికపై సాయంసంధ్యలో సంధ్యానటుడైన ధూర్జటిని పూజించాడు.

**అర్ధనిశాసమయార్చన :**

అంచితభక్తితో శివు నర్ధనిశా సమయంబునందు సే
వించు గురూపదేశ పదవీ పరిశుద్ధ సమర్చనా విధిన్

గాంచనకోరకంబుల శుకప్రసవంబులఁ గొండ గోగులన్
గాంచన కందరా ముఖగృహంబులఁ బార్థుడు సంస్కృతార్థుడై.

గురూపదేశ పదవీ పరిశుద్ధ సమర్చనావిధి శ్రీనాథునదే. సంపంగి మొగ్గలు, దిరిసెన పువ్వులు, కొండగోగులు ఈశ్వరార్చనకు శాస్త్రసమ్మతాలే. ఈశ్వరార్చన కళాశీలునకు శాస్త్రజ్ఞానం కరతాలామలకం. అంచితభక్తితో అర్థ నిశాసమయాన పూజించడం ఈశ్వరార్చన కళాశీలునకు నిరంతరాభ్యాసమైన విషయమే.

ఇట్లర్చించిన అర్జునునకు ఈశ్వరుడు కిరాతవేషంలో సమీపించాడు. ఆ వేషం పరమశివునకు తనంత తాను సిద్ధించింది.

"వికట పాటల జటా మకుటికాభారంబు
కఱకైన జుంజురు నెఱులు గాఁగఁ
జారు సుధాధామ శకలావతంసంబు
పెడకొప్పపైనుండు పీకె కాగ
ఘనలలాటంబున కనుపట్టు కనుచిచ్చు
గైరికద్రవ తిలకంబు గాఁగ
భుజమధ్యమునగ్రాలు భుజగహారంబులు
గురిజపూసల గుబ్బ సరులుగాఁగ
శంకరుండు గిరాత వేషంబు దాల్చి
యగజ చెంచెతయైతోడ నరుగుదేరఁ
బాణినోంకార దివ్యచాపము ధరించి
వచ్చె విప్వచ్చు వరతపోవనము కడకు''.
ఈశ్వరార్చన కళాశీలునకే ఈ రచన సాధ్యం.

చివరకు అసలు రూపంతో ప్రత్యక్షమైన శివుని అర్జునుడు స్తోత్రము చేశాడు. శ్రీనాథుని ఆత్మీయతాముద్రయే ఆ అర్జునస్తోత్రం. అర్జునుడు చేసిన ఈశ్వరార్చనంతా శ్రీనాథుడాచరించినదే. శ్రీనాథుడు ఈశ్వరార్చన కళాశీలుడు.

2. అర్జునుడు ఇంద్రుని గూర్చి చేసిన తపోవిధానాన్ని తెలుపండి.
(సమాధానం : పాఠం 8: 1:8.1 పాఠ్యభాగవివరణలోని అర్జునుడు ఇంద్రుని గూర్చి తపస్సు చేసిన విధం.)

3. అర్జునుడు ఈశ్వరుని గూర్చి చేసిన తపస్సు సోదాహరణంగా వివరించండి.
(సమాధానం : పాఠం 8 : 1.8.1 పాఠ్యభాగ వివరణలోని అర్జునుడు ఈశ్వరుని గూర్చి చేసిన తపస్సు - పాశుపతదీక్ష ; షట్కాల లింగార్చన.)

4. కిరాతార్జునుల యుద్ధాన్ని వర్ణించండి.
(సమాధానం : పాఠం 8 : 1.8.1 పాఠ్యభాగ వివరణలోని కిరాతార్జునులయుద్ధం - కిరాతార్జునుల మల్లయుద్ధం)

5. అర్జునునకు ఈశ్వరుడు ప్రత్యక్షమై అనుగ్రహించిన విధం వివరించండి.
(సమాధానం : పాఠం 8 : 1.8.1 పాఠ్యభాగ వివరణలోని కిరాతార్జునుల యుద్ధం, మల్లయుద్ధం - అనే అంశాలను సంగ్రహంగా తెలిపి - ఈశ్వర సాక్షాత్కారం, అర్జునుడు చేసిన శివస్తుతి, వరప్రదానం - వీటిని వివరించండి).

### 1.9.3 రాదగిన ప్రశ్నలు :

1. శ్రీనాథుని కవితారీతులను వివరించండి.
2. ఈశ్వరార్చన కళాశీలుడు శ్రీనాథుడనే అంశాన్ని నిరూపించండి.

(లేదా)

శ్రీనాథుని ఆత్మీయత

(లేదా)

అర్జునుని పాశుపత దీక్ష

(లేదా)

అర్జునుడొనర్చిన షట్కాల శివలింగార్చన.

3. అర్జునుడింద్రుని గూర్చి కావించిన తపస్సు
4. అర్జునుడీశ్వరుని గూర్చి కావించిన తపస్సు
5. పరమేశ్వరుడు పార్థుని అనుగ్రహించిన విధం.
6. క్రీడి క్రీడాకిరాతుల యుద్ధక్రీడ.
7. కిరాతార్జునీయములో కాననగు హరవిలాసం.

### 1.9.4. ఆధార గ్రంథాలు :


| | | |
|---|---|---|
| 1. ఆంధ్ర సాహిత్య చరిత్ర | : | లక్ష్మీకాంతం, పింగళి |
| 2. ఆంధ్ర సాహిత్య సమీక్ష | : | నాగయ్య, జి. |
| 3. ఈశ్వరార్చన కళాశీలుడు | : | శ్రీరామమూర్తి, కొర్లపాటి |
| 4. చంద్రాలోక సమున్మేషము | : | స్ఫూర్తిశ్రీ, |
| 5. తెలుగు సాహిత్య చరిత్ర | : | శ్రీరామమూర్తి, కొర్లపాటి |
| 6. సమగ్రాంధ్ర సాహిత్యము | : | ఆరుద్ర |
| 7. శ్రీనాథుడు | : | శ్రీరామమూర్తి, కొర్లపాట |



**డా॥ శ్రేష్ఠి చంద్రమౌళి శర్మ,** ఎం. ఏ., పిహెచ్.డి.

రీడర్ & ప్రిన్సిపాల్

ఎస్.వి.కె.వి. కళాశాల, పొదిలి

ప్రకాశం జిల్లా.

మొదటి భాగము - ప్రాచీన పద్యభాగము

# శుక్తిమతీ కోలాహలుల కథ

## రామరాజభూషణుడు

(వసుచరిత్ర - ద్వితీయాశ్వాసం 102-157 పర్వాలు)

## పాఠం-10

**1.10.0 : పరిచయం**

**1.10.1 : పాఠ్యభాగ వివరణ**

**1.10.2 : సమగ్ర వ్యాఖ్యలు**

### 1.10.0 : పరిచయం :

శుక్తిమతీ కోలాహలుల కథ అనే పాఠ్యభాగం రామరాజభూషణుడు రచించిన వసుచరిత్రలోని ద్వితీయాశ్వాసం నుంచి గ్రహించబడింది.

రామరాజభూషణుడు 16వ శతాబ్ది (క్రీ.శ. 1510-1580) లోనివాడు. ఇతని ఇంటిపేరు 'ప్రబంధాంకము' వారు. రామరాజభూషణడన్నది ఈ కవి బిరుదనామమే తప్ప పెట్టుపేరు కాదు. శ్రీకృష్ణదేవరాయల అనంతరం విజయనగర సామ్రాజ్యానికి అధినేతగా ఉన్న అళియరామరాజు ఆస్థానానికి భూషణమైన ఇతడు రామరాజభూషణుడయ్యాడు. ఇతని నిజనామధేయం మూర్తి. భట్టుకులానికి చెందినవాడు కనుక భట్టుమూర్తి అని వ్యవహరించారు. ఇతని తాత తిమ్మరాజు. ముత్తాత సింగరాజు. భట్టుమూర్తి, రామరాజ భూషణుడు వేర్వేరని ఆంధ్రసాహిత్య ప్రపంచంలో ఒకప్పుడు చర్చలు కొనసాగి, చివరకు ఇరువురు ఒక్కరే అని విమర్శకులు తేల్చిచెప్పారు. రామరాజభూషణుడు అష్టదిగ్గజాల్లో ఉన్నాడనటానికి చారిత్రక ఆధారాలు లేవు. ఇతడు పెద్దన అవసానదశలో ప్రసిద్ధుడయ్యాడని చెప్పవచ్చు.

ఈ మహాకవి రచించిన గ్రంథాలు మూడు :

1. నరసభూపాలీయం అనే నామాంతరంగల కావ్యాలంకార సంగ్రహం.
2. వసుచరిత్ర
3. హరిశ్చంద్రనలో పాఖ్యానం.

**1. నరసభూపాలీయం:-** కావ్యాలంకార సంగ్రహమనే ఈ గ్రంథం లక్షణ గ్రంథం. ఇది రామరాజభూషణుని ప్రథమ కావ్యం. అలంకార శాస్త్రం. దీనిని అతడు అళియరామరాజు మేనల్లుడైన ఓబయనరసరాజునకు అంకితమిచ్చాడు. కావ్యాలంకార సంగ్రహం విద్యానాథుని ప్రతాపరుద్ర యశోభూషణానికి ప్రతిబింబరూపం. నరసభూపాల నామాంకితమైన లక్ష్యాలతో ఈ ఆంధ్ర లక్షణ కావ్యం కూర్చబడింది.

**2. వసుచరిత్ర:-** శ్లేషైకతానుడు, సంగీతకళా రహస్యనిధిఅయిన రామరాజభూషణునకు ఘనతర కీర్తి సంపాదించి పెట్టిన కావ్యం వసుచరిత్రయే. దీని కృతిపతి శ్రీకృష్ణదేవరాయల అల్లుడైన అళియరామరాజు తమ్ముడు తిరుమల దేవరాయలు. క్రీ.శ. 1570 లో జరిగిన పెనుగొండ యుద్ధం వసుచరిత్రలో వర్ణింపబడటంచేత ఈ మహాప్రబంధం క్రీ.శ. 1570 తర్వాత రచింపబడిందని విమర్శకులు నిర్ణయించారు.

వసుచరిత్ర శ్రీకృష్ణదేవరాయల యుగంలో ఆంధ్రవాఙ్మయమందు వెలసిన మహాకావ్యం. ఆంధ్ర పంచకావ్యాలలో ప్రౌఢిమకు ఆముక్తమాల్యద ఒకవైపు, వసుచరిత్ర ఒకవైపు ప్రసిద్ధికెక్కాయి. ఆంధ్ర మహాప్రబంధరచనా ప్రక్రియకు శిఖరాయమాణస్థితి ఈ కావ్యం.

వసుచరిత్ర ఇతి వృత్తానికి మాతృక మహాభారత కథయే. ఆదిపర్వంలోని స్వల్పమైన ఉపరిచరవసు వృత్తాంతాన్ని రామరాజభూషణుడు శ్లేష కవితా వైభవంతో ఆరాశ్వాసాల ప్రబంధంగా తీర్చిదిద్దాడు.

**3. హరిశ్చంద్రనలో పాఖ్యానం:-** రామరాజభూషణుడు హరిశ్చంద్రనలోపాఖ్యానాన్ని రచించి శ్రీరామచంద్రున కంకితం గావించాడు. హరిశ్చంద్రనల కథలను జోడించి హరిశ్చంద్రనలో పాఖ్యానమనే పేరుతో ఈ ద్వ్యర్థి ప్రబంధాన్ని రామరాజభూషణుడు రచించాడు. హరిశ్చంద్రనలోపాఖ్యానంలోని నలకథ చాలవరకు సంస్కృత మహాభారతాన్ని, శ్రీహర్షుని నైషధకావ్యాన్ని అనుసరించి రచింపబడింది. మార్కండేయపురాణ, దేవభాగవతాల్లోని హరిశ్చంద్ర కథయే హరిశ్చంద్రనలోపాఖ్యాన ప్రబంధస్థమైన హరిశ్చంద్ర కథకు మాతృక.

## 1.10.1 పాఠ్యభాగ వివరణ:-

**మూలకథ:-**

వసుచరిత్రకు మాతృక అయిన మహాభారతంలోని ఆదిపర్వంలో వంశావతరణ పర్వమందు ఉపరిచరవసు వృత్తాంత మీ విధంగా ఉన్నది. ఉపరిచరుడు సత్యవతి తండ్రి. అందువల్ల ఈ కథ మహాభారతంలో ప్రధానమైంది.

ఉపరిచర వసువు తపస్సు చేస్తూ ఉండగా ఇంద్రుడు వచ్చి అతనికి చేదిరాజ్యాన్ని పాలింపుమని చెప్పాడు. అతనికొక దివ్యవిమానాన్ని, వేణుయష్టిని ప్రసాదించాడు. వసురాజు కృతజ్ఞతా పూర్వకంగా ఇంద్రపూజను తనరాజ్యంలో ప్రతిష్ఠింపచేశాడు. పురోపవాహినియైన శుక్తిమతీనదిని కోలాహల పర్వతం నిరోధించగా వసురాజు పాదతాడనంతో కోలాహల పర్వతాన్ని నిగ్రహించాడు. రాజువలన కలిగిన విమోక్షణానికి శుక్తిమతి సంతోషించి గిరిక అనే తన కుమార్తె నాతని భార్యగా, తన కుమారుని అతని సేనానిగా సమర్పించింది.

మహాభారతమందలి ఈ కథను రామరాజభూషణుడు తన ప్రబంధాని కనుకూలంగా మార్చుకొని ఆరాశ్వాసాలలో తీర్చిదిద్దాడు.

వసుచరిత్ర కావ్యప్రధానేతివృత్తం గిరికను వసురాజు వివాహమాడటం. సమస్త కథ తదభిముఖంగా తీర్చిదిద్దబడింది. మహాభారతమందలి కథలో రామరాజభూషణుడు ఎక్కువగా మార్పులు చేయలేదు. రెండు కథలలో ఇంద్రుడు ప్రాధాన్యం వహించాడు.

రామరాజభూషణుడు స్వల్పకథనే ఒక నాటకం వలె రమ్యంగా తీర్చిదిద్దాడు. మొట్టమొదట చెప్పవలసిన శుక్తిమతీ కోలాహల వృత్తాంతాన్ని గిరికా ప్రియసఖియైన మంజువాణిచే చెప్పించాడు. ప్రథమాశ్వాసంలో వసురాజు బయలుదేరింది మొదలు వివాహానంతరం నగరానికి తిరిగి వచ్చినదాక కథ మొత్తం నదీ తీరంలోనే, కోలాహల పర్వతం మీదనే జరుగుతుంది.

గిరికా వసురాజుల ప్రణయోదంతం ప్రధానమైన వసుచరిత్రలో శుక్తిమతీ కోలాహలుల కథ ఒక ఉపాఖ్యానం. ఒక మనోహర సందర్భం. ఇది కావ్యనాయిక గిరికా జన్మగాథ. కాళిదాసుని అభిజ్ఞాన శాకుంతల మార్గాన్ననుసరించి రామరాజభూషణుడు మంజువాణిచే ప్రౌఢంగా నర్మసచివునకు చెప్పించాడు. అది ప్రచ్ఛన్నుడైన వసురాజు వినేట్లు సందర్భపరిచాడు.

విలాసినీ మణియైన మంజువాణి గిరికా ప్రియసఖి. ఆమె ద్వితీయాశ్వాసంలో కథాఘట్టంలో ప్రవేశిస్తుంది. వసురాజు నర్మసచివుడు మాయాతపస్వి వేషం ధరించి గిరికా మణిమందిరాన్ని ప్రవేశిస్తాడు. అక్కడ సంభాషణావసరాన్ని బట్టి మంజువాణి అతనికి గిరికాజన్మ వృత్తాంతాన్ని చెప్పటం ప్రారంభించింది.

“ఓ మునీంద్రా! ఈ రమణీలలాను మీరూహించినట్లు నదీ పుత్రికయే. పర్వతరాజపుత్రికయే. ఈ కన్యక జన్మప్రకారాన్ని విన్నవిస్తాను.

వసురాజు అనే నృపాలుడున్నాడు. పరాక్రమ సంపదచే ఇంద్రుని మన్ననలందినవాడు. సమస్త సంపదలకు ఆటపట్టుగా విలసిల్లు అదిష్ఠాన నగరం అతని రాజధాని. స్వర్గాన్ని ఇంద్రుడు పాలించినట్లుగా వసురాజు భూమండలాన్ని పాలిస్తున్నాడు.

అధిష్ఠానపురంలోని ఉద్యానవనాల్లో పూదోటలు, చెఱకుతోటలు పెంచబడుతున్నాయి. అధిష్ఠానపురమనే పేరు గల రాజధాని అనే స్త్రీ కంఠసీమలో ప్రకాశించు ముత్యాలహారమో అన్నట్లుగా జలమాధుర్యంచేత, ముత్యాలచేత ప్రకాశిస్తున్న శుక్తిమతీ నది పట్టణప్రాంతంలో ప్రవహిస్తున్నది.

ఆ నదీ జలం నీటిపక్షులకు సేవాపాత్రమౌతున్నది. అందలి మడుగులు నిర్మలమై, పవిత్రమై, లోతుకలవిగా ఉన్నాయి. జలప్రవాహలన్నీ సమస్త భూమండలానికి ముక్కారు పంటలు లభింపజేస్తున్నాయి. నదిలోని శంఖాలు ముత్యాముల పుట్టుకకు ఆటపట్టులు. ఆ శుక్తిమతీ నది యొక్క ఘనత కొనియాడ వశమా?

ఓ యతీంద్రా! నర్మద, బాహుద, వేత్రవతి, సరస్వతీ నదులు ఆమెకు పరిచర్యలు చేస్తూ వెంటరాగా ఆ శుక్తిమతీ నది ప్రతిదినం బ్రహ్మసభకు పోయి వస్తూండేది. ఈ విధంగా శుక్తిమతీ నది బ్రహ్మకొలువునకేగి తిరిగి వస్తుండగా కోలాహలుడనే పర్వతరాజు ఎదురయ్యాడు.

దేవతానివాసంచేత ప్రకాశిస్తున్న ఎత్తైన శిఖర ప్రదేశాలతో ఒప్పుతున్నవాడును, దట్టంగా పెరిగిన కర్పూరపు అరటిచెట్ల యొక్క, అలకవృక్షాల యొక్క పరిమళాలు కలిగినవాడును, జవ్వాదిచేత నిండిన గండశిలలు కలవాడును, పద్మరాగమణిమయమైన సానువులు కలవాడును, నక్షత్ర సమూహానికి చేరువలో ఉన్నవాడును, హరిచందన వృక్షచ్ఛాయచేత ఒప్పుచున్నవాడును, కనకమయమైన నితంబప్రదేశం కలవాడును, రత్నమయమైన పర్వతావరణం కలవాడును, అమూల్యమైన రత్నకాంతులతో ఒప్పు శిఖరాగ్రభాగాలచేత ఆకాశాన్ని చిత్రవర్ణాలతో నింపగలిగినవాడును అయిన కోలాహలుడనే పేరుగల పర్వతరాజు పురుష రూపంతో బ్రహ్మదేవుని సభామందిరానికి వెడలుచున్నవాడై స్త్రీరూపధారిణియైన శుక్తిమతికి ఆ సమయంలో ఎదురుపడ్డాడు.

ఐశ్వర్యవంతుడును, హిమవంతుని కుమారుడు, పార్వతీ సహోదరుడు, శంకరుని బావమరది అయిన కోలాహలుడు మిన్నుముట్టి వస్తూండగా, ఆ కోలాహలుని సేవించి శుక్తిమతీనది వినయంతో ఓరగా తొలగిపోయింది. శుక్తిమతీనది స్త్రీ సహజమైన తన సుందరావయవాలచేత కోలాహలుని నిలుకడను తొలగించి మోహితుని గావించినది.

మునీంద్రా! ఆ శుక్తిమతి కోలాహలుని దిట్టతనాన్నంతటిని లోగొనిపోవగా కోలాహలుడా చెలువ సౌందర్యాన్ని లోలోపల తలంచుచు వెడలి పోయాడు. కోలాహలుడు వలపుచే రెప్పలార్పక తనను చూచినప్పటినుంచి శుక్తిమతీనది కూడ చింతా మోహాది మనోవికారాలకు లోనైంది.

కోలాహలుడు శుక్తిమతిని కాంచినప్పటి నుంచి వలపునకులోనై మన్మథాగ్నిచే తపింపబడుచు, కన్నీరు విడుచుచు మాటిమాటికి శుక్తిమతిని తలచుకొంటూ గగుర్పాటు కలవాడయ్యాడు.

కోలాహలుడు శుక్తిమతిని తలచిన మాత్రాననే మన్మథావిర్భావం కలవాడయ్యాడు. ఆ శుక్తిమతి మహిమ లెట్టివో! మన్మథుని పద్మరూపబాణ పరంపర వజ్రాయుధంవలె కోలాహల పర్వత మర్మభేదనం చేయడంలో ఆశ్చర్యమేమున్నది? ఆ బాణాలు నదీ ప్రవాహాల్లో ఉద్భవించినవే కదా!

శుక్తిమతీ నదీ విషయకమైన కోలాహల పర్వతం యొక్క విరహతాపానలం శైత్యప్రదమైన కర్పూరం, పన్నీరు, చంద్రకాంత శిలాజలప్రవాహం, చందనం మొదలైన వాటిచేత శమింపక, శుక్తిమతీ నదీజలాన్ని త్రాగిన మేఘం ఆ జలాన్ని కోలాహలునిపై వర్షింపగా ఆ అమృతధారచేత కొంత ఉపశమించింది.

కోలాహలుడు మన్మథోద్దీపనకరమైన కోకిల, గోరువంక, నెమలి మొదలైన పక్షుల కలకలారావం వల్ల ధైర్యం కోల్పోయి తమ నిలుపజాలక మన్మథతాపం శమించుటకె శుక్తిమతీ నదీ రసోర్మికలలో తేలియాడాలని, ఆమెను పొందాలని నిశ్చయించినవాడై వివిధభూషణాల నలంకరించుకొని కోలాహలుడొకనాడు శుక్తిమతిని సమీపించాడు.

కోలాహలుడు సమీపానికి రాగా శుక్తిమతీ నది ఎదురేగి తరంగరూపమైన చేతులలో పద్మసమూహమనే రత్న పాత్రలను ధరించి, పుప్పొడి అనే చందనాన్ని, కింజల్కాలనే అక్షతలను నింపి, అర్ఘ్య పాద్యాది విధులతో పూజించింది.

ఆ సమయంలో పుణ్యనదియైన ఆ శుక్తిమతి పర్వత శ్రేష్ఠుడైన కోలాహలునితో ఈ రీతిగా పలికింది.

"ఓ కోలాహలేంద్రా! నీవు మిక్కిలి గొప్పవాడవు. నేనొసంగు పాద్యం, అర్ఘ్యం, పుష్పం మొదలైన కానుకలను ప్రీతితో స్వీకరింపుము. కొండంతవారి కెవ్వరును కొండంత పత్రి పెట్టజాలరు. కావున భక్తి సూచకంగా నేను సమర్పించే ఈ స్వల్పమైన పుష్పాలను, పత్రాలను, తోయాన్ని పరిగ్రహింపుము.

నీకు మణిమయమైన శిఖరాలున్నవి కావున సంపన్నుడవు. దేవకాంతల చెలిమి గలవాడవు కావున భోగపురుషుడవు. కోరిన వస్తువు లొసంగు కల్పవృక్షాలు నీకుండటంవల్ల నీవు నిష్కామివి. ఇటువంటి నీకు ఇతరులను యాచింపదగిన వస్తువు ఈ ముల్లోకాల్లోనే లేదు.

"ఓ హిమవత్పర్వత కుమారా! ఇటువంటి గుణ గరిష్ఠులైన మీరు ఇక్కడికి వచ్చుట నాయందుద్భవించిన అనురాగ సంపదచేత కదా!"

శుక్తిమతి ఈ విధంగా పలుకగా ఆలకించి పర్వత రాజనందనుడైన కోలాహలుడు ఒక చిరునవ్వు నవ్వి ' సత్పురుషుని రాకను గుర్తించిన దానా! సరసమైన హృదయంగలవారిలో శ్రేష్ఠురాలవు గదా' అని ప్రశంసించినవాడై ఆ నదిని గూర్చి మరల ఇట్లు పలుకదొడగాడు.

" సంతోషం వెల్లివిరుస్తుండగా సమస్త నదీకాంతలు వెంటారగా నీవు బ్రహ్మదేవుని సేవించి పోవుచుండగా, నీ నిర్మలత్వాన్ని, సరసత్వాన్ని, గాంభీర్యాన్ని, పరిపూర్ణత్వాన్ని చూచి మనసులో ఎప్పుడూ నిన్నే ధ్యానిస్తూ, నీ గొప్పతనాన్ని చిరకాలం నుంచి భావిస్తూ ఉన్నాను.

ఆ బ్రహ్మదేవుని కొలువునకు దివ్యనదీకాంతలు ఎందరు వచ్చిపోవుటలేదు? వారు, మేము ఎదురపడ్డ సందర్భాలెన్ని లేవు? ఎవ్వరిని చూచినను నిన్ను చూచినట్లుగా ఉండదు. బహుభాషలెందుకు? ఈ నెయ్యము, ఈమక్కువ పూర్వజన్మకృతమైనవి కాబోలు.

ఓ నదీమణీ! నేను నీపై వలపైగొని యుండుట నీ వెరిగియు నన్నెపుడును పలుకరించక తొలగిపోవుచున్నావు. నిన్నెట్లు చేరగలను? నీ మాట తేనియలు ఎట్లు ఆస్వాదింపగలుగుదునో అని చిరకాలం నుండి ఉవిళ్ళూరుచున్నాను. మన్మథతాపాన్నిశమింప చేయగలదానా! విమలమైన, మధురమైన, మనోహరమైన నడవడి గలవారిని ప్రశంసించుటకు పెద్దలు ఎంతదూరమైనను పోవుచుందురు. నేను నీ సాంగత్యమభిలషించి దూరమని విచారింపక వచ్చినవాణ్ణి.

ఇకమీద చెప్పటానికేమున్నది? నా జీవనమంతా నీకే అప్పగించి ఎల్లప్పుడు నిన్నెడబాయక నీకు ప్రియమాచరింపగలను. దీనికి నీవు సమ్మతించి నన్నువరించి శుక్తిమతీనాథునిగా, దైవ్యం లేనివానిగా చేయరాదా."

ఈ విధంగా కోలాహలుడు పలుకగా శుక్తిమతి అతనిని అతిథిగా భావించి పూజించినదేకాని, అతని పలుకులు ధ్వనిరూపమై వలపునెరింగింపగా ఆమెలో వెరపు జనించింది. ఎంతో వ్యాకులపడినదై వినయం, నీతి, భీతి అనేవి మనసులో ముప్పేటలై పెనగొనగా తన జీవితం మిక్కిలి హేయమైనదని, నీవు మహానుభావుడవు కాబట్టి నన్ను పొంది కలుషమతివి కావలదని ప్రార్థింపసాగింది.

"ఓ అచలేంద్రా! మేము చలించే వారం. నీవు చలింపనివాడవు. మేము అల్పులం. నీవు గొప్పవాడవు. మేము పారిపోయేవారం. నీవు ధైర్యంకోల్పోనివాడవు. మేము మందబుద్ధులం. నీవు గొప్పబుద్ధి గలవాడవు. మేము కుటిల ప్రవర్తన కలవారం. నీవు కుటిల ప్రవర్తన లేనివాడవు. కావున ఇటువంటి దుర్గుణాలు కల మాతో సుగుణ గరిష్ఠుడవైన నీకు సాంగత్యం పొసగనేరదు.

సమానులైన వారియెడ నెయ్యం పొసగుతుందే కాని అసమానులయెడ పొసగదు. మీరు అచలేంద్రులు, అతిశయం కల్గినవారు. మేము జడవాహినులము. మన మధ్య నెయ్యము వినదగినది కాదు. మీ పట్ల నాకు అనురాగం కలుగదు."

శుక్తిమతి ఈ విధంగా పలుకగా పర్వతనాథుడైన కోలాహలుడు ముఖంలో దీనత్వం ఉట్టిపడగా శుక్తిమతిని గూర్చి ఈ విధంగా పలికాడు.

"నదీ శిరోమణివైన ఓ శుక్తిమతీ! నీ మాటలు సత్యమే.అయినప్పటికి తెలిసో తెలియకో ప్రకాశిస్తున్న నీ కాంతి ధారాప్రవాహపరంపరలో మునిగిపోయాను. నన్ను సుడిగుండంలో పడవేస్తావో, తెప్పలదేల్చి రక్షిస్తావో, ముంచినా తేల్చినా నీవే దిక్కు. కర్తవ్యం నిశ్చయించవలసింది నీవే సుమా."

ఆ మాటలు విన్న శుక్తిమతి వెలవెలపోయి పర్వతనాథుడైన కోలాహలునితో 'మిక్కుటమైన మన్మథ వికారంతో నీ గౌరవాన్ని, ఔన్నత్యాన్ని విస్మరిస్తున్నావు. మా వంటి జడులచేత ఉద్ధరింపబడటం మహోత్కృష్టమైన కులపర్వత శ్రేణిలో నీకు చులకన కాదా' అని పలికింది.

అంతటితో ఆగక శుక్తిమతి 'మేము తపస్వినులము. ఔద్ధత్యంతో మావంటి వారిని పొందగోరుట దుస్సాహసం. క్రీడారతి నీకున్నచో లావణ్యంతో, యౌవనంతో ప్రకాశించు రంభాది దేవతా స్త్రీలు నీకు కరవయ్యారా" అని ప్రశ్నించింది.

పర్వతశేఖరుడైన కోలాహలుడు కామాతురత్వంచేత కన్నుగాననివాడై శుక్తిమతితో "జడస్థితిలో నుండు నదీకాంతలను పెండ్లాడినవారు పూర్వం పలువురున్నారు. వారికే లాఘవం రాలేదు. శివుడు గంగను, విష్ణువు కాళిందిని, శంతనుడు జాహ్నవిని, సముద్రుడు సమస్తనదులను పెండ్లాడిన గాథలు అందరూ ఎరిగినవే. కావున లాఘవం సంభవించుట కల్ల. ఓ శుక్తిమతీ! నా అనురాగాన్ని స్వీకరింపక ఎంతగా ప్రతికూలభావం వహిస్తున్నావు. పనికిమాలిన నియమాలింతటితో చాలు. నన్నేలుకొమ్ము" అని పలుకుతూ శుక్తిమతీ నది యొక్క పద్మసమూహమనే పట్టువస్త్రపు కొంగును బలిష్ఠమైన, పొడవైన బాహువుతో పట్టుకొన్నాడు.

కోలాహలుడు శుక్తిమతి కొంగుపట్టుకొనగా ఆమె జడ కదిలింది. భుజాలు వణకుటచే కంకణాలు మ్రోగాయి. ఓరగంటచూపు లొప్పారాయి. అందెలు మ్రోగాయి. తొట్రుపాటుచే మోము త్రిప్పినది. ధూర్తుడైన కోలాహలుడు శుక్తిమతిని పట్టరాని తమకంతో బలాత్కరించినాడు.

కోలాహలుని చేష్టితం వల్ల భూమండలానికే జలోపద్రవం సంభవించింది. శుక్తిమతితో పాటుగా, మహీమండల ప్రజలు వసురాజునకు మొరపెట్టుకున్నారు.

వసురాజు కోలాహలుని దర్పమడంచడానికి చతురంగ బల సహితుడై బయలువెడలగా సైన్యకలకలానికి కుల పర్వతాలు కలత చెందాయి.

వనాంతర సంచారానికి ఆటంకం కలిగించే దుందుభికాయాన్ని శ్రీరాముడు బొటనవ్రేలితో దూరంగా చిమ్మినట్లు, శుక్తిమతీనదిని నిరోధించిన కోలాహల పర్వతాన్ని వసురాజు కాలిబొటనవ్రేలిగోటితో మింటకెగసి తిరుగునట్లుగా ఎగజిమ్మి శుక్తిమతికి, భూమండలానికి ఉపశమనం చేకూర్చాడు. సురలు సంతోషించారు. ప్రజలందరు వసురాజు చేసిన పనికి మిక్కిలి ఆనందించారు."

ఈ విధంగా మంజువాణి ద్వితీయాశ్వాసాంతంలో వసురాజు కోలాహల పర్వతాన్ని ఎగమీటినంతవరకు గల గిరికా జన్మ వృత్తాంతాన్ని మాయాతపస్వి వేషంలో ఉన్న వసురాజు నర్మసచివునకు వివరించంది.

## 1.10.2 సమగ్ర వ్యాఖ్యలు :

ప. 102 కలఁడుల్లోక మహా మహోగ్రహుతభుగ్జ్వాలావళీ నిర్జల
స్థలదంభోనిధి లక్ష్యహైమవత పక్షక్షోదదక్షోరు ది
గ్వలభీ దుర్భరభేరికా భయద భాంకారైక సంప్రీణితా
చలవైరిస్తుత కీర్తిసాంద్రుఁడు వసుక్ష్మాపాల చంద్రుండిలన్.

**పరిచయం:-** ఈ పద్యం రామరాజభూషణుడు రచించిన వసుచరిత్ర ద్వితీయాశ్వాసంలోని శుక్తిమతీ కోలాహలుల కథ నుంచి గ్రహించబడింది.

**సందర్భం:-** గిరికా ప్రియసఖియైన మంజువాణి మాయాతపస్వి వేషంలో ఉన్న నర్మసచివునకు గిరికా జన్మగాథను చెప్పటం ప్రారంభించిన సన్నివేశంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:-**

ఉల్లోక = లోకాతీతమైన

మహః = ప్రతాపమనే

మహోగ్ర = అత్యంత తీక్ష్ణమైన

హుతభుక్ = అగ్నియొక్క

జ్వాలావళీ = జ్వాలా సమూహంచేత

నిర్జల స్థలత్ = జలశూన్య ప్రదేశంగా చేస్తున్న

అంభోనిధి = సముద్రంలో

లక్ష్య = చూడదగిన, అనగా కనబడుతున్న

హైమవత = హిమవత్పర్వత పుత్రుడైన మైనాకుని యొక్క

పక్ష = రెక్కల యొక్క

క్షోద = చూర్ణము చేయుటయందు

దక్ష = సమర్థమైనదియు

ఉరు = అధికమైనదియునైన

దిగ్వలభీ దుర్భర = దిగంతాలచేత భరింపశక్యముకానట్టి

భేరికా = రణభేరియొక్క

భయద = శత్రు భయప్రదమైన

భాంకార = భాం అనునట్టి అనుకరణ ధ్వని చేత

ఏక = ముఖ్యమగునట్లుగా

సంప్రీణిత = సంతోషపెట్టబడిన

అచలవైరి = పర్వత ద్వేషియైన ఇంద్రునిచేత

స్తుత = స్తోత్రం చేయబడిన

కీర్తి = యశస్సుచేత

సాంద్రుడ = పూర్ణుడైన

వసుక్ష్మాపాల చంద్రుడు = వసురాజ శ్రేష్ఠుడు

ఇలన్ = ఈ భూమి యందు

కలఁడు = ఉన్నాడు

**తాత్పర్యం:**

వసురాజను నృపాలుడు కలడు. లోకాతీతమైన అతని పరాక్రమాగ్నిచే సముద్రజలమంతయు ఇంకిపోగా అందు తలదాచుకున్న మైనాకుడు బయటపడి భేరీభాంకార ధ్వనిచే పక్షశూన్యుడగుటచే దేవేంద్రుడు శైలపక్షచ్ఛేద రూపమైన తన పని నెరవేర్చినందులకు రాజశ్రేష్ఠుడైన వసురాజును కొనియాడుచుండును.

**విశేషాంశాలు:**

మైనాకుని రెక్కలు తెగిపోవుటకు వసురాజు రణభేరి యొక్క భాంకారధ్వని హేతువై ఇంద్రుని సంతోష పెట్టుటచే కావ్యలింగాలంకారం, వసురాజు పరాక్రమాగ్నికి సముద్రజలం ఇంకిపోయి మైనాకుడు బయటపడెనుటలో అతిశయోక్త్యలంకారం ఈ పద్యంలో సమన్వయిస్తున్నాయి. ఈ పద్యం మత్తేభ వృత్తంలో రచింపబడింది.

ప.103

స్వారాజ్యంబును బోలె నింద్రున కధిష్ఠానంబధిష్ఠానమై
యారాజన్యున కింపు సొంపెసఁగు నిత్యశ్రీ లతాలవాలమై
యారామ స్మయమాన సూన మకరందాసార శైవాలినీ
ధారావర్ధిత మాధురీ గుణలసత్కాంతారకాంతారమై.

**పరిచయం:-** ఈ పద్యం రామరాజభూషణుడు రచించిన వసుచరిత్ర ద్వితీయాశ్వాసంలోని శుక్తివతీ కోలాహలుల కథ నుంచి గ్రహించబడింది

**సందర్భం:-** గిరికా జన్మగాథను మాయాతపస్వి వేషంలో ఉన్న నర్మసచివునకు వివరిస్తున్న మంజువాణి వసురాజు పరాక్రమాన్ని వర్ణిస్తున్న సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:-**

| | | |
|---|---|---|
| ఇంద్రునకున్ | = | దేవేంద్రునికి |
| స్వారాజ్యంబునుబోలెన్ | = | స్వర్గరాజ్యమువలె |
| అధిష్ఠానంబు | = | అధిష్ఠానమనెడు పట్టణము |
| అధిష్ఠానమై | = | నివాస స్థానమై |
| నిత్య | = | శాశ్వతమైన |
| శ్రీ | = | సంపద అనెడి |
| లతా | = | తీగకు |
| ఆవాలమై | = | పాదై |
| ఆరామ | = | ఉద్యానవనములందు |
| స్మమయాన | = | వికసించుచున్న |
| సూన | = | పుష్పముల యొక్క |
| మకరంద | = | పూదేనె యొక్క |
| ఆసార | = | ధారా సంపాతము వలన పుట్టిన |
| శైవాలినీ | = | నది యొక్క |
| ధారా | = | అల్పప్రవాహము చేత |
| వర్ధిత | = | వృద్ధి పొందింపబడుతున్న |
| మాధురీ గుణ | = | మాధుర్యము చేత |
| లసత్ | = | ఒప్పుచున్న |
| కాంతార | = | చెరకు యొక్క |
| కాంతారమై | = | తోటలు గలదై |
| ఆ రాజన్యునకున్ | = | ఆ వసురాజునకు |
| ఇంపు సొంపెసఁగున్ | = | మనోహరమై ఒప్పుచుండును. |

**తాత్పర్యం:-** సమస్త సంపదల కాటపట్టయి సొంపలరు అధిష్ఠాన నగరం వసురాజునకు రాజధాని. స్వర్గాన్ని ఇంద్రుడు ఏలినట్లుగా వసురాజు భూమండలాన్ని పాలించుచున్నాడు. అధిష్ఠానపురంలోని ఉద్యానవనాల్లోన్ని పూదేనియ సోనచే మధుర రసావృతాలైన చెరకుతోటలు పెంచబడుతున్నాయి.

**విశేషాంశాలు :** నిత్య శ్రీ లతావాలమై అనుచోట సంపదకు తీగకు అభేదం చెప్పబడింది. మకరందాసారా శైవాలినీ ధారవర్ధిత అనుచోట మకరందపు జడివానకు, నదీ ప్రవాహనికి అభేదం చెప్పబడింది. కావున రూపకాలంకారం అధిష్ఠానంబధిష్ఠానమై, కాంతార

కాంతారమై అనుచోట యమకాలంకారం, అధిష్ఠానమై, లతావాలమై, కాంతారమై అని అంత్యప్రాస ఈ పద్యంలో సమన్వయిస్తున్నాయి. ఈ పద్యం శార్దూల వృత్తంలో రచింపబడింది.

**ప.105.**

జీవనమెల్ల సత్కవి నిషేవిత మాశయమెల్ల నచ్ఛతా
పావనతా గభీరతలపట్టు ప్రచారములెల్ల విశ్వథా
త్రీవలయ త్రికాల ఫల దేశికము ల్నవకంబులెల్ల ము
క్తావళి విభ్రమాస్పదము లానది పెంపు నుతింప శక్యమే?

**పరిచయం:**-ఈ పద్యం రామరాజభూషణుడు రచించిన వసుచరిత్ర ద్వితీయాశ్వాసంలోని శుక్తిమతీ కోలాహలుల కథ నుంచి గ్రహించబడింది

**సందర్భం:** మాయాతపసికి గిరికా జన్మగాథను వివరించుచున్న మంజువాణి వసురాజు రాజధానియైన అధిష్ఠానపుర ప్రాంతంలో ప్రవహిస్తున్న శుక్తిమతీనదిని వర్ణించుచున్న సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:**- ఈ పద్యంలో శుక్తిమతి ధార్మికురాలైన స్త్రీగా, నదీమతల్లిగా అర్థద్వయంచే వర్ణించబడుచున్నది.

జీవనమెల్లన్ = ఉదకమంతయు; బ్రతు కంతయును
సత్కవి = శ్రేష్ఠమైన జలపక్షులచేత; శ్రేష్ఠులైన కవిజనులచేత
నిషేవితము = అనుభవింపబడుచున్నది; సేవింపబడుచున్నది
ఆశయమెల్లన్ = మడుగంతయును; మానసమంతయును
అచ్ఛతా = నిర్మలత్వము యొక్కయు; పావనత్వము యొక్కయు
పావనతా = పావనత్వము యొక్కయు; పవిత్రత్వము యొక్కయు
గభీరతా = అగాధత్వము యొక్కయు; గంభీరత్వము యొక్కయు
పట్టు = స్థానము
ప్రచారము లెల్లన్ = జలప్రవాహములన్నియు; ప్రవర్తనములన్నియు
విశ్వధాత్రీవలయ = సమస్త భూవలయమునకు; సమస్త భూజనులకును
త్రికాలఫలదేశికముల్ = ముక్కారు పంటలను కలుగజేయుచున్నవి; కాలత్రయఫలములను తెలియజేయునట్టివి
నవ కంబులెల్లన్ = నూతనమైన శంఖములన్నియు, చక్కదనములు
ముక్తావళి = ముత్తెముల సముదాయములకు, ముక్తులైనవారికిని
విభ్రమాస్పదములు = చుట్టురేఖలకు ఆధారములు, మోహాస్పదములు
ఆ నది పెంపున్ = కావున ఆ శుక్తిమతీ నది యొక్క ఘనతను
నుతింపన్ శక్యమే = కొనియాడనలవి యగునా?

**తాత్పర్యం:**- "శుక్తిమతీ నదిలోని జలం నీటిపక్షులకు సేవా పాత్రమైనది. అందలి మడుగులు నిర్మలమైనవి, పవిత్రమైనవి, లోతుగలిగినవి. నదీగమనం భూమండలానికి సస్యరూపఫలప్రదమై ఒప్పుచున్నది. నదిలోని శంఖాలు ముత్యాల పుట్టుకకు ఆటపట్టులు. కాబట్టి ఇటువంటి నదిని కొనియాడవశమా?" అని ఒక అర్థం.

"శుక్తిమతి అనే నాయిక జీవితం కవులచే సేవింపబడుచున్నది. ఆమె హృదయం పరిశుద్ధమైనది. ఆమె ఆశయాలు స్వచ్ఛమైనవి. పవిత్రమైన మనస్సు ఆమెది. ఆమె స్వభావం గంభీరమైనది. ఆమె గమనం భూతభవిష్య ద్వర్తమాన ఫలబోధకమైనది. ఆమె సౌందర్యం ముక్తులైన వారికి కూడ విభ్రమాన్ని కలిగిస్తుంది. అటువంటి శుక్తిమతిని పొగడ శక్యమా అన్నది రెండో అర్థం.

**కవితా విశేషాంశాలు:** నదికి, స్త్రీకి సమానార్థబోధకాలైన పదాల ద్వారా శ్లేషాలంకారాన్ని సమన్వయించి కవి శుక్తిమతిని ధార్మికురాలిగా ధ్వనింపచేశాడు. ఈ పద్యం శార్దూల వృత్తంలో రచింపబడింది.

ప.112. అలఘుశ్రీనిధి యానగేంద్ర తన యుండా సైకతశ్రోణి యొ
ప్పులు ఱెప్పార్పక చూచి చన్న మొదలుంబొంగారి పైపైరసం
బులు జృంభించు భ్రమించు నాశయము కూర్ముల్మించుదీపించును
త్కలికాచాపలముల్మనో నిబిడ చింతా తన్మయత్వంబునన్!

**పరిచయం:** ఈ పద్యం రామరాజభూషణుడు రచించిన వసుచరిత్ర ద్వితీయాశ్వాసంలోని శుక్తిమతీ కోలాహలుల కథ నుంచి గ్రహించబడింది.

**సందర్భం:** శుక్తిమతీనది స్త్రీ సహజమైన తన సుందరావయవములచేత కోలాహలుని నిలుకడను తొలగించి మోహితుని గావించినది. శుక్తిమతీ సౌందర్యావలోకనమున ధైర్యహీనుడైన కోలాహలుడు ఆమె సౌందర్యమునే తలచుచు వెడలిన సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం :**

అలఘు = అధికమైన
శ్రీ = ఐశ్వర్యమునకు
నిధి = స్థానమైన
ఆ నగేంద్ర తనయుందు = పర్వతరాజ పుత్రుడైన ఆ కోలాహలుడు
ఆ సైకత శ్రోణి యొప్పులు = ఇసుక తిన్నెల వంటి నితంబములు గల శుక్తిమతి చక్కదనములను
ఱెప్పార్పక = రెప్పవేయకుండ
చూచి చన్న మొదలున్ = చూచిపోయినది మొదలుకొని
మనః = శుక్తిమతీ మనస్సునందు
నిబిడ = సాంద్రమైన
చింతా = చింత చేతనైన
తన్మయత్వంబునన్ = పారవశ్యము చేత
పొంగారి = ఉప్పొంగి
పైపైన్ = మీదమీదను
రసంబులు = అనురాగములు
జృంభించున్ = విజృంభించుచున్నవి
ఆశయము = శుక్తిమతీ మానసము
భ్రమించున్ = మోహితమగుచున్నది
కూర్ముల్ మించున్ = ప్రేమలతిశయించుచున్నవి
ఉత్కలికాచాపలముల్ = ఔత్సుక్యంబును, చాపల్యంబును
దీపించున్ = ప్రకాశించుచున్నవి

**తాత్పర్యం:** కోలాహలుడు వలపుచే రెప్పలార్పక తన్ను చూచినప్పటి నుంచి శుక్తిమతి మనసు చింతా, మోహ, ఔత్సుక్య, చాపలములనెడి మనోవికారాలకు లోనైనది.

**విశేషాంశాలు:** నిమేషశూన్య దర్శనము అనగా రెప్పలార్పక చూచుట లోకోత్తర వస్తుదర్శనం చేత కలిగిన విస్మయానికి సూచన.

ఈ పద్యంలో చింత, మోహం, ఔత్సుక్యం, చాపలం అనే నాలుగు సంచారి భావాలు చెప్పబడ్డాయి. ఈ పద్యం మత్తేభ వృత్తంలో రచింపబడింది.

ప.114 కులగిరి రాజనందనుడు కూరిమి నా భువనాభినందితం
దలఁపఁదలంపు లోపలనె దర్పక కేతన వల్గనంబులం
చల యెలగోలు నంబుజ విశాల శిలీముఖ తాండవంబులు
త్పలదళ మండలాగ్రములు పైకొను నెట్టివో తత్ప్రభావముల్?

**పరిచయం :** ఈ పద్యం రామరాజభూషణుడు రచించిన వసుచరిత్ర ద్వితీయాశ్వాసంలోని శుక్తిమతీ కోలాహలుల కథ నుంచి గ్రహించబడింది.

**సందర్భం:** కోలాహలుడు శుక్తిమతిని చూచినది మొదలుగా వలపునకులోనై మన్మథాగ్నిచే తపింపబడుచు కన్నీరు విడుచుచు, శుక్తిమతినేతలంచుచు, గగుర్పాటు చెందుచు సాత్త్విక భావ పరవశుడైన సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| కులగిరి రాజనందనుఁడు | = | కులపర్వత శ్రేష్ఠుడైన హిమవంతుని కుమారుడగు కోలాహలుడు |
| కూరిమిన్ | = | ప్రేమచేత |
| ఆభువనాభినందితన్ | = | లోకసన్నుతయైన ఆ శుక్తిమతిని |
| తలఁప్రన్ | = | తలపగా |
| తలంచులోపలనె | = | తలచుకొన్నంత లోపలనె |
| దర్పక కేతన వల్గనంబులు | = | మన్మథుని యొక్క ధ్వజచలనములు |
| అంచలయెలగోలున్ | = | హంసరూపములైన మన్మథుని ఎలగోలమూకలు |
| అంబుజ విశాల శిలీముఖ | = | అరవిందరూప బాణములయొక్క |
| తాండవంబులు | = | పతనములు |
| ఉత్పలదళ మండలాగ్రములు | = | కలువ రేకుల రూపమైన ఖడ్గములు |
| పైకొనున్ | = | క్రమ్ముకొనుచున్నవి |
| ఎట్టివో తత్ప్ర భావముల్ | = | ఆ శుక్తిమతి మహిమలెట్టివో! |

**తాత్పర్యం :** నాయకుడు కులగిరిరాజనందనుడు, నాయిక భువనాభినందిత అని వర్ణించుటచే వీరిదాంపత్యం అను రూపమైన దనియు అను కూలమైనదనియు భావం. మన్మథతాపాగ్ని పాలయ్యెనని చెప్పబడుటచే కోలాహలుని ధైర్యము ఇదివరకే తొలగిపోయినది. కావున శుక్తిమతిని తలంచగానే మన్మథ పరివారం చుట్టు ముట్టనవకాశం చిక్కింది. తొలుత మన్మథుని చెక్కేము, పిదప పరివారకలకలము, ఆ తరువాత ధనుష్టంకారము, ఆ పిదప ఆయుధహస్తులైన భటులు సమీపించారు.

**విశేషాంశాలు :-** మత్స్యచలనాది నదీ ధర్మాలను, మన్మథ కేతనచలనాది ధర్మాలుగా అధ్యవసించుటచే శ్లేషానుప్రాణిత రూపకాలంకారం ఈ పద్యంచే సమన్వయించుచున్నది. ఈ పద్యం చంపకమాలావృత్తంలో రచింపబడింది.

ప.126. పరమామోదముతో విశేషతటినీ పద్మాస్యలంగూడి నీ
వరవిందోద్భవుఁగొల్చి యేఁగుతఱి నీయచ్ఛాచ్ఛభావంబు నీ
సరసత్వంబును నీ గభీరతయు నీ సర్వంకషప్రౌఢి నీ
పరిపూర్ణత్వము గాంచి మెచ్చిమదిలో భావింతు నిన్నెప్పుడున్!

**పరిచయం :** ఈ పద్యం రామరాజభూషణుడు రచించిన వసుచరిత్ర ద్వితీయాశ్వాసంలోని శుక్తిమతీ కోలాహలుల కథ నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** శుక్తిమతీ సౌందర్యమునకు వశుడైన కోలాహలుడు ఆమెను పొందాలని నిశ్చయించి, ఒకనాడామెను సమీపించి, ఆమె చేసిన పరిచర్యలకు ప్రీతిచెంది ఆమెతో సంభాషించు సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| పరమ ఆమోదముతోన్ | = | ఉత్కృష్టమైన సంతోషముతో |
| అశేషతటినీ పద్మాస్యలన్ | = | సమస్త నదీకాంతలను కూడుకొని |
| నీవు | = | నీవు |
| అరవిందోద్భవున్ కొల్చి | = | బ్రహ్మదేవుని సేవించి |
| ఏఁగు తఱిన్ | = | పోవుచుండెడు సమయమందు |
| నీ అచ్ఛాచ్ఛ భావంబున్ | = | నీ యొక్క అత్యంత స్వచ్ఛమైన హృదయమును, నిర్మలత్వమును |
| నీ సరసత్వంబును | = | నీ యొక్క రసికత్వమును, జలసహితత్వమును |
| నీ గభీరతయున్ | = | నీ యొక్క గాంభీర్యగుణమును, లోతును |
| నీ సర్వంకష ప్రౌఢిన్ | = | నీ సర్వసంగ్రహ ప్రౌఢిమను; సర్వవ్యాపకసామర్థ్యమును |
| నీ పరిపూర్ణత్వమున్ | = | నీ యొక్క సంపూర్ణభావమును; ప్రవాహ పరిపూర్ణత్వమును |
| కాంచి | = | చూచి |
| మెచ్చి | = | మెచ్చుకొని |
| మదిలోన్ | = | మానసమందు |
| ఎప్పుడున్ | = | ఎల్లప్పుడును |
| నిన్నున్ | = | నిన్ను |
| భావింతున్ | = | ధ్యానము చేయుచుందును |

**తాత్పర్యం :** నిర్మలత్వము, సరసత్వము, గభీరత, సర్వంకషప్రౌఢి, పరిపూర్ణత్వము - ఉత్తమ స్త్రీ ధర్మములు, నదీధర్మములును. సమస్త నదీకాంతలతో కూడి నీవు బ్రహ్మను సేవించి పోవు సందర్భమున ఉత్తమగుణాన్వితవైన నిన్ను ఎంతోకాలంగా ధ్యానించుచున్నప్పటికి నీవే తెలిసికొనజాలకున్నావు.

**విశేషాంశాలు :-** శ్లేషాలంకార నైపుణ్యంచేత ఈ పద్యంలో శుక్తిమతీ నదిని ఉత్తమ స్త్రీమూర్తిగా సంభావించటం గమనార్హం. ఈ పద్యం మత్తేభ వృత్తంలో రచింపబడింది.

ప. 138

వేణిచలింపఁగంపిత నవీన మృణాళ భుజాగ్రకంకణ
శ్రేణి నటింప లోలశఫరీ నిబిరీస కటాక్షకాంతి వి
న్నాణము చూప హంసక గణక్వణనంబులు మీఱ సైకత
శ్రోణి వివర్తితాబ్జ ముఖ శోభితయై కడు సంభ్రమించినన్!

**పరిచయం:-** ఈ పద్యం రామరాజభూషణుడు రచించిన వసుచరిత్ర ద్వితీయాశ్వాసంలోని శుక్తిమతీ కోలాహలుల కథ నుంచి గ్రహించబడింది.

**సందర్భం:-**శుక్తిమతీ సౌందర్యానికి వశుడైన కోలాహలుడు తన్ను వరింపుమని కోరగా, జడాత్ములమైన మాతో కలయిక నీ గౌరవోన్నతులకు తగనిదని శుక్తిమతి ఎంతో నేర్పుగా అతనిని వారిస్తుంది. అయినప్పటికి విననివాడై కోలాహలుడు పూర్వం నదీకాంతులను పెండ్లియాడిన వారు పలువురున్నారని పలుకుచు శుక్తిమతి కొంగు పట్టుకొనిన సవదర్భంలోనాదీ పద్యం.

**ప్రతిపదార్థం:-**

వేణి = నీటిపాయ అనెడి సర్పాకారముగా అల్లిన జడ

చలింపన్ = కదలియాడగా

కంపిత = చలించుచున్నదియు

నవీన = నూతన మైనదియునగు

మృణాళ = తామర తూడులనెడు

భుజ = బాహువుల యొక్క

అగ్ర = కొనలయందు

కంకణ = జలబిందువుల నెడు హస్తాభరణముల యొక్క

శ్రేణి = పంక్తి

నటింపన్ = నర్తింపగా

లోల = కదలుచున్న

శఫరీ = మత్స్య విశేషములనెడు

నిబిరీస = నిబిడమైన

కటాక్ష = క్రీగంటి చూపుల యొక్క

కాంతి = ప్రకాశము

విన్నాణము చూపన్ = ఒప్పిదము కనబరచగా

హంసక = హంసలనెడు కాళ్ళ అందెల యొక్క

గణ = స్తోమము యొక్క

క్వణనంబులు = అనుకరణధ్వనులు

మిాఱన్ = అతిశయింగా

సైకత శ్రోణి = ఇసుక తిన్నెలనెడు నితంబములు గల శుక్తిమతి

వివర్తిత = త్రిప్పబడిన

అబ్జ = కమలము వంటి

ముఖ = నెమ్మొగము చేత

శోభితయై = ఒప్పుచున్నదై

కడుసంభ్రమించినన్ = మిక్కిలి తొందరపాటు పొందగా, కలత చెందినదైనది.

**తాత్పర్యం :-** కోలాహలుడు శుక్తిమతీనదిని నిరోధించగా నీటిపాయ చెదరెననియు, తామరతూండ్లు కలగెననియు, జలకణములు చిందెననియు, మత్స్యము లెగిరిపడెననియు, హంసలు ధ్వనిచేసెననియు తామరపూవులు కలతనొందెననియు నదీపరమైన అన్వయం.

శుక్తిమతి కొంగు కోలాహలుడు పట్టుకొనగా జడ కదిలెననియు, భుజములు వణకుటచే కంకణములు మ్రోగెననియు, ఓరగంటి చూపులొప్పారెననియు, కాలియందెలు మ్రోగెననియు నాయికాపరమైన అన్వయం.

**విశేషాలు:-** వివిధాంశాలలో నదికి, స్త్రీకి అభేదం చెప్పుటచే ఈ పద్యంలో రూపకాలంకారం సమన్వయిస్తున్నది. శాంత స్వభావం గల నదిలోని కల్లోలాన్ని రామరాజ భూషణుడు స్వభావోక్తి రమ్యంగా చిత్రించాడు. ఈ పద్యం ఉత్పలమాలా వృత్తంలో రచింపబడింది.

ప.155

మొక్కల్వోయిన ఱెక్క మొక్కగమితో మూర్ఛాలసత్వంబుతో
జిక్కుల్ వడ్డ లతాద్రుమావళులతో శీర్ణోపల శ్రేణితో
నక్కోలాహలముర్వి వ్రాలియును నెయ్యంబొప్పనయ్యేటికే
గ్రుక్కిళ్ళుమ్రింగుచు నుండె నండనె వసుక్షోణీధవత్రస్తమై!

**పరిచయం:-** ఈ పద్యం రామరాజభూషణుడు రచించిన వసుచరిత్ర ద్వితీయాశ్వాసంలోని శుక్తిమతీ కోలాహలుల కథ నుంచి గ్రహించబడింది.

**సందర్భం:-** కోలాహలావరోధంచేత శుక్తిమతీ నదీ ప్రవాహజలం భూమండలమంతా ఆక్రమించటంచేత ప్రజలందరు వసురాజును శరణుకోరారు. వసురాజు కాలిగోటికొనచే పర్వతాన్ని ఎగమీటగా కోలాహలుడు నలినలి అయ్యెనని వర్ణించు సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం :-**

| | | |
|---|---|---|
| మొక్కల్వోయిన | = | తునుకలయిన |
| ఱెక్కమొక్కగమితోన్ | = | మొలకల వంటి రెక్కల గుంపులతోడను |
| మూర్ఛాలసత్వంబుతోన్ | = | మూర్ఛవలన పుట్టిన దుర్బలత్వము తోడును |
| చిక్కుల్వడ్డ | = | వ్యత్యాసముగా పెనవేసికొన్న |
| లతా | = | తీగల యొక్కయు |
| ద్రుమావళులతోన్ | = | చెట్ల యొక్కయు సమూహముతోడను |
| శీర్ణ | = | జారిన |
| ఉపల | = | పాషాణముల యొక్క |
| శ్రేణితోన్ | = | సమూహము తోడును |
| ఆ కోలాహలము | = | ఆ కోలాహల పర్వతము |
| ఉర్విన్ వ్రాలియును | = | భూమి మీద ఒరగియును |
| నెయ్యంబొప్పన్ | = | ప్రేమ అతిశయించగా |
| అయ్యేటికే | = | ఆ శుక్తిమతి నిమిత్తమే |
| గ్రుక్కిళ్ళుమ్రింగుచున్ | = | గుటకలు మ్రింగుచు |
| వసుక్షోణీధవ త్రస్తమై | = | వసురాజు చేత భయపెట్టబడినదై |
| అండన్ | = | సమీపమందే |
| ఉండన్ | = | నిలిచియుండెను. |

**తాత్పర్యం :-** వసురాజు కాలితో ఎగజిమ్మగా పైకెగసిపడుట వలన కోలాహలుని రెక్కలు తునుకలయ్యెను. మూర్ఛజనించెను. తీగలు వృక్షములు తలక్రిందయ్యెను. రాళ్ళు జారిపడెను. ఈ విధముగా ఆ పర్వతము పడినప్పటికి ప్రేమాధిక్యముతో శుక్తిమతి కొరకే గ్రుక్కిళ్ళుమ్రింగుచు వసుభూపతికి భయపడి సమీపమందే నిలిచియుండెను.

**విశేషాంశాలు:-** గ్రుక్కిళ్ళు+గ్రింగు అనుచోట గ్రుక్కిళ్గ్రింగు అనురూపాన్ని రామరాజభూషణుడు గ్రహించాడు. బహువచనం పరమైనప్పుడు ద్విత్వరూపకళ వర్ణకోకారం క్రియాపదాలు పరమైనప్పుడు లోపించటం కవి ప్రయోగాలల్లో కానవస్తుంది.

ఈ పద్యం శార్దూల వృత్తంలో రచింపబడింది.

ప.156

పోటన బంతి మీటుగతి భూవరుఁడంఘ్రి నఖాంచలంబునన్
మీటిన గట్టు బిట్టెగసి మేదిని వ్రాలు ఘన స్వనంబునన్
హాటక శైలకూట కటకాళిఁ బ్రతిధ్వని పర్వెనా నభో
వాటి నెసంగె నంత సుర వార వధూ మురవారవార్భటుల్.

**పరిచయం:-** ఈ పద్యం రామరాజభూషణుడు రచించిన వసుచరిత్ర ద్వితీయాశ్వాసంలోని శుక్తిమతీ కోలాహలుల కథ నుంచి గ్రహించబడింది.

**సందర్భం :-** శుక్తిమతిని నిరోధించిన కోలాహలుని వసురాజు కాలిగోటితో మింటికెగరి తిరుగునట్లు ఎగజిమ్మెను. ప్రజలందరు వసురాజు చేసిన పనికి సంతోషించిన సమయమందలిదీ పద్యం.

**ప్రతిపదార్థం:-**

పోటన బంతి మీటుగతిన్ = పూలచెండు నెగమీటినట్లుగా
భూవరుఁడు = వసురాజు
అంఘ్రి నఖ అంచలంబునన్ = కాలిగోటి కొనచేత
మీటినన్ = ఎగమీటగా
గట్టు = కోలాహల పర్వతము
బిట్టుఎగసి = మిక్కిలి ఎగసినదై
మేదినిన్ వ్రాలు = భూమి మీదపడెడు సమయమందైన
ఘన స్వనంబునన్ = గొప్పధ్వని చేత
హాటక శైల = మేరు పర్వతము యొక్క
కూట = శిఖరముల యొక్క
కటక = చరుల యొక్కయు
ఆళిన్ = సమూహమందు
ప్రతిధ్వని పర్వెనాన్ = మార్మోత పుట్టినదో యన్నట్లుగా
అంతన్ = ఆ మీదట
సురవారవధూ = దేవతా వేశ్యల యొక్క, అనగారంభాదుల యొక్క
మురవ = మృదంగముల యొక్క
ఆరవ = ధ్వని యొక్క
ఆర్భటులు = ఆర్భాటములు
నభోవాటిన్ = గగనావరణ మందు
ఎసంగెన్ = అతిశయించెను

**తాత్పర్యం :-** వసురాజు కాలిగోటి కొనచేత పూలచెండును ఎగమిటినట్లుగా పర్వతాన్ని ఎగమిటుట వలన కోలాహల పర్వతం పైకెగిరి భూమిమీద పడెడు సమయమందు ఉద్భవించిన గొప్పధ్వని చేత మేరు పర్వతపు గుహలు మార్మ్రోగినవో అన్నట్లుగా ఆ సమయంలో ఆనందించిన దేవకాంతలు మ్రోగించిన మంగళవాద్యాల ధ్వని ఆకాశ మార్గంలో అతిశయించినది.

**విశేషాంశాలు:-** దేవకాంతుల మగంళవాద్యాల మ్రోతను, కోలాహలుని భూపతన సమయంలో ధ్వనిచేత మేరు పర్వత చరియలలో కలిగిన ప్రతిధ్వనిగా ఊహించడంవల్ల ఉత్ప్రేక్షాలంకారమే పద్యంలో సమన్వయించుచున్నది. ఈ పద్యం ఉత్పలమాల వృత్తంలో రచింపబడింది.

**డా॥ జి.కై. ప్రభావతీదేవి,** ఎం.ఎ. (తెలు); ఎం.ఏ.(సం) ; ఎంఫిల్; పి.హెచ్.డి.
అసోసియెట్ ప్రొఫెసర్,
తెలుగుసంస్కృత శాఖ,
నాగార్జున విశ్వవిద్యాలయం,
నాగార్జుననగర్

# శుక్తిమతీ కోలాహలుల కథ

## రామరాజ భూషణుడు

## పాఠం : 11

1.11.0 సంధర్భ సహిత వ్యాఖ్యలు

1.11.1 ప్రశ్నలు - సమాధానాలు

1.11.2 రాదగిన ప్రశ్నలు

1.11.3 ఆచూకీ గ్రంథాలు

## 1.110 సందర్భ సహిత వ్యాఖ్యలు :

**ఆ నది పెంపు మతింపశక్యమే?**

**పరిచయం:-** ఈ పద్యపాదం రామరాజభూషణుడు రచించిన వసుచరిత్ర ద్వితీయాశ్వాసంలోని శుక్తిమతీ కోలాహలుల కథలోనిది.

**సందర్భం:-** వసురాజు రాజధానియైన అధిష్ఠాన నగరమనే స్త్రీ యొక్క కంఠంలో ప్రకాశించు ముత్యాలహారమో అన్నట్లుగా ఒప్పుచున్న శుక్తిమతీనదిని గురించి మంజువాణి మాయా తపసితో వివరించుచున్న సందర్భంలో పలికిన పలుకులివి.

**వివరణ:-** శుక్తిమతీనది జలపక్షులతో, నిర్మలమైన, పవిత్రమైన, లోతైన మడుగులతో కూడి ఉంటుంది. ఆ నదీజలపు ప్రవాహాలు సమస్త భూమండలానికి ముక్కారు పంటలను చేకూర్చుతున్నాయి. నదిలోని శంఖములు ముత్యముల పుట్టుకకు ఆటపట్టులు. కాబట్టి శుక్తిమతీ నది యొక్క ఘనత కొనియాడనలవిగాదని నదీపరమైన అర్థం.

'శుక్తిమతీ అనే నాయిక జీవితం కవులచే సేవింపబడుతోంది. ఆమె హృదయం పరిశుద్ధమైంది. ఆశయాలు స్వచ్ఛతకు, పవిత్రతకు ఆటపట్టులు. ఆమె సౌందర్యం ముక్తులకు కూడ భ్రమను కల్గిస్తుంది. అటువంటి శుక్తిమతిని పొగడ శక్యమా' అన్నది రెండో అర్థం.

నదికీ, స్త్రీకి సమానార్థ బోధకాలైన పదాల ద్వారా శ్లేషను సాధించి శుక్తిమతిని ధార్మికురాలిగా కవి ధ్వనింపచేశాడు.

**2. ఆ మఖ్లోకుఁడు నా చెలువ చెలువు లోఁగొని చనియెన్!**

**పరిచయం:-**ఈ పద్యపాదం రామరాజభూషణుడు రచించిన వసుచరిత్ర ద్వితీయాశ్వాసంలోని శుక్తిమతీ కోలాహలుల కథలోనిది.

**సందర్భం:-** బ్రహ్మకొలువునకు వెడలి తిరిగి వచ్చుచున్న శుక్తిమతీ నదీ సౌందర్యము పర్వత రాజైన కోలాహలుని మోహితుని గావించెనని మంజువాణి మాయాతపసితో వివరించు సందర్భంలో పలికిన పలుకులివి.

**వివరణ:-** శుక్తిమతీ ప్రవాహధారలు కోలాహలుని దిట్టతనము కోల్పోవునట్లు ఒరసిప్రవహించగా, నదీ సౌందర్యముచే నిలుకడ తొలగి యోగ్యమైన కీర్తి గల ఆ కోలాహలుడు దిటవు కోల్పోయి ఆ చెలువ శుక్తిమతి యొక్క సౌందర్యమునే లోనతలంచుచు వెడలినాడు.

**3. పైకొను వెట్టివా తత్ప్రభావముల్ ?**

**పరిచయం:-** ఈ పద్యపాదం రామరాజభూషణుడు రచించిన వసుచరిత్ర ద్వితీయాశ్వాసంలోని శుక్తిమతీ కోలాహలుల కథలోనిది.

సందర్భం:- కోలాహలుడు శుక్తిమతీనదిని చూచినప్పట నుంచి వలపునకులోనై మన్మథాగ్నిచే తపింపబడుచు, కన్నీరు విడచుచు మాటిమాటికి శుక్తిమతినే స్మరించుచున్న సందర్భాన్ని వివరిస్తూ మంజువాణి మాయాతపసితో పలికిన పలుకులివి.

వివరణ:- కులపర్వత శ్రేష్ఠుడైన హిమవంతుని కుమారుడైన కోలాహలుడు ప్రేమతో లోకసన్నుతమైన శుక్తిమతీనదిని తలంచగానే మన్మథుని కేతనమైన మీనము, హంసల కోలాహలము, మన్మథుని పంచబాణములు, ధనుష్టంకారములు చుట్టుముట్టినవి. శుక్తిమతిని తలచుకొన్నంతలోనే కోలాహలుడు మన్మథావిర్భావము కలవాడగుచున్నాడు. ఇక ఆ శుక్తిమతి మహిమ లెటువంటివో ?

**4. ఎవ్వారలైనఁ గొండంత వారి కవనిఁ గొండంత పూజసేయంగ గలరె ?**

పరిచయం:- ఈ పద్యపాదం రామరాజభూషణుడు రచించిన వసుచరిత్ర ద్వితీయాశ్వాసంలోని శుక్తిమతీ కోలాహలుల కథలోనిది.

సందర్భం:- శుక్తిమతీ సౌందర్యమును కాంచి మన్మథ వేదనకు గురియైన కోలాహలుడు భూషణాలంకృతుడై ఒకనాడు శుక్తిమతిని సమీపించెను. శుక్తిమతి ఎదురేగి అర్ఘ్యపాద్యాది విధులతో పూజించి కోలాహలుని సంతసింపజేసినది. ఆ సమయమున పుణ్యానదియైన శుక్తిమతి వినయముతో కోలాహలుని గొప్పతనాన్ని ప్రశంసించుచు, తాను చేసే సపర్యలు అల్పమైనవిగా సంభావించుకొనుచున్న సందర్భంలోనివి పలుకులు.

వివరణ:-నదీశతములను కలిగియున్న మీకు నేను సమర్పించెడి నిర్మలమైన అర్ఘ్యజలం ఎంతపాటిది? మంచుతో నిండిన హిమవంతుని పుత్రుడనైన మీకు పన్నీటితో ఇచ్చుపాద్యమెంతపాటిది? కల్పవృక్షపు పూలతో ప్రకాశించు మీకు పుష్పమాలికర్పించుట ఎంతపాటిది? గోరూపధారిణియైన భూమివలన రత్నములు పిదుకుటను కలిగిన తండ్రియైన హిమవంతుని యొక్క సంపద కలిగిన మీకు కానుకగా మణుల సమూహాన్ని సమర్పించుట ఎంతపాటిది?

పర్వత శ్రేష్ఠుడా! లోకంలో ఎవరైనప్పటికి కొండంత ఔన్నత్య గలిగిన ఘనత కలవారికి కొండంత ఘనమైన పూజ చేయగలరా? కావున భక్తి సూచకంగా నేనొసంగు స్వల్పమైన పుష్ప, పత్ర, తోయములను స్వీకరింపుము.

**5. పూర్వజన్మ సుకృతముల్ గాబోలు నీ నెయ్యముల్ !**

పరిచయం:- ఈ పద్యపాదం రామరాజభూషణుడు రచించిన వసుచరిత్ర ద్వితీయాశ్వాసంలోని శుక్తిమతీ కోలాహలుల కథలోనిది.

సందర్భం:- శుక్తిమతి చేసిన సపర్యలకు, సత్కారములకు సంతసించిన కోలాహలుడు ఆమెపట్ల తనకు కలిగిన అనురాగమును వ్యక్తీకరించుటకు భూమికగా శుక్తిమతి నదిలోని నిర్మలత్వాన్ని, సరసత్వాన్ని, గాంభీర్యాన్ని, ప్రౌఢిమను, పరిపూర్ణత్వాన్ని ప్రశంసించుచు, చిరకాలం నుంచి నిన్ను గురించి మదిలో ధ్యానించుచుంటినని శుక్తిమతితో అనురాగాన్ని వెల్లడించు సందర్భంలో కోలాహలుడు పలికిన పలుకులివి.

వివరణ:- సరసాంతరంగనైన ఓ శుక్తిమతీ! ఆ బ్రహ్మదేవుని కొలువునకు నిరంతరం ఎందరు దివ్యనదీ కాంతలు వచ్చిపోవుచుండుట లేదు. ఎందరు ఎదురుపడుట లేదు. వారిలో ఏ సౌందర్యవతిని చూచినను నిన్ను చూచినట్లుగా ఉండదు. పలుమాటలేల? ఈ అనురాగము, ఈ మైత్రి పూర్వజన్మకృతమగుటయే దానికి హేతువు. అనగా పూర్వజన్మవాసనా విలసితమైన మైత్రీభావమును తొలగించుట అసాధ్యమనియు, దాని బలము వ్యక్తీకరించుటయు కష్టసాధ్యముకాన పలుమాటలేల అని భావము.

**6. కులగిరి కోటిలోఁగడు లఘుత్వము గాదె తలంచి చూడుమా !**

పరిచయం:- ఈ పద్యపాదం రామరాజభూషణుడు రచించిన వసుచరిత్ర ద్వితీయాశ్వాసంలోని శుక్తిమతీ కోలాహలుల కథలోనిది.

సందర్భం:- కోలాహలుడు శుక్తిమతీ సాంగత్యమును కోరగా, అతని వలపునంగీకరింపజాలక శుక్తిమతి మీరచలేంద్రులు. మేము జడవాహినులము. మన నెయ్యము వినదగినది కాదు. మీ యెడ మాకనురాగము జనింపదని కోలాహలుని కోరికను తిరస్కరించింది.

అయినను వినక కోలాహలుడు 'తెలిసో తెలియకో ధారాప్రవాహ రూపమైన నీ లావణ్యమునకు మోహితుడనైతిని. 'ముంచినను తేల్చినను నీవే దిక్కు' అని పలుకగా శుక్తిమతీ వెలవెలపోయి కోలాహలునితో హితాహితములను వివరించు సందర్భంలోని పలుకులివి.

వివరణ: ఓపర్వతరాజా! మిక్కుటమైన మన్మథ వికారంచేత నీ వంశ గౌరవాన్ని, ఔన్నత్యాన్ని పరిగణింపకున్నావు. జడాత్ములమైన మీతో కలయిక కులపర్వత సమూహంలో నీ గౌరవోన్నతులకు భంగం కలిగిస్తుంది. మా వంటి వారిచేత ఉద్ధరింపబడుట చులకన యనువిషయమును మన్మథ వికారంచేత గుర్తింపలేకున్నావు.

నీ యొక్క గౌరవోన్నతులనగా పృథులత్వమును, పొడవును విచారించుకొనక మా ద్రవజలస్థితిచేత తెప్పల మీద తేలుచునుండుట కులపర్వత శ్రేణిలో చులకదనముగాదా విచారింపుమని అర్థం.

**7. మహిమంబు గావవగు గ్రక్కున మిన్నులు వద్ద శైవడిన్ !**

**పరిచయం:-** ఈ పద్యపాదం రామరాజభూషణుడు రచించిన వసుచరిత్ర ద్వితీయాశ్వాసంలోని శుక్తిమతీ కోలాహలుల కథలోనిది.

**సందర్భం:-** కోలాహల పర్వతం శుక్తిమతీ నదిని అడ్డగించగా నదీ పరమైన అల్లకల్లోలమేగాక జలోపప్లవం సంభవించి లోకమంతయు అకులమైనది. శుక్తిమతి ఆక్రందనను, జనుల మొరను విన్న వసురాజు కోలాహల విజృంభణకు కారణమేదోయని లోకసంరక్షణోత్సాహియై యుండగా ప్రజలు దీనాలాపములతో ఓ మహారాజా! ఎక్కడ నుండియో ఒక పర్వతము వచ్చి దిక్కులు పిల్లటిల్లగా శుక్తిమతీ నదిలో పడగా శుక్తిమతీ నదీ ప్రవాహము వెల్లువయై భూమినాక్రమించినదని" చెప్పు సందర్భములోనివీ పలుకులు.

**వివరణ:-** "ఓ రాజా! ఆ మహాపర్వతం వల్ల కలిగిన అపాయాన్ని ఏమని విన్నవింపగలము ? కోలాహలుని నిరోధముచే శుక్తిమతీ నదీ ప్రవాహజలం భూమి యావత్తును వ్యాపింపగా, ఆ వెల్లువలో ప్రతిఫలించిన ఆకాశ స్వరూపం చూడగా ఆకాశమే విరిగిపోయి జలములో పడినట్లు కనబడుచున్నది." అనగా భూమ్యాకాశములు ఏకమైనట్లుగా వెల్లివరద పెట్టినది కనుక అందువలన సంభవించిన ఉపద్రవం చెప్పనలవి గాదని జనుల ఆక్రందన.

**8. కులకుధర మండలము గలగుండు పడియె.**

**పరిచయం:-** ఈ పద్యపాదం రామరాజభూషణుడు రచించిన వసుచరిత్ర ద్వితీయాశ్వాసంలోని శుక్తిమతీ కోలాహలుల కథలోనిది.

**సందర్భం:-** కోలాహలావరోధమున శుక్తిమతీనది వెల్లివిరిసి సర్వస్వము కోల్పోయితిమని పౌరులు వసురాజున కెరింగించిరి. కోలాహలుని నశింపజేయుటకుద్యుక్తుడై వసురాజు ప్రజలకు అభయము సంగుచు ఆర్తత్రాణ పరాయణుడై శ్రీమహావిష్ణువువలె మనోవేగముచేత వెడలినాడు. కోలాహలుని దర్పమణచుటకు బయలుదేరిన వసురాజు చతురంగ బలముల ఔద్ధత్యమును వెల్లడించు సందర్భంలోనివీ పలుకులు.

**వివరణ:-** శైలభేదన సమర్థములైన వజ్రాయుధము వంటి దంతములు కలిగిన ఏనుగులును, కాలిగిట్టల వలన ఎగసిన ధూళి సమూహముచే సముద్రజలముల నింకింపగా, జలములోని పర్వతములను బయటపడవేయగలిగిన ఆరట్టదేశ సంభవమైన గుఱ్ఱములను, చక్రములను ధ్వనిచేత పర్వతములను బ్రద్దలు చేయజాలిన అసంఖ్యాకమైన రథములను, ధైర్యవంతులైన కాల్బలములను, వసురాజు వెంటనడవగా ఆ సైన్య కలకలమునకు కులపర్వత సమూహమంతయు ఆ కులత్వమును పొందినది.

**9. దుందుభి కబంధము మీటిన రాము శైవడిన్ !**

**పరిచయం:-** ఈ పద్యపాదం రామరాజభూషణుడు రచించిన వసుచరిత్ర ద్వితీయాశ్వాసంలోని శుక్తిమతీ కోలాహలుల కథలోనిది.

**సందర్భం:-** శుక్తిమతి మొరను, ప్రజల దీనాలాపములను విన్న వసురాజు కోలాహలుని దర్పమణచుటకు చతురంగ బలసహితుడై బయలువెడలగా సైన్యకలకలమునకు కులశైలములు కలత చెందినవి. కోలాహలుని ఉద్ధతిని వసురాజు అణచు సందర్భంలోనివీ పలుకులు.

**వివరణ:-** వనాంతర సంచారానికి ఆటంకము కలిగిస్తున్న దుందుభి అనే రాక్షసుని మొండెమును శ్రీరాముడు బొటనవ్రేలితో దూరముగా చిమ్మిన విధముగా శుక్తిమతీ నదీజలమునకు నిరోధము కలిగించిన కోలాహల పర్వతమును వసురాజు మింటికెగిరి తిరుగునట్లు ఎగజిమ్మెను. అంతసురలు సంతోషించిరి. ప్రజలందురు వసురాజు చేసిన పనికి మిక్కిలి ఆనందించిరి.

## 1.11.1 ప్రశ్నలు - సమాధానాలు:

ప్రశ్న: 1. రామరాజ భూషణుని శ్లేషకవితా వైభవాన్ని మీ పాఠ్యభాగమాధారంగా వివరించండి.

లేదా

రామరాజ భూషణుని కవిత్వంలో శ్లేషకు, ధ్వనికి గల స్థానాలను వివేచించండి.

లేదా

వసుచరిత్రలోని శ్లేష కవితా చమత్కారాలను సోదాహరణంగా వివరించండి.

వసుచరిత్ర ప్రబంధయుగంలో వెలసిన మహాకావ్యం. ఇది తదితర ప్రబంధాల వంటిది కాదు. సామాన్యంగా పురాణేతిహాసాలందరి స్వల్పకథను స్వీకరించి అష్టాదశ వర్ణనలతో, ఆలంకారిక శైలితో, శృంగార రస ప్రధానంగా కవులు కావ్యాలు రచించగా వానినే మనం ప్రబంధాలు అంటున్నాము. ప్రబంధ లక్షణాలు పరకోటికెక్కాయి. వసుచరిత్ర మహిమ అంతా కథలో కన్న, కల్పనల్లో, వర్ణనల్లో, రచనా విధానంలో అధికంగా గోచరిస్తుంది.

వసుచరిత్ర శ్లేషప్రధాన కావ్యంగా కన్పిస్తుంది. రామరాజభూషణుడు శ్లేషైకతానుడు. అతడేది పలికినా సహజ సుందరమైన శ్లేష దొరలుతూ ఉంటుంది. వసుచరిత్రలోని ఇతివృత్తమే కొంతవరకు రామరాజభూషణుని ప్రయోగానికి దారితీసింది.

శుక్తిమతీ కోలాహల వృత్తాంతం వసుచరిత్రలో ప్రముఖమైన ఘట్టం. శుక్తిమతి నది. కోలాహలుడు పర్వతం. ఈ నదీ పర్వత సంగమం వల్ల గిరిక జనించింది. గిరికా జన్మవృత్తాంతం మానవానుభవ విరుద్ధం. ఇట్టి విరుద్ధ కథాంశాలను పురాణాల్లో మాదిరిగా కావ్యాల్లో వర్ణించుటం ఔచిత్యం కాదు. అందువల్లనే ఆ ఘట్టాన్ని వర్ణించునపుడు రామరాజభూషణుడు నదీ పర్వతాలను వర్ణించినట్లుగాక నాయికా నాయకులైన స్త్రీ పురుషులను వర్ణించినట్లుగాక పద్యరచన గావించాడు. అనగా శ్లేషసహాయమున నదీ పర్వత వృత్తాంతాన్ని స్త్రీ పురుష వృత్తాంతంగా మలచి రచించాడు. శ్లేష కవిత్వం రామరాజభూషణుడు రచించిన ఇతివృత్తంలోని అసంభావ్యాన్ని తొలగించటానికి సహాయపడింది.

"నానార్థ సంశ్రయము శ్లేషము" అని ఆలంకారికులు శ్లేషను నిర్వచించారు. శ్లేషవిషయంలో ఆలంకారికులలో అభిప్రాయ భేదాలున్నాయి. ఒకొనొక ఘట్టంలో శ్లేషాలంకారం వల్ల అనేకార్థాలు జనింపవచ్చు. అవి ప్రకృత కథకు సంబంధించినవి కావచ్చు. సంబంధింపనివి కావచ్చు. ఎన్ని అర్థాలు స్ఫురించినప్పటికీ ఆ అర్థాలన్నీ శ్లేషార్థాలే అని నవీనాలంకారికుల సిద్ధాంతం. కాని ప్రాచీనాలంకారికులు ప్రకృత కథకు సంబంధించిన అర్థంకాక మిగిలిన అర్థాన్ని వ్యంగ్యార్థమని అంటారు. ఈ సందర్భంలో శ్లేషకు, ధ్వనికి గల భేదాన్ని గమనించాలి. వాచ్య, లక్ష్యార్థాలచే ఒక అర్థం స్ఫురించిన పిదప ప్రకరణాన్ని బట్టి మనోహరమైన మరియొక అర్థం స్ఫురించినచో అది వ్యంగ్యార్థమవుతుంది. ఆ విధంగాకాక స్ఫురణ విషయంలో సమానబలం కలవై ప్రకరణాన్ని బట్టి వాచ్యమైన అర్థాలు శ్లేషార్థాలు. అనగా వాచ్యార్థం (ముఖ్యార్థం) మీద ఆధారపడేది శ్లేష. ఇక వ్యంగ్యార్థం వాచ్యార్థాన్ని అతిక్రమించి ఉంటుంది.

శ్లేష నానావిధాలుగా ఉంటుంది. రెండర్థాలు ప్రకృత కథకే సంబంధించినట్లైతే ప్రకృత శ్లేష అనీ, అప్రకృతాలైతే అప్రకృత శ్లేష అనీ, ఒకటి ప్రకృతమూ, మరొకటి అప్రకృతము అయిన ప్రకృతా ప్రకృత (ఉభయ) శ్లేష అని ఆలంకారికుల మతం. వీటిలో ప్రకృతశ్లేష, అప్రకృతశ్లేష రెండూ ప్రాచీనాలంకారికులకు సమ్మతములే. ఉభయశ్లేషలోని అప్రకృతార్థం శ్లేషార్థం కాదని వ్యంగ్యార్థమని ప్రాచీనాలంకారికుల సిద్ధాంతం. ఈ అప్రకృతార్థం గూడ శ్లేష అని నవీనాలంకారికులంటారు.

ఏదిఏమైనప్పటికి రామరాజభూషణుడు ధ్వని ప్రధానమైన వసుచరిత్రను కేవల శ్లేషను తరచుగా ఉపయోగింపలేదని చెప్పవచ్చును. శుక్తిమతి తనకడకు వచ్చిన కోలాహలుని ఉచితరీతిని సత్కరించి,

"అతులశైవలవతీ శతము లీనెడు మీకు
నాయిచ్చు విమలార్ఘ్య తోయమెంత
ప్రాలేయనిలయ సంభవముగాంచిన మీకుఁ
బన్నీట నొనరించు పాద్యమెంత
సరసమందార మంజరుల రంజిలు మీకు
బెనఁచి పూదండలర్పించుటెంత
గోరత్న దోహన గురులక్ష్మి గల మీకు
నుపదగా మణివర్గ మొసఁగుటెంత

యనఘ! యెవ్వారలైన గొండంతవారి
కవనిఁ గొండంత పూజ సేయంగఁగలరె
భక్తి నే నిచ్చు నీ పుష్పపత్ర తోయ
మాత్రములు గైకొనుటెకాక గోత్ర తిలక !

ఈ విధంగా పలికినది. శుక్తిమతి తాను చేసే సపర్యలు అల్పమైనవని చెబుతోంది. కాని అంతరార్థాన్ని పరిశీలిస్తే ఇందులో ధ్వని గోచరిస్తోంది. కోలాహలుని యందుండు నదులు శైవలవతులు. అనగా నాచుతో కూడినవి ఇక శుక్తిమతి సమర్పించే అర్ఘ్యమో విమల తోయము. కోలాహలునకు మంచు మాత్రమే తెలుసు. మరి శుక్తిమతి పన్నీటిని సమర్పిస్తున్నది. ఈ విధంగా అన్ని పాదాల్లో శుక్తిమతి పూజాధిక్యం ధ్వనిస్తోంది. శుక్తిమతి కోలాహలుని "గోత్రతిలక" అని సంబోధించింది. గోత్రతిలకుడనగా భూమిని రక్షించు పర్వతాలలో శ్రేష్ఠుడని అర్థం. ఆ సంబోధనలో భూమిని రక్షించువాడు పరకాంతలను కామింపవచ్చునా అనే ఆక్షేపమున్నది.

ఇట్లే
"నిలువెల్ల నీచాతి నీచోపసరణంబు
ప్రకృతి యెల్లను జాడ్య పరిణతంబు
పెంపెల్ల నియత గాంభీర్యమాన విహీన
మంతరంబెల్లఁ బంకావిలంబు
జీవనంబెల్ల నంచిత బుద్బుద ప్రాయ
ముదయమెల్లను దుర్దినోన్ముఖంబు
గతులెల్లఁ గుటిలప్రకార కారణములు
త్సేకంబులెల్ల భంగాకులములు

నిలుకడ హుళక్కి తావులు పొలసువల్పు
నట్టి మా బోంట్లతోఁ జెల్మి యెట్లు పొసఁగు
నచలితోత్తుంగ ధైర్యున కలఘుమతికి
ననఘగతికి నభంగ శీలునకు నీకు.

అను శుక్తిమతీ వాక్యాలలో మనోహరమైన ధ్వనులు కలవు. పల్లమునకు పారే స్వభావము, శైత్యస్థితి, లోతును కొలుచుటకు వీల్లేని జలాధిక్యమూ, జలాంతర భూమి పంకావిలమగుట, బుద్బుదబాహుళ్యమైన జలమూ, సూర్యుడు కన్పించకుండా మేఘముపట్టి వర్షించడంచేత నదులు జలపూరితాలుకావడం, నదులు వంకవంకలుగా ప్రవహించుట, స్థిరముగా నిలిచి ఉండకపోవడం - అనే నదీపరమైన ఉత్తమ లక్షణాలన్నీ ఈ పద్యంలో ధ్వని రూపంలో వ్యక్తీకరించబడ్డాయి. అందుచేతనే విమర్శకులు "శబ్దశక్తి మూలధ్వనియో, గుణీభూత

వ్యంగ్య ప్రాయములగు సమాసోక్త్యలంకారములో కోకొల్లలుగానీ కావ్యమున కానవచ్చుచున్న " వని నిర్ధారించారు. పై పద్యంలో తన జీవన హైన్యాన్ని నిరూపించి కోలాహలునకు వైముఖ్యం పుట్టించాలని శుక్తుమతి ప్రయత్నం. "అచలితోత్తుంగ ధైర్యునకు" మొదలైన విశేషణాలన్నీ సార్థకమైనవి. మనోనిగ్రహాదులలవరచుకొమ్మని పుణ్యతరంగిణియైన శుక్తిమతి కోలాహలునకు ధ్వని రూపంగా హితాన్ని బోధించింది.

జడములైన నదీపర్వతములందు రామరాజభూషణుడు నాయికా నాయకత్వారోపణము గావించిన విధానము అత్యద్భుతము.

"జీవనమెల్ల సత్కవి నిసేవితమాశయమెల్ల నచ్ఛతా
పావనతా గభీరతల పట్టు ప్రచారము లెల్ల విశ్వధా
త్రీ వలయు త్రికాల ఫల దేశికముల్నవకంబు లెల్ల ము
క్తావళి విభ్రమాస్పదము లానది పెంపు నుతింప శక్యమే."

ఈ పద్యంలో శుక్తిమతీ నది ధార్మికురాలైన స్త్రీగా, నదిగా అర్థద్వయంచే వర్ణించబడినది. శ్లేష సహజ సుందరంగా ఒదిగి పోయిన ఈ సందర్భంలో శుక్తిమతీ నదియందలి జలము నీటిపక్షులకు సేవా పాత్రమని, అందులోని మడుగులు నిర్మలమైనవి, పవిత్రమైనవి, లోతైనవి, నదీ గమనం భూచక్రంలో సస్యరూపఫలప్రదమని, శంఖములు ముత్యపు పుట్టువులకాట పట్టులని, కావున ఇటువంటి నదీమతల్లిని కొనియాడవశమా? అన్నది నదీపరమైన అన్వయం. శుక్తిమతి అనేనాయిక జీవితం కవులచే సేవింపబడుచున్నదని, ఆమె ఆశయాలు స్వచ్ఛతకు, పవిత్రతకు ఆటపట్టులని, ఆమె గమనం భూతభవిష్య ద్వర్తమాన ఫలబోధకమని, అటువంటి శుక్తిమతిని పొగడ తరమా' అని నాయికాపరమైన అన్వయం. నదికి, స్త్రీకి సమానార్థ బోధకాలైన పదాల ద్వారా శ్లేషను సమన్వయించి శుక్తిమతిని ధార్మికురాలిగా రామరాజభూషణుడు ధ్వనింప చేశాడు.

కోలాహల పర్వతాన్ని పర్వత పరంగా, నాయకుని పరంగా శ్లేషతో సాధించి ఈ క్రింది పద్యాన్ని రామరాజభూషణుడు కమనీయంగా రచించాడు.

సుమనోధివాస భాసుర శిఖోన్నతి వాఁడు
ఘనసార తిలక వాసనల వాఁడు
ఘన సంకుమద సాంద్ర గండభాగము వాఁడు
నవ పద్మరాగ దంతముల వాఁడు
కలితోపకంఠ నక్షత్ర మాలిక వాఁడు
హరిచందనచ్ఛాయ నమరువాఁడు
తపనీయ మేఖలా ధాళధళ్యము వాఁడు
మణిపాదవలయ ధామంబు వాఁడ

నర్ఘ్య రత్నావళీ విచిత్రాంబరాభి
రామ శృంగారముల వాఁడు హైమగర్భ
గేహమున కేఁగువాఁడు కోలాహలాఖ్యుఁ
డొక ధరాధీశుఁడెదురయ్యె నువిద కపుడు.

ఈ పద్యం మొదలు తదుపాఖ్యానాంతందాక సర్వము శ్లేష ధ్వని మయమయ్యెను. పై పద్యంలో ధరాధీశుడనే పదం కలదు. ధరాధీశుడనగా పర్వతచక్రవర్తి, భూపతి అను రెండర్థాలు కలవు. పద్యమందలి విశేషణాలన్నింటిని రామరాజభూషణుడు పర్వాతా ధీశ్వరుడైన కోలాహలునకు, రాజునకు ఇరువురకు సమన్వయించునట్లు నిపుణముగా ప్రయోగించెను. సర్వాలంకార శోభితుడైన ఒక

శృంగార నాయకుని వర్ణిస్తూనే సర్వలక్షణ మనోహరమైన పర్వతాన్ని కూడ చూపించడంలో శ్లేషచమత్కృతి కనబడుతుంది.

కోలాహలుడు కన్నుమిన్ను గానక శుక్తిమతిని బలాత్కరించిన సందర్భంలో పుణ్య స్త్రీ పరంగా, నదీపరంగా అర్థద్వయము కలదు.

"వేణి చలింపఁ గంపిత నవీన మృణాళ భుజాగ్రకంకణ
శ్రేణి నటింప లోలశఫరీ నిబిరీస కటాక్ష కాంతి వి
న్నాణము చూప హంసక గణక్వణనంబులు మీఱసైకత
శ్రోణి వివర్తితాబ్జముఖ శోభితయై కడు సంభ్రమించినన్ !"

కోలాహల పర్వతం నదినడ్డగించడము నీటిపాయ చెదరిందని, తామరతూండ్లు కలగాయని, జలకణాలు చిందాయని, మత్స్యములెగిరిపడ్డాయని, హంసలు ధ్వని చేశాయని, తామర పూవులు కలత చెందాయని, నదిలో కల్లోలం సంభవించిందని ఒక అర్థం.

శుక్తిమతి అనే నాయిక కొంగు కోలాహలుడనే శృంగార పురుషుడు పట్టుకోగా జడకదిలిందనీ, భుజాలు వణకుటచే కంకణాలు మ్రోగాయని, ఓరగంటిచూపు లొప్పారాయని, కాలియందెలు మ్రోగాయని, తొట్రుపాటుతో నాయిక మోము త్రిప్పిందని రెండో అర్థం.

శుక్తిమతీ కోలాహల వృత్తాంతంలో రామరాజభూషణుడు నాయికానాయక వ్యవహారానికి సంబంధించిన అర్థాన్ని వ్యంగ్యార్థంగా సంభావించినాడు. ఈ వ్యంగ్యాలన్నీ ధ్వనులే అని చెప్పడం సమంజసం.

ఈ ఉపాఖ్యానంలో ప్రప్రథమంగా కోలాహలుడు శుక్తిమతిని చూచినప్పుడు వారిరువురు మనుష్య రూపాలతో ఉన్నారు. పిదప కోలాహలుడు శుక్తిమతితో ఉపభోగించిన సన్నివేశంలో వారు నదీ పర్వత రూపాలతో ఉన్నారు. రామరాజభూషణుడు ఈ రెండు సన్నివేశాల్లో మొదట నాయికానాయక వ్యవహారార్థాన్ని ముఖ్యార్థంగాను, తరువాత దానిని వ్యంగ్యార్థంగాను నిరూపించారు. రామరాజభూషణుడు తన కథాకథన వర్ణనా ప్రాగల్భ్యాన్నంతటిని శుక్తిమతీ కోలాహల వృత్తాంతంలో ప్రదర్శించాడు. గిరికా వసురాజుల కంటె మానవీకరింపబడిన శుక్తిమతీ కోలాహలులే వసుచరిత్రలో సజీవపాత్రలుగ సాక్షాత్కరిస్తున్నాయి. ఈ ప్రశస్తిని సాధించటంలో రామరాజ భూషణునకు ఉపకరించినది శ్లేషకవితా చాతుర్యమే.

ప్రశ్న 2 : రామరాజభూషణుని శ్లేషవైభవాన్ని సోదాహరణంగా నిరూపించండి.

ఆంధ్ర కవులు, అందునా పింగళిసూరనవంటి కవులు ద్వ్యర్థికావ్యాలు వ్రాస్తూ భిన్న భిన్నములైన శ్లేషలనుపయోగించి ద్వివిధ కథలకు సామరస్యం ఘటించారు. వానిలో "ఆంధ్రభాషా సంస్కృతాభిభాషాశ్లేష , శబ్దశ్లేష , అర్థశ్లేష , ముఖ్యగౌణవృత్తిశ్లేష, అర్థాన్వయభేద కల్పనం, శబ్దాన్వయశ్లేష" అనేవి ముఖ్యం. వీటిని రామరాజభూషణుడు ప్రయోగించిన తీరు గమనించగలము శుక్తిమతీ కోలాహలుల కథలో.

**1. ఆంధ్రభాషా సంస్కృతాభిభాషా శ్లేష :**

ఒక శబ్దం ఒక అర్థంలో సంస్కృత భాషకు, మరియొక అర్థములో ఆంధ్రభాషకు చెంది నానార్థాలు కలిగితే అది ఆంధ్రభాషా సంస్కృతాభిభాషా శ్లేష అంటారు.

'జీవనమెల్ల సత్కవి నిషేవితమాశయశయమెల్లనచ్యుతా' (ప.105) అనే పద్యంలో 'నవకంబు లెల్లన్ ముక్తావళి విభ్రమాస్పదము' లనుచోట 'నవకంబులు' అనుమాటలో సంస్కృతాంధ్ర శ్లేష కలదు.

నదీపరమైన అర్థమున - నవ = నూతనమయిన;
కంబులు ఎల్లన్ = శంఖములన్నియు - అని
విభజనము చేయవచ్చును. ఈ అర్థంలో

నవ, కంబు - సంస్కృత పదాలు
నాయికా పరంగా అన్వయించినపుడు
నవకంబులు = కోమలత్వములు, చక్కదనములు
నవకమనునది దేశ్యశబ్దము. ఆంధ్ర శబ్దము.

2. శబ్దశ్లేష:

శబ్దాల విరుపు వల్ల నానార్థాలు కల్గినచో శబ్దశ్లేష అంటారు.

శుక్తిమతీ నదీపరమైన, నాయికా సౌందర్యపరమైన అన్వయం కలిగిన "బాలకూర్మవిలాస పదములు కాంతరంభాప్రతిబింబోరుభవ్యరుచులు" (ప. 110) అనే పద్యంలోని రెండవ పాదంలో/-

'సరససైకత సారజఘన సౌభాగ్యంబు

నతనాభి రూప వనభ్రమంబు' అనేచోట సరస సైకతసారజ + ఘన అనీ, సైకతసార + జఘన అనీ శబ్దవిభజన చేయవలసి ఉంది.

సరస = జలయుక్తములైన
సైకత సారజ = శ్రేష్ఠములైన ఇసుక తిన్నెలవలన పుట్టిన
ఘన = అధికమైన
సౌభాగ్యంబున్ = సౌష్ఠవమును అనునది నదీపరమైన విభజనము.
సరస = శృంగారయుక్తమును
సైకతసార = శ్రేష్ఠమైన ఇసుకతిన్నెలతో సదృశమైన
జఘన = జఘనము యొక్క, నితంబముల యొక్క
సౌభాగ్యంబున్ = సౌభాగ్యమును అనునది నాయికాపరమైన విభజనము. ఇట్లు శబ్దముల విరుపు వలన ద్వివిధార్థాలు సంభవించుచున్నవి గాననిది శబ్దశ్లేష

'నతనాభిరూపవనభ్రమంబు' అనుచోట
నత = గంభీరమైన
నాభిరూప = నాభి సదృశమైన
వనభ్రమంబు = నీళ్ళ సుడిగుండమును
అనేది నదీపరమైన విభజనం.
నత = లోతైనదీ
న+అభిరూప = సుందరము కానిదీ
వనభ్రమంబు = సుడిగొన్నట్లుగా ఉన్న నాభి యొక్క ఆవర్తనమును
అనేది నాయికాపరమైన విభజనం.

శబ్దముల విరుపువలన ద్వివిధార్థాలు సంభవించుటచే ఇదీ శబ్దశ్లేషయే.

"అనుకూల ఖేలనాయత్త జీవనమైత్రి నడరి నర్మద బోటియై భజింప (ప.106)

అనే పద్యంలోని నర్మద, బాహుద, వేత్రవతి శబ్దములకు ఆ పేర్లు గల నదులు అని ఒక అర్థము.

నర్మ + ద = నర్మ ప్రదమైన చెలికత్తియ
బాహు + ద = కైదండ ఇచ్చెడు చెలికత్తియ

వేత్రి + వతి = వెండిబెత్తము పట్టుకొని కొలువు చేసెడి స్త్రీ (వేత్రపాస్తురాలైన స్త్రీ)
అని రెండవ అర్థమూ చెప్పవలసింది. శబ్దముల విరుపుచే ఈ ద్వివిధార్థాలు సంభవిస్తున్నాయిగాన ఇదిగూడా శబ్దశ్లేషయే.

3. అర్థ శ్లేష:
శబ్దాని కుండే నానార్థాలను బట్టి అనేకార్థాలు జనిస్తే అర్థశ్లేష అంటారు.
" సుమనోధివాస భాసుర శిఖోన్నతివాడు ..." (ప. 108)
అనే పద్యంలో కోలాహల వర్ణన పురుష పరంగా, పర్వత పరంగాను అన్వయించడానికి కారణం ఆయా శబ్దాలకున్న నానార్థాలే.

సుమనోధివాస = పుష్పాదివాసము చేత
భాసుర = ప్రకాశించుచున్న
శిఖా ఉన్నతివాడు = సిగముడి యొక్క హెచ్చుగలవాడును అని ఒక అర్థం.
సుమనోధివాస = దేవతా నివాసముతోడ
భాసుర = ప్రకాశించుచున్న
శిఖోన్నతివాడు = అగ్రభాగము యొక్క ఉన్నతి కలవాడును అని రెండవ అర్థం.

ధరాధీశుడు అనగా రాజు అని ఒక అర్థము, పర్వతా ధీశ్వరుడు అని రెండవ అర్థమూను. గోత్రతిలక (ప. 122) అనుచోట వంశ శ్రేష్ఠుడా అని ఒక అర్థం. పర్వత శ్రేష్ఠుడా అని రెండవ అర్థం.

"పుడమి ధచలేంద్రులెచ్చట
జడవాహినులెచట నెచటి సఖ్యము వినఁబో
ప్పడదు పొడవడరుమీయెడ
నెడపక మారసము లెచటి కెక్కు, మహాత్మా!" (ప. 133)

అనే పద్యంలో
భూమియందు పర్వత శ్రేష్ఠులెక్కడ? జలమయములైన నదులెక్కడ? మన నెయ్యము వినదగినదికాదు. పొడవుచేత ఒప్పుచుండెడి మీకడకు క్రింద నుండెడి మా ఉలములు ఎక్కడి కెక్కిరాగలవు' అన్నది నదీ పర్వతపరమైన అర్థం.

భూమిలో భూదేవేంద్రులైన రాజులెక్కడ? నీళ్ళ కడవలు మోసే దాసీజనమెక్కడ? అసమానులయెడ స్నేహం పొసగదు. అతిశయంతో ఒప్పుతున్న మీ విషయమై మా యనురాగాలు ఎట్లుదయిస్తాయి? అన్నది అర్థాంతరం. 'సరసాగ్రగణ్యవుగదే' (ప. 125) అనే చోట సరసమైన హృదయం గల వారిలో శ్రేష్ఠురాలవుగదే అని ఒక అర్థం జలసహితమైన నదులలో ముందుగా స్తుతింపదగిన దానవుగదే అని అర్థాంతరం.

'నిద్దంపు ఁజవులఁబరఁగు శుక్తిమతీ నామభవ్యతటిని'(ప. 104) అనేచోట చవులనగా మధుర రుచులనీ, ముత్యములనీ రెండర్థాలు గలవు. జలమాధుర్యంలో, ముత్యాలచేతను ఒప్పుతున్న శుక్తిమతీ నదిని వర్ణించటంలో రెండూ ప్రకృతార్థాలే.

4. ముఖ్య గౌణవృత్తి శ్లేష:
'ప్రసవశరాఖ్యయోగి బహుభంగుల భావనలిచ్చి.... వసుచరిత్ర, '(తృతీయా శ్వాసం, ప. 106) ఇట మన్మథుడు యోగిగా పోల్చబడినాడు. శృంగారరసాధిదేవత అయిన మన్మథుని విరాగి అయిన యోగితో పోల్చడం పొసగదు. కాని యోగిత్వమతని యందారోపింపబడి యోగివంటివాడు అనునర్థము కల్పింపబడినది. అట్లు కనిపించుట గౌణవృత్తి అవుతుంది. యోగికి సంబంధించిన అర్థంలో ముఖ్యవృత్తి అవుతుంది కావున నిది ముఖ్య గౌణవృత్తి శ్లేష.

**5. అర్థాన్వయ భేద కల్పనం:**

"గోత్రవర్గము పాదుకొల్పిన నయశాలి" (వసుచరిత్ర, తృతీయాశ్వాసం, ప. 4) అనుచోట ఇంద్రుని పరముగా పర్వతా సమూహాన్ని స్వస్థానమందు నిలిపిన నేర్పరియనీ, వసురాజు పక్షంలో వర్ణసాంకర్యమూ కలుగకుండ చేసిన వాడనీ అర్థాలు చెప్పవలసివస్తుంది. ఇచట శబ్దశ్లేషగాని, పదాన్వయ భేదం కాని లేకనే అర్థాన్వయం భిన్నభిన్నాలుగా ఉండునట్లు కల్పింపబడింది. కావున నిది అర్థాన్వయ భేద కల్పనమవుతుంది.

**6. శబ్దాన్వయ భేదకల్పనము:**

పదాల కర్థభేదం లేకున్నా వాటిని రకరకాలుగా అన్వయించుటచేత భిన్నార్థాలు కలిగిన శబ్దాన్వయ భేదకల్పనమవుతుంది. "సొలసి తటిల్లతాంగి జిగిసూపు వెలుంగులచే" (వసుచరిత్ర, తృతీయాశ్వాసం, ప. 67) ఇట గిరిక పక్షాన తటిల్లతాంగి = మెరుపుతీగ వంటి దేహముగల గిరిక, జిగి = కాంతి గలిగిన, చూపు వెలుంగులచేన్ = చూపుల కాంతులచే అని అన్వయింపవలసి ఉంది.

మెరుపుతీగ పక్షమున జిగి = కాంతులను, చూపు = చూపుచున్న, వెలుంగులచేన్ = ప్రకాశముచే అని అన్వయింపవలసి వస్తుంది. అనగా ఒక పదానికి ముందు వెనుకలకన్వయించినచో శబ్దాన్వయ భేద కల్పనమవుతుంది.

రామరాజభూషణుడు కవితా శిల్పానికి శ్లేషనుపయోగించాడు. అందుచేత ఆ శ్లేష సరసంగా ఉంది.

'భువనాశయవేదిని సరసాగ్రగణ్యవుగదే' (ప. 125) అని కోలాహలుడు పలుకటంలో

భువన = జగత్తుల యొక్క, ఆశయ = అభిప్రాయ స్థితిని, వేదిని = గుర్తెరిగినదానా అని స్త్రీ పరమైన అన్వయం.
భువనాశయు = జలాశయుమందలి
సన్నివేశ = సత్పురుష ప్రవేశమును
వేదిని = గుర్తెరిగినదానా అని నదీపరమైన అర్థం
సరసాగ్రగణ్యవుగదే = సరసమైన హృదయంగల వారిలో శ్రేష్ఠురాలవుగదే అని ఒక అర్థం.
సరసాగ్రగణ్యవు గదే = జలసహితమైన నదులలో ముందుగా స్తుతి సేయదగినదానవు గదే అని నదీపరమైన అన్వయం.

నాయందుద్భవించిన అనురాగ సంపత్తి చేతగదా ఇచటి కేతెంచి నారని పలికిన శుక్తిమతి పలుకులకు అనురాగాన్ని స్త్రీ విషయక రాగంగానే అర్థం చేసుకొని కోలాహలుడు శుక్తిమతిని భువనాశయ సన్నివేశినివి, సరసాగ్రగణ్యవని అన్నారు. అంటే పరేంగిత గ్రాహిణివి, రసికురాలవని ఉత్తముడైన నాయకుడైన కోలాహలుడు లేతనవ్వుతో పలికినాడు.

ఈ విధంగా శ్లేష సహాయంతో నదీ పర్వత వృత్తాంతాన్ని రామరాజభూషణుడు స్త్రీ పురుష వృత్తాంతంగా మార్చాడు.

## 1.11.2 రాదగిన ప్రశ్నలు:

1. శుక్తిమతీ కోలాహలుల కథ ఆధారంగా రామరాజభూషణుని ఊహావైభవాన్ని వివరించండి.

2. రామరాజభూషణుని కవితా శిల్ప వైలక్షణ్యాన్ని సోదాహరణంగా నిరూపించండి.

3. వసుచరిత్రలోని మీ పాఠ్యభాగం ఆధారంగా ప్రజలకు ప్రాప్తించిన దైన్యాన్నీ, దానిని వసురాజు తొలగించిన విధానాన్నీ విశదీకరించండి.

4. రామరాజభూషణుడు రూపొందించిన శుక్తిమతి మరియు కోలాహలుల వ్యక్తిత్వాలను పరామర్శించేది.

5. రామరాజభూషణుడు నదినీ, పర్వతాన్నీ మానవీకరించి వర్ణించిన తీరును వివరించండి.

### 1.11.3 ఆధార గ్రంథాలు:

1. వసుచరిత్ర - సోమ కవి విరచిత విద్వజ్జనరంజనీ వ్యాఖ్య: ప్రచురణ వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్‌కో/- చతుర్థ ముద్రణ, 1962.

2. వసుచరిత్ర విమర్శనము - వజ్ఝల చిన సీతారామ స్వామి శాస్త్రి.

డా॥ జి.కై. ప్రభావతీదేవి, ఎం.ఎ. (తెలు); ఎం.ఏ.(సం) ; ఎంఫిల్స్; పి.హెచ్.డి.
అసోసియేట్ ప్రొఫెసర్,
తెలుగుసంస్కృత శాఖ,
నాగార్జున విశ్వవిద్యాలయం,
నాగార్జుననగర్

## మొదటి భాగము - ప్రాచీన పద్యభాగము
## చేమకూర వేంకటకవి

# విజయ విలాసము

**(తృతీయాశ్వాసం పూర్తిగా 1 - 239 పద్యాలు)**

## పాఠం - 12

**1. 12. 0** - పరిచయం
**1. 12. 1** - కవి పరిచయం
**1. 12. 2** - కావ్యపరిచయం
**1. 12. 3** - పాఠ్యభాగ సందర్భం
**1. 12. 4** - పాఠ్యభాగ వివరణ

### 1.12. 0 పరిచయం :

శ్రీ కృష్ణదేవరాయల మరణానంతరం తెలుగు సాహిత్యం ఆంధ్రదేశాన్ని వదలి దక్షిణదేశానికి వలసపోయింది. ఆ రోజుల్లో తెలుగు సాహిత్యాన్ని ఆదరించిన రాజ్యాలు రెండు - అవి తంజావూరు, మధుర రాజ్యాలు. ఈ రాజ్యాల్లో వర్ధిల్లిన సాహిత్యంగా యుగ విభజనకర్తలు దక్షిణాంధ్ర యుగ సాహిత్యంగా భావించారు. ఆ కాలంలో తంజావూరును పాలించిన రఘునాథ రాయలు (1600 - 1630) పండితకవి. మహావీరుడు. రాజనీతి విశారదుడు. సంస్కృతాంధ్రాల్లో రసవత్కవితను చెప్పగల దిట్ట. సంగీతశాస్త్ర నిపుణుడు. అన్నింటినిమించి ఎందరో కవి సత్తములను తీర్చి దిద్దిన ప్రతిభాశాలి. అతని ఆస్థానంలో మన చేమకూర వేంకటకవితో పాటు మధురవాణి రామభద్రాంబ, యజ్ఞనారాయణ దీక్షితులు మొదలైన పండితులు ఉండేవారు. రాయల ఆస్థానంలో విశిష్టస్థానం ఆక్రమించుకోవడంతో పాటు తన విజయవిలాసాన్ని తన ప్రభువు రఘునాథ రాయలకు అంకితం చేసిన కవిరాజు చేమకూర వేంకటకవి.

### 1.12. 1 కవి పరిచయం :

చేమకూర వేంకటకవి జీవితాన్ని గూర్చి తెలిసింది స్వల్పం. రఘునాథరాయల కొలువులో ఉద్యోగం చేసే వేంకటకవి సాహిత్య గోష్ఠుల్లో పాల్గొంటూ చక్కని కవిత్వం చెప్పడం అలవాటు చేసుకున్నాడు. వేంకటకవి మాటలకున్న విలువలను గుర్తించినవాడు. ఉపమావాచకాల విషయంలో పాటు తిరస్కార పదాల ఉపయోగం తెలిసినవాడు. పలుకుబడుల్లో, లోకోక్తుల్లో ఎంత చమత్కారం చూపవచ్చో ఎరిగినవాడు. సన్నివేశానికి తగిన పదాన్ని అర్థగౌరవంతో ప్రయోగించడంలో నేర్పున్నవాడు. మాటల విరుపుల ద్వారా అందాన్ని అద్దడం అలవాటయినవాడు. ఔచిత్య పోషణం పాటించినవాడు. ప్రతిపద్యంలోను చమత్కారం చూపించగల అనన్య సామన్యమైన కవితాశక్తి గలవాడు.

చేమకూరను గురించి కందుకూరి వీరేశలింగం పంతులుగారు "అచ్చతెనుగు పదములను పొందికగా గూర్చి కవనము చెప్పు నేర్పు ఈ కవికి కుదిరినట్లు మరియొక కవికి కుదిరినదని చెప్పవలనుపడదు. పింగళి సూరనార్యుని ప్రభావతీ ప్రద్యుమ్నమునకు తరువాత విజయవిలాసమే సర్వ విధముల చేతను తెలుగులో శ్లాఘ్య కావ్యముగానున్నది. జాతీయాది చమత్కృతిని బట్టి విజయవిలాసమే శ్లాఘ్యతరమయినదని యనేకులభిప్రాయపడుచున్నారు" అని చెప్పిన మాటలు అక్షరసత్యాలు.

విజయ విలాస కావ్యాన్ని తరచి పరిశోధించిన తాడీ ధర్మారావు గారు చేమకూర వేంకటకవి శబ్దతత్వ పరిజ్ఞానాన్ని, శ్లేషరచనా నైపుణ్యాన్ని ప్రశంసించారు.

చేమకూర వేంకటకవి రచించిన కావ్యాలు రెండు. 1. సారంగధర చరిత్ర 2. విజయ విలాసం. ఈ రెండు కావ్యాల్లో అద్వితీయమైనది విజయ విలాసం.

### 1.12. 2 కావ్య పరిచయం :

వేంకటకవి కాలంలో శృంగార రసానికి ఉన్న ప్రజాకర్షణ కారణంగా ఆయన శృంగారాన్ని మూడు ముఖాలుగా ప్రదర్శించడానికి విజయవిలాస కథను స్వీకరించాడు. అర్జునుడు తీర్థయాత్రలకోసం వెళ్ళి ఉలూచి, చిత్రాంగద, సుభద్ర అనే కన్యకలను వివాహం చేసుకోవడమే ఈ కావ్యంలోని కథావస్తువు. ఇది మూడు ఆశ్వాసాల కావ్యం. ఈ కథలో ఉన్న మూడు వివాహాలు మూడు విధాలయినట్టివి. ఉలూచి అర్జునుడిని వలచింది. సుభద్రను అర్జునుడు వలచాడు. చిత్రాంగదకు అర్జునుడి విషయంగాని, అర్జునుడికి చిత్రాంగద విషయంగాని తెలియదు. ఈ మూడు వివాహాల్లో ఉలూచి వివాహం గాంధార్వం. చిత్రాంగద వివాహం ఆమెతండ్రి ఏర్పాటు చేశాడుగనుక బ్రాహ్మ్యం. సుభద్ర వివాహం రాక్షస వివాహచిహ్నాలున్నట్టిది. అలాగే ఉలూచి వివాహం పాతాళలోకానికి, చిత్రాంగద వివాహం మానవలోకానికి, సుభద్ర కృష్ణుని చెల్లెలు కనుక దేవలోకానికి సంబంధించింది. ఉలూచి నాగకాంత. చిత్రాంగద మానవకాంత. సుభద్ర దేవకాంత.

చేమకూర వేంకటకవి మూడాశ్వాసాల ఈ ప్రబంధంలో ఈ ముగ్గురి వివాహాన్ని రసరమ్యంగా, చమత్కార శ్లేషయుతంగా, పరిపక్వమయిన నైపుణ్యంతో వర్ణించాడు.

### 1.12. 3 పాఠ్యభాగ సందర్భం :

చిత్రాంగదను వివాహమాడిన అర్జునుడు బభ్రువాహనుడు జన్మించిన తరువాత రైవతకోత్సవానికి వెళ్ళాడు. అక్కడ అతడికి సుభద్ర కనిపించింది. ఆమె సౌందర్యం అతడిని వివశుడిని చేసింది. యతి రూపంలో ఉన్న అర్జునుడిని బలరాముడు చూశాడు. సమీపానికి వెళ్ళి వినయంగా నమస్కరించాడు. చాతుర్మాస్యవ్రతాన్ని మా రాజ్యంలో చేయండంటూ ప్రార్థించాడు. అందుకు సన్యాసి రూపంలో ఉన్న అర్జునుడు అంగీకరించాడు. ఆ సమయంలోనే కృష్ణుడక్కడికి రాగా బలరాముడతనితో "ఆ మునిని తానాహ్వానించిన విషయాన్ని చెప్పి ఆ ముని సేవకు సుభద్రను నియమించమని ఆజ్ఞాపించాడు. కన్యను ఆ విధంగా పంపడం మంచిదికాదన్నాడు కృష్ణుడు - తప్పులేదంటూ బలరాముడు ఆదేశించాడు. కృష్ణుడు సోదరుడి మాట ప్రకారం మునివేషంలో ఉన్న అర్జునుడిని ద్వారకకు తీసుకుపోయాడు. సుభద్రను పిలిపించి ముని సేవకు నియోగించాడు. వచ్చినవాడు అర్జునుడనే విషయాన్ని రుక్మిణీ సత్యభామలకు రహస్యంగా చెప్పాడు.

సన్యాసివేషంలో ఉన్న అర్జునుడు ఉద్యానవనంలో ఉంటూ సుభద్ర చేత సేవలు అందుకుంటూ ఉన్నాడు. ఆమెకూడా భక్తి ప్రపత్తులతో అతడిని సేవిస్తూ ఉంది. పోలికలను బట్టి అతడర్జునుడేమో అని అనుమానించింది. అయి ఉండడని నమ్మి అతనికి శుశ్రూషలు చేస్తూ ఉంది. ఒకనాడు తనకు సేవచేయడానికి వచ్చిన సుభద్రతో అర్జునుడు "నీకు త్వరలో పెండ్లి అవుతుంది" అన్నాడు. "మీ తీర్థయాత్రల్లో అర్జునుడిని చూశారా ?" అని ఆమె ప్రశ్నించింది. "చూశాను - నాకు అతనికి భేదం లేదు. గోకర్ణంలో కొంతకాలం కలిసి ఉన్నాం" అన్నాడు . "అతడిక్కడికి రాడా ? అటునుంచి అటే ద్వారకకు వెళతాడా ?" అని ప్రశ్నించింది సుభద్ర. "నీ వాతని ప్రేమిస్తున్నావా ?" అని ఎదురుప్రశ్నించాడు అర్జునుడు. " నీకోసం యతివేషంవేశాను. నీకోసం వచ్చి ఇక్కడ ఈ రూపంలో ఉన్నాను. నేనే అర్జునుడిని" అన్నాడు. సిగ్గుతో ఆమెలేచి వెళ్ళబోయింది. అర్జునుడామె చేతిని పట్టుకున్నాడు. ఆమె శరీరం పులకరించింది. ముద్దిమ్మని అడిగాడు. పెద్దలు వివాహం చేసేవరకు తొందరపాటు వద్దన్నది. గాంధర్వ వివాహం చేసుకుందామని, విరహాన్ని సహించలేనని అన్నాడు. కౌగలించుకోవడాని ప్రయత్నించాడు. ఆమె నేర్పుగా తప్పించుకుంది. అతడు ప్రేమను వెళ్ళడిస్తున్నాడు. ఆమె అతని మాటలు వింటూ అంతఃపురానికి దారి తీసింది. సుభద్రార్జునులిద్దరూ మదన వేదనకు గురయ్యారు.

ఇక్కడి నుండి పాఠ్యభాగం ప్రారంభమవుతుంది.

**1.12. 4 పాఠ్య భాగవివరణ :**

**అర్జునుని విరహం :** సుభద్ర చెలికత్తెలతో అంతఃపురానికి వెళ్ళిపోయింది. అర్జునుని మనస్సు విచారంతో విరహానికి లోనయింది. కృష్ణుని ఆదేశం మేరకు రుక్మిణి వచ్చి భోజనం వడ్డించినా అర్జునుడు చింతాక్రాంతుడై సరిగా భోజనం చేయలేకపోయాడు. సుభద్ర సేవచేసే సమయంలో సంతోషంతోను, ఆమె వెళ్ళిన తరువాత విచారంతోను అర్జునుడు భుజించలేక పోయాడు. భోజనం విషయంలో సుభద్ర దూరంగా ఉన్నా, దగ్గరగా ఉన్నా అర్జునునకు ఒకే తీరుగా ఉంది. చిన్నచప్పుడయినా సుభద్ర వచ్చిందనుకొని నిలబడేవాడు. ఏ దిక్కున అలికిడి అయినా అవి సుభద్ర పలుకలని ఆలకించేవాడు. ఏ దిక్కున తళుక్కుమన్నా అది సుభద్ర శరీరపు కాంతి అని పరికించేవాడు. చక్కెరలాంటి మధురమైన అధరంతో, నల్లత్రాచువంటి నల్లని జడతో, తామరపూవులవంటి పాదాలతో సుభద్ర తన చెంతకు వస్తున్నట్లు ఊహించుకునేవాడు. మన్మథబాణాల వాడికి, మలయమారుతం వేడికి, శుక శారికలదాడికి మహావీరుడయిన అర్జునుడు భయపడసాగాడు.

సుభద్ర మీది విరహంతో అర్జునుడు ఈ విధంగా భావించాడు. "విరహిణులను వేధించే మన్మథుడి చిహ్నమైన చేప, చంద్రుని చిహ్నమయిన జింక సుభద్ర వాలు చూపులకుఓడిపోయాయి. అందుచేతనే అవి సుభద్రను బాధింపజాలక నన్ను బాధిస్తున్నాయి. చదవవేస్తే ఉన్న మతిపోయిందన్నట్లు కౌగిలి కోరినంతనే వెళ్ళిపోయిన సుభద్రతోపాటు ఆమె సేవకూడా దూరమయింది. అంతఃపురానికి పోతూ ఆమె ఓరగా చూచినప్పుడు ఆమె కడగంటి చూపులలో శృంగారరసం ప్రవహించింది. నేను అర్జునుడను అని తెలిపినంతనే సుభద్ర చూపు చేపలాగా తుళ్ళిపడింది. గాంధర్వ వివాహం చేసుకొమ్మని అడిగినంతనే పచ్చకర్పూరంలాగా ఆమెమాట మాయమయింది. పట్టుకోడానికి సిద్ధపడినంతనే బండి చక్రంలాగా ఆమె పిరుదు అలవికాలేదు. పయ్యెదను చూడగానే ఆమె నూగారు పచ్చపూసలాగా సరిగా కనిపించలేదు. పేరువిప్పి పిచ్చివాడినయ్యాను. కోరిక తెలియజెప్పి అమాయకుడనయ్యాను. బలాత్కరించి బయటపడ్డాను. ప్రేమను ప్రదర్శించి పలుచనయ్యాను. సుభద్రకు సన్నని నామము కన్నా కస్తూరిబొట్టు, రంగు చీరల కన్న తెల్లచీరలు, జడకన్నా వాలుముడి, రత్నాభరణాలకన్నా బంగారు నగలు అందాన్ని కలిగిస్తాయి. ఆమెను తేరిపార చూస్తే కళ్ళు మిరుమిట్లు గొలుపుతాయి. ఆమె కదిలితే తళుక్కున మెరిసినట్లుంటుంది. ఆమెను బంగారు బొమ్మ అని అందరూ అంటారుగాని ఆమె శరీరానికి, బంగారానికి పోలికే లేదు. సుభద్ర కన్నులు మన్మథుని ఆయుధాలయిన పద్మాలను, అతని ధ్వజమైన చేపలను జయించే విధంగా ఉన్నాయి." ఈ విధంగా ఆలోచిస్తూ అర్జునుడు మళ్ళీ సుభద్ర సేవ చేయడానికి వస్తే బాగుంటుందని ఆశపడ్డాడు. వస్తే మళ్ళీ విడిచి పెట్టకూడదని అనుకున్నాడు. తన శత్రువైన శంకరుడిని జయిస్తాడని విడిచిపెట్టాడుగాని, లేకపోతే శృంగారవనంలో ఒంటరిగా విరహంతో ఉన్న అర్జునుని మన్మథుడు బాధించక విడిచేవాడు కాదు.

**సుభద్ర విరహం :** ఇక్కడ అర్జునుడు ఇలా బాధపడుతూ ఉంటే అక్కడ అంతఃపురంలో సుభద్ర మన్మథబాధకులోనయి ఇలా అనుకుంటూ ఉన్నది. నేను కోరిన ప్రియుడు కోరి ప్రార్థించినా కౌగిలి ఈయకుండావచ్చిన అవివేకిని. అర్జునుడు చేయిపట్టి లాగినప్పుడు కౌగిలించి సుఖసముద్రంలో తేలకుండా సిగ్గు అడ్డు పడింది. ఇంతకుముందులాగా నేను అతని సేవకు వెళ్ళకూడదు గదా ! పెద్దలు పెళ్ళి చేస్తారని చెప్పివచ్చాను. అలా చెప్పి పెళ్ళికాకుండా అతని వద్దకు వెళితే చులకన అవుతాను కదా ! నన్ను ప్రేమించిన ఆయాసం పోయేవిధంగా నేనెప్పుడు అతనిని అలంకరిస్తానో ? చేయి విడిపించుకున్న నేరం పోయేటట్లు నేనెప్పుడు అతని చెంత చేరుతానో ? ప్రేమను ఆటంకపరిచిన నా దుడుకుతనం పోయేటట్లు ఎప్పుడు కళ్యాణం జరుగుతుందో ? మోహతాపం తీరేటట్లు అతనికి అధరామృతంతో ఎప్పుడు సంతృప్తి కలిగించగలనో ? ఉద్యానవనంలో ఒంటరిగా వదలివచ్చిన వ్యథపోయేటట్లు అతనిని ఎప్పుడు నా కుచాల మీదకు చేర్చుకుంటానో ? ఈ విధంగా ఆలోచించుకుంటూ సుభద్ర నిద్రపోయింది. నిద్రలో అర్జునునితో కూడినట్లు కలగని సంతోషించింది. అది కల అని గ్రహించి కలతపడింది. అంతఃపురంలో సుభద్ర విరహతాపంతో కృష్ణకృష్ణాయని బాధపడుతూ ఉంటే, ఉద్యానవనంలో అర్జునుడు విరహతాపంతో రామారామా అని పరితపించాడు. మనస్సులో అర్జునుడు ఉండడం చేత విరహతాపాన్ని భరించలేక సుభద్ర ముఖం పాలిపోయింది.

**వదినెలు మేలములాడటం :** "శరీరం పులకరించింది. ఏమి తలచుకుంటూ ఉన్నావు?" అని మిత్ర వింద, "ఇన్నాళ్ల వలె మనసిచ్చి మాటాడవు. చూపు ఎక్కడ ఉంది?" అని కాళింది, "చెలి పెండ్లి కథ చెబుతున్నది విను" అని భద్ర, "నీ ముఖం వలపు వాసన వస్తుంది సుమా" అంటూ సుదంత పరిహాసం చేశారు. జాంబవతి, లక్షణ సరసమాడారు. అల్లరి చేయవద్దని రుక్మిణి అంటే సత్యభామ కన్నుగీటింది. "ఇన్నాళ్ళ నుంచి మునికి సేవలు చేయడానికి పోయేదానవు. ఈ రోజు అటుతొంగి చూడవెందుకు ? ముని తప్పుచేశాడా ?

మచ్చిక చూపే హంసలను, చెంతకు వచ్చిన చిలుకలను, సమీపించిన చెలికత్తెలను తిరస్కారంతో చూస్తున్నావు. నీ ప్రవర్తన వింతగా ఉంది. నీవెవ్వరిని మోహించావు. నీ మనస్సులో ఎవడు ప్రవేశించాడు ? ఎవని అందం నిన్ను ఆకర్షించింది. దాచకుండా నిజం చెప్పు. నీ శరీరం పూవులాంటిది. అది పిల్లగాలికే సొలిపోతుంది. చిలుక వాలినా కందిపోతుంది. అది విరహాగ్నిని ఎలా సహిస్తుందో గదా !" ఈ విధంగా వారందరు అంటూ ఉంటే విని సిగ్గుతో సుభద్ర మారుమాట్లాడలేదు. తరువాత వారిట్లా అనుకున్నారు. "ఈ సుభద్ర మనకు బదులు చెప్పడంలేదని అమాయకురాలు అనుకుంటున్నారేమో ! ఈమె భర్తను సేవకునిగా చేసుకోగల సామర్థ్యం గలది. చమత్కారంగా మాట్లాడడంలో దిట్ట. ఆమె శరీరం చూడండి. కాలుతూ ఉన్నది. ఏదేదో పలవరించే ఈమెకు దయ్యం పట్టిందేమో ! ఆ సన్యాసికే చూపించాలి" అని సత్యభామ నవ్వింది. సుభద్రకు ఉపద్రవం కలగకుండా ఏమి చేయాలో బోధచేసింది.

**శీతలోపచారాలు :** సుభద్ర బాధకు ప్రేమే కారణమని గ్రహించిన చెలికత్తెలు శైత్యోపచారాలకై తామరతూళ్ళు, చిగుళ్ళు, పూవులు సమకూర్చుకున్నారు. సుభద్రను పన్నీటితో స్నానం చేయించారు. చలువవస్త్రాలను కట్టారు. శరీరం నిండా మంచిగంధం పూశారు. పచ్చకర్పూరంతో తిలకందిద్దారు. సిగలో పూలమాలలను తురిమారు. చన్నుల మీద ముత్యాలహారాలు ఉంచారు. ఒక చెలికత్తె తేనెను తెచ్చి సుభద్ర అధరానికి రాసింది. మరొకచెలికత్తె పూలగుత్తులను స్తనాలమీద అమర్చింది. ఇంకొక చెలికత్తె తామరతూండ్లను చేతులయందు కూర్చింది. మరొక చెలికత్తె చిగురుటాకులను పాదాలమీద చేర్చింది. శరీరం మీద ఉన్న పన్నీరు, గంధం, పూలమాలలు చూస్తే అర్జునుని గెలవడానికి మన్మథుడు పూజించిన గజరాజంలాగా సుభద్ర కనిపించింది. కుండలవంటి సుభద్ర స్తనాలమీద పూసిన గంధం విరహాగ్నివల్ల పెట్లి రాలిపోవడం చూచి చెలికత్తెలు మన్మథునకు అర్పితమైన పాలు, బియ్యం లేని పొంగలి పొంగిపోయింది" అనిగేలి చేశారు. చెలికత్తెలు ఈ విధంగా శైత్యోపచారాలు మన్మథుడినీ, అతని అనుచరులైన మందమారుతం, చంద్రుడు, కోకిల మొదలయిన వారిని నిందించసాగారు.

**మన్మథాదులను నిందించటం :** "గొప్ప ఇంటివారు డబ్బు కూడబెట్టాలన్న కోరికతో తమను ఆశ్రయించిన బాటసారులను ఉపేక్షించరు. మన్మథా ! పూవిల్లు ధరించే నీవు కోకిలలను చేరదీసి నీ శరణుజొచ్చిన విరహిణులను బాధించడం మహాదోషం సుమా! విరహంతో ఉన్న వారిని బాధించడం నీకు చేతకాక నీవు చంద్రుడిని సాయం తెచ్చుకున్నావు. అందగాడవయిన నీవు అందగాళ్ళయిన చంద్రుడిని, వసంతుడిని చేరదీయడం బాగానే ఉందిగాని ఆకారంలేని లేతగాలి అనే నాలిముచ్చు భూతాన్ని చేరదీయడం బాగాలేదు. చంద్రుడు నీతల్లి లక్ష్మికి నట్టింటి పగవాడు. అతడు కంసునివలె దుర్మార్గుడు. అతనితో స్నేహాన్ని విడిచిపెట్టు - లేకపోతే మేనమామ అయిన అతడే నీకు హాని కలిగిస్తాడు. మందమారుతమా ! సుభద్ర శరీర పరిమళం తనకు లేదనే ఈర్ష్యతో మలయ పర్వతం బాధించడానికి నిన్ను పంపించింది. అలాగే పద్మాలుండే సరస్సు కూడా ఈర్ష్యతో నిన్ను పంపించిందా ? మన్మథుడు నాయకుడుగా, చంద్రుడు, తుమ్మెదలు, కోకిలలు, చిలుకలు సైన్యంగా చేసి ముందుగా నీవు వచ్చావా ? ఓ మలయ మారుత చంద్రులార ! మీరు సుభద్రను చల్లగా చూడండి. మదనునితో స్నేహంచేసి తాపాన్ని కలిగిస్తే శివుని పాదం మీద ఒట్టే. చంద్రా ! సుభద్రకు ఒక్కతెకే ప్రేమకలిగిందా ? అలాంటి వారెందరో ఉంటారు. కనక సుభద్రను బాధపెట్టక విడిచిపెట్టు. శివుడు రమ్మని ఆదరిస్తే తలకెక్కావు. కోపంతో చూస్తే కాళ్ళు పట్టుకున్నావు. అందితే సిగ, అందకుంటే కాళ్ళు పట్టుకునే నీ స్వభావం, నీ ప్రవర్తన సమయానుకూలంగా మారుతూ ఉంటాయి. పాలసముద్రంలో పుట్టడం, నల్లదనాన్ని కలిగిఉండడం, శివుని తలమీద ఉండడం, తాకడానికి వీలులేకుండా ఆకాశాన ఉండడంవల్ల నిన్ను కాలకూటవిషం అని పిలిస్తే తప్పు కాదు.

"లోకాలకు అపకారం చేస్తారనే భావనతోనే సముద్రుడు పుట్టిన వెంటనే నిన్ను, కాలకూట విషాన్ని శివునికి ఇచ్చివేశాడు. మన్మథుడు శివుని ఎదిరించి పోరాడి కాలి బూడిద అయినప్పుడు కనిపించని నీవు, వసంతుడు, మందమారుతమూ, అతడిప్పుడు బ్రతికి బయటపడగానే మంత్రులుగా పెద్దరికం చేయడానికి సిగ్గుపడరేమిటి ? కోకిలా ! నీవు, నీ కంఠ స్వరంలాంటి స్వరంగల మా సుభద్ర స్నేహంగా ఉండేవారుగదా! నీవిప్పుడామెను బాధించటం ధర్మమా ? విషసర్పాలను తినే నెమళ్ళను, అగ్నికణాలను తినే చకోరాలను క్రూర స్వభావం ఉండవచ్చు గాని తామర తూడులు తినే హంసలు, లేత చిగురులు తినే కోకికలు ఇతరులను బాధించకూడదు. కాని సుభద్ర విషయంలో అవికూడా బాధించే విధంగా కూస్తున్నాయి. ఓ చిలుకా ! నీవు చెలికి కటువుగా మాట్లాడవద్దు. సుభద్రను రెచ్చగొడితే మాటవస్తుంది సుమా! తుమ్మెదలారా ! మీరు మాకు అనుకూలంగా ఉంటారని భావిస్తే, ఈ విధంగా రొదపెట్టి సుభద్రను బాధించడం మీకు ధర్మం కాదుగదా!" అని చెలికత్తెలు చంద్రుడు మొదలయినవారిని నిందించారు.

అప్పుడు సుభద్ర విరహతాపంచేత ఆగండి అంటూ చెలికత్తెలను ఆపి పడకమీద ఉన్న పూవులు మొదలైన వానిని చూపి "మకరందం త్రాగే తుమ్మెదలు, లేత చిగుళ్ళు తినే కోకిలలు, పండు వెన్నెల ఆస్వాదించే చకోరాలు, తామర తూండ్లు భుజించే హంసలు బాధపడక ఉన్నాయంటే వానివి వజ్రకాయాలై ఉంటాయి. మలయమారుతం గర్వం అణచడానికి పాములు ఉన్నాయనుకుంటే, ఆ పాములను తినడానికి నెమళ్ళు దాపురించాయి. నన్ను మన్మథుడు పీడిస్తూ ఉండే అతనికి సాయంగా చంద్రుడు వచ్చాడు. మన్మథుడేమో తేనెలు చిలికే పూలబాణాలను చెరకు వింటితో సంధిస్తూ ఉన్నాడు. అయినా అవి బాధ కలిగిస్తూనే ఉన్నాయి." అని అంటూ ఉంటే చెలికత్తెలు ఆమెకు ధైర్యం చెప్పాలని ఇలా అన్నారు. "గాలి మన స్వాధీనంలో ఉంటుంది. చంద్రుడు మనుషుల జోలికిరాక ఆకాశంలో ఉంటాడు. మన్మథుడి బాణాలైన పూలను మనం తలలో పెట్టుకుంటాము. కావున భయపడవలసిన పనిలేదు" ఈ విధంగా సుభద్రను ఊరడించి సుభద్ర విరహవేదన గురించి దేవకీదేవికి చెప్పకపోవడం ఉచితం కాదని భావించి ఆమెకీ సంగతి వివరంగా తెలియ జేశారు.

**సుభద్రా వివాహం :** కృష్ణుడంతకు ముందే తల్లిదండ్రులను, కుమారులను, తమ్ముడు సాత్యకిని పిలిచి సుభద్రార్జునుల ప్రేమ విషయాన్ని తెలియజేశాడు. "ఈ విషయం బలరామునికి తెలిస్తే వివాహం చేయడానికి వీలుకాదు. అతనికి దుర్యోధనుడంటే అభిమానం. అందుచేత ఈ వివాహానికి ఇష్టపడడు. ఈ ఆటంకం తప్పించుకోవాలంటే ఒక మార్గం ఉంది. రేపటినుంచి శివునికి ఉత్సవాలు జరుగుతాయి. బలరాముడు అక్కడికి వెళతాడు. అతనికి తెలియకుండా పెళ్ళి ఏర్పాట్లను చేయండి. ఎనిమిది రోజుల్లో మంచిముహూర్తం ఉంది. ఆ ముహూర్తానికి నేను వస్తాను" అని కృష్ణుడు మార్గాంతరాన్ని ఏర్పాటుచేసి శివుని ఉత్సవాన్ని తిలకించడానికి బలరాముడు, వసుదేవుడు మొదలైన వారిని అంతర్ద్వీపానికి పంపించి తానుకూడా వెళ్ళాడు. అతనితో పాటు యదువృష్ణి భోజకులజులందరూ ఆ ఉత్సవానికి కదలి వెళ్ళారు. అక్కడ శివమహోత్సవం వైభవంగా సాగుతూ ఉంటే కృష్ణుడు బలరామునితో కూడి ఆ ఉత్సవాలను తిలకించాడు.

ద్వారకలో దేవకీదేవి, రుక్మిణి మంచి లగ్నంలో సుభద్రార్జునుల చేతులకు దీక్షాకంకణాలు కట్టారు. శరీరాలకు నలుగు పెట్టారు. కేశాలలో పూలదండలు అలంకరించారు. పుణ్యస్త్రీల చేత మంగళగీతాలు పాడించారు. సత్యభామాది యాదవరాణులు సుభద్రార్జునులకు వారి వారి మందిరాల్లో విందులు చేశారు. పురోహితుడు వివాహం చేయడానికి వచ్చాడు. ఒక చెలికత్తె కిరీటికి సంపంగినూనె అంటింది. మరొక చెలికత్తె తలరుద్ది స్నానం చేయించింది. చెలికత్తెలు అర్జునుని తలతుడిచి చలువబట్టలు కట్టబెట్టారు. జవ్వాది పూసి సిగలో పూవులు పెట్టారు. నుదుట తిలకందిద్దారు. శరీరమంతా చందనం పూశారు. ఆ అలంకరణతో ఉన్న అర్జునుడిని చూచి చెలికత్తెలు "అర్జునుడు యతివేషం వేసి మంచే చేశాడు. వేరే వేషం వేసి ఉంటే సిగవేసుకోవడం కుదిరేదికాదు. కాషాయాన్ని, కమండలాన్ని విడిచి పెండ్లికొడుకయ్యాడు. ఇది చిత్రమైన సన్యాసమేసుమా! ఇన్నాళ్ళూ ఈ ఉద్యానంలో ఉన్న యతే అర్జునుడు అంటే నమ్మలేదు. అతనిలో ఈ శరీరకాంతి గాని, రాజసంగాని, వర్చస్సుగాని, వయ్యారంగాని, మీసాలలో దాగిన నవ్వులుగాని అప్పుడు కనిపించలేదు. లోకంలో మన్మథుడు, చంద్రుడు, వసంతుడు అందగాళ్ళు అని అంటారుగాని అర్జునుడే వాళ్లకన్నా అందగాడు. అదృష్టం అంటే ఇతనికి సేవ చేసిన వారిదే. ఇలాంటి అందగాడితో సుఖిస్తేనే ఆడదాని జన్మ సార్థకమవుతుంది. మంచి భర్త లభించాలని కోరుకునే సుభద్రకు మంచి భర్తే దొరికాడు. అది ఆమె అదృష్టం అనుకోవచ్చు" అని అనుకున్నారు.

అలాగే కొందరు చెలికత్తెలు సుభద్రకు తలంటి స్నానం చేయించారు. తలదువ్వి జారుకొప్పువేశారు. సుభద్ర కస్తూరితో తిలకం దిద్దుకుంది. రత్నాభరణాలు ధరించింది. లక్ష్మీదేవిలాగా బంగారు పీటమీద కూర్చున్నది. అంతలో సూర్యుడు అస్తమించాడు. చంద్రుడు ఉదయించాడు. వివాహ మండపంలో కులదేవతను తెచ్చి నిలిపారు. అరివేణి కుండలను అమర్చారు. ముత్యాలతో బాసికాలు కట్టారు. బంగారు పళ్ళేలలో ముత్యాల తలంబ్రాలు సిద్ధం చేశారు. మంగళ వాద్యాలు మ్రోగించారు. ముహూర్త సమయానికి కృష్ణుడు వచ్చాడు. అతని వెనుక వసుదేవుడు, సారణుడు, సాత్యకి, ప్రద్యుమ్నుడు, సాంబుడు మొదలైనవారు వచ్చారు. ఈలోపు ఇంద్రుడు, దేవతలు, అప్సరసలు, మహర్షులు, అరుంధతి, బృహస్పతి, శచీదేవి ప్రవేశించారు. అర్జునుడు తండ్రియైన ఇంద్రునికి నమస్కరించాడు. ఇంద్రుడు పుత్ర వాత్సల్యంతో అతనిని కౌగలించుకున్నాడు.

బృహస్పతి సుముహూర్తం సమీపించిందని చెప్పిన వెంటనే ఇంద్రుడు బంగారు పట్టువస్త్రాలు, కిరీటం మొదలైన రత్నాభరణాలతో బాసికాన్ని సింగారించి, పారిజాత పుష్పహారాన్ని మెడలో వేసి అర్జునుడిని ఐరావతం మీద ఎక్కించాడు. కొందరు ముత్యాల గొడుగుల పడితే, కొందరు వింజామరలు వీచారు. కొందరు మంగళ తూర్యనాదాలు వినిపిస్తే మరికొందరు కాగడాలు వెలిగించి తెచ్చారు. ప్రద్యుమ్నుడు, జయంతుడు బరాబరులు చేస్తూ ఉండగా, ఇంద్రుడు, కృష్ణుడు ఉత్సవ అగ్రభాగాన నడచివచ్చారు. అనిమిషభావం సార్థకమయింది అనుకుంటూ అప్సరసలు అర్జునుడి ఒడలెల్ల కన్నులుగ తిలకించారు.. ఈ విధంగా వారంతా రుక్మిణీ గృహం వద్దకువెళ్ళారు. సాత్యకి

చేయి అందించగా అర్జునుడు ఐరావతం దిగాడు. ముత్తయిదువులు తలంబ్రాల చల్లుతుండగా అతడు కళ్యాణవేదిక వద్దకు వచ్చాడు. అప్పుడు సుభద్రను కూడా వేదికవద్దకు తీసుకువచ్చారు. "మనం తిలోత్తమ అందాన్ని మెచ్చుకుంటూ ఉంటాము. దాని అందం సుభద్ర అందంతో పోలిస్తే తక్కువే" అని అప్సరసలు గుసగుసలు పోయారు. ఈ దంపతులు అందాన్ని చూడాలంటే వేయికళ్ళు కావాలని కవులు అనుకుంటే, వేయికళ్ళున్న ఇంద్రుడు పదివేల కళ్ళు కావాలని కోరుకున్నాడు. కృష్ణుడు కూడా ఇంద్రుడి లాగానే సమీపంలో ఉండిచూస్తూ ఉన్నాడు.

కొందరు స్త్రీలు తెర అమర్చారు. వసుదేవుడు అర్జునుడికి మధుపర్కాలు సమర్పించాడు. దేవకి అందిస్తూ ఉండగా అర్జునుడి పాదాలు కడిగి కన్యాదానం చేశాడు. ముత్తయిదువులు తలంబ్రాలు పాత్రలను వధూవరుల సమీపానికి చేర్చారు. తెర కొంచెం దించగానే సుభద్ర నవ్వుముఖం చంద్రబింబంలాగా కనబడింది. అర్జునుడు సుభద్ర ముఖాన్ని పైకెత్తి, మెడక్రిందికి చేతులను పోనిచ్చి, జడను తప్పించి, మంగళసూత్రం కట్టాడు. సుభద్రార్జునులు ఒకరిపై ఒకరు తలంబ్రాలు పోసుకున్నారు. ఆహూతులు అక్షతలు చల్లారు. వధూవరులు చూసేవారికి కనుల పండుగగా కనిపించారు. అర్జునుడు శచీదేవికి, ఇంద్రునికి నమస్కరించాడు. సుభద్ర క్రొత్తవారు కావడంచేత నమస్కారం చేయడానికి సందేహించింది. "కోడలు అత్తమామలను ఇలవేల్పులుగా పూజించాలి. నీకు ఆ వేల్పులే అత్తమామలయ్యారు" అంటూ దేవకీ శచీంద్రులకు సుభద్ర చేత నమస్కారం చేయించింది. "మంచి లక్షణాలు గల కన్యకు మంచి వరుడిని చూచి పెళ్ళిచేశారు. నైపుణ్యం అంటే మీదే" అని ఇంద్రుడు అంటే "ఆప్తులైన మీరు రావడం చేతనే పెళ్ళి వైభవంగా జరిగింది" అంటూ కృష్ణుడు బదులిచ్చాడు. తర్వాత స్త్రీ పురుషులందరు బువ్వాన భోజనం చేశారు. కృష్ణుడు నమస్కారంతో ఇంద్రునికి వీడ్కోలు చెప్పాడు. రుక్మిణి శచీదేవికి కస్తూరి ఇచ్చింది. ఆమె దేవకీదేవిపై కొంచెం చిలకరించింది. "మొదటి సంబంధంలో అత్తవైన నీవు ఈ సంబంధం చేత వియ్యపురాలవయ్యావు. నీ కూతురిని నా కొడుకు పెండ్లాడడం మంచిదే. అత్త వరస కలిగిన కన్యను పెళ్ళాడితే ఆయువు కలిగినవాడవుతాడని అంటారుగదా ! ఈ సంబంధం వలన శుభమే జరుగుతుందిలే" అని శచీదేవి సరసమాడింది. సత్యభామ తనకు నమస్కారం చేస్తే ఆమెతో" చెల్లెలా ! పెరటి చెట్టుగా ఉన్న పారిజాతం అందంగా ఉందా ? నా మనస్సు ఎప్పుడూ దానిమీదే ఉంటుంది. అదినీకు పుట్టిల్లు, అత్తవారి ఇల్లులాగా అభివృద్ధిని కలిగిస్తుంది" అని సందర్భోచితంగా మాట్లాడి ఇంద్రునితో దేవలోకానికి వెళ్ళింది.

**సుభద్రార్జునుల ప్రయాణం :** "ఇంక ఆలస్యం చేయకూడదు. ఇంద్రప్రస్థానికి వెళ్ళి నాగవళి చెయ్యాలి. తొందరగా బయలుదేరండి" అని కృష్ణుడు అర్జునుని ప్రయాణానికి ఏర్పాట్లు చేశాడు. అర్జునుని రాక గురించి ధర్మరాజుకు వేగులద్వారా వర్తమానం పంపాడు. తరువాత ఆనాటి రాత్రే అణకువతో బలరాముని వద్దకు వెళ్ళాడు. దేవకి సాగనంపడానికి సుభద్రను పిలిచింది. పుట్టిల్లు విడిచి వెళ్ళడానికి బాధపడుతూ సుభద్ర కన్నీరు పెట్టింది. ఆమెను చూచి దేవకీదేవికి కన్నీరు తిరిగాయి. ఆమె కన్నీరు శుభం కాదని కనపడనీయలేదు. "సుభద్రా ! కుంతీదేవి నీ మేనత్తే. మీరు ప్రేమించి పెళ్ళాడినవారు. లోకోత్తరుడైన అర్జునుడే నీ భర్త. నీకు మంచి కాపురం దొరికింది. త్వరలో మేము చూడడానికి వస్తాములే. విచారం ఎందుకు ?" అంటూ ఆమెను దీవించి సాగనంపింది. అర్జునుడి చేతిసాయంతో సుభద్ర రథం మీదికి ఎక్కింది. రథం మీదున్న ఆ దంపతులను చూచి వీరు రతిమన్మథులని చూపరులు భావించారు.

ఇంద్రప్రస్థానికి వెళుతున్న సుభద్రార్జునులను కావలి వాళ్ళు గమనించారు. వాళ్ళను వదిలిపెడితే బలరామకృష్ణుల వలన మాట వస్తుంది అనుకున్నారు. రథాన్ని ఆపడానికి వాళ్ళు చేస్తున్న హడావుడి చూచి సుభద్ర అర్జునునితో" నాకు రథాన్ని నడపడం తెలుసు. మా అన్న నేర్పాడు. యుద్ధం చేయడం వచ్చు. వదిన సత్యభామనేర్పింది", అంటే కృష్ణుడు "సుభద్రా! ఇది నువ్వు చేయాల్సినంత పనికాదు. నేనున్నాను గదా ! ఎదిరించే సైన్యాలను ఛిన్నాభిన్నం చేస్తాను. నీ యిష్టం ఎందుకు కాదంటాను. రథాన్ని నడుపు" అని ధనుర్బాణాలు చేబూనాడు.

రాకుమారిని దొంగతనంగా తీసుకుపోవడం తప్పని కావలి వారు హితవు చెప్పబోగా "నన్నాపుటకు మీరు సమర్థులు కారు. బ్రతకాలనే ఆశ ఉంటే దూరంగా పొండి" అని అర్జునుడు బదులిచ్చాడు. కావలివారు అర్జునుడి రథాన్ని చుట్టుముట్టారు. చతురంగ బలాలతో తనను చుట్టుముట్టిన సైన్యాన్ని అర్జునుడు తన బాణసమూహంతో తుత్తినియలు చేశాడు. రథం నడుపుతున్న సుభద్రను చూస్తూ శత్రుసైన్యంతో పోరాటంలో సాగించే అర్జునుడిని చూస్తే అతని చేతులకు కన్నులున్నాయా అనిపించింది. అతడు యుద్ధపు పెండ్లికొడుకు అన్నట్లు యుద్ధం చేస్తూ ఉంటే అతడు ప్రయోగించిన బాణాలకు లెక్కేలేదు. అతని ధాటికి ఓర్వలేక సైనికులు చెల్లాచెదరుగా పారిపోయారు. అర్జునుడు విజయలక్ష్మి సమేతుడై నదీనదాలు, అడవులు, కొండలు దాటి ఇంద్ర ప్రస్థానికి చేరుకున్నాడు. సుభద్రను అంతఃపురానికి పంపి ధౌమ్యునికి నమస్కరించి ఆశీర్వాదం పొందాడు. ధర్మరాజుకు, భీమునికి సాష్టాంగ నమస్కారాలు చేసి, కుంతికి వందనాలు అర్పించి, ద్రౌపదిని పల్కరించి సుఖంగా ఉన్నాడు.

**ద్వారకలో బలరాముని ఆర్భాటం :** అర్జునుడి చేతిలో ఓడిపోయిన సైనికులు భేరిని మ్రోగిస్తే విని బలరాముడు మొదలైన యాదవులందరు ద్వారకకు వచ్చారు. అర్జునుడు సుభద్రను తీసుకొని వెళ్ళిన వృత్తాంతం తెలుసుకున్నారు. "సన్యాసి వేషం వేసి కన్యను అపహరిస్తాడా ? దీనిని యాదవులు సహిస్తారనుకున్నాడా ? వీరుడైన వాడికి ఇదా పద్ధతి ? దీనిని బలరాముడు సహించడు. వారి రాజ్యాన్ని దున్నివేస్తాడు. శత్రువులను ధూళి చేస్తాడు'' అని బలరాముడు అన్నంతనే యాదవవీరులు "యాదవబలం బయలుదేరితే అడ్డుకునేవారు లేరు. ఇంద్రకుమారుడైన అర్జునుడే కాదు, వాని తండ్రి ఎదిరించినా, జయించి అతడిని పట్టి కట్టి తెస్తాము.'' అని కోపంతో పలికారు. ఆ మాటలన్నీ విని కృష్ణుడు ఇలా అన్నాడు. "సోదరా ! మిమ్మెదిరించేవారు లేరు. అది తెలిసీ కోపాన్ని పొందడం నేర్పుకాదు. తగని చోట ఓర్పు చూపడం మంచిది. విలువిద్యలో నేర్పరి అయిన అర్జునుడు సామాన్యుడు కాదు. అతడిని శివుడు కూడ జయించలేడు. మత్స్యయంత్రాన్ని కొట్టి ద్రౌపదిని గ్రహించినవాడు. అతడినెదిరించిన రాజులపాట్లు మనకు తెలియవా ? యతిగా వచ్చినప్పుడే అనుమానం కలిగింది. సుభద్రను సేవ చేయడానికి పంపించవద్దని ఆరోజు చెప్పాను. ఆ మాట అలా ఉంచు - అతడేమీ దూరంవాడు కాదు. మనకు మేనమరిది. యోగ్యుడు. నిష్ఠురవాక్యాలు మాటాడడం మంచిది కాదు. అర్జునుడితో సమానమైన వీరుడు ఈ రాజులలో కనిపించడు. అతడు శత్రువులనైనా తూలిమాట్లాడడు. కోపం వచ్చినా స్నేహాన్ని మరువడు. సరసుడు, అందగాడు, సుభద్రకు ఇంతకంటే మంచి వరుడు దొరుకుతాడా ? పాండవులందరు మనలనే నమ్ముకున్న వారు. ధర్మరాజు మిమ్ములను పెద్దగా గౌరవిస్తాడు. ఇంద్రప్రస్థానికి మీరు వెళితే ఎదురుగా వచ్చి గౌరవంతో తీసుకుపోతాడు. కాబట్టి మీరు వెళితే నాగవళికి ఇంద్రప్రస్థానికి వెళదాము. పదండి'' అని వివరించాడు.

**బలరామాదులు ఇంద్రప్రస్థానికి వెళ్ళడం :** బలరాముడు ఆప్తబంధుమిత్ర సపరివారంగా ఇంద్రప్రస్థానికి వచ్చాడు. ఈ విషయం ముందే తెలియడం వల్ల పాండవులు అంతఃపురాన్ని అందంగా అలంకరింపజేశారు. బలరాముడికి ఎదురేగి నమస్కారాలు చేసి కానుకలు అర్పించారు. అర్జునుడు సుభద్రతో వచ్చి బలరాముడికి నమస్కారం చేశాడు. బలరాముడు సుభద్రార్జునులను కౌగిటిలో చేర్చుకున్నాడు. ధర్మరాజు 'బావా' అంటూ కృష్ణుడికి మ్రొక్కాడు. కృష్ణుడతడిని లేవనెత్తి కౌగలించుకున్నాడు. "పాండవులకు శుభాలు కలిగించేవాడవు నీవేసుమా'' అంటూ ధర్మరాజు కృష్ణుడిని కీర్తించాడు. బలరామకృష్ణులను ఏనుగుమీద నగరానికి తీసుకుపోయాడు. అంతఃపురంలో వారు కుంతికి నమస్కారం చేశారు. తమకు నమస్కారం చేసిన ద్రౌపదితో సంతోషం కలిగేటట్లు సంభాషించారు. బంధు సాంగత్యం వలన కలిగే ఆనందాన్ని అనుభవించారు. ధర్మరాజు చేసిన ఏర్పాట్లు వారికి సంతోషం కలిగించాయి. వియ్యాలవారికి ప్రయాణాయాసం తీరిన తరువాత ధర్మజుడు "చనువు ఉండడంచేత బలత్కారంగా కన్యను తీసుకువచ్చాము. ఆ ధైర్యం కలిగించినవారు మీరే. ఇలాంటి అనుకూలురైన బంధువులు లోకంలో ఉంటారా ? ఈ కృష్ణుడు సాక్షాత్తు విష్ణుమూర్తి. బలరామా ! నీవు ఆదిశేషుడవు. ఇట్టి మీతో బంధుత్వం కలగడానికి మేమెంత తపస్సు చేశామో !'' అని పలికాడు. అతని మాటలకు బలరాముడు సంతోషించాడు. వివాహోత్సవం వైభవంగా జరిపించాడు. ఈ ఉత్సవాలు ఐదు రోజులు జరిగాయి. ఉత్సవానంతరం సుభద్రార్జునులు కృష్ణుడికి నమస్కారం చేశారు. కృష్ణుడు ఆ ఇద్దరిని దీవించాడు. బంధువులతో అర్జునుడు పండువెన్నెలలో విందులు ఆరగించాడు.

కేళీ గృహాన్ని అందంగా అలంకరించారు. వజ్రాలు, రత్నాలు పొదిగి పందిరిని ఏర్పాటు చేశారు. గదిలో శృంగార చిత్రాలను అలంకారంగా ఉంచారు. నవరత్నాలు ఉపయోగించి మంచాన్ని సిద్ధం చేశారు. గదిలో పరిమళద్రవ్యాలను ఉంచారు. పంజరాలలో చిలుకలను గోరువంకలను ఉంచారు. మంచానికి తెరలు అమర్చారు. అందమంతా అక్కడే ఉన్నట్టుగా అలంకరించబడ్డ ఆ కేళీగృహంలో అర్జునుడు సుభద్రకోసం ఎదురుచూస్తున్నాడు. చెలికత్తెలు సుభద్రను అందంగా అలంకరించి "సుభద్రా ! ఇంకా ఆలస్యం ఎందుకు ? నీ భర్తకు తాంబూలం ఇవ్వాలి. ఇదే మంచి ముహూర్తం సుమా !'' అని ఆమెను కేళీగృహానికి వెళ్ళడానికి ఆయత్తం చేశారు.

**చెలికత్తెల సరసాలు :** "నీ భర్త ప్రేమతో పిలిస్తే దగ్గరగా వెళ్ళు. ప్రక్క కూర్చో మంటే కూర్చో. తాంబూలం చేతికిస్తే తీసుకో. నీ మాటలు వినాలని అడిగితే మాట్లాడు. కొంచెం సిగ్గుగా ఉన్నా చప్పున ఇవతలికి రాకుండా కాసేపు అక్కడే నిలబడు. ఏదో చెప్పాలి కాబట్టి చెప్తున్నాము గాని మీ యిద్దరికీ మనస్సు ఊరకుంటుందా ? పడకటింటికి వెళ్ళడానికి ఇంతజాగు చేస్తే ఎట్లా ? శోభన సమయంలో పడకటింటికి వెళ్ళేటప్పుడు సిగ్గుపడే యువతులను చూశాంగాని ఇంత సిగ్గుపడే దానిని నిన్నే చూస్తున్నాం. ఇలాంటి వారే భర్తను తమ వశంలో ఉంచుకుంటారని అంటారు సుమా ? అక్కడ ద్వారకానగరంలో ఉద్యానవనంలో నీవు ఆ అర్జునుడికి సేవ చేసేటప్పుడు ఏం జరిగిందో, ఇక్కడికి వచ్చేటప్పుడు దారిలో ఒంటరిగా ఉన్నప్పుడు ఏంజరిగిందో ఎవరికి తెలుసు ? మన్మథుడు తొందరపాటు కలవాడు - నీభర్త అంతకంటె తొందరపాటు ఉన్నవాడు. వారిద్దరిని నీవు నీచూపులతోనే స్వాధీనం చేసుకోగలదానవు. నీవు ఉచితానుచితాలను,

వేళను లక్ష్యపెడతావా ? ఇప్పటి ఈ సిగ్గు అప్పుడేవమవుతుందో ? కోపించినా, మొగమటు తిప్పి విముఖత్వాన్ని ప్రకటించినా, చేత్తో తోసివేసినా, కనుబొమలు ముడిచి విసుగు కనబరిచినా కాదనము కాని ద్వారకలో మీ యిద్దరు అన్యోన్యంగా ఉండడం మీ శరీరాల్లో కనిపించే యౌవనోద్రేకాలు తలచుకుంటే నీవు లక్షమాటలు చెప్పినా నీవీలక్షణాలు అర్జునుడి వద్ద చూపుతావని మేము నమ్మజాలము సుమా ! మేము చెప్పింది అయినా కాకున్నా మంచిదే - దానికేమిలే. ఇట్లా కాసేపు నవ్వుకున్నాము అంతే. ఇంకా ఆలస్యం ఎందుకు ? ఈ సరసాలతోనే ప్రొద్దుపోయేటట్లు ఉంది. పద, కేళీగృహానికి వెళదాము " అని చెలికత్తెలు సరసాలాపాలు పలికి సుభద్రను అర్జునుడున్న కేళీగృహానికి తీసుకువెళ్ళారు. సుభద్ర వస్తూఉంటే భవనాలన్నింటిలో పరిమళం వ్యాపించింది. ఆమె శరీరం కాంతి మిరుమిట్లు గొలుపుతూ నాలుగు దిక్కులను ఆక్రమించింది. ఆమె కేళీగృహానికి రాకముందే అర్జునుడి మనస్సులో ప్రేమ సంబంధమైన కోరికలు నిండిపోయాయి.

ఆ చెలికత్తెలు సుభద్రార్జునులను దగ్గరగా చేర్చి ఒక చోట కూర్చోబెట్టారు. "ఈ సుభద్ర రథాన్ని ఎలా నడిపిందో తెలియదు గాని మేమిప్పుడామెను రథాన్ని లాక్కువచ్చినట్లు తీసుకువచ్చాము. ఈ సుభద్ర ఏమీ తెలియని ముద్దరాలు. ఉపాయంతో దిద్దుకో. ఈమె కసిగాటులకు సహించలేదు. ఇంక దంత క్షతాలను గురించి చెప్పేపనేముంది. ఇక ఈ స్తనాలు నీ సొత్తే సుమా ! శృంగారం గురించి నీకు అన్నీ తెలుసుగదా ! ఈమెను చూచుకో. సుభద్రా ! అర్జునుడు తాంబూలం ఇస్తున్నాడు. కొంచెం ముఖాన్ని పైకెత్తు. మన్మథుడు లాంటి అందగాడు నీకు లభించాడు. ఇక చెప్పేదేముంది ? వచ్చి వక్కలు తీసుకో. నీ భర్తకు ఇవ్వు. శుభాలు కలుగుతాయి." అని అంటూ చెలికత్తెలు వక్కలు, తమలపాకులు సుభద్ర చేతికి ఇచ్చి, వారిద్దరిని మరింత దగ్గరగా చేర్చి ఆమెను చేపట్టుమని అర్జునుడితో చెప్పి సుభద్రచేతిని అర్జునుడి చేతిలో ఉంచారు. ఇది మంచిలగ్నం, ఎన్ని గడియలయ్యిందో తెలుసుకొని వస్తాను అని ఒకరు, ఆ చెలికత్తె ఎందుకు రాలేదో తెలుసుకొని వస్తానని మరొకరు, చెలికత్తెను పిలిచి వస్తానంటూ ఇంకొకరు - ఇలా అందరూ ఏదో ఒక నెపాన్ని చూపించి కేళీగృహం నుంచి వెళ్ళిపోయారు.

**సుభద్రార్జునుల సంగంమం :** చెరకు వింటిని ధరించి పూలబాణాలను ప్రయోగించడం ద్వారా సుభద్రార్జునులు కలిసి కరిగే విధంగా చేయాలనే ప్రయత్నంతో మన్మథుడు పిల్లవాయువుతో కలిసి గవాక్షం గుండా తొంగి చూస్తున్నాడు. అర్జునుడు సుభద్ర చేయిపట్టుకున్నాడు. ఆమె పిరుదులు చుట్టు చేయివేసి దగ్గరగా లాక్కున్నాడు. తొడలు తగిలేటట్లు దగ్గరగా కూర్చోబెట్టాడు. అర్జునుడు కొప్పు సవరించినంతనే సుభద్ర చెక్కిలి చెమర్చింది. చెక్కిలిని నొక్కినంతనే స్తనాలు పులకరించాయి. స్తనాలను పట్టుకోగానే పోకముడి వీడిపోయింది. పోకముడిని అంటుకున్నంతనే శరీరమంతా పారవశ్యం చెందింది. ఆ తరువాత చెప్పేదేముంది ? అర్జునుడు సుభద్ర అధరామృతాన్ని త్రాగి ఆమెను సుఖసముద్రంలో తేలే విధంగా చేశాడు. కొత్త పెళ్ళికూతురుతో సంభోగం అర్జునుడికి సంతోషం కలిగించింది. సుభద్ర ముగ్ధ అయినా భర్తను సుఖసాగరంలో తేల్చింది. అర్జునుడామెకు దంతక్షతాలు చేయడం, నఖక్షతాలు కలిగించడం, కౌగిలింతలచే పారవశ్యం కలిగించడం నేర్పాడు. సుభద్రార్జునులు సాటిలేని నైపుణ్యంతో క్రీడించసాగారు. కొన్నాళ్ళకు సుభద్ర నెల తప్పింది. వేవిళ్ళు కనిపించాయి. శరీరం పాలిపోయింది.

**అభిమన్యుని జననం :** లక్ష్మీదేవి మన్మథుడిని కన్నట్టుగా, పాలసముద్రం కల్పవృక్షాన్ని కన్నట్టుగా ఒక శుభలగ్నంలో వంశోద్ధారకుడైన కుమారుడికి జన్మనిచ్చింది. అప్పుడు ఆకాశంనుంచి పూలవాన కురిసింది. దేవతలు దుందుభులు మ్రోగించారు. అర్జునుడు శుభలేఖను పంపించగా కృష్ణుడు మొదలైన రాజులు ఇంద్రప్రస్థానికి వచ్చారు. పాండవులు వారికి స్వాగతం చెప్పారు. బలరాముడు, సాత్యకి, రుక్మిణి మొదలైన వారు అర్జునుడి మందిరానికి అరుగుదెంచారు. అర్జునుడు తన కుమారుడికి అభిమన్యుడు అని పేరు పెట్టారు. రుక్మిణీకృష్ణులు మేనల్లుడితో పాటు సుభద్రకు అర్జునుడికి కూడా అమూల్యమైన ఆభరణాలను కానుకగా ఇచ్చారు. క్రమక్రమంగా పెరుగుతూ అభిమన్యుడు యౌవనవంతుడయ్యాడు. ధర్మరాజునుంచి ధర్మాన్ని, భీముడినుంచి శత్రువులను నిర్మూలించే ఉపాయాలను, నకులుడినుంచి అశ్వారోహణను, సహదేవుడినుంచి గోరక్షణను, ధనుర్విద్యను అర్జునుడినుంచి నేర్చుకున్నాడు.

**డా॥ నాగభైరవ ఆదినారాయణ, ఎం. ఏ., పిహెచ్.డి.**
రీడర్ & ప్రిన్సిపాల్
బి.ఎస్.ఎస్.బి. డిగ్రీ కళాశాల, తాడికొండ
గుంటూరు జిల్లా.

మొదటి భాగము - ప్రాచీన పద్యభాగము

# విజయ విలాసము - చేమకూర వేంకటకవి

## పాఠం -13

1. 13. 0 పరిచయం
1. 13. 1 సమగ్ర వ్యాఖ్యలు
1. 13. 2 సందర్భ సహిత వ్యాఖ్యలు

### 1.13. 0 పరిచయం

చేమకూర వేంకటకవి రచించిన విజయవిలాసంలోని కొన్ని రసవత్తర పద్యాలకు సమగ్రవ్యాఖ్యలు పరీక్షలలో వ్రాయవలసి ఉంటుంది. పదవిభజన, పదాలకు అర్థాలు, తాత్పర్యంతో పాటు ఆపద్యంలోని ముఖ్యాంశాలను గూడ ఇందులో వివరించవలసి ఉంటుంది. అలాగే సందర్భ సహిత వ్యాఖ్యలకు ఆ వాక్యాన్ని ఎవరు ఎవరితో అన్నారో, అందలి విశేషాంశాలేవో వివరించవలసి ఉంటుంది. వేంకటకవి పదప్రయోగ నైపుణ్యాన్ని, శ్లేష చమత్కారాలను తెలియజేయడం దీని ప్రధాన ఉద్దేశం.

### 1.13. 1 సమగ్ర వ్యాఖ్యలు :

1. (7)

చక్కెర కెంపు మోవిఁగని సారెకుఁజిల్క మొగంబు వేఁడఁగాఁ
జొక్కపుఁ జిల్వ కప్పుజడఁ జూచి మయూరము లబ్బు సాఁపఁగాఁ
జక్కని తమ్మిపూ వడుగు జాడలఁ గన్గొని రాజహంసముల్
త్రొక్కుడు పాటు చెందఁగఁ, వధూమణి వచ్చుట లెంచు నెమ్మదిన్.

**పరిచయం :**

ఈ పద్యం చేమకూర వేంకటకవిచే రచించబడిన విజయవిలాసం తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది.

**సందర్భం :**

యతి రూపంలో ఉన్న అర్జునుడు తన ప్రేమను సుభద్రకు వెళ్ళడించాడు. సుభద్ర తన చెలికత్తెలతో అంతఃపురానికి వెళ్ళిన తరువాత అర్జునుడు విరహతాపానికి లోనయినాడు. అప్పటి అతడిస్థితిని వర్ణిస్తూ కవి చేసిన వర్ణనలోనిదీ పద్యము.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| చక్కెర కెంపు మోవిన్ | = | చక్కెరవలె తీయనైన ఎర్రని పెదవిని |
| కని | = | చూచి |
| సారెకున్ | = | మాటిమాటికి |
| చిల్క | = | సుభద్ర చేతిమీద ఉండే చిలుక |

| | | |
|---|---|---|
| మొగంబున్ | = | సుభద్ర ముఖాన్ని (తినడానికి పెదవిని) |
| వేడగాన్ | = | కోరగా |
| చొక్కపు | = | అందమైన |
| చిల్వ | = | పామువంటి |
| కప్పు | = | నల్లనైన |
| జడన్ + చూచి | = | జడను చూచి |
| మయూరము | = | నెమలి |
| అఱ్ఱుసాపగాన్ | = | ఆశపడగా |
| చక్కని | = | అందమైన |
| తమ్మిపూవు | = | తామరపూవులవంటి |
| అడుగుజాడలన్ | = | కాలిగుర్తులను |
| కన్గొని | = | చూచి |
| రాజహంసముల్ | = | రాజహంసలు |
| త్రొక్కుడు పాటు చెందగన్ | = | ఒకదానిపై ఒకటిపడగా |
| వధూమణి | = | సుభద్ర |
| వచ్చుటల్ | = | రాకలను |
| నెమ్మదిన్ | = | మనస్సులో |
| ఎంచున్ | = | స్మరించుకొనును. |

**తాత్పర్యం :** సుభద్ర పెదవి చక్కెరలాగా తీయగా ఉంటుంది. అందుచేత సుభద్ర పెంపుడు చిలుక ఆమెముఖాన్ని తినాలని ఆశపడుతుంది. ఆమె జడపాములాగా నల్లగా ఉంటుంది. అందుచేత నెమలి తినాలని కోరుకుంటుంది. ఆమె పాదాలు తామరపూలలా ఉంటాయి. అందుచేత రాజహంసలు వాటిని తినాలని తొ్రటుపడతాయి. అలావచ్చే సుభద్ర రాకను అర్జునుడు మనస్సులో ఊహించుకున్నాడు.

**కవితా విశేషాలు :**

సుభద్ర మోవి ఎర్రని దొండపండులా ఉంటుందని, జడనల్ల త్రాచువలె ఉంటుందని, పాదాలు పద్మాల్లా ఉంటాయని భావం. చిలుక మాట్లాడగలదు కాబట్టి వేడింది అని, నెమలి విషయంలో అఱ్ఱుసాచింది అని, హంసల విషయంలో త్రొక్కుడు పాటు చెందనివని చెప్పడం వేంకటకవి పదప్రయోగ నైపుణ్యానికి ఉదాహరణ. సుభద్ర పాదాలు పద్మాంకితాలు అని చెప్పడం వల్ల ఆమె పద్మినీజాతి స్త్రీ అని ధ్వనిస్తుంది. భ్రాంతిమంతము, స్మరణాలంకారాలతో, ఉత్పలమాలతో వ్రాయబడ్డ ఈ పద్యం చేమకూర వేంకటకవి భావనాశక్తికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

**2. (15)**

చిత్తజుఁడల్గి తూపుమొనచేసినఁ జేయఁగనిమ్ము; పైధ్వజం
బెత్తిన నెత్తనిమ్ము, వచియెంచెదఁగల్గిన మాట గట్టిగా ;
నత్తరళాయతేక్షణ కటాక్ష విలాస రసప్రవాహముల్
కుత్తుక బంటి తామరలకున్ దలమున్కలు గండు మీలకున్.

**పరిచయం :**

ఈ పద్యం చేమకూర వేంకటకవిచే రచింపబడిన విజయవిలాస తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది.

**సందర్భం :**

యతి రూపంలో ఉన్న అర్జునుడు తన ప్రేమను సుభద్రకు చెప్పగా ఆమె తన చెలికత్తెలతో అంతఃపురానికి వెళ్ళిపోయింది. తరువాత విరహతాపానికిలోనయిన అర్జునుడు సుభద్ర అందాన్ని తలపోస్తూ బాధపడిన సందర్భంలోనిదీ వాక్యం.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| చిత్తజుడు | = | మన్మథుడు |
| అల్గి | = | కోపించి |
| తూపు | = | బాణమును |
| మొన చేసినన్ | = | వాడిగా చేసినా |
| చేయగనిమ్ము | = | చేయనిమ్ము. |
| పైన | = | మీదికి |
| ధ్వజంబు + ఎత్తినన్ | = | జెండా ఎత్తినా (దండెత్తినా) |
| ఎత్తనిమ్ము | = | ఎత్తనిమ్ము |
| కల్గిన మాటన్ | = | ఉన్నమాటను |
| గట్టిగాన్ | = | గట్టిగా |
| వచియించెదన్ | = | చెప్పుతాను |
| ఆ + తరళ + ఆయత + ఈక్షణ | = | చలించే విశాలమైన కన్నులు గల ఆ సుభద్ర యొక్క |
| కటాక్ష | = | క్రీగంటి చూపుల యొక్క |
| విలాస రస | = | శృంగార రసం యొక్క |
| ప్రవాహముల్ | = | ప్రవాహములు |
| తామరలకున్ | = | పద్మాలకు |
| కుత్తుకబంటి | = | కంఠంవరకు ఉంటాయి. |
| గండు మీలకున్ | = | గండు చేపలకు |
| తలమున్కలు | = | తలలు ముంచునట్టివి అవుతాయి. |

**తాత్పర్యం :** మన్మథుడు బాణాలు ప్రయోగించినా, నామీద దండెత్తి వచ్చినా భయపడక ఉన్నమాట గట్టిగా చెప్తాను. ఆమె కడగంటి చూపులలోని శృంగార రసప్రవాహాల్లో తామరలు కుత్తుక వరకు, గండు చేపలు తలమున్కలుగా ఉంటాయి.

**కవితా విశేషాలు :**

మన్మథుని బాణమయిన పద్మం ధ్వజమయిన చేప సుభద్ర కళ్ళముందు దిగదుడుపే అని, ఆ మాట అంటే మన్మథుడికి కోపంవచ్చి దండెత్తి ఆయుధాలు ప్రయోగిస్తాడని, అయినా భయపడకుండా నిజం గట్టిగా చెబుతాననీ అర్జునుడు చెప్పినట్లుగా కవి రసరమ్యంగా వర్ణించాడు. ప్రవాహంలో పద్మాలు మెడవరకు, చేపలు తలమునిగే విధంగా ఉండడం సహజం. అందుకే తామరలకు కుత్తుకబంటి అని, గండుమీలకు తలమున్కలని కవి చమత్కరించాడు. గట్టిగా చెప్పడం అనేది లోకవ్యవహారంలోని మాట. సుభద్ర కన్నులు పద్మాలకన్నా, చేపలకన్నా అందంగా ఉంటాయని తాత్పర్యం. రసము అనుపదమునకు శృంగార రసమని, నీరు అని అర్థాలు చెప్పుకోవచ్చు. తద్వారా ఇక్కడ శ్లేషాలంకారం చెప్పబడింది. లోకోక్తి, పరికరాలంకారాలతో ఉత్పలమాలతో రచింపబడిన పద్యమిది.

3. (41)

అంగన గుబ్బ చన్మెఱుఁగు టందపు మేలి పసిండి కుండలం
బొంగఁ దొడంగెఁ జొబ్బిలఁగఁ బూసిన గంధము తాపవహ్ని, సం
పంగికటారి వీరునకుఁబాలును బియ్యము లేని పొంగలో
పొంగలి !'' యంచు నయ్యెలరుఁ బోడులు సారెకు గేలిసేయఁగన్.

**పరిచయం :**

ఈ పద్యం చేమకూర వేంకటకవిచే రచించబడిన విజయవిలాసం - తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది.

**సందర్భం :**

సుభద్ర అంతఃపురంలో విరహతాపానికి లోనయింది. చెలికత్తెలు ఆమెకు శైత్యోపచారాలు చేయడం ప్రారంభించారు. ఆ ఉపచారాల్లో భాగంగా ఆమె స్తనాల మీద గంధం పూశారు. ఆ సన్నివేశాన్ని వర్ణిస్తూ కవి చెప్పిన పద్యమిది.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| అంగన | = | సుభద్రయొక్క |
| గుబ్బచన్ | = | గుబ్బలవంటి చన్నులు అనే |
| మేలి పసిండి | = | మేలిమి బంగారంతో చేసిన |
| కుండలన్ | = | కుండలయందు |
| పూసిన | = | రాసినట్టి |
| గంధము | = | చందనం |
| ఆ + అలరు బోడులు | = | పూలవంటి శరీరాలుగల ఆ చెలికత్తెలు |
| సారెకున్ | = | మాటిమాటికి |
| సంపంగి కటారివీరునకున్ | = | సంపంగి పూవుకత్తిగా కలిగిన మన్మథుడికి |
| పాలును బియ్యము లేని | = | పాలు, బియ్యం లేనట్టి |
| పొంగలో పొంగలి + అంచున్ | = | పొంగలి పొంగలి అంటూ |
| గేలిచేయగన్ | = | ఎగతాళి చేసిన విధంగా |
| తాపవహ్నిన్ | = | విరహతాపమనే అగ్నిచేత |
| పొంగన్ + తొడగెన్ | = | పెట్లి పొంగుటానికి ప్రారంభించింది. |

**తాత్పర్యం :** సుభద్ర స్తనాలమీద దట్టంగా పూసిన గంధం విరహమనే అగ్నివలన పెట్లి రాలిపోవడం చూస్తే పొంగలి పొంగినట్లుగా అనిపించింది. అది చూచి చెలికత్తెలు ఇది మన్మథవీరుడికి పాలూబియ్యం లేని పొంగలి అని ఎగతాళి చేశారు.

**కవితా విశేషాలు :**

మన్మథుడు శివుడి మంటలో బూడిదయి ఆకారం పోగొట్టుకున్నాడు. చనిపోయిన వీరులకు పొంగలి వండి పూజచేసే ఆచారం మనదేశంలో ఉంది. పొంగలి వండేటప్పుడు అది పొంగి కిందికి జారితే పూజసంతృప్తికరమని భావిస్తారు. పొంగలి కుండలలో వండుతారు కనుక స్తనాలను బంగారుకుండలుగా వర్ణించి చెప్పడం రసవంతంగా ఉంది. పాలతో కూడిన పొంగలి పొంగి జారేటప్పుడు తెల్లగా ఉంటుంది. స్తనాల మీద పెట్లి రాలిపోయే చందనం కూడా తెల్లగా ఉంటుంది. అందుచే పోలిక రమణీయం. 'సంపంగి కటారి వీరుడనే' ప్రయోగం వినూత్నంగా కనిపిస్తుంది. రూపక ఉత్ప్రేక్షాలంకారాలతో ఉత్పలమాలఛందంలో రచించబడిన పద్యమిది.

4. (51)

శివుఁడిటు రమ్మటంచు దయ చేసినచోఁ దలకెక్కి, తుగ్రవై
భవమునఁ జూచుచో నడుగువట్టితి, వేమనవచ్చు నీగుణం.
బవు నవు ! నందినన్ సిగయు నందకయున్నను కాళ్ళుపట్టు కొం
దువు హరిణాంక, వేల కొలఁదుల్ గద నీనడకల్ దలంపఁగన్.

**పరిచయం :**

ఈ పద్యం చేమకూర వేంకటకవిచే రచించబడిన విజయవిలాసం తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది.

**సందర్భం :**

సుభద్ర అంతఃపురంలో విరహతాపానికి లోనయింది. చెలికత్తెలు ఆమెకు శైత్యోపచారాలు చేశారు. విరహబాధను అనుభవిస్తున్న సుభద్రను బాధించే మన్మథుని, మందమారుతాన్ని, చందమామను, వసంతుడిని, కోకిలను నిందించడం ఆరంభించారు. ఈ సందర్భంలో చంద్రుడి గురించి చెలికత్తెలు నిందించే సందర్భంలో రచింపబడ్డ పద్యమిది.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| హరిణాంక | = | జింక చిహ్నంగాగల చంద్రుడా ! |
| శివుడు | = | పరమేశ్వరుడు |
| ఇటురమ్ము + అటంచున్ | = | ఇలా దగ్గరకు రమ్మని |
| దయచేసినచోన్ | = | ఆదరించగా |
| తలకున్ + ఎక్కితి | = | తలమీదికెక్కి కూర్చున్నావు. |
| ఉగ్రవైభవమునన్ | = | కఠిన భావంతో |
| చూచుచోన్ | = | చూడగా |
| అడుగు + పట్టితివి | = | పాదాలు పట్టుకున్నావు |
| అవును + అవును | = | అవునవును |
| అందినన్ సిగయున్ | = | అనుకూలంగా ఉన్నప్పుడు అందితే సిగను |
| అందకయున్నను | = | అనుకూలంకానప్పుడు అందకపోతే |
| కాళ్ళు | = | కాళ్ళను |
| పట్టుకొందువు | = | పట్టుకుంటావు |
| నీగుణంబు | = | నీ స్వభావాన్ని |
| ఏమి + అనవచ్చున్ | = | ఎలా చెప్పాలో తెలియదు. |
| నీ నడకల్ | = | నీ ప్రవర్తనలు |
| తలంపగన్ | = | ఆలోచిస్తే |
| వేలకొలదుల్గదా | = | వేల సంఖ్యలో లెక్కపెట్టవచ్చుగదా ! |

**తాత్పర్యం :** చంద్రా ! శివుడు దగ్గరకు రమ్మని పిలిస్తే వెళ్ళి తలమీదకెక్కావు. కోపంగా చూస్తే పాదాలమీద పడిపోయావు. అందితే జుట్టు, అందకపోతే కాళ్ళు పట్టుకునే నీ స్వభావాన్ని ఎలా వర్ణించాలి ? నీ నడకలు వేల సంఖ్యలో ఉంటాయి కదా !

**కవితా విశేషాలు :**

చంద్రుడు శివుడి శిరస్సుమీద ఉంటాడు కనుక తలకెక్కాడు అని లోకోక్తితో చెప్పబడింది. పాదాలు పట్టుకోవడం దక్షయజ్ఞం సందర్భంలో జరిగిన సన్నివేశంలో ఇక్కడ ప్రస్తావించబడింది. అందితే సిగ అందగపోతే కాళ్ళు పట్టుకోవడం అనే లోకోక్తిని కవి సందర్భోచితంగా ఉపయోగించాడు. లోకోక్తుల ప్రయోగంలో కవికున్న నేర్పు ఈపద్యంలో కనిపిస్తుంది. వేలకొలదులు అనే దానికి "వేలకొలదుల్" అంటే సమయాన్ని అనుసరించి మారిపోతుంటాయని అర్థం చెప్పుకోవచ్చు. చంద్రుడు ఏయెండకాగొడుగు పట్టే స్వభావం ఉన్న వాడంటూ చెలికత్తెలు నిందించారని భావం - లోకోక్తి అలంకారంతో చంపకమాల ఛందంతో వ్రాయబడిన పద్యమిది.

5. (93)

"తనయుని పెండ్లి కేఁగవలె ధాత్రికి; దిక్కుల వారినెల్లఁ దో
డ్కొని చనుదెమ్ము నీ "వని కడుం గుఱిసేసి సురాధి నాథుఁడ
వ్వనపతి కంపినట్టి శుభవార్తల బంగరు గమ్మ చుట్ట నా,
దినకరమండలం బపర దిగ్గిరి కూటముఁ జేరె నయ్యెడన్"

**పరిచయం :**

ఈ పద్యం చేమకూర వేంకటకవిచే రచించబడిన విజయవిలాసం - తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది.

**సందర్భం :**

ద్వారకలో సుభద్రార్జునుల వివాహసన్నాహం ఆరంభమయింది. అర్జునుడిని పెళ్ళి కొడుకును చేశారు. సుభద్రను పెళ్ళికూతురిని చేశారు. ఇంతలో సాయంకాలమయింది. సూర్యుడు అస్తమించాడు. సూర్యాస్తమయాన్ని వర్ణిస్తూ చెప్పిన పద్యమిది.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| సుర + అధినాథుడు | = | దేవతలకు ప్రభువయిన ఇంద్రుడు |
| తనయుని | = | కుమారుడైన అర్జునుడి యొక్క |
| పెండ్లికిన్ | = | వివాహానికి |
| ధాత్రికిన్ | = | భూలోకానికి |
| ఏగవలెన్ | = | పోవాలి |
| దిక్కుల వారిని + ఎల్లన్ | = | దిక్కులనున్న వారినందరిని |
| తోడ్కొని | = | వెంటపెట్టుకొని |
| నీవు | = | నీవు |
| చనుదెమ్ము | = | రావలసినది |
| అని | = | అని |
| కడున్ | = | గట్టిగా |
| గుఱి + చేసి | = | ఆజ్ఞాపించి |
| ఆ + వనపతికిన్ | = | సముద్రుడికె |
| అంపిన + అట్టి | = | పంపించిన |
| శుభవార్తల | = | శుభమైన సమాచారం ఉన్న |

| | | |
|---|---|---|
| బంగరు కమ్మ | = | బంగారంతో చేసిన ఉత్తరముల యొక్క |
| చుట్టనాన్ | = | గుండ్రని కట్ట అన్నట్లుగా |
| దినకరమండలంబు | = | సూర్యబింబం |
| ఆ + ఎడన్ | = | ఆ సమయంలో |
| అపర దిక్ | = | పడమటి దిక్కులో ఉన్న |
| గిరికూటమున్ | = | కొండ శిఖరాన్ని |
| చేరెన్ | = | చేరింది. |

**తాత్పర్యం :** ఇంద్రుడు "అర్జునుడి వివాహానికి భూమికి వెళ్ళాలి. అన్ని దిక్కుల్లో ఉన్నవారిని తీసుకురా" అని ఆజ్ఞాపిస్తూ సముద్రుడికి పంపిన శుభలేఖల కట్టలాగా సూర్యుడు పడమటి కొండశిఖరాల్లో అస్తమించాడు.

**కవితా విశేషాలు :**

ఇది అష్టాదశ వర్ణనల్లోని సూర్యాస్తమయ వర్ణన. కవి ఈ వర్ణన కథలో కలిసిపోయేటట్లు మేళవించి రచించడం ఇందులోని విశేషం. ఇంద్రుడు దిక్పాలకుడు. దిక్కుల వారినెల్ల తోడ్కొని రమ్మనడంలో దిక్కులలో ఉండే దిక్పాలకులనందరిని అన్ని దిక్కులలో ఉండే అందరిని అని అర్థం చెప్పుకోవచ్చు. ఇది మరో విశేషం. అలాగే ఇంద్రుడు తూర్పుకు అధిపతి. వరణుడు పడమరకు అధినాథుడు. ఇద్దరూ ఎదురెదురుగా ఉండే దిక్కులకు అధిపతులు కాబట్టి 'అప్పనపతి' అని అనడం సముచితంగా ఉంది. అస్తమించే సూర్యుడు ఎర్రగా ఉంటాడు. అందుచేత బంగరు కమ్మచుట్టతో పోల్చడం జరిగింది. ఇది సముచితమైన పోలిక గనుక అది ఇంకోవిశేషం. భూమిచుట్టూ అన్నిదిక్కుల్లో వ్యాపించి ఉండేవాడు కాబట్టి అందరిని పిలుచుకు రావడానికి సముద్రుడినే ఆజ్ఞాపించడం ఇంద్రుడి ఉచితజ్ఞతకు నిదర్శనం. ఇన్ని విశేషాలతో ఉన్న ఈ పద్యం ఉత్ప్రేక్షాలంకారంతో చంపకమాల ఛందంలో రచింపబడింది.

**6. (103)**

అనిమిష భావ మీ సమయమందు ఫలించె నటంచుఁ గోరికల్
వెనుకొనఁ బైనపైన పడి వే తటకాపడి యుర్వశీ విలా
సిని మొదలైన యచ్చరలు చెంతలుఁజేరి, సహస్రదృక్ తనూ
జుని యొడలెల్లఁ గన్నులుగఁ జూచిరి మానసముల్ గరంగఁగన్.

**పరిచయం :**

ఈ పద్యం చేమకూర వేంకటకవిచే రచించబడిన విజయవిలాసం - తృతీయాశ్వాసం నుంచి గ్రహింపబడింది.

**సందర్భం :**

సుభద్రార్జునుల వివాహానికి ఇంద్రుడు శచీదేవితో వచ్చాడు. అతనితోపాటు బృహస్పతి, అరుంధతి, మహర్షులు, అప్సరసలు అరుగుదెంచారు. అప్సరసలు అర్జునుని అందాన్ని తిలకించడాన్ని వర్ణిస్తూ కవి చెప్పిన పద్యమిది.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| ఊర్వశీ విలాసిని | = | విలాసవతియైన ఊర్వశి |
| మొదలైన | = | మొదలుగా ఉన్న |
| అచ్చరలు | = | అప్సరసలు |
| అనిమిష భావము | = | రెప్పపాటులేని తమగుణం |

| | | |
|---|---|---|
| ఈ సమయమందున్ | = | ఈ వేళలో |
| ఫలించెన్ | = | సార్థకమైనది |
| ఆటంచున్ | = | అనుకుంటూ |
| కోరికల్ | = | కోరికలు |
| వెనుకొనన్ | = | వెనుకనుంచి ముందుకు తరుము తుండగా |
| పైన పైనపడి | = | ఒకరిమీద ఒకరు పడుతూ |
| వే తటకాపడి | = | చూచిన వెంటనే కంగారు పడుతూ |
| చెంతలన్ + చేరి | = | సమీపానికి వచ్చి |
| సహస్రదృక్ తనూజుని | = | వేయుకన్నులు గల ఇంద్రుని కొడుకైన అర్జునుడిని |
| మానసముల్ | = | మనస్సులు |
| కరంగగన్ | = | ద్రవించేటట్లు |
| ఒడలు + ఎల్లన్ | = | శరీరమంతట |
| కన్నులుగన్ | = | కన్నులున్నట్లుగా |
| చూచిరి | = | తిలకించారు. |

**తాత్పర్యం :** దేవతలు అనిమిషులు - ఊర్వశీ మొదలైన అప్సరసలు తమకున్న ఈ అనిమిష భావంవల్ల అర్జునుడిని కన్నార్పకుండా చూడగలుగుతున్నామని, ఆకారణంగా అనిమిషభావం అనే ఆగుణం సార్థకమయింది అనుకుంటూ కోరికతో పైపైన బడుతూ సమీపంగా వచ్చి ఒడలెల్ల కన్నులుగ చూశారు.

**కవితా విశేషాలు :**

రెప్పలు మూస్తే అర్జునుడి సౌందర్యాన్ని చూచే అవకాశం పోతుందని, అనిమిష భావం ఉండడం వల్ల అతడిని తనివితీరా చూచే అవకాశం ఈ అనిమిష భావంవల్ల కలిగింది అని ఊర్వశీ మొదలైన అప్సరసలు అనుకోవడం, దేవతలైన వారుకూడా పైపైనబడుతూ, కంగారుపడుతూ చూడడం ఇందలి విశేషం. ఇంద్రుడు సహస్ర లోచనుడు - అతని శరీరమంతా కన్నులే. అతని కుమారుడు అర్జునుడు. అతడిని దేవతలంతా శరీరమంతా కన్నులయ్యేటట్లు చూశారట. ఎన్నికన్నులుంటే అన్ని రెట్లు చూడవచ్చు. శరీరం నిండా కన్నులుంటే ఎన్నో రెట్లు చూడవచ్చు. అప్సరసలు అందరూ అతడిని అలా చూశారని చెప్పుకోవచ్చు. అంతేకాకుండా ఒడలెల్ల కన్నులు అనడంలో అప్సరసల అందరి కన్నులు అర్జునుడి శరీరమంతటా లగ్నమయ్యాయని, అతని ఒడలు అంతా అప్సరసలు కన్నులతో నిండిపోయాయని అంటే చూపులతో నిండిపోయాయని చెప్పుకోవచ్చు. అప్పుడు వేయికన్నులున్న ఇంద్రుడి కొడుకు అర్జునుడికి కూడా వేయి కన్నులు కలిగాయని ధ్వని. ఈ పద్యంలో ఒడలెల్ల కన్నులుగ అనే జాతీయం సముచితంగా ప్రయోగింపబడింది. స్వభావోక్తి, శ్లేష, పరికరాలంకారాలతో, చంపకమాల ఛందంలో రచింపబడిన పద్యమిది.

**7. (121)**

"ఎంచంగాఁదగు నత్తమామలను దాని ల్వేల్పులంగా మనః
ప్రాంచద్భక్తిని సాధ్వి'' యందు; రదిమీపట్లన్ నిజంబయ్యెనేఁ ;
డంచుం జేరి శచీపురందరుల కాహ్లాదంబుగా పల్కి, మ్రొ
క్కించెం దేవకి యప్పుడర్ధ హిమరుక్ బింబాలికన్ బాలికన్.

**పరిచయం :**

ఈపద్యం చేమకూర వేంకటకవిచే రచించబడిన విజయవిలాసం - తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది.

**సందర్భం :**

సుభద్రార్జునుల వివాహం ముగిసిన తరువాత అర్జునుడు ఇంద్రునికి, శచీదేవికి నమస్కరించాడు. ప్రక్కనే ఉన్న సుభద్ర సిగ్గుతో తలవంచి వారికి నమస్కరించడానికి సందేహించింది. అప్పుడు దేవకీదేవి సుభద్రచే ఇంద్రునికి శచీదేవికి నమస్కారం చేయించింది. ఆసందర్భంలో చెప్పిన పద్యమిది.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| సాధ్వి | = | పతివ్రత |
| తాన్ | = | తాను |
| మనః | = | మనస్సులో |
| ప్రాంచత్ | = | ప్రకాశించునట్టి |
| భక్తిని | = | భక్తితో |
| అత్తమామలను | = | అత్తను, మామను |
| ఇల్వేల్పున్ + కాన్ | = | గృహదేవతలుగా |
| ఎంచన్ + కాన్ + తగున్ | = | భావించడం ఉచితమై ఉంటుంది. |
| అందురు | = | అని అంటుంటారు. |
| అది | = | ఆ మాట |
| మీ పట్లన్ | = | మీ విషయంలో |
| నేడు | = | ఈనాడు |
| నిజంబు + అయ్యెను | = | నిజమే అయింది. |
| అంచున్ | = | అంటూ |
| చేరి | = | సమీపించి |
| శచీపురందరులకున్ | = | శచీదేవికి, ఇంద్రునికి |
| ఆహ్లాదంబుగాన్ | = | సంతోషం కలిగేటట్లు |
| పల్కి | = | పలికి |
| దేవకి | = | దేవకీదేవి |
| అప్పుడు | = | ఆ సమయంలో |
| అర్ధ | = | సగమైన |
| హిమరుక్ బింబ | = | చల్లని కాంతిగల చంద్రబింబంవంటి |
| అలికన్ | = | నుదురు కలిగినదైన |
| బాలికన్ | = | సుభద్రచేత |
| మ్రొక్కించెను | = | నమస్కరింపజేసింది. |

**తాత్పర్యం :** "పతివ్రత అత్తమామలను భక్తితో ఇలవేల్పులుగా భావించాలి. అది మీ విషయంలో నిజమయింది." అని శచీదేవికి, ఇంద్రుడికి ఆనందం కలిగించే విధంగా పలుకుతూ దేవకి సుభద్ర చేత వారికి నమస్కారం చేయించింది.

**కవితా విశేషాలు :**

అత్తమామలను దేవతలుగా భావించాలి. కాని సుభద్రకు దేవతలే అత్తమామలయ్యారు. అని చెప్పడంలో చమత్కారం ఉంది. సిగ్గుతో సుభద్ర అత్తమామలకు నమస్కారం చేయలేదు. ఆ లోపాన్ని దేవకీదేవి గ్రహించింది. ఆ లోపం వారిద్దరూ గమనించకుండా సంతోషం కలిగేటట్లు మాట్లాడి సుభద్ర చేత నమస్కారం చేయించింది. దేవకీదేవి సమయస్ఫూర్తిని కవి చక్కగా ప్రకటించాడు. సుభద్ర బాలిక అని చెప్పడం వలన ఆమె ముగ్ధ అని అందుకే ఆమె నమస్కారం చేయలేదని కవి ఆమాటతో కారణం చూపి, అది ఆమె తప్పుకాదని వివరించాడు. యమకం, లోకోక్తి అలంకారాలతో శార్దూల వృత్తంలో రచించబడిన పద్యమిది.

8. (126)

వీయపు రాలి వైతి గదవే యిపు;డత్తవు తొంటి వావి ; నో
తోయజ నేత్రుఁగాంచిన వధూమణి, నీసుత బెండ్లియాడఁగా
నాయము నాకుమారుడు నర్మిలి హత్తఁగ ; నత్తవావిచే
నాయువు గల్గు వాఁడవు నటంద్రు ; శుభంబగుదీన నెంతయున్.

**పరిచయం :**

ఈ పద్యం చేమకూర వేంకటకవిచే రచించబడిన విజయ విలాసం - తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది.

**సందర్భం :**

సుభద్రార్జునుల వివాహానంతరం శచీదేవి, ఇంద్రుడు స్వర్గానికి బయలుదేరారు. రుక్మిణి శచీదేవికి వీడ్కోలు చెబుతూ కస్తూరిని ఇచ్చింది. ఆమె ఆ కస్తూరిని దేవకీదేవి మీద చిలికి పరిహాసంగా పలికిన సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| తోయజనేత్రున్ | = | పద్మాలవంటి కన్నులున్న శ్రీకృష్ణుడిని |
| కాంచిన | = | కన్న |
| ఓ వధూమణి | = | స్త్రీలలో శ్రేష్ఠురాలవైన ఓ దేవకీ ! |
| తొంటి వావిన్ | = | మొదటి సంబంధంలో |
| అత్తవు | = | నాకు అత్తవు |
| ఇపుడు | = | ఈ పెళ్ళి వలన |
| వీయపు రాలివి + ఐతిగదవే | = | వియ్యపురాలివి అయ్యావుగదా ? |
| అర్మిలి | = | ప్రేమ |
| హత్తగన్ | = | హత్తుకొనేటట్లు |
| నీసుతన్ | = | నీ కూతురైన సుభద్రను |
| పెండ్లి + ఆడగాన్ | = | వివాహమాడడం |
| నా కుమారునకున్ | = | నా కొడుకైన అర్జునుడికి |
| నాయము | = | న్యాయమే |
| అత్తవావిచేన్ | = | అత్తవరుస కలిగిన కన్యను పెళ్ళి చేసుకోవడం వలన |
| ఆయువు కల్గువాడు | = | ఎక్కువ ఆయుర్దాయు కలవాడు |
| అవును | = | అవుతాడు |
| అట + అంద్రు | = | అని అంటారు. |
| దీనన్ | = | ఈ సంబంధం వలన |
| ఎంతయున్ | = | మిక్కిలి |
| శుభంబు ÷ అగున్ | = | మేలు కలుగుతుంది. |

**తాత్పర్యం :** "కృష్ణుడిని కన్న దేవకీ దేవీ ! మొదటి సంబంధంలో నీవునాకు అత్తవు. ఈ పెళ్ళి వలన వియ్యపు రాలివయ్యావు. నీ కూతురిని పెళ్ళాడడం అర్జునుడికి న్యాయమే. అత్త వరుసగల కన్యను పెళ్ళాడితే ఆయువు పెరుగుతుంది అంటారు. ఈ సంబంధం వలన శుభమే జరుగుతుందిలే " అని శచీదేవి అన్నది.

**కవితా విశేషాలు :**

శచీదేవి భర్త అయిన ఇంద్రుడికి కృష్ణుడు తమ్ముడవుతాడు. కృష్ణుడి తల్లి దేవకీదేవి. అందుచే దేవకీదేవి శచీదేవికి అత్త అవుతుంది. ఇప్పుడే దేవికి కూతురయిన సుభద్రను శచీదేవికి కుమారుడయిన అర్జునుడు వివాహం చేసుకోవడం వలన వారిద్దరు వియ్యపురాళ్ళు అయ్యారు. పెండ్లియాడగాన్ + ఆయము అని విడదీస్తే వివాహం చేసుకోవడం వల్ల లాభం అనే అర్థం స్ఫురిస్తుంది. కృష్ణుడు, ఇంద్రుడు సోదరులు కనుక కృష్ణుడి చెల్లెలు సుభద్ర ఇంద్రుడికి సోదరి అవుతుంది. ఇంద్రుడి కొడుకైన అర్జునుడికి అత్త అవుతుంది. అత్తవరసగల కన్యను చేసుకుంటే ఆయువు పెరుగుతుంది అనడం వలన అర్జునుడు దీర్ఘాయుష్షు కలవాడవుతాడని శచీదేవి చెప్పింది. లోకోక్తి అలంకారంతో ఉత్పలమాలవృత్తంలో రచింపబడిన పద్యం ఇది.

**9 (148)**

స్యందనమున్ దురంగములు శౌరివెపో, బలరాము చెల్లెలీ
యిందునిభాస్య ; యీమె నెట కెత్తుక పోయెదు రాకుమార ? యే
మందురు యాదవుల్ వినిన ? హా ! యిటువంటివె రాచవారితోఁ
బొందులు ? గానకుండఁ గొని పోఁ దగవా మిమువంటి వారికిన్ ?

**పరిచయం :**

ఈ పద్యం చేమకూర వేంకటకవిచే రచించబడిన విజయ విలాసం - తృతీయా శ్వాసం నుంచి గ్రహించబడింది.

**సందర్భం :**

సుభద్రార్జునుల వివాహం అయిన తరువాత అర్జునుడు సుభద్రతతో ఇంద్రప్రస్థానికి బయలుదేరాడు. సుభద్రను తీసుకుపోతున్న అర్జునుడిని చూచి పట్టణాన్ని కాపలా కాసే పృథుశ్రవసుడు మొదలైనవారు అర్జునుడిని ఎదిరించారు. ఆ సమయంలో వారు అర్జునుడితో పలికిన మాటలివి.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| స్యందనమున్ | = | రథం |
| తురంగములు | = | గుర్రాలు |
| శౌరివెపో | = | కృష్ణునివే గదా ! |
| ఈ ఇందునిభాస్య | = | చంద్రునితో సమానమైన ముఖం ఉన్న ఈ సుభద్ర |
| బలరాము | = | బలరాముడి యొక్క |
| చెల్లెలు | = | చెల్లెలు |
| రాకుమార | = | ఓ రాజకుమారా ! ఓ అర్జునా ! |
| ఈమెను | = | ఈ సుభద్రను |
| ఎటకు | = | ఎక్కడకు |
| ఎత్తుకు పోయెదు | = | తీసుకుపోతున్నావు ? |
| వినిన | = | ఈ విషయం వింటే |
| యాదవులు | = | యాదవులు |
| ఏమందురు | = | ఏమంటారు ? |
| రాచవారితోన్ | = | రాజులతో |
| పొందులు | = | స్నేహాలు, సంబంధాలు |
| ఇటువంటివె | = | ఇలా ఉంటాయా ? |
| మిము వంటివారికిన్ | = | మీలాంటి గొప్పవారికి |
| కానకుండన్ | = | ఇతరులు చూడకుండా |
| కొని పోన్ | = | తీసుకుపోవడం |
| తగవా | = | న్యాయమా ? |

**తాత్పర్యం :** "అర్జునా ! ఈ రథం, గుఱ్ఱాలు కృష్ణుడివే కావచ్చు. కాని ఈ సుభద్ర బలరాముడి చెల్లెలు. ఆమెను ఎక్కడికి తీసుకుపోతున్నావు ? ఈ విషయం వింటే యాదవులు ఏమంటారు ? రాజులలో స్నేహం ఇలానా ఉండేది ? మీలాంటి వారు దొంగతనంగా ఇలా తీసుకుపోవడం న్యాయమా ?" అని కావలివారు అర్జునుడితో అన్నారు.

**కవితా విశేషాలు :**

దొంగతనం చేసిన వానిని ఆధారాలతో దొంగ అని నిరూపించినట్లు, రథము, గుఱ్ఱాలు కృష్ణుడివని, రథంలో ఉన్న సుభద్ర బలరాముడి చెల్లెలని కనుక ఆమెను దొంగతనంగా ఎత్తుకుపోవడం నిజమని నిరూపించి కావలివాళ్ళు అర్జునుడు దొంగ అని నిర్ధారించారు. ఆ తరువాత కృష్ణార్జునుల మధ్య సంబంధం తెలిసిన వారు కాబట్టి అతనికి రాజులతో స్నేహాలు ఇలా ఉండకూడదని, దొంగతనంగా తీసుకుపోవడం న్యాయం కాదని హితవు చెప్పారు. ముందుగానే యుద్ధానికి సిద్ధంకాకుండా హితవు చెప్పి దొంగతనం చేసిన అర్జునుడిని మార్చడానికి కావలి వాళ్ళు ప్రయత్నించినట్లు చెప్పడం చేమకూర వారి ఔచిత్య నిరూపణకు నిదర్శనంగా భావించవచ్చు - ఉత్పలమాల వృత్తంలో రచింపబడిన పద్యమిది.

**10. (154)**

"రకపుం జెయ్యుల ౘదా వినోదముగ సారథ్యంబుఁ గావించు క
న్యకపై ౘబెట్టిన చూపెకాని, యిటు సేనం జూచుటే లేదు ; సా
యక పంక్తులు నడుచున్ సహస్రములుగా, నయ్యారె ! వివ్వచ్చు చే
తికి ౘగన్నుల్ గల" వంచు నెంచి రపుడెంతే వీర యోధాగ్రణుల్.

**పరిచయం :**

ఈ పద్యం చేమకూర వేంకటకవిచే రచింపబడిన విజయవిలాస - తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది.

**సందర్భం :**

వివాహం అయిన తరువాత అర్జునుడు సుభద్రను గైకొని ఇంద్రప్రస్థానికి బయలుదేరాడు. కావలివారు అతడిని అడ్డగించి ఎదిరించారు. అర్జునుడు వారితో చేసిన యుద్ధాన్ని వర్ణిస్తూ కవి చెప్పిన పద్యమిది.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| రకము + చెయ్యులన్ | = | చిత్ర విచిత్రాలైన పద్ధతులతో |
| తాను | = | తాను (సుభద్ర) |
| వినోదముగన్ | = | వినోదంగా |
| సారథ్యంబున్ + కావించు | = | రథాన్ని నడిపే |
| కన్యకపైన | = | సుభద్రపై |
| పెట్టిన | = | లగ్నం చేసిన |
| చూపె కాని | = | చూపేకాని |
| ఇటు | = | ఈ వైపున ఉన్న |
| సేనన్ | = | సైన్యాన్ని |
| చూచుటే లేదు | = | చూడడం అన్నదేలేదు. |
| సాయక పంక్తుల్ | = | బాణాల వరుసలు |

| | | |
|---|---|---|
| సహస్రములుగాన్ | = | వేలకొలదిగా |
| నడచున్ | = | పోతూ ఉన్నాయి |
| అయ్యారె | = | ఆహా |
| వివ్వచ్చు | = | బీభత్సుడైన అర్జునుడి యొక్క |
| చేతికి | = | చేతికి |
| కన్నులు + కలవు | = | కళ్ళు ఉన్నాయి |
| అంచున్ | = | అంటూ |
| వీరయోధ + అగ్రణుల్ | = | వీరుల్లో శ్రేష్ఠులు |
| అపుడు | = | ఆ సమయంలో |
| ఎంతేన్ | = | విశేషంగా |
| ఎంచిరి | = | మెచ్చుకున్నారు |

**తాత్పర్యం :** అర్జునుడు చిత్రవిచిత్రగతులతో రథం నడుపుతున్న సుభద్రను చూస్తున్నాడు కాని శత్రుసైన్యాన్ని చూడడంలేదు. అయినా బాణాలు వేలకొలది శత్రువులపైకి పోతూనే ఉన్నాయి. అలా అర్జునుడు బాణాలు ప్రయోగించడం చూచి వీరశ్రేష్ఠులు "అర్జునుడు చేతికి కళ్ళున్నాయి" అనుకున్నారు.

**కవితా విశేషాలు :**

సుభద్ర చిత్ర విచిత్రగతులతో వినోదంగా రథాన్ని నడిపి తన నేర్పును ప్రకటించింది. ఆమె నేర్పును మెచ్చుకుంటూ అర్జునుడు తన చూపును ఆమెపై లగ్నం చేశాడు. చూపు సుభద్ర మీద నిలిపి శత్రువుపై బాణాలు ప్రయోగించాడు. చూపు శత్రుసైన్యంపై నిలపకపోయినా బాణాలు గురితప్పడంలేదు. అందుచేతనే శత్రువులు చేతికి కళ్ళున్నాయనుకున్నారు. ఈ యుద్ధం సుభద్రార్జునులిద్దరికీ వినోదంగా ఉందని, అనాయాసంగా శత్రువులను జయించగలమనే నమ్మకం ఉండడం వల్లనే వాళ్ళిద్దరూ అలా నిర్లక్ష్యంగా ఉన్నారని భావం.

కావ్యలింగం, అతిశయోక్తి అలంకారాలతో మత్తేభవృత్తంలో రచింపబడిన పద్యమిది.

**11. (164)**

వంచన సేసి యిట్లు చెలువం గొనిపోవఁ బ్రలంబవైరి సై
రించునె ? దుర్మదాధిప వరేణ్యులు భూములు దున్ని ధూళి గా
వించఁడె ? పిండి పిండిగఁ బ్రవీర విరోధి కిరీట రత్నముల్
దంచఁడె ? ఘోర సీర ముసలంబుల వ్యర్థములే ధరించుటల్.

**పరిచయం :**

ఈ పద్యం చేమకూర వేంకటకవిచే రచించబడిన విజయ విలాసం - తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది.

**సందర్భం :**

అర్జునుడు యాదవులను జయించి సుభద్రను తీసుకువెళ్ళిన విషయం తెలుసుకున్న యాదవులు బలరాముడి ఆధ్వర్యవంలో అనుకున్న మాటలలోనిదీపద్యం.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| వంచన + చేసి | = | మోసం చేసి |
| ఇట్లు | = | ఈ విధంగా |
| చెలువన్ | = | సుభద్రను |
| కొనిపోవన్ | = | తీసుకుపోవడాన్ని |
| ప్రలంబవైరి | = | ప్రలంబాసురుని చంపిన బలరాముడు |
| సైరించునె | = | సహిస్తాడా ? |
| దుర్మద | = | చెడ్డ గర్వం ఉన్న |
| అధిప వరేణ్యుల | = | రాజులలో శ్రేష్ఠులైన వారి యొక్క |
| భూములు | = | రాజ్యాలను |
| దున్ని | = | దున్ని |
| ధూళి + కావించడె | = | ధూళి అయ్యేటట్లు చేయడా ? |
| ప్రవీర | = | గొప్ప వీరులైన |
| విరోధి | = | శత్రువుల యొక్క |
| కిరీట | = | కిరీటాల్లో ఉండే |
| రత్నముల్ | = | రత్నాలు |
| పిండి పిండిగన్ | = | పిండి అయ్యేటట్లు |
| దంచడె | = | దంచడా ? |
| ఘోర | = | భయంకరమైన |
| సీర | = | నాగలిని |
| ముసలంబులన్ | = | రోకలిని |
| ధరించుటల్ | = | ఆయుధాలుగా ధరించడం |
| వ్యర్థములే | = | వృథాకావు సుమా ! |

**తాత్పర్యం :** అర్జునుడు మోసం చేసి సుభద్రను తీసుకుపోయాడు. బలరాముడు దీన్ని సహించడు. వారి రాజ్యాలను దున్ని ధూళి చేస్తాడు. వీరి కిరీటాల్లో ఉండే రత్నాలను పిండి పిండి చేస్తాడు. అలా చేయకపోతే బలరాముడు, నాగలిని, రోకలిని ధరించడం వ్యర్థమే కదా ! (వ్యర్థం కాకుండా తప్పక చేస్తాడని భావం).

**కవితా విశేషాలు :**

బలరాముడి ఆయుధాల్లో నాగలి, రోకలి ఉన్నాయి. నాగలి ఉన్నది కాబట్టి రాజ్యాన్ని దున్ని ధూళి కావించడం, రోకలి ఉన్నది కాబట్టి రత్నాలను పిండి పిండిగ దంచడం అనేవి సార్థక ప్రయోగాలుగా చెప్పుకోవచ్చు. పరికరాంకురం, క్రమాలంకారాలతో ఉత్పలమాల వృత్తంలో చెప్పబడిన పద్యమిది.

12. (170)

ఆ పుర మర్దనుండయిన నాతని నడ్డము దాఁకి నిల్వఁగా
నోపఁడు, మత్స్య యంత్రము మహోద్ధతి నేసి స్వయంవరంబునన్
ద్రౌపదిఁ గైకొనన్ చెనకు రాజకుమారుల పాటెరుంగమే ?
మూఁపులు మూఁడగున్ రిపు చమూపులఁ గన్నపు డక్కిరీటికిన్.

**పరిచయం :**

ఈ పద్యం చేమకూర వేంకటకవిచే రచించబడిన విజయవిలాసం - తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది.

**సందర్భం :**

అర్జునుడు సుభద్రను తీసుకెళ్ళిన వృత్తాంతం విని యాదవులు కోపించారు. అతనిపై యుద్ధానికి వెళ్ళాలనుకున్నారు. అలా ఆగ్రహంతో పలికే యదువీరుల మాటలు విని కృష్ణుడు బలరామునితో అన్నమాటల లోనిదీపద్యం.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| ఆ పురమర్దనుండు | = | త్రిపురాసురులను చంపిన ఆ ఈశ్వరుడు |
| అయినన్ | = | అయినా |
| అతనిన్ | = | అర్జునుడిని |
| అడ్డము + తాకి | = | ఎదిరించి |
| నిల్వ + కాన్ + ఓపడు | = | నిలబడలేడు |
| మత్స్య యంత్రము | = | మత్స్య యంత్రాన్ని |
| మహా + ఉద్ధతిన్ | = | గొప్ప పరాక్రమంతో |
| ఏసి | = | కూలగొట్టి |
| స్వయం వరంబునన్ | = | స్వయంవరంలో |
| ద్రౌపదిన్ | = | ద్రౌపదిని |
| కైకొనన్ | = | స్వీకరించినప్పుడు |
| చెనకు | = | ఎదిరించినట్టి |
| రాకుమారుల | = | రాజకుమారుల యొక్క |
| పాటు | = | అవస్థ |
| ఎరుంగమే | = | తెలియమా ? |
| రిపు | = | శత్రువుల యొక్క |
| చమూపులన్ | = | సేనా నాయకులను |
| కన్నపుడు | = | చూచినప్పుడు |
| ఆ + కిరీటికిన్ | = | ఆ అర్జునుడికి |
| మూపులు | = | భుజాలు |
| మూడు + అగున్ | = | మూడు అవుతాయి. |

**తాత్పర్యం :** ఈశ్వరుడు వచ్చి ఎదిరించినా అర్జునుడి ధాటికి నిలువలేదు. మత్స్య యంత్రాన్ని కొట్టి ద్రౌపదిని స్వయంవరంలో పరిగ్రహించినప్పుడు అతడి నెదిరించిన రాజకుమారుల అవస్థలు మనకు తెలుసుగదా ! శత్రుసైన్యాధిపతులను చూస్తే అర్జునుడి భుజాలు మూడవుతాయి సుమా !

**కవితా విశేషాలు :**

పరాక్రమం విషయంలో పరమశివుడు సాటిలేనివాడు. అలాంటి శివుడు కూడా నిలువలేడని చెప్పడం వలన అర్జునుడి వీరత్వం వెల్లడవుతుంది. సుభద్రా పరిణయ సందర్భానికి అర్జునుడికి శివుడితో యుద్ధం జరగలేదు. ఆ తరువాత పంది విషయంలో వారిద్దరి మధ్య జరిగిన యుద్ధంలో ఈశ్వరుడు ఓటమి చెందాడు. దానివలన శివుడు అర్జునుడి ముందు నిలువలేడనే విషయం నిజమయింది. ద్రౌపది స్వయంవర సందర్భంలో రాకుమారులందరూ ఓడిపోయారని చెప్పడంలో అలాంటి అవస్థ మనకు కలగకూడదనే సూచన ఉంది. మూపులు మూడగున్ అంటే అత్యధికమైన ఉత్సాహం కలుగుతుంది అని భావం. యమకాలంకారంతో ఉత్పలమాల వృత్తంలో రచించబడిన పద్యమిది.

13. (220)

పంచశిలీముఖంబులును బచ్చని విల్లును బూని యెక్కు సం
ధించుచు 'నిర్వురం బెనఁచి నెమ్మి గరంచు కడంక చూడు మీ'
యంచు, గవాక్ష సీమ నపుడా యెల తెమ్మెరఁ గూడి, వేడుకన్
బొందులు సూడఁగా దొడఁగెఁబో మకరాంకుఁడు గానకుండఁగన్.

**పరిచయం :**

ఈ పద్యం చేమకూర వేంకటకవిచే రచించబడిన విజయవిలాసం - తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది.

**సందర్భం :**

సుభద్రను కేళీగృహంలో అర్జునుడి చెంత విడిచిపెట్టి చెలికత్తెలు వెళ్ళిన తరువాత మన్మథుడు విజృంభించాడు. ఆ సన్నివేశాన్ని వర్ణిస్తూ కవి చెప్పిన పద్యమిది.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| పంచ శిలీముఖంబులును | = | అయిదు బాణాలను |
| పచ్చని విల్లును | = | చెరకు విల్లును |
| పూని | = | ధరించి |
| ఎక్కు సంధించుచు | = | వింటిని ఎక్కుపెడుతూ |
| ఇర్వురన్ | = | ఇద్దరిని |
| పెనచి | = | కలిసేటట్లు చేసి |
| నెమ్మిన్ | = | ప్రేమచేత |
| కరంచు | = | కరిగే విధంగా |
| కడంకన్ | = | నా ప్రయత్నాన్ని |
| చూడుమీ | = | చూడండి |
| అంచున్ | = | అంటూ |
| అపుడు | = | ఆ సమయంలో |
| గవాక్ష సీమన్ | = | కిటికీ ప్రదేశంలో |
| ఆ ఎల తెమ్మెరన్ | = | ఆ పిల్లగాలితో |
| కూడి | = | కలిసి |
| వేడుకన్ | = | సంతోషంతో |
| మకరాంకుడు | = | మన్మథుడు |
| కానకుండగన్ | = | ఇతరులకు కనిపించకుండా |
| పొంచులు | = | దొంగచూపులు |
| చూడగన్ | = | చూడడం |
| తొడగెన్ | = | ఆరంభించాడు |

**తాత్పర్యం :** "పంచ బాణాలనీ, విల్లునీ ధరించివచ్చి, వింటిని ఎక్కుపెడతాను. సుభద్రార్జునులు కలిసి ప్రేమలో కరిగే విధంగా చేస్తాను. నా ప్రయత్నం చూడండి" అంటూ మన్మథుడు కిటికీ దగ్గర పిల్లగాలితో కలిసి ఇతరులకు కనిపించకుండా దొంగచూపులు చూస్తున్నాడు.

**కవితా విశేషాలు :**

మన్మథుడికి శరీరంలేదు. అందుచేతనే ఇతరులకు కనిపించకుండా ఉన్నాడని భావం. అంతేకాకుండా 'కానకుండగన్' అంటే చూడకుండానే కళ్ళుమూసుకొని బాణాలు ప్రయోగిస్తున్నాడని చెప్పుకోవచ్చు. మన్మథుడు ప్రగల్భాలు పలుకుతూ తననేర్పును గురించి ఎలతెమ్మెరతో చెప్పడం రమ్యంగా ఉంది. కనబడకుండా చూస్తున్నాడు కాబట్టి పొంచుట అనడం సార్థక ప్రయోగం. ఉత్ప్రేక్షాలంకారంతో ఉత్పలమాల వృత్తంలో రచింపబడిన పద్యమిది.

## 1. 13. 3 సందర్భ సహిత వ్యాఖ్యలు :

### 1. ఒక్క తీరయ్యె భరత వంశోత్తమునకు !

**పరిచయం :** ఈ వాక్యం చేమకూర వేంకటకవిచే రచించబడిన విజయ విలాసం - తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** అర్జునుడు పొందిన విరహతాపాన్ని వర్ణిస్తూ కవిచెప్పిన వాక్యమిది.

**వివరణ :** రుక్మిణి వచ్చి భోజనం వడ్డించింది. అర్జునుడు విచారంలో సరిగా భుజించలేదు. సుభద్ర దగ్గరగా ఉంటే సంతోషంతో భుజించేవాడు కాదు. ఆమె దూరమయితే విచారంతో భుజించేవాడు కాదు. సుభద్ర దగ్గరగా ఉన్నా, దూరంగా ఉన్నా అర్జునుడికి ఒకే విధంగా ఉంది అని కవి చమత్కరించాడు.

### 2. చదువంబెట్టగ నున్న మతియు బోయె !

**పరిచయం :** ఈ వాక్యం చేమకూర వేంకటకవిచే రచించబడిన విజయ విలాసం - తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** సుభద్ర వెళ్ళిపోయిన తర్వాత విరహతాపాన్ని పొంది బాధపడుతూ అర్జునుడు అనుకున్న మాటలలోనిదీ వాక్యం.

**వివరణ :** సుభద్ర తనకు సేవ చేసేటప్పుడు అర్జునుడు ఆమెను చూచి సంతోషించేవాడు. ఇప్పుడు తాను అర్జునుడనని చెప్పి కౌగలి అడిగినంతనే ఆమె వెళ్ళిపోయింది. ఇది చదువుకోసం పంపితే ఉన్నమతి కూడా పోయినట్లుగా ఉన్నదని అర్జునుడు బాధపడ్డాడు. తన విషయం చెప్పకుండా ఉంటే కనీసం ఆమె రూపం కనిపించేదని, తాను బయటపడడం వల్ల అంతకు ముందు కనిపించే సుభద్ర కనిపించకుండా పోయిందని అర్జునుడు చింతిల్లాడు. సందర్భోచితంగా లోకోక్తిని ఉపయోగించి చక్కని చమత్కారం చూపించిన వేంకటకవి కవిత్వాన్ని మెచ్చవలసిందే !

### 3. ఎంత యవివేక మయో ?

**పరిచయం :** ఈ వాక్యం చేమకూర వేంకటకవిచే రచించబడిన విజయ విలాసం - తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** సుభద్ర అంతఃపురానికి వెళ్ళి మన్మథ బాధకు లోనయి ఏకాంతంలో తనలో తాను విపత్కరించుకునే సందర్భంలో అనుకున్న మాటలివి.

**వివరణ :** "నేను అందగాడయిన అర్జునుడిని ప్రేమించాను. అతడే నన్ను కోరి నా దగ్గరకు వచ్చి ప్రార్థించాడు. నేను పెనుగులాడి కౌగిలి ఇవ్వకుండా వచ్చాను. ఇది ఎంత అవివేకమో" అని సుభద్ర అనుకున్నది. తాను ప్రేమించిన ప్రియుడు స్వయంగా వచ్చి అడిగినా కౌగిలి ఇవ్వకపోవడం అమాయకత్వమని, ఆ విధంగా ఇవ్వకపోవడం వల్లనే ఇప్పుడీ విరహవేదన అనుభవించవలసి వచ్చిందని సుభద్ర బాధపడింది. కౌగిలి ఇస్తే సుఖం, ఇవ్వకపోవడం వల్ల బాధ కలుగుతాయని సుభద్ర గ్రహించింది.

### 4. అతడేమి దోసము సేసెన్ ?

**పరిచయం :** ఈ వాక్యం చేమకూర వేంకటకవిచే రచించబడిన విజయ విలాసం - తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** సుభద్ర విరహవేదన అనుభవిస్తూ ఉంటే ఆమె ప్రేమ రహస్యం తెలిసిన వదినెలు పరిహాసం చేస్తూ సుభద్రతో అన్న పలుకులలోనిదీ వాక్యము.

**వివరణ :** "సుభద్రా ! ఇన్ని రోజులనుంచి ఆ ముని దగ్గరకు పరుగులు తీస్తూ వెళ్ళి పరిచర్యలు చేస్తూ ఉండేదానివి. ఈ రోజు అటు తొంగి కూడా చూడడం లేదు. ఆ ముని ఏమయినా దోషం చేశాడా ? అని పరిహాసం చేశారు. సుభద్ర ఎందుకు వెళ్ళలేదో ఆమెకు తెలుసు - వదినెలకూ తెలుసు. అయినా ఏమీ తెలియనట్లు వాళ్ళు ప్రశ్నించడం ఇందలి పరిహాసం, వదిన మరదళ్ళు సరస సంభాషణని, పరిహాస ప్రసంగాన్ని కవి చక్కగా ప్రదర్శించాడు.

### 5. అల్ల సన్యాసికే చూపవలయు ! -

**పరిచయం :** ఈ వాక్యం చేమకూర వేంకటకవిచే రచించబడిన విజయ విలాసం - తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** విరహ వేదన అనుభవించే సుభద్రను చూచి వదినెలు సరసాలాడారు. చెలికత్తెలు పరిహాసం చేశారు. ఆ తరువాత సత్యభామ సుభద్రను గురించి చెలికత్తెలతో పలికిన మాటలలోనిదీ వాక్యము.

**వివరణ :** "ఈమె శరీరం చూస్తే కాలుతూ ఉంది. ఏదేదో కలవరించే ఈ సుభద్రను దయ్యం సోకిందేమో ! సుభద్రను తీసుకువెళ్ళి ఆ సన్యాసికే చూపాలి" అని నవ్వుతూ సత్యభామ చెలికత్తెలతో అన్నది. శరీరం కాలడానికి, కలవరించడానికి కారణం గనుక ఆ సన్యాసికే చూపాలని దయ్యం పడితే సన్యాసులు వదలగొడతారు కనుక ఆ సన్యాసికి చూపాలనే భావాలతో సత్యభామ ఈ మాటలు అంది. అందలి అంతరార్థం చెలికత్తెలందరికీ తెలుసు. మరదలిని పరిహాసం చేస్తూ సత్యభామ అన్నమాటలు వదినెమరదళ్ళ సరససంభాషణకు ఉదాహరణంగా కవి వర్ణించాడు.

### 6. క్రమ్మఱం బ్రతికి రాగ వజీర్లయినారుగా శరీ ! -

**పరిచయం :** ఈ వాక్యం చేమకూర వేంకటకవిచే రచించబడిన విజయ విలాసం - తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** విరహవేదన అనుభవించే సుభద్ర బాధను చూడలేక చెలికత్తెలు ఆమెకు బాధ కలిగిస్తున్న మన్మథుడు మొదలైన వారిని నిందించడానికి పూనుకున్నారు. అందులో చంద్రుని నిందిస్తున్న సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :** "మన్మథుడు పరమశివునితో పోరాడి బూడిదైనాడు. చంద్రుడా ! ఆ సమయంలో నీవెక్కడ ఉన్నావు ? వసంతుడు, మందమారుతం ఎక్కడ ఉన్నారు ? అప్పుడు కనిపించని మీరు ఇప్పుడా మన్మథుడు అదృష్టం వల్ల బ్రతికి బయటపడితే మంత్రులుగా తయారయ్యారు. ఇందుకు మీరు సిగ్గుపడాలి" అని చెలికత్తెలు చంద్రుడిని నిందించారు. కష్టకాలంలో కనిపించకుండా వెళ్ళి, అదృష్టం కలిగినప్పుడు వచ్చి ఆప్యాయత చూపించే స్నేహితులు హితులు కారని, అది వారి నీతిలేమికి తార్కాణమని కవి పేర్కొన్నాడు.

### 7. నీ కగునే యిగురు బోడి నెత్తురు ద్రావన్ ?

**పరిచయం :** ఈ వాక్యం చేమకూర వేంకటకవిచే రచించబడిన విజయ విలాసం - తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** విరహవేదన అనుభవిస్తున్న సుభద్ర బాధను చూడలేక చెలికత్తెలు ఆమెకు బాధ కలిగిస్తున్న మన్మథుడు మొదలైన వారిని నిందించడానికి పూనుకున్నారు. అందులో కోకిలను నిందిస్తున్న సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :** "కోకిలా ! ఇది విపరీతం సుమా ! మా సుభద్ర, నీవు ఇన్నాళ్ళు ఏకగ్రీవంగా సఖ్యంగా ఉండేవారు. ఇప్పుడెందుకు ఆమెను శ్రమ పెడుతున్నావో గాని అది న్యాయం కాదు. అసలే సుభద్ర చిగురాకు వంటి శరీరం కలది. ఆమె నెత్తురు త్రాగడం నీకు తగదు కదా! " అని చెలికత్తెలు కోకిలను నిందించారు. ఏకగ్రీవంగా అనడం చేత ఇద్దరూ కమ్మని కంఠస్వరం గలవారే అనిభావం. చిగురుటాకులను భుజించే నీకు రక్తం త్రాగడం ధర్మంకాదని హితవు చెప్పడం ఇందులో కనిపిస్తుంది. నెత్తురు త్రాగుట అనే జాతీయాన్ని కవి సముచితంగా ప్రయోగించడం ఇందులోని విశేషం.

### 8. మనసు భద్రమయ్యె మనకు నెల్ల ?

**పరిచయం :** ఈ వాక్యం చేమకూర వేంకటకవిచే రచించబడిన విజయ విలాసం - తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది.

**సందర్భం:** సుభద్రార్జునుల వివాహసన్నాహాలు ప్రారంభమయిన సందర్భంలో చెలికత్తెలు అర్జునుడిని చూచి, సుభద్ర అదృష్టవంతురాలని భావించిన సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :** అర్జునుడి సౌందర్యం చూచి అతడు అందగాడని, అతడిని పొందే సుభద్ర జన్మమే జన్మమని చెలులు భావించారు. "మంచిమగడు కావాలని సుభద్ర కోరుకుంటూ ఉంటే మంచి వీరుడైన అర్జునుడే లభించాడు. మన సుభద్ర అదృష్టవంతురాలు. మనందరి మనసులు కుదుటపడ్డాయి" అని చెలికత్తెలు అనుకున్నారు. సుభద్రకు మంచి భర్త లభించాలని చెలికత్తెలు కోరుకున్నారని, మంచి భర్త లభించడం వల్ల సంతోషించారని భావం.

**9. తలిదండ్రులు పెట్టని సొమ్ము పెన్నెఱుల్ !**

**పరిచయం :** ఈ వాక్యం చేమకూర వేంకటకవిచే రచించబడిన విజయ విలాసం - తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** వివాహానికి సుభద్రార్జునులను అలంకరించే చెలికత్తెలు సుభద్రను అలంకరిస్తూ ఆమె శిరోజాలను వర్ణిస్తూ కవి చెప్పిన వాక్యమిది.

**వివరణ :** సుభద్రను అలంకరించే చెలికత్తెలు నల్లగా బారెడు పొడవున్న వెండ్రుకలను దువ్వారు. జారుకొప్పు వేశారు. ఆ కొప్పు వేయి ఆభరణాలు పెట్టినట్లు అమరింది. దానిని చూస్తే స్త్రీకి తల వెండ్రుకలు తల్లిదండ్రులు పెట్టని ఆభరణాలు అవుతాయి. నగలు ధరించకున్నా కేశసంపద చేత సుభద్ర అందంగా ఉంటుందని కవి అర్థాంతరన్యాసాలంకారం చేత వర్ణించాడు.

**10. మెత్తవడె దాని చెలువు !**

**పరిచయం :** ఈ వాక్యం చేమకూర వేంకటకవిచే రచించబడిన విజయ విలాసం - తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** వివాహ వేదిక కడకు సుభద్రార్జునులను తీసుకువచ్చిన తరువాత అప్పటి సుభద్ర సౌందర్యాన్ని చూసిన అప్సరసలు అనుకున్న మాటలలోనిదీ వాక్యం.

**వివరణ :** "మనం ఎప్పుడూ తిలోత్తమ అందాన్ని మెచ్చుకుంటూ ఉంటాము. కాని ఆ తిలోత్తమ అందం ఈ సుభద్ర అందం ముందు తక్కువే సుమా !" అని అప్సరసలందరు తమలో తాము రహస్యంగా చెప్పుకున్నారు. దేవతలు మెచ్చుకొనే సౌందర్యరాశి సుభద్ర అని, దేవతాస్త్రీలలో పేరెన్నికగన్న తిలోత్తమ కన్న ఈమె అందగత్తె అని దీనివల్ల తెలుస్తుంది.

**11. పదివేల కన్నులు కావలెను !**

**పరిచయం :** ఈ వాక్యం చేమకూర వేంకటకవిచే రచించబడిన విజయ విలాసం - తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** వధూవరులైన సుభద్రార్జునులను కళ్యాణవేదిక కడకు తీసుకువచ్చిన తర్వాత ఆ దంపతులను చూపరులు మెచ్చుకుంటున్న సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :** ఈ దంపతులను చూడడానికి వేయికన్నులు కావాలని కవులు పొగుడుతూ ఉంటే, వేయి కన్నులు గల ఇంద్రుడు పదివేలకన్నులు కావాలి అనే విధంగా ఆ దంపతులను చూస్తున్నాడు. రెండు కళ్ళు ఉన్నవాళ్ళు వేయికళ్ళు కావాలి అనుకుంటే వేయి కళ్ళు కలవాడు పదివేల కళ్ళు కావాలని అనుకోవడం ఇక్కడి చమత్కారం.

**12. పుట్టిల్లును జొచ్చినట్టునయి వృద్ధి యొసంగెడు నీకు నెంతయున్ !**

**పరిచయం :** ఈ వాక్యం చేమకూర వేంకటకవిచే రచించబడిన విజయ విలాసం - తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** సుభద్రార్జునుల వివాహానంతరం దేవలోకానికి వెళుతున్న శచీదేవికి అంతఃపుర కాంతలు వీడ్కోలు పలికే సందర్భంలో ఆమె సత్యభామతో అన్న మాటలివి.

**వివరణ :** "చెల్లెలా ! క్షేమమేనా పెరటిచెట్టుగ నాటిన పారిజాతం వికసించిన పూలతో అందంగా ఉందా ! నా మనస్సెప్పుడు దానిమీదే ఉంటుంది. అది పుట్టిల్లు, అత్తవారి ఇల్లులా ఎంతో అభివృద్ధి కలిగిస్తుంది" అని శచీదేవి సత్యభామతో అన్నది.

**13. ఒకతె యెడ బాసి పోవనెట్లోర్చు మనసు ?**

**పరిచయం :** ఈ వాక్యం చేమకూర వేంకటకవిచే రచించబడిన విజయవిలాసం - తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** సుభద్రార్జునుల వివాహానంతరం దేవకీదేవి తన కూతురు సుభద్రను అత్తవారింటికి సాగనంపే సందర్భంలో సుభద్ర పరిస్థితిని వర్ణిస్తూ కవి చెప్పిన వాక్యమిది.

**వివరణ :** "తల్లిదండ్రులు గారాబంతో పెంచారు. వదినెలు, అన్నలు గౌరవం చూపారు. ఊరునిండా బంధువులున్నారు. ఇంతమంది నుంచి ఒక్కతే విడిచిపోవడానికి సుభద్ర మనసు ఓర్చుకోలేకపోతుంది" అని కవి వర్ణించాడు. తనను ఆత్మీయంగా చూచిన తన వారిని విడిచి పోవడానికి సుభద్ర పడే బాధ ఇక్కడ వర్ణింపబడింది.

**14. సందియ మందనేల ?**

**పరిచయం :** ఈ వాక్యం చేమకూర వేంకటకవిచే రచించబడిన విజయవిలాసం - తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** వివాహానంతరం ఇంద్రప్రస్థానికి బయలుదేరి వెళుతున్న సుభద్రార్జునులను చూచి జనులు అనుకున్న పలుకులను సమర్థిస్తూ కవి చెప్పిన వాక్యమిది.

**వివరణ :** రథాన్ని ఎక్కి వెళుతున్న దంపతులను చూచి జనులు వీరు రతిమన్మథులు అనుకున్నారు. ఆ రథంలో హరి తురంగాలు (చిలుక గుర్రాలు, కృష్ణుని గుర్రాలు) ఇంచువిల్లు (మన్మథుని చెరకువిల్లు, అందమైన విల్లు) అలరు తూపులు (పూలబాణాలు, సొగసైన బాణాలు) ఉన్నాయి కాబట్టి జనులనుకునే మాటల్లో నిజం ఉంది అని కవి సమర్థించాడు. చక్కని శ్లేషణతో రచింపబడిన భావమిది.

**15. రేకుమడంతుము మాట లేటికిన్ ?**

**పరిచయం :** ఈ వాక్యం చేమకూర వేంకటకవిచే రచించబడిన విజయవిలాసం - తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** అర్జునుడు సుభద్రను తీసుకువెళ్ళాడని తెలుసుకున్న బలరాముడికి కోపం వచ్చింది. బలరాముడితో యాదవ ప్రముఖులు అన్న మాటలలోనిదీ వాక్యం.

**వివరణ :** "మనం యుద్ధానికి వెళదాము. యాదవ బలం అనే సముద్రం పొంగితే అడ్డుకునే వీరుడు ఈ ప్రపంచంలో లేడు. ఈ పనికి ప్రభువులైన మీరెందుకు ? అర్జునుడే కాదు అతడి తండ్రి ఇంద్రుడు యుద్ధంలో ఎదిరించినా వారి శరీరమంతా గాయాలు చేస్తాం. మాటలెందుకు ? వెళ్ళమంటారా ? కట్టి తెమ్మంటారా ?" అని యాదవ వీరులు బలరాముడితో అన్నారు.

**16. తెగరాని చోట సైరణ తగదా ! -**

**పరిచయం :** ఈ వాక్యం చేమకూర వేంకటకవిచే రచించబడిన విజయవిలాసం - తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** అర్జునుడి పైకి యుద్ధానికి వెళ్ళాలని తొందరపడుతున్న బలరాముడు, సభలోని యాదవ వీరుల మాటలు విని కృష్ణుడు వారితో అన్నమాటల లోనిదీవాక్యం.

**వివరణ :** యుద్ధానికి వెళ్ళి అర్జునుడిని జయించాలని బలరాముడు, యాదవవీరులు అనుకున్నారు. ఆ మాటలు కృష్ణుడికి నచ్చలేదు. కృష్ణుడు బలరాముడితో "అన్నా ! బలరామా ! మిమ్మెదిరించి యుద్ధంలో ఎవడు నిలవలేడు. ఉచితమైనదాన్ని గ్రహించి ఇతరుల్లాగా మాట్లాడకూడదు. అధికమైన కోపాన్ని పొందడం నేర్పుకాదు. తెంపుకోడానికి వీలుగాని చోట సహనం చూపడం మంచిది" అన్నాడు. అర్జునుడు సుభద్రను వివాహం చేసుకున్నాడు కాబట్టి ఆ సంబంధం తెంపుకోలేమని, అందుచేత ఓర్చుకోవడం మంచిదని, అర్జునుడితో యుద్ధం ప్రమాదకరమని కృష్ణుడు సోదరునికి సలహా ఇచ్చాడు.

**17. మాకీవగదయ్య సర్వ శుభహేతువు నిచ్చలు !**

**పరిచయం :** ఈ వాక్యం చేమకూర వేంకటకవిచే రచించబడిన విజయవిలాసం - తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** ఇంద్రప్రస్థానికి వచ్చిన బలరామకృష్ణులను ధర్మరాజు గౌరవ మర్యాదలతో స్వాగతం పలికి ఆహ్వానించాడు. కృష్ణుని కౌగలించుకుంటూ ధర్మరాజు మనస్సులో అనుకున్న మాటలివి.

**వివరణ :** బావా అంటూ కృష్ణుడు భయభక్తులతో వచ్చి ధర్మరాజుకు నమస్కరించాడు - ధర్మరాజు అతని కౌగలించుకున్నాడు. "మా పాండవులకు ఎల్లప్పుడు శుభాలు కలిగించే వాడవు నీవేకదా " అని హృదయంలో అనుకున్నాడు.

**18. అనుకూలత గల్గు బంధు లవనిన్ గలరే !**

**పరిచయం :** ఈ వాక్యం చేమకూర వేంకటకవిచే రచించబడిన విజయవిలాసం - తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది.

**సందర్భం:** ఇంద్రప్రస్థానికి వచ్చిన బలరామకృష్ణులను సంభావించి ధర్మరాజు మర్యాదలు చేశాడు. ఆ తర్వాత బలరామ కృష్ణునితో అన్న మాటలలోనిదీ వాక్యం.

**వివరణ :** "మీ వద్ద మాకున్న చనువు చేతనే బలవంతంగా సుభద్రను తెచ్చి వివాహం చేయడానికి సాహసించాం. దానికి మీ చనువేకారణం. ఇలాంటి అనుకూలత ఉన్న బంధువులు భూమిమీద మీరుతప్ప ఇంకెవరుంటారు ?" అని ధర్మరాజు బలరామకృష్ణులతో అన్నాడు. వారిచ్చిన చనువు ఆధారంతోనే అర్జునుడు సుభద్రను తెచ్చి పెళ్లాడినాడని, అందుకు వారు అంగీకరించి రావడం సంతోషం కలిగించే విషయమని, అలాంటి అనుకూలురైన బంధువులు దొరకటం అదృష్టమని ధర్మరాజు చమత్కారంగా సమర్థించాడు.

**19. ఏలిక మ్రోలకున్ మనవికేగెడు నయ్యభిమాని పోలికన్ !**

**పరిచయం :** ఈ వాక్యం చేమకూర వేంకటకవిచే రచించబడిన విజయవిలాసం - తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** చెలికత్తెలు సుభద్రను అలంకరించి, సరసాలాడి కేళీ గృహానికి తీసుకుపోయిన సందర్భంలో సుభద్రను వర్ణిస్తూ కవి చెప్పిన వాక్యమిది.

**వివరణ :** కేళీ గృహంలో భర్త వద్దకు వస్తున్న సుభద్ర మనస్సులో తత్తరపాటు, ప్రేమ, భయం ఉన్నాయి. ఆ మూడు ఆమె ఓర్పును అణచివేశాయి. శరీరమంతా చెమట పట్టింది. ఆమె సందేహిస్తూ మెల్లగా చెలికత్తెలు లాగుతుండగా భర్త దగ్గరకు వచ్చింది. ఆ విధంగా రావడాన్ని కవి ప్రభువు ఎదుట మనవి చేసుకోవడానికి వెళ్ళే అభిమానిలాగా ఉందని చమత్కరించాడు. అభిమానం కలవారు ప్రభువు ఎదుట మనవి చేసుకోడానికి ఎలా తత్తరపడతారు, భయపడతారో అలాగే సుభద్ర అర్జునుడి వద్దకు వెళ్ళిందని కవి వర్ణించాడు.

**20. తేరుగడకాగ మెల్లగ దిద్దు కొనుము.**

**పరిచయం :** ఈ వాక్యం చేమకూర వేంకటకవిచే రచించబడిన విజయవిలాసం - తృతీయాశ్వాసం నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** కేళీగృహానికి సుభద్రను తీసుకువచ్చిన చెలికత్తెలు అర్జునుడితో సుభద్ర గురించి చెప్పిన మాటలలోనిదీ వాక్యం.

**వివరణ :** "ఈమె ద్వారకనుంచి వచ్చేటప్పుడు రథాన్ని ఎలా నడిపిందో తెలియదు కాని ఈమెను ఇక్కడికి రథాన్ని ఈడ్చుకు వచ్చినట్లు తీసుకురావలసి వచ్చింది. ఈమెకు ఇప్పటి వరకు ఏమీ తెలియదు. ముద్దరాలు. ఆమె చక్కబడి అనుకూలమయ్యే విధంగా ఉపాయంతో దిద్దుకో" అని చెలికత్తెలు అర్జునుడితో చెప్పారు. రథాన్ని నడిపిన సుభద్ర రథాన్ని లాగినట్లు లాక్కురావలసి వచ్చిందని చెప్పటం ద్వారా కవి చమత్కారం కల్పించాడు.

**డా॥ నాగభైరవ ఆదినారాయణ, ఎం. ఏ., పిహెచ్.డి.**

రీడర్ & ప్రిన్సిపాల్

బి.ఎస్.ఎస్.బి. డిగ్రీ కళాశాల, తాడికొండ

గుంటూరు జిల్లా.

## మొదటి భాగము - ప్రాచీన పద్యభాగము

# విజయ విలాసము - చేమకూర వేంకటకవి

## పాఠం -14

1. 14. 0 ప్రశ్నలు - సమాధానాలు
1. 14. 1 పరీక్షలో రాదగిన ప్రశ్నలు
1. 14. 2 ఆచూకీ గ్రంథాలు

### 1.14. 0 ప్రశ్నలు సమాధానాలు

1. పాఠ్యభాగం ఆధారంగా చేమకూర వేంకటకవి ప్రతిపద్య చమత్కారాన్ని వ్యాఖ్యానించండి.

లేదా

చమత్కారమంటే ఏమిటో తెల్పి, దానిని చేమకూర వేంకట కవి విజయవిలాసంతో సమన్వయించండి.

చేమకూర వేంకటకవి శ్లేష చమత్కారాలకు పెట్టింది పేరు. అలాంటి చేమకూర వేంకటకవి విజయవిలాసము ప్రబంధాన్ని అంకితం తీసుకొని ఆదరించిన రఘునాథరాయలు చేమకూర కవిత్వాన్ని ఇలా మెచ్చుకున్నాడట :

"ప్రతి పద్యము నందు జమ
త్కృతి గలుగం జెప్పనేర్తు వెల్లెడ బెళుకౌ
కృతి వింటి మపారముగా
క్షితిలో నీ మార్గ మెవరికిన్ రాదుసుమీ,"

ప్రతిపద్యంలో చమత్కారం చెప్పేనేర్పు వేంకటకవికి ఉంది. అలాంటి కవిత్వాన్ని తాను విన్నానని, ఆ కవితామార్గం అన్య కవులకు అసాధ్యమయిందని దీని భావం. కవిరాజు, రాజకవి అయిన రఘునాథ నాయకుని ప్రశంసకు పాత్రం అయిన ప్రతిపద్య చమత్కారం విజయవిలాసంలో ఎలా నిర్వహింపబడిందో పరిశీలిద్దాం.

చమత్ అనేది ధ్వన్యనుకరణ శబ్దం. చమత్ అనేశబ్దం ధ్వని వచ్చే విధంగా లొట్టలు వేయడం అనే భావంలో దీనిని వాడతారు. చమత్కారం అంటే "లొట్టలు వేసే విధంగా ఆస్వాదింపజేసే గుణం ఉన్నది" అని అర్థం చెప్పుకోవచ్చు. కావ్య పరంగా చూస్తే చమత్కారం ఉన్న పద్యాన్ని చదివి పాఠకుడు లొట్టలు వేసేటంత ఆనందం పొందుతాడని, అలాంటి గుణాన్నే చమత్కారం అంటారని చెప్పుకోవచ్చు.

విశ్వేశ్వరకవి చంద్రుడు "చమత్కార : చిత్త విస్తార రూపో విస్మయా పర పర్యాయ" అని చమత్కార లక్షణాన్ని చెప్పగా, ఆప్టే అనే నిఘంటు కారుడు చమత్కారమనగా కవితా సౌందర్యం అని అర్థం చెప్పాడు. క్షేమేంద్రుడు, నారాయణాది ఆలంకారికులు చమత్కారం గురించి, కావ్యాల్లో దాని స్థానం గురించి వివరించారు.

**శబ్దగత చమత్కారం :**

శబ్ద ప్రయోగాన్ని ఆశ్రయించి ఉండే చమత్కారం శబ్దగత చమత్కారం.

"చక్కెర కెంపు మోవిఁ‘గని సారెకు ( జిల్క మొగంబు వేడగా (
జొక్కపు ( జిల్వ కప్పు జడ ( జూచి మయూరము లబ్జు సాపగా (
జక్కని తమ్మిపూ వడుగు జాడెల గన్గొని రాజ హంసముల్
త్రొక్కుడు పాటు చెందగ వధూమణి వచ్చుట లెంచు నెమ్మదిన్"

ఇక్కడ చిలుకకు మాటలాడే నేర్పు ఉంది కాబట్టి వేడింది అని, నెమలి విషయంలో అబ్జు సాపింది అని, హంసల విషయంలో త్రొక్కుడు పాటు చెందాయి అని కవి చెప్పడం వల్ల ఇందు శబ్ద గత చమత్కారం కనిపిస్తుంది.

**అర్థగత చమత్కారం :**

అర్థం వలన సాధింపబడిన చమత్కారానికి అర్థగత చమత్కారం అనిపేరు.

"వేయు గన్నులు వలయుబో వీరి (జూడ
నని కవుల్ దంపతుల చెల్వు వినుతి చేయఁ;
కాదు పదివేల కన్నులు గావలెనని
చూచు చుండె సహస్ర విలోచనుండు."

సుభద్రార్జునుల సౌందర్యం చూడడానికి రెండు కళ్ళున్నవాళ్ళు వేయి కళ్ళు కావాలని అనుకుంటూ ఉంటే, అక్కడే ఉన్న వేయి కళ్ళున్న ఇంద్రుడు పదివేల కళ్ళు కావాలని అనుకున్నాడట. ఇక్కడ అర్థం వలన చమత్కారం సాధింపబడింది గనుక ఇది అర్థగత చమత్కారం.

**శబ్దార్థ చమత్కారం :**

శబ్దార్థముల రెండింటి ద్వారా సాధింపబడే చమత్కారాన్ని శబ్దార్థ చమత్కారం అంటారు.

"అంతిపురమున కరుగుచో నింతి తిరిగి
యోరగా ( జూచునపుడు, శృంగార రస మ
పారముగ నుబ్బ జాలెత్తె నౌర ! దాని
చల మనోహర లోచనాంచలమ చెలమ."

అంతఃపురానికి వెళుతూ సుభద్ర ఓరగా చూచిందట. అప్పుడు నీటి బుగ్గల వంటి ఆమె కనుకొలుకుల్లో శృంగారరసం అపారంగా జాలు వారిందట చెలమల్లో నీరు ఉంటుంది గాని ప్రవహించదు. కాని ఇక్కడ శృంగార రసమనే ప్రవాహం అపారంగా ఉండడం వల్ల ప్రవహించింది అని చెప్పడంలో చమత్కారం కనిపిస్తుంది. ఇది అర్థ చమత్కారం. అలాగే పారం అంటే గట్టు. అపారం అంటే గట్టు దాటేటట్లుగా శృంగార రసం ఉబ్బింది. అది చెలమ అంచులను దాటి ప్రవాహ రూపం దాల్చింది. అపారం అనేపద ప్రయోగంలో శబ్ద చమత్కారం ఉంది. కనుక ఇక్కడ శబ్దార్థ చమత్కారం ఉన్నదిగా చెప్పుకోవచ్చు.

**అర్థాలంకార గత చమత్కారం :**

అర్థాలంకార ప్రయోగం వల్ల సాధించే చమత్కారం అర్థాలంకార గత చమత్కారం.

"మృగమదము చెంత గుంకుమ రేఖ వోలె
నీలమణి పొంత నుదురి పాస్రేకు వోలె
మేఘము కుఱంగటను దీగ మెఱపు వోలె
నర్జునుని చెంగట సుభద్ర యలరె నపుడు."

అర్జునుని చెంత సుభద్ర మృగమదం చెంత కుంకుమ రేఖలాగా, నీలమణి చెంత బంగారు రేకులాగా, మేఘం చెంత మెరపు తీగలాగా ఉందట. ఇక్కడ ఉపమాలంకారం ఉంది. అర్జునుడు నల్లనివాడు కాబట్టి అతడికి నల్లగా ఉండే కస్తూరిని, నీలమణిని, మేఘాన్ని ఉపమానాలుగా వాడడం, సుభద్ర మేలిమి బంగారు రంగులో ఉంటుంది కాబట్టి ఆమెకు కుంకుమ రేఖ, బంగారు రేకు, మెరపు తీగలను ఉపమానాలుగా వాడడంలో చమత్కారం ఉంది. అలాగే కస్తూరి, కుంకుమ, పూవులు, సుగంధ ద్రవ్యాలు, నీలమణి, బంగారు రేకులు ఆభరణ విశేషాలు. మేఘం, మెరపు తీగ మేఘ సంబంధాలు సజాతీయాలైన వాటినే సామ్యంగా తీసుకోవడంలో వేంకటకవి చమత్కారం కనిపిస్తుంది.

**శబ్దాలంకార చమత్కారం :**

అనుప్రాసాది శబ్దాలంకారాలతో కూడిన చమత్కారం శబ్దాలంకారగత చమత్కారం.

"మంచి మగడు వలయు నంచు గోరుచు నుండ
మంచి మగడు గల్గె మఘవ సుతుడు
మన సుభద్ర సుకృత మహిమ యేమనవచ్చు
మనసు భద్ర మయ్యె మనకు నెల్ల.

ఈ పద్యంలో యమకాలంకారం ఉంది. మంచి మగడు అనే సమాసం మొదటి రెండు పాదాల్లో, మన సుభద్ర అనే అక్షర సముదాయం చివరి రెండు పాదాల్లో ఉంది. మంచి భర్త కావాలి అనుకుంటే మంచి భర్తే లభించాడని (మంచి మగడు = గొప్ప వీరుడు అనే అర్థం కూడా ఉంది) చెలికత్తెలు అనుకోవడంలోను, మన సుభద్ర అదృష్టం చూస్తే మనకు మనసు భద్రమయింది అని చెప్పడంలో చమత్కారం ఉంది. కనుక ఇది శబ్దాలంకార గత చమత్కారం.

**శ్లేష గత చమత్కారం :**

రెండర్థాలు కలిగే విధంగా రచిస్తే అది శ్లేష. అలా రెండర్థాలు అర్థవంతంగా ప్రయోగించడం వల్ల కలిగే చమత్కారం శ్లేషగత చమత్కారం

"అటుల దేరెక్కి దంపతు లరుగ ( జూచి
జనులు రతి మన్మథులు వీరలని తలచిరి
హరి తురంగము లించువిల్లలరు తూపు
లంద యుండగ సందియ మందనేల ?"

రథమెక్కి వెళుతున్న సుభద్రార్జునులను చూచి జనులు వీరు రతి మన్మథులు అనుకున్నారట. హరి తురంగాలు, ఇంచువిల్లు, అలరు తూపులు ఉన్నాయి కాబట్టి వాళ్ళు రతి మన్మథులే సందేహం లేదంటూ కవి శ్లేష ద్వారా చమత్కారం చూపాడు.

| | | | |
|---|---|---|---|
| హరితురంగాలు | = | (అర్జునుడి పరంగా) | కృష్ణుని గుర్రాలు |
| | | (మన్మథుడి పరంగా) | చిలుక గుర్రాలు |
| ఇంచు విల్లు | = | (అర్జునుడి పరంగా) | అందమైన విల్లు |
| | | (మన్మథుడి పరంగా) | చెరకు విల్లు |
| అలరు తూపులు | = | (అర్జునుడి పరంగా) | అందమైన బాణాలు |
| | | (మన్మథుడి పరంగా) | పూలబాణాలు |

ఈ సమాసాల అర్థాలు అటు రతి మన్మథులకు, ఇటు సుభద్రార్జునులకు అన్వయించే విధంగా శ్లేషాలంకారంతో చెప్పడం వల్ల ఇక్కడ శ్లేషగత చమత్కారం ఉంది.

**లోకోక్తి గత చమత్కారం :**

లోకోక్తులు ప్రయోగించి సాధించే చమత్కారాన్ని లోకోక్తి గత చమత్కారం అంటారు.

"శివుఁడిటు రమ్మటంచు దయచేసినచోఁ దలకెక్కి, తుగ్రవై
భవమునఁ జూచుచో నడుగవట్టితి, వేమన వచ్చు నీ గుణం ?
బవునవు ; నందినన్ సిగయు నందక యున్నను గాళ్ళు పట్టుకొం
దువు హరిణాంక, వేలకొలదుల్ గద నీ నడకల్ దలంపగన్ ?''

శివుడు ప్రేమతో పిలిస్తే చంద్రుడు తలకెక్కి అలంకారమయ్యాడు. దక్షయజ్ఞ సమయంలో కోపంగా చూస్తే పాదాలమీద పడ్డాడు. సుభద్ర చెలికత్తెలు "అందితేసిగ, అందకపోతే కాళ్ళు పట్టుకునే స్వభావం నీది'' అని చంద్రుడిని నిందిస్తూ ఉన్న సమయంలో వేంకట కవి సందర్భానికి తగినట్లు లోకోక్తిని ప్రయోగించి అద్భుతమైన చమత్కారాన్ని సాధించాడు. ఈ లోకోక్తి ప్రయోగం వల్ల సందర్భానికి మరింత వన్నె చేకూరింది.

**సామెతగత చమత్కారం :**

సామెతలను ఉపయోగించడం ద్వారా సాధించే చమత్కారాన్ని సామెతగత చమత్కారం అంటారు.

"ఇన్నాళ్ళు సేవ చేయుచు
నున్నది యుంబోయె నేడయో ! కౌగిలి యి
మ్మన్నంత "జదువు బెట్టగ
నున్న మతియు బోయె'' ననుటహో నిజమయ్యెన్ !''

అర్జునుడు కౌగిలి అడిగినంతనే సేవకు వచ్చే సుభద్ర రావడం మాని వేసింది. ఆ సందర్భంలో 'చదవేస్తే ఉన్న మతి పోయింది' అన్నట్లు కౌగిలి అడిగితే కౌగిలి ఇవ్వలేదు సరిగదా అంతకు పూర్వం వచ్చి కనువిందు చేసే సుభద్ర రావడం కూడా మానివేసిందని అర్జునుడు బాధపడ్డాడు. ఈ సందర్భంలో ఈ సామెతను ఉపయోగించడం వల్ల చమత్కారం చేకూరింది గనుక ఇది సామెత గత చమత్కారం.

**వర్ణన గత చమత్కారం :**

వర్ణన కేవలం వర్ణన కోసం కాక కథలో కలిసిపోయే విధంగా సందర్భాను గుణంగా వర్ణిస్తే అది వర్ణన గత చమత్కారం అవుతుంది.

"నంద కుమారానుజ యుఱు
తం దన నందనుడు గట్ట దైవత పతి వే
డ్కం దెచ్చు తాళి బొట్టనఁ
జందురు డరుణ రుచి బ్రాగ్దిశన్ గననయ్యెన్ !''

ఇంద్రుడు తూర్పు దిక్కుకు అధిపతి. అర్జునుడి వివాహానికి బయలు దేరాడు. సుభద్ర మెడలో అర్జునుడు కట్టడానికి తెచ్చే తాళిబొట్టు లాగా చంద్రుడు బంగారు రంగుతో ప్రకాశించాడట. చంద్రోదయం కథలో మిళితనుయ్యే విధంగా వర్ణించబడింది. తూర్పు దిక్కునే చంద్రుడు ఉదయించినట్లు చెప్పడం, తాళిబొట్టు, చంద్రుడు బంగారు రంగులో ఉండడం, రెండూ గుండ్రంగా ఉండడం మొదలయిన విశేషాలతో కూడిన ఈ వర్ణన చమత్కారంతో కూడి ఉండడం చేత ఇది వర్ణన గత చమత్కారం.

**ధ్వని గత చమత్కారం :**

ధ్వని ప్రధానంగా అంటే మరొక అంతరార్థం స్ఫురించే విధంగా చూపే చమత్కారాన్ని ధ్వని చమత్కారం అంటారు.

"క్రాగియున్నది మిగుల నంగంబు సూడ
గలవరించు చున్నది, కలదొ యేమొ
సోకు, డల్ల సన్యాసి కే చూపవలయు
భామ" నని పల్కెనా సత్య భామ నగుచు !"

సత్యభామ చెలికత్తెలతో సుభద్ర మదన తాపాన్ని గురించి చెబుతూ "శరీరం తాకితే కాలుతూ ఉన్నది. పదే పదే పలవరిస్తూ ఉన్నది. దయ్యం సోకిందేమో ! సుభద్రను ఆ సన్యాసికే చూపాలి" అని నవ్వుతూ అంది. మునులు మంత్ర బలం చేత దయ్యాలను పారద్రోలుతారు కనుక అతనికి చూపుదామని సత్యభామ అన్నట్లుగా పైకి అనిపించినా, సుభద్ర స్థితికి కారకుడు అయిన ఆ మునికి చూపితే ఆతని సాహచర్యంలో ఆమె స్థితి చక్కబడుతుందని అంటే ముని రూపంలో ఉన్న అర్జునుడు ఆమెకు మదన తాపం తగ్గించ కలడని ధ్వనిస్తుంది. సత్యభామ నవ్వులో ఆ ధ్వని చెలికత్తెలకు ధ్వనించింది. పాఠకులకు వినిపిస్తుంది. ధ్వని కారణంగా వచ్చిన చమత్కారం కనుక ఇది ధ్వనిగత చమత్కారం.

**హాస్య గత చమత్కారం :**

పరిహాసంతో కూడిన మాటల వలన సాధింపబడే చమత్కారానికి హాస్యగత చమత్కారం అనిపేరు.

"అంగన, యిన్నాళ్ళును ముని
చెంగటికిం బాటి బాటి సేవలు గావిం
పంగా బోదువు, నేడటు
తొంగియు జూడ, వత డేమి దోసము సేసెన్ ?"

అర్జునుడు కౌగిలి అడిగిన తరువాత అతని చెంతకు వెళ్లని సుభద్రను వదినెలు పరిహాసం చేస్తూ "ఇన్నాళ్ళూ ముని దగ్గరకు ఆసక్తితో పరిగెత్తే దానివి. ఇప్పుడటు తొంగి కూడా చూడడం లేదు. ఆ ముని ఏంతప్పు చేశాడు ?" అని అడిగారు. పారి పారి వెళ్ళేదానవు, తొంగియు చూడవు అనడంలో సున్నితమైన హాస్యం ఉంది. వదినె మరదళ్ళ ఈ హాస్యం హాస్య గత చమత్కారానికి ఉదాహరణ.

**రసగత చమత్కారం :**

శృంగారాది రసాలను వర్ణించేటప్పుడు రసోచితమైన భావాలను చమత్కారంగా చెప్పడాన్ని రసగత చమత్కారం అంటారు.

'నెఱి కొప్పు కొనగోర నిమిరిన యంతనే
　　　　తళుకు లేముద్దు చెక్కిలి చెమర్చె,
తళుకు లేముద్దు చెక్కిలి నొక్కినంతనే
　　　　వలి గుబ్బ చనుగవ పులకరించె,

.........................................................

కుసుమ శరకేళి నేమేమి గుఱుతులిడెనొ
బాల యెఱుగదు సౌఖ్యాబ్ధి దేలియపుడు.

సుభద్రార్జునుల సంగమకేళిని వర్ణిస్తూ వేంకటకవి చూపిన చమత్కారం రసిక జన హృదయ రంజకమైన శృంగార రసగత చమత్కారంగా చెప్పవచ్చు.

**సంభాషణా చమత్కారం :**

సందర్భోచితంగా వినేవారికి ఇంపు కలిగే విధంగా సంభాషణను కూర్చడం సంభాషణా చమత్కారమంటారు.

"ఎంచంగా దగు నత్తమామలను దా నిల్వేల్పులంగా మనః
ప్రాంచద్భక్తిని సాధ్వి యందు రది మీ పట్లన్ నిజంబయ్యె నే
డంచుం' జేరి శచీపురందరుల కాహ్లాదంబుగా పల్కి, మ్రొ
క్కించెం దేవకి యప్పుడర్థ హిమరుక్ బింబాలికన్ బాలికన్ !"

సిగ్గుచే అత్తమామలకు నమస్కారం చేయని సుభద్ర తప్పిదాన్ని దాచిపెడ్తూ దేవకి "అత్తమామలను దేవతలుగా పూజించే స్త్రీని సాధ్వి అంటారు. సుభద్రకు దేవతలే అత్త మామలయ్యారు" అని శచికి, ఇంద్రునికి ఆనందం కలిగే విధంగా మాట్లాడిన దేవకి వాక్చాతుర్యం సంభాషణా చమత్కారానికి ఉదాహరణగా చెప్పవచ్చు.

చేమకూర వేంకటకవికి చమత్కారమంటే ఏమిటో తెలుసు. చమత్కారం ఎలా సాధించవచ్చో తెలుసు. చమత్కారమంటే ఎంత రసానందం కలుగుతుందో తెలుసు. అందుచేతనే ప్రతిపద్యంలో చమత్కారం ఉండే విధంగా విజయ విలాసం రచించాడు. చమత్కారం ఒక్కటే కావ్య లక్షణం అయితే విజయ విలాసం ఒక్కటే తెలుగు సాహిత్యంలో కావ్యం అవుతుంది. చేమకూర వేంకటకవి ఒక్కడే కవి అవుతాడు.

2. పాఠ్యభాగం ఆధారంగా చేమకూర వేంకటకవి కవితా రీతులను వివరించండి.

దక్షిణాంధ్ర సాహిత్యంలో అగ్రగణ్యుడైన కవిరాజు చేమకూర వేంకటకవి. యుగధర్మాన్ని బట్టి శృంగారాన్ని అంగిరసంగా స్వీకరించి కవిత్వం వ్రాసినా, యుగలక్షణమైన అశ్లీలాన్ని, అసభ్యాన్ని పరిహరించిన కవి ఆయన. వేంకటకవికి మాటలకున్న విలువ తెలుసు. పదాలను అర్థగౌరవంతో ప్రయోగించడం తెలుసు. మాటల విరుపుతో మనోహరమైన మాధుర్యాన్ని శ్లేషద్వారా అద్భుతమైన చమత్కారాన్ని సాధించడం తెలుసు. తన కొలువులో క్షత్ర ధర్మాన్ని పాటించే వృత్తిని సాగిస్తూ, సరసమైన కవిత్వం చెప్పడం ప్రవృత్తిగా చేసుకుని సాటిలేని మేటి కవిగా గుర్తింపు పొందిన వేంకటకవి కవిత్వాన్ని, కవిత్వ తత్త్వాన్ని గుర్తించి రఘునాధ రాయలు ఇలా అన్నాడు.

"ప్రతిపద్యము నందు జమ
త్కృతి గలుగం జెప్ప నేర్తు వెల్లడ బెళుకా
కృతి వింటి మపారముగా
క్షితిలో నీ మార్గ మెవరికిన్ రాదుసుమీ !"

విజయ విలాసాన్ని హృద్యంగా, సహృదయ నైవేద్యంగా రచించిన వేంకటకవి కవితాగుణాలును గురించి తెలుసుకుందా.

**చమత్కారం :**

ప్రతి పద్యంలో చమత్కారం ఉండే విధంగా కవిత్వం చెప్పడంలో అందె వేసిన చేయి చేమకూర. శబ్దం ద్వారా, అర్థం ద్వారా అలంకారం ద్వారా, శబ్దార్థాల ద్వారా - ఇలా దేని ద్వారానయినా చమత్కారం కలిగించి పాఠకుడు ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని పొందే విధంగా చేసేనేర్పు వేంకటకవిలో పుష్కలంగా ఉంది.

"చిత్తజుడల్గి తూపు మొన చేసిన జేయగనిమ్ము ; పై ధ్వజం
బెత్తిన నెత్త నిమ్ము, వచియించెద గల్గిన మాట గట్టిగా
నత్తరళాయతేక్షణ కటాక్ష విలాస రస ప్రవాహముల్
కుత్తుక బంటి తామరలకున్ దల మున్కలు గండుమీలకున్ !"

ఈ పద్యంలో సుభద్ర కన్నులు పద్మాలకన్నా, గండు చేపల కన్నా అందమైనవని వర్ణించాడు కవి. వానిలో పద్మం మన్మథుడి బాణం. చేప అతని ధ్వజం. మన్మథుడి ఆయుధాలను కూడా సుభద్ర తన కన్నుల అందం చేత కించపరిచింది. అందుకు

కోపించిన అర్జునుడు తన ఆయుధమైన పద్మాన్ని మొనచేశాడు. చేపఅనే ధ్వజమెత్తాడు. పద్మాలు నీటిలో తేలి ఉంటాయి. కనుక కుత్తక బంటి అని, చేపలు నీటిన మునిగి ఉంటాయి గనుక తలమున్కలు అని ప్రయోగించడంలో అత్యద్భుతమైన చమత్కారం దాగి ఉంది.

**శ్లేష :**

శ్లేషను ప్రయోగించడంలో చేమకూర వేంకటకవి ప్రతిభ అనన్య సామాన్యమయింది. అనవసరంగా తన ప్రతిభా పాండిత్యాలను ప్రదర్శించడానికి వేంకటకవి శ్లేషను ఉపయోగించడు. కథకు అవసరమయినప్పుడు సందర్భానికి ఉచితమయినప్పుడు, చమత్కారానికి తగినప్పుడు మాత్రమే శ్లేషాలంకారాన్ని ఉపయోగించి రసరమ్యంగా వర్ణించడంలో వేంకట కవి చాతుర్యం అగణ్యమని చెప్పవచ్చు.

"అటుల దేరెక్కి దంపతులరుగ ( జూచి
జనులు రతి మన్మథులు వీరలని తలచిరి
హరి తురంగము లించువిల్లలరు తూపు
లంద యుండగ సందియ మందనేల !"

ఈ పద్యంలో సుభద్రార్జునులకు రతి మన్మథులకు అభేదం చెప్ప దలచిన కవి శ్లేషను ఆశ్రయించాడు.

| | | |
|---|---|---|
| హరితుంగములు | = | కృష్ణుని గుర్రములు, చిలుక గుర్రములు |
| ఇంచు విల్లు | = | అందమైన విల్లు, చెరకు విల్లు |
| అలరు తూపులు | = | సొగసైన బాణాలు, పూలబాణాలు |

ఇది అభంగ శ్లేష

చమత్కారాన్ని సాధించడానికి చేమకూర వేంకటకవి శ్లేషను వాడినంతగా మరే కవి వాడలేదని చెప్పవచ్చు. అతని చేతిలో శ్లేష ఒదిగిపోయి అందాలు చిందింది. ఆనందాలు పంచింది.

**అష్టాదశ వర్ణనలు - వర్ణనా నైపుణ్యం :**

ప్రబంధ కర్తలు వర్ణించిన అష్టాదశ వర్ణనలకు తీసిపోని విధంగా అత్యద్భుతంగా వర్ణించిన చేమకూర వేంకటకవి. ఈ వర్ణనల ద్వారా తన భావనాశక్తిని, ప్రతిభా పాండిత్యాలను ప్రదర్శించాడు. ఈ కథా భాగంలో విరహ వర్ణన, మన్మథ ఉపాలంభనం, వివాహ వర్ణన, ప్రయాణ వర్ణన, యుద్ధ వర్ణన, కేళీ గృహవర్ణన, సంగమ కేళీ వర్ణన, సూర్యాస్తమయ వర్ణన, చంద్రోదయ వర్ణన ఉన్నాయి. ఈ వర్ణనలన్నీ సహృదయానంద కరంగా వేంకటకవి రచించాడు. చేమకూర వర్ణనలు కథలో మిళితమయ్యేటట్లు ఉంటాయి గాని, కథాగమనానికి ఆటంకం కలిగించే విధంగా ఉండవు.

చంద్రోదయాన్ని వర్ణిస్తూ చేమకూర తూర్పున ఉదయించే చంద్రుడు సుభద్రమెడలో అర్జునుడు కట్టడానికి ఇంద్రుడు తెచ్చే తాళిబొట్టులా ఉందని వర్ణించాడు. ఇంద్రుడు అర్జునుడి వివాహానికి బయలు దేరే సమయంలో చెప్పిన పద్యమిది. ఇంద్రుడు తూర్పు దిక్కుకు అధిపతి. ఆ తూర్పు దిక్కునే చంద్రుడు ఉదయించి తాలిబొట్టులా ప్రకాశించాడట. ఆ వర్ణన పద్యమిది.

"నందకుమారానుజ యకు
తం దన నందనుడు గట్ట దైవతపతి వే
డ్కం దెచ్చు తాళిబొట్టన
జందురు డరుణరుచి బ్రాగ్దిశన్ గననయ్యెన్."

శేషాలంకార యుక్తంగా, చమత్కార యుతంగా, సందర్భోచితంగా రచింపబడే చేమకూర వర్ణనలు ఎంత రసరమ్యాలో చెప్పక్కరలేదు.

**పదప్రయోగ నిపుణత**

చేమకూర వేంకట కవి శబ్దవ్యుత్పత్తి పరిజ్ఞానం ఉన్నవాడు. ఏ పదాన్ని ఏ సందర్భంలో ప్రయోగించాలో అతనికి తెలిసినంత బాగా ఇతరులకు తెలియదు.

అర్థం ఒకటే అయినా తరుణి అనవలసిన చోట వెలది అని ప్రయోగం చేయడు. కిరీటి అనవలసినచోట నరుడు అనడు. అమృతాంశుడు అనదగిన చోట చంద్రుడు అనడు. ఆ విధంగా సాభిప్రాయమైన పదాలను ప్రయోగించడంలో వేంకటకవి చూపే శ్రద్ధ సామాన్యమయింది కాదు.

"ఎవ్వని జూచి మేలు పడితే యర వింద దళాక్షి ? నీమనం
బెవ్వడు సొచ్చె ( జెప్పగదవే మదకోకిల వాణి ? నిన్న నే
డెవ్వని చెల్వు నీ యెదుట నెన్నబడెన్ వినతాంగి ? నేన కా
కెవ్వరు నీకు బ్రాణపద ? మేటికి దాచెదవే తలోదరీ ?"

ఈ పద్యంలో చూడడానికి ఉచితంగా అరవింద దళాక్షి అని, చెప్పడానికి ఉచితంగా మదకోకిల వాణి అని, దాచడానికి ఉచితంగా తలోదరీ అని సంబోధనలు ప్రయోగించడంలో వేంకటకవి ఉచితజ్ఞతను మెచ్చి తీరవలసిందే. అలాగే

"మా కలకంఠియు నీవును
నేక గ్రీవముగ నుందు రిన్నాళ్ళు ; నయో !
కోకిల యిపుడే లలచెదు
నీకగునే యిగురు బోడి నెత్తురుద్రావన్ ?"

కోకిల నిందించే చెలికత్తెలు సుభద్ర, కోకిల ఏకగ్రీవంగా ఉన్నారనే సందర్భంలో కలకంఠి ప్రయోగం ఎంత సాభిప్రాయమో చెప్పనవసరంలేదు.

**తెనుగు దనం :**

చేమకూర వేంకటకవికి తెలుగుదనాన్ని ప్రదర్శించే లోకోక్తులు, జాతీయాలు, సామెతలు ప్రయోగించే నేర్పు అపారంగా ఉంది. సందర్భానికి తగిన సామెతలను గ్రహించి సన్నివేశానికి అందం చేకూర్చడంలో అతనిది అందె వేసిన చేయి.

అర్జునుడు కౌగిలి అడిగినంతనే సుభద్ర అంతఃపురానికి వెళ్ళిపోయింది. సేవకు రావడం మానివేసింది. 'చదవేస్తే ఉన్నమతి పోయింది' అనే సామెతను ఉపయోగించి వేంకటకవి సందర్భానికి వన్నె కలిగించాడు.

"ఇన్నాళ్ళు సేవ చేయుచు
నున్నదియుం బోయె నేడయో కౌగిలి యి
మ్మన్నంత ( 'జదువ బెట్టగ
నున్నమతియు బోయె' నను టహో నిజమయ్యెన్ !"

తాను కౌగిలి అడగడం వల్ల కౌగిలి లభించలేదు సరికదా దానితో పాటు సభద్ర దర్శనం కూడా కరువయ్యింది అని అర్జునుడు బాధపడడంలో ఈ సామెత అర్థాన్ని సుబోధకం చేసింది.

"అంగన యిన్నాళ్ళును ముని
చెంగటికిం బాటి పాటి సేవలు గావిం
పంగా బోదువు నేడటు
తొంగియు జూడ వతడేమి దోసము చేసెన్ !"

ఇందులో 'పారి పారి', తొంగియు జూడవు అనే తెనుగు పలుకుబడులు అర్థానికి మరింత అందం కలిగించాయి.

మా చెలి గెరలించితేని మాటలు వచ్చున్,

మాటలోపల వచ్చె అమ్మాధవుండు,

ఒడలెల్ల కన్నులుగ జూచిరి -

మొదలయిన జాతీయాలను వేంకటకవి సందర్భోచితంగా ప్రయోగించారు.

**అలంకారాలు :**

శ్రుతిహితంగా ఉండే శబ్దాలంకారాలను, బుద్ధి హితంగా ఉండే అర్థాలంకారాలను దాదాపు ప్రతి పద్యంలో చెప్పిన అలంకార ప్రియుడు చేమకూర వేంకటకవి. శబ్దాలంకారాలలో యమకం, ముక్తపదగ్రస్తం, అనుప్రాసలు విజయవిలాసంలో ఎక్కడ చూచినా కనిపిస్తాయి.

"మారు తమ్ముల వాడికి మలయకూట
మారు తమ్ముల వేడికి మట్టుమీరి"

అలాగే

"చలమనోహర లోచనాంచలమ చెలమ"
"అర్థహిమరుక్ బింబాలికన్ బాలికన్"

మొదలైనచోట్ల శబ్దాలంకారాల సొగసు వర్ణనాతీతం.

శబ్దాలంకారాల మాదిరిగానే అర్థాలంకారాలు కూడా వేంకటకవి జిహ్వాగ్రం మీద నాట్యం చేస్తాయి. ఉపమానాలను స్వీకరించేటప్పుడు, అర్థాంతరన్యాసాలను చెప్పేటప్పుడు, ఉత్ప్రేక్షలను భావించేటప్పుడు వేంకటకవి ప్రతిభ గోచరిస్తుంది.

"మృగ మదము చెంత గుంకుమరేఖ వోలె
నీలమణి పొంత నుదిరి పొన్నేకు వోలె
మేఘము కురంగటను దీగ మెఱపు వోలె
నర్జునుని చంగట సుభద్ర యలరె నిపుడు" - ఉపమాలంకారం

"కలయ బన్నీరు చిలికి శ్రీ గంధమలది
విరులు పైదార్ప నపుడొప్పె దరుణి మేటి
మగని నరుగెల్వ వలరాచమావటీడు
పూజసేసిన యగ్గజరాజమనగ" - ఉత్ప్రేక్ష.

**రసోచిత బంధం**

రసాను గుణమైన శైలికి చేమకూర కవిత్వం ఉదాహరణంగా చెప్పుకోవచ్చు. శృంగార రసాన్ని వర్ణించేటప్పుడు చిన్న చిన్న పదాలతో పద్యాలు అల్లిన చేమకూర వేంకటకవి యాదవుల యుద్ధ కోలాహలాన్ని వర్ణించేటప్పుడు వృత్తాన్ని మార్చి పద్యపునడకలోనే ఆ కోలాహలాన్ని స్ఫురింపజేశాడు.

**శృంగారం :**

"తేరు తానెట్లు గడపెనో తెలియరాదు
తేరు గడలించినట్లు దోతేర వలసె
గన్నె యిందాక నే మెఱుంగదు సుమయ్య
తేరుగడ కాగ మెల్లన దిద్దుకొనుము"

**యాదవుల కోలాహలం :**

"హుటాహుటిన్ హలాయుధుండహో మహోగ్రుడై తనం
తటన్ దటాన నిప్పుడీ విధం బెఱింగి వచ్చెనో
ఘటాఘటీల నెల్ల ద్రోవ గట్టి పట్ట ( బంచెనో
యటో యిటో యెటో భటోద్భటార్భటుల్ ఘటిల్లెడున్,"

**పాత్ర చిత్రణ :**

ఈ పాఠ్య భాగంలో పాత్ర చిత్రణకు అవకాశం తక్కువ. సుభద్రార్జునుల విరహం, పెండ్లి, యుద్ధం, సంగమకేళి మొదలైన అంశాలతో కూడిన కథ కనుక పాత్ర చిత్రణకు అవకాశం లేకపోయినా, ఉన్న పాత్రలను చిత్రించడంలో వేంకటకవి అసామాన్యమయిన నేర్పు చూపాడు. అర్జునుడిని మహావీరుడుగా, సుభద్రను ముగ్ధగా, శ్రీ కృష్ణుడిని చతురోపాయాలు నేర్చిన లౌకికునిగా చిత్రించాడు. దేవకిని ఉచితానుచితాలు తెలిసిన దానిగా ధర్మజుని ఉత్తమ గృహస్థుగా చిత్రీకరించాడు. సోదరి అపహరణ విషయం తెలిసిన బలరాముని ఆవేశాన్ని అందంగా చిత్రీకరించాడు. వేంకటకవి చిత్రించిన పాత్రలన్నీ చెలికత్తెల పాత్రలయినా సజీవ సుందరంగా కనిపిస్తాయి.

**ఔచిత్య పోషణ :**

చేమకూర వేంకటకవికి ఉచితానుచిత జ్ఞానం ఎక్కువ. వర్ణనల్లో గాని, సంభాషణల్లోగాని ఆవేశంలో ఔచిత్యాన్ని మరచిపోడు. తిలోత్తమ కన్నా సుభద్ర అందగత్తె అని అప్సరసలు అనుకున్నారు. ప్రక్కనే తిలోత్తమ కూడా ఉంది. ఆమె వింటే బాధపడుతుంది. అందుచేత ఆమెకు వినిపించకుండా గుసగుసలు పోయారని చెప్పడం వేంకటకవి ఔచిత్యానికి మచ్చుతునక.

"మెత్తుము గదె మనమెపుడు ( ది
లోత్తను చక్కదన మీ తలోదరి యెదుటన్
మెత్తవడె దాని చెలు వని
యత్తఱి గుసగుసల బోయి రచ్చర లెల్లన్"

అలాగే సిగ్గుతో అత్తమామలకు నమస్కారం చేయని సుభద్ర తప్పిదాన్ని శచీదేవి, ఇంద్రుడు గుర్తించకుండా దేవకిదేవి చేత మాట్లాడించడం, నమస్కరింప జేయడం వేంకటకవి ఔచిత్యానికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

**నాటకీయత - సంభాషణా చాతుర్యం :**

రచించిన కావ్యం శ్రవ్యకావ్యమయినా దృశ్యకావ్య లక్షణాలను అక్కడక్కడ చూపించిన చతురుడు వేంకటకవి. చెలికత్తెలు సుభద్రతో మాట్లాడినపుడు, వదినెలు సుభద్రతో మేళమాడినపుడు ఇంద్రకృష్ణుల సంభాషణలోను, ధర్మారాజ బలరాముల సంభాషణలోను నాటకీయత గోచరిస్తుంది. యాదవ వీరులు అడ్డగించినప్పుడు అర్జునుడు పలికిన మాటలు గమనిస్తే సంభాషణలను వ్రాయడంలో వేంకటకవి ప్రతిభ గోచరిస్తుంది.

"నన్నెవ్వనిగా జూచితి
కన్నియ ? నీ చేయునంత కార్యంబిటనే
మున్నది ? చూడుము చెండెద
ఛిన్నాభిన్నములు గాగ సేనల - నైనన్,
నీ వేడు కేల గాదనవలె ?
నటువలెనే తేరు గడుపుము"

అలాగే పాత్రల ఆంగికాభినయాన్ని వేంకటకవి సూచన చేస్తాడు.

"ముసిముసి నవ్వు లొలయ
ఒక తీరు గాగ నుండె,
భయభక్తుల మ్రొక్క వచ్చు ;

**లోకానుభవం :**

చేమకూర వేంకటకవి రఘునాథ రాయల ఆస్థానంలో ఉద్యోగం చేసినవాడు కావడం చేత అతనికి లోకానుభవం ఎక్కువ. తనకు పరిచయమయిన అంశాలను సందర్భానికి అనుగుణంగా ఉపయోగించుకునే వేంకటకవి తన చదరంగ ప్రావీణ్యాన్ని ఇలా వినియోగించుకున్నాడు.

"అమృతమొలకు నధరంబున
గుముద చకోరముల నేలుకొను శుభదృష్టిన్
గమలముల కళలు గైకొను
రమణీమణి ముఖము దెఱచి రాజనవలెనే ?"

చదరంగంలో తన రాజుకు అడ్డుగా ఉండే ఎదుటి బలగాన్ని తొలగించి రాజుకు 'షా' చెప్పడాన్ని తెరచిరాజు అంటారు. దానిని సుభద్ర వర్ణన సందర్భంలో వేంకటకవి చెప్పడం రమ్యంగా ఉంది. రఘునాథుల కొలువులో ఉన్న వేంకటకవి తన క్రీడా నైపుణ్యాన్ని ఇలా వ్యక్తం చేశాడు అనుకోవచ్చు.

**పద్య రచనా సౌందర్యం :**

పద్యరచనలో చేమకూర వేంకటకవి శైలి విలక్షణంగా ఉంటుంది. ఏ పద్యమయినా' గద్యమయినా సరికొత్త కాంతులతో హృదయంగమంగా సాగిపోతుంది. పద్యనిర్మాణంలో వేంకటకవి చాతుర్యం సామన్యమయింది కాదు. సీసపద్య నిర్మాణంలో శ్రీ నాథుని, కంద పద్మ నిర్మాణంలో తిక్కనను, ఆటవెలదిని వ్రాయడంలో వేమనను మించి పోయాడా అనిపిస్తుంది.

"నెఱికొప్పు కొన గోర నిమిరిన యంతనే
తళుకు లేముద్దు జెక్కిలి చెమర్చె
తళుకు లేముద్దు జెక్కిలి నొక్కినంతనె
వలిగుబ్బ చనుగవ పులకరించె" - సీసం

"రా చిలుకా, కోమలి దెస
జూచితె ? శ్రుతి కటువు లనెడు, శుక నామము నీ
కేచాడ్పున దగు ; వలదిక
మా చెలి గెరలించి తేని మాటలు వచ్చున్" - కందం

"మంచి మగడు వలయు నంచు గోరుచు నుండ
మంచి మగడు గల్గె మఘవ సుతుడు
మన సుభద్ర సుకృత మహిమ యేమనవచ్చు
మనసు భద్రమయ్యె మనకు నెల్ల !" - ఆటవెలది

" మున్ను సుభద్ర ముహూర్తంబున సుభద్రా భద్ర భద్రేభయాన
జతురంత యానంబున శుద్ధాంతంబున కనిపి" - వచనం

చేమకూర వేంకట కవిది కళాదృష్టి. కావ్యం ప్రసన్న గంభీరంగా ఉండాలని, "విరిపొట్లము విప్పిన గతి" వాసించాలిలని, ప్రతి పద్యంలో చమత్కృతి ఉండడం మంచిదని ఆయన సిద్ధాంతం. రస గుంఫిత పదాలు, ప్రసన్నతా గుణం, శ్లేషాది చమత్కారాలు, సరసమైన హాస్యం, ముచ్చటయిన తెనుగు నుడికారం కావ్యమంతా మిరుమిట్లు గొలుపుతూ ఉంటాయి. చేమకూర వేంకటకవికి పదాలమర్మం తెలుసు. వాటిని ఎలా ఉపయోగించుకోవాలో తెలుసు. అతడు సాటిలేనికవి. ఆయన మాటల్లోనే

"స్వకపోల కల్పిత మనో
జ్ఞ కళాగతి కెట్టు లౌను సరి ?"

అన్నట్లు అతని కావ్యానికి సరిపోయిన కావ్యం కాని, అతని కవిత్వంతో తులతూగే కవిత్వం గాని కనిపించదంటే సందేహం లేదు.

3. పాఠ్య భాగం ఆధారంగా సుభద్రార్జునుల విరహతాపాన్ని వివరించండి.

సమాధానం : పాఠం 12 : 1.12.4 పాఠ్యభాగ వివరణ :

4. పాఠ్య భాగం ఆధారంగా సభద్రార్జునుల వివాహపు వేడుకలను చిత్రించండి.

సమాధానం : పాఠం 12 : 1.12.4 పాఠ్య భాగ వివరణ :

## 1.14.1. పరీక్షలలో రాదగిన ప్రశ్నలు

1. సుభద్రార్జునుల సంగమ కేళిని వర్ణించండి.
2. సుభద్రా పరిణయ వృత్తాంతాన్ని తెల్పండి.
3. అర్జునుడు యాదవులను జయించి సుభద్రతో హస్తిన చేరిన విధం వివరించండి.

## 1.14.2. ఆచూకీ గ్రంథాలు

| | | |
|---|---|---|
| 1. విజయ విలాసము | - | హృదయోల్లాస వ్యాఖ్య |
| | | చేమకూర వేంకట కవి కృతికి తాపీ ధర్మారావు వ్యాఖ్య |
| 2. కావ్యలహరి | - | యువభారతి ప్రచురణ - ఆచార్య దివాకర్ల వేంకటావధాని ఉపన్యాసాలు |
| 3. తెలుసు సాహిత్య సమీక్ష | - | రెండవ సంపుటి - ఆచార్య జి. నాగయ్య |
| 4. సమగ్రాంధ్ర సాహిత్యం | - | ఆరుద్ర |
| 5. సాహిత్య సమాలోచన | - | ఆచార్య ఎస్. గంగప్ప |
| 6. సాహిత్య సుధ | - | ఆచార్య ఎస్. గంగప్ప |

**డా॥ ఎన్. ఆదినారాయణ**
రీడర్ & ప్రిన్సిపాల్
బి.ఎస్.ఎస్.బి. డిగ్రీ కళాశాల
తాడికొండ, గుంటూరు జిల్లా

## రెండోభాగం - నాటకం

# కన్యాశుల్కం నాటకం - గురజాడ అప్పారావు

## పాఠం - 15

**2.15.0 : నాటక పరిచయం**

**2.15.1 : నాటక కథా వివరణ**

### 2.15.0 నాటక పరిచయం :

విభిన్నరుచులు కలిగిన జనావళికి ఏకత్రసమారాధన చేసేది నాటకం అంటాడు కాళిదాసు. జాతిని జాగృతం చేసేదీ జాతిజీవనాన్ని ప్రతిబింబించేదీ నాటకం అంటాడు ఆధునికుడు. కదిలేదీ కదిలించేదీ.... మునుముందుకు నడిపించేది పరిపూర్ణపు బ్రతుకుకు దారులు వేసేదీ నాటకం. సాహిత్యాన్ని శ్రవ్యమూ - దృశ్యమూ అని రెండురకాలుగా విభజించారు. వినడానికి మాత్రమే యోగ్యమైనది శ్రవ్యం. వినుటకేకాక చూచుటకు కూడా యోగ్యమైనది నాటకం. అందుకే సాహిత్యంలో నాటకానికి పెద్దపీటవేశారు. 'కావ్యేషు నాటకం రమ్యం' అని 'నాటకాంతం హి సాహిత్యం' అని నిర్వచించారు. దృశ్యకావ్యాలు పదిరకాలు. అవి నాటకం, ప్రకరణం, డిమం, ఈహామృగం, సమవాకారం, వీథి, భాణం, అంకం, వ్యాయోగం, ప్రహసనం. అనేవి ప్రదర్శన తీరు, ప్రయోజనం అనే విస్తృతిని బట్టి దశరూపకాలలో నాటకానికి పెద్దపీటవేశారు. అక్షర రూపం దాల్చిన ఒకేఒక సిరాచుక్క లక్షమెదళ్లకు కదలిక. అక్షరానికే మాటొస్తే..., దానికి హావభావాలు జతకలిస్తే అదొక గొప్ప కళారూపమౌతుంది. ఈ కళారూపపరంపరలో నాటకం పదునైనది, పరమోత్కృష్టమైనది.

జడత్వం నుంచి జాగృతి వైపుకు.. అంధకారం నుంచి వెలుగువైపుకు నడిపించేదీ నాటకం. కందుకూరితో ప్రారంభమైన తెలుగు నాటకం వర్తమానం వరకూ ప్రజాచైతన్యానికి ఒక దీపికగా విజ్ఞాన వినోద ప్రదాయిగా నిలిచింది. తెలుగునాటక ప్రపంచంలో గురజాడ కన్యాశుల్కం ఒక పెద్దకుదుపుగా నిలిచింది. కన్యాశుల్కం పేరుతో ప్రజల మూలిగలను తుదికంటా పీల్చివేస్తున్న దురాచారాన్ని తనకలాన్ని కత్తిగా చేసుకొని చీల్చిచెండాడిన యుగపురుషుడు గురజాడ. జీవితానికి దర్పణం నాటకమైతే కన్యాశుల్కం నాటకంలో ఒక కాలంనాటి అవ్యవస్థను ... దురవస్థను కళ్లకు కట్టినట్లు చూపి ప్రజలలో ఒక మార్పుకు, ఒక స్పందనకు, ఒక చైతన్యానికి దారులు వేసిన వైతాళికుడు గురజాడ. గురజాడ కన్యాశుల్కం నాటకం సమస్య నిర్మూలనకు ఒక ప్రధాన హేతువుగానే కాకుండా సమగ్రమైన తెలుగునాటకానికి నిలువెత్తు అద్దంగా నిలిచింది. నాటికీ నేటికి ఏనాటికీ ఉత్తమమైన తెలుగునాటకానికి అసలుసిసలైన నిర్వచనంగా ఎదిగింది. తెలుగుజాతి అదృష్టవశాత్తూ పుట్టి కలంపట్టిన ఆ మహనీయుని ఆశయం ఎంతో ఉన్నతమైనది.

20వశతాబ్దం తెలుగుసాహిత్య వికాసానికి అడుగుజాడ గురజాడ. సమాజాన్ని పట్టిపల్లారుస్తున్న ఎన్నో రుగ్మతలను తన కవిత్వాన్ని సాధనంగా ఆయుధంగా చీల్చిచెండాడిన కళారవి పవి గురజాడ. తెలుగు వెలుగులుగా నూతనభావాలూ; క్రొత్తఛందస్సూ; నవ్యకవిత్వం, నవీననాటకం జాతికి అందించి జాతికి మహోపకారం చేసిన మార్గదర్శక మహర్షి గురజాడ. సాంఘిక దురాచారానికి గొడ్డలిపెట్టులా వ్యావహారిక భాషలో వెలువడిన తొలితెలుగు స్వతంత్రనాటకమైన కన్యాశుల్క సృష్టికర్తగా సామాజిక స్పృహగల నవయుగ వైతాళికునిగా గురజాడ స్థానం తెలుగుభాష, తెలుగుజాతి ఉన్నంతకాలం సుస్థిరం, అజరామరం. ప్రభుత్వశాసనాలూ... చట్టాల ద్వారా సాధించలేనిది., నాటక రచన ద్వారా కన్యాశుల్క దురాచారాన్ని కూకటివేళ్లతో కూల్చి వేయగలిగింది గురజాడ కలంబలం. కన్యాశుల్కం అంటే ఆధునిక భాషా సాహిత్యాల అపూర్వసృష్టి. ఆధునిక యుగానికి ఆది కావ్యం. సాహిత్య సామాజికాల ప్రయోగశాల. సజీవపాత్రల సమగ్ర చిత్రణం. ఇటువంటి రచన చేసిన తెలుగు వారి నిలువెత్తు సంతకమైన గురజాడ జీవనరేఖలను తెలుసుకోవలసి వుంది.

కృష్ణాజిల్లా గురజాడ గ్రామం నుంచి గురజాడ తాతముత్తాతలు విశాఖమండలానికి తరలివెళ్లారు. గురజాడ తండ్రి వెంకట రామదాసు. తల్లి కౌసల్యమ్మ. తండ్రి రామదాసు సంస్కృతపండితులు. ఆయన విజయనగర ఆస్థానంలో పేష్కారుగా, రెవెన్యూ సూపర్‌వైజర్‌గా, ఖిల్లేదార్‌గా ఉద్యోగం చేశారు. విజయనగరం సమీపంలోని ఊటగెడ్డ అనే ఏరును బండిలో దాటుతూ వుండగా హఠాత్తుగా ఏరుపొంగడంతో నీటమునిగి చనిపోయారు. 1862 సెప్టెంబర్ 21న విశాఖజిల్లా ఎలమంచలి తాలూకా రాయవరం గ్రామంలో గురజాడ మాతామహుల ఇంట జన్మించారు. తండ్రి చీపురుపల్లిలో ఉద్యోగం చేస్తున్నప్పుడు పదేళ్లవయస్సు వరకూ అక్కడే గురజాడ చదువు సంధ్యలు జరిగాయి. విజయనగరంలో బి.ఏ చదివారు. కలసి చదువుకొన్న గిడుగు రామ్మూర్తిపంతులు గురజాడకు ప్రాణమిత్రులు. పాఠశాల చదువులోనే గురజాడ సంస్కృతంలో శ్లోకాలను వ్రాసేవారు. పేదరికం ప్రతిభకు ప్రతిబంధకం కావటంతో గురజాడ అసాధారణ తెలివితేటలను గుర్తించిన విజయనగరం మహారాజా కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరశాస్త్రి తన ఇంట్లో ఆశ్రయమిచ్చారు. 1882 - 84 కాలంలో యఫ్.ఏ.పూర్తి చేశారు. 1883 లో సారంగధర అనే ఇంగ్లీషుకావ్యాన్ని రచించారు.

తమ్ముడు శ్యామలరావుతో కలసి విజయనగరంలోని ఇండియన్ లీడర్ అవర్, తెలుగుహార్ప్ అనే పత్రికల్లో పద్యాలు వ్రాసేవారు. ఇండియన్‌లీడర్ అవర్‌లో ప్రచురించబడిన సారంగధరను మెచ్చుకొన్న ఆనాటి కలకత్తాలోని బెంగాలీపత్రిక రీస్ అండ్ రయ్యత్ ఇంగ్లీషు పత్రికాధిపతి శంభూచంద్ర ముఖర్జీ దానిని తన పత్రికలో ప్రచురించారు. 1884లో విజయనగరం మహారాజా కాలేజి హైస్కూలులో నెలకు 25 రూపాయల జీతంపై ఉపాధ్యాయునిగా చేరారు. 1885లో అప్పలనరసమ్మను వివిహమాడారు. 1886లో ఉపాధ్యాయవృత్తికి సెలవుపెట్టి డిప్యూటీ కలెక్టర్ ఆఫీసులో హెడ్‌క్లర్క్‌గా చేరారు. 1887లో విజయనగరం మహారాజు ఆనందగజపతితో పరిచయం గురజాడ జీవితాన్ని సరికొత్త మలుపు తిప్పింది. ఆనందగజపతి ఆస్థానంలోని డిబేటింగ్ క్లబ్ ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు. 1891లో మూడవ లెక్చరర్‌గా నియమితులై యఫ్.ఏ.,బి.ఏ. విద్యార్థులకు ఇంగ్లీషు వ్యాకరణం, సంస్కృతం, తర్జుమా, గ్రీక్, రోమన్ చరిత్రలను బోధించారు. 1892 కన్యాశుల్కం మొదటి రచనను ఆగష్ట్ 13న విజయనగరం ఆస్థానంలో ప్రదర్శించారు. 1895లో విజయనగర సంస్థాన శాసన పరిశోధన పదవిని చేపట్టారు.

1897లో మొదటి కన్యాశుల్కంను ముద్రించి ఆనందగజపతికి అంకితమిచ్చారు. ఈ పీఠికలో గ్రాంథిక భాషలోని అసౌకర్యాలనూ, ఇబ్బందులనూ వివరంగా చెప్పి వాడుకభాషను కావ్యభాషగా పెంపొందించడం వల్ల కలిగే ప్రయోజనాలను స్పష్టంగా నొక్కివివరించారు. ఇది సాహిత్య భాషగా వాడుక భాషస్థాపనకు., ఆధునిక భాషావ్యాప్తికి అంకురార్పణగా నిలిచింది. 1906లో పాఠశాలల్లో సులభ తెలుగుబోధనా భాష కోసం తూర్పుజిల్లాల విద్యాధికారి జె.ఎ.ఏట్స్, విశాఖపట్నం మిసెస్ ఏవియన్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస అయ్యంగార్, పర్లాకిమిడి కళాశాల లెక్చరర్ గిడుగురామ్మూర్తి కలిసి వాడుక భాషా మహోద్యమానికి నడుంకట్టారు. 1906లో కొండుభట్టీయం నాటకం రచించారు. 1907లో నీలగిరి పాటలను రచించారు. 1909లో కన్యాశుల్కం రెండవకూర్పును ప్రచురించారు.1910లో బరంపురంలో సకలకులాల వారితో సహపంక్తి భోజనం చేశారు. 1910లో ముత్యాలసరాలు, 1911లో లవణరాజుకలను రచించి ప్రచురించారు. 1911లో మద్రాసు విశ్వవిద్యాలయం బోర్డ్‌ఆఫ్ స్టడీస్ సభ్యులుగా నియమితులయ్యారు. అదే సంవత్సరం వాడుక భాషోద్యమంలో భాగంగా ఆంధ్ర సాహిత్యపరిషత్తును స్థాపించారు. 1912లో కన్యకను రచించి ప్రచురించారు.1913లో మద్రాసు విశ్వవిద్యాలయంలో ఫెల్లో పదవిని చేపట్టి విశ్వవిద్యాలయాలు-సంస్కృత మాతృభాషలు అనే నివేదికను సమర్పించారు. 1914లో మద్రాసు విశ్వవిద్యాలయాల పాఠ్యాంశాల్లో వాడుకభాషను చేర్చడానికి విరుద్ధంగా చేసిన నిర్ణయానికి అసమ్మతిగా అసమ్మతి పత్రాన్ని (డిసెంట్) సమర్పించారు. 1915లో అనారోగ్యంతో విజయనగరంలో మరణించటంతో తెలుగు సాహిత్య వినీలాకాశంలో వేగుచుక్క రాలిపోయింది.

**నేపథ్యం:**

## గురజాడకు ముందు తెలుగు నాటకం:

19వ శతాబ్దం వరకూ తెలుగులో సంస్కృత రూపకాల వంటివి లేవనడం చారిత్రక సత్యం. కానీ తెలుగునేలపై యక్షగానాలవంటి ప్రక్రియలు దృశ్యరూపకాలుగా పండిత పామర ప్రజానీకానికి విజ్ఞాన వినోద దాయకాలై విలసిల్లాయి. తెలుగులో నాటక రచన ఆరంభవికాసాలు

పాశ్చాత్య నాటక రంగ ప్రభావాన జరిగాయనడం నిర్వివాదాంశం. రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యము భారతదేశంలో విస్తరించి వేళ్లూను కొన్న తర్వాత సుస్థిరతకోసమై ఆంగ్లభాషను ప్రవేశపెట్టారు. భారతీయులు ఉద్యోగాలను పొందే నిమిత్తం, ఆంగ్లభాషను మాట్లాడుట ద్వారా సంఘములో పరువు ప్రతిష్ఠలు పెంచుకొను నిమిత్తం ఆంగ్లభాషను నేర్చుకోడానికి ఉత్సాహం ప్రదర్శించారు. కాలక్రమంలో భారతదేశంలో కూడా ఆంగ్లభాష రాజభాషగా పాతుకుపోయింది. ఆంగ్లభాషను అభ్యసించుటవలన ఆంగ్లభాషలోని అనేక నాటకములను చూడడం మూలంగా ఇటువంటి రసవత్తరములైన నాటకాలను తెలుగులో కూడా రచించాలనే బలీయమైన కోరిక మనవారికి కలిగింది. ఆంగ్లేయులపాలన ఆరంభదశలో వ్యాపారార్థమై ఈస్టిండియా కంపెనీ భారతదేశంలో నెలకొల్పబడింది. ఆ తరుణంలో ఆంగ్లేయులు, ఆంగ్లవర్తకులు పాశ్చాత్యనాటకాలను భారతదేశంలో విస్తృతంగా ప్రదర్శించారు. భారతదేశంలోని ముఖ్యనగరాలైన కలకత్తా, బొంబాయి, మద్రాసు వంటి చోట్ల ఆంగ్లనాటకాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలకు భారతీయులలో ఆంగ్లవిద్యావంతులను, సంపన్నులు, జమీందారులు, రాజులను ఆహ్వానించేవారు. అద్భుతమూ, మనోహరమైన ఆంగ్లనాటక ప్రదర్శనలను చూసి ఆశ్చర్యచకితులై భారతీయ నాటకరంగాన్ని పునరుద్ధరించుకొనే కోరిక నానాటికీ బలీయమై పోయింది.

ఈ స్ఫూర్తితో పందొమ్మిదో శతాబ్దిలో భారతీయులు ముఖ్యనగరాలలో సంస్కృత రూపకాలను, వాటి అనువాదాలూ.అనుసరణలను ప్రదర్శించడం ప్రారంభించారు. భారతదేశంలో ఆంగ్లభాషాచార్యులుగా పనిచేస్తున్న నాటకాభిమానులు కళాశాలలో పాఠ్యగ్రంథాలుగా నిర్ణయింపబడిన నాటకాలతోపాటు షేక్స్పియర్ వంటి ప్రముఖుల నాటకాలను విద్యార్థులచేత ప్రదర్శింపచేశారు. ఈ పరంపరలో కలకత్తా, బొంబాయి, పూనా వంటి నగరాలలో విద్యార్థులు అనేక ఆంగ్లనాటకాలను ప్రదర్శించారు. సమాజంలోని ప్రముఖుల నాటక ప్రదర్శనల్లో పాల్గొనడం మూలంగా అప్పటి వరకూ నటునిపై ఉన్న న్యూనతాభావం క్రమంగా అంతరించి పోసాగింది. అంతకు పూర్వం నటుడన్నచో సమాజంలో నీచమైన భావం ప్రతివారిలో పొంగి పొర్లేది. ఎంత ప్రతిభాపాటవాలు కలవాడైనప్పటికీ అతడు పంక్తి బాహ్యుడు. కనుకనే తక్కువ కులాలకు చెందిన వారు మాత్రమే వీధి నాటకాలు,వీధి భాగవతాలు, తోలుబొమ్మలాటలలో పాల్గొనేవారు. ఆంగ్లనాటకాల మూలంగా నటుడంటే ఎంతో ఉన్నతుడనే అభిప్రాయం ప్రతివారితో కలిగింది. దీనితో విద్యార్థులతో పాటు నాటకాభిలాష ఉన్న ఎందరో నటన పట్ల ఆసక్తి, అనురక్తిని పెంచుకొన్నారు. ఆంగ్లనాటకంతో ప్రభావితమైన పార్శీ నాటక రంగం ప్రదర్శనలను అత్యంత వ్యయప్రయాసలతో ఇచ్చేవారు. రంగస్థలంపై వెనుకతెర (BACK DROP) వింత వింత రంగులతో చిత్రించబడేది. రాక్షసులు, ప్రతినాయక పాత్రలు రణగొణధ్వనులతో పెడబొబ్బలు పెట్టేవారు. భూతాలు గాలిలోఎగురుతూ విన్యాసాలు చేసేవి. కథానాయకులు, కోటగోడలపైనుండి దూకేవారు. కత్తులు తళతళలతో మెరుపులు మెరిసేవి. 1842లో సాంగ్లీ ప్రభువు అప్పా సాహెబ్, విష్ణుదాస్ భావేను నాటకాన్ని రచించాలని ఆదేశించారు. భావే సీతాస్వయంవరమనే నాటకాన్ని రచించి 1843లో ప్రదర్శించెను. ఇదే మరాఠీ నాటక రంగ ప్రదర్శనలకు శుభారంభమైంది. దీనితో పాటు పార్శీరంగ ప్రభావంతో ఉర్దూ, గుజరాతీ భాషల్లో ఎన్నోనాటకాలు వెలువడ్డాయి. ఈ పార్శీ, మహారాష్ట్ర నాటక సమాజాలు భారతదేశంలోని అన్ని ప్రాంతాలకు వెళ్ళి ప్రదర్శనలు ఇవ్వడం మొదలు పెట్టారు. ఈ స్థితిలో ఆంధ్రనాటకరంగంపై పార్శీ, మరాఠీ నాటకాల ప్రభావం బలీయంగా పడింది.

తెలుగుదేశంలోని కోరాడ రామచంద్రశాస్త్రి, కొక్కొండ వేంకటరత్నం పంతులు, పరవస్తు వేంకట రంగాచార్యులు, వావిలాల వాసుదేవశాస్త్రి వంటి పండితులు తెలుగులో నాటకరచనకు ఉద్యమించారు. 1860లో కోరాడ రామచంద్రశాస్త్రి మంజరీ మధుకరీయము అనే నాటకాన్ని రచించారు. సంస్కృతనాటక లక్షణాలకు లోబడి తెలుగులో వచ్చిన తొలి స్వతంత్ర నాటకం ఇది. సంస్కృత నాటకాలలో ఉత్తమ, మధ్యమ పాత్రలకు సంస్కృతాన్ని, స్త్రీ, నీచ పాత్రలకు తద్భవ దేశ్య బహుళమైన భాషనూ వినియోగించారు. ఆంధ్రా జాన్సన్ గా పేరుపొందిన కొక్కొండ వెంకటరత్నం పంతులు 1871లో వారణాసి ధర్మసూరి సంస్కృతంలో రచించిన నరకాసురవిజయము అనే వ్యాయోగాన్ని తెలుగులోనికి అనువదించారు. సీసము అనే లోహము పేరుతో ఛందస్సు ఉండగా వెండి, బంగారం అనే పేరుతో క్రొత్త ఛందస్సును సృష్టించారు. వావిలాల వాసుదేవశాస్త్రి ఆంగ్లనాటకాలను ఆంధ్రీకరించడానికి శ్రీకారం చుట్టారు, షేక్స్పియర్ రచించిన జూలియస్ సీజర్ ఆంగ్లనాటకాన్ని సీజరు చరిత్రను అనువాదంచేశారు. వాసుదేవశాస్త్రి తొలి ఆంగ్లనాటక అనువాదకులుగా కాకుండా తొలి విషాదాంత రచయితగా పేరుపొందారు. 1880లో వావిలాల నందకరాజ్యము అనే సాంఘిక నాటకాన్ని రచించారు.

ఈ రచయితల నాటకాలు ఏవీ ప్రదర్శనలకు నోచుకోలేదు. అనంతరకాలంలో కందుకూరి కొండు భొట్ల సుబ్రహ్మణ్యశాస్త్రి, నాదెళ్ల పురుషోత్తమకవి, వడ్డాది సుబ్బారాయుడువంటి వారు ఎన్నో నాటకాలను రచించారు. కందుకూరి, కులాచార విషయాలలోనూ, రాజకీయ వ్యవహారాలలోనూ గల అనేక దురాచారాలకు వినోదాత్మకమైన సంభాషణలతో వెల్లడిచేయడానికి హాస్యసంజీవిని పత్రికను ప్రారంభించారు. అందులో ప్రచురించిన బ్రాహ్మవివాహమును కేవలము వినోదము కొరకు కాక అతిబాల్య వివాహము, వృద్ధవివాహము, కన్యాశుల్కము మొదలైన దురాచారముల వలన అనర్ధకములను చూసి జనులకు వానినుండి విముఖులను చేయతలంపులతో వ్రాసితిని, అని కందుకూరి పేర్కొన్నారు. అనంతరం వ్యావహారిక భాషలో కందుకూరి వ్యవహార ధర్మబోధిని అనే నాటకాన్ని వ్రాశారు.

తెలుగు నాటక ఆరంభదశలో ధార్వాడ నాటకసమాజంవారి ప్రదర్శనలు ఎంతో ఆసక్తిని రేకెత్తించాయి. 1885లో ధార్వాడ నాటక సమాజం వారు భట్టుజోషి, సీతారామ్‌జోషి నాయకత్వంలో ఆంధ్రదేశంలో విస్తృతంగా నాటకాలను ప్రదర్శించారు. అప్పటికే కందుకూరి 1880వ సంవత్సరంలో రాజమండ్రిలోని శ్రీ విజయనగరం మహారాజావారి బాలికా పాఠశాలలో నాటకాన్ని తొలిసారిగా ప్రదర్శించారు. కందుకూరికన్న పూర్వం ఉన్న మహాపండితులు నాటక రచన చేసినా తొలి తెలుగు నాటక రచయిత అనే ఖ్యాతి కందుకూరికే లభించింది. ఎందుకంటే నాటకం దృశ్యప్రక్రియ. నాటకం ప్రదర్శనయోగ్యమైనది. ఆ కవుల నాటకాలన్నీ ప్రదర్శనకు నోచుకోలేదు. ప్రదర్శనే నాటక రచనకు సార్థకతను కలిగిస్తుంది కాబట్టి తొలిప్రదర్శన పొందిన నాటకం వ్యవహార ధర్మబోదిని కాబట్టి తెలుగు నాటక కర్త అనే ఖ్యాతి కందుకూరికే లభించింది. ధార్వాడ నాటక సమాజం రాజమండ్రిలో నెలరోజులపాటు పాకలను నాటకశాలను నిర్మించి నాటకాలను ప్రదర్శించారు. అనంతరం ఆపాకలలో తాను నెలకొల్పిన నాటకసమాజము వారికే రత్నావళి, చమత్కార రత్నావళి, అనే తన రచనలను ప్రదర్శించారు. ఈ నాటకాల్లో కందుకూరితో పాటు సోమంచిశంకరం, అడవికొల్లు కనకరాజు అనే వారు కూడా నటించారు.

ఈ స్ఫూర్తితో బళ్లారిలో ఆంధ్రనాటక పితామహుడైన ధర్మవరం రామకృష్ణమాచార్యులు 1897లో చిత్రనళీయము, విషాదసారంగధర వంటి పలునాటకాలను రచించి ప్రదర్శించారు. ఆంధ్రచారిత్రక నాటక పితామహుడైన కోలాచలం శ్రీనివాసరావు ధర్మవరానికి పోటిగా రామరాజుచరిత్ర, కీచకవధ, ప్రహ్లాదనాటకం, పాదుకా పట్టాభిషేకం వంటి నాటకాలను ప్రదర్శించారు. ధర్మవరం మేనల్లుడైన బళ్లారి రాఘవ మామకు పోటిగా కోలాచలం సమాజంలో పాత్రలను ధరించేవారు. గురజాడ శ్రీరామమూర్తి మర్చెంట్ ఆఫ్ వెనిస్ నాటకాన్ని వెనీజువణిజ నాటకము లేదా సుహృత్సుభాషితము అనేపేరుతో అనువదించారు. వసురాయకవిగా సుప్రసిద్ధులైన వడ్డాది సుబ్బారాయుడు వేణీసంహారము, విక్రమోర్వశీయము, ప్రబోధచంద్రోదయం, అభిజ్ఞానశాకుంతలం వంటి ఏడునాటకాలను రచించారు. నాదెళ్ల పురుషోత్తమకవి హరిశ్చంద్ర, చంద్రహాస నాటకము, సారంగధర, ద్రౌపదీ వస్త్రాపహరణము అనే నాటకాలను రచించారు.

పందొమ్మిదవ శతాబ్దం చివరి అధ్యాయంలో తెలుగునాటకరంగంలో ఒక సువర్ణ అధ్యాయం ప్రారంభమైనది. వ్యావహారిక భాషకు పట్టంకడుతూ గురజాడ కన్యాశుల్కాన్ని, పాత్రోచితభాషకు ప్రాధాన్యం ఇచ్చి వేదం వేంకటరాయశాస్త్రి ప్రతాపరుద్రీయం నాటకాన్ని రచించారు. వేదంవారు బొబ్బిలియుద్ధం, మాళవికాగ్నిమిత్రము వంటి నాటకాలను రచించారు. తెలుగునాటక సర్వస్వంలో వేదం వారి ప్రతాపరుద్రీయం నాటకంలో నీచపాత్రలకు గ్రామ్యభాషను సరసమధురంగా ప్రయోగించారు. కందుకూరి వారితో పుట్టి పురుడుపోసుకున్న తెలుగునాటకం గురజాడ కన్యాశుల్కంతో బలమైన కుదురుతో నిలదొక్కుకుంది.

## 1.2.15.1 నాటక కథావివరణ:

**ప్రథమాంకం - 1వ స్థలం :**

పూటకూళ్ళమ్మ దగ్గర ఇరవైరూపాయలు అప్పు చేసి ఖర్చుపెట్టిన గిరీశం, ఆమె నుంచి తప్పించుకోడానికి విజయనగరం నుంచి వెళ్ళిపోవాలనుకుంటాడు. పరీక్షల్లో తప్పిన శిష్యుడు వెంకటేశ్వర్లుతో వాళ్ళ ఊరికి వెళితే బాగుంటుందనుకుంటాడు. గిరీశం చుట్ట తాగడం తప్ప తనకేమీ నేర్పలేదని, ఆతని సాహసంతోనే చెడిపోయానాని వెంకటేశం అంటే తనగురించి గొప్పగా చెప్పుకుంటాడు గిరీశం.

తాను వెంటేశంతో వాళ్ళ ఊరువచ్చి పరీక్షల్లో పాసయినట్లు చెబుతాడు. సెలవులయిన తరువాత పైక్లాసులో చేర్పిస్తానని చెప్పి చదువుకోవడానికి కొత్త పుస్తకాల జాబితా చెప్పి కొనుక్కోమంటాడు. తాను తన పనులు చక్కబెట్టుకువస్తానని, రాత్రికి బయలుదేరుదామని, ఈ విషయం రహస్యంగా ఉంచమని చెప్పి వెంకటేశాన్ని పంపిస్తాడు. ఫోటోలు తీయించుకున్నందుకు ఇవ్వవలసిన బకాయి కోసం బంట్రోతు వస్తే చెవిటివాడుగా నటిస్తాడు. బంట్రోతు పెద్దగా అరవడం ప్రారంభిస్తాడు. అతనికి చుట్ట ఒకటి లంచంగా ఇచ్చి రేపొద్దున పూటకూళ్ళమ్మ ఇంటికి వస్తే బాకీ తీర్చేస్తానని నమ్మకం కలిగేటట్లు చెప్పి గాయత్రి మీద ప్రమాణం చేస్తాడు. అతడిని పంపించి మధురవాణి ఇంటికి బయలుదేరుతాడు.

**2వ స్థలం:- మధురవాణి ఇంట్లోగది :**

రామప్పంతులు అనే వ్యక్తి మధురవాణిని ఉంచుకుంటానని తనతో రమ్మని అంటాడు. తాను గిరీశంతో ఉన్నానని, అతనితో తెగతెంపులు చేసుకురావాలంటే రెండు వందలు కావాలని అంటుంది. రామప్పంతులు రెండు వందలు ఇస్తాడు. గిరీశాన్ని నిందిస్తాడు. అంతలో గిరీశం వస్తున్నాడని చెబితే, అతడు తంతాడని భయపడ్డ పంతులు మంచం కింద దూరుతాడు. గిరీశం వచ్చి తనకు హైదరాబాదులో ఉద్యోగం వచ్చిందని కోతలు కోస్తాడు. తనతో హైదరాబాదు రమ్మంటాడు. పూటకూళ్ళమ్మను తీసుకుపొమ్మని మధురవాణి అంటే ఎవరో తన గురించి అబద్ధాలు చెప్పారని ఆ చెప్పిన వాడెవడో చెప్పమని అంటాడు గిరీశం. తన పేరు చెప్తుందేమానని రామప్పంతులు భయపడతాడు. ఇంతలో గిరీశం కోసం పూటకూళ్ళమ్మ వస్తుంది. ఆమెను చూసిన గిరీశం మంచం కింద దూరతాడు. కింద రామప్పంతులు కనబడతాడు. రామప్పంతుల్ని ముందుకు జరిపి గిరీశం మంచం కింద గోడప్రక్క కి చేరతాడు. పూటకూళ్ళమ్మ చీపురుకట్టతో వచ్చి గిరీశం గురించి మధురవాణిని అడుగుతుంది. తనకు గిరీశం గురించి తెలియదంటూనే మంచం క్రింద ఉన్నాడని మధురవాణి సైగ చేస్తుంది. పైటకూళ్ళమ్మ చీపురుకట్టతో మంచం క్రింద ఉన్నవాడిని కొడితే ఆ దెబ్బలు రామప్పంతులికి తగులుతాయి. ఆయన బయటకు వస్తాడు. తనను కొట్టినందుకు తిడుతూ గిరీశం మంచం కిందే ఉన్నాడని చెబుతాడు. పూటకూళ్ళమ్మ మంచం క్రిందికి దూరుతుంది. గిరీశం రెండోవైపు నుంచి బయటకు జారుకుంటాడు.

## ద్వితీయాంకం

**1వస్థలం - కృష్ణరాయపురంలో అగ్నిహోత్రావధాన్లు ఇల్లు :**

అగ్నిహోత్రావధాన్లు, వెంకమ్మ వెంకటేశం తండ్రి, తల్లి. అతని మేనమామ కరటక శాస్త్రి అతని శిష్యుడు కూడా అక్కడే ఉంటారు. వెంకటేశానికి ఇంగ్లీషు చదువు చెప్పించడం వలన డబ్బంతా నాశనం అవుతున్నదని తండ్రి బాధపడితే, అవసరమయితే తన పసుపు కుంకానికి ఇచ్చిన భూమి అమ్మయినా చదివించాల్సిందేనని వెంకమ్మ వాదిస్తుంది. అంతలో గిరీశం వెంకటేశం వస్తారు. వెంకటేశం పరీక్ష పాసయ్యాడని మూడేళ్ళు తన దగ్గర ఉంచితే పోలీసు పరీక్ష పాస్ చేయిస్తానని గిరీశం చెప్తాడు. కరటక శాస్త్రి తనకు తెలుసునని పొగుడుతాడు. తనకు గతిలేక అక్కడికి రాలేదని, వెంకటేశం మీద ప్రేమతో చదువు చెప్పడానికి అంగీకరించానని నమ్మబలికి వెంకమ్మ అభిమానం సంపాదిస్తాడు.

అగ్నిహోత్రావధాన్లు తన కూతురు బుచ్చమ్మను పదిహేనువందలకు అమ్మడం, భర్త చనిపోయిన ఆమె విధవగా పుట్టింటికి రావడం ప్రస్తావనకు వస్తుంది. ఆ సన్నివేశాన్ని ఆధారం చేసుకొని గిరీశం రాజమహేంద్రవరంలో ఉన్న రామావధాన్లు తన మేనమామ అని, ఆయన అగ్నిహోత్రావధాన్లను కీర్తిస్తాడని చెప్పి ఆయన మనసు చూరగొంటాడు. ఆయనిచ్చిన కొన్ని ఇంగ్లీషు కాగితాలను తర్జుమా చేసిపెడతానంటాడు. వెంకమ్మ కోరికపై గిరీశం, ఇంగ్లీషులో మాట్లాడినట్లు ఏవేవో పొంతనలేని వాక్యాలు చదువుతాడు. వెంకటేశం తెలుగుపద్యం చెప్పి అర్థం చెప్పలేకపోతే గిరీశం సర్దిచెబుతాడు. రామచంద్రపురంలో ఉన్న లుబ్ధావధాన్లు తన రెండో కూతురు సుబ్బమ్మను పద్దెనిమిదివందలకు బేరం ఆడి పెళ్ళి చేస్తానని అంటారు. లుబ్ధావధాన్లు తన బంధువని, ఆయనకు అరవయ్యేళ్ళుంటాయని గిరీశం చెప్పి కన్యాశుల్కం తప్పని చెప్తాడు. తాంబూలం కూడా ఇచ్చానని భర్త అంటే వెంకమ్మ ఆదౌర్భాగ్యపు సంబంధం వద్దని ఆ సంబంధం చెడిపోయే మార్గం ఆలోచించమని కరకటశాస్త్రికి, గిరీశానికి చెబుతుంది. ఉపాయం చెప్తానని వెంకమ్మని, కరటకశాస్త్రి ప్రక్కకు తీసుకుపోతాడు. అన్నానికి పిలవడానికి

వచ్చిన బుచ్చమ్మను చూచిన గిరీశం ఆమె అందాన్ని మనసులోనే మెచ్చుకుంటాడు.

**2 వస్థలం - దేవాలయం :**

కరటకశాస్త్రి శిష్యుడు తనకు గురువు సరిగ్గా చదువు చెప్పడం లేదని, గిరీశం దగ్గర ఇంగ్లీషు చదివితే బాగుంటుందని అనుకుంటాడు. ఆడపిల్ల వేషంలో లుబ్ధావధానులను పెళ్ళిచేసుకొంటే తాను ఇంగ్లీషు చదువు చెప్పించడంతో పాటు తన కూతురునిచ్చి వివాహం జరిపించి ఇల్లరికం ఉంచుకుంటానని మాట ఇస్తాడు.

**3వ స్థలం - అగ్నిహోత్రావధాన్లుఇంటి యదటివీధి :**

ఆ రాత్రి భోజనాల సమయంలో గిరీశం కన్యాశుల్కానికి వ్యతిరేకంగా లెక్చరు ప్రారంభించాడు. ఇంగ్లీషు మాటలు వినబడే సరికి అగ్నిహోత్రావధాన్లు మండిపడ్డాడు. సపోర్టు చేస్తానన్న కరటక శాస్త్రి నోరెత్తలేదు. దాంతో గిరీశం లెక్చరు ఆపేశాడు. అంతలో బుచ్చమ్మ వచ్చి చెల్లికి లుబ్ధావధాన్లుతో పెళ్ళివద్దని అంటుంది. అవధాని కోపంతో పెరుగన్నం బుచ్చమ్మ నెత్తిన కొడతాడు. కోపం వచ్చి కరకటశాస్త్రి శిష్యుడుతో ఊరెళ్ళిపోతాడు. వెంకమ్మ ఏడుస్తూ ఉంటుంది. గిరీశం నీళ్ళు కాగ బెట్టి బుచ్చమ్మను స్నానం చేయమన్నాడు. లుబ్ధావధాన్లు తన మాట వినడని గ్రహించిన గిరీశం అతడు చెప్పిండంతా నిజమేనని కన్యాశుల్కం మంచి సంప్రదాయమని లుబ్ధావధాన్లు వాదనను అంగీకరించాడు.

జరిగిన ఈ సంగతంతా చెప్పి గిరీశం విధవావివాహలు చేసే అవకాశం ఉండడం వల్ల కన్యాశుల్కం మంచిదని వెంకటేశానికి హితబోధ చేశాడు. లుబ్ధావధాన్లను తను లోబరచుకున్నానని చెప్పాడు. వెంకటేశం తెచ్చిన పోగాకుతో చుట్టముట్టించి విడోమీద తాను రాసిన ఇంగ్లీషు కవిత్వాన్ని వినిపించాడు. కాసేపు తర్వాత వచ్చిన లుబ్ధావధాన్లుకు దావాల విషయంలో సహాయం చేస్తానని ప్లీడరుకుఫీజు లేకుండా చేస్తానని నమ్మబలికాడు. లుబ్ధావధాన్లు పూర్తిగా గిరీశానికివశమై అతను చెప్పినట్లు దావాలువేయడానికి అంగీకరించాడు.

**తృతీయాంకం - 1వ స్థలం - రామచంద్రపురం - రామప్పంతులు ఇల్లు :**

రామప్పంతులు ఆర్థికస్థితి బాగా లేకపోవడం వల్ల మధురవాణి తనకు నష్టం కలుగుతుందేమో అని అనుమానిస్తుంది. లుబ్ధావధాన్లు పెళ్ళి ఆపించమని అడుగుతుంది. లుబ్ధావధాన్లు డబ్బున్న పరమలోభి. పెళ్ళాడితే ఆయనకు ధనం వస్తుందని సిద్ధాంతి, పండాగారు చెప్పారు. పెండ్లి, ధనం జంటగా వస్తాయని ఈ వయసులోపిల్ల నెవరూ ఇవ్వక, పెళ్ళికాకపోతే గొప్ప కీడు వస్తుందని, ఆ కీడు పోవాలంటే శాంతి చేసి బ్రాహ్మణులకు పెట్టాలని వాళ్ళిద్దరూ కల్పించి చెప్పారు. అతగాడు వివాహ ప్రయత్నాలు ప్రారంభించారు. అగ్నిహోత్రావధాన్లు కూతురు జాతకం బాగుందని కల్పించి చెప్పి ఆయిద్దరికీ వివాహం కుదిర్చారు. ఇదంతా రామప్పంతులు డబ్బు కోసం చేసిన కుట్ర అని మధురవాణి అతని చేతనే చెప్పించింది. లుబ్ధావధాన్లు కూతురు మీనాక్షి ప్రవర్తన మంచిదికాదని రామప్పంతులు అంటాడు. పెళ్ళి ఆపమంటూ మధురవాణి గొడవ చేస్తుంది.

రామప్పంతులు ఇన్స్పెక్టరు పేరుతో రామినాయుడు దగ్గర డబ్బు కాజేశాడని తెలిసి, రామప్పంతులును తీసుకు వెళ్ళడానికి కానిస్టేబులు వస్తాడు. అతను అవమానంగా మాట్లాడితే రామప్పంతులు మధువాణి ముందు గౌరవం పోతుందని అతడిని బతిమలాడుకొని అక్కడి నుంచి వెళ్ళిపోతాడు.

**2వ స్థలం - రామప్పంతులు ఇంట్లో పడక గది :**

కరకట శాస్త్రులు శిష్యుడికి ఆడవేషం తగిలించుకొని, మధురవాణి దగ్గరకు వస్తాడు. అతను కొంత కాలం ఆమెను చేరదీసిన వాడే గిరీశానికి ఆమెతో ఉన్న సంబంధం తెలుసుకుంటాడు. తన చెల్లెలు కూతురు సుబ్బమ్మకు లుబ్ధావధాన్లుతో పెళ్ళి నిశ్చయమయిందనీ, దానిని తప్పించాలని, సుబ్బమ్మకు ఇస్తానన్న కన్యాశుల్కం కంటే తక్కువ డబ్బుతో ఆడవేషంలో ఉన్న తన శిష్యుడితో పెళ్ళి జరిపే విధంగా చేయమని, అందుకు కొంత డబ్బు ఇస్తానని కరటకశాస్త్రులు చెబుతాడు. మధురవాణి సరే అంటుంది. రామప్పంతులతో మాట్లాడి దానికి వ్యూహం తయారు చేసుకోవాలని అనుకుంటారు.

రామప్పంతులుకి ముందుగా పాతిక రూపాయలు ఇచ్చి అతని మనస్సు ఆకట్టుకున్న కరకట శాస్త్రులు, లుబ్ధావధాన్లు పెళ్ళి సుబ్బమ్మతో ఆపేటట్లు, తన శిష్యుడితో జరిగేటట్లు అతనిచ్చిన కన్యాశుల్కంలోసగం రామప్పంతులుకి ఇచ్చేటట్లు బేరం ఖాయం చేసుకుంటాడు. రామప్పంతులు పెళ్ళి ఆపడానికి ప్రయత్నాలు ప్రారంభిస్తాడు.

### 3వ స్థలం: అగ్రిహోత్రావధాన్లు ఇల్లు :

బుచ్చమ్మను లోబరుచుకొని లేవదీసుకుపోయి పెళ్ళి చేసుకోవాలని గిరీశం అనుకుంటాడు. వెంకటేశానికి పాఠం చెబుతున్నట్లు నటిస్తూ, విధావా వివాహం శాస్త్రసమ్మతం అని విధవా వివాహం చేసుకోవడం బ్రహ్మచారుల కర్తవ్యమని ఆ వివాహాలను అడ్డుకోవడం తప్పని బుచ్చమ్మకు వినబడేటట్లు చెబుతాడు. విధవలు పెళ్ళాడి, పిల్లలను కనకపోతే పాపమని చెబుతాడు. అగ్నిహోత్రావధాన్లు వస్తే అతను వినేటట్లుగా తండ్రిని గౌరవించాలని, లోకంలో కోర్టులే ముఖ్యమయినవని లెక్చరు నిస్తాడు. తనను గిరీశమే రక్షించాలని అగ్నిహోత్రావధాన్లు చెప్పి పెళ్ళిపనుల్లో సాయం చేయమంటాడు.

### 4వ స్థలం - పెరడు :

బుచ్చమ్మ గిరీశం గురించి అడిగితే, ఆయన చాలా గొప్పవాడని, సంఘసంస్కర్త అని వెంకటేశం కోతలు కోస్తాడు. గిరీశం వచ్చిన తరువాత పెళ్ళి ఎందుకు చేసుకోలేదని బుచ్చమ్మ అడుగుతుంది. ఎవరికీ చెప్పవద్దని మాట తీసుకొని తాను విధవావివాహాలు చేయడానికి వేశ్యావృత్తిని మానిపించడానికి పెళ్ళి చేసుకోలేదని చెప్తాడు. మాటవరసకు అంటూ బుచ్చమ్మ వంటి బంగారు బొమ్మ దొరికితే వివాహమాడుతానని, పెళ్ళి, పిల్లలు, సంసారం అని మాటలు చెప్పి ఆమె కళ్ళ ముందు ఒక లోకాన్ని కల్పిస్తాడు. బుచ్చమ్మకు తెలియని అనేక విషయాలు చెప్పి ఆమెదృష్టిలో గొప్పవాడిగా ఎదిగిపోతాడు. అచ్చమ్మను చేసుకోమని చెబితే, తాను బుచ్చమ్మలాంటి అమ్మాయి అయితేనే వివాహమాడతానని అంటాడు. బుచ్చమ్మ బదులు చెప్పదు.

అగ్నిహోత్రావధాన్లు వస్తే అతనికి ఇంగ్లీషు చదువులో చెట్లెక్కడం నేర్పుతారని, అది నేర్చుకుంటే తాసిల్దారు కావచ్చని చెప్తాడు. చెట్టెక్కి కోసితెచ్చిన జామకాయల్లో గిరీశం వాటా అడిగితే వెంకటేశం బాధపడుతూ ఇస్తాడు.

### చతుర్థాంకం - 1వ స్థలం - రామప్పంతులు ఇల్లు :

రామప్పంతులు, మధురవాణి, గిరీశం లుబ్ధావధాన్లు పెళ్ళికి వస్తాడని రామప్పంతులిని గొడవ చేస్తాడని ఆ గొడవ తప్పించుకోవాలంటే పూటకూళ్ళమ్మను పెళ్ళికి వంటలక్కగా పిలిపిస్తే మంచిదని అనుకుంటూ ఉంటే ఒక ఉత్తరం తీసుకొని లుబ్ధావధాన్లు వస్తాడు. అది గిరీశం అతనికి రాసిన ఉత్తరం అందులో అగ్నిహోత్రావధాన్లుకు కోపం ఎక్కువని , కోపం వస్తే కొడతాడని, ద్రవ్యాశ ఎక్కువని, పెళ్ళికి ఆర్భాటంగా వస్తున్నాడని కనుక పెళ్ళి ఖర్చు అధికంగా చేయవలసిన అవసరం ఉంటుందని, పెళ్ళికూతురుకు పెయ్యనాకుడు జబ్బు ఉందని, ఆ జబ్బు ఉంటే వైధవ్యం కలుగుతుందనే నమ్మకం ఉందని, ఈ పెళ్ళి పిల్ల తల్లికి ఇష్టంలేదని, పెళ్ళిసమయానికి బావిలోపడాలని అనుకుంటూ ఉన్నదని, పిల్ల జాతకం నిజం కాదని, బనాయించినదని గిరీశం వ్రాశాడు. ఆ ఉత్తరం చదివిన లుబ్ధావధాన్లు అగ్గి మీద గుగ్గిలం అయ్యాడు. అప్పుడే అతనికి అగ్నిహోత్రావధాన్లు రాసినట్లుగా రామప్పంతులు వ్రాసిన ఉత్తరం వచ్చింది. అందులో లుబ్ధావధాన్లు పిసినిగొట్టు కనుక ఆసంబంధం తమకు అవసరం లేదని, ముసలివాడు, క్షయరోగి అయిన అతనికి తన కూతురిని ఇవ్వనని, లుబ్ధావధాన్లు కూతురు ప్రవర్తన మంచిది కాదని, రాసి ఉంది. ఆ ఉత్తరంలో విశేషాలకు కోపం పొందిన లుబ్ధావధాన్లు ఆపెళ్ళి వద్దని, తక్కువ కన్యాశుల్కంతో మరో సంబందం చూడమంటాడు. రామప్పంతులు కరకటశాస్త్రి శిష్యుడిని ఆడవేషంలో తీసుకువచ్చి చూపిస్తాడు. లుబ్ధావధాన్లు సరేనంటాడు. పన్నెండువందల రూపాయలు కన్యాశుల్కంగా ఇచ్చేటట్లు కరకటశాస్త్రులను ఒప్పించినట్లు రామప్పంతులు నాటకం ఆడతారు. బంగారం ముందే పెట్టాలని అడుగుతున్నారు గనుక మధుర వాణి కంటెను ముందు తగిలించేద్దాం అంటాడు రామప్పంతులు.

### 2వ స్థలం- లుబ్ధావధాన్లు ఇల్లు :

కరటక శాస్త్రి, లుబ్ధావధాన్లు మాట్లాడుకుంటూ ఒక రాత్రి వివాహం అయితే ఖర్చు తక్కువ కనుక ఏకరాత్రి వివాహం జరపాలని నిర్ణయించుకుంటారు. ఈ విషయం రామప్పంతులుతో చెప్పవద్దనుకుంటారు.

**3వ స్థలం : లుబ్ధావధాన్లు ఇంటి పెరడు :**

సిద్ధాంతి రాత్రికి ముందే లగ్నమని, మంగళస్నానాలు చేయించండని హడావిడి చేస్తాడు. రామప్పంతులు రాత్రికి అనుకుంటున్నాడని, ముందే జరిపిస్తే గొడవ చేస్తాడని లుబ్ధావధాన్లు భయపడతాడు. పెళ్ళిపనులు జరుగుతుంటాయి.

**4వ స్థలం:- లుబ్ధావధాన్లు ఇంటి అరుగు :**

వివాహం అయిపోతుంది. కరటకశాస్త్రి డబ్బుతో వెళ్ళిపోయ్యాడు. రామప్పంతులు తన వాటా తనకు అందకపోయేసరికి హడావుడి చేస్తాడు. పెళ్ళి సమయంలో మధురవాణి హెడ్డుగారితో మాట్లాడిందని తెలుసుకొని మండిపడతారు. తను లేకుండా పెళ్ళి జరిగినందుకు చిందులు వేస్తాడు. సిద్ధాంతి రహస్యంగా మాట్లాడి రామప్పంతులి కోపాన్ని తగ్గిస్తాడు. మధురవాణి హెడ్డుగారితో ఉండి ఉంటుందని అనుమానించిన రామప్పంతులు కొండి భట్లును తీసుకొని వెళ్ళి, ఇంటివెనుక కాపలా ఉంచి తలుపు తడతాడు. కొండి భట్లు రామప్పంతులు దగ్గర తీపుకున్న డబ్బుతో పాటు హెడ్డుగారి దగ్గర లంచం తీసుకొని హెడ్డుగారు రాలేదని చెప్తాడు. తన గుట్టు కాపాడినందుకు మధురవాణి అతనికో ముద్దు ఇస్తుంది. వాడి ఆనందానికి అవధులుండవు.

**5వ స్థలము - అగ్నిహోత్రవధానుల ఇంటిపెరడు**

గిరీశం వెంకటేశంతో మతసారాంశం గురించి, పొగాకు గురించి, చుట్టకాల్చడం వల్ల కలిగే లాభాల గురించి, నరకానికిపోతే దేవుడితో చేసేవాదన గురించి, తనకు అధికారం ఇస్తే లోకంలో తాను సరిచేసే లోపాల గురించి చెబుతాడు. బుచ్చమ్మ వచ్చి తన చెల్లెల్ని తప్పించమని అడిగినా ఆ పని చేయలేనంటాడు. తాను రెండు పేజీల ఉత్తరం వ్రాసినా లుబ్ధావధానులు సమాధానం ఇవ్వలేదని బాధపడి బుచ్చమ్మ తనతో లేచివస్తే పెళ్ళి ఆగిపోతుందని అంటాడు. తాను రానంటుంది బుచ్చమ్మ. ఆమె రాకపోతే తాను చస్తానని, ఆమె చెల్లెలు పెళ్ళి ఆగిపోవాలంటే అంతకంటే గత్యంతరం లేదని బలవంతం చేస్తాడు. బుచ్చమ్మ అతనితో వెళ్ళడానికి అంగీకరిస్తుంది.

## పంచమాంకం :

**1వ స్థలం - లుబ్ధావధాన్లు పడక గది :**

లుబ్ధావదాన్లు తన భార్య మొదటి మొగుడు గొంతునులిమి చంపబోతున్నట్లు కలగంటాడు. అతని అరుపులకు అతని కూతురు మీనాక్షి వచ్చింది. పెళ్ళికూతురుకు అంతకు పూర్వం పెళ్ళి అయి ఉండదని, ఆ అమ్మాయి మంచిదని అంటుంది. తాను చస్తే ఇద్దరూ పెళ్ళిళ్ళు చేసుకుంటారని అంటూ లుబ్ధావధాన్లు మీనాక్షిని అక్కడే పడుకోమంటాడు. అతనికి మాదిరిగానే తన మొదటి మొగుడు కలలోకివచ్చాడని, రెండో మొగుడిని చంపుతానని అంటున్నాడని పిన్ని చెప్పిందని మీనాక్షి అంటుంది. ఆడవేషంలో ఉన్న శిష్యుడు వచ్చి లుబ్ధావధానుల్ని కౌగిలించుకుంటాడు. మీనాక్షి అతనిని కొట్టబోతే తప్పించుకోవడం వలన ఆదెబ్బలు ఆమె తండ్రికి తగులుతాయి. శిష్యుడు మీనాక్షిని కరిచి పారిపోతాడు.

**2వ స్థలం- రామప్పంతులు ఇల్లు :**

మధరవాణి పోలిశెట్టి, సిద్ధాంతి, మొదలైన వారితో పేకాట ఆడుతూ ఉంటుంది. ఇంతలో తలుపు తట్టిన చప్పుడు వినిపిస్తుంది. రామప్పంతులు వచ్చి ఉంటాడని చెప్పి, మధురవాణి అక్కడున్న వాళ్ళను ఒక గదిలో పెట్టి బయటకు వస్తుంది. తలుపు తీస్తే కరటక శాస్త్రి శిష్యుడు వస్తాడు. కంటె మధురవాణికి ఇస్తాడు. దాసరి వేషంతో అతడిని తన గురువు దగ్గరకు పంపు తానని మధురవాణి మాట ఇస్తుంది. రామప్పంతులు గొంతుతో మాట్లాడిన శిష్యుడి మాటలు విని గదిలో ఉన్న వాళ్ళు భయపడతారు. మధురవాణి రామప్పంతులు కాదని చెబితే సంతోషించి మరల పేకాట ప్రారంభిస్తారు. ఇంతలోనిజంగానే రామప్పంతులు వస్తాడు. ఉన్న వాళ్ళందరినీ దాచి మధురవాణి తలుపు తీస్తుంది. లుబ్ధావధాన్లు పెళ్ళాన్నిరామప్పంతులే లేవదీసుకుపోయాడని, తనకంటె తన కిస్తేనే లోనికి రానిస్తానని దబాయించి మధురవాణి రామప్పంతులిని తిట్టి, బయటకు నెట్టి తలుపువేస్తుంది. కంటె కోసం వెళితే లుబ్ధావధాన్లు తంతాడని భయపడతాడు రామప్పంతులు.

**3వస్థలం- లుబ్ధావధాన్లు ఇంటివాకిలి :**

ఇంటినుంచి వెళ్ళిపోయిన భార్య చనిపోయిందేమో అని లుబ్ధావధాన్లు భయపడతాడు. రామప్పంతులు కారణంగానే తనకీ అవస్థ ఏర్పడిందని భావిస్తాడు. అపుడే అక్కడికి వచ్చిన రామప్పంతులు తన కంటె ఇప్పించమని అడుగుతాడు.దయ్యాలను సీసాలో బంధించానని గురవయ్య చెప్తాడు. కంటెతో పాటు ఆ అమ్మాయి రామప్పంతులు ఇంటికే వెళ్ళిఉంటుందని లుబ్ధావధాన్లు గొడవచేస్తాడు.

**4వస్థలం-రామచంద్రపురం-సారాయి దుకాణం :**

ఒకబైరాగి, ఒకయోగిని, మునసబు, సాతాని, వీరేశమొదలయిన వారు సారాయి తాగి ఆకాశంగురించి బంగారం చేసే విద్యగురించి సిద్ధులను గురించి మాట్లాడుకుంటూ ఉంటారు. వారితోహెడ్ బాల్యవివాహాలగురించి, రండా గర్భాలగురించి హవల్దారు అచ్చన్నతో ముచ్చటిస్తాడు, రామప్పంతులు వచ్చి యోగినికి సైగచేస్తే ఆమె అతనితో మాట్లాడి, హెడ్‌ను తీసుకుపోతుంది. పారిపోయిన పిల్ల దగ్గర నుండి కంటెను యిప్పించమని, లేదా లుబ్ధావధాన్లును బెదిరించి కంటె విలువైన సొమ్మును గాని ఇప్పించమని రామప్పంతులు హెడ్‌ను కోరతాడు. సాక్ష్యం కోసం దుకాణదారునూ, బైరాగిని తీసుకుని లుబ్ధావధాన్లు ఇంటికి బయలు దేరుతారు.

**5వస్థలం- దేవాలయం గుమ్మందగ్గర :**

హెడ్ లుబ్ధావధాన్లును కంటె గురించి బెదిరించి పన్నెండు రూపాయలు తీసుకుని వదిలిపెడతాడు. కంటె లేకుండా ఇంటికి వెళ్ళ లేనని రామప్పంతులు హెడ్ దగ్గర వాపోతాడు. తానేమీ చేయలేనంటూ మూడురూపాయలు ఇచ్చి హెడ్ వెళతాడు. శిష్యుడు బావిలో దూకి చనిపోయి ఉండడని, మీనాక్షిని అడిగితే విషయం తెలుస్తుందని వాళ్ళ ఇంటికి వెళ్ళి అసిరిగాడికి లంచం ఇచ్చి మీనాక్షిని పిలుచుకురమ్మంటాడు.

**6వస్థలం -లుబ్ధావధాన్లు ఇంటినడవ :**

మీనాక్షి రామప్పంతులుకి వడపప్పు కొబ్బరిముక్కలు పెడితే, అవి దెయ్యానికి పెట్టినవని చెప్పి వాటిని తీసుకుంటాడు, మీనాక్షిని పెళ్ళాడుతానని, మధురవాణిని ఇంట్లోంచి పంపుతానని చెప్పి సరుకులు తీసుకురమ్మంటాడు. తాళంలేదంటే మారు తాళంతో తీస్తానంటాడు రామప్పంతులు. దీపం ఆర్పి ప్రమాణం చేసిన రామప్పంతులు చీకట్లో మీనాక్షిని కౌగిలించుకుంటాడు లుబ్ధావధాన్లు వచ్చి రామప్పంతులిని కొట్టి, మీనాక్షిని, రామప్పంతులినిబయటకు తరిమి వేస్తాడు. రామప్పంతులుఇంటికి వెళ్ళి తలుపు తడతాడు. మధురవాణి కంటె తెస్తేనే తలుపు తీస్తానంటుంది. ఇంతలో మీనాక్షి వచ్చి తనను రాజమండ్రిలో వివాహంచేసుకుంటానని ప్రమాణం చేశాడని, మధురవాణిని వదిలేస్తానన్నాడని చెబుతుంది. మీనాక్షిని చేసుకుంటేనే తలుపు తీస్తానంటుంది మధురవాణి. మంగళ హారతి తెచ్చి ఇద్దరినిలోనికి ఆహ్వానిస్తానంటుంది ఆమె. ఆమె వచ్చేలోపు రామప్పంతులు పారిపోతాడు. దాసరి వేషంలో శిష్యుడు పాటలు పాడుతుంటాడు,

## షష్ఠాంకము :

**1వస్థలం-రామచంద్రపురం :**

పెళ్ళి బస్సులోవచ్చిన అగ్నిహోత్రావధాన్లుకి రామప్పంతులు కనబడతాడు. లుబ్ధావధాన్లుకు పెళ్ళయి పోయిందని చెప్పాడు. లుబ్ధావధాన్లు ఇంటికి వెళ్ళడానికి అతడు తనతో మాట్లాడడని చెప్పి దాసరి వేషంలో ఉన్న శిష్యుడిని పంపి ఇల్లు చూపించమంటాడు. వాడు కొంత దూరం వెళ్ళి అగ్నిహోత్రావధాన్లు కోప్పడ్డం వల్ల ఇల్లు చూపకుండానే వెళ్ళిపోతాడు.

**2వ స్థలం-చెరువు గట్టు :**

లుబ్ధావధాన్లును కొట్టిన అగ్నిహోత్రావధాన్లు క్రిమినల్ కేసు కూడా తీసుకురావాలను కుంటాడు. అతనికి రామప్పంతులు సాయం చేస్తానంటాడు. దావావేయడానికి పోలిశెట్టి దగ్గర నగలు కుదువపెడదామనుకుంటారు. నగల కోసం బుచ్చమ్మ ఎక్కడ ఉందో చూస్తే బుచ్చమ్మ, గిరీశం నగలతో పారిపోయారని తెలుస్తుంది.

**3వ స్థలం-మధురవాణి బస ఎదుటి వీధి :**

పోలిశెట్టి దగ్గర తెచ్చిన డబ్బుంతా అయిపోవడంతో ఏమి చెయ్యాలో అర్థంకాని అగ్నిహోత్రావధాన్లుకు తాకట్టు పెట్టడానికి ఏదన్నా తీసుకురమ్మని రామప్పంతులు చెబుతాడు. ఆయన తన తాతల నాటి కడియం తీసియిచ్చి తాకట్టుపెట్టమంటాడు. రామప్పంతులు తన చేతికి ఆ కడియం తొడుక్కుంటాడు. ప్లీడరు నాయుడుతో మాట్లాడి అగ్నిహోత్రావధాన్లుకు అతని మీద నమ్మకం లేదని, భీమారావు పంతులు గారికి వకాల్తా ఇచ్చామని చెప్తాడు. అతనికి కోపంవస్తుంది.

**4వ స్థలం-లుబ్ధావధాన్లు బస :**

వృద్ధాప్యంలో వివాహం తప్పని గ్రహించిన లుబ్ధావధాన్లు , తనకూతురు మీనాక్షికి డబ్బాశతో పెళ్ళి చేసినందుకు బాధపడతాడు. సౌజన్యారావు పంతులు దయవల్ల ఈ కేసులో తప్పించుకుంటే మీనాక్షిని మఠంలో ఉంచి కాశీకి వెళ్ళాలని అనుకుంటాడు రామప్పంతులు వచ్చి తాను కంటెకోసం రాలేదని, ఈ కేసులో ఉరిశిక్ష తప్పించుకోవాలంటే డిప్టీకలక్టరుకు, ఇన్సపెక్టరుకు లంచం ఇవ్వాలని, ప్రస్తుతం

డబ్బు లేకపోతే అప్పు ఇప్పిస్తామని చెప్తాడు. లుబ్ధావధాన్లు అంగీకరించడు. సౌజన్యరావు పంతులు వచ్చి రామ పంతులును వెళ్ళి పొమ్మంటాడు. ఎవరికి లంచాలు ఇవ్వనవసరంలేదని చెప్తాడు. గుంటూరు శాస్త్రులు గుంటూరు వాడు కాడని, అతని మాటతీరు, యాస ఎలాగుంటుందో గుర్తు చేసుకోమని చెప్తాడు.

**5వ స్థలం - విశాఖపట్టణంలో వీధి :**

కరటకశాస్త్రి శిష్యుడితో కంటె మధుర వాణికి ఇవ్వడం వలన ఈ కేసు జరుగుతూ ఉందని, ఈ గొడవ లేకుండా చేసుకోవాలంటే మధురవాణి దగ్గర కంటె తెచ్చి, దానితో పాటు పన్నెండు వందలు లుబ్ధావధాన్లుకు పంపిస్తే ఖూనీ కేసు పోతుందని, రామప్పంతులు కంటబడకుండా మధురవాణిని కలుసుకోవడం మంచిదని అంటాడు.

**6వ స్థలం - మధురవాణి బస :**

కరటక శాస్త్రి, శిష్యుడితో మధురవాణి ఇంటికి వెళ్ళి కంటె ఇస్తే తాము బతికి బయటపడతామని అంటారు. ఇద్దరికీ జైలుశిక్ష పడుతుందని మధురవాణి బెదిరిస్తుంది. తాను జీవితంలో ఆడవేషాలు వేయనని, మధురవాణికి శిష్యరికం చేస్తానని శిష్యుడు చెబుతాడు. కంటె డబ్బు పంపించాలని అనుకుంటున్నట్లు కరటక శాస్త్రి చెప్పాడు. సౌజన్యారావు పంతులు మంచివాడని. ఆయన మధురవాణి కంటె ఆమెకు ఇప్పిస్తాడని, ఆయన వేశ్యలతో మాటాడరని కరటక శాస్త్రి చెబుతాడు. మధురవాణి డిప్టీకలక్టరు తనమీద కోరికతో ఉన్నాడని చెప్పగానే, అతనితో గడిపి తనకు ఆపద తప్పేటట్లు చూడమంటాడు శాస్త్రి మధురవాణి మనుషుల స్వార్థతత్వాన్ని గురించి చెప్పి, శిష్యుడికి తప్పకుండా పెళ్ళిచేయమని చెప్పి కంటె కరటక శాస్త్రి చేతికి ఇస్తుంది. మధురవాణి శిష్యుడి చేత తత్వాలు పాడిస్తుంది.

**7వ స్థలం-సౌజన్యారావు పంతులు ఇల్లు :**

సౌజన్యారావు పంతులు అగ్నిహోత్రావధాన్లును పిలిపించి పిల్లలను అమ్మడం తప్పని, రెండోపిల్లకి మంచివరుడినిచూచి పెళ్ళిచేయమని, పెద్ద పిల్లని మఠంలో చేర్పిస్తేసుఖంగా ఉంటుందని. ఆమె ఆస్తి ఆమెకి ఇస్తే మంచిదని ఈ విధంగా చెయ్యకపోతే తానే దావావేస్తానని బెదిరించాడు. తానుచెప్పినట్లు చేస్తే లుబ్ధావధాన్లు తెచ్చిన కేసు లేకుండా చేస్తాననిమాటయిచ్చి ఆలోచించుకోమని సలహా ఇచ్చారు. అగ్నిహోత్రావధాన్లు విధవావివాహం చేయమన్నాడని, గిరీశం పక్షం మాట్లాడాడని సౌజన్యారావు పంతులిని తిట్టి వెళ్ళిపోయాడు.

## సప్తమాంకం :

**1వ స్థలం-విశాఖపట్టణంలోవీధి :**

బైరాగి తాను కాశీనుంచి వస్తున్నట్లు శూద్రులతో చెప్పేసమయంలో సారాయి దుకాణదారువచ్చి తనడబ్బు ఇమ్మంటూ బైరాగిని పట్టుకున్నాడు. అంతలో హెడ్ వచ్చి అతడిని విడిపించి ఆ రోజు లుబ్ధావధాన్లు దగ్గర డబ్బు తీసుకున్న తరువాత తన కంటె రాలేదని

రామప్పంతులు అర్జీలు పెట్టాడని, ఖూనీకేసు మాపు చేసినట్లు తనను తాసీల్దారు తిడుతున్నాడని, గుంటూరు శాస్త్రులు ఎక్కడున్నాడో తెలిస్తే సౌజన్యారావు పంతులు తనను రక్షించగలడని, ఆ శాస్త్రుల జాడ తెలిసేమార్గం చెప్పమని అడుగుతాడు. బైరాగి సరేనంటాడు. హెడ్ అతడిని తీసుకుపోతాడు.

**2వస్థలం-డిప్టీకలెక్టరు కచేరీ :**

డిప్టీకలెక్టరు అగ్నిహోత్రావధాన్లు కేసు గురించి అడుగతాడు. భీమారావు, నాయుడు కేసుగురించి చెప్తారు, గిరీశం బుచ్చమ్మను లేవదీసుకుపోయిన విషయం గురించిన చర్చ వస్తుంది. పిల్లవయసు పదహారు లోపని నిరూపించడానికి జాతకం ఇస్తారు. భీమారావు, నాయుడు అగ్నిహోత్రావధాన్లు తమకే వకాల్తి ఇచ్చాడని తామేమాట్లాడాలని వాదించుకుంటారు.జాతకంలోఉన్న సంవత్సరం తప్పని తెలుసుకున్న కలెక్టరు తిడతాడు. ముద్దాయి ఇంటిపేరు, సాకీను లేకుండా అర్జీపెట్టినందుకు కేకలేస్తాడు. ముద్దాయిపేరు గిరీశం అని తప్పతనకింకేమీ తెలియదని అగ్నిహోత్రావధాన్లు చెబుతాడు. డబ్బిస్తే గాని ఇంకమాట్లాడనని భీమారావు అంటే రామప్పంతులు ఎప్పుడోజారుకున్నాడని నాయుడు చెబుతాడు. ఫోర్జరీ కేసుకింద జైలుశిక్ష పడుతుందని నాయుడు అగ్నిహోత్రావధాన్లును బెదిరిస్తాడు.

**3వస్థలం-సౌజన్యారావు పంతులు కచేరిగది :**

సౌజన్యారావు పంతులు పోలిశెట్టిని పిలిపించి లుబ్ధావధాన్లును కాపాడడానికి సాక్ష్యం చెప్పమంటాడు. తాను ఎవరు ఏమిచెప్పినా వింటానని, తనను ఈసాక్ష్యం విషయంలో వదలిపెట్టమని, తన భార్యకు జబ్బుగా ఉందని పోలిశెట్టి వాపోతాడు. పోలిశెట్టి భయపడుతున్నాడనిగ్రహించిన సౌజన్యారావు పంతులు అతడివల్ల ప్రయోజనం ఉండదని పంపించివేస్తాడు.

**4వస్థలం -వీధి :**

భీమారావు వల్ల కేసు పోయిందని, రామప్పంతులు కడియం, కంటె కాజేశాడని, ఫోర్జరీ కేసు లేకుండా చేసినందుకు తనకు సొమ్ముముట్టజెప్పమని నాయుడు అగ్నిహోత్రావధాన్లును అడుగుతాడు. తనవద్ద ఏమీలేదని, ప్రామీసరీనోటు వ్రాయనని, తమ ఊరువస్తే రెండుపుట్లు మిరపకాయలు ఇస్తానంటాడు అవధాన్లు. సౌజన్యారావు పంతులు లుబ్ధావధాన్లుకు సహాయపడుతున్నాడని అందుచేత లుబ్ధావధాన్లుకు శిక్షపడదని చెప్తాడు నాయుడు. అంతలో గిరీశం కనబడతాడు. అగ్నిహోత్రావధాన్లు కాళ్ళుపట్టి లాగి మావగారికి నమస్కారం అంటూ పారిపోతాడు. అగ్నిహోత్రావధాన్లు తిట్లదండకం ప్రారంభిస్తాడు.

**5వస్థలం- లుబ్ధావధాన్లు బస :**

తన వద్దకు వచ్చిన గిరీశంతో అగ్నిహోత్రావధాన్లు కూతుర్ని లేవదీసుకుపోయి తగిన శాస్తి చేశావంటూ లుబ్ధావధాన్లు మెచ్చుకుంటాడు. సౌజన్యారావు పంతులు సలహా చెప్పమని పంపించాడని, తనకు పెంచుకోవలసిందనీ, దత్తతపత్రిక రాయడం మంచిదనీ గిరీశం లుబ్ధావధాన్లుతో అన్నాడు. పంతులుగారు మంచివారనీ, ఆయన చెప్పినట్లు చేస్తాననీ సమాధానం ఇచ్చిన అవధానితో గిరీశం తాను ఉత్తరంలో చెప్పినట్లు చేస్తే అవస్థ ఉండేది కాదని అంటాడు. అంతలో హెడ్ వచ్చి బైరాగి ఎటో వెళ్ళాడని, గుంటూరు శాస్త్రుల విషయం తెలియలేదని అంటే దుకాణదారు తాను సాక్ష్యం చెప్పను అని అంటాడు. అసిరిగాడు వచ్చి తమ ముసల్ది చనిపోయిందని తాను వెళ్ళాలి కాబట్టి సాక్ష్యం చెప్పలేనని అంటాడు. తాను అసిరిగాడిచేత సాక్ష్యం చెప్పిస్తానని గిరీశం అంటాడు. గిరీశాన్ని నమ్ముకోవడం మంచిదని హెడ్ అవధాన్లుకి హితబోధ చేస్తాడు. గవరయ్యవచ్చి మాయలు, మంత్రాలు అని మోసం చేయబోతాడు. గిరీశం అతనిని నమ్మడు. తాను సాక్ష్యం చెప్పనని వెళ్ళిపోతాడు.

**6వస్థలం - సౌజన్యారావు పంతులు ఇల్లు :**

గిరీశం సౌజన్యారావు పంతులుతో మాట్లాడుతూ అబద్ధం ఆడడం పాపమని, తాను అసత్యాన్ని సహించలేనని, గుంటూరు శాస్త్రులు తెలిసే మార్గం చెబితే పట్టుకొస్తానని, తాను సంఘసంస్కరణ కోసమే బుచ్చమ్మను వివాహమాడదలచానని, తనను లుబ్ధావధానులు పెంచుకోక పోయినా బుచ్చమ్మనే పెళ్ళాడుతానని తాను వేశ్యావృత్తికి వ్యతిరేకిని చెబుతుంటాడు. అప్పుడు మారు వేషంలో మధురవాణి

వస్తుంది. ఆమెను చూచి గిరీశం గతుక్కుమంటాడు. ఆమె తానెవరో చెప్పకుండా మనుషుల్లో మంచితనం గురించి ప్రస్తావిస్తే గిరీశం, సౌజన్యారావు పంతులు ఆవిషయం గురించే చర్చ సాగిస్తారు. గిరీశం తనకు తెలుసు అని మధురవాణి చెప్పేసరికి గిరీశం చిన్నగా జారుకుంటాడు. వేశ్యావృత్తి గురించి సౌజన్యారావు మధురవాణి కొంతసేపు సంభాషిస్తారు. వేశ్యలంటే తనకున్న ఏహ్యాభావాన్ని పంతులు వివరిస్తే, వేశ్యల్లో కూడా మంచివాళ్ళు ఉంటారని మధురవాణి వాదిస్తుంది. తను వేశ్యనని, తనకొక ముద్దు అనుగ్రహిస్తే లుబ్ధావధానుల కేసు విషయం చేస్తానని అంటుంది. ముందు కాదన్నా, కేసు కోసం సరే అంటాడు. గుంటూరు శాస్త్రులు అంటే కరటక శాస్త్రి అని, పారిపోయినది అమ్మాయి కాదని, అతడు కరటక శాస్త్రి శిష్యుడని చెప్పి ఎవ్వరికి హాని కలుగకుండా చేయమని మధురవాణి కోరుతుంది. పంతులు అంగీకరిస్తాడు. తన ఫీజు ఇవ్వమని మధురవాణి అడుగుతుంది. వ్రతభంగం అయినా ఇస్తానంటాడు పంతులు. చెడనివారిని చెడగొట్టనని ఆమె నిరాకరిస్తుంది. అక్కడ ఉన్న భగవద్గీతను గురించి అడిగి తెలుసుకుంటుంది. ఆపుస్తకం అడిగి తీసుకుంటుంది. వృత్తిమాని వేస్తానని అప్పుడప్పుడు దర్శనం చేస్తానని చెబుతుంది.

గిరీశం గురించి పంతులు అడిగితే ఉన్న విషయం అంతా చెబుతుంది. బుచ్చమ్మ బ్రతుకు చెడకుండా చేయాలని అనుకున్న పంతులు గిరీశాన్ని పిలిచి బుచ్చమ్మకు చదువు చెప్పిస్తానని, అతని ప్రవర్తన మార్చుకుంటే చదివిస్తానని అంటాడు. మధురవాణి బుచ్చమ్మను కాపాడి మహోపకారం చేసింది కనుక ఆమెకు షేక్‌హాండ్ ఇచ్చి గిరీశాన్ని, వెళ్ళిపొమ్మంటాడు.

"డామిట్! కథ అడ్డంగా తిరిగింది" అంటూ గిరీశం వెళ్ళిపోతాడు.

**డా॥ కందిమల్ల సాంబశివరావు**, ఎం.ఏ, పిహెచ్.డి.
రీడర్ మరియు తెలుగు శాఖాధ్యక్షుడు
ఆర్.ఎన్.ఎస్.సి.వి.ఎస్.కళాశాల
చిలకలూరి పేట, గుంటూరు జిల్లా.

రెండోభాగం - నాటకం

# కన్యాశుల్కం నాటకం - గురజాడ అప్పారావు

## పాఠం-16

**2..16.0 :** కన్యాశుల్కంలోని ప్రధాన పాత్రలు

**2..16.1 :** అప్రధాన పాత్రల ప్రాముఖ్యం

**2..16.2 :** సందర్భ సహిత వ్యాఖ్యలు

### 2.16.0 : కన్యాశుల్కంలోని ప్రధాన పాత్రలు :

నాటకమంటే కేవలం మాటలు కాదు. అందులోని పాత్రలూ వారి భావాలు., ప్రభావం మంచిచెడూ., యుక్తి కుయుక్తి మాటకారితనం, లోభితనం, ఇలా ఎన్నోగుణాల సమ్మేళనం. కన్యాశుల్కం నాటకాన్ని చిరంజీవిగా చేసిన ముఖ్య హేతువుల్లో పాత్రచిత్రణ బలీయమైనది. కన్యాశుల్కంలోని ప్రతిపాత్ర ఒక దృక్పథానికి ప్రతినిధి. ఒక వ్యవస్థకు, అవ్యవస్థకు ప్రతినాధులు. పాత్రలన్నీ జీవశక్తితో మన కళ్లెదుట ప్రత్యక్షమౌతాయి. ప్రతిపాత్ర మన చెట్టూ వున్న మనుషుల రూపంలో ప్రత్యక్షమౌతుంది. ఒక్కొక్క సందర్భంలో ఆ పాత్ర లక్షణం మనలోనూ కనిపిస్తుంది. భుజాలు తడుముకోవడం మన వంతు. ఏ మనిషీ మంచివాడు కాదు. అలాగని చెడ్డవాడూ కాదు. చేదు అనుభవమూ., ఎదురైన ఆటుపోట్లు ఒక మనిషిలో పంతాన్ని రేపి చెడువైపు నడిపిస్తే., అనుభవాల పాఠాలు చదివి., తీపి జ్ఞాపకాలతో మంచివారుగా చక్కబడతారు. ఒక రచన ద్వారా మానవ సంస్కారాన్ని పెంపొందించడానికి రెండుపద్ధతులు కనిపిస్తాయి. ఆదర్శవంతులైన వారిని ప్రధానపాత్రలుగా స్వీకరించి ఒక ఆశయం కోసం ఆదర్శం కోసం వారు చేసే ఘనకార్యాలూ., త్యాగాలనూ కథావస్తువుగా తీసుకోవడం ఒక పద్ధతి. సాదాసీదా మనుషులు ; సర్వసాధారణమైన సంఘటనలు; మామూలు పరిస్థితిలోనే మనిషి చేసే తప్పులు, ఒప్పులు., వాటి ప్రభావంతో ఇతరులు గిలగిలా కొట్టుకోవడం దరిమిలా మానవ జీవితం తిరిగే మలుపులను తెలియజేసేది రెండవ పద్ధతి. గురజాడ రెండవ పద్ధతినే ఎన్నుకొని సాధారణమైన నాటక ఫలితాన్ని రాబట్టారు.

### కన్యాశుల్కంలోని పాత్రలు :

| పురుషపాత్రలు | స్త్రీ పాత్రలు |
|---|---|
| అగ్నిహోత్రావధానులు | వెంకమ్మ |
| వెంకటేశం | బుచ్చమ్మ |
| కరటక శాస్త్రి | మీనాక్షి |
| కరటక శాస్త్రి శిష్యుడు | మధురవాణి |
| లుబ్ధావధాన్లు | |
| రామప్పంతులు | |
| గిరీశం | |
| సౌజన్యారావుపంతులు | |
| భీమారావు పంతులు | |
| నాయుడు | |
| పూజారిగవరయ్య | |

వీరితోపాటు డిప్టీకలెక్టర్, హెడ్‌కనిస్టేబు, పోలిశెట్టి సిద్ధాంతి, బైరాగి, దుకాణుదారు, గ్రామమునసబ్, హవల్దారు, యోగిని

లుబ్ధావధానుల నౌకరు, అసిరిగాడు, మనవాళ్ళ, వీరేశ మొదలైన వారు

## ప్రధాన పాత్రలు :

గిరీశం : లుబ్ధావధానుల పినతల్లి కొడుకు, దురాచారి, స్త్రీలోలుడు, వేశ్యాలంపటత్వం కలవాడు, అనర్గళంగా ఇంగ్లీషు ధారాళంగా తెలుగు మాట్లాడగల వాక్చాతుర్యం కలవాడు. ఎప్పటికి ఏది ప్రస్తుతమో దానికి అనుగుణంగా మాట్లాడగల సమయస్ఫూర్తి ఇతని సొత్తు. స్త్రీ లోలత్వానికి ఎక్కడి డబ్బూ చాలదు. పూటకూళ్లమ్మను మాయచేసి డాన్సింగ్ గర్ల్ క్రింద ఖర్చు చేస్తాడు. మొఖం చాటువేయడానికి వెంకటేశానికి వేసవిలో చదువు చెప్పే మిషతో కృష్ణరాయపురం చేరుకొంటాడు. వెంకటేశం అక్క బుచ్చమ్మను ఒక పథకం ప్రకారం లొంగదీసుకుంటాడు. ఒకపక్క మధురవాణితో స్నేహం కొనసాగిస్తుంటాడు. లుబ్ధావధాన్లుకు మాయమాటలు చెప్పి ఆస్తిని తనపేరు వ్రాయించుకోవడానికి ప్రయత్నిస్తాడు. బుచ్చమ్మని తీసుకొని వెళతాడు. నెపోలియన్ ఆఫ్‌యాంటీనాచ్‌గా పోజుపెట్టి సౌజన్యారావు పంతుల మెప్పును పొందుతాడు. మధురవాణి గిరీశం నిజస్వరూపాలన్ని బట్టబయలు చేయడంతో సౌజన్యారావు గిరీశాన్ని గెంటివేస్తాడు. తన బండారం బట్టబయలు కావడంతో డామిట్ కథ అడ్డం తిరిగింది అంటూ మరో మజిలీకి ప్రయాణం కడతాడు.

రామప్పంతులు:- రామచంద్రాపుర అగ్రహారం కరణం. లౌక్యం ఇతని నరనరాల్లో జీర్ణించుకొనిపోయింది. దొంగ సాక్ష్యాలు, ఫోర్జరీలు, జాతాకాల బనాయింపులు, డామేజీ దావాలు, పెళ్లిబేరాలు, కమీషన్లు ఇతని ప్రవృత్తి. కుటిలుడు, ద్రోహబుద్ధికలవాడు. నక్కజిత్తులతో ఎత్తుకుపై ఎత్తులు వేస్తూ తాను చిత్తవుతూ ఉంటాడు. గిరీశం మాటల్లో చెప్పాలంటే గుంటనక్క. అటకల మీద మోపులు తాటాకులు, రకరకాల సిరాలు, బుర్రలో మోసకారిత్వంతో దొంగ పిటీషన్లు పెట్టడం ఇతని నైజం. మధురవాణిని తెచ్చి రామచంద్రాపురంలో ఒక చోట ఉంచుతాడు. వయసుమళ్లినా మీసాలకు రంగువేసుకొని లేని ఆడంబరాలతో డంబాలు పలికే విలాసపురుషుడు. గొడవలు సృష్టించడం వరకే తెలిసిన రామప్పంతులు అది అటుతిరిగి యిటుతిరిగి తనపీకలమీదకు వచ్చినపుడు పిరికిపందలా ఉడాయిస్తాడు. లుబ్ధావధానులు విధవాకుమార్తె మీనాక్షితో సరససల్లాపాలు చేస్తూ ఆమెను మోసం చేస్తుంటాడు. అబద్ధపు సాక్ష్యం చెప్పబోయి సౌజన్యారావు పంతులు చేత పరాభవం పొందుతాడు.

## అగ్నిహోత్రావధానులు :

అతికోపిష్ఠి: ఎదుటివారిని లక్ష్యపెట్టక తనమాట చెల్లించుకోవాలనే మొండి పట్టుదల కలవాడు. ఇంగ్లీషు చదువులు చదివితే ప్రాణం మీదకు అపాయం ముంచుకువస్తుందని ఇతని గుడ్డి నమ్మకం. కొడుకు చదువు కొంపగుండమై పోతుందని భార్యపై దుర్వాసునిలా నిప్పులు కక్కుతాడు. ఆడపడుచులను అమ్ముకోవడం శిష్టాచారమని ఇతని వాదం. సంఘసంస్కరణ ఇతనికి పీడకల. చిన్నపిల్లలను పెద్దవాళ్లకు కట్టబెట్టకపోతే శుల్కము లభించదు. కాబట్టి సుబ్బిని 1800వందలకు అమ్మివేయడానికి నిర్ణయించాడు. ఎవరైనా సలహా యిస్తే చెడతిట్లు తిడతాడు. బుచ్చమ్మ లేచిపోయిందని బాధపడటం మానివేసి తిట్లపురాణం చదువుతాడు. తాను పట్టిన కుందేటికి మూడేకాళ్లని బల్లగుద్ది వాదిస్తాడు. భార్యతో చెప్పకుండా సుబ్బిపెళ్ళిని ఖాయం చేయడంతో, భార్య గొడవ చేయడంతో 'తాంబూలాలిచ్చాను తన్నుకు చావండి' అంటూ కేకలు వేస్తాడు. లుబ్ధావధానులపై దావావేసి ఫకీరైపోయాడు. తాను దావాలో ఓడిపోయినా లుబ్ధావధానులకు శిక్షపడలేదని కుమిలిపోతాడు. పూర్వాచారాలు ఊబిలో బిగుసుకొని అందులోనే సుఖం ఉందనుకొనే ఛాందసుడు.

## లుబ్ధావధానులు :

సార్థక నామధేయుడు లుబ్ధావధానులు డబ్బు అయాచితంగా వస్తుందంటే చావడానికైనా సిద్ధం. కాటికి కాళ్లు చాపిన వృద్ధుడు. ఈ లోభితనాన్ని ఆసరాగా చేసుకొని లుబ్ధావధాన్లని రామప్పంతులు పెళ్లికి ప్రోత్సహిస్తాడు. జాతకరీత్యా వల్లమాలిన ధనం వస్తుందని ఆశపెడతాడు. పెళ్లి చేసుకోకపోతే మారకమో (అంటుకొనెడి చెడ్డ వ్యాధి) ధననష్టమో వస్తుందని తాను తయారుచేసిన జ్యోతిష్యుల చేత రామప్పంతులు చెప్పిస్తాడు. దీనితో లుబ్ధావధానులు పెళ్లికి సిద్ధమయ్యాడు. ఇదే ఇతని కొంపముంచి ఖూనీకేసు మెడకు చుట్టుకుంటుంది. సౌజన్యారావు పంతులు మూలంగా చావుతప్పి కన్నులొట్టబోయి బ్రతుకుజీవుడా అంటూ ఈ జంఝాటం నుంచి బైటపడతాననే అంత

దురదృష్టవంతుడు లోకంలో ఎవరూ లేడు. తప్పంతా నాయందుంచుకొని విధిని నిందించడం ఎందుకు. డబ్బుకు లొభపడి ఒక్కగానొక్క కూతుర్ని ముసలాడికమ్మాను. నాజీవానానికి ఉసూరంటూ అది కాని తిరుగుళ్లు తిరిగిందంటే దాని తప్పా! బుద్ధితక్కువ వెధవని. ముసలితనంలో నాకు పెళ్లేమిటి, ఆ మాయగుంట పారిపోవడమేమిటి. ఆ ఇనసపెకటరు ఖూనీ చేశామని మమ్ములను సలపెట్టడమేమిటి. అంతా ఘోరకలి. ఏమి చిత్రాలు. వెధవలకు మఠం కట్టారట. ఎన్నడూవినలేదు అమ్మని వెళ్లి ఆ మఠం చూడమంటాను. దానికి ఇష్టం కలిగిందా దానికి కావలసిన డబ్బు ఇస్తాను అంటూ చిట్టచివరకు తన ఛాందసపు కల్మషంలో నుంచి వెలుపలికి వస్తాడు.

## సౌజన్యరావు పంతులు

సౌజన్యారావు విశాఖపట్టణంలో పేరు ప్రఖ్యాతులున్న ప్లీడరు. సత్యంవద ధర్మంచర అనే సూక్తిని అక్షరాలా ఆచరణలోపెట్టే దయాగుణ సంపన్నుడు. సంఘసంస్కరణాభిలాషి పరోపకారపరాయణుడు. యాంటీనాచ్‌గా ధృఢమైన దీక్షకలవాడు. వేశ్యలను అసహ్యించుకొనే సౌజన్యారావు మధురవాణి ఉన్నత వ్యక్తిత్వాన్ని గుర్తించి ఆమెను యథోచితంగా గౌరవించి భగవద్గీతను బహుమతిగా ఇస్తాడు. లుబ్ధావధానులపై వచ్చిన ఖూనీకేసు అబద్ధమని తెలుసుకొని దానినుంచి అవధానిని తప్పించడానికి శాయశక్తులా కృషి చేస్తాడు. భగవద్గీతలోని శ్రీకృష్ణభగవానుని ఉపదేశము ఇతని లక్ష్యము. సౌజన్యారావు మంచికి మారు పేరు. మానవాళికి మరోపేరన్న సార్థక నామధేయుడు.

## మధురవాణి:

వేశ్యావృత్తితో శరీరం మాలిన్యమైనా మనసుకు ఎటువంటి మలినం అంటని మంచితనం. మానవత్వం ఉన్న మంచిమనిషి మధురవాణి. సంగీత సాహిత్యాలలో అందెవేసిన చేయి. గిరీశం వద్ద ఇంగ్లీషు నేర్చుకుంటుంది. కొన్నాళ్లు అతని ప్రాపకంలో ఉన్న రాయప్పంతుల మాయలోపడి రామచంద్రాపురం చేరుకొంటుంది. తనతెలివితేటలు రామచంద్రాపురంలో ఆడవిగాచిన వెన్నెలవలె వృథాగా పోతున్నట్లు బాధపడుతున్న సమయంలో కరటకశాస్త్రికి తోడుగా మాయవివాహానికి సూత్రధారిగా వ్యవహరిస్తుంది. క్రమంగా మధురవాణి తన వృత్తిలోని హీనత్వాన్ని గుర్తిస్తుంది. స్త్రీ జీవితం పరిపూర్ణత చెందడానికి డబ్బు, వేశ్యావృత్తి కారణాలు కాజాలవని జ్ఞానోదయం చెంది సౌజన్యారావు వద్ద గిరీశం మోసకారిత్వాన్ని బట్టబయలు చేస్తుంది. వేశ్యజాతి చెడ్డదేకాని తాము సెలవిచ్చినట్లు చెడ్డలో మంచి ఉండకూడదా అని సౌజన్యారావును ప్రశ్నిస్తుంది. మధురవాణి వేశ్య అయినా ఆమెది సరళస్వభావం. నిర్మలమైన అంతఃకరణ, పరోపకారబుద్ధి, నిస్వార్థతా, కొంపలు కూలదోసే గాలివానలో కూడా ముచ్చటగా నాట్యంచేసే విలక్షణ స్వభావమూ తన చతురతతో ఎంతటి ప్రళయాగ్నినైనా వారించే ధీమా, ముగ్ధమనోహరమైన అమాయకత్వం ఆమె స్వభావం.

## 12.16.1 అప్రధాన పాత్రల ప్రాముఖ్యం :

### కరకటశాస్త్రి:-

కరకట శాస్త్రి మంచిపండితుడు. గొప్ప లోకజ్ఞానం ఉన్నవాడు. రామప్పంతులు సహాయంతో మాయసుబ్బిని లుబ్ధావధానులకు అంటగట్టి ఆఖరికి రామప్పంతులుకి టోపీవేసి ఆయన ఊళ్లోలేని సమయంలో ముహుర్తాన్ని ఎనిమిది ఘడియలు ముందుకు లాగించి పెళ్లి అయిందనిపించి డబ్బుతో అగ్రహారానికి ఉడాయిస్తాడు. విజయనగరంలో సంస్కృత నాటకాలు వేసే అనుభవంతో తను గుంటూరు శాస్త్రులై శిష్యుడు మహేశాన్ని మాయసుబ్బిగా చేసి నాటకం నడిపిస్తాడు. అభం శుభం తెలియని తన మేనకోడలిని పెళ్లితప్పించడం ఇతని ఉద్దేశం. ఈ వ్యూహరచనలో మధురవాణి సహాయసహకారాలను స్వీకరిస్తాడు.

### వెంకటేశం

వెంకటేశం అగ్నిహోత్రావధానుల కుమారుడు. మందమతి తెలివితేటలు పూజ్యం. ఒక్కొక్క క్లాసులో మూడేళ్లకుపైగా బైఠాయించే మొద్దబ్బాయి. ఎంతసేపూ తిండియావ. చేగోడీలు, పులుసటుకులు, గేదెపెరుగు, జామపళ్లు వీటితో పొద్దుపుచ్చేవాడు. గిరీశం పుణ్యామా

అని చుట్ట అలవాటు చేసుకొన్నాడు. గిరీశం ఎలా చెబితే గొఱ్ఱెలాగా తల ఊపడమేగానీ స్వతహాగా తెలివితేటలు లేవు. పెళ్లికి ఏనుగులు, గుఱ్ఱాలతో దర్జాగా వెలుతున్నప్పుడు వెంకటేశాన్ని బుచ్చమ్మను ఒక బండిలో కూర్చోబెడతారు. దారిలో బుచ్చమ్మను తీసుకొనిపోవాలనే ఎత్తుగడతో గిరీశం వెంకటేశాన్ని ఏనుగు ఎక్కిస్తాడు. ఏనుగెక్కిన సరదాయే కానీ అక్క బాధ రవ్వంతలేదు. తెల్లవారాక తండ్రిచేత చావుదెబ్బలు తింటాడు.

## వెంకమ్మ:-

వెంకమ్మ అగ్నిహోత్రావధానుల భార్య. కరటకశాస్త్రికి స్వయనా తోడబుట్టిన చెల్లెలు. బాల్య వివాహాలకు విరుద్ధం. ధనాశతో చిన్నపిల్లలను ముసలివాళ్లకు యిచ్చి పెళ్లిచేయడం అమానుషమని పెద్దకూతురు బుచ్చమ్మను చూసి అనుభవపూర్వకంగా తెలుసుకొంటుంది. తన రెండవ కుమార్తె సుబ్బమ్మను లుబ్ధావధానులుకు ఇచ్చి పెళ్లిచేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. కొడుకు వెంకటేశానికి పెళ్లిచేయడానికి పుట్టింటి వారిచ్చిన తన పొలాన్ని అమ్మివేయమని గొడవపెడుతుంది. భర్త మూర్ఖత్వాన్ని భరించలేక నిస్సహాయంగా నూతిలో దూకి ఆత్మహత్యకు పాల్పడుతుంది. గిరీశం ఆమెను రక్షిస్తాడు.

## మీనాక్షి:

పరమలుబ్ధాగ్రేశ్వర చక్రవర్తి అయిన లుబ్ధావధానుల కుమార్తె మీనాక్షి. బాల్యవితంతవు, తనకు సౌఖ్యాలను రుచిచూపించిన రామప్పంతులను వివాహమాడి జీవితం గడపాలని కలలుకంటుంది. రాత్రిపూట దొంగతనంగా వచ్చిన రామప్పంతులు తనను ముద్దుపెట్టుకొని పెళ్లాడతానని చెప్పినా అతనిని పూర్తిగా విశ్వసించక దీపం ఆర్పి ప్రమాణం చేయమంటుంది. దీనితో తన కష్టాలన్ని గట్టెక్కాయని భ్రమించిన మీనాక్షి మధురవాణితో నిన్నువదిలేసి నన్ను రాజమహేంద్రవరం తీసుకుపోయి పెళ్లాడతానన్నాడు. దీపమార్పి ప్రమాణం కూడా చేశాడు అన్న అమాయకురాలు. కన్యాశుల్క వ్యవస్థకు తన జీవితాన్ని నైవేద్యంగా అర్పించుకొని తెల్లనివన్నీ పాలు నల్లనివన్నీ నీళ్లు అని నమ్మే అమాయకురాలు.

## బుచ్చమ్మ:-

బాల్యవితంతువులకు సంఘం నిర్దేశించిన అన్ని పనులనూ తలవంచుకొని గొడ్డుచాకిరి చేసే అభాగ్యురాలు బుచ్చమ్మ. మినప్పప్పురుబ్బడం, నీరుతోడడం, విస్తళ్లు కుట్టడం వంటివి ఆమె దినచర్యలో భాగాలు. అగ్నిహోత్రావధానుల పెద్దకుమార్తె. తమ్ముడికి పెళ్లిచేయాలంటే నాడబ్బు ఇచ్చివేయండి. కానీ సుబ్బిబ్రతుకును బుగ్గిపాలు చేయవద్దని తండ్రిని ప్రాధేయపడుతుంది. తండ్రి ధనలోభ పిశాచానికి తనలాగే తనచెల్లిలి బ్రతుకు అడవిగాచిన వెన్నెల కాకూడదని ఈపెళ్లి తప్పించే ఉపాయాన్ని చెప్పమని గిరీశాన్ని ప్రాధేయపడుతుంది. గిరీశం మాయమాటలునమ్మి అతనితో వెళ్లిపోతుంది. సౌజన్యారావు పంతులు మూలంగా గిరీశం వలలో నుండి తప్పించుకొంటుంది.

## 2.16.2 సందర్భసహితవ్యాఖ్యలు - ప్రథమాంకము :

**1. నాతో మాట్లాడటమే ఒక ఎడ్యుకేషన్ !**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావు గారు రచించిన కన్యాశుల్కం నాటకంలోని ప్రథమాంకం నుంచి గ్రహింపబడింది.

**సందర్భం:-** పరీక్షలో తప్పిపోయిన వెంకటేశం గిరీశం వద్దకు వెళ్లాడు. గిరీశం వెంకటేశం పరీక్షలో తప్పినట్లు గ్రహించి అతడ్ని ఓదారుస్తూ మాటాడిన సందర్భంలోనిది.

**వివరణ:-** పరీక్షలో తప్పినపోయిన వెంకటేశం గిరీశం వద్దకు వెళ్లాడు. గిరీశం వెంకటేశాన్ని ఓదార్చి తనవైపు తిప్పుకోవాలని భావించాడు. "మీ మాష్టారే నిన్ను ఫెయిల్ చేశాడు. లేకపోతే మళ్ళీ ఫెయిలయ్యేవాడివికాదు. అతనికి నాకు కొంతకాలంగా విరోధం

వుంది. ఆయన చెప్పేదంత తప్పులు తడక. ఆ విషయాన్నే నేను పత్రికల ద్వారా విమర్శించాను. అప్పటి నుండి ఆయనకు నేనంటే కడుపుమంట. అందుకే నాశిష్యుడవైన నిన్ను పరీక్ష తప్పించాడు. ఇకనైనా నిజం తెలుసుకో. నన్ను విమర్శించటం మానుకో. నిజం ఆలోచిస్తే నాతో మాట్లాడటమే ఒక ఎడ్యుకేషన్ ఈ విషయాన్ని గ్రహించు అని గిరీశం వెంకటేశంతో చెప్పాడు.

**2. పొగతాగనివాడు దున్నపోతైపుట్టున్ !**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావు గారు రచించిన కన్యాశుల్కం నాటకంలోని ప్రథమాంకం నుంచి గ్రహింపబడింది.

**సందర్భం:-** పొగ తాగడం యొక్క ఆవశ్యకాన్ని వివరిస్తూ గిరీశం వెంకటేశంతో చెప్పిన సందర్భంలోనిది.

**వివరణ:-** మనవాళ్ళు ఉత్తవెధవాయలోయ్. చుట్టనేర్పినందుకు థాంక్ చేయక తప్పుపడుతున్నావ్. చుట్టకాల్చడం యొక్క మజా నీకు ఇంకా బోధపడక పోవడం చాలా ఆశ్చర్యంగా వుంది. చుట్టకాల్చబట్టేకదా దొరలంత గొప్పవాళ్ళు అయ్యారు. చుట్ట పంపిణీ మీదనే స్టీముయంత్రం వగైరా తెల్లవాడు కనిపెట్టాడు. గరుత్మంతుడు అమృతాన్ని తెస్తున్నప్పుడు అది భుగభుగమండి ఒకచుక్క భూమిమీద పడింది. అది పొగచెట్టుగా జన్మించింది. కావున అమృతము వంటి ఆ చుట్టకాల్చనివాడు మరుజన్మలో దున్నపోతుగా జన్మిస్తాడు. ఈ విషయం బృహన్నారదీయం నాలుగో ఆశ్వాసంలో స్పష్టంగా వుంది. చుట్టకాల్చడంలో ఎటువంటి తప్పులేదని గిరీశం వెంకటేశంతో పెద్ద లెక్చరిచ్చాడు.

**3. మాటల్లో కార్యం లేదు.**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావు గారు రచించిన కన్యాశుల్కం నాటకంలోని ప్రథమాంకం నుంచి గ్రహింపబడినది.

**సందర్భం:-** రామప్పంతులు గారి బంట్రోతు గిరీశం దగ్గరికి బాకీవసూలు కోసం వచ్చి, వాని బడాయి మాటల్ని విమర్శించిన సందర్భంలోనిది.

**వివరణ:-** రామప్పంతులు తన బాకీ వసూలు నిమిత్తం ఒక బంట్రోతును గిరీశం వద్దకు పంపాడు. బంట్రోతు గిరీశాన్ని గట్టిగా డబ్బుల్ని గూర్చి ప్రశ్నించాడు. రేపు ఉదయం పూటకుళ్లమ్మ ఇంటికి వస్తే అణాపైసల్తో చెల్లిస్తాను. మీ పంతులు గార్కి స్నేహం, మంచిచెడులు అక్కర్లేదా' అని గిరీశం ప్రశ్నించగా 'మాటల్లో మజాయే గాని చేతుల్లో నిజంలేదు' అని బంట్రోతు పలికాడు.

**4. ఇటుపైని మీతోవ మీది వాతోవ వాది.**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావుగారు రచించిన కన్యాశుల్కం నాటకంలోని ప్రథమాంకం నుంచి గ్రహింపబడినది.

**సందర్భం:-** రామప్పంతులు మధురవాణిని ఉంచుకోవటానికి సిద్ధపడి, తన ఉద్దేశాన్ని చెప్పినపుడు ఆమె తన ఇబ్బందుల్ని తెలియజేసిన సందర్భంలోనిది.

**వివరణ:-** రామప్పంతులు మధురవాణిని ఉంచుకోవటానికి సిద్ధపడ్డాడు. అయితే ఆయన చులకనగా మాట్లాడటం మాత్రం సహించలేకపోయింది. 'వేశ్య అంటే అంత చులకనా! సానిదానికి మాత్రం నీతినియమాలు ఉండవా? అని పంతులుగార్ని పిలిచి 'అయ్యా యికనుండి నీదారినీది నాదారినాది' అనే చెప్పేదాకా నేను పరాధీనురాలనే. మీరు చెప్పినట్లే గిరీశం ఎటువంటి వాడైతే నాకేమి? నన్ను చక్కగా పోషిస్తున్నాడు. మీరు కూడా గొప్పరసికులే! నామనస్సును ఆకర్షించిన వారే. అయినా నాకు మాత్రం ఆయన మీద విశ్వాసం తగ్గలేదు అని మధురవాణి రామప్పంతుల్తో పల్కింది.

**5. నేను డబ్బు కక్కుర్తి మనిషినికాను !**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావుగారిచే రచించబడిన కన్యాశుల్కం నాటకంలోని ప్రథమాంకం నుంచి గ్రహింపబడినది.

సందర్భం:- గిరీశం నుంచి విడాకులు తీసుకోవటానికి మధురవాణికి 200/-లు ఇస్తూ రామప్పంతులు ఆమెచేతిని గట్టిగా పట్టుకొని లాగినపుడు ఆమె కోపాన్ని ప్రదర్శించిన సందర్భంలోనిది.

వివరణ:- రామప్పంతులు మధురవాణిని ఉంచుకోటానికి సిద్ధపడ్డాడు. గిరీశం నుంచి తెగతెంపులు చేసికోవటానికి 200/-లు కూడా ఇచ్చి, ఆమె చేతిని గట్టిగా పట్టుకొని లాగాడు. మధురవాణి కోపంతో చేతిని విదిలించుకొని అతని నోట్లుదూరంగా పారేసి 'మీతో కాలక్షేపం చేయటం చాలాకష్టం. ఒక స్థిరమైన నిర్ణయం మీద ఉండరు. అటువంటి నిన్ను ఎలా నమ్మాలి. నేను మనస్ఫూర్తిగా నిన్ను నమ్మాను కాబట్టి నీతో రావటానికి సిద్ధపడ్డాను. ఇంతటి రసికులైవుండి కూడా నన్ను అర్థం చేసుకోలేకపోయారు. మీ నోట్లు మీవద్దే వుంచండి. నేను డబ్బు కక్కుర్తి మనిషిని కాను' అని పలికింది.

**6. సానివాళ్లకి కర్ణ పిశాచి వుంటుంది కాబోలు !**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావుగారిచే రచించబడిన కన్యాశుల్కం నాటకంలోని ప్రథమాంకం నుంచి గ్రహింపబడినది.

**సందర్భం:-** తాను ఊరొదిలి వెళ్లే విషయాన్ని మధురవాణి గ్రహించిందని భ్రమించిన గిరీశం తనలోతాను అనుకొన్న సందర్భంలోనిది.

**వివరణ:-** గిరీశం మధురవాణి ఇంటికి వచ్చి ప్రేమతో ఆమె భుజాన్ని పట్టుకోబోయాడు. ఆమె అక్కడనుంచి దూరంగా తొలగిపోయింది. గిరీశం అందుకు కారణాన్ని ప్రశ్నించాడు. 'ఇది ఆఖరు వికారం' అని ఆమె జవాబిచ్చింది. అప్పుడు గిరీశం 'నేను ఉడాయిస్తానని దీనికెలాతెల్సింది? సానివాళ్లకి కర్ణపిశాచి వుంటుంది కాబోలు. అని అనుకున్నాడు.

**7. వెధవముండకి పాతివ్రత్యం అన్నమాట!**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావుగారిచే రచించబడిన కన్యాశుల్కం నాటకంలోని ప్రథమాంకం నుంచి గ్రహింపబడినది.

**సందర్భం:-** 'పూటకూళ్లమ్మ యోగ్యురాలు, ఉత్తమ పతివ్రత' అని గిరీశం పొగిడినపుడు మధురవాణి ఆ మాటల్ని భరింపలేక బదులు పల్కిన సందర్భంలోనిది.

**వివరణ:-** మధురవాణి పూటకూళ్లమ్మను నిందించింది. గిరీశం ఆమాటల్ని వినలేకపోయాడు. 'సీదుర్మార్గం కూతలు ఆమె చెవినబడితే చాలా బాధపడుతుంది. ఆ పాపమంతా నిన్నే చుట్టుకుంటుంది. ఆమె యోగ్యురాలు ఉత్తమ పతివ్రత అని పొగడగా వెధవముండకి పాతివ్రత్యమన్నమాట ఈనాడే విన్నాను' అని మధురవాణి తిరస్కారంగా పలికింది.

## ద్వితీయాంకం :

**8. పుచ్చకాయలు దొంగంటే బుజాల్తడుముకున్నట్లు !**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావుగారు రచించిన 'కన్యాశుల్కం' నాటకం ద్వితీయాంకంలోనిది.

**సందర్భం:-** గిరీశాన్ని చులకనగా చూచిన అగ్నిహోత్రావధాన్లతో కరటకశాస్త్రి మాట్లాడిన సందర్భంలోనిది.

**వివరణ:-** వెంకమ్మ పట్నం నుంచి వచ్చిన కొడుకును చూసుకొని మురిసిపోయింది. 'ఈ సారైనా పాసయ్యావా' అని అగ్నిహోత్రావధాన్లు కొడుకును ప్రశ్నించాడు. వెంకటేశం తెల్లమొగం వేశాడు. 'వెంకటేశం ఫస్టుక్లాసుతో పాసయ్యాడు. వాడికి నేనే చక్కగా కష్టపడి చదువు చెప్పాను' అని గిరీశం చెప్పాడు. అగ్నిహోత్రావధాన్లు గిరీశాన్ని చులకనగా మాట్లాడాడు. గిరీశం చదువుచెప్పిన

మాష్టారని వెంకటేశం తల్లికి చెప్పాడు. అప్పుడు కరటకశాస్త్రి 'పెద్ద మనిషి ఇంటికి వస్తే ఇంతేనా మాట్లాడేది. ఆయన కుర్రవాడితో ఇంగ్లీషులో మాట్లాడుతూ వుంటే పుచ్చకాయలదొంగంటే భుజాలు తడుముకున్నట్లుగా నామీద పెట్టుకుంటావేమి'? అని అగ్నిహోత్రావధాన్లతో అన్నాడు.

**9. ఇదంతా టోపీ వ్యవహారంగా కనబడుతుంది.**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావుగారు రచించిన 'కన్యాశుల్కం' నాటకం ద్వితీయాంకంలోనిది.

**సందర్భం:-** అగ్నిహోత్రావధాన్లు గిరీశం మాటల్ని, చేతల్ని, ప్రవర్తన్ని సందేహించి, ఊళ్లో నుంచి పంపాలని భావించి వెంకమ్మ, కరటకశాస్త్రుల్తో మాట్లాడిన సందర్భంలోనిది.

**వివరణ:-** అగ్నిహోత్రావధాన్లు గిరీశాన్ని సందేహించాడు. అతణ్ని ఊళ్లో నుంచి పంపేయాలని భావించాడు. కాని వెంకమ్మ గిరీశాన్ని ఇంట్లోనే పెట్టుకొని కొడుక్కి బాగా చదువు చెప్పించుకోవాలనుకుంది. గిరీశం కూడా మూడేళ్లలో వెంకటేశాన్ని పోలీసు పరీక్ష పాసయ్యేలా చేస్తానని వాగ్దానం చేశాడు. 'సంవత్సరానికి పుస్తకాల ఖర్చు ఎంతవుతుంది అని అగ్నిహోత్రావధాన్లు కొడుకును అడిగాడు. పదిహేను రూపాయలవుతుందని వెంకటేశం చెప్పాడు. అప్పుడు అగ్నిహోత్రావధాన్లు అగ్గిమీదగుగ్గిలమై 'నేను చిల్లిగవ్వకూడ యివ్వను. వీళ్ళిద్దరూ ఆడబ్బులు పంచుకొని తినేటట్లు కనపడుతుంది. ఇదంతా టోపీ వ్యవహారంలాగుంది' అని వెంకమ్మ కరటకశాస్త్రుల్తో అన్నాడు.

**10. పడుపడు అన్న నానవితేగాని పడ్డనానవితి లేదంది.**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావుగారు రచించిన కన్యాశుల్కం నాటకం ద్వితీయాంకంలోనిది.

**సందర్భం:-** అగ్నిహోత్రావధాన్లు తన రెండవకూతురైన సుబ్బమ్మను లుబ్ధావధాన్లకిచ్చి పెండ్లిచేయాలని నిశ్చయించినట్లు వెంకమ్మకు చెప్పాడు. ఆమె అందుకు అంగీకరించలేదు. ఈపెళ్ళి జరిగితే నుయ్యో, గొయ్యో చూసుకుంటానని కూడా హెచ్చరించింది. ఈ విషయాన్నంతటిని వెంకటేశం గిరీశంతో చెప్పే సందర్భంలోనిది.

**వివరణ:-** అగ్నిహోత్రావధాన్లు తన రెండువకూతురైన సుబ్బమ్మను లుబ్ధావధాన్లకిచ్చి పెండ్లిచేయాలనుకున్నాడు. ఆ విషయాన్ని భార్యతో చెప్పాడు. ఆమె తనకు ఇష్టంలేదని చెప్పింది. ఈపెళ్ళి జరిగితే ఏనుయ్యో, గొయ్యో చూసుకుంటానని కూడా సోదరుడైన కరటకశాస్త్రితో హెచ్చరించింది. వెంకటేశం ఈవిషయాన్ని గిరీశానికి చెప్పాడు. అప్పుడు 'పడుపడు అనే సవితేగాని పడ్డనాసవితిలేదు' అని ఒకామె అంది యీవ్యవహారం కూడా అలాగే వుంది'అని వెంకటేశంతో చెప్పాడు.

**11. పెద్దమనుషుల్తో వ్యవహారం మాట్లాడుతూవుంటే రామాయణంలో పిడకల వేట్లాటలాగా అదే పిలవడమా ?**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావుగారిచే రచింపబడిన కన్యాశుల్కం నాటకం ద్వితీయాంకంలోనిది.

**సందర్భం:-** అగ్నిహోత్రావధాన్లు రామావధాన్లతో తనకు ఏర్పడిన గోడ తగాదా గురించి గిరీశంతో చెప్పే సమయంలో అక్కడకు వచ్చిన బుచ్చమ్మను అగ్నిహోత్రావధాన్లు కసురుకొన్న సందర్భంలోనిది.

**వివరణ:-** అగ్నిహోత్రావధాన్లు తనకు లుబ్ధావధాన్లతో వచ్చిన గోడ తగాదా గురించి గిరీశానికి చెప్తున్నాడు. అప్పుడు ఆయన కూతురైన బుచ్చమ్మ అక్కడకువచ్చి తల్లిస్నానం చెయ్యమన్నట్లుగా చెప్పింది. ఆయన సరేనని చెప్పి మరల వ్యవహారంలో నిమగ్నమయ్యాడు. చాలా సమయం గడిచింది. అగ్నిహోత్రావధాన్లు స్నానానికి లేవలేదు. బుచ్చమ్మ మరలవచ్చి స్నానం మాటను గుర్తు చేసింది. ఆ సమయంలో అగ్నిహోత్రావధాన్లు మండిపడుతూ' పెద్ద మనుషుల్తో వ్యవహారం మాట్లాడుతూవుంటే రామాయణంలో పిడకల వేట్లాటలాగా అదేపిలవటమా! అని బుచ్చమ్మను కసురుకున్నాడు.

## తృతీయాంకము :

**12. చట్లకి చావనలుపు మనిషికి చావతెలుపు!**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావుగారు రచించిన 'కన్యాశుల్కం' నాటకం తృతీయాంకంలోనిది.

**సందర్భం:-** రామప్పంతులు భూములన్నీ అప్పులపాలయ్యాయని తెలుసుకున్న మధురవాణి ఆ విషయాన్ని గూర్చి రామప్పంతుల్ని ప్రశ్నించిన సందర్భంలోనిది.

**వివరణ:-** రామప్పంతులు భూములన్నీ అప్పులపాలయ్యాయని మధురవాణికి తెల్సింది. ఆ విషయాన్ని ఆమె రామప్పంతుల్ని అడిగింది. ఈ సంగతి ముందుగా తెలిసివుంటే నీదగ్గర 200/-లు తీసుకొనేదాన్నేకాదు. నాకు మీరు మహరాజులా కన్పించారు. కాబట్టే యిల్లూ, వాకిలీ వదిలి మానం ప్రాణం మీపాలు చేసి నమ్మి మీతో వచ్చాను. నన్ను మాత్రం మోసం చేయకండి. మిమ్మల్ని పాపం చుట్టుకుంటుంది. నిజంగా మీకు మోసం చేసే ఉద్దేశ్యం లేకపోతే లుబ్ధావధాన్లుకు పెళ్లి ఎందుకు కుదిర్చారు. ఆ ముసలాడికి పెండ్లేమిటి? అని నిలదీసింది. నాకు కొంచెం గడ్డంవరిసింది. అంతమాత్రాన ముసలాణ్ణి అంటావా? అని లుబ్ధావధాన్లు ప్రశ్నించాడు. అప్పుడు మధురవాణి చట్లకి చావ నలుపు, మనిషికి చావతెలుపు. ఈ విషయం తెలియదా అని లుబ్ధావధాన్లును అడిగింది.

**13. వెర్రికుదిరింది రోకలితలకి చుట్టమన్నాట్ట!**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావుగారు రచించిన కన్యాశుల్కం నాటకం తృతీయాంకంలోనిది.

**సందర్భం:-** లుబ్ధావధాన్ల పెళ్లిమాన్పించకపోతే నేను నీతో మాట్లాడను అని మధురవాణి రామప్పంతులు పలికిన సందర్భంలోనిది.

**వివరణ:-** రామప్పంతులు మధురవాణి ఇంటికి వచ్చి సరసంలో భాగంగా ముద్దును కోరాడు. మధురవాణి అయిష్టతతో చేతులు అడ్డంపెట్టుకొని ముద్దుకు వేళాపాళా లేదా? లుబ్ధావధాన్ల పెళ్ళి తప్పిస్తేనే ముద్దుపెట్టుకోనిస్తాను మోటుసరసం చాలించు' అని కసరికొట్టింది. 'వెర్రికుదిరింది రోకలికి తలకు చుట్టమన్నాట్ట' అట్లాగే రెండేళ్ళు కష్టపడి పెళ్లికి సిద్ధంచేస్తే ఇప్పుడు తప్పించమంటే ఎలా' అని రామప్పంతులు మధురవాణితో అన్నాడు.

**14. నమ్మించోట చేస్తే మోసం నమ్మంచోట చేస్తే లౌక్యం !**

**పరిచయం:-** ఆ వాక్యం గురజాడ అప్పారావుగారు రచించిన కన్యాశుల్కం నాటకం తృతీయాంకంలోనిది.

**సందర్భం:-** లుబ్ధావధాన్లను జాతకం పేరుతో మోసంచేసిన విధానాన్ని రామప్పంతులు మధురవాణితో చెప్పిన సందర్భంలోనిది.

**వివరణ:-** మధురవాణి రామప్పంతుల్తో లుబ్ధావధాన్ల పెళ్లి విషయం ప్రస్తావించి పెళ్లివల్ల లాభం యెలావస్తుంది? అని అడిగింది. రామప్పంతులు తాను ముందుగా తర్ఫీదు యిచ్చిన సిద్ధాంతిద్వారా లుబ్ధావధాన్లుకు వివాహ, ధనలాబాలు వున్నట్లు, మరల మరొక సిద్ధాంతి ద్వారా అదే విషయాన్ని చెప్పించి, గ్రహం శాంతికి బ్రాహ్మలకు భోజనంపెడ్తే మంచిదని చెప్పించినట్లు ఆమెతో చెప్పాడు. బ్రాహ్మల్లో పెళ్లిళ్ల కోసం పంపే జాతకాలేవి నిజమైనవికావు. అని కూడా రామప్పంతులు చెప్పగా 'ఇది మోసం కాదా' అని మధురవాణి ప్రశ్నించింది. నమ్మించోట చేస్తే మోసం, నమ్మంచోట చేస్తే లౌక్యం అని రామప్పంతులు సమాధానం చెప్పాడు.

**15. ఆపదకడ్డంబడ్డవారే బంధువులు.**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావుగారు రచించచన కన్యాశుల్కం నాటకం తృతీయాంకంలోనిది.

**సందర్భం:-** రామప్పంతులు ఇన్‌స్పెక్టర్ దగ్గరకు వెళ్తూ తలుపులు బిగించికొని జాగ్రత్తగా వుండు అని మధురవాణికి చెప్పాడు. తర్వాత కాసేపటికి కరటకశాస్త్రి శిష్యునితో వచ్చి తలుపుతట్టి మధురవాణితో మాట్లాడిన సందర్భంలోనిది.

వివరణ:- ఇన్‌స్పెక్టర్ రమ్మన్నాడని హెడ్‌కానిస్టేబుల్ రామప్పంతులుకు చెప్పాడు. రామప్పంతులు స్టేషన్‌కుపోతూ మధురవాణికి జాగ్రత్తలు చెప్పాడు. ఎవరు వచ్చినా తలుపు తీయవద్దని హెచ్చరించాడు. ఆయన వెళ్ళిన తర్వాత కొద్దిసేపటికి కరటకశాస్త్రి కన్యవేషంలోనున్న శిష్యునితో వచ్చి యింటి తలుపుతట్టాడు. 'ఎవరూమీరు' అని మధురవాణి లోపలనుండే ప్రశ్నించింది. మేము మీకు బంధువులంకాము అని మీరు మాకు బంధువులుకాగలరు. ఆపదకడ్డంబడ్డవారే బంధువులు గదా! అని కరటకశాస్త్రి చెప్పాడు.

**16. ఉదరనిమిత్తం బహుకృతవేషం!**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావుగారు రచించిన కన్యాశుల్కం నాటకం తృతీయాంకంలోనిది

**సందర్భం:-** కన్యవేషంతో వున్న శిష్యుని వెంటబెట్టుకొని వచ్చిన కరటకశాస్త్రి మధురవాణితో శిష్యుని మారువేషాన్ని గూర్చి చెప్పిన సందర్భంలోనిది.

**వివరణ:-** కరటకశాస్త్రి తన శిష్యునకు కన్యవేషం వేసి వెళ్ళి మధురవాణి యింటి తలుపుతట్టాడు. "మీరెవరని' మధురవాణి లోపలనుండే ప్రశ్నించింది. మేము మీకు బంధువులంకాము కాని మీరు మాకు బంధువులుకాగలరు. ఆపదకడ్డంబడ్డవారే బంధువులు గదా' అని శాస్త్రి చెప్పాడు. 'పంతులుగారికి బంధువులు అప్పులు కాకపోతే తలుపుతీయవచ్చు' అని చెప్పి మధురవాణి తలుపుతీసింది. శాస్త్రి మధురవాణిని చూచి ఆశ్చర్యపోయాడు. మధురవాణి ముక్కుమీద వేలువేసుకొని 'యేమిటి ఈవేషం' అని ప్రశ్నించింది. 'ఉదరనిమిత్తం బహుకృతవేషం. ఇది దేవుడిచ్చిన వేషం కూడా' అని కరటకశాస్త్రి సమాధానం చెప్పాడు.

**17. నా దగ్గరకు వచ్చినవాడల్లా చెడిపోయినాడే!**

లేదా

**తనకు రొట్టా ఒకనికి ముక్కానా?**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావుగారు రచించిన కన్యాశుల్కం నాటకం తృతీయాంకంలోనిది.

**సందర్భం:-** గిరీశం ప్రవర్తన మంచిదికాదని కరటకశాస్త్రి చెప్పినప్పుడు మధురవాణి వానితో గిరీశాన్ని గూర్చి మాట్లాడిన సందర్భంలోనిది.

**వివరణ:-** డిప్యూటీ కలెక్టరు కొడు నన్ను ఉంచుకొన్నాడు. ఆవిషయం తెలిసిన తండ్రి ఆయన్ని చదువు వంకతో చెన్నపట్నం పంపాడు. అయినా కూడా ఆయన నాకు గిరీశం ద్వారా డబ్బులు పంపేవాడు. ఇట్లా కొంతకాలం సాగింది. తర్వాత కొన్నాళ్లకు గిరీశమే నన్నుంచుకున్నాడు. అప్పుడు డబ్బులకు చాలా ఇబ్బందిగా వుండేది. అని మధురవాణి కరటకశాస్త్రితో చెప్పింది. గిరీశం నిన్నుంచుకున్నాడా? ఆయన నా మేనల్లుడికి చదువు చెప్పటం కోసం కుదుర్చుకున్నాడే. వాడికి వెంటనే ఉద్వాసన చెప్పాలి' అని కరటకశాస్త్రి మధురవాణితో చెప్పాడు. అప్పుడు మధురవాణి 'నా దగ్గరకు వచ్చిన వాడల్లా చెడిపోయినాడే. నా దగ్గరకు మీరు రాకుండా అవరోధం కల్గించారని మీరు డిప్యూటీకలెక్టర్ని తిట్టారు కదా. ఆయనకొకన్యాయం! మీకొకన్యాయమా! నాదగ్గరకు వచ్చినందుకు మీ భార్య నిన్ను మెడబట్టుకొని తరవాల్సింది. తనకి రొట్టా! ఒకడికి ముక్కానా! అని మధురవాణి కరటకశాస్త్రితో పలికింది.

**18. ఈ పిల్లదగ్గర వాల్చోట్లు దివిటీముందర దీపాలు !**

లేదా

**ఆడది మెచ్చిందే అందం !**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావుగారు రచించిన కన్యాశుల్కం నాటకం తృతీయాంకంలోనిది.

**సందర్భం:-** కరటకశాస్త్రి కన్యవేషంలో వున్న శిష్యునితో మధువాణి వద్దకు వచ్చి ఆపిల్ల పెళ్లి విషయం ప్రస్తావించగా ఆమె సౌందర్యానికి ముగ్ధురాలైన మధురవాణి కరటకశాస్త్రితో మాట్లాడిన సందర్భంలోనిది.

వివరణ:- కరటకశాస్త్రి కన్యవేషంలోవున్న శిష్యునితో మధురవాణి వద్దకు వెళ్ళి ఈపిల్లకు పెళ్లిచేయటానికే నీవద్దకు తీసు కొచ్చాను అని చెప్పాడు. 'మాపంతులుకేనా పెళ్లి' అని మధురవాణి ప్రశ్నించింది. 'త్రిలోకసుందరివి నువ్వు ఉండగా పంతులుగారికి ఇంకా పెళ్లెందుకు' అని శాస్త్రి అన్నాడు. అలాగైతే నేనే మగవేషం వేసికొని పెళ్లిపీటలమీద కూర్చుంటాను. ఇలాంటి పెళ్లాం దొరకటం ఎలాగ? జగత్ప్రసిద్ధులైన కరటకశాస్త్రులవారి అల్లుడు కావటం ఎలాగ? దివ్యసుందరవిగ్రహం అని పొగడగానే భుజాలు పొంగుతాయనుకున్నారు కాబోలు.'ఈపిల్లదగ్గర నాబోంట్లు దివిటీ ముందర దీపాలు. అడది మెచ్చిందే అందం. మగవాడి కన్నుమనసక మీకేం తెలుసు. నాపెళ్లాన్ని నాకిచ్చేసి మీదారిన మీరు పొండి' అని మధురవాణి కరటకశాస్త్రితో పలికింది.

**19. బుద్ధికి అంతా అసాధ్యమేకాని డబ్బుకి ఎక్కడా అసాధ్యంలేదు !**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావుగారు రచించిన కన్యాశులక్కం నాటకం తృతీయాంకంలోనిది.

**సందర్భం:-** కరటకశాస్త్రి స్త్రీవేషంలో వున్న శిష్యుణ్ణి వెంటబెట్టుకొని మధురవాణి వద్దకు వెళ్ళి తనను ఆపదనుంచి తప్పించమని కోరిన సందర్భంలోనిది.

**వివరణ:-** కరటకశాస్త్రి స్త్రీవేషంలోని శిష్యునితో మధురవాణి వద్దకు వెళ్లి 'ఓమధురవాణి! దేవుడు నాకు నిన్ను చూపించాడు. పంతుల్లేని సమయంలో వచ్చాను. నామాటలు విని ఆపదనుండి తప్పించు. మావూళ్లో లుబ్ధావధాన్లు అనే ముసలాడున్నాడు. వాడికి మామేనకోడల్ని యివ్వాలని మా బావ నిశ్చయించాడు. ఈ సంబంధం నాచెల్లికి యిష్టంలేదు. ఒక వేళ ఈపెళ్ళి జరిగితే నాచెల్లిలు నుయ్యో గొయ్యో చూచుకుంటుంది. దాని ప్రాణం కాపాడాలి. నాకు నీవే దిక్కు అని చెప్పాడు. ఈ పిల్లను తక్కువ సొమ్ముకు అమ్మితే లుబ్ధావధాన్లు చంకలు గుద్దుకొని చేసికొంటాడు. సమస్యా తీరుతుంది. అందాకా యెందుకు? నేనే కొనుక్కుంటాను. అయితే యింతకు ముందే నిర్ణయమైన సంబంధం ఎలా తప్పిపోతుంది అని మధురవాణి ప్రశ్నించింది. 'నీ బుద్ధికి అసాధ్యం వుందా? డబ్బులకు అసాధ్యం వుందా?' అని కరటకశాస్త్రి అన్నాడు. అప్పుడు మధురవాణి బుద్ధికి అంతా అసాధ్యమేకాని డబ్బుకు ఎక్కాడా అసాధ్యం లేదు అని కరటకశాస్త్రితో చెప్పింది.

**20. పొగమకత్తెలకి అలక కూడా అదొక శృంగారం!**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావుగారు రచించిన కన్యాశుల్కం నాటకం తృతీయాంకంలోనిది.

**సందర్భం:-** కరటకశాస్త్రితో వచ్చిన పిల్లను పెళ్లాడతానని రామప్పంతులు చెప్పగా మధురవాణి కొరకొరచూసింది. అప్పుడు రామప్పంతులు అందగత్తెలకు కోపం కూడా అందమే అని పలికిన సందర్భంలోనిది.

**వివరణ:-** రామప్పంతులు మధురవాణి ఇంటికి వెళ్ళేసరికి కరటకశాస్త్రి స్త్రీవేషంలో వున్న శిష్యునితో కనిపించాడు. 'వచ్చిన పనేమిటి' అని పంతులు ప్రశ్నించాడు. 'ఈపిల్లకు పెళ్లి నిశ్చయించి పుణ్యం కట్టుకోమని శాస్త్రులు ప్రార్థించాడు. వివాహం జరిపించటానికి నేను వైదికుడ్నీ కాను. నాకు మంత్రాలు రావు. ఈ రోజుల్లో వైదికమంత్రల మహిమపోయింది. నియోగప్రభువుదే మంత్రమయ్యింది. మరి నేను ఈ పిల్లను పెళ్ళాడనా? అని మధురవాణిని అడగగా ఆమె కొరకొర చూసింది. అందగత్తెలకు కోపంకూడా అందమే అని పంతులుగారు మధురవాణిని ప్రశంసించాడు.

**21. ఇయ్యా ఇప్పించగల అయ్యలకేగాని మీపమువ్యలకేలా! రామయ్యకు చేవాబారెడు!**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావుగారు రచించిన కన్యాశుల్కం నాటకం తృతీయాంకంలోనిది.

**సందర్భం:-** అప్పులపాలైన కరటకశాస్త్రి తన అప్పుల్ని యీపిల్ల పెళ్లి ద్వారా వచ్చే సొమ్ముతో తీర్చాలనుకున్నట్లు రామప్పంతులుతో చెప్పి సహాయపడవలసిందిగా కోరిన సందర్భంలోనిది.

**వివరణ:-** కరటకశాస్త్రి రామప్పంతులు వద్దకు వెళ్ళి తన దుస్థితిని తెలిపి మీరు నియోగ ప్రభువులు. అందువల్ల మంత్రబలంతో అడ్డుకుంటారని వచ్చాను. మీ పినతల్లి కొడుకు డిప్యూటీ కలెక్టరేకాని వానివల్ల లాభంలేదు. వాడు బందువుల్ని దగ్గరకు రానివ్వడు.

బంధువులు పంపించిన కూరనారల్ని తీసికోడు. పెట్టడానికి, పుచ్చుకోవటానికి నియోగప్రభువులైవ మీకే చెల్లిందికాని, మావాళ్ల ఉద్యోగాలు మంటిగడ్డ ఉద్యోగాలు! ఇయ్యాఇప్పించగల మీసమన్యులకేలా! రామయ్యకు లేవా బారెడు' అని ఒక కవీశ్వరుడన్నాట్ట, అలాగే ఇవ్వటం, ఇప్పించటం చేతగాని వాళ్లకి రామయ్యలమాదిరిగా మీసాలెందుకు? అని కరటకశాస్త్రి రామప్పంతుల్తో అన్నాడు.

**22. అది రంగువేసిన గాజుపూస- ఇది ప్యూర్ డైమండ్ !**

లేదా

**Two birds at one shot !**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావుగా రు రచించిన కన్యాశుల్కం నాటకం తృతీయాకంలోనిది.

**సందర్భం:-** మధురవాణి, బుచ్చమ్మల మధ్యనున్న తారతమ్యాన్ని గిరీశం గుర్తించిన సందర్భంలోనిది.

**వివరణ:-** బుచ్చమ్మ అమాయకత్వానికి, నిర్మలత్వానికి గిరీశం ఈశ్చర్యపడ్డాడు. మధురవాణి మాటల్ని, చేతల్ని, ప్రవర్తనని అస్యహించుకున్నాడు. ఇంతకాలం మధురవాణి వలలోనే వున్నందుకు చింతించాడు. మధురవాణి రంగువేసిన గాజుపూస. బుచ్చమ్మ ప్యూర్ డైమండ్- దీన్ని మాయోపాయంతో లేవదీసికొనిపోయి విడోమ్యారేజి చేసుకొంటే కీర్తి, సుఖం రెండు దక్కుతాయి. Two birds at one shot ఒక్కదెబ్బకు రెండుపిట్టలు. ఇటువంటి అమాయకత్వం విడోని ఒప్పించి పెళ్లాడితే మజావుంటుంది అని గిరీశం భావించాడు.

**23. పామ్మనక్కరలేదు. పొగబెడితే చాలు !**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావుగారు రచించిన కన్యాశుల్కం నాటకం తృతీయాంకంలోనిది.

**సందర్భం:-** ఈనాడు లోకం తప్పుడు దారిలో నడుస్తూవుంది. దాన్ని సరియైన దారిలోకి మళ్లించాలి. విధవా వివాహాన్ని ప్రోత్సహించాలి. సానివాళ్లని హతమార్చాలి అని గిరీశం బుచ్చమ్మతో చెప్పిన సందర్భంలోనిది.

**వివరణ:-** బుచ్చమ్మను ఆకర్షించాలని గిరీశం భావించాడు. సంఘసంస్కారాన్ని గూర్చి, విధవావివాహం గూర్చి ఉపన్యసించాడు. సానివాళ్లను చంపాల్సిన పనిలేదు. పామ్మనక్కరలేదు. పొగబెడితే చాలన్నట్లుగా పెళ్లిళ్లకు పిలవకపోవటం ఉంచుకోకపోవటం, కనబడ్డచోటల్లా నిందించటంలాంటివి చేయాలి. అలా చేస్తే కొంత కాలానికి సానివాళ్లు అంతరిస్తారు అని గిరీశం బుచ్చమ్మతో చెప్పాడు.

## చతుర్థాంకం !

**24. మాటలు నేర్చిన శునకాన్ని వేటకి పంపితే ఉసుకోమంటే ఉసుకోమందిట !**

**పరిచయం :-** ఈ వాక్యం గురజాడ అప్పారావుగారు రచించిన 'కన్యాశుల్కం' నాటకం చతుర్థాంకంలోనిది.

**సందర్భం:-** గిరీశం తెలివితేటల్ని, గొప్పతనాన్ని ఒప్పుకోలేని రామప్పంతుల్తో మధురవాణి మాట్లాడిన సందర్భంలోనిది.

**వివరణ:-** గిరీశం తెలివైనవాడు. చురుకైనవాడు. శాస్త్రాలు చదివినవాడు. ఇంగ్లీషులో ధారాళంగా మాట్లాడగలిగినవాడు అని మధురవాణి ప్రశంసించటాన్ని రామప్పంతులు భరింపలేకపోయాడు. "నేనే చిన్నతనంలో ఇంగ్లీషు చదివుంటే జడ్జీల యెదుట ఫెళఫెళలాడించేవాణ్ని. నాకు వాక్స్థానమందు బృహస్పతి వున్నాడు. అందువల్ల ఇంగ్లీషు రాకపోయినా నాప్రభ యీలా వెలుగుతుంది" అని రామప్పంతులు ఆత్మస్తుతి చేసుకున్నాడు. "మాటలు నేర్చిన శునకాన్ని వేటకు పంపితే ఉసుకోమంటే ఉసుకోమందిట" నీ వ్యవహారం కూడా అంతేవుంది. గిరీశం వాక్శూరుడు, కార్యశూరుడు. నీవు కార్యశూరుడవు కాదు కాని వాక్శూరుడువు అని మధురవాణి రామప్పంతుల్తో అంది.

25. పావంటి దానికి విరుగుడుంది. పంతులుకుండవా!

పరిచయం:- ఈ వాక్యం గురజాడ అప్పారావుగారు రచించిన కన్యాశల్కం నాటకం చతుర్థాంకంలోనిది.

సందర్భం:- ఏదో విధంగా రామప్పంతులు నోరుమూయించాలని లుబ్ధావధాన్లు కరటకశాస్త్రితో మాట్లాడిన సందర్భంలోనిది.

వివరణ:- పెద్ద పెద్ద ఉద్యోగస్థులు కూడా యిప్పటి రోజుల్లో ఏకరాత్ర వివాహాలు చేసుకొంటున్నారు. కోదండ రామస్వాముల వారి ఆలయంలో హనుమంతుని విగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతుంది. కావున ఆ పవిత్రస్థలంలో నీవు కూడా వివాహం చేసేకుంటే బాగుటుంది. ఈ విషయాన్ని పుస్తెకట్టేదాకా పంతులుగారికి తెలియనీయవద్దు అని కరటకశాస్త్రి లుబ్ధావధాన్లుతో అన్నాడు. సిద్ధాంతికి రెండురూపాయలు పడవేస్తే అంతా ఆయనే చూసుకుంటాడు. పంతులుగారు ఆయన ఎదుట నోరు మెదపడు అని లుబ్ధావధాన్లు అన్నప్పుడు పావంటిదానికి విరుగుడున్నప్పుడు పంతులకు ఉండదా అని కరటకశాస్త్రి ఆయనతో అన్నాడు.

## పంచమాకం :

26. వీడి పిండం పిల్లులకు పెట్ట !

పరిచయం :- ఈ వాక్యం శ్రీగురజాడ అప్పారావుగారు రచించిన కన్యాశుల్కం నాటకం పంచమాంకంలోనిది.

సందర్భం:- లుబ్ధావధాన్లు తాను పెళ్లాడినపిల్ల మొదటి మొగుడు రాత్రివేళవచ్చి గొంతుపిసికాడని మీనాక్షితో చెప్పిన సందర్భంలోనిది.

వివరణ:- లుబ్ధావధాన్లు నిద్రనుండి మేల్కొని పెద్దపెద్దగా అరుస్తూ కాళ్ళ చేతులు కొట్టుకుంటూ, వణుకుతూ లేచి కూర్చున్నాడు. అసిరిగాడు, మీనాక్షి వెళ్ళి తలుపుతట్టారు. లుబ్ధావధాన్లు తలుపుతీసి అసిరిగాడ్ని దూరంగా వెళ్లిపొమ్మన్నాడు. వాడు వెళ్లిపోయాడు. 'రెండవ పెళ్లాం మొగుడు వచ్చి నీ పీక పిసికాడు.' అని లుబ్ధావధాన్లు మీనాక్షికి చెప్పాడు. మీనాక్షి తండ్రికి తోడుగా అక్కడే పండుకుంటానని చెప్పివెళ్లింది. తర్వాత కొంచెంసేపటికి మరలావచ్చి 'నాన్నా! నీవు చెప్పినమాట యదార్థం. నీరెండవ పెళ్లాం మొదటిమొగుడు దానిక్కూడా కలలో కన్పించి 'నీ కొత్త మొగుడు పీకపిసికేస్తాను అని అన్నాడట' అని చెప్పింది. అప్పుడు లుబ్ధావధాన్లు 'వీడి యిల్లు వల్లకాడు కానూ, యెక్కడ కల్పించాడే ఈ మాయపెళ్లి? వీడి పిండం పిల్లులకు పెట్ట' అని తీవ్రంగా రామప్పంతుల్ని తిట్టాడు.

27. తలచినప్పుడేనా తాతకి పెళ్లి?

పరిచం:- ఈ వాక్యం శ్రీగురజాడ అప్పారావుగారు రచించిన కన్యాశుల్కం నాటకం పంచమాంకంలోనిది.

సందర్భం:- రాజమహేంద్రవరం వెళ్లి పెళ్లి చేసుకుందాం అన్న మీనాక్షితో రామప్పంతులు పలికిన సందర్భంలోనిది.

వివరణ:- రామప్పంతులు మీనాక్షిని నమ్మించి మధురవాణి కంటెను తెప్పించాలనుకున్నాడు. పెళ్లి చేసుకుంటానని ప్రమాణం చేశాడు. ఇనుపములికి సాయంతో తాళం తీస్తానన్నాడు. ఇంతలో లుబ్ధావధాన్లు వచ్చి చీకట్లో కర్రతో రామప్పంతుల్ని కొట్టాడు. మీనాక్షిని బయటకునెట్టి తలుపువేశాడు. రామప్పంతులు మీనాక్షిని ఇంట్లోకి వెళ్లమన్నాడు. 'నేను ఇంట్లోకి అడుగుపెట్టాను. సరుకులు లేకపోతేపోయెను. రాజమహేంద్రవరం వెళ్లి పెళ్లి చేసుకుందాం' అని మీనాక్షి అంది. అప్పుడు రామప్పంతులు తలచినప్పుడే నా తాతకి పెళ్లి' అని మీనాక్షితో అన్నాడు.

## షష్ఠాంకం :

28. చేసేవి మాఘస్నానాలు దూరేవి దొమ్మరకొంపలు.

పరిచయం:- ఈ వాక్యం శ్రీ గురజాడ అప్పారివుగారిచే రచింపబడిన 'కన్యాశుల్కం' షష్ఠాంకంలోనిది.

సందర్భం:- అగ్నిహోత్రావధాన్లు తన కూతురైన బుచ్చమ్మను లేవదీసుకొనిపోయిన గిరీశాన్ని వెదుక్కుంటూ వెళ్లి రామప్పంతుల్తో మాట్లాడిన సందర్భంలోనిది.

**వివరణ:-** గిరీశం బుచ్చమ్మను నమ్మించి లేవదీసుకొనిపోయాడు. అగ్నిహోత్రావధాన్లు రామప్పంతుల్ని వెంటబెట్టుకొని గిరీశం కోసం వెదకటంతో చేతిలో వున్న డబ్బంతా ఖర్చయిపోయింది. ఆ సమయంలో ఆయన డబ్బులేని పరిస్థితిని రామప్పంతులుకు చెప్పాడు. "నాకు తాకట్టుపెట్టి డబ్బులు తీసుకొందాం" అని రామప్పంతుల్లు సలహా ఇచ్చాడు. అప్పుడు అగ్నిహోత్రావధాన్లు "చేసేవి మాఘస్నానాలు. దూరేవి దొమ్మరకొంపలు" అన్నట్లు నన్నుముండలకొంపకు తీసికెళ్తావా' అని రామప్పంతుల్తో అన్నాడు.

**29. పాలమ ముంచినా మీరే నీళ్లమ ముంచినా మీరే.**

**పరిచయం:-** ఈ వాక్యం శ్రీ గురజాడ అప్పారావుగారిచే రచింపబడిన 'కన్యాశుల్కం' షష్ఠాంకంలోనిది.

**సందర్భం:-** లుబ్ధావధాన్లు సౌజన్యారావుపంతులు వద్దకు వెళ్లి తనకు కలిగిన యిబ్బందుల్ని వివరించాడు. తాను యెటువంటి నేరం చేయలేదని విన్నవించుకున్న సందర్భంలోనిది.

**వివరణ:-** రామప్పంతులుగారు ఇనస్పెక్టర్‌కి, డిప్యూటీ కలెక్టర్‌కి లంచం యివ్వమని బలవంతం చేస్తున్నట్లు చెప్పాడు. "డిప్యూటీ కలెక్టర్ నాకు మంచి స్నేహితుడు. ఆయన లంచం తీసుకోడు. మీరు కనుక లంచాలు ఇచ్చే ప్రయత్నం చేస్తే నేను మీకేసును వాదించను" అని సౌజన్యారావు పంతులుగారు లుబ్ధావధాన్లను హెచ్చరించాడు. అప్పుడు లుబ్ధావధాన్లు మీరు చెప్పినట్లే నడుచుకుంటాను. భగవంతుడు మీ రూపంలో సాక్షాత్కరించాడు. పాలముంచినా మీరే, నీళ్ళముంచినా మీరే. మిమ్మేనమ్ముకున్నాను" అని సౌజన్యారావు పంతుల్ని ప్రార్థించాడు.

**డా॥ కందిమళ్ల సాంబశివరావు, ఎం.ఏ. పిహెచ్.డి.**
రీడర్ మరియు తెలుగు శాఖాధ్యక్షుడు
డి.ఆర్.ఎన్. ఎస్.సి.వి.ఎస్ కళాశాల
చిలకలూరిపేట, గుంటూరు జిల్లా.

రెండోభాగం - నాటకం

# కన్యాశుల్కం నాటకం - గురజాడ అప్పారావు

## పాఠం-17

**2.17.0 :** కన్యాశుల్క నాటకంలోని నాటకీయ శిల్పం

**2.17.1 :** ప్రశ్నలు - సమాధానాలు

**2.17.2 :** రాదగిన ప్రశ్నలు

**2.17.3 :** ఆచూకీ గ్రంథాల

## 2. 17. 0 కన్యాశుల్క నాటకంలోని నాటకీయ శిల్పం :

"దేశమును ప్రేమించుమన్న... మంచి అన్నది పెంచుమన్నా దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్'' అని గొంతెత్తిపాడిన నవయుగ వైతాళికుడు గురజాడ మహాకవి. సాహిత్య రంగంలో నవ్యమార్గాలు వెలిగించి నవ్యరీతులు వెలయించిన స్రష్ట. సాహిత్యముఖంగా సంఘసంస్కారానికి దోహదం చేసిన ద్రష్ట. ఆధునిక వచనరచనకు ఆద్యుడు గురజాడ. వ్యావహారిక భాషను చేపట్టి సాహిత్య ప్రపంచంలో దానికి సుస్థిరమైన స్థానాన్ని కలిగించిన దిట్ట. కవిగా .. నాటకకర్తగా, కథారచయితగా .. వ్యాసకర్తగా బహుముఖాలుగా లబ్ధప్రతిష్ఠుడైన యుగకర్త గురజాడ. కందుకూరి రచనలు తెలుగు సాహిత్యంలో సంస్కార ధోరణులను ప్రవేశపెడితే విప్లవాత్మకమైన మార్పులు తీసికొనివచ్చిన ఖ్యాతి గురజాడకు దక్కింది. అంధకార బంధురమైన వ్యవస్థకు వేగుచుక్క గురజాడ. వీరేశలింగం అగ్నిపర్వతమైతే గురజాడ మేరుపర్వతంలాంటివాడు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆధునిక సాహిత్యానికి సరిహద్దు రేఖ గురజాడ.

సమాజం వీపుపై లేచిన కన్యాశుల్కం అనే రాచపుండుకు నాటక రచన ద్వారా షాక్‌ట్రీట్‌మెంట్ ఇచ్చిన గురజాడ ఆనాటి సమాజంలో అమ్మకాలు కొనుగోళ్ల మధ్య నలిగి నాశనమౌతున్న స్త్రీ జాతికి అండగా నిలిచారు. కన్యాశుల్క వ్యవస్థను నిరసిస్తూ కన్యాశుల్కం నాటకాన్ని రచించారు. ఎన్నో సంచలనాలకు కేంద్రబిందువైన కన్యాశుల్కం నాటకరచనకు ఉన్న నేపథ్యాన్ని విధిగా తెలుసుకోవాలి. విజయనగరం మహరాజా ఆనందగజపతి మద్రాస్ లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యులుగా ఉన్న కాలంలో కన్యాశుల్క నిషేధశాసనాన్ని ప్రవేశపెట్టాలని భావించారు. ఇందు నిమిత్తం విశాఖజిల్లాలో (నేటి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం జిల్లాలు కలిపి) గురజాడ అప్పారావు ద్వారా ఆడపిల్లల్ని డబ్బుకు అమ్ముకునే కుంటుంబ వివరాలను సేకరించారు. ఈ 1034 కుంటుంబాల వివరాలను సేకరించారు. ఈ నివేదికలో తొంభైతొమ్మిది మంది 3 సంవత్సరాలలోపు బాలికలకు, నలభై నలుగురికి నాలుగవ ఏట, ముప్ఫైఆరుగురికి మూడవ ఏట, ఆరుగురికి రెండవ ఏట ముగ్గరికి సంవత్సరకాలంలో వివాహాలు జరిగినట్లు గురజాడ పేర్కొన్నారు. ఈ శాసనం చేయడానికి మద్రాస్ ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేయలేదు. ఒక వేళ ప్రభుత్వం అంగీకరించిన ప్రభుత్వం రూపొందించే శాసనం ఇంగ్లీషులో ఉంటుంది గనుక మారుమూల పల్లెల్లోని ప్రజలకు అర్థంకావు. ప్రజలు వారు అవలంబిస్తున్న కన్యాశుల్కం యొక్క దుష్ప్రభావాన్ని రంగస్థలం మీద చూపి సిగ్గుతో తలలువంచుకొనే విధంగా రచనకావాలని ఆనందగజపతుల వారు గురజాడను కోరారు. ప్రజాచైతన్యానికి ఒక కథ, ఒక కావ్యంకన్నా నాటక ప్రక్రియ పదునైనా వజ్రాయుధంగా భావించి గురజాడ కన్యాశుల్క నాటక రచనకు శ్రీకారం చుట్టారు. కత్తిపోటుకంటె బలీయమైన కలంపోటుతో సంఘాన్ని మరమ్మత్తు చేయడానికి గురజాడ ఉద్యమించారు. కందుకూరి సాంఘిక విప్లవం, గిడుగుభాషా విప్లవాలను జీర్ణించుకొన్న గురజాడ ప్రజల నాలుకలపై లాస్యంచేసే వాడుక భాషతో కళ్లముందు కనిపించే సమాతీరుతెన్నులను, మనుషుల మనస్తత్వాలను కన్యాశుల్కం నాటకంలో ఎక్స్‌రే తీశారు. ఈ నాటకంలోని ప్రతిసంఘటనా, ప్రతిపాత్రను

చూసి ప్రతిఒక్కరూ భుజాలు తడుముకొనేలా చేసింది. ఈ నాటకాన్ని 1892లో రచించి ఆనందగజపతి మహరాజులకే కృతజ్ఞతాపూర్వక నైవేద్యంగా అంకితం చేశారు.

1892 ఆగష్టునెలలో విజయనగరం జగన్నాథ విలాసినీ నాటక సమాజం కన్యాశుల్కం నాటకాన్ని మొదటి సారిగా ప్రదర్శించారు. కన్యాశుల్కం తొలిరచనలో ఐదు అంకములు, 27 రంగాలున్నాయి. ఈ నాటక ప్రదర్శన గొప్పగా విజయవంతమైనట్లు,; ఒక సంచలనాన్ని సృష్టించినట్లు తెలుగు హర్బ్వంటి పత్రికల సమీక్షల వలన తేటతెల్లమౌతుంది. సంఘసంస్కరణ ఉద్యమాన్ని ముందుకు నడిపించడం, నాటకరచనకు వ్యావహారిక భాష నప్పదనే భాషాఛాందసవాదుల అభిప్రాయాన్ని పూర్వపక్షం చేయడం కోసం కన్యాశుల్కం నాటకాన్ని రచించినట్లు పేర్కొన్న గురజాడను ఏదో వెలితి కలవరపెట్టింది. మారుతున్నకాలంలో ఒకటిరెండు పాత్రల మనస్తత్వాలపట్ల ఆయన ఉద్దేశ్యాలలో వచ్చినమార్పు ఆప్తుడైన శ్రీనివాస అయ్యంగార్ చేసిన సూచనలు, మధురవాణి పాత్ర గురించి అప్తమిత్రుడైన ఒంగోలు ముని సుబ్రమణ్యం ఆక్షేపణలు; దీనితో కన్యాశుల్కం నాటకాన్ని పునర్ముద్రణ చేయదలిచారు. కొద్దిపాటి మార్పులు చేద్దామనే తలంపుతో పునర్ముద్రణకు పూనుకొనగా అది సరికొత్త రంగు రుచి వాసనతో కొత్త కన్యాశుల్కమై 1909లో ఆవిర్భవించింది.

కన్యాశుల్కం తొలిరచన కాలంలో సంఘసంస్కరణోద్యమం ఉధృతంగా సాగుతుంది. రెండవ కూర్పునాటికి జాతీయోద్యమం మొదటి స్థానంలో సంఘసంస్కరణోద్యమం రెండవ స్థానంలోనూ వున్నాయి. కన్యాశుల్కం స్వీకరించడం నీతిబాహ్యమని, చట్టవిరుద్ధమని మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పు సంఘసంస్కరణోద్యమానికి ఒక బలాన్ని చేకూర్చింది. సంఘసంస్కరణ అంటే కన్యాశుల్కాలు, బాల్యవివాహలూ, సానిమేళాలూ నిషేధించడం కాదు. సంఘపరివర్తనకు, పురోగమనానికి అవరోధంగా ఉన్న శక్తులను ఎదుర్కొని సవరించి సామాజిక వికాసానికి తోడ్పడటం. సామాజిక వికాసానికి సాహిత్యవిద్యారంగాలు ఉత్తమసాధనాలు. అందుకే గురజాడ దృష్టి వాటిపై ప్రసరించింది. మలికూర్పు వెలువడే నాటికి తెలుగు నాటకరంగంలో సామాజిక ఇతివృత్తం గల నాటకాలు లేవు. సంచారమరాఠీ నాటక సమాజాలవారు తెలుగునాట నాటకాలాడి డబ్బు సంపాదిస్తున్నారు. స్థానిక సమాజాలు వాటిని అనుకరిస్తున్నాయి. అజ్ఞానంలోని మహదానందానికి ఇంతకన్న చక్కని ఉదాహరణ లేదని గురజాడ భావించారు. అందుకే ప్రజలకు అవసరమైన ఇతివృత్తాన్ని ప్రజల భాషలో వ్రాసి ఆనాటి కాలానికే కాదు తెలుగునాటకానికే మహోపకారం చేశారు. సమకాలీనమైన ఇతివృత్తం, సజీవమైన వ్యావహారికభాష, ఒక వంక గిలిగింతలు పెడుతూ మరోవైపు ఛెళ్ళున చరిచే హాస్యంతో అరురూపమైన త్రివేణీసంగమంలా కన్యాశుల్కం అమరింది. సమస్యలకు నూరేళ్లునిండినా ఆనాటకం మాత్రం ఇప్పటికీ సజీవంగానే వుంది. శ్రీ శ్రీ మాటల్లో చెప్పాలంటే కన్యాశుల్కం నాటకం గొప్పది. మానవత్వానికీ సమానత్వానికీ కన్యాశుల్కం ఒక నివాళి. ఇందులో దేవతలూ దానవులూ లేరు. నిజమైన మనుషులున్నారు. అన్నీ సజీవపాత్రలే.

ప్రతిరచనలోనూ రచయిత ఏ అంశాన్ని చెప్పాడు. ఎలా చెప్పాడు అనే రెండు అంశాలు ఉంటాయి. మొదటి అంశాన్ని వస్తువు అని; రెండవ అంశాన్ని శైలి అంటారు. రచయిత రచనకు తీసుకొన్న జీవితాంశమూ దానిపట్ల రచయితకు ఉన్న అవగాహనాశక్తి అనే రెండూ కలిసి వస్తువుగా రూపుదిద్దుకొంటాయి. ఈ వస్తువును పాఠకులకు, ప్రేక్షకులకు అందించడానికి రచయిత తయారుచేసుకొన్న ప్రణాళిక, అనుసరించిన విధానాన్ని శిల్పం అంటారు. ప్రతిరచనలో వస్తువూ, శిల్పమూ రెండు కలగలిసేవుంటాయి. వస్తువును అటు పాఠకులకు, ప్రేక్షకులకూ అందించడానికి ఉపయోగపడే సాధనం శిల్పం. సామాజిక వాస్తవికతకు ప్రతిబింబమే కళ. అందువలన కళలో.. రచనలో వస్తువుకు ప్రాధాన్యముంటుంది. అలాగని శిల్పాన్ని నిరాకరించడం కుదరదు. వస్తుశిల్పాల సమాహార స్వరూపమే కళ. వస్తువును మింగేసే శిల్పం కేవలం శిల్పంగానే మిగిలిపోతుంది. అసలు శిల్పమే లేని వస్తుంవు కేవలం అలంకార ప్రాయమైన వార్తగా మిగిలిపోతుంది. వస్తువును ఆశ్రయించి ఉన్న శిల్పం ఒక సంపూర్ణ సిద్ధికి దోహదం చేస్తుంది.

నూరేళ్ల క్రితం రచించబడిన కన్యాశుల్కం నాటకంలో గురజాడ సంఘసంస్కరణాభిలాష. ఆశయ దీక్ష.. సిద్ధాంత బలం అడుగడుగునా ప్రత్యక్షమౌతాయి. అస్తవ్యస్థమైన ఒక అవ్యవస్థనూ; సమస్యల సుడిగుండాలలో గిరికీలు కొడుతున్న సమాజాన్ని ప్రతిబింబించడమే గురజాడ లక్ష్యం.. ధ్యేయం. జీవితంలో నైతిక విలువలూ; ఉన్నత సంస్కారం., అత్యున్నతమైన నాగరికతను కన్యాశుల్కం రచన ద్వారా ప్రతిబింబిచడమే ఆశయంగా వ్రాయబడిన కన్యాశుల్కంలో గురజాడ దీక్షాదక్షతలు గోచరిస్తాయి. ఇందుకు

అనుగుణమై ఇతివృత్తాన్ని స్వీకరించడంలో; దానిని సంఘటనలుగా విడగొట్టి ఏక సూత్రంగా తీర్చిదిద్దడంలో; ఆ ఇతివృత్తాన్ని సజావుగా నడిపించడానికి పాత్రలను సృష్టించడంలో.. ఆ పాత్రలకు మాటలను అద్దడంలో.. తదను గుణమైన భాషను ఉపయోగించడంలో గురజాడ నాటక రచనా శిల్పచాతుర్యం గోచరిస్తుంది. ఈ నాటక శిల్పాన్ని మూడు విభాగాలుగా విభజించవచ్చు. అవి 1. కథాశిల్పం 2. పాత్రచిత్రణాశిల్పం 3. సంభాషణరచనా శిల్పం.

**కథాశిల్పం:** కథలో పలు వైవిధ్యమైన సంఘటనలుంటాయి. ఆ సంఘటనలన్నీ ఒక సామాజిక ప్రయోజనానికి; నాటక కార్యానికీ దోహదపడడమే కథాశిల్పం. నాటకంలో ప్రధాన ప్రయోజనానికి ఉపయోగపడని సంఘటన ఉంటే కథాశిల్పం దెబ్బతింటుంది. కన్యాశుల్కం నాటకం మీద ఉన్న ప్రధానమైన విమర్శలు; చెలరేగిన వాదోపవాదాలూ కథైక్యత విషయంపైనే కేంద్రీకరించబడడం విశేషం. కన్యాశుల్కం నాటకంలో కథ ముప్ఫైమూడు స్థలాల్లో నడుస్తుంది. ఈ ఇతివృత్తాన్ని యేడంకాల్లో పకడ్బందీగా బిగించారు. విజయనగరం, కృష్ణారాయపురం; రామచంద్రపురం, అగ్రహారం వంటి అనేక స్థలాల్లో కథనడుస్తుంది. అగ్నిహోత్రావధానులు తనకుమార్తె సుబ్బిని లుబ్ధావధానులకు ఇచ్చి వివాహం చేయడానికి ప్రయత్నిస్తున్న సందర్భంలో కరటక శాస్త్రి మధురవాణి సహాయంతో భగ్నం చేయడం.. తద్వారా జరిగిన పరిణామాలను గుదిగుచ్చి గురజాడ కన్యాశుల్కంగా రచించారు. ఈ విషయంతో పాటు ఆనాటి సమాజంలో ఉన్న వేశ్యాలంపటత్వాన్ని విస్పష్టంగా చెప్పాలనేది గురజాడ ఆశయం. వీనితో పాటు విద్యా వ్యవస్థతీరు తెన్నులను కూడా గురజాడ ఈ నాటకంలో చర్చించారు.

నాటకం ప్రారంభం ముగింపుల మధ్య అందమైన సంవిధానం, సమన్వయం పాటించకపోతే నాటక శిల్పంలో వెలితి కొట్టవచ్చినట్లుగా కన్పిస్తుంది. కన్యాశుల్కం నాటకం గిరీశంతో ప్రారంభమై గిరీశంతోనే ముగుస్తుంది. విజయనగరంలోనే కథ ప్రారంభమై విజయనగరంలోనే ముగుస్తుంది. ఈ విధంగా దేశకాల పాత్రల దృష్ట్యా కన్యాశుల్కం నాటకంలో ఆద్యంతాల మధ్య చక్కని సమన్వయం కుదిరింది. నాటకారంభంలో పూటకూళ్లమ్మ చేత గెంటబడిన గిరీశం నాటకాంతంలో సౌజన్యారావుచేత గెంటడంతో ముగుస్తుంది. ఇది ఆద్యంతాల మధ్య చక్కగా కుదిరిన సమన్వయం. నాటకారంభంలో మధురవాణిచేత వదిలించుకోవడంతో మొదలైన గిరీశం పాత్ర పాపం అతనిని బ్రతకనివ్వండి అనే మధురవాణి సానుభూతివాక్యాలతో నాటకం ముగుస్తుంది. నాటక ఆరంభ ముగింపుల మధ్య శిల్ప మర్యాద చక్కగా పోషించబడింది.

**పాత్ర చిత్రణా శిల్పం:-** సమాజంలో మానవ ప్రవృత్తులే రచనలలోని పాత్రలకు ప్రతిబింబాలుగా ఉంటాయి. ఒక భావానికి.. స్వభావానికీ అనేక పాత్రలను.. ప్రతినిధులుగా చేయడం రచయితలు చేసేపని. పాత్రలను అర్థవంతంగా ప్రయోగించడం రచయిత ఔన్నత్యానికి నికషోపలంగా నిలుస్తుంది. ఒక భావానికీ ఒక స్వభావానికి అనేక పాత్రలు ప్రతినిధులను చేయడం సామూహిక పాత్ర చిత్రణ అని అంటారు. కన్యాశుల్కం నాటకంలో గురజాడ పాత్ర చిత్రణను సమర్థవంతంగా నిర్వహించారు. పాత్రపోషణ విషయంలో గురజాడ చూపిన శిల్ప నైపుణ్యం అనంతమైనది. మానవతా దృక్పథంతో ఆ పాత్రలను చిత్రిస్తూనే వానిని నాటకానికి మాధ్యమంగా వడుకోవడానికి గురజాడ ఎన్నుకొన్న ముఖ్యమైన పద్ధతి పాత్రల్ని తులనాత్మకంగా చూపడం. మూసపాత్రలను తీసుకొని వారికి వ్యక్తిత్వ లక్షణాలతో ప్రాణం పోసి మరొక పాత్రతో పోల్చి చూపి తద్వారా ఆ పాత్రల ప్రతిపత్తిని ఇనుమడింప చేశారు. ఉదాహరణకు ఛాందస ఒక మూస పాత్ర. గురజాడ కన్యాశుల్కంలో ఇద్దరు ఛాందస బ్రాహ్మణుల్ని సృష్టించారు. ఒకరు అగ్ని హోత్రావ ధానులు... ఒకరు లుబ్ధావధానులు. ఇద్దరూ మూర్ఖులు. తమకు తోచిందే వేదం. కానీ పాత్రలను సృష్టించిన తరువాత ఇద్దరి మధ్యా హస్తి మసికాంతర వ్యత్యాసముంది. నశిస్తున్న ఒక సంస్కృతికి, క్షీణిస్తున్న ఒక సంప్రదాయానికి వారు ప్రతినిధులు. పూట కూళ్ళమ్మా; బుచ్చమ్మా, మీనాక్షి ఈ నాటకంలో వితంతువులు. వితంతువుల జీవితంలోని వైవిధ్యానికి వారు ప్రతి నిధులు. పూట కూళ్ళమ్మ స్వేచ్ఛా జీవి. బుచ్చమ్మ తల్లి దండ్రుల కట్టడిలో శృంఖలాబద్ధంగా ఉంది. మీనాక్షి రామప్ప పంతుల వంటి దుర్మార్గుల మూలంగా అల్లరి పాలైపోయింది. నాయుడు, భీమారావు పంతులు; సౌజన్యారావు అనే ముగ్గురూ న్యాయ మూర్తులు. నాయుడు నాటు వకీలు. భీమారావు సౌజన్యారావు ఆధునికులు.

భీమారావుకు డబ్బే సర్వస్వం. సౌజన్యారావుకు న్యాయమే సర్వస్వం. గిరీశం; కరటక శాస్త్రి ఇద్దరూ గురువులు. శిష్యులను తమ స్వార్థానికి వాడుకొంటారు. వెంకటేశం, మహీశం ఇద్దరూ విద్యార్థులు వెంకటేశం ఇంగ్లీషు విద్యనూ, మహేశం సంస్కృత విద్యనూ అభ్యసిస్తూ వుంటారు. గిరీశాన్ని సంకీర్ణ పాత్రగా గురజాడ తీర్చి దిద్దారు. పూటకూళ్ళమ్మను, మధుర వాణిని అబద్ధాలు చెప్పి మోసం చేస్తాడు. మంచి చెడుల సంగమ పాత్రగా గురజాడ మలిచారు. పాత్ర చిత్రణలో ఇది అరుదు.

**సంభాషణ రచనా శిల్పం :** సంభాషణ రచన నాటక రచనలో అత్యంత ప్రాముఖ్యం వహిస్తుంది. పాత్రల ఆర్థిక సాంఘిక రాజకీయాది నేపథ్యాన్ని వివరించాలన్న, కథలోని దేశకాల పాత్రలను సూచించాలన్నా అన్నింటికీ సంభాషణా రచనే బలమైన సాధనం. కన్యాశుల్కంలోని సంభాషణలు మానవ మనస్తత్వ పరిశీలనకు, సమాజ పరిశోధనా శక్తికి, నిదర్శనాలుగా నిలుస్తాయి. పాత్రలను సమూహాలుగా చిత్రించిన గురజాడ సంభాషణలను సైతం సమూహాలుగా చిత్రించారు. ఒకే రకమైన సన్నివేశాలలో ఒక పాత్ర, అనేక పాత్రలు ఒకే రకంగా మాట్లాడటం సామూహిక సంభాషణా శిల్పం. మధురవాణి పురుష పాత్రల అనైతికతను బట్టి బయలు చేసే అనేక సందర్భాలలో ఒకే తీరుగా మాట్లాడుతుంది.

కన్యాశుల్కం నాటకంలో కొన్ని పాత్రలు నాటకంలో ప్రవేశిస్తూ పలికే తొలి మాటలు ఆ పాత్రల స్వభావాలను వ్యక్తం చేసేవిగా ఉండడం ఒక వైచిత్రి. ఆ మాటల ద్వారా ఆయా పాత్రలు తమ మనస్తత్వాలను తామే ఆవిష్కరించుకొంటాయి. గిరీశం తన తొలి మాటల్లోనే "పేషెన్స్ ఉంటేగానీ లోకంలో నెగ్గలేం" అంటూ ప్రవేశిస్తాడు. నాటకంలోని అన్ని దశల్లోనూ గిరీశం అదే మాటలను ఆలంబనగా చేసుకొని నడుస్తాడు. "మొగవాడికైనా ఆడదానికైనా ఒక నీతి ఉండాలి" అంటూ మధురవాణి ప్రవేశిస్తుంది. నాటకంలో తన దైన నీతిని ప్రదర్శిస్తూ ఎదుటి వారి దుర్నీతిని ఎండగడుతుంది. "పిల్లా అగ్గి పుల్లా" అంటూ ప్రవేశించిన రామప్ప పంతులు స్త్రీలను మోసం చేయడం; కొంపలను నిలువునా కూల్చడం చేస్తాడు. అపురూపమైన శిల్ప నిర్మాణ చాతుర్యంతో అత్యుత్తమమైన నాటకంగా తీర్చి దిద్దిన కన్యాశుల్కం ఒక తరగని గని. తవ్విన కొద్దీ అనేక అనర్ఘ రత్నాలు మన చేతికి అందుతాయి.

## 2.17.1 ప్రశ్నలు - సమాధానాలు :

ప్రశ్న :

1. **గిరీశం పాత్ర చిత్రణా నైపుణ్యాన్ని వివరించండి.**

**లేదా**

**ఆనాడు మారుతూన్న వ్యక్తుల ప్రతిబింబం గిరీశం పాత్ర అనే మాటలను సోదాహరణంగా చిత్రించండి.**

అభ్యుదయ నాటక సాహిత్యానికి గురజాడ అప్పారావు దిశా నిర్దేశకుడు. కన్యాశ్కులంతో సరితూగే నాటకం తెలుగు నాటక సాహిత్యంలో మరొకటి లేదంటే అతిశయోక్తి లేదు. కన్యాశుల్కం నాటక మంతా ఒక ఎత్తు. గిరీశం పాత్ర చిత్రణ ఒక ఎత్తుగా కనిపిస్తుంది. గిరీశం పాత్ర చిత్రణలో గురజాడ చూపిన ప్రతిభ అనన్య సామాన్యం. గురజాడ పేరు చెప్పగానే గిరీశం; గిరీశం పేరు చెప్పగానే గురజాడ చటుక్కున మనస్మృతి పథంలో కనిపిస్తారు. గిరీశం లుబ్ధావధానుల పినతల్లి కొడుకు. లక్ష్మీ కటాక్షం సరస్వతీ అనుగ్రహం చిన్న చూపు చూడడంతో చదువు సంధ్యలు అబ్బలేదు. సిరీ సంపదా అతని వైపు చూడడానికే సుతరామూ అంగీకరించలేదు. కానీ మాటల గారడి మాత్రం శరీరంలోని నరనరంలో పెల్లుబుకుతూ వుంటుంది. నయవంచన, డాంబికం, ఎప్పటికి ఏది ప్రస్తుతమో అలా క్షణాలలో ప్లేటు ఫిరాయించే ఊసరవెల్లి తనం, మింగమెతుకు లేకపోయినా మీసాలకు సంపంగినూనె వ్రాసుకొనే ఆడంబరత్వం గిరీశం సొత్తు. తాను నవ్వకుండా తన మాటలూ చేతలతో భళ్ళున హాస్యాన్ని చిలికిస్తూ ఎటువంటి విషమ పరీక్షనైనా గోటితో ఎదుర్కొంటూ దానిని తనకు అనుకూలంగా మలచుకొనే సమయస్ఫూర్తి అతని సొత్తు.

నాటక ప్రారంభంలో బొంకుల దిబ్బవద్ద ప్రత్యక్షమైన గిరీశం, 'పూటకూళ్ళమ్మకు సంతలో సామానుకొనిపెడతానని నెలరోజుల కిందట ఇరవై రూపాయలు పట్టుకెళ్ళి డాన్సింగర్లు కింద ఖర్చు పెట్టాను. ఇవాళ ఉదయం పూటకూళ్ళమ్మకూ నాకూ యుద్ధమైపోయింది. బుర్రబద్దలు కొడదామా అన్నంత కోపం వచ్చిందికానీ పూర్రిచర్డు చెప్పినట్లు పేషెన్సు ఉంటేగానీ లోకంలో నెగ్గలేం. ఈ ఊళ్ళో మరి మనపప్పు ఉడకదు. ఎటుచూసినా అందరికీ బాకీలే. వెంకుపంతులుగారి కోడలికి లవ్‌లెటర్ రాసినందుకు ఎప్పుడో ఒహప్పుడు సమయం కనిపెట్టి దేహశుద్ధి చేస్తారు. "శీఘ్రంగా ఇక్కడనుండి బిచాణా ఎత్తివేయడమే'' అనే నిర్ణయానికి వస్తాడు. బిక్కమొగం వేసుకొని వస్తున్న ప్రియ శిష్యుడు వెంకటేశాన్ని చూసి వీడి వైఖరి చూస్తే పరీక్ష ఫెయిలైనట్లు కనబడుతుంది. వీణ్ణి కొంచెం ఓదార్చి వీడికి సెలవుల్లో చదువుచెప్పే మిషమీద వీడితో వీడి ఊరికి ఉడాయిస్తే చాలా చిక్కులు వదులుతాయి అంటూ తన సమస్యకు పరిష్కారాన్ని తానే సూచించుకొంటాడు. 'మీ సావాసం చేయడంచేత నా పరీక్షపోయిందని మా మాష్టారు మీతో మాట్లాడొద్దన్నారు.' అన్న వెంకటేశ్వర్లు మాటలు విని తన శీలాన్ని శంకించిన మాష్టారుపై అగ్గిరాముడిలా విరుచుకుపడతాడు. 'నాతో మాట్లాడటమే ఒక ఎడ్యుకేషన్. ఆ మాటకొస్తే నీకున్న లాంగ్వేజీ నీ మాష్టరుకుందీ. విడోమేరియేజ్ విషయమై., కౌశ్చిన్ విషయమై నీకు ఎన్ని లెక్చర్లిచ్చాను. నా దగ్గర చదువుకున్నవాడు ఒహడూ అప్రయోజకుడుకాలేదు. పూనా డక్కన్ కాలేజీలో నేను చదువుతున్నపుడు ది ఇలెవున్ కాజెస్ ఫర్ది డిజనరేషన్ ఆఫ్ ఇండియాను గూర్చి మూడుఘంటలు ఒక్కబిగిన లెక్చర్ ఇచ్చేసరికి ప్రొఫెసర్లుడంగయి పోయినారు. మనవాళ్లు ఉత్తవెధవాయలోయ్. చుట్టనేర్పినందుకు థ్యాంక్ చేయక తప్పుపడుతున్నవ్. చుట్టకాల్చడం యొక్క మజా నీకు బోధపడకపోవడం చాలా ఆశ్చర్యంగా ఉంది. చుట్టకాల్చబట్టేగదా దొర్లంతా గొప్పవాళ్లపోయారు. చుట్టకాల్చని ఇంగ్లీషు వాళ్లని చూశావు. చుట్టపంపిణీ మీదనే స్టీముయంత్రం వగయిరా తెల్లవాడు కనిపెట్టాడు. గరుత్మంతుడు అమృతాన్ని తీసుకొని వెళుతున్న సందర్భంలో ఒక చుక్కభూమిమీద రాలిపడింది. అది పొగచెట్టుగా జన్మించింది. కావున పొగతాగనివాడు దున్నపోతుగా పుడతాడని బృహన్నారదీయం నాలుగవ ఆశ్వాసంలో ఉందని తన ఔన్నత్యం గూర్చి పొగతాగడం యొక్క ప్రాశస్త్యాన్ని తాటవలచి నొక్కివక్కాణిస్తాడు. నువ్వు బుద్ధిగా ఉండి చెప్పిన మాటల్లా వింటూవుంటే సురేంద్రనాథ్‌బెనర్జీ అంత గొప్పవాణ్ణి చేస్తానని గిరీశం వెంకటేశాన్ని చుక్కల్లో కూర్చోబెడతాడు.

ఫోటోగ్రాఫర్ బంట్రోతువచ్చి గిరీశాన్ని పాతబాకీ ఇమ్మని నిలేశాడు. అతగాడి నుండి తప్పించుకోవడానికి చెవిటివాడిలాగా నటించాడు. బంట్రోతుకు ఒక సిగారులంచమిచ్చి రేపు సాయంత్రానికి ఇస్తానని గాయత్రిపై ప్రమాణం చేశాడు. ఈ విధంగా బంట్రోతుకు టోపీవేసి మధురవాణి ఇంటికి హుషారుగా వెళ్లిన గిరీశానికి ఉత్సాహభంగం జరిగింది. చీపురుకట్టతో పూటకూళ్లమ్మ భద్రకాళిగా ప్రత్యక్షమైతే రామప్పంతుల్ని ఆమె ఆగ్రహానికి ఆహారంగా వేసి బ్రతుకు జీవుడా అంటూ బైటపడతాడు. పకడ్బందీగా పథకం వేసుకొని వెంకటేశం ఇంటికి వెళ్లగానే అహిరావణ; మైరావణుల వంటి కరటకశాస్త్రి; అగ్నిహోత్రావధానులు గిరీశాన్ని ఓ పట్టుపట్టారు. కరటకశాస్త్రి పాండిత్యాన్ని వేనోళ్ల పొగడి బుట్టలో వేసుకొన్నాడు. కానీ అగ్నిహోత్రావధానులు గిరీశానికి ఓ పట్టాన కొరుకుడుపడలేదు. ఈ శషభిషలు నాకేంపనికిరావు. ఇతడి వైఖరిచూస్తే ఇక్కడే బసచేసేటట్టు కనపడుతుంది. మా ఇంట్లో భోజనం ఎంతమాత్రం వీలుపడదు అంటూ అగ్నిహోత్రావధానులు తెగవేసి చెప్పాడు. వెంకటేశం చదువు విషయంలో అగ్నిహోత్రావధానుల దంపతుల విభేదాలను చూసి "ఇక మూడేళ్ల నా తరిఫీదులోనుంచితే క్రిమినల్లో వరుసగా పోలీసు పరీక్ష ప్యాసుచేయిస్తాను'' అంటూ వెంకాయమ్మను తనవైపు తిప్పుకొంటాడు. కోర్టురికార్డులను ముక్క ముక్క తర్జుమా చేసి పెడతానని అగ్నిహోత్రావధానుల తాటాకు కోపాన్ని మాటల నీటి మూటలతో చప్పున చల్లబరుస్తాడు.

బుచ్చమ్మను చూసి గిరీశం మనసు మంచులాగా కరిగిపోతుంది, ' పల్లెటూరు ఊసు పోదనుకొన్నాను గానీ పెద్ద క్యాంపెయిన్‌కు అవకాశం ఇక్కడా కూడా దొరకడం నా అదృష్టం.' అంటూ బుచ్చమ్మను వలలో వేయడానికి పటిష్టమైన పథకరచనకు పూనుకొంటాడు. గిరీశం మాటలగారడి తెలియని వెంకటేశం అమాయకత్వంతో ఇన్నాళ్లూ ఇది కూడదని చెప్పినారే నాతో అంటే " ఒపీనియను అప్పుడప్పుడు ఛేంజి చేస్తూంటేగాని పొలిటీషియన్ కానేరుడు'' అంటూ చిత్రవిచిత్రమైన వాదన చేసి పరువునిలబెట్టుకుంటాడు. ఫ్యూర్ డైమండ్ వంటి బుచ్చమ్మను పెళ్లిచేసుకొంటే మొత్తం మీద లాభమనీ దినదినగండం లేకుండా బ్రతుకు సాగిపోతుందని గిరీశం నిర్ణయించుకొంటాడు. బుచ్చమ్మ గిరీశం ఉపన్యాసాలకు లొంగలేదు. సుబ్బి పెళ్లి గొడవను అస్త్రంగా చేసుకొని బుచ్చమ్మ మీద సమ్మోహనాస్త్రం ప్రయోగించాడు.

తనతో లేచిపోయి రావడం ఒక్కటే పెళ్లితప్పించడానికి ఏకైక తరుణోపాయమని నూరిపోశాడు. పెళ్లికి వెళుతూ దారిలో బుచ్చమ్మ బండి తప్పించి లేవదీసుకుపోయాడు. సౌజన్యారావు పంతులు వద్దకు చేరి ఆయన మనస్సుకు నచ్చేటట్లు ప్రవర్తిస్తాడు. లుబ్ధావధానుల ఆస్తినికాజేసి బుచ్చమ్మతో సుఖించాలని కలలుకనే సమయంలో మధురవాణి మారువేషంలో రావడంతో తన పథకం రచ్చకెక్కింది. తన బండారం బద్దలుకావడంతో డామిట్ కథ అడ్డం తిరిగింది అంటూ వెళ్లిపోతాడు.

గిరీశం అబద్ధాలు ఆడతాడు. ఎన్నోడాబులు కొట్టాడు. అతివినయం నటించాడు. ఎవరిదగ్గర తాళం వారిదగ్గర వేస్తాడు. మిడిమిడి జ్ఞానం ఉపయోగించి లెక్చర్లు దంచాడు. విదూషకుడిలా నవ్విస్తాడు. వేదాంతిలా ఆలోచనలను రేకెత్తిస్తాడు. అడుగడుగునా ఎదురైన చిక్కులను ఉపాయంతో తప్పించుకొన్నాడు. కానీ ఎదుటివాళ్ల కొంపలు కూల్చి మేడలు మిద్దెలు కట్టాలనే ఆలోచన ఏ కోశానా గిరీశానికి లేదు. జానెడు పొట్టకోసం బ్రతుకు తెరువు కోసం జీవితంలో నటించాడు. నటనలో జీవించాడు. తెలుగునాటక సాహిత్యంలో కన్యాశుల్కం మొదటి మైలురాయి. ఈ నాటకానికి గిరీశం గొప్ప అలంకారం. సమర్థుడైన దౌర్భాగ్యుడు గిరీశం. అందుకే గిరీశానికి సాటి గిరీశమే. గిరీశానికి పోటీ కూడా గిరీశమే.

## ప్రశ్న. 2. గురజాడ మధురవాణి పాత్రచిత్రణ గావించిన తీరును వివరించండి.

దేశమంటే మట్టికాదు, మనుష్యులు అన్నారు గురజాడ. అలాగే కావ్యమన్నా, నాటకమన్నా కేవలం పదప్రయోగం, మాటలగారడి కాదు. అందులో ప్రజలకు ప్రాతినిధ్యం వహించే పాత్రలు. అవి వ్యక్తం చేసే భావాలు ప్రధానం. కన్యాశుల్కంలో కొట్టవచ్చినట్లు కన్పించేది, గురజాడ కీర్తిపతాకకు అసలైన నిదర్శనంగా కనిపించేది పాత్రచిత్రణా నైపుణ్యం. "రచయిత తాను రూపొందించే పాత్రలనన్నింటినీ జీవితం నుండి పరిగ్రహించడు. పరిగ్రహించిన పాత్రలను అచ్చంగా పరిగ్రహించినట్లుగానే చిత్రించడు. వెనుకటి కవులు నిర్మించిన భావనాత్మకమూర్తుల లక్షణములు అతనికి తెలియకుండానే అతనిలో ద్యోతకమౌతాయి" అనే గురజాడ మాటలకు ప్రజల సాక్ష్యం మధురవాణి పాత్రచిత్రణ. కన్యాశుల్కం నాటకంలో మధురవాణి పాత్ర కీలకమైనది. నాటకం చుట్టూ తాను తిరుగుతుంది. తన చుట్టూ నాటకాన్ని తిప్పుకొంటుంది. కథ సూటిగా ప్రయాణించడానికి, ప్రవహించడానికి సరైన దారులు వేస్తుంది. కథకు ఎక్కడైనా ఎప్పుడైనా అడ్డు ఎదురైతే ఆ చిక్కుముడులను తానే విప్పుతుంది. అవసరమైతే తానే చిక్కుముడులు వేస్తుంది. జవంజీవం తొణికిసలాడే మధురవాణి చిత్రణలో గురజాడ సునిశితమైన ప్రజ్ఞను ప్రదర్శించారు.

'మొగవాడికైనా.. ఆడదానికైనా నీతి ఉండాలి. వేశ్య అనగానే అంతచులకనా, సానిదానికి మాత్రం నీతి ఉండొద్దా' అంటూ నాటకం ప్రారంభంలోనే పురుషాధిక్యతపై కొరడా ఝుళిపిస్తుంది. "నేను డబ్బుకక్కుర్తి మనిషిని కాదు" అంటూ తన మనస్తత్వాన్ని తేటతెల్లం చేస్తుంది. పరువైన ఆడది నీ ఇంటికి ఎందుకువస్తుంది అన్న గిరీశంతో "పరువైన మొగాళ్లు వచ్చినప్పుడు పరువైన ఆడవాళ్లెందుకు రాకూడదు". అంటూ పురుషాహంకారంపై చురకలు వేస్తుంది. నాకు డబ్బు గడ్డిపరక అంటూ తనకు డబ్బుపై వ్యామోహంలేదని రామప్పంతులితో చెబుతుంది. జడతోకొడతాను శాస్త్రంలో కాముకులకు చెప్పిన ఆయుధమిది అంటూ రామప్పంతుల్ని గిలిగింతలు పెడుతుంది. తనమేనకోడలికి పెళ్లిజరిగితే మా చెల్లెలు నూతిలో పడతానని అంటున్నందున ఏదైనా ఉపాయం ఆలోచించి ఆ పెళ్లి చెడకొట్టమని కరటకశాస్త్రి మధురవాణిని ప్రాధేయపడతాడు. వృత్తిచేత వేశ్యను గనుక చెయ్యవలసిన చోట్ల ద్రవ్యాకర్షణ చేస్తాను. మధురవాణికి దయాదాక్షిణ్యాలు సున్న అని తలచారా" అని కరటకశాస్త్రికి అభయమిచ్చి ఆ పెళ్లి తప్పించడానికి పథక రచన చేస్తుంది.

సంపూర్ణమైన మానవత్వం మూర్తీభవించిన పూర్ణకుంభం మధురవాణి. నవ్వినా.. కోపించినా.. మాటలాడినా.. మన్ననచేసిన, మంత్రాంగం చెప్పినా, తంత్ర రచన చేసినా ఏమి చేసినా చేయకపోయినా నిండైన మాధుర్యం, ఒయ్యారం, రసజ్ఞత ఒలికి పరిమళించి ఎదుటివారిని సైతం గుభాళింపచేస్తాయి. ఆ స్పందనకు లోబడని వ్యక్తి మానవాతీతుడైనా కావాలి లేదా మగవాడు కానివాడైనా కావాలి. మసిపాతరకప్పినా మాణిక్యం ప్రభలు దాగనట్లు ఏజన్మయోగమో భ్రష్టమై కాలుజారి ఆమె వేశ్యాకులంలో పుట్టినా మంచితనం, మానవత్వం పరిమళిస్తూనే వుంటుంది. రామప్పంతులు వంటి మహాలౌక్యులను కూడా కించిత్తు లెక్క చేయకుండా నిలువునా నిలబెట్టి వాళ్ల అక్రమాలను దులిపి బుద్ధిచెబుతుంది. మధురవాణి ప్రతిమాటా ప్రతిచేష్టా మెత్తని చెప్పుతో కొట్టినట్లుగా ఉంటుంది. "తాను చేస్తే

లౌక్యం మరొకడు చేస్తే మోసం అనరాదా అబద్ధానికి అర్థం ఏమిటి'' అని రామప్పంతుల్ని దులిపివేస్తుంది. యోగ్యుడైన కరటకశాస్త్రికి ఎంతో సహాయం చేసినా అతగాడు కూడా పప్పులో కాలువేసినప్పుడు మెత్తమెత్తగా అంటిస్తుంది. "చిత్రగుప్తుడికి లంచం ఇవ్వగలరా? అతగాడి దగ్గరకు కూడా మధురవాణిని పంపి చేసిన పాపాలు అన్నీ తుడుపుపెట్టించుకోవడానికి వీలు ఉండదు కాబోలు'' అని కరటకశాస్త్రిని దులిపివేస్తుంది. మధురవాణి మధురసంస్కారం, అమలిన హృదయమూ అడుగడుగునా ప్రత్యక్షమౌతుంది. పంకంలో పుట్టినా పద్మినీ జాతికి చెందిన స్త్రీ రత్నం మధురవాణి.

"మధురవాణి అంటూ ఒక వేశ్యశిఖామణి ఈ కళింగరాజ్యంలో పుట్టి ఉండకపోతే భగవంతుడి సృష్టికి ఎంతో లోపం వచ్చి ఉండును.'' అని కరటకశాస్త్రి మాటలను పరిశీలిస్తే కన్యాశుల్కం నాటకంలో మధురవాణి సహజసుందరి. గిరీశం మాటల్లో బ్యూటిఫుల్‌నాచ్ డెవిల్. ఆమె వలలో చిక్కిన ప్రాణి మరి తప్పించుకుపోలేడు. డిప్యూటీకలెక్టర్ నుండి కొండిభట్లుదాకా అందరూ ఆమె పరిచయం కోసం దేవుళ్లాడినవారే. పూజారికి ఆమె పుత్తడి బొమ్మ. కరటకశాస్త్రికి త్రిలోకసుందరి. మధురవాణి చాలా తెలిసిన మనిషి. లుబ్ధావధానుల పెళ్లినాటకంలో నాందీ ప్రస్థావన భరతవాక్యాలను తానే పలుకుతుంది. తెలివితేటలతోపాటు మధురవాణికి ఆత్మవిశ్వాసం కూడా ఎక్కువే. తాను తిప్పేయంత్రం ఎప్పుడు ఎదురుతిరిగినా చక్రం అడ్డువేస్తుంది. కొంపమునిగితే చాకచక్యంతో తేలుస్తుంది. యాంటీనాచ్‌గా ముద్రపడిన సౌజన్యారావును కలవడానికి మగవేషంతో నిశిరాత్రి సమయంలో వస్తుంది. వేశ్యను అర్ధరాత్రి పడకింటిలో పెట్టుకొని మాట్లాడటం మూలంగా తనకు వ్రతభంగమైనదని, బాధపడుతున్న సౌజన్యారావును తనవాదనతో కనువిప్పు కలిగిస్తుంది. "భగవంతుని దర్శనమునకు పోవచ్చునుగదా? తమ దర్శనమునకు మాత్రము విరోధమా'' అంటూ ముందరికాళ్లకు బంధాలు వేస్తుంది. నా శత్రువులు ఎవరో నిన్ను నాదగ్గరకు పంపారు అన్నమాటలకు అలాగైతే మంచే తనకు శత్రువై వుండాలి. అని మాటకు మాట బదులిస్తుంది. "వేశ్యజాతి చెడ్డజాతి కావచ్చు. తాము సెలవిచ్చినట్లు చెడ్డలో మంచి ఉండకూడదా? మంచి ఎక్కుడున్నా గ్రాహ్యం కాదా? అని సౌజన్యారావు నోరు కట్టివేస్తుంది. అట్టేసేపు నీవు నా ఎదుటగానీ నిలిచి ఉంటే నువ్వు ఏ తగువు తీరిస్తే ఆ తగువుకు ఒప్పుదల అవుతానో అని భయమేస్తుందని'' అంటూ సౌజన్యారావు బింకం మధురవాణిని చూసి కరిగిపోతుంది.

సౌజన్యారావు మధురవాణితో వెయ్యిరూపాయిలిస్తాను బ్రాహ్మణ్ణి కాపాడు అని బేరంపెట్టాడు. మధురవాణి ముద్దు ఇవ్వమని బేరం పెడుతుంది. నీవు సాగసరివి.. ముద్దు చేదనికాదు వ్రతభంగం కదా అని దిగులు అని మధనపడతాడు. మధురవాణిది లాలనకాదు. మోహం అంతకన్నా కాదు. మంచిని ఆశ్రయించాలనే ప్రబలవాంఛతో నిండిన మనస్సు యొక్క ఆవేశమూ; సౌజన్యతను ఆస్వాదించడానికి అతిశయించిన తృష్ణ, నిరాధారంగా ఉన్న తన జీవితానికి ఒక పట్టుగొమ్మకోసం వెదుకులాడే స్త్రీ సహజమైన బలీయమైన కోరిక, సజ్జనసేవయందు అనురక్తి, సౌజన్యారావు ముద్దు ఇవ్వబోయిన సందర్భంలో ఆమె మనస్సులోని స్ఫటికంలాంటి మంచితనాన్ని సౌజన్యారావు గుర్తించి భగవద్గీతను కానుకగా ఇస్తాడు. వ్రతభంగమని కూడా సంకోచించక ఆమెకు షేక్‌హ్యాండ్ ఇచ్చి అభినందించి సగౌరవంగా సాగునంపుతాడు. సామాన్యమైన వేశ్యకంటే నిష్ఠాగరిష్ఠులైన అధికులకంటె వేయిరెట్లు గొప్పదని సౌజన్యారావు భావిస్తాడు. మధురవాణి సంప్రదాయానికి వ్యతిరేకంగా నిలిచి వ్యక్తిత్వం పరిధులు స్పృశించిన స్త్రీ పాత్ర. అందరి తత్వాలకు అనుగుణంగా మసులుకొంటూ ఉన్నట్లే నటిస్తూ ఆకుకు అందకుండా పోకకు పొందకుండా తప్పించుకొని తిరిగే వేశ్య అయినా మానవ సంఘమునుగడకు కావలసిన నీతినిజాయితీ చూపించిన శీలవతి, మహామేధావి మధురవాణి. తన ఆంతర్యాన్ని ఎవరికీ చిక్కనీయనంత చిక్కని చక్కని మనిషి మధురవాణి. మధురవాణి పాత్ర పోషణలో గురజాడ ఒక ఆదర్శనిరూపణ. నిజనిర్ధారణను తగిన రీతిలో అద్భుతమైన నిపుణతతో మేళవించారు. అందుకే తెలుగు నాటక సర్వస్వంలో మధురవాణి పాత్ర ఒక అపురూపసృష్టి.

## 12.17.2 రాదగిన ప్రశ్నలు:-

1. గురజాడ ఆశించిన సంఘసంస్కరణ, భాషాసంస్కరణలు కన్యాశుల్కం నాటకం ద్వారా ఏ మేరకు నెరవేరాయో చర్చించండి.

2. ఆనాటి జీవిత ప్రతిబింబం కన్యాశుల్కం - పరిశీలించండి.

3. ఈ నాటికీ కన్యాశుల్కం గొప్పనాటకం- కారణాలను అన్వేషించండి.
4. కన్యాశుల్కం నాటకంలోని వాస్తవికతను వివరించండి.
5. కన్యాశుల్కం నాటకంలో హాస్యరస పోషణను చర్చించండి.
6. గిరీశం ఆనాడు మారుతున్న పరిస్థితులకు ప్రతినిధి - పరిశీలించండి.
7. ఈనాడు కన్యాశుల్కం లేదు... కానీ కన్యాశుల్కం నాటకం చిరంజీవి-కారణాలను చర్చిండి.
8. పాత్ర చిత్రణలో గురజాడ ప్రతిభను వివరించండి.
9. కన్యాశుల్కం నాటకంలోని ఉత్తరాంధ్ర మాండలికాన్ని సోదాహరణంగా వివరించండి.
10. కన్యాశుల్కం నాటకంలోని స్త్రీ పాత్రల ప్రాముఖ్యాన్ని చర్చించండి.

## 2.17.3 ఆచూకీ గ్రంథాలు :


1. కన్యాశుల్కం - నూరేళ్ల సమాలోచనం.
   విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్: హైదరాబాద్: 1990
2. కన్యాశుల్కం శతజయంతి ఉత్సవం - ప్రత్యేక సంచిక
   ఉత్సవ కమిటి ప్రచురణ - విజయనగరం- 1992 - నవంబర్.
3. GURAZADA- COMMEMORATIVE VOLUME - SOUTH DELHI, ANDHRA ASSOCIATION-1976
4. కోలాచలం శ్రీనివాసరావు, నాటక సాహిత్య సమాలోచనం - ఆచార్య ఎస్. గంగప్ప
   శశీప్రచురణలు - 1977
5. తెలుగు నాటక వికాసము - డాక్టర్ పి.యస్. ఆర్. అప్పారావు
   నాట్యమాలా ప్రచురణలు - హైదరాబాద్ - 1967
6. కన్యాశుల్క నాటక కళ - సర్దేశాయి తిరుమలరావు.



**డా॥ కందిమళ్ల సాంబశివరావు,** ఎం,ఏ. పిహెచ్.డి
రీడర్ మరియు తెలుగు శాఖాధ్యక్షుడు
డి.ఆర్.ఎన్. ఎస్.సి.వి. ఎస్. కళాశాల
చిలకలూరిపేట, గుంటూరు జిల్లా.